# దక్షిణ భారతదేశ చరిత్ర

## (క్రీ.శ. 1336 - 1765)

### ఎం.ఏ. చరిత్ర, మొదటి సంవత్సరం : మూడవ పేపరు


రచయితలు

**ఎం. సోమశేఖరరావు,** ఎం.ఏ., ఎమ్.ఫిల్.,
డైరెక్టర్, హిందూ కళాశాల (పి.జి.)
అమరావతి రోడ్, గుంటూరు

**డా॥ వి.కె. మోహన్,** ఎం.ఏ., పి.హెచ్‌డి.
ప్రిన్సిపాల్ మరియు చరిత్ర శాఖాధిపతి
ఎస్.వి.ఆర్. ఎమ్. కళాశాల, నగరం

**డా॥ కంరున్నిసా బేగం** ఎం.ఏ., పి.హెచ్‌డి.
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సంపాదకులు మరియు సమన్వయకర్త :
**ఆచార్య డి. భాస్కరమూర్తి** ఎం.ఏ., పి.హెచ్‌డి.
చరిత్ర మరియు పురావస్తు విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్
**ఆచార్య వి. చంద్రశేఖర రావు,** ఎం.కాం., పి.హెచ్‌డి.



**దూరవిద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510

Ph : 0863-2293299, 2293356, 08645 - 211023,
Cell : 9848285518, 08645 - 211024 (Study Material)
Website : www.anucde.com, e-mail : anucde@yahoo.com

**M.A. History of South India (1336 to 1765 A.D.)**

First Edition : 2004

Second Edition : 2005

Third Edition : 2006

Fourth Edition : 2008

No. of Copies : 1000

**(C) Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of M.A. Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

Published by :
**Prof. V. Chandrasekhara Rao,** *Director*
Centre for Distance Education,
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించుటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్ట్ క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య వి. బాలమోహన్‌దాస్**

కులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

## M.A. History 1st Year

# PAPER III - HISTORY OF SOUTH INDIA (1336 TO 1765 A.D.)

## SYLLABUS

1. Resistance to Muslim Expansion - The Musunuri Chiefs - Prolayanayak and Kapayanayaka - The Reddi Kingdoms of Kondavidu and Rajahmundry - Political History - Contribution to Literature.
2. Theories regarding the Foundation to Vijayanagara Empire - The Sangama Dynasty - Harihara and Bukka - Devaraya I - Devaraya II - The Saluva Dynasty - Saluva Narasimha - The Tuluva usurpation - Narasa Nayaka - Vira Narasimha - Krishnadeva Raya - Aliya Ramaraya - Battle of Tallikota.
3. Aravidu Dynasty - Tirumala Nayaka - Sriranga - Venkatapati II - Sriranga III - Nature of Vijayanagara State - Nayankara System - Local Administration - Art and Architecture - Literature.
4. The Qutbshahi Dynasty of Gokonda - Quli Qutb Shah - Jamshid Qutb Khan - Ibrahim Qutb Shah - Muhammad Quli Qutb Shah - Abdullah Qutb Shah - Mughal Annexation of the Qutbshahi Kingdom.
5. The Nayaks of Madura, Tanjore and Jinji - General Conditions - Patronage to Literature - The Asafijahis - Nizam-ul-Mulk - Relations with European Trading Missions.

**Texts and References Books :**


1. R.C. Majumdar and others (Ed.) : History and Culture of Indian People Vol. V. The Mughal Empire.
2. Mahalingam T.V. : Administration and Social Life under Vijayanagara, 2 Vols.
3. Sathianathier. R. : Nayaks of Madura
4. Sewell R. : A Forgotten Empire
5. Stein, Burton. : Peasant State and Society in Medieval South India
6. Venkataramanayya N. : Krishnadevarayalu - Vijayanagara Charitramu (Telugu) Part 1.
7. Richards, J.F. : Mughal Administration in Golconda.
8. Sri Rama Sarma P. : Saluva Dynasty
9. Heras. H. : Aravidu Dynasty
10. Somasekhara Sarma M. : A Forgotten Chapter in Andhra History
11. Somasekhara Sarma M. : History of Reddy Kingdoms.
12. Sherwani H.K. and Joshi P.M. : History of Medieval Deccan, 2 Vols.
13. Sherwani H.K. : History of the Qutbshahi Dynasty
14. Banerjee A.C. and Ghosh D.K. : Comprehensive History of India Vols. 8 and 9.

# M.A. (Previous) DEGREE EXAMINATION, DECEMBER 2005

First Year

History

## Paper III - HISTORY OF SOUTH INDIA FROM 1336 To 1765 A.D.

Time : Three hours | Maximum : 100 marks

***Answer ALL questions.***

***All questions carry equal marks.***

1. (a) Discuss the role of Musunuri Chiefs in liberating Andhra Desa from the Muslim rule.
   మహ్మదీయుల పాలన నుండి ఆంధ్ర దేశాన్ని విముక్తి చేయడంలో ముసునూరి నాయకులు నిర్వహించిన పాత్రను చర్చింపుము.

   Or

   (b) Estimate the greatness of Anavema Reddi.
   అనవేమా రెడ్డి గొప్పతనాన్ని అంచనా వేయుము.

2. (a) Describe the career and achievements of Krishnadeva Raya.
   కృష్ణదేవరాయల జీవిత విశేషాలను, విజయాలను వర్ణింపుము.

   Or

   (b) What were the causes and results of the Battle of Talikota?
   తల్లికోట యుద్ధ కారణాలు, ఫలితాలు ఏవి ?

3. (a) Write about the rule of Venkatapati - II.
   రెండో వెంకటపతి పరిపాలనను గూర్చి వ్రాయుము.

   Or

   (b) Descuss the main features of Nayankara system under the Vijayanagara rulers.
   విజయనగర రాజుల కాలం నాటి నాయంకర విధానపు ముఖ్య లక్షణాలను చర్చింపుము.

4. (a) Give an account of the cultural contribution of the Qutb Shahis.
   కుతుబ్ షాహీల సాంస్కృతిక సేవలను గూర్చి వ్రాయుము.

   Or

   (b) Critically examine the Mughal annexation of the Qutub Shahi Kingdom.
   కుతుబ్‌షా రాజ్యంను మొగలులు ఆక్రమించిన విధానంను విమర్శనాత్మకంగా వివరింపుము.

5. (a) Narrate the foundation of Asaf Jahi Dynasty in Hyderabad.
   హైదరాబాద్‌లో ఆసఫ్ జహి రాజ వంశ స్థాపన గూర్చి వివరింపుము.

   Or

   (b) Describe Nizam-ul-Mulk's relations with the European Trading Companies.
   ఐరోపా వర్తక సంఘాలతో నిజామ్-ఉల్-ముల్క్ సంబంధాలను వర్ణింపుము.

(DH 03)

# M.A. (Previous) DEGREE EXAMINATION, MAY 2006.

History

Paper III - **HISTORY OF SOUTH INDIA FROM 1336 TO 1765 A.D.**

Time : Three hours Maximum : 100 marks

Answer ALL questions

All questions carry equal marks.

1. (a) Write a note on the Musunuri Nayaks.

   ముసునూరి నాయకుల గురించి వ్రాయుము.

   Or

   (b) Disuss the cultural contribution of the Reddi Kings.

   రెడ్డిరాజుల సాంస్కృతిక సేవల గురించి చర్చించుము.

2. (a) Give an account of Sangama dynasty.

   సంగమ వంశం గురించి వ్రాయుము.

   Or

   (b) Write a note on Aliya Ramaraya.

   అళియ రామరాయల గురించి వ్రాయుము.

3. (a) Give an account of Aravidu dynasty.

   ఆరవీడు వంశం గురించి వ్రాయుము.

   Or

   (b) Discuss the art and architecture of the Vijayanagara period.

   విజయనగర కాలపు వాస్తు శిల్ప కళల గురించి చర్చించుము.

4. (a) Write a note on the Mughal annexation of the Qutbshahi Kingdom.

   మొగలులు కుతుబ్‌షాహీ రాజ్య ఆక్రమణ చేసిన రీతిని గురించి వ్రాయుము.

   Or

   (b) Discuss the cultural contribution of the Qutabshahis.

   కుతుబ్ షాహీల సాంస్కృతిక సేవల గురించి చర్చించుము.

5. (a) Write a note on the Nayaks of Madura.

   మధుర నాయకుల గురించి వ్రాయుము.

   Or

   (b) Discuss the Nizam-ul-Mulk's relations with the European trading companies.

   యూరపుఖండ వాణిజ్య కంపెనీలతో నైజాంఉల్ ముల్క్ సంబంధాల గురించి చర్చించుము.

# [illegible]


| | | |
|---|---|---|
| 1. | [illegible] | 1.1 - 1.9 |
| 2. | [illegible] | 2.1 - 2.8 |
| 3. | [illegible] | 3.1 - 3.16 |
| 4. | [illegible] | 4.1 - 4.5 |
| 5. | [illegible] | 5.1 - 5.17 |
| 6. | [illegible] | 6.1 - 6.15 |
| 7. | [illegible] | 7.1 - 7.17 |
| 8. | [illegible] | 8.1 - 8.11 |
| 9. | [illegible] (క్రీ.శ. 1565) | 9.1 - 9.10 |
| 10. | [illegible] (క్రీ.శ. 1570 - క్రీ.శ. 1646) | 10.1 - 10.14 |
| 11. | [illegible] | 11.1 - 11.15 |
| 12. | [illegible] | 12.1 - 12.4 |
| 13. | [illegible] | 13.1 - 13.5 |
| 14. | [illegible] | 14.1 - 14.5 |
| 15. | [illegible] | 15.1 - 15.8 |
| 16. | [illegible] | 16.1 - 16.16 |
| 17. | [illegible] | 17.1 - 17.25 |
| 18. | [illegible] | 18.1 - 18.12 |
| 19. | [illegible] | 19.1 - 19.4 |
| 20. | [illegible] | 20.1 - 20.4 |

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ముస్లింల దక్షిణ భారతదేశ విస్తరణ | 1.1 - 1.9 |
| 2. | ముసునూరి నాయకులు | 2.1 - 2.8 |
| 3. | కొండవీటి రెడ్డి ...లు | 3.1 - 3.16 |
| 4. | రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం | 4.1 - 4.5 |
| 5. | రెడ్డి యుగ విశేషాలు | 5.1 - 5.17 |
| 6. | విజయనగర సామ్రాజ్యము - అవతరణ | 6.1 - 6.15 |
| 7. | సంగమ - సాళువ వంశములు | 7.1 - 7.17 |
| 8. | తుళువ వంశం | 8.1 - 8.11 |
| 9. | అళియ రామరాయలు : తళ్ళికోట యుద్ధం (క్రీ.శ. 1565) | 9.1 - 9.10 |
| 10. | ఆరవీటి వంశం (క్రీ.శ. 1570 - క్రీ.శ. 1646) | 10.1 - 10.14 |
| 11. | విజయనగర ప్రభుత్వ యంత్రాంగ స్వభావము | 11.1 - 11.15 |
| 12. | విజయనగర కాలము నాటి ఆర్థిక పరిస్థితులు | 12.1 - 12.4 |
| 13. | విజయనగర కాలం నాటి సాంఘిక, మత పరిస్థితులు | 13.1 - 13.5 |
| 14. | విజయనగర కాలపు దేవాలయ వాస్తు, శిల్పకళలు | 14.1 - 14.5 |
| 15. | విజయనగర కాలం నాటి సాహిత్యము | 15.1 - 15.8 |
| 16. | గోల్కొండ కుతుబ్‌షాహి రాజవంశం | 16.1 - 16.16 |
| 17. | నాయక రాజ్యాలు | 17.1 - 17.5 |
| 18. | నాయక రాజుల పాలనలో సాధారణ పరిస్థితులు | 18.1 - 18.12 |
| 19. | దక్కన్‌లో మొఘల్ ప్రతినిధుల పాలన | 19.1 - 19.4 |
| 20. | ఐరోపా వారి వాణిజ్య కేంద్రాలు | 20.1 - 20.4 |

పాఠం - 1

# ముస్లింల దక్షిణ భారత దేశ విస్తరణ

## 1.0. లక్ష్యం :

దక్షిణ భారతదేశంలో ముస్లిం సామ్రాజ్య విస్తరణ, ముస్లింల పాలనకు వ్యతిరేకంగా జరిగిన విముక్తి ఉద్యమాల గూర్చి తెలియపరచుట ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :


1.1 పరిచయం

1.2 ముస్లింల భారతదేశ దండయాత్రలు

1.2.1 ఖల్జీల దండయాత్ర

1.2.2 తుగ్లక్‌ల దండయాత్రలు

1.3 ముస్లిం పాలనకు వ్యతిరేకంగా సాగిన విముక్తి ఉద్యమాలు

1.3.1 ముసునూరి నాయకులు

1.3.2 ప్రోలయ వేమారెడ్డి

1.3.3 రేచర్ల పద్మనాయకులు

1.3.4 ఆరవీటి వంశస్థులు

1.3.5 విజయనగర స్థాపన


## 1.1 పరిచయం :

క్రీ.శ. 1206 లో ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యస్థాపన జరిగింది. అప్పటి నుండి ఢిల్లీ సుల్తానులు షుమారు 90 సంవత్సరాలు తమ దృష్టిని ఉత్తర భారతదేశంపైన కేంద్రీకరించారు. కానీ 13 వ శతాబ్ది ముగిసే నాటికి సుల్తానులు ఉత్తర భారతదేశంపైన తమ సార్వభౌమాధికారాన్ని నిల్పి దక్షిణ భారతదేశం పై తమ దృష్టిని మరలించారు. ఈ పార్శ్యంలో ఖిల్జీల కాలంలో జలాల్ ఉద్దీన్ ఖిల్జీ, అల్లా ఉద్దీన్ ఖిల్జీ, ముబారక్ ఖిల్జీలు దక్షిణ భారతదేశంపై సాగించిన దండయాత్రలు కేవలం ధన సంపాదన కోసం ప్రారంభమయి క్రమేణా దేవగిరి రాజ్యం పతనం కావడం ; ఓరుగల్లు, ద్వార సముద్రం, మధుర రాజ్యాలు ఢిల్లీ సుల్తానత్ సామంత రాజ్యాలుగా మారడం, తుగ్లక్‌ల పాలనా కాలంలో సుల్తానుల దక్షిణ భారతదేశ దండయాత్రల స్వభావంలో మార్పు వచ్చి ఘియాస్ ఉద్దీన్ తుగ్లక్, మహమ్మద్ బిన్ తుగ్లక్ ల పాలనా కాలంలో భారతదేశం ఢిల్లీ సుల్తానత్ ఆక్రమణలోకి ఎలా వచ్చిందో తెలియజేయడం ముఖ్య ఉద్దేశం.

## 1.2 ముస్లింల దక్షిణ భారత దేశ దండయాత్రలు :

క్రీ.శ. 1206 లో ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యస్థాపన నుండి సుమారు 90 సంవత్సరాలు ఢిల్లీ సుల్తానులు తమ దృష్టిని కేవలం ఉత్తర భారతదేశంపైనే కేంద్రీకరించారు. క్షిణ భారతదేశ ప్రాంతాలను ఆక్రమించి తమ ఆధీనంలో ఉంచుకోవాలన్న కోరిక ఖిల్జీలతోనే ప్రారంభమయింది. ఖిల్జీలు దాదాపు ఉత్త భారతదేశంపై తమ సార్వభౌమాధికారాన్ని నిలిపి తదనంతరం తమ దృష్టిని దక్షిణ భారతం పై మరలించారు. ఈ విధానాన్నే తరువాత తుగ్లక్‌లు కూడా అనుసరించారు. ప్రథమంలో ఢిల్లీ సుల్తానుల ఆశయం దక్షిణ భారతదేశ సంపదను కొల్లగొట్టడం అయినా తరువాత దక్షిణ భారతదేశాల ఆక్రమణ, ఇస్లాంమత విస్తరణ వారి ధ్యేయం అయింది.

### 1.2.1 ఖిల్జీల దండయాత్రలు :

ప్రథమంగా దక్షిణ భారతదేశంపై దాడులు సాగించిన వారు ఖిల్జీలు. జలాల్ ఉద్దీన్ ఖిల్జీ ఢిల్లీ సుల్తాను గా ఉన్న కాలంలో అతని అల్లుడైన గర్షప్ మాలిక్ (అల్లా ఉద్దీన్ ఖిల్జీ) కారా, అయోధ్య రాష్ట్రాలకు గవర్నరుగా ఉన్నాడు. జలాల్ ఉద్దీన్ ఖిల్జీకి అల్లుడు అల్లాఉద్దీన్ అన్న ప్రాణము. కాని అల్లా ఉద్దీన్ అత్త, భార్యలు అతన్ని ఏవగించుకొనేవారు. అల్లా ఉద్దీన్‌కు ఈ పరిస్థితుల్లో ఢిల్లీ సింహాసనము ఆక్రమించవలెననెడి కోరిక కలిగి అందుకు తగిన వనరుల సంపాదనకై దక్షిణ భారతదేశ దండయాత్రకు అనుమతిపొంది తరువాత అనుమతి పొందకుండా ఇంకా దక్షిణానికి సాగి క్రీ.శ 1294 లో దేవగిరి రాజ్యంపై దాడిచేసాడు. దేవగిరి పాలకుడు రామచంద్రదేవుడు తన కొడుకు శంకర దేవుడు తీర్ధ యాత్రలకు వెళ్లగా కొద్దిపాటి సైన్యంతో అల్లాఉద్దీన్‌ను ఎదుర్కొని ఓడిపోయి అల్లాఉద్దీన్ అడిగిన మొత్తాన్ని ఇచ్చి సంధి చేసుకున్నాడు. ఈ లోపల తీర్థయాత్రల నుండి తిరిగి వచ్చిన శంకరదేవుడు ఈ సంధిని వ్యతిరేకించి అల్లాఉద్దీన్‌తో తిరిగి యుద్ధం చేసి ఓడిపోయాడు. అవమానకరమైన సంధికి అంగీకరించాడు. పెద్ద మొత్తంలో ధనం చెల్లించడమే గాక ఎలిచ్ పూర్ రాష్ట్ర ఆదాయాన్ని ప్రతి సంవత్సరం ఢిల్లీకి పంపడానికి అంగీకరించాడు.

అల్లా ఉద్దీన్ ఖిల్జీ సుల్తాన్ అయిన అనంతరం దక్షిణ భారతదేశ సంపద కొల్లగొట్టవలెననే ఆశయంతో తన దండయాత్రలను సాగించాడు. క్రీ.శ. 1303 - 1304 సం॥లో అల్లా ఉద్దీన్ మాలిక్ ఫక్రుద్దీన్ జూనను, కారా రాష్ట్ర గవర్నరయిన జాజును తెలంగాణం పైకి దండయాత్రకు పంపాడు. బెంగాల్ మీదుగా వెళ్లిన ఈ ముస్లిం సైన్యాన్ని కాకతీయ ప్రతాపరుద్రుని సైన్యం రాజ్యం బైటనే ఓడించి తరిమివేసాయి. వర్షాకాలం కనుక సమయం అనుకూలించక ముస్లిం సైన్యం ఓడి వెనుదిరిగిందని బరాని వ్రాసిన విషయం నమ్మశక్యంగాలేదు.[1] ముస్లింల వైఫల్యం ప్రకృతి వైపరీత్యం వలన కాదని, కాకతీయ ప్రతాపరుద్రుని ప్రతినిధులు ఇద్దరు సాహసోపేతమైన విజయం ముస్లింలపై సాధించినట్లు క్రీ.శ. 1304 - 1305 నాటి ఓరుగల్లులోని శాసనమొకటి తెలియజేయుచున్నది. ఈ శాసనం ప్రకారం పోతుగంటి మల్లి ఉప్పరపల్లి దగ్గర, వెలుగోటి వారి వంశానికి చెందిన వెన్న ముస్లింలపై ఘన విజయం సాధించినట్లు తెలుస్తున్నది.[2] ఢిల్లీ సుల్తాన్ సైన్యం పొందిన ఈ అపజయం అల్లా ఉద్దీన్ గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించడమే గాక దేవగిరి పాలకులు ఒప్పందం ప్రకారం చెల్లింపవలసిన కప్పాన్ని సుల్తాన్‌కు కట్టడం నిరాకరించారు. సుల్తాన్ చేతిలో ఓడిపోయి పారిపోయిన గుజరాత్ పాలకుడు కర్ణదేవునకు అతని కూతురు దేవలదేవికి దేవగిరి శంకర దేవుడు ఆశ్రయం ఇచ్చాడు.

క్రీ.శ 1307 లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ తన సేనాని మాలిక్ కపూర్‌ను దేవగిరిపైకి పంపాడు. శంకర దేవుడు ఓడిపోయి పారిపోగా కపూర్ రామచంద్రదేవుని అతని కుటుంబాన్ని బంధించి ఢిల్లీకి పంపాడు. అల్లాఉద్దీన్ ఖిల్జీ రామచంద్రదేవుని సాదరంగా ఆహ్వానించి రాజ సత్కారాలు చేసి 6 నెలలు తన దగ్గర ఉంచుకుని దేవగిరికి పంపాడు. అప్పటి నుండి రామచంద్ర దేవుడు సుల్తాన్‌కు విధేయుడుగా ఉంటూ దక్షిణ భారతదేశంలో సుల్తాన్ యుద్ధ కార్యక్రమాలకు సైనిక సహాయాన్ని అందజేస్తూ వచ్చాడు.

క్రీ.శ 1309 లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ మాలిక్ కపూర్ ఆధ్వర్యంలో ఓరుగల్లు పై మరో దాడి పంపాడు.[3] మాలిక్ కపూర్ సైన్యం దేవగిరి ప్రవేశించి అక్కడ కావలసిన వరులను రామచంద్ర దేవుని నుండి పొంది క్రీ.శ. 1310 ప్రథమంలో ఓరుగల్లు పరిసర ప్రాంతాలను చేరాడు. ఓరుగల్లు కోట ముట్టడించి రెండు నెలలు దిగ్బంధనం చేసాడు. కాకతీయ ప్రతాపరుద్రుడు ఈ ముస్లిం దాడిని ధైర్య

హసాలతో ఎదుర్కొన్నప్పటికీ మాలిక్ కపూర్‌కి లొంగి సంధి చేసుకొనక తప్పలేదు. తన ఖజానాలో ఉన్న మొత్తం ధనాన్ని ఇవ్వడానికి ప్రతి సంవత్సరం సుల్తాన్‌కు కప్పం కట్టడానికి అంగీకరించాడు. ధనం, వజ్ర వైఢూర్యాలతో క్రీ.శ. 1310 మార్చి నెలలో ఢిల్లీకి తిరుగు ప్రయాణం సాగించాడు.

క్రీ.శ. 1311 లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ కర్ణాటకంలో ద్వార సముద్ర పాలకులైన హోయసాలుల పైకి, మధుర పాలకులైన పాండ్యులపైకి మాలిక్ కపూర్‌ను దండయాత్రకై పంపాడు. హోయసాల 3 వ వీరభల్లాలుడు ఓడి సంధికి అంగీకరించి అనేక గజాలను, అశ్వాలను, అపార ధన రాసులను సుల్తాన్‌కు సమర్పించాడు.[4] హోయసాల రాజ్యం సుల్తాన్‌కు సామంత రాజ్యం అయింది.

మాలిక్ కపూర్ ద్వారసముద్రం నుండి మధురపై దాడిచేశాడు. 3 వ వీరభల్లాలుడు ఈ దాడిలో మాలిక్ కపూర్‌కు సాయపడ్డాడు.[5] ఇదే సమయంలో పాండ్య సోదరులు వీరపాండ్య, సుందర పాండ్యల మధ్య వారసత్వపు యుద్ధం జరుగుచున్నది. సుందర పాండ్య మాలిక్ కపూర్ సాయమర్థించాడు. మాలిక్ కపూర్ ఇదే అవకాశంగా తీసుకుని మొదట ఉరయూర్‌కు సమీపంలో వీర పాండ్యుని ఓడించి పాండ్య రాజధాని మధుర పై దాడిచేసాడు. వీరపాండ్య రాజధాని వదలి పారిపోయాడు. పాండ్య రాజ్యంలో కపూర్ అపారమైన ధనరాసులు పొందాడు. మాబారు (మధుర) దండయాత్రలో మాలిక్ కపూర్ 612 గజాలను, 96 వేల మణుగుల బంగారము, కొన్ని పెట్టెల రత్నాలు, ముత్యాలను ఢిల్లీకి తరలించినట్లు బరాని వ్రాతల ద్వారా తెలియుచున్నది.

క్రీ.శ. 1312 లో రామచంద్ర దేవుడు చనిపోగా శంకర దేవుడు సింహాసనాన్ని అధిష్టించాడు. సుల్తాన్ పట్ల తీవ్రమైన ద్వేషంగల శంకర దేవుడు సుల్తాన్‌కు కప్పం నిరాకరించి స్వతంత్రించ ప్రయత్నించాడు. మాలిక్ కపూర్ మరియొక పర్యాయం దేవగిరిపై దండయాత్ర చేసి శంకర దేవుని వధించి దేవగిరిలో ముస్లిం పాలన ఏర్పాటు చేసాడు. దేవగిరిలోని అనేక దేవాలయాలను మసీదులుగా మార్చాడు. కాని దేవగిరి రాజ్యంలోని కొన్ని ప్రాంతాలు కపూర్ ఆక్రమణలోకి రాలేదు. సింగమ నాయక ఆధ్వర్యంలో కంపిలి రాజ్యం స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నది. సింగమ నాయక పుత్రుడే ప్రసిద్ధ కంపిలి దేవుడు. ఈ నూతన రాజ్యంలో ప్రస్తుతం గల బళ్ళారి, రాయచూర్ మరియు ధార్వార్ ప్రాంతాలే గాక ప్రముఖ కోటలైన కంపిలి, కుమ్మట, హోష్ దుర్గాలు చేరాయి. మాలిక్ కపూర్ ఈ రాజ్యంపై కూడా ఒక పర్యాయం దండయాత్ర చేసినాడు. మరొక పర్యాయం దండయాత్ర చేయాలన్న ప్రయత్నంలో ఉండగా ఢిల్లీకి పిలువబడ్డాడు.

ఢిల్లీలో అల్లాఉద్దీన్ ఖిల్జీ చనిపోవడం, అతని కుమారులను మాలిక్ కపూర్ ద్రోహ బుద్ధితో నిర్బంధించడం జరిగింది. ఢిల్లీ సింహాసనం కోసం పెనుగులాటలు ప్రారంభమయి చివరకు ముబారక్ ఖిల్జీ క్రీ.శ. 1316 లో సుల్తాన్ అయ్యాడు. ఢిల్లీలో ఏర్పడిన అరాచక పరిస్థితులను అవకాశంగా తీసుకొని రామచంద్ర దేవుని అల్లుడగు హరపాలదేవుడు దేవగిరిలో ముస్లిం పాలన అంతంచేసి స్వతంత్రించాడు. క్రీ.శ. 1316 లో ముబారక్ షా దేవగిరిపై దాడి చేసి హరపాలదేవుని వధించి దేవగిరిని ఢిల్లీ సుల్తానత్‌లో విలీనం చేసాడు. మాలిక్ యక్ లాఖీని దేవగిరి గవర్నరుగా నియమించి ఢిల్లీకి తిరోమార్గం పట్టినాడు. కప్పం కట్టనిరాకరించిన ప్రతాపరుద్రుని ఎదుర్కోవడానికి ఖుస్రూఖాన్‌ను పంపాడు. ఖుస్రూ ఖాన్ ప్రతాపరుద్రుని దగ్గర కప్పం వసూలు చేసాడు.

ఖుస్రూ ఖాన్ దక్షిణ భారతదేశంలోనే ఉన్నపుడు దేవగిరిలో మాలిక్ యక్ లాఖీ స్వతంత్రించగా అతనిని ఓడించి, బంధించి ఢిల్లీకి పంపాడు. పాండ్య రాజ్యాధికారం కోసం జరుగుతున్న వారసత్వపు యుద్ధం అవకాశంగా తీసుకొని సుందర పాండ్య పై దాడిచేసి ఖుస్రూ ఖాన్ అత్యంత ధనాన్ని కొల్లగొట్టాడు. కాని విపరీతమైన వానల వలన ఖుస్రూ ఖాన్ అసంపూర్ణమైన విజయంతో ఢిల్లీకి మరలాడు.

ఖిల్జీల కాలంలో దేవగిరి రాజ్యం పతనమై ఓరుగల్లు, ద్వారసముద్రము, మధురరాజ్యాలు సుల్తాన్‌కు సామంతరాజ్యాలుగా మారాయి.

## 1.2.2 తుగ్లక్‌ల దండయాత్రలు - మహమ్మద్ బిన్ తుగ్లక్ :

క్రీ.శ. 1320 లో సంభవించిన రాజకీయ విప్లవ ఫలితంగా ఖిల్జీలు పదవీభ్రష్టులై తుగ్లక్ వంశస్థాపన జరిగింది. ఈ రాజకీయ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని ప్రతాపరుద్రుడు స్వతంత్రించాడు. దీని ప్రభావం సుల్తాన్ గవర్నరు పాలనలో ఉన్న మహారాష్ట్రంపై

ప్రసరించింది. తుగ్లక్ వంశస్థాపకుడు ఘియాస్ ఉద్దీన్ తుగ్లక్ సుల్తానుల దక్కను విధానంలో మార్పులు తెచ్చాడు. దక్షిణ భారతదేశ సందప కొల్లగొట్టడం పూర్వపు సుల్తానుల విధానమయితే దక్కనులో రాజ్య సంపాదన తుగ్లక్ వంశీయుల ధ్యేయం అయింది. ఘియాస్ ఉద్దీన్ తుగ్లక్ దక్షిణ భారతదేశంలో గల హిందూ రాజ్యాలను సంపూర్ణంగా రూపు మాపడానికి నిశ్చయించుకొని తన కొడుకు జూనాఖాన్‌ను ఓరుగుల్లు పై దాడికి పంపాడు. క్రీ.శ. 1321 లో జూనాఖాన్ దేవగిరి మీదుగా వెళ్ళి ప్రతాపరుద్రుని రాజధాని ఓరుగుల్లును 6 నెలలు ముట్టడించాడు. ప్రతాపరుద్రుడు అత్యంత ధైర్య సాహసాలతో ముస్లిం సైన్యాలను ఎదుర్కొని ఓడించి వారికి అపార నష్టం కలిగించాడు.

తనకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా ఘియాస్ ఉద్దీన్ తుగ్లక్ క్రీ.శ. 1323 లో జూనా ఖాన్ నాయకత్వంలోనే పెద్ద సైన్యాన్ని మరొకమారు ఓరుగుల్లు పై దాడికి పంపాడు. ఈ పర్యాయం జరిగిన దాడిలో జూనాఖాన్ 5 నెలల కాలం ఓరుగల్లు కోటను ముట్టడించి ప్రజలను అనేక విధాలుగా హింసించాడు. ప్రజల బాధలను భరించలేక ప్రతాపరుద్రుడు జూనా ఖాన్‌కు లొంగిపోయాడు. ప్రతాపరుద్రుడు బంధింపబడి ఢిల్లీకి పంపుతుండగ మార్గం మధ్యలో ప్రతాపరుద్రుడు అవమానం భరింపలేక నర్మదా నదీతీరంలో ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ విషయాన్ని ప్రోలయ నాయక విలస దాన శాసనం పేర్కొంటే,[6] క్రీ.శ. 1326 నాటి ఇందులూరి రుద్రదేవుని సంతమాగులూరు శాసనం ప్రతాపరుద్రుడు సర్వకాలం పరిపాలించాడని పేర్కొంటున్నది.[7] అని తల్లి కలువచేరు శాసనం ప్రతాపరుద్రుడు స్వేచ్ఛగా స్వర్గానికి చేరుకొన్నాడని ప్రస్తావిస్తున్నది. ఓరుగుల్లుకు జూనా ఖాన్ సుల్తాన్ పూర్ అని పేరు పెట్టి అక్కడ సుల్తాన్ ప్రతినిధిని ఉంచినాడు.[8]

క్రీ.శ 1325 లో జూనా ఖాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ బిరుదుతో ఢిల్లీ సింహాసనం అధిష్టించాడు. క్రీ.శ 1327 లో మధుర పై దాడిచేసి మధురను ఢిల్లీ సుల్తానత్ రాజ్యంలో విలీనం చేసి జలాలుద్దీన్ హసన్ షాను మధుర గవర్నరుగా నియమించాడు.

మహమ్మద్ బిన్ తుగ్లక్ సుల్తాన్ అయేనాటికే దక్షిణ భారతదేశంలోని అనేక రాజ్యాలు సుల్తాన్ సార్వభౌమాధికారంలోకి వచ్చాయి. దేవగిరి మరియు ఓరుగల్లులు సుల్తాన్ ఉన్నతాధికారుల నియంత్రణలో ఉండగ దూరంగ ఉన్న మధుర రాజ్యం రాజప్రతినిధి అధికారంలో ఉంచబడింది. కాని కంపిలి, ద్వార సముద్ర రాజ్యాలు స్వతంత్ర రాజ్యాలుగా ఉన్నాయి.

కంపిలి రాజ్యాధినేతగా ఉన్న కంపిలి దేవుడు 14 వ శతాబ్ది ప్రధమంలోనే తన సార్వభౌముడైన దేవగిరి రామచంద్ర దేవునికి హోయసాల వీరభల్లాలునికి మధ్య జరిగిన యుద్ధాలలో రామచంద్రదేవునికి సహాయం చేస్తూ ప్రాపకంలోకి వచ్చాడు. కంపలి దేవుడు దక్షిణ భారతదేశంలో వ్యాపిస్తున్న ఇస్లాం అధికారాన్ని తీవ్రంగా ప్రతిఘటించినా ఓరుగల్లు, ద్వార సముద్ర రాజ్యాలలో గల నిరంతర సంఘర్షణలు కంపిలి దేవుని బాధించాయి. షిమోగా జిల్లాతో పాటు రాయచూర్, బళ్ళారి, ధార్వార్ ప్రాంతాలలో గల పెద్ద రాజ్యాన్ని నిర్మించాడు. ఢిల్లీ సుల్తానత్ రాజ్యంలో గల మహారాష్ట్రానికి, కంపిలిదేవుని రాజ్యానికి కృష్ణానది సరిహద్దుగా ఉండేది. ఢిల్లీ సుల్తాన్ కప్పం కోరగా కంపిలి దేవుడు సాగర్ రాష్ట్రపాలకుడైన బహుద్దీన్ గర్షాప్‌తో స్నేహసంబంధాలు పెంపొందించుకొన్నాడు. భహుద్దీన్ గర్షాప్ క్రీ.శ. 1326 - 27 లో సుల్తాన్ ను వ్యతిరేకించి తిరుగుబాటు చేసాడు. బహుద్దీన్ గర్షాప్‌ను శిక్షించే నిమిత్తం మహమ్మద్ బిన్ తుగ్లక్ గుజరాత్ రాష్ట్ర పాలకుడైన మాలిక్ జాదను, దేవగిరి రాష్ట్రపాలకుడైన మజీర్ అబురిజాలను దాడికి పంపాడు. గోదావరి నదీ తీరంలో జరిగిన యుద్ధంలో బహుద్దీన్ గర్షాప్ ఓడిపోయి పారిపోయాడు. కంపలి దేవుని ఆశ్రయం పొందాడు. మహమ్మద్ బిన్ తుగ్లక్ స్వయంగా బయలుదేరి దేవరిగి వచ్చి అటునుండి కంపిలి దేవునిపై యుద్ధం ప్రకటించాడు. మూడు సార్లు జరిగిన దాడులలో మొదటి రెండు దాడులు కంపిలి దేవుడు ముస్లింలను వీరోచితంగా ఎదుర్కొన్నాడు. మూడవ పర్యాయం మాలిక్ జాద నాయకత్వంలో జరిగిన దండయాత్రలో (క్రీ.శ. 1327) కంపిలిదేవుడు వీరోచితంగా పోరాడి మరణించాడు. కంపిలి సుల్తాన్ వశమయింది. బహుద్దీన్ గర్షాప్ ద్వార సముద్రం పారిపోయి 3 వ వీర భల్లాలుని ఆశ్రయం పొందాడు. కంపిలిలో అంతఃపుర స్త్రీలందరూ జోహార్ సమర్పించగా కంపిలిదేవుని కుమారులు, హరిహర, బుక్క మొదలగు ఉద్యోగులు బంధింపబడి ఢిల్లీకి పంపబడ్డారు. మాలిక్ మహమ్మద్ కంపిలి గవర్నరుగా నియమింపబడినాడు. కంపలిరాజ్యం స్వతంత్ర హిందూ రాజ్యంగా అస్తమించింది.

కంపిలి రాజ్య పతనానంతరం మహమ్మద్ బిన్ తుగ్లక్ మాలిక్ జాదను హోయసాల రాజ్యంపైకి పంపాడు. హోయసాలరాజు 3 వ వీరభల్లాలుడు తనదగ్గర ఆశ్రయం పొంది ఉన్న గర్షాప్ ను సుల్తాన్‌కు అప్పగించి సంధిచేసుకొని సుల్తాన్ సార్వభౌమాధికారానికి అంగీకరించాడు. గర్షాప్ అతిక్రూరంగా చంపబడ్డాడు. ద్వార సముద్రం సుల్తాన్ సామంత రాజ్యమయింది.

ముస్లిం చరిత్రకారులు క్రీ.శ. 1327 నాటికి దక్షిణ భారతదేశం అంతా మహమ్మద్ బిన్ తుగ్లక్ రాజ్యంలో చేరిందని పేర్కొంటున్నారు. సుల్తాన్ ఆధీనంలో గల దక్షిణ భారతదేశం దేవగిరి, తెలంగాణము, కంపిలి, ద్వార సముద్రం, మధుర, మరియూ జాజ్ నగర్ అను ఆరు రాష్ట్రాలుగా మహ్మద్ బిన్ తుగ్లక్ ఏర్పాటు చేసి నాయబ్‌లను నియమించి పాలించాడని ముస్లిం చరిత్రకారులు వ్రాసారు. కాని దేవగిరిలో తప్పిస్తే మిగతా ప్రాంతాలలో సుల్తాన్ అధికారం స్థిరంగా ఉన్నట్లు కనిపించదు. ప్రజలలో ముస్లిం పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నది. అందువలననే అతి తక్కువ సమయంలోనే దక్షిణ భారతదేశంలో ముస్లిం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటులు ప్రారంభమయి తుగ్లక్ అధికారాన్ని దక్షిణ భారతదేశంలో కూలదోసాయి.

## References :


1. Tarikh - i - Firuz - Shahi, Elliot and Dawson : A History of India as told by its Historians, Vol. III, p. 189
2. Early Muslim expansions in South India, N. Venkataramanayya, p. 25, Note. 23 ;
   Velugotivari Vamsavali, N. Venkataramanayya (Ed), p. 25
3. The early Muslim Invasions in South India
   N. Venkataramanayya p. 28, Note 27
4. Cambridge History of India, Vol. III, W. Haig (Ed), P. 118
5. A History of South India, K.A. Nilakanta Sastri, P. 229
6. Epigraphia Indica, Vol. 32, p.p. 239 - 268
7. Annual Reports on Epigraphy 308 of 1915
8. Bharati, Vol. 21, No. 6, p. 553


## దక్షిణ భారతదేశంలో ముస్లిం పాలనకు వ్యతిరేకంగా సాగిన విముక్తి ఉద్యమాలు (క్రీ.శ.1327-1336)

### పరిచయం :

ఢిల్లీని సుల్తానులు పరిపాలిస్తున్న కాలంలో ఖిల్జీ వంశీయులు అనుకరించిన దక్షిణ భారతదేశరాజ్యాల దోపిడీ విధానం తుగ్లక్ వంశీయుల కాలంలో రాజ్యాల ఆక్రమణగా మారి వివిధ దశలలో క్రీ.శ. 1327నాటికి దక్షిణ భారతదేశంలో గల వివిధ స్వతంత్ర హిందూ రాజ్యాలు ఢిల్లీసుల్తానత్‌లో ఎలా విలీనమైనవో వెనుకటి పాఠ్యాంశంలో తెలుసుకొన్నాము. మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలంలో యావత్ భారతదేశం ముస్లింల పాలనలోకి వచ్చింది. కాని దక్షిణ భారతదేంలో సుల్తానుల అధికారం ఎక్కువ కాలం కొనసాగలేదు. దక్షిణ భారతదేశంలో ముస్లింల పాలననుండి విముక్తికై పోరాటాలు ప్రారంభమై క్రీ. శ.1336 నాటికే దక్షిణ భారతదేశం ముస్లిం పాలననుండి విముక్తి అయింది. మహమ్మద్‌బిన్ తుగ్లక్ క్రీ. శ. 1329 లో ఉత్తర భారతదేశం మరలిపోవడంతో దక్షిణ భారతదేశంలో విముక్తి పోరాటాలు ప్రారంభమై స్వతంత్ర హిందూరాజ్యాల స్థాపన ఎలా జరిగాయో తెలియజేయడం ఈ పాఠ్యాంశ ముఖ్య లక్ష్యం.

మహమ్మద్ బిన్ తుగ్లక్ అధికారంలో ఉన్నపుడు అతని చర్యల ఫలితంగా ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి పెరిగి దేశవ్యాప్తమైన ఆందోళన ప్రారంభమయింది. దీనిలో భాగంగా దక్షిణ భారతదేశంలో వివిధ ప్రాంతాలలో స్వతంత్ర రాజ్య స్థాపనకై తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. భారతదేశ చరిత్రలో కేంద్రాధికారంపై రాజకీయ స్వార్థంతో కూడిన తిరుగుబాట్లు ముఖ్యంగా ఆంధ్రదేశ చరిత్రలో చాళుక్య-కాకతీయ యుగంలో అనేకం జరిగాయి. తుగ్లక్ పై జరిగిన ఈ తిరుగుబాట్లు సుసంఘటితమైన ప్రజా ఉద్యమాలని, హింసాయుత మత విధానంపై జరిగిన తిరుగుబాట్లని దేశీయ చరిత్రకారులు పేర్కొంటున్నారు. కాని ఈ అభిప్రాయానికి బలమైన సాక్ష్యాధారంలేదు.

ఈ తిరుగుబాటుల నాయకులు ముఖ్యంగా ఆంధ్రదేశంలో వేరువేరు స్వతంత్ర రాజ్యాలు స్థాపించడమేకాక హిందూసంస్కృతిని హిందూమతాన్ని పరిరక్షించే నిమిత్తం సమైఖ్యంగా ముస్లింలను ఎదిరించడానికి ప్రయత్నించలేదు. బదులుగా పరస్పరం యుద్ధాలల నిమగ్నులై దక్షిణ భారతదేశంలో స్వతంత్ర ఇస్లాంరాజ్యస్థాపన లక్ష్యమైన బహమనీ రాజ్యస్థాపనకు దోహదపడి తామూ బలైపోయారు.

దక్షిణ భారతదేశంలో నాయకులు, ప్రజలు ముస్లింపాలనను ఏ మాత్రం అంగీకరించలేదు. ఈ సమయంలో దక్షిణ భారతదేశంలోని నాయకులు, ప్రజలు శైవమత పునరుద్ధరణలో ఉన్నారని, ముస్లింలు సాగించిన దేవాలయ విధ్వంస కార్యక్రమాలు వారు తీవ్రంగా వ్యతిరేకించారని, శైవమత పునరుద్ధరణ వారికి ఊపిరిపోసిందని ఆచార్య నీలకంఠశాస్త్రిగారి అభిప్రాయము[1]. ఏదిఏమైనా సుల్తాన్ పాలనలో దక్షిణ భారతదేశ ప్రజలు అనేక కష్టనష్టాలకు గురిఅయ్యారు. ఆంధ్రదేశంలో ముస్లింలపాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలు, జరిగిన విధ్వంసం గురించి, ముస్లింలు సాగించిన దురాగతాలను గురించి పిఠాపురం సమీపంలోని ప్రోలయనాయకుని విలాసతామ్ర శాసనం వివరిస్తుంది.

"ధనికులను హింసించి ధనాన్ని దోచుకున్నారు. బ్రాహ్మణులు తమ తమ ఆచారాలను పాటించకుండా విఘాతం కలిగించారు. దేవాలయాలను విధ్వంసం చేసి, దేవతావిగ్రహాలను పగులగొట్టారు. వేదపండితులు చిరకాలంగా అనుభవిస్తున్న అగ్రహారాలను ముస్లింపాలకులు హస్తగతం చేసుకొన్నారు. రైతుల పంటలను దోచుకున్నారు. ప్రజలు నాది అనుకునేందుకు ఏమీ లేకుండా పోయింది. వారి దుశ్చర్యలకు ఆంధ్రప్రాంతం అంతా ఆహుతి అయిపోయింది". అని విలస తామ్ర శాసనం వర్ణిస్తున్నది. ఇందులో కొన్ని అతిశయోక్తులుండి ఉండవచ్చు. పాలకులు పరమతస్థులయినపుడు మితిమీరిన ద్వేషభావం ప్రతిఫలిస్తుంది.

జియాఉద్దీన్ బరాని అనే ముస్లీం చరిత్ర కారుడు ప్రజలు అనుభవించిన కష్టాలు ఇలా వర్ణించాడు. "రైతులవద్ద నుండి పన్నులు అధికంగా వసూలుచేయడానికి సుల్తాన్ పూనుకొన్నాడు. అంతకు పూర్వం కంటే 5 రెట్లు , 10 రెట్లు పన్నులు విధింపబడ్డాయి. పన్నులభారంతో అనేక కుటుంబాలు నాశనం అయ్యాయి. ధనికులు గ్రామాలు వదలి తిరుగుబాటు సైన్యంలో చేరారు. వ్యవసాయ భూములు బీడుపడి వ్యవసాయం క్షీణించింది.

ఈ విధమైన ముస్లింల కంటక పాలనావిధానాలు విముక్తి ఉద్యమాలను ప్రోత్సహించాయి. దక్షిణ భారతదేశాన్ని ముస్లిం పాలననుండి విముక్తి చేసి హిందూమతోద్ధరణ స్వీయపాలన తమ కర్తవ్యంగా ఎంచి అనేక ప్రాంతాలలో అనేక మంది నాయకులు ఉద్యమాలను ప్రారంభించారు. విముక్తి ఉద్యమాలలో కీలకమైన పాత్ర వహించినవారు.

1. ఉత్తర తీరాంధ్ర, ఉత్తర తెలంగాణమందు ముసునూరి నాయకులు
2. దక్షిణ తీరాంధ్రంలో రెడ్డిరాజులు.
3. దక్షిణ తెలంగాణాలో రేచర్ల పద్మనాయకులు
4. రాయలసీమలో ఆరవీటి సోమదేవరాజు
5. కంపిలిలో హరహరబుక్కరాయలు
6. ద్వార సముద్రంలో హోమసాలులు. మొదలగువారు.

## 1. ముసునూరి నాయకులు : ప్రోలకయనాయక - కాపయనాయక

వింధ్యపర్వతాలకు దక్షిణంగా ఉన్నప్రాంతం అంతా ముస్లింల పాలనలోకి వచ్చినపుడు ముస్లింపాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటన ఉద్యమం ఆంధ్రదేశంలోనే ప్రధమంగా ప్రారంభంకావడం ఆంధ్రదేశచరిత్రలోనే గాక భారతదదేశ చరిత్రలోనే ప్రముఖమైన ఘట్టం[2]. ఆంధ్రదేశంలో ముస్లింల పాలనను అంతమొందించుటకు ప్రధమంగా నాయకత్వం వహించిన వ్యక్తి ముసునూరి ప్రోలయనాయకుడు. ప్రోలయనాయకవేంగివిషయాధిపతి అయిన పోతకు మనుమడు, పోచినాయకుని కుమారుడు. చతుర్థాన్వయుడు. ఉత్తరతెలంగాణము, ఉత్తరతీర ఆంధ్రంలో ముసునూరి ప్రోలమనాయకుడు వన, గిరి దుర్గాలను స్థాపించాడు. ఈస్వాతంత్ర్య పోరాటంలో ప్రోలయనాయకునికి అతని పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు, వేంగిప్రభువేంగభూపాలుడు[3]. అద్దంకి వాసి అయిన ప్రోలయవేమారెడ్డి, కొలనిరుద్ర, బెండపూడి అన్నయమంత్రి, కొప్పులప్రోలయనాయక,[4] రేచర్ల సింగమ నాయక, మంచికొండ గణపతినాయక మొదలగు 75మంది నాయకులు సహాయపడ్డారు. ఆంధ్రులలో ఉద్భవించిన ఈ విధమైన నూతన ఉత్తేజాన్ని విలాస, ప్రోలవరం[5] శాసనాలు ప్రస్తావిస్తున్నాయి. విలస తామ్ర శాసనం ముసునూరి ప్రోలయనాయక తెంగాణా ప్రాంతాన్ని ముస్లిం పాలననుండి విముక్తిచేసినట్లు తెలియుచున్నది.

అయితే ఆంధ్రదేశానికి చెందిన నాలుగు ప్రాంతాలు -1. పశ్చిమ ఆంధ్ర ప్రాంతము 2.తూర్పు ఆంధ్రప్రాంతము, తెలంగాణము 3.కొస్తాఆంధ్రా ప్రాంతము 4. కళింగ ఆంధ్రా ప్రాంతము -క్రీ. శ. 1323 వరకు కాకాతీయుల పాలనలో ఉన్నాయి. గండికోట కైఫీయత్ క్రీ. శ 1322 నాటికి గొంకయ రెడ్డి శాసనాన్ని పేర్కొనుచున్నది. క్రీ.శ. 1323నాటికి గండికోట ముస్లింల ఆధీనంలోకి వచ్చి, అప్రాతంలో ఆదవీటి సోమదేవరాజు తారుగుబాటు వరకు గండికోటి ముస్లింల పాలనలోనే ఉన్నది. ఆదవీటిసోమదేవరాజు కొన్ని సంవత్సరాలఅనంతరం రాయలసీమ ప్రాంతంలో తిరుగుబాటుచేసి ఆ ప్రాంతాన్ని ముస్లింపాలన నుండి విముక్తి చేసాడు. కనుక రాయలసీమ విముక్తిలో ప్రోలయనాయకుని పాత్రలేదు. ముస్లీం రచయితలైన ఫరిష్టా[7] బరానిల ప్రకారం క్రీ. శ. 1344లో కాపయ నాయక ఓరుగల్లును పునరాక్రమించే వరకు తెలంగాణము ముస్లిం పాలనలోనే ఉన్నది. కనుక ఉత్తరకోస్తా ఆంధ్రా ప్రాంతాన్నే ముసునూరి ప్రోలయనాయక ముస్లిం పాలననుండి విముక్తి చేసినట్లు విశదమగుచున్నది. క్రీ. శ. 1323 తరువాత హిందు పాలకుల శాసనాలు కూడా ఇదే విషయాన్ని సూచిస్తున్నాయి. ముసునూరి ప్రోలయ నాయక ఈ విజయాన్ని సెప్టెంబర్ 10వతేది 1324తరువాత సాధించాడు అని చెప్పడానికి ఆతేదీనాటి రాజమహేంద్రవరంలోని పెద్దమసీదులో ఘియాస్ ఉద్దీన్ తుగ్లక్ శాసనం ఒక నిదర్శనం. ఏలూరు సమీపంలో ఘియాస్ ఉద్దీన్ నాణాలు కూడా లభించాయి. సమకాలీన ఆధారాలను బట్టి క్రీ. శ. 1325-26ల మధ్య ఉత్తర తీరాంధ్రమును ముస్లింపాలననుండి ముసునూరి ప్రోలయనాయకుడే విముక్తి చేసినట్లు తెలుస్తున్నది.

ముసునూరి ప్రోలయనాయక మరణానంతరం అతని పినతండ్రి కుమారుడైన ముసునూరి కాపయ నాయక రేకపల్లి రాజై ఈ విముక్తి ఉద్యమాన్ని కొనసాగించాడు. ముస్లిం చరిత్ర కారులు ఈతడిని కృష్ణ నాయక్, కాన్యానాయక్ మొదలగా పేర్లతో వ్యవహరించారు. కాపయనాయక అత్యంత ధైర్యసాహసాలు ఉన్నవ్యక్తి. ఓరుగల్లు పునరాక్రమణే అతని జీవిత లక్ష్యం అయింది. కాపయనాయక ద్వార సముద్రం పాలకుడైన 3 వ వీరభల్లాలునితో చేరి ఓరుగల్లు ద్వార సముద్రం, కంపిలి రాజ్యాలను ముస్లిం పాలననుండి విముక్తి చేయడానికై ఒక బృహత్తరమైన ప్రణాళిక వేసాడని ఫరిష్టా రచనలు తెలియజేయుచున్నవి. మధుర వజీరు సయ్యద్ జలాల్ ఉద్దీన్ క్రీ.శ. 1335 చేసిన తిరుగుబాటు దక్షిణాత్య హిందూ రాజ్యాలకు మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. తిరుగుబాటు చేసిన మధుర నవాబుని శిక్షించడానికై మహమ్మద్ బిన్ తుగ్లక్ అపార సైన్యంతో ఓరుగల్లు చేరాడు. ఆ సమయంలో ఓరుగల్లులో ప్లేగు వ్యాధి రావడంతో అది సుల్తాన్ సైన్యంలో సోకి అనేకమంది సైనికులు మరణించారు. సుల్తాన్‌కు కూడా వ్యాధి సోకినట్లు ఇసామి వ్రాసాడు. సుల్తాన్ మాబార్ (మధుర) దండయాత్రను విరమించుకొని దౌలతాబాద్ (దేవగిరి) చేరి అక్కడ చికిత్సపొంది ఢిల్లీకి మరలాడు. మధుర నవాబ్ తిరుగుబాటు అణచడంలో సుల్తాన్ బలహీనత తేటతెల్లమయింది. దీనిని అవకాశంగా తీసుకొని కాపయనాయక ఓరుగల్లు వజీర్ మాలిక్ మక్‌బూలును పారద్రోలి (క్రీ. శ. 1336) ఓరుగల్లు ఆక్రమించాడు. ఓరుగుల్లుకోట బురుజుపై స్వతంత్ర ఆంధ్ర పతాకం ప్రతిష్టితమయింది. తదుపరి క్రీ. శ. 1336 నాటికే కాపయ నాయక ఉత్తర తెలంగాణములోని ప్రాంతములను ఆక్రమించి ఆంధ్ర సురత్రాణ", "ఆంధ్ర దేశాధీశ్వర", అను బిరుదములతో పరిపాలన సాగించాడు.

## ప్రోలయ వేమారెడ్డి :

దక్షిణ తీరాంధ్రను ముస్లిం పాలన నుండి విముక్తి చేసిన వ్యక్తి ప్రోలయ వేమారెడ్డి. క్రీ.శ. 1325 నాటి మల్లవరం శాసనం.[8] పువ్వాడ శాసనం[9] ప్రోలయ వేమారెడ్డిని "మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవ" అని వర్ణిస్తున్నది గనుక ఆనాటికే అతను స్వతంత్రించాడని చెప్పవచ్చు. ప్రతాపరుద్రుని మహాప్రధాని అయిన కొలని రుద్రదేవుడు, బెండపూడి అన్నయ మంత్రి ప్రోలయ వేమారెడ్డితో సహకరించినట్లు తెలియుచున్నది. క్రీ.శ. 1326 నాటి కొలని రుద్రదేవుని శాసనం[10] ప్రోలయ వేమారెడ్డి రాజ్యంలోని సంతమాగులూరులో ఉన్నది. ఈ శాసనం కొలని రుద్రదేవుని ప్రతాపరుద్రుని ప్రధానిగా చెబుతూ ప్రతాపరుద్రునిపై హిందువులకు గల భక్తి భావాన్ని తెలియజేయుచున్నది. విలస మరియు కలువచేరు దాన శాసనాలు కూడా ప్రతాపరుద్రుని పట్ల ప్రజలకు గల భక్తి భావాన్ని వక్కాణించుచున్నవి. ప్రతాపరుద్రుని కాలంలో కాకతీయ రాజ్య వైభవాన్ని ప్రజలకు తెలియజేయడం ద్వారా ప్రజలలో భక్తి, విధేయత,మతాను రక్తి కలిగించడం ద్వారా ముస్లింలను ఎదుర్కొనే శక్తి ప్రజలలో కలిగించడానికి ప్రతాపరుద్రుని పేరు తిరుగుబాటుదారులు ఉపయోగించి ఉంటారు. రెడ్డి రాజుల ఆస్థాన పండితుడైన శ్రీనాథుడు బెండపూడి అన్నయ మంత్రిని "ఆంధ్ర భూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠాపనాచార్యుడని" కీర్తించినాడు.[11] శ్రీనాథుని అభిప్రాయంలో రెడ్డిరాజులే నాటికి ఆంధ్ర దేశాధీశ్వరులుగా కనిపిస్తున్నారు. కొండవీటి దండకవితల వంటి స్థానిక చరిత్రలు ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1320 కు పూర్వమే స్వతంత్రించాడని చెప్పడానికి తావిస్తున్నాయి. ఏమైనా ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1325 నుండి అద్దంకి రాజధానిగా దక్షిణ తీరాంధ్రను స్వతంత్రంగా పాలిస్తున్నట్లు శాసన ఆధారాలున్నాయి.

## రేచర్ల పద్మనాయకులు :

దక్షిణ తెలంగాణా ప్రాంతంలో ముస్లిం పాలన నుండి విముక్తికై ఉద్యమాన్ని సాగించిన వారు రేచర్ల పద్మనాయకులు. వీరిది రేచర్ల గోత్రము, వెలమ కులజులు. "పలనాటి వీరచరిత్ర"లో వెలమల ప్రసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. వెలమల చరిత్రకు వెలుగోటి వంశావళి" ముఖ్య ఆధారం. వీరు కాకతీయ గణపతి దేవుని కాలం నుండి వారి సేనాపతులుగా, సామంతులుగా ఉండేవారు. రేచర్ల సింగమ నాయకుడు ప్రతాపరుద్రుని కొలువులో సేనాని. కాకతీయ రాజ్య పతనానంతరం ఆంధ్రదేశంలో తురుష్క అధికారం అంతమొందించి రాచకొండ రాజధానిగా రేచర్ల సింగమ నాయకుడు స్వతంత్రించాడు. దక్షిణ తెలంగాణంలో పద్మనాయక రాజ్యం స్థాపించాడు. ముస్లిం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రేచర్ల సింగమ నాయక ముసునూరి ప్రోలయ నాయకతో సహకరించాడు.

## ఆరవీటి వంశస్థులు :

రాయలసీమ ప్రాంతంలో ఆరవీటి వంశస్థులు ఓరుగల్లు పతనానికి ముందే స్వతంత్ర రాజ్య స్థాపనకు ప్రయత్నాలు ప్రారంభించారు. రాయలసీమలో ఆరవీటి సోమదేవరాజు నాయకత్వంలో ముస్లిం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమయింది. 'రామరాజీయం' అనుసరించి సోమదేవరాజు పూర్వీకులు కర్నూలు, శ్రీశైలం మధ్య భూములను ఆక్రమించి పాలిస్తున్నట్లు తెలియుచున్నది. వీరికి మల్యాల కేంద్రం. ప్రతాపరుద్రుని కాలంలో చెరకు వంశస్థుల ఆధీనంలో ఉన్న మల్యాలను వీరు ఆక్రమించారు. తమ రాజ్య విస్తరణకై ఆరవీటి వంశీయులైన తాత పిన్నమరాజు, కొంటికంటి రాఘవుడు కంపిలి రాయలతో నిరంతరం పోరాడారు. క్రీ.శ. 1327 - 1328 లో కంపిలిని మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆక్రమించిన తరువాత ఆరవీటి సోమ దేవరాజు ముస్లిం అధికారాన్ని ధిక్కరించి కంపిలిలోని సుల్తాన్ ప్రతినిధితో పోరాటం సాగించాడు. సుల్తానుకు విధేయులైన కొందరు హిందూ సామంతులు ఒక కూటమిగా ఏర్పడి సోమదేవరాజును ఎదిరించారు. ఈ కూటమిని సోమదేవరాజు గంగినేని కొండ దగ్గర ఓడించి మొసలి మడుగు,కందనవోలు, సాతానికోట, కల్వకొండ మొదలగు ప్రాంతాలలో గల కోటలను ఆక్రమించాడు. కంపిలి లేక ఆనెగొంది లోని సుల్తాన్ ప్రతినిధి మాలిక్ నబి సోమదేవరాజు ఎదిరించి ఓడిపోయాడు. ఈ పరిస్థితుల్లో హోయసాల 3వ వీరభల్లాలుడు స్వాతంత్ర్యం ప్రకటించి కంపిలిపై దాడులు చేయసాగాడు. కంపిలి రాజ్యంలో ముస్లిం అధికారం దాదాపు అస్తమించింది. "తన ప్రాంతంలో ఎవరికి వారు తోచిన విధంగా ప్రభువులైనారని, తన ప్రక్కన ఎవరూ లేరని, ప్రజలు తన కోటను ముట్టడించి నిత్యావసర వస్తువుల రాకపోకలను స్తంభింపజేసారని, ఎవరూ పన్నులు చెల్లించడం లేదని" మాలిక్ నబి సుల్తాన్‌కు చెప్పుకొన్నట్లు న్యూనిజ్ వ్రాతల వలన తెలియుచున్నది.

**విజయనగర రాజ్యస్థాపన :**

కంపిలిలో వచ్చిన తిరుగుబాటు విన్న సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ తన మంత్రి మండలి సలహా ప్రకారం కంపిలికి స్థానికులైన వారినే ప్రతినిధులుగా పంపడం మేలని భావించి తన దగ్గరే ఉన్న హరిహర, బుక్కరాయలను అపార సైన్యం ఇచ్చి కంపిలి పంపాడు. సంగమ సోదరులైన హరిహర, బుక్కలు 3 వ వీర భల్లాలునితోను, ఆరవీటి సోమదేవరాజుతోను యుద్ధాలు చేసి కంపిలిని తమ నియంత్రణలోకి తెచ్చుకొన్నారు. తదనంతరం సుల్తాన్ పట్ల విధేయతను వీడి క్రీ.శ. 1336 లో కంపిలిలో స్వతంత్ర రాజ్యస్థాపన చేసారు. దీనితో విజయనగర రాజ్యస్థాపనకు అంకురార్పణ జరిగింది.

క్రీ.శ. 1336 నాటికి దక్షిణ భారతదేశంలో సుల్తాన్ అధికారం అస్తమించి స్వతంత్ర హిందూ రాజ్యాలు ఏర్పడ్డాయి. కాని ఈ హిందూ రాజ్యాల మధ్య సఖ్యత, ఐకమత్యం కొరవడి నిరంతరం పరస్పర పోరాటాలలో నిమగ్నమగుటతో దక్షిణ భారతదేశంలో గుల్బర్గా రాజధానిగా మరియొక ఇస్లాం రాజ్యం అయిన బహమనీ రాజ్యస్థాపనకు అవకాశం ఏర్పడింది.

## References :


1. A History of South India, K.A.N. Sastri, p. 236
2. A Forgotten Chapter of Andhra History, M. Soma Sekhara Sarma, p. 34
3. As per the Pentapadu Inscription, Choda Bhakti Raju extended his help to Musunuri Prolayanayaka.
4. Bendapudi Anna Mantri, Kolani Rudradeva were the eminent generals of Pratapa Rudra.
5. Epigraphia Indica, Vol. XXXII, p.p. 239 - 268; Bharati Vol. XI, No. 6, p.p. 939 - 952
6. Local Records, C.P. Brown, Vol. 15, p. 55
7. Ferishta's Rise of Muhammadan Power in India, John Brigges (Ed), Vol. I, p.p. 426 - 27.
8. Nellore District Inscriptions, II, O, 73, p. 1022 ff.
9. A.P. Archaeological Series, No. 6, p. 173
10. Archaeological Reports on Epigraphy, 308 of 1915
11. Bhimesvarapurana, Canto I, Verse 49.


- ఎం. సోమశేఖర రావు.

పాఠం - 2

# ముసునూరి నాయకులు

## 2.0. లక్ష్యం :

మధ్యయుగ భారతదేశ చరిత్రలో ముస్లిం పాలనకు వ్యతిరేకంగా దక్షిణ భారతదేశంలో ప్రారంభమయిన ప్రతిఘటనోద్యమంలో ఆంధ్రదేశంలోని ఉత్తరతీరాంధ్ర, ఉత్తర తెలంగాణమునందు ముస్లిం పాలన నుండి విముక్తికై ముసునూరి నాయకులు సాగించిన పోరాటాన్ని వివరంగా తెలుసుకోవడమే ఈ పాఠ్యాంశ ముఖ్య లక్ష్యం.

## విషయక్రమం :

2.1 పరిచయం

2.2 ప్రోలయనాయక

2.3 ముసునూరి కాపయనాయక

2.4 ఓరుగల్లు ఆక్రమణ

2.5 ఓరుగల్లు పాలకునిగా కాపయనాయక

2.6 కాపయనాయక - రేచర్ల పాలకులతో సంఘర్షణ

2.7 కాపయనాయక - బహమనీ సుల్తానులతో సంఘర్షణ

2.8 కాపయనాయక - విజయనగర రాజుల సంబంధాలు

2.9 కాపయనాయక చివరి రోజులు

2.10 సారాంశము

## 2.1 పరిచయం:

ముసునూరి నాయకులు ముస్లిం పాలన నుండి విముక్తికై ఆంధ్రదేశంలో ఉత్తరతీరాంధ్ర, ఉత్తర తెలంగాణమునందు ఉద్యమాన్ని సాగించి స్వతంత్ర హిందు రాజ్యాన్ని స్థాపించారు. వీరు చతుర్థాన్వయులు. కమ్మవారిలో ముసునూరు వారున్నారు. ముసునూరు అను పేరుతో నెల్లూరు జిల్లాలో ఒక గ్రామం, కృష్ణాజిల్లాలో మరియొక గ్రామం ఉన్నది. కృష్ణాజిల్లాలో ఉయ్యూరుకు సమీపాన గల ముసునూరులో కోటగోడలు గల శిధిలాలు నేటికి ఉండుట వలన, ముసునూరి నాయకుల స్వాతంత్ర్య పోరాట రంగస్థలం కృష్ణాజిల్లా సమీపంలో ఉన్నందున కృష్ణాజిల్లాలోని ముసునూరే వారి జన్మస్థలం అయి ఉండవచ్చు.

ముసునూరి నాయకుల తొలిచరిత్ర, వంశోత్పత్తుల గురించి అంతగా తెలియటం లేదు. కాని ముసునూరి వంశానికి చెందిన ముసునూరి ప్రోలయ నాయక, కాపయనాయకల గురించి, వారు సాంగించిన ప్రతిఘటన ఉద్యమాల గురించి తెలుసుకోవడానికి ఈ క్రింది ఆధారాలు ఉపయుక్తంగా ఉన్నాయి.

1. ప్రోలయనాయకుని విలస తామ్ర శాసనం
2. కాపయనాయకుని పోలవరం శాసనం
3. చోడ భక్తి రాజు పెంటపాడు శాసనం
4. అనితల్లి కలవచేరు శాసనం
5. ముస్లించరిత్ర కారులైన ఫెరిష్టా మొదలగు వారి రచనలు

## 2.2 ప్రోలయనాయక :

ప్రోలయనాయక తొలిచరిత్ర తెలిపే సమాచారం లభ్యం కావడం లేదు. ప్రోలయ తండ్రి పోతినాయకుడు. కొలని రుద్రదేవుడు చనిపోయిన అనంతరం ప్రోలయనాయక కోస్తా ఆంధ్రా ప్రాంతాన్ని స్వతంత్రంగా పరిపాలించినట్లు తెలియుచున్నది. ఓరుగల్లు పతనానంతరం ముస్లింల వశమైన ఆంధ్రదేశంలో చెలరేగిన అసంతృప్తి, అలజడులను అవకాశంగా తీసుకొని భద్రాచల ప్రాంత వన్యభూముల్లోని గిరి, వన దుర్గాలను స్థావరాలుగా జేసుకొని ముస్లింలతో పోరాడాడు. ఈ పోరాటంలో ప్రోలయనాయకునకు అద్దంకి పాలకుడు ప్రోలయవేమారెడ్డి, వేంగిపాలకుడు వెంగభూపాలకుడు, తన పినతండ్రి కొడుకు కాపయనాయకుడు, బెండపూడి అన్నయమంత్రి మొదలగు వారు సహాయపడ్డారు. ముసునూరి ప్రోలయనాయక ముస్లింలతో యుద్ధాలు చేసి వారిని పారద్రోలి గోదావరినది ప్రాంతాలలో మాల్యవంతం సమీపంలోని రేఖాపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యం స్థాపించాడు.[1] అత్యంత శక్తివంతమైన బలగంతో ప్రోలయ నాయక యవనుల (ముస్లింల) అధికారాన్ని తుదముట్టించినట్లు విలస శాసనం[2] తెలుపుతున్నది. ప్రతాపరుద్రుని తరువాత కృష్ణా గోదావరి ప్రాంతాలను పరిపాలించిన ప్రోలయ నాయక గుర్తింపు పొందిన మొదటి ఆంధ్రదేశ పాలకుడని చెప్పవచ్చు.

ప్రోలయ నాయకుడు ముస్లింల దాడులతో అల్లకల్లోలమైన ఆంధ్రదేశాన్ని పూర్వస్థితికి తెచ్చాడు. నష్టపడిన అగ్రహారాలతోబాటు వైదిక ధర్మాన్ని పునరుద్ధరించాడు. ముస్లిం పాలకులు విధించిన అధిక పన్నులను తగ్గించి ప్రజలకు స్వాంతన చేకూర్చాడు. అనే బ్రాహ్మణ కుటుంబాలు ప్రోలయ నాయకుని ఆదరణకు పాత్రమై దక్షిణ తెలంగాణము నుండి ఉత్తర తెలంగాణమునకు వలస వచ్చి అగ్రహారాలను పొందినవి. అమలాపురం తాలుకాలోని విలస గ్రామాన్ని భరద్వాజ గోత్రుడైన అన్నయకుమారుడు విన్నయకు చంద్రగ్రహణ కాలంలో దానం చేసాడు. ఈ శాసనంలో తేది పేర్కొనబడలేదు. బహుశ క్రీ.శ.1330 ప్రాంతంలోనిది అయి ఉండవచ్చు.

ప్రోలయనాయకునికి సంతానం లేకపోవడం వలన రాజ్యాధికారాన్ని తన పినతండ్రి కుమారుడైన కాపయనాయకునకు మరి ఇత అధికారులకు అప్పగించి శేషకాలాన్ని ఆధ్యాత్మిక చింతనలోగడిపాడు. అతి తక్కువ కాలం జీవించి యున్నందున తాను ప్రారంభించి మహత్తరమైన కార్యక్రమాన్ని తన వారసుడు కాపయనాయకకు అప్పగించాడు. ప్రోలయనాయక క్రీ.శ. 1340 లో మరణించి ఉంటాడు

## 2.3 ముసునూరి కాపయనాయక :

ముసునూరి ప్రోలయ నాయక అనంతరం ఆంధ్రదేశంలో హిందు ప్రతిఘటనోద్యమానికి నాయకత్వం వహించి విజయవంతం కొనసాగించి పూర్తి చేసిన ఆంధ్ర నాయకుడు కాపయనాయక. ప్రోలయ నాయకుని అనంతరం రేఖాపల్లి సింహాసనాన్ని అధిష్ఠించి

కాపయ నాయక దేవనాయకుని కుమారుడు.[3] దేవనాయక పోతినాయకుని కుమారుడు, ప్రోలయ నాయకుని సోదరుడు. పోలవరం, పిల్లలమర్రి, గణపేశ్వరం శాసనాల నుండి, వెలుగోటి వారి వంశావళి నుండి, ఫెరిష్టా మొదలైన ముస్లిం చరిత్రకారుల రచనల నుండి కాపయ నాయక చరిత్ర తెలుస్తున్నది.

ప్రోలయ నాయకుని లక్ష్య సిద్ధికై కృషి చేసిన కాపయనాయకుడు ప్రోలయ ఆధ్వర్యంలో యుద్ధ నిర్వహణ, పరిపాలనానుభవం పొంది తూర్పు కనుమలకు పశ్చిమాన గల ఆంధ్రదేశాన్ని తురుష్క పాలన నుండి విముక్తికై కృషి చేసాడు. తెలంగాణాను ముస్లిం పాలననుండి విముక్తి చేసి ఓరుగల్లులో హిందు పతాకాన్ని ఎగురవేయడం కాపయ లక్ష్యం అయింది. తన లక్ష్యసాధనకై ఇరుగు పొరుగు రాజ్యాల నాయకుల సహాయ సహాకారాలు పొంది తెలంగాణాను ముస్లింల నుండి విముక్తి చేయడానికై పోరాటాన్ని సాగించాడు.

## 2.4 ఓరుగల్లు ఆక్రమణ, (క్రీ.శ. 1336)

ముసునూరి ప్రోలయ నాయక కోస్తా ప్రాంతంలో ముస్లింలపై సాధించిన విజయాలు తుగ్లక్ సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాలలో తిరుగు బాటులకు ప్రేరణ ఇచ్చాయి. సాగర్ రాష్ట్రంలో తుగ్లక్ ప్రతినిధి బహుద్దీన్ గర్షప్ తిరుగుబాటు చేసి (క్రీ.శ.1326-27) ఇరుగు పొరుగున గల సుల్తాన్ విధేయ రాజ్యాలపై దాడులు ప్రారంభించాడు. తుగ్లక్ ఖ్వాజాజహాన్‌ను పంపగా దేవగిరి దగ్గర జరిగిన యుద్ధంలో బహుద్దీన్ ఓడి సాగర్‌కు తదనంతరం కంపిలికి పారిపోయాడు. మహమ్మద్ బిన్ తుగ్లక్ స్వయంగా దేవగిరి వచ్చి కంపిలి పైకి దాడులు పంపగా చివరకు క్రీ.శ. 1327-28లో కంపిలి రాజ్యం పతనమైంది. కంపిలిలో ముస్లీం గవర్నరు నియమింపబడ్డాడు. మహమ్మద్ బిన్ తుగ్లక్ ఢిల్లీకి మరలాడు. దక్కను నుండి సుల్తాన్ నిష్క్రమించడంతో దక్కనులో అల్లరులు ప్రారంభమయినాయి. నాటి దక్కను పరిస్థితులను న్యూనిజ్ వర్ణించాడు. ఈ తిరిగిబాటు దారులు ఆంధ్రులే. కాపయనాయక ఈ తిరుగుబాటులలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాడు.

కాపయనాయకుడు జరిపిన ఈ తిరుగుబాటులో కాపయనాయక 3వ వీరభల్లాలుని సహాయం పొంది ఉంటాడు. కంపిలి పాలకులుగా మహమ్మద్ బిన్ తుగ్లక్ చే పంపబడిన హరిహర బుక్కలు కాపయ నాయకుని బంధువులుగా పేర్కొనబడ్డారు. తరువాత కాలంలో హరిహర బుక్కలు తుగ్లక్ అధికారాన్ని వ్యతిరేకించుట, ఓరుగల్లులో కాపయ నాయకుని తిరుగుబాటు ఒకే సమయంలో జరిగాయి. కాపయనాయక బలాన్ని సమీకరించి ఓరుగల్లులో తిరుగుబాటు చేయగా మాలిక్ మక్ బుల్ ఢిల్లీకి పారిపోయాడు. ఓరుగల్లు హిందువుల ఆక్రమణలోకి వచ్చింది. మధుర వజీరైన సయ్యద్ జలాలుద్దీన్ తిరుగుబాటును అణచడంలో సుల్తాన్ విఫలం చెందడం ఆంధ్రదేశంలో కాపయనాయకుని ప్రేరేపించాయి. కాపయ నాయక మాలిక్ మక్ బుల్‌ను పారద్రోలి ఓరుగల్లు ఆక్రమించి ఓరుగల్లు కోటపై స్వతంత్ర ఆంధ్ర పతాకాన్ని ఎగుర వేసాడు. కాపయ నాయక "ఆంధ్ర దేశాధీశ్వర", 'ఆంధ్ర సురత్రాణ' అనే బిరుదులతో శాసనాలతడిని వ్యవహరిస్తున్నాయి.

## 2.5 ఓరుగల్లు పాలకునిగా కాపయనాయక :

కాపయనాయక రాజ్యంలో తెలంగాణము, కోస్తా ఆంధ్ర ప్రాంతము చేరాయి . తన రాజ్యాన్ని ప్రమాదాల నుండి కాపాడటానికి ఓరుగల్లును దుర్భేధ్యం చేసి కట్టుదిట్టమైన, సమర్థవంతమైన పాలన ఏర్పాటు చేసాడు. తనకు విశ్వాసపాత్రులైన వారిని, బంధువులను వివిధ ప్రాంతాలలో ప్రతినిధులుగాను, ఉన్నత ఉద్యోగులు గాను నియమించాడు. వీరిలో కొందరితో వివాహ సంబంధములు కూడా ఏర్పాటు చేసుకొన్నాడు. తొయ్యేరు రాజధానిగా ఉత్తర ఆంధ్రలో తన పిన తండ్రి రాజనాయక కొడుకు అనపోతా నాయకుని పాలకునిగా నియమించాడు. తొయ్యేరు నుండి రాజధాని తరువాత కాలంలో రాజమహేంద్రవరానికి మార్చబడింది. అనపోతానాయుడు తొయ్యేటి అనపోతానీడుగా ప్రసిద్ధి చెందాడు.[4] రామగిరి (కరీంనగర్) రాజధానిగా సబ్బి నాడులో తన ప్రతినిధిగా గురజాల తెలుంగు నృపకొడుకు ముప్ప భూపాలుని నియమించాడు.[5] క్రీ.శ 1335 నాటి త్రిపురాంతక శాసనంలో తెలుంగు నృపుని పేరు పేర్కొనబడింది.[6] సబ్బినాడు ప్రాంతము తెలంగాణాలో గోదావరి నదికి దక్షిణానగల కరీంనగర్ దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలకు సరిపోలి ఉన్నది. మడికి సింగన

ముప్ప భూపాలుని ఆస్థానంలోనే ఉన్నాడు. మడిగి సింగన తొయ్యేటి అనపోతానాయని మంత్రి అయ్యలామాత్యుని కుమారుడు. కాపయ నాయక కోరుకొండ దుర్గాన్ని నిర్మించి అందు మంచికొండ కూనయ నాయకుని[7] రాజప్రతినిధిగా నియమించాడు. రాజమహేంద్రవరానికి ఈశాన్య దిక్కున 12 మైళ్ల దూరంలో కోరుకొండ ఉన్నది. కూనయ నాయకుడు కోరుకొండ దుర్గాన్ని దుర్భేద్యం చేసి ఉత్తర తీరాంధ్రంలో రాజకీయాలకు కోరుకొండను బలమైన కేంద్రంగా చేసాడు. కాపయనాయక తన మేనకోడలిని కూనయ కొడుకు ముప్పిడి నాయకునికిచ్చి వివాహం చేసి[8] తన బలాన్ని పెంచుకొన్నాడు. అద్దంకి రాజధానిగా గుండ్లకమ్మ నదీ తటాల మీద గల పూంగినాడును పాలిస్తున్న ప్రోలయవేమారెడ్డి[9] కాపయ నాయకుని ఆప్తమిత్రుడు.

కాపయనాయక సమర్థవంతమైన పరిపాలనా యంత్రాంగం ద్వారా ఆంధ్రదేశంలో శాంతి భద్రతలను నెలకొల్పాడు. భవిష్యత్తులో ముస్లింల నుండి వచ్చే ప్రమాదాలను ఎదుర్కోవడానికి తెలంగాణాలో గల కోటలను దుర్భేద్యం చేసి తన సైనిక బలాన్ని పెంచాడు.

## 2.6 కాపయ నాయక - రేచర్ల పాలకులతో సంఘర్షణ :

'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్ర సురత్రాణ' అని శాసనాలు కాపయ నాయకుని వర్ణిస్తున్నాయి. అనితల్లి కలువ చేరు శాసనం అనుసరించి కాకతీయుల కాలం నాటి నాయకులందరు కాపయను సేవించినట్లు తెలుస్తున్నది. కాని ఇది అతిశయోక్తిగా కనపడుతుంది. ప్రోలయ వేమారెడ్డి కాపయ నాయకునితో సహకరించాడని, అతని ఆధిపత్యం అంగీకరించాడని చెప్పడానికి కలువ చేరు శాసనం ఒక్కటే సాక్ష్యం. ఇక రేచర్ల సింగమ నాయుడు యుద్ధంలో కాపయను ఓడించాడని వెలుగోటి వారి వంశావళి నుండి తెలుస్తున్నది.[10]

రేచర్ల[11] నాయకులు గణపతి దేవుని కాలం నుండి కాకతీయులకు సామంతులుగా అనుమనగల్లు, పిల్లల మర్రి ప్రాంతాలను పరిపాలిస్తున్నారు. క్రీ.శ. 1336 - 37 సంవత్సరంలో సాగిన స్వాతంత్ర్యోద్యమంలో కాపయ నాయకునికి సహాయపడిన ఎర్రదాచనాయక కొడుకు సింగమనాయక. ఇపుడు సింగమనాయక కాపయ నాయకుని ఎదుర్కొన్నాడు. కాపయనాయక ఆంధ్రదేశంపై సాధించిన సార్వభౌమాధికారం సింగమ నాయకునికి ఇష్టంలేక కాపయ నాయకుని ఆధికారాన్ని ధిక్కరించి ఉండవచ్చు. కాపయ నాయక ఓరుగల్లు ఆక్రమణకు కొలది కాలం అనంతరం సింగమ నాయక తన రాజధానిని రాజు కొండకు మార్చి అక్కడ ఒక దుర్గాన్ని నిర్మించాడు. సింగమ నాయక తన అధికారాన్ని రాజు కొండకు ఉత్తర దక్షిణ దిక్కులకు విస్తరింపజేసాడు. ఈ విస్తరణా కార్యక్రమంలోనే సింగమ నాయక కాపయ నాయకునితో సంఘర్షణపడి ఉంటాడు. కాపయ నాయక ఈ సంఘర్షణలో ఓడి వెనుదిరిగినాడు.[12] ఈ సంఘర్షణలో కాపయనాయక తన ప్రాంతాలను వేటిని కోల్పోలేదు. పైగా కాపయ నాయక తన అధికారాన్ని త్వరితగతిన పిల్లలమర్రి దాక దక్షిణంగా విస్తరింపజేసాడు. కాపయ నాయక రేచర్ల పద్మనాయకులపై తిరిగి ఆధిపత్యం నెలకొల్పాడని చెప్పడానికి క్రీ.శ. 1346 నాటి కాపయ నాయకుని గణపేశ్వరం శాసనం ఆధారంగా ఉంది.[13] ఈ శాసనం కాపయ నాయకుని "అనుమగంటి పురవరాధీశ్వర" అని వర్ణిస్తున్నది. క్రీ.శ 1357 నాటి పిల్లలమర్రి శాసనం[14] కూడా కాపయనాయకుని ఈ బిరుదుతోనే వ్యవహరిస్తున్నది. కాపయనాయకునికి ఈ బిరుదు అతను రేచర్ల సింగమ నాయుని పై సాధించిన విజయాన్ని సూచిస్తున్నది.[15] ఏది ఏమైనా-ఉత్తర తెలంగాణము, కృష్ణానదీ పర్యంతం ఉత్తర తీరాంధ్రములలో కాపయ అధికారం స్పష్టంగా గుర్తింపబడింది.

## 2.7 కాపయనాయక - బహమనీ సుల్తానులతో సంఘర్షణ :

కాపయనాయక తన రాజ్యాన్ని పటిష్టం చేసుకొనే సమయంలో దక్షిణ భారతదేశంలో మరొక రాజకీయ విప్లవం జరిగింది. మహమ్మద్ బిన్ తుగ్లక్ చర్యలను వ్యతిరేకించి దక్కనులోని సైన్యాధిపతులు తిరుగుబాటు చేశారు. వారిలో ఇస్మాయిల్ మఖ్, హసన్‌లు ముఖ్యులు. మహమ్మద్ బిన్ తుగ్లక్ స్వయంగా దక్కను వచ్చి దౌలతాబాదులోను, గుల్బర్గాలోను వచ్చిన తిరుగుబాటులను అణచడానికి ప్రయత్నించి విఫలుడైనాడు. ఈ సమయంలోనే మహమ్మద్ బిన్ తుగ్లక్ ఓరుగల్లుపై దాడిచేయగలడని అనుమానించి, కొత్తగా ముస్లిం రాజ్యం దక్కనులో ఏర్పడితే తన రాజ్యానికి కాపుదల ఉంటుందని భావించి కాపయ నాయక 1500 ఆశ్విక దళాన్ని హసన్‌కు సహాయంగా పంపాడు. ఈ తిరుగుబాట్ల పట్ల కాపయనాయక ఆసక్తి వహించినట్లు ఫెరిష్టా వ్రాసాడు. హసన్ తనకు అందిన సైనిక సహాయంతో

సుల్తాను పంపిన ఇమదుల్ ముల్క్‌ను ఓడించి విజయగర్వంతో దౌలతాబాద్ ప్రవేశించాడు. హసన్ క్రీ.శ. 1347 లో గుల్బర్గా రాజధానిగా అల్లాఉద్దీన్ హసన్‌షా గంగూబహమనీ అనే బిరుదుతో దక్షిణ భారతదేశంలో స్వతంత్ర ముస్లిం రాజ్యస్థాపన చేసాడు. హసన్‌కు కాపయనాయక సైనిక సహాయాన్ని అందజేయడం దూరదృష్టి లేని చర్యగా నిరూపించబడింది. కాపయనాయక తలచినట్లు దక్కనులో స్వతంత్ర ముస్లిం రాజ్యం తన రాజ్య సమగ్రతకు దోహదం చేయకపోగా ఓరుగల్లు రాజ్యానికి ప్రమాదకరంగా తయారయింది.

అల్లాఉద్దీన్ హసన్ దక్కనులో గల పూర్వపు తుగ్లక్ రాజ్య ప్రాంతాలను సమస్తం తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి నిర్ణయించుకొన్నాడు. దక్షిణాపథంలో ఇస్లాం విస్తరణే బహమనీల ధ్యేయం అయింది. ఈ తరుణంలో హసన్ గంగూ క్రీ.శ. 1350 లో ఓరుగల్లు జయించడానికి సికిందర్ ఖాన్‌ను పంపాడు. ఫలితంగా కాపయనాయక ఓడిపోయి హసన్ గంగూతో సంధి చేసుకొన్నాడు. ఈ దండయాత్ర విషయంలో ఫెరిష్టా మరియు అజిజుల్లాలు విభిన్నమయిన అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ఫెరిష్టా కథనం అనుసరించి[16] కాపయనాయకుడు ఓడిపోయి కౌలస్ దుర్గాన్ని (నిజామాబాద్ జిల్లా), అపారమైన ధనరాసులను, కొన్ని ఏనుగులను ఇచ్చి సంధి చేసుకొన్నాడు. అజిజుల్లా సమాచారం ప్రకారం[17] అల్లాఉద్దీన్ వ్రాసిన లేఖను అనుసరించి కాపయనాయక లొంగిపోయి ఒక లిఖిత పూర్వకమైన సంధి పత్రాన్ని సికిందర్ ఖాన్ ద్వారా అనేక బహుమతులతో బాటు అల్లాఉద్దీన్‌కు పంపినట్లున్నది. ఏది ఏమైనా కాపయనాయక అల్లాఉద్దీన్‌కు లొంగినట్లు తెలుస్తున్నది. కాని ఈ లొంగుబాటు కాపయనాయక సార్వభౌమాధికారానికి ఎటువంటి భంగపాటు కలిగించలేదు. ఈ సంఘర్షణ తరువాత కాపయనాయక హసన్ అధికారాన్ని గుర్తించడం గాని, అతనికి కప్పం చెల్లించడంగాని జరుగలేదు. ఆంధ్రదేశంలోని పశ్చిమోత్తర భాగాలు బహమనీ రాజ్యంలో చేరాయి.

మహమ్మద్ బిన్ తుగ్లక్ చనిపోయిన తరువాత బహమనీ రాజ్యానికి ఢిల్లీ నుండి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అల్లాఉద్దీన్ తన పూర్తి శక్తియుక్తులు తన రాజ్య విస్తరణకు, సుస్థిరతకు వినియోగించాడు. తన పొరుగు రాజైన కాపయనాయకను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. తిరిగి క్రీ.శ 1356 లో అల్లాఉద్దీన్ తెలంగాణంపై దండెత్తాడు. ఫెరిష్టా రచనలను అనుసరించి ఈ దండయాత్ర కాపయనాయక అప్పటి దాక ఢిల్లీ సుల్తానులకు చెల్లిస్తున్న కప్పాన్ని అల్లాఉద్దీన్‌కు చెల్లించేటట్లు చేసి ఓరుగల్లును సామంతరాజ్యంగా చేయడం లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాని ఈ దండయాత్ర తెలంగాణాకు మాత్రమే పరిమితం కాలేదు. కోస్తా ఆంధ్రలోని కృష్ణానదీ తీరంలో గల ధాన్యకటకం వరకు సాగింది. ఈ దండయాత్రలో భువనగిరి, పిల్లలమర్రి, ధాన్యకటకంలలో గల దేవాలయాలను బహమనీ సైన్యం ధ్వంసంచేసాయి. క్రీ.శ. 1357 నాటి కాపయ నాయక పిల్లలమర్రి శాసనం[18] అల్లాఉద్దీన్ సాగించిన ఈ రెండవ దండయాత్రను సూచిస్తున్నది. పిల్లలమర్రిలోని కాపయనాయక ప్రతినిధి బహమనీ దండయాత్రలో నాశనం అయిన ఎరకేశ్వర దేవుని విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించినట్లు పిల్లలమర్రి శాసనం పేర్కొంటున్నది. అల్లాఉద్దీన్ కృష్ణాతీరంలోని ధాన్యకటకం వరకు నడచి అమరేశ్వరాలయాన్ని దోచుకున్నట్లు రెడ్డి రాజుల శాసనాలు నుండి తెలుస్తున్నది. అనవోతారెడ్డి అమరావతి శాసనం,[19] కోమటి వేమారెడ్డి పెదపూడి శాసనం[20] ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. ఈ దండయాత్రలో కాపయ నాయక ఓడిపోయి భువనగిరి దుర్గాన్ని బహమనీలకు ఇచ్చి సంధి చేసుకొన్నాడు. అల్లాఉద్దీన్ దండయాత్ర ఫలితంగా కాపయనాయక అధికారం కోస్తా ఆంధ్రలో బలహీన పడింది. బహమనీ అధికార విస్తరణను ఎదుర్కొనడానికి నిరంతరం ప్రయత్నిస్తున్న కాపయనాయకుని అధికారాన్ని కోస్తా ఆంధ్రలో అతని ప్రతినిధులు ధిక్కరించడం ప్రారంభించారు.

## 2.8 కాపయ నాయక - విజయనగర రాజుల సంబంధాలు :

బహమనీ రాజ్యాధికారాన్ని కూలదోయడానికి నిశ్చయించుకొన్న కాపయనాయక తన లక్ష్యసిద్ధి కోసం విజయనగర రాజు మొదటి హరిహర సహాయాన్ని కోరాడు. మొదటి హరిహరుడు ఈ సమయానికి కృష్ణ-తుంగభద్ర నదులకు ఉత్తరాన గల ప్రాంతాన్ని బహమనీలకు కోల్పోయాడు. అందువలన ఓరుగల్లు, విజయనగరాలు కలసి బహమనీ రాజ్య విధ్వంసానికి పూనుకొన్నాయి. బహమనీల బంగారు నాణేలను సాధ్యమయినంతవరకు సంగ్రహించి కరిగించవలసినదిగా హిందూ రాజులు తమ ప్రజలకు సూచించినట్లు, బహమనీ సుల్తానులకు ఉద్దేశించిన గుర్రాలను అరబ్బు వర్తకుల నుండి హిందూ రాజులు సంగ్రహిస్తున్నట్లు ఫెరిష్టా వ్రాసాడు.[21] ఈ చర్యల వలన బహమనీల

ర్థిక విధానానికి, సైనిక బలానికి అపార నష్టం కలిగింది. దీనికి తోడు విజయనగరరాజు, కాపయనాయకులు కలసి హసన్ గంగూ అనంతరం బహమనీ సుల్తాన్ అయిన మహమ్మద్ షాకు అతని తండ్రి తమ తమ రాజ్యాల నుండి ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి అప్పగించాలని, లేని పక్షంలో ఢిల్లీ సుల్తానులతో తాము చేరి బహమనీ రాజ్యంపై దండయాత్ర చేయగలమని దూతల ద్వారా కబురు చేసారు. కాపయ, బుక్కరాయలే కప్పం చెల్లించవలసిందని, ఉత్తమ జాతికి చెందిన ఏనుగులను పంపవలసిందని మహమ్మద్ షా ఎదురు రాయబారం పంపాడు. కుపితుడైన కాపయ నాయక తన కుమరుడైన వినాయక దేవుని బహమనీ రాజ్యం పై దండయాత్రకు పంపాడు. విజయనగర రాజు బుక్కరాయలు తన సహాయాన్ని అందజేస్తూ 20 వేల అశ్విక దళాన్ని పంపాడు.[22] మహమ్మద్ షా తన సేనాని బహదూర్ ఖాన్ని పెద్ద సైన్యంతో వినాయక దేవుని ఎదుర్కొనడానికి పంపి తాను విజయనగర సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. సుల్తాన్ సైన్యం విజయనగర సైన్యంపై విజయం సాధించి విజయ నగరాన్ని దోచుకొన్నది. వినాయక దేవుడు తాము కోల్పోయిన భువనగిరిని తిరిగి ఆక్రమించి ప్రథమంలో విజయం సాధించిననూ చివరకు బహదూర్ ఖాన్ చేతిలో ఓడి తన రాజధాని వెలుంపుట్టన్ కోటలో తలదాచుకొన్నాడు. బహదూర్ ఖాన్ ఓరుగల్లు ప్రవేశించి కాపయనాయకుని సంధికి ఒప్పించాడు. కాపయనాయక అపారధనరాసులు, 25 ఏనుగులు, అమూల్యమైన రత్నాలు సుల్తాన్‌కు ఇచ్చి సంధి చేసుకొన్నాడు.

కాని వేలుంపుట్టన్‌లో వినాయక దేవుడు గుల్బర్గాకు వస్తున్న అరబ్బుల గుర్రాలను అటకాయించడం కొనసాగించి బహమనీలకు కోపం కలిగించాడు. క్రీ.శ. 1362 లో అరబ్బు వర్తకుల ఫిర్యాదుపై[23] మహమ్మద్ షా వేలుంపుట్టన్ పై దాడిచేసి వినాయక దేవుని ఓడించి అతిదారుణమైన మరణానికి గురిచేసాడు. వినాయక దేవుని నాలుక కోయించి, క్రింద నిప్పులు ఏర్పాటు చేసి ఎత్తైన ప్రదేశం నుండి పడద్రోయించాడు. మహమ్మద్ షా వినాయక దేవుని కోశాగారాన్ని దోచుకున్నాడు. రాజ్యం దోపిడికి గురి అయింది. ప్రజలు అనేక హింసల పాలయ్యారు. ప్రజలు ఆగ్రహంతో సుల్తాన్‌ను ఎదుర్కొని అతనికి అపార నష్టాన్ని కలిగించినట్లు, అతికష్టం మీద తప్పించుకొని కౌలస్ దుర్గాన్ని చేరాడని, సుల్తాన్ చేతికి గాయం కూడా అయిందని ఫెరిష్టా వ్రాసాడు.[24]

వినాయక దేవుని మరణం కాపయనాయకుని కుంగదీసింది. మరియొక వైపు బహమనీ రాజ్యాన్ని కూలదోయడం తన లక్ష్యం అయింది. తన లక్ష్యసాధనలో విజయనగర రాజుల సహాయం సరిపోదని భావించి గత్యంతరం లేక కాపయ ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్‌షాను సహాయం అర్థించాడు. ముస్లింలతో యుద్ధం చేస్తున్న కాఫర్లకు సహాయం చేయడం ఇస్లాం ధర్మవిరుద్ధంగా భావించిన ఫిరోజ్ షా కాపయనాయక కోర్కెను తిరస్కరించాడు.కాపయనాయక ప్రయత్నాలను తెలుసుకున్న బహమనీ సుల్తాన్ మహమ్మద్ షా ఓరుగల్లును నిర్మూలించ నిశ్చయించుకొని విస్తృతమైన ప్రయత్నాలు చేసాడు. అజాం హుమాయూన్ సేనానిని గోల్కొండ పైకి, సఫ్దర్‌ఖాన్ సేనానిని ఓరుగల్లు పైకి దాడికి పంపి తాను వారిని అనుసరించాడు. ఈ తరుణంలో విజయనగరం నుండి కాపయకు ఎట్టి సహాయం అందలేదు. కాపయనాయక పరాజయానికి వెరచి అడవుల్లోకి పారిపోయాడు. మహమ్మద్ షా రెండు సంవత్సరాలు తెలంగాణంలో ఉండి అక్కడ విధ్వంసం సృష్టించాడు. కాపయనాయక తన రాజ్యం పూర్తిగా విధ్వసం కావడం ఇష్టపడక సంధికై కబురు పంపాడు. మహమ్మద్ షా ప్రథమంలో అంగీకరించకపోయినా తరువాత బహదూర్‌ఖాన్ మధ్యవర్తిత్వంలో క్రీ.శ.1364-65లో సంధి జరిగింది ఈ సంధి ప్రకారం కాపయ నాయక గోల్కొండ దుర్గం దాని పరిసర ప్రాంతాలతో బాటు 300 ఏనుగులను, 250 అశ్వాలను, 33 లక్షల రూపాయలు యుద్ధ నష్టపరిహారాన్ని సుల్తాన్‌కు చెల్లించాడు. ఉభయ రాజ్యాల మధ్య గోల్కొండ సరిహద్దుగా నిర్ణయించబడింది. వజ్రవైఢూర్యాలు పొదిగిన సింహాసనాన్ని కాపయ మహమ్మద్ షాకు బహూకరించాడు. ఈ సంధి అనంతరం కాపయ నాయక బహమనీల సంబంధాలు సజావుగా సాగాయి. విజయనగర రాజుల నుండి కాపయ నాయకకు సహాయం అందకపోవడం శోచనీయమైన విషయం.

## 2.9 కాపయ నాయక చివరి రోజులు :

కాపయ నాయక బహమనీలతో పొందిన పరాజయాలు అతని అధికార, గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించాయి. తీరాంధ్రంలో అతని అధికారం అస్తమించింది. పిఠాపురంలో కొప్పుల నాయకులు స్వతంత్రించారు. క్రీ.శ. 1356 నాటికి తొయ్యేటి అనవోతనాయుడు

మరణించడంతో రాజమహేంద్రవరం కోరుకొండ రాజ్యంలో చేరింది. కోరుకొండ నేలు మంచికొండ వంశస్తుడు ముమ్మడి నాయకుడు కాపయ నాయకుని బంధువే అయినా అతను గోదావరి ఉభయ తీర ప్రాంతాలలో స్వతంత్రించాడు. తరువాత మంచికొండ వారు కొండవీటి రెడ్ల సామంతులైనారు. ఉత్తర తీరాంధ్రంలో రెడ్ల అధికారం ఏర్పడింది.

కాపయ నాయక బహమనీలతో యుద్ధాలు చేస్తున్న సమయంలోనే రేచర్ల పద్మనాయకులు తమ అధికారాన్ని పటిష్టం చేసుకొన్నారు. మహమ్మద్ షా పరిపాలన ఆరంభకాలంలోనే సింగమ నాయక తన రాజ్యాన్ని కృష్ణానదీ పర్యంతం విస్తరింప జేయడమేగాక కృష్ణా తుంగభద్ర అంతర్వేదిలోని కొన్ని కోటలను[25] ఆక్రమించాడు. సింగమ నాయక ఇంకా పురోగమించి జల్లిపల్లి[26] కోటను ముట్టడించి కోటలో బంధింపబడిన తన బావమరిది చింతపల్లి సింగమ నాయకుని విడుదల చేయడానికి ప్రయత్నించాడు. ఇక్కడ చాళుక్యులతో జరిగిన యుద్ధంలోనే రేచర్ల సింగమ నాయక మరణించాడు. తదనంతరం అతని కుమారుడు అనవోతానీడు రాజయ్యాడు. సింగమ నాయక మరణంలో కాపయ నాయక జోక్యం ఉన్నదని అనవోతానీడు అనుమానించాడు. అనవోతానీడు తన రాజధానిని అమనగల్లు నుండి బలిష్టమైన రాజాకొండ దుర్గానికి మార్చి కాపయ నాయక పై దండెత్తాడు. క్రీ.శ.1368లో వరంగల్ తాలూకాలోని భీమవరంలో జరిగిన భయంకర యుద్ధంలో కాపయ నాయక ఓడి మరణించాడు.[27] అనవోతానీడు భువనగిరి, ఓరుగల్లు, సింగవరం మొదలగు కోటలను వశపరచుకొని "ఆంధ్ర దేశాధీశ్వర", "ప్రతిగండ భైరవ", "తిభువన రాయ" మొదలగు బిరుదులను గ్రహించాడు. క్రీ.శ.1369 నాటి అనవోతానీడు ఐనవోలు శాసనం[28] అతను సాధించిన విజయాన్ని సూచిస్తున్నది. కాపయ నాయక రాజ్యం రాజాకొండ పద్మనాయకుల వశమైనది. ముసునూరి వంశం అంతరించింది.

## 2.10 సారాంశము :

కాపయ నాయక గొప్ప యుద్ధవీరుడు, సమర్ధవంతమైన సేనాని. అంతకుమించి గొప్ప దేశ భక్తిపరుడు. మధ్యయుగాంధ్ర దేశచరిత్రలో సమర్థవంతుడైన పరిపాలకుడనిపించుకొన్నాడు. అతనిలోగల సాహసం, హిందూధర్మం, మతం పట్లగల భక్తి ముస్లింపాలన నుండి విముక్తికై స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించాయి. తన జీవితకాలమంతా తెలంగాణా సమగ్రతకు, హిందువుల స్వాతంత్రాన్ని కాపాడటానికి కృషి చేసి అనేక త్యాగాలు చేసాడు. కాని కాపయ నాయక, రేచర్ల అనవోతానీడు, మరియు మాదానాయకులు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలను వీడి హిందూ అధికార స్థాపనకోసం, తెలంగాణాలోని హిందూప్రజల సంక్షేమం కోసం కలసికట్టుగా పని చేసి ఉంటే ఆంధ్రదేశ చరిత్ర మరోక విధంగా ఉండి ఉండేది.

## References


1. Bharati, Vol. No.21, No:6, p. 553.
2. Epigraphia Indica, vol.XXXII, p. 239-268
3. Polavaram Inscription of Kapayanayaka, Bharati, Vol.XI, 1934, Part I, p.p. 939-952
4. Vasishta Ramayanam, Madiki Singana, Canto I, verse 33
5. Padmapuranam, Madiki Singana, preface.
6. Archaeological Report on Epigraphy, 261 of 1905.
7. Srirangam Plates of Mummadi Nayaka, Epigraphia Indica, Vol.XV, pp.83 ff
8. Akkalapudi Grant of Singaya Nayaka, Epigraphia Indica, Vol.XIII, p.p.259-275
9. Kaluvacheru Grant of Anitalli, Bharati, Vol.21, No.6, pp.553 ff
10. Velugotivari vamsavali, N.Venkataramanayya(Ed), verse 20.

11. Recherla, a village in Telengana
12. Velugotivari Vamsavali, Verse 20
13. South Indian Inscriptions, Vol.IV, No.950
14. A Corpus of Inscriptions of Telengana District of H.E.H. Nizam's Dominions, No.40
15. It was the tradition that victorious King acquired the titles of the defeated king.
16. Ferishta - Rise of Muhammadan Power in India, J.Briggs, Vol. II, p.294
17. Indian Antiquary, Vol.28, p.652
18. A Corpus of Inscriptions of Telengana Districts of HEH Nizam's Dominions, No.40
19. South Indian Inscriptions, Vol. VI, No:226
20. The Reddis, V. Yasoda Devi, Appendix.
21. J. Briggs, OP.Cit. Vol.II, p.301.
22. Cambridge History of India, W. Haig (Ed), Vol.III, p.379.
23. A Forgotten Chapter of Andhra History , M. Soma Sekhara Sarma, Appendix IV
24. J. Briggs, OP.Cit., Vol.II, p.304.
25. Rasarnavasudhakaram, Recherla Singabhupala, Introduction.
26. In Chintakunta Taluq of Mahaboobnagar District.
27. Velugotivarivamsavali, p.26.
28. Velugotivarivamsa Charitra, Appendix No.4, p.20.

- ఎం. సోమశేఖర రావు.

పాఠం - 3

# కొండవీటి రెడ్డి రాజులు

## 3.0. లక్ష్యం :

ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ స్థానం వహించిన కొండవీటి రెడ్డిరాజుల గురించి వారు సాగించిన దండయాత్రల గురించి వివరంగా తెలియజేయటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయక్రమం :


3.1 పరిచయం

3.2 రెడ్డిరాజ్య స్థాపన

3.3 ప్రోలయ వేమారెడ్డి

3.3.1 స్వతంత్ర రెడ్డిరాజ్య పాలకుడుగా ప్రోలయవేమారెడ్డి

3.4 అనవోతారెడ్డి

3.4.1 తూర్పు తీర దండయాత్రలు

3.4.2 రెడ్డి - వెలమల సంఘర్షణ

3.4.3 రెడ్డి - బహమనీల సంఘర్షణ

3.4.4 రెడ్డి - విజయనగర సంఘర్షణ

3.5 అనవేమారెడ్డి

3.5.1 కళింగ దండయాత్ర

3.5.2 అనవేమారెడ్డి - వెలమలు

3.5.3 అనవేమారెడ్డి - విజయనగర రాజులతో సంఘర్షణ

3.6 కుమారగిరి రెడ్డి

3.6.1 కుమారగిరిరెడ్డి - విజయనగర రాజుల సంఘర్షణ

3.6.2 కుమారగిరిరెడ్డి - రేచర్ల పద్మనాయకులు

3.6.3 కుమారగిరి - కళింగ దండయాత్ర

3.6.4 కుమారగిరి - రాజమహేంద్రవర రాజ్యఏర్పాటు

3.7 రెండవ అనవోత మరణం

3.8 పెదకోమటి వేమారెడ్డి

3.8.1 పెదకోమటి వేమారెడ్డి తొలి దిగ్విజయాలు

3.8.2 పెదకోమటి వేమారెడ్డి - కాటయ వేమారెడ్డి సంబంధాలు

3.8.3 పెదకోమటి వేమారెడ్డి - అల్లాడ రెడ్డి

3.8.4 కొండవీటి రెడ్డి రాజ్య అంతం ప్రారంభం

3.8.5 పెదకోమటి వేమారెడ్డి - రేచర్ల పద్మనాయకులు

3.9 రాచవేముడు

3.10 సారాంశము

## 3.1 పరిచయం

కాకతీయుల పతనానంతరం కోస్తా ఆంధ్రప్రాంతంలో సింహాచలం నుండి నెల్లూరు వరకు సుమారు ఒక శతాబ్ది పాలించి ఆంధ్రదేశ చరిత్ర, సంస్కృతి, భాషా సారస్వతాలకు రెడ్డి రాజులు అత్యంత సేవ చేసారు. రెడ్డి రాజులు స్వతంత్ర పాలన క్రీ.శ. 1324 - 25 సం॥లో అద్దంకి నుండి ప్రారంభమై తరువాత కొండవీడు, కోరుకొండ, పిఠాపురం, కందుకూరు, చందోలు శాఖలుగా వివిధ ప్రాంతాలను పరిపాలించారు.

"రెడ్డి" పద ఉత్పత్తి చర్చనీయాంశమైనది. ఆంధ్రదేశంలో ప్రాచీన కాలంలో గల వివిధ జాతుల్లో "రట్ట" అనే జాతివారున్నారని "రట్ట" పదం నుండే "రెడ్డి" అను పదం ఉద్భవించిందని చరిత్రకారుల అభిప్రాయం. అశోకుని శిలా శాసనాలలో దక్షిణా పథంలో "రట్ట" జాతివారున్నట్టు తెలుస్తున్నది. అశోకుని శిలాశాసనాలలోనే రాష్ట్రిక, రాష్టిక (షహాబాజ్‌ఘర్ శాసనం), రాట్రక (మాన్‌సెరా శాసనం), రిష్టిక (గిరినార్ శాసనం) "రట్ట" పదానికి రూపాంతరాలున్నాయి. శాతవాహనుల నానాఘాట్, కార్లి, కన్హేరి శాసనాలలో మహారధులు కనిపిస్తారు. ఖారవేలుని హాతిగుంఫా శాసనం రఠికులను పేర్కొంటున్నది. ఆరట్ట, సురట్ట, మరట్ట, రట్టపాడి అనే ప్రాంతీయ విభాగాల పేర్లు రట్ట జాతి వలననే వచ్చాయి. కనుక ఆంధ్రజాతిలో విలీనమైన పలు తెగల్లో "రట్ట"కు లొకరని చెప్పవచ్చు. శాతవాహనుల పతనానంతరం క్రీ.శ. 300-600 సంవత్సరాల మధ్య వీరి ప్రస్తావన కనిపించదు. బహుశ ఈ కాలంలో వీరు ఆంధ్రదేశానికి సంబంధించిన వివిధ ప్రాంతాలలో స్థిరపడి వ్యవసాయ వృత్తిని అవలంభించి క్రమేణా ధనవంతులై, గ్రామప్రముఖులై 7వ శతాబ్దానికి రాజకీయాలలో ప్రవేశించి ఉంటారు. 8వ శతాబ్దం నుండి "రాష్ట్రకూట ప్రముఖాన్" అనే పదం కనిపిస్తున్నది. అంటే ప్రతి గ్రామంలోను పలువురు రాష్ట్రకూటులు (రట్టులు) ఉండేవారవి తెలుస్తుంది. రాష్ట్రకూట వంశస్థులు ఎనిమిదో శతాబ్దం నుండి రెండువందల సంవత్సరాలు దక్షిణా పథంలో పరిపాలన చేసి సార్వభౌములై ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ పాత్రని నిర్వహించారు. రాష్ట్ర కూట అనేది ఉద్యోగ నామమని, దాన్నే వంశనామంగా ధరించారనే అభిప్రాయం పబలంగా ఉంది. రాష్ట్రకూడ రాజులు రట్టకందర్ప, రట్టవిద్యాధర అనే బిరుదులు ధరించారు. కనుక రట్టకుడి సంస్కృతీకరణమే రాష్ట్రకూట అని చెప్పవచ్చు. రట్టడి పదమే క్రమంగా మార్పులు చెంది రెడ్డిగా స్థిరపడింది.

రెడ్డిరాజులు పంటశాఖీయులు పంట రాష్ట్రవాసులయినందున పంట రెడ్లయినారు. పంట రాష్ట్రం పాకనాడు అంతర్భాగమైనట్లు శాసనాధారమముంది. గూడూరు తాలూకాలోని ముట్టింబాకయే పంట రాష్ట్రకేంద్రమని చరిత్రకారుల భావన. పాకనాటిలో విక్రమ సింహపురి, దువ్వూరు, గండవరాది పట్టణాలు పంటదేసటి మహన్వయానికి కేంద్రాలని శ్రీనాధుడు భీమేశ్వర పురాణంలో పేర్కొన్నాడు. పంట రెడ్లు క్రమంగా పంట రాష్ట్రం నుండి విస్తరించి తమ తమ నివాస ప్రాంతాలను బట్టి మోటాటి, వెలనాటి, చాంగలునాటి మొదలగు పదునాలుగు శాఖలుగా విడిపోయారు.

కొండవీటి దండకావలె, కొండవీడు కైఫీయత్‌లు రెడ్డిరాజులు దొంతి వంశస్థులని తెలియజేస్తున్నాయి. రెడ్డిరాజులు శాసనాలేవి వీరు దొంతి వంశస్థులని పేర్కొనుటలేదు. రెడ్డి రాజుల ఆస్థానాన్ని అలంకరించిన ఎర్రాప్రగడ, శ్రీనాథులు రెడ్డిరాజులు దొంతి వంశస్థులని పేర్కొన్నారు. ఎర్రాపగడ తన హరవిలాసంలో ప్రోలయ వేమారెడ్డిని "దేసటి వేమ" అని వర్ణించాడు. శ్రీనాధుడు ఆలయ వీరభద్రారెడ్డిని "దేసటి వంశ గ్రామణి" అని సంబోధించాడు. వీర భద్రారెడ్డి సమకాలీనుడైన కొమ్మన కవి రాజమహేంద్రవరం రెడ్డి రాజులను దేగుటి వంశీయులని వర్ణించాడు. ఈ సాహిత్య ఆధారాల ప్రకారం రెడ్డి రాజులు దేసటి వంశీయులని తెలుస్తున్నది.

పంట దేసటి రాజు వంశానికి కోమటి ప్రోలారెడ్డి మూల పురుషుడు. వీరి వంశంలో కోమటి, వేమ అనే పేర్లు తరచుగా కనిపిస్తున్నాయి. పరుసవేది వల్ల ధనికుడైన వేముడనే కోమటిని హత్యజేసి అతని ధనాన్ని సంగ్రహించి, ఆ పాప నివృత్తికై కోమటి, వేమ పేర్లను స్వీకరించారని స్థానిక చరిత్రలు పేర్కొంటున్నాయి. కోమటి ప్రోలారెడ్డికి మాచారెడ్డి వేమారెడ్డి, అన్నారెడ్డి, దొడ్డారెడ్డి, మల్లారెడ్డి అను ఐదుగురు కుమారులున్నారు. వీరిలో రెండవ వాడైన ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్య స్థాపకుడు.

పంట రెడ్లు నెల్లూరు చోడులకు సామంతులుగా ఉండి హోయసాలి, పాండ్య, పల్లవ రాజులతో నిరంతర యుద్ధాలు చేసి "జగనొబ్బగండ" "పాండ్యరాజ్య గజకేసరి", "పల్లవ త్రినేత్ర" మొదలగు బిరుదులు పొందారు. కాని తెలుగుచోడులు బలహీనులు కావటంతో ప్రోలయ వేమారెడ్డి వల్లూరు-గండికోటలనేలే కాయస్థ అంబదేవుని మంత్రి ఘోడెరాయ గంగదేవుని సహాయంతో ప్రోలయ వేమారెడ్డి ధరణికోట ప్రాంతంలో బలపడ్డాడని తెలుస్తుంది.

## 3.2 రెడ్డి రాజ్యస్థాపన

ఏ పరిస్థితుల్లో రెడ్డి రాజ్యస్థాపన జరిగిందో నిర్దుష్టంగా తెలియజేసే ఆధారాలు ఇంతవరకు లభించలేదు. లభించిన ఆధారాలు ఆ కోణంలో సమాచారాన్ని అందించడం లేదు. మధ్యయుగ ఆంధ్రదేశానికి సంబంధించిన అనేకమంది ప్రభువులు ముస్లిం అధికారం నుండి తమ ప్రాంతాలను విముక్తి చేసివారి పరిపాలన వలన ఏర్పడిన అరాజకం నుండి శాంతి భద్రతల పునరుద్ధరణకై ప్రయత్నాలు చేస్తున్న సందర్భంలో కొండవీటి రెడ్డి రాజ్యస్థాపన జరిగిందని చెప్పవచ్చు. ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్య స్థాపకుడు. ప్రోలయ వేమారెడ్డి ప్రోలవరం శాసనం[1] (క్రీ.శ. 1324-25) రెడ్డిరాజుల చరిత్రలోనేగాక ఆంధ్రదేశ చరిత్రలో అతిముఖ్యమైనది. ఈ శాసనం ఆంధ్రదేశ చరిత్ర ఒక నూతన శక ఆరంభాన్ని సూచిస్తున్నది. ఈ శాసన కాలం నాటికి కోస్తా ఆంధ్రాప్రాంతం ముస్లిం పాలన నుండి విముక్తి పొందింది.

## 3.3 ప్రోలయ వేమారెడ్డి: (క్రీ.శ.1324-25-1353)

ప్రోలయ వేమారెడ్డి పాకనాడు (పుంగి విషయ) పాలకుడైన ప్రోలయరెడ్డి కుమారుడు. ప్రోలయ వేమారెడ్డి ప్రతాపరుద్రుని కొలువులోని నాయంకరులలో ఒకడనే వాదం ప్రబలంగా ఉంది. కాని ప్రోలయ వేమారెడ్డి నాయంకరులలో ఒకడని చెప్పడానికి సాక్ష్యం లేదు. ప్రోలయ వేమారెడ్డి శాసనాల నుండి అతని జీవిత విశేషాలు స్పష్టంగా తెలియడంలేదు. అనితల్లి కలువ చేరు శాసనం[2] ప్రోలయ వేముడు కాపయనాయకుని కొలచిన 75 నాయంకరులలో ఒకడని చెబుతున్నది. ఇందు పేర్కొన్న సమాచారం విశ్వాసయోగ్యం కాదని పండితుల అభిప్రాయం. వేమారెడ్డి శాసనాలలో అతడు కాకతీయ సామంతుడనే సూచనలేదు. కాని కాకతీయ ప్రతాపరుద్రునికి నామ మాత్రంగా లొంగి తన రాజ్యాన్ని ఏలుకొని ఉండవచ్చు. ప్రతాపరుద్రుని పాలనా కాలంలోనే కాకతీయుల ప్రసక్తి లేకుండా తన రాజ్యంలో భూదానాలు చేసాడు. మల్లవరం శాసనం ప్రోలయ వేమారెడ్డి ఆంధ్రదేశంలో ఏర్పడిన అరాజక పరిస్థితుల కాలంలో సాగించిన చర్యలకు సంబంధించిన ప్రాంతాలను తెలియజేస్తున్నది. ప్రోలయ వేమారెడ్డి గుండ్లకమ్మ, కృష్ణా, గోదావరి నదుల పారివాహక ప్రాంతాలలో సైనిక చర్యలు జరిపినట్లు సూచిస్తున్నది. బహుశ ఈ సమయంలోనే ఈ నదీ తీరములందుగల అనేక అగ్రహారాలను బ్రహ్మణులకు దానం చేసాడు. ముస్లిం పాలనకు ముందు ఈ అగ్రహారాలు బ్రహ్మణులకు దానం ఇవ్వబడ్డాయి. ముస్లిం పాలననుండి ఈప్రాంతాలను విముక్తి చేసి అక్కడగల ఈ అగ్రహారాలను తిరిగి దానం చేసాడు. అనవేముడనే పేరున ప్రోలయ వేముడు శివకవి, ప్రధమకవి శ్రీగిరి దేవయ్యంనింగారికి

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలుకాలోని మొగ్గల్లులో భూదానం చేసినట్లు అక్కడి శాసనాల్లో నమోదయింది. ఈ శాసనాల్లో ఒకదానిలో తేదీలేదు. రెండోవది క్రీ.శ.1315 నాటిది.[3] కాకతీయ ప్రతాపరుద్రుని పాలనా కాలంలోనే ప్రతాపరుద్రుని పేరులేకుండా స్వయంగా భూదానం చేశాడంటే ప్రోలయ వేముడు కాకతీయ సార్వభౌమాధికారాన్ని గుర్తించక స్వయంగా పాలిస్తున్నాడని, అతని సైనిక చర్యలు, రాజ్యవిస్తరణ గోదావరీ నదీ ప్రాంతందాకా కొనసాగాయని తెలుస్తున్నది.

ప్రతాపరుద్రుని యుద్ధాలు, తురుష్కులతోటి సంఘర్షణ ప్రోలయవేమారెడ్డి బలవంతుడు కావడానికి అనుకూలించాయి. స్వతంత్ర రెడ్డిరాజ్య స్థాపనకు ప్రోలయవేమారెడ్డి సాగించిన ప్రయత్నాలలో బలవంతులైన అతని సోదరులు, మేనమామలు అయిన మాచారెడ్డి మల్లారెడ్డి, పోతయ, నాగయ, చిట్టయ మొదలగు వారు అత్యంత చేయూతనిచ్చారు, ముస్లింలు ఓరుగల్లుని ఆక్రమించిన తరువాత ముస్లింలపై దండయాత్ర జరిపి వారిని కృష్ణానది దక్షిణ ప్రాంతం నుండి తరిమి వేసాడు. ఈ ప్రయత్నంలో ఆరవీటి వంశస్థుల సహాయం కూడా ప్రోలయకు లభ్యమయింది. కలువచేరు శాసనం బట్టి ప్రోలయవేమారెడ్డి ప్రోలయనాయక అతని వారసుడు కాపయ నాయకకు విధేయుడుగా ఉన్నట్లు తెలుస్తుంది. కొలని రుద్రదేవుని ప్రోత్సాహం కూడా అందినట్లు రుద్రదేవుని సంతమాగులూరు శాసనం తెలియజేస్తున్నది. ఈ విధంగా మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవుడై మల్లవరం శాసనం ప్రకారం ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1324-25 నాటికి అద్దంకి రాజధానిగా రెడ్డిరాజ్యం స్థాపించాడు. అన్న మాచారెడ్డిని చందోలు దుర్గానికి అధిపతిగా తమ్ముడు మల్లారెడ్డిని సర్వసైన్యాధ్యక్షుడుగా నియమించి కృష్ణానదికి దక్షిణాన గల ఆంధ్రదేశాన్ని పరిపాలించాడు. స్థానిక చరిత్రలు వేమారెడ్డి క్రీ. శ.1320 లోనే ధరణి కోటలో స్వతంత్ర రెడ్డిరాజ్యాన్ని స్థాపించినట్లు చాటుతున్నాయి.

## 3.3.1 స్వతంత్ర రెడ్డిరాజ్య పాలకుడుగా ప్రోలయవేమారెడ్డి: (క్రీ.శ.1325-53)

ప్రోలయవేముని మల్లవరం శాసనం అనుసరించి అతను క్రీ.శ.1325 నుండి స్వతంత్రంగా రాజ్యపాలన చేసాడని చెప్పవచ్చు. అతని కాలం నాటి రాజకీయ సంఘటనలు గురించిన వివరాలు స్పష్టంగా లేవు. రేచర్ల పద్మనాయక వంశీకుడు సింగమ నాయకుని మరణంతో రెడ్డి-పద్మనాయకుల సంఘర్షణ ప్రారంభమయింది. క్రీ.శ.1336లో విజయనగర రాజ్యస్థాపనతో కొండవీడు-విజయనగర రాజ్యాల మధ్య దక్షిణ తీరాంధ్రానికై ముఖ్యంగా పంటరెడ్ల జన్మభూమి అయిన పాకనాటికై పోరాటం ప్రారంభమైంది. అటకలగూడు (క్రీ.శ.1339)[4] ఆకుమళ్ల తామ్ర శాసనం (క్రీ.శ.1340)[5] మొదటి హరిహర రాయలను "పూర్వ పశ్చిమ సముద్రాధీశ్వర" అని వ్యవహరిస్తున్నవి. క్రీ.శ.1343నాటి నుండి విజయనగర శాసనాలు నెల్లూరు జిల్లాలో గల కొవ్వూరు, కావలి, ఉదయగిరి తాలూకాలలో కనిపిస్తున్నాయి. వీటిని బట్టి విజయనగర అధికారం తూర్పు పశ్చిమ తీర ప్రాంతాలలో విస్తరించి ప్రోలయవేముడు పాకనాడును విజయనగర రాజులకు కోల్పోయాడని చెప్పవచ్చు. ఈ విధంగా కొండవీటి విజయనగర రాజ్యాల మధ్య ప్రారంభమయిన సంఘర్షణ ఒక శతాబ్దం సాగింది. విజయనగర రాజులకు దక్షిణ కోస్తా ఆంధ్రాలో ఉదయగిరి ఒక ముఖ్య కేంద్రం అయింది.

ప్రోలయ వేమారెడ్డి కాలంలోనే బహమనీలకు రెడ్డిరాజులకు సంఘర్షణ ప్రారంభమయింది. క్రీ.శ.1347లో బహమనీ సుల్తాన్ అల్లాఉద్దీన్ తెలంగాణం మీదుగా కృష్ణాతీరం వరకు దాడి చేయగా ఆ దాడిని మల్లారెడ్డి త్రిప్పికొట్టి రెడ్డిరాజ్యాన్ని కాపాడాడు.[6] ఇదే సమయంలో మల్లారెడ్డి మోటుపల్లి రేవు పట్టణాన్ని ఆక్రమించాడు. కర్నూలు జిల్లాలోని చోడ వంశస్థులను ఓడించి శ్రీశైలం,త్రిపురాంతకం ప్రాంతాలను ఆక్రమించాడు. ప్రోలయవేముడు ఏరువచోడులతో సంబంధబాంధవ్యాలను నెలకొల్పుకున్నాడు. ఏరువ చోడులలో భక్తిరాజు ప్రోలయవేమారెడ్డి సమాకాలీనుడు. వెంగభూపాలుడు స్వాతంత్ర్యోద్యమంలో ముసునూరి ప్రోలయ నాయకతో సహకరించి తురుష్కులతో జరిగిన యుద్ధాలలో మరణించడంతో ముసునూరి ప్రోలయనాయకుడు భక్తిరాజుని వేంగి సింహాసనస్థుని చేసినట్లు పెంటపాడు శాసనం సూచిస్తున్నది. ముసునూరి ప్రోలయ నాయక వారసుడు కాపయనాయక తన రాజ్యాన్ని పునఃవ్యవస్థీకరించి రాజమహేంద్రవరంలో తొయ్యేటి అనవోతానీడుని నియమించడంతో భక్తిరాజు తన అధికారం కొల్పోయి ప్రోలయవేమారెడ్డి సహాకారం కోరి ఉంటాడు. తొయ్యేటి అనవోతానీడు మరణానంతరం రెడ్డిరాజుల సహాకారంతో భక్తిరాజు వేంగి ప్రాంతాన్ని తిరిగి సంపాదించాడు.[7] భక్తిరాజు మద్రాస్ మ్యూజియం ఫలక శాసనం భక్తిరాజు శ్రీశైలంలో ఉండి కాంద్వకొలను గ్రామాన్ని క్రీ.శ.1356లో కౌశిక గోత్రజుడైన

శ్రీవిశ్వనాధకు దానం చేసినట్లు పేర్కొంటున్నది. అదే సమయంలో ఆతుకూరు గ్రామాన్ని పర్వత దేవర మల్లికార్జునికి దానం చేసా అదే సమయంలో త్రిపురాంతకంలోని త్రిపురాంతక దేవరకు ఆముదాలపల్లి గ్రామాన్ని దానం చేసాడు. కాశీఖండం, శివలీల వి మొదలగు తెలుగు రచనలను అనుసరించి భక్తిరాజు కుమారుడు భీమచోడుడు ప్రోలయవేమారెడ్డి కుమార్తెను వివాహం చేసుకొన తెలియుచున్నది. పై ఆధారాల ప్రకారం ఏరువ భక్తిరాజు ప్రోలయ వేమారెడ్డికి మిత్రుడుగా క్రీ.శ.1355-56సంవత్సరాలలో శ్రీశై త్రిపురాంతక ప్రాంతాలు దర్శించి దానధర్మాలు చేసాడు.

ప్రోలయవేమారెడ్డి రాజ్యం స్థూలంగా కృష్ణానది, అహోబిలం, శ్రీశైలక్షేత్రాలు, కందుకూరిసీమ, తూర్పుతీరాల మధ్య విస్త ఉన్నది. క్రీ.శ.12,వ శతాబ్ది ఆంధ్రదేశంలో ఒక సామంతరాజు ఆధీనంలో ఉండే ప్రాంతం కన్నా ఇప్పుడు ఎక్కువ ప్రాంతాన్ని ప్రోలయవేము పరిపాలించాడు. కాని నాటి స్వతంత్రపాలకులు గ్రహిస్తున్న మహామండలేశ్వర బిరుదాన్ని ప్రోలయవేమారెడ్డి స్వీకరించలేదు. రాజ్యరక్షణకై ధరణికోట, చందోలు, వినుకొండ, బెల్లంకొండ, కొండవీడు, కందుకూరు, కొండపల్లి ప్రదేశాలలో దుర్గాలు నిర్మించా అద్దంకి రాజధాని అయినప్పటికి కొండవీడు భావిరాజధాని అనే దృష్టితో దాన్ని దుర్భేధ్యమైన దుర్గంగా రూపొందించాడు. ప్రోలయవేము క్రీ.శ.1353 వరకు పాలించినట్లు అతని మణికేశ్వరం (ఒంగోలు తాలుకా) శాసనం[6] వలన తెలియుచున్నది.

ప్రోలయవేమారెడ్డి తన రాజ్యాన్ని సమర్ధవంతంగా, న్యామబద్ధంగా పాలించాడు. ముస్లీంల దండయాత్రలు, ఆంతరంగిక కల్లో వలన బ్రాహ్మణులు, కర్షకులు అనుభవిస్తున్న కష్టాల నుండి వారిని విముక్తి చేసి వారి వారి వృత్తులను సవ్యంగా అనుసరించగలి వాతావరణాన్ని సృష్టించి, వారికి తగురక్షణ కల్పించి, ధర్మప్రతిష్ఠాగురు అని కీర్తి పొందాడు. ముస్లిం ఆక్రమణలో బ్రాహ్మణు కోల్పోయిన అగ్రహారాలను వారికి తిరిగి పునరుద్ధరించి ఇంకా అనేక అగ్రహారాలను బ్రాహ్మణులకు దానం చేసి "నిస్సీమ పరుశురా "అపరమిత భూదాన పరశురామ" అని శ్లాఘింపబడ్డాడు. ప్రోలయవేమారెడ్డి 44 గ్రామాలను బ్రహ్మణులకు దానం చేసినట్లు చా పద్యాలున్నాయి. ప్రోలయవేమునికిగల "అనేక నగరోపకంత ప్రతిష్టాపిత బహువిధ ఆరామ" అను బిరుదును బట్టి నాటికే ప్రోలయ తన రాజ్యంలోని అనేక పట్టణాల వెలుపల తోటలను వేయించినట్లు తెలియుచున్నది. సప్త సంతానాలలో తోటల పెంపకము ఒ ప్రోలయవేమారెడ్డి వైదిక ధర్మాభిమాని, వైదిక క్రతువులు నిర్వహించడానికి దాన ధర్మాలు చేసి, బ్రహ్మణులను పోషించి"అనవ పురోహిత కృతసోమపాన" అని కీర్తింపబడ్డాడు. హేమాద్రి తన చతుర్వర్గ చింతామణిలోని దానకాండలో చెప్పిన దానాలన్నీ ప్రోలయవేము చేసాడు. ప్రోలయవేముడు శైవమతాన్ని కూడ అభిమానించాడు. శ్రీశైలంలో, అహోబిలక్షేత్రంలో సోపాన పంక్తులు నిర్మించి భ అభిమానానికి పాత్రుడయ్యాడు. గొప్పసాహిత్య పోషకుడు. శంభుదాసుడుగా ప్రసిద్ధికెక్కి కవిత్రయంలో చివరివాడయిన ఎర్రాప్రగడ వేమారెడ్డి ఆదరించి పోషించాడు. ఎర్రాపగ్రడ హరివంశాన్ని రచించి వేమారెడ్డికి అంకితం చేసాడు. ప్రోలయవేమారెడ్డికి అనవోతా అనమాచారెడ్డి, అనవేమారెడ్డి అను ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్దకుమార్తె దొడ్డాంబను ఇమ్మడి కాటయరెడ్డికి వివాహం చేసాడు. వీరి సంతానమే కాటయ వేమారెడ్డి.

## 3.4 అనవోతారెడ్డి (క్రీ.శ.1353-1364)

ప్రోలయవేమారెడ్డి మరణానంతరం అతని పెద్ద కుమారుడు అనవోతారెడ్డి సింహాసనం అధిష్టించాడు. తన తండ్రితో పా అనవొతారెడ్డి అనేక యుద్దాల్లో పాల్గొని అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి "వీరన్నవోతు"గా ప్రసిద్ధి చెందాడు. అనవోతా రె చిన్నతనంలోనే తన తండ్రితోబాటు పరిపాలనలో పాలుపంచుకొన్నాడు. ముఖ్యంగా తన తండ్రి చివరి రోజులలో పరిపాలనా వ్యవహారా సమర్థవంతంగా నడిపాడు. కొల్లూరు దానశాసనంలో తమ్ముడైన అనవేమారెడ్డి ఇతడిని "ప్రత్యబ్దం ప్రతిపక్ష దేశ జయినం" అ కీర్తించాడు. ప్రతి సంవత్సరం యుద్ధాలు చేసి రాజ్యాలను ఆక్రమించాడనే అర్ధంపై మాట చెబుతున్నది. అనవోతారెడ్డి తన పరిపా కాలమంతా యుద్ధాలలో నిమగ్నుడై ఉన్నాడనే మాట వాస్తవం అయినా తన తండ్రి నుండి సంక్రమించిన రాజ్యంలో కొంత భాగమిత కొల్పోవడం జరిగింది.

## 3.4.1 తూర్పు తీర దండయాత్రలు:

అనవోతారెడ్డి రాజ్యానికి వచ్చినంతనే అతని దృష్టిని కళింగ పరిస్థితులు ఆకర్షించాయి. రాజమహేంద్రవరంలో తొయ్యేటి అనవోతానీడు మరణించడంతో వేంగి రాజ్యంలో అలజడి ప్రారంభమయింది. ముసునూరి కాపయనాయక అధికారం సన్నగిల్లింది. కోరుకొండ పాలకుడైన మంచికొండ ముమ్మడి నాయక తన అధికారాన్ని అనవోతానీడు రాజ్యంలోని రాజమహేంద్రవర ప్రాంతంలో ప్రబలం చేశాడు. తూర్పుతీరంలోని ఈ పరిస్థితులు కళింగ గాంగ చక్రవర్తి నాల్గవ నరసింహుని ప్రోత్సహించాయి. క్రీ.శ.1353లో నాల్గవ నరసింహుడు గోదావరి నది దాటి తీరాంధ్రంపై దండెత్తి కృష్ణానది తీరంలో గల శ్రీకాకుళం వరకు జయించి శ్రీకాకుళంలోని శ్రీవల్లభరాయ దేవరునకు తన భార్య గంగామహాదేవిపేర బంగారునగలను దానం చేసాడు.[9] అనవోతారెడ్డి ఈ కళింగ దండయాత్రను విజయవంతంగా ఎదుర్కొనలేదు.

కాని అనవోతారెడ్డి కొలది కాలంలోనే ప్రతీకార చర్యగా తూర్పుదిగ్విజయ యాత్రలు ప్రారంభించి "తలగడదీవి"ని ఆక్రమించి దాక్షారామం వరకు నడచినట్లతని దాక్షారామ శాసనం (క్రీ.శ.1356)[10] తెలుపుతున్నది. దాక్షారామ శాసనం అనవోతారెడ్డిని "ద్వీపజేత" అని వర్ణిస్తున్నది. తవలగడదీవిని కృష్ణాజిల్లాలోని మచిలీపట్టణం తాలూకాలోని దివిపురంగా గుర్తించారు. ఈ దండయాత్రలో అనవోతారెడ్డికి తన మిత్రుడు బంధువైన చోడభక్తి రాజా అండగా నిలిచాడు. అయితే ఈ దండయాత్ర సమయంలోనే కృష్ణానది కళింగ రాజ్యాల మధ్య గల ప్రభువులు అనవోతారెడ్డిని ఎదిరించి లొంగిపోయారు. వారిలో కొరుకొండ-రాజమహేంద్రవరం పాలకుడు మంచికొండ వంశస్థుడైన ముమ్మడినాయకుడు, కోనహైహయులు, పిఠాపురం పాలకులు కొప్పుల ప్రభువులు ముఖ్యులు. అనవోతారెడ్డి కొరుకొండ శాసనం[11] అనవోతారెడ్డి సాధించిన పై విజయాలను సూచిస్తున్నది. పైన చెప్పిన ఆధారాల ప్రకారం అనవోతారెడ్డి తూర్పు దిగ్విజయ యాత్రలు క్రీ.శ.1353-1356 సంవత్సరాల మధ్య జరిగాయి. అనవోతారెడ్డి తమ్ముడు,వారసుడైన అనవేమారెడ్డి ఇప్పుగల్లుదాన శాసనం,[12] పచ్చలతాడిపర్రు శాసనాలలో పేర్కొన్న ప్రకారం అనవోతారెడ్డి కళింగ రాజ్యానికి పశ్చిమోత్తరంలో గల మేఖాల భూపర్యంతం జయించి కళింగదాక తన అధికారాన్ని నిలిపాడని విషయానికి సాక్ష్యాధారాలు లేవు.

అయితే అనవోతారెడ్డి తూర్పుదిగ్విజయ యాత్రలు పూర్తిగా విజయవంతమయినవని చెప్పలేము. కృష్ణాగోదావరి మండలాలలోని ప్రభువులు, ఏరువ చోడ భక్తిరాజు రెడ్ల అధికార విస్తరణ తమ రాజ్యాలలో ప్రమాదంగా పరిగణించి ఒక కూటమిగా ఏర్పడి అనవోతారెడ్డిని తిరుగు ప్రయాణంలో సురవరం దగ్గర[13] ఎదుర్కొని అతడిని ఓడించారు. ఏరువ చోడ భక్తిరాజు కుమారుడు ఇచ్చిన రాజమహేంద్రవరం శాసనం ప్రకారం అన్నదేవచోడుడు సురవరం దగ్గర వీరాన్నవోతును ఓడించినట్లు తెలియుచున్నది. చోడ భక్తిరాజుకు సురవరం పాలిస్తున్న సూర్యవంశ ప్రభువులతోను, రెడ్లతోను బంధుత్వం ఉంది. అయిననూ స్వీయరక్షణకై సురవరాధీశులతో కలపి రెడ్ల అధికార విస్తరణ అరికట్టడమే చోడ భక్తిరాజు ధ్యేయం అయింది.

## 3.4.2 రెడ్ల-వెలమల సంఘర్షణ :

కళింగ దండయాత్ర అనంతరం కొలది కాలానికే అనవోతారెడ్డికి వెలమలతో సంఘర్షణ ప్రారంభమయింది. అనవోతారెడ్డి పోషణలోనూ, వెలమ ప్రభువుల పోషణలోను తయారయిన తెలుగు, సంస్కృత గ్రంధాలుగాని, వారి శాసనాలుగాని, వీరి మధ్య సంభవించిన సంఘర్షణను పేర్కొనకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. కాని వెలుగోటివారి వంశావళి మాత్రం అనవోతారెడ్డికి, రేచర్ల ప్రభువులైన మాదానాయక, ఆతని సోదరుడు కటారి నాగానాయక మధ్య జరిగిన సంఘర్షణను పేర్కొంటున్నది. రేచర్ల సింగమనాయకుని వధించడంలో జల్లిపల్లి క్షత్రియులతో రెడ్లు చేరినందున రెడ్లపై ప్రతీకారం తీర్చుకొనడానికి రేచర్ల ప్రభువులు రెడ్డిరాజ్యాంపై దండయాత్ర చేసారు. వెలమ సైన్యాలు అనవోతానాయక, మాదానాయక నాయకత్వంలో కృష్ణానది దాటి నదికి దక్షిణంగా ఉన్న కర్నూలు, గుంటూరు జిల్లాలలోని ప్రాంతాలను ఆక్రమించాయి. రేచర్ల ప్రభువు రెండవ సింగమనాయక సంస్కృతంలో రచించిన"రసార్ణవ సుధాకర" అనే గ్రంథం అనవోతానాయక, మాదానాయకలు శ్రీశైలానికి సోపానాలు నిర్మించినారని చెప్పడం బట్టి పైచెప్పిన ప్రాంతాలను రేచెర్ల ప్రభువులు ఆక్రమించినట్లు తెలియుచున్నది.

అనవోతనాయక తమ్ముడు మాదానాయక కతారి నాగానాయకతో కలసి దక్షిణదిశగా ఇంకో దిగ్విజయయాత్ర సాగించడంతో ధాన్య కటకం దగ్గర రెడ్లకు వెలమలకు మధ్య భయంకర యుద్ధం జరిగింది. వెన్నెలకంటి సూరన రచించిన విష్ణుపురాణం అనుసరించి ఈ యుద్ధంలో అనవోతారెడ్డి ప్రథమంలో విజయం సాధించినా చివరకు మాదానాయకుని చేతిలో ఓడిపోయి పారిపోయాడు. కతారి నాగానాయక అనవోతారెడ్డిని బంధించి అతని వీపుమీద వెలమల లాంఛనం ముద్రించి వదిలాడని వెలుగోటి వారి వంశావళి పేర్కొంటున్నది.[14] రెడ్డి రాజుల బిరుదులైన "జగనొబ్బగండ", "సంగ్రామధనుంజయ", "రాయవేశ్యా భుజంగ", మొదలగు బిరుదులను పద్మనాయకులు స్వీకరించారు. ఈ విధంగా ప్రారంభమయిన రెడ్డి వెలమ సంఘర్షణ తీవ్రతరమై 15వ శతాబ్ది మధ్యస్తం దాక కొనసాగింది.

### 3.4.3 రెడ్డి - బహమనీల సంఘర్షణ :

అనవోతారెడ్డి పాలనా కాలంలోనే బహమనీ సుల్తాన్ మహమ్మద్‌షా క్రీ.శ. 1361లో తెలంగాణా పై దండెత్తి కృష్ణానది దాటి రెడ్డి రాజ్యంపై దండయాత్ర చేసాడు. అనవోతారెడ్డి అమరావతి శాసనం ప్రకారం[15] మహమ్మద్‌షా ధాన్యకటకం పై దాడి చేసి అక్కడి అమరేశ్వర దేవాలయానికి నష్టం కలిగించాడు. అనవోతారెడ్డి మంత్రి అయిన మల్లయ వేమన ఆ దాడిని త్రిప్పికొట్టి అమరేశ్వర స్వామిని పునఃప్రతిష్ట గావించినట్లు అమరావతి శాసనం సూచిస్తున్నది.

### 3.4.4 రెడ్డి - విజయనగర సంఘర్షణ :

రేచర్ల పద్మనాయకులతో యుద్ధాల తరువాత కూడా అనవోతారెడ్డి ప్రశాంతంగా ఉండలేదు. విజయనగర సామ్రాజ్య దక్షిణ, నైరుతీ దిక్కుల విస్తరణ కొండవీడు రాజ్య రక్షణకు భంగం వాటిల్లినది. అనవోతారెడ్డి తనకు తూర్పు పశ్చిమ ప్రాంతాలలో గల శత్రువులతో పోరాడుతుండగా విజయనగర రాజులు ఉదయగిరి కేంద్రంగా తూర్పు కోస్తా ప్రాంతంలో తమ అధికారాన్ని బలోపేతం చేసుకొనే ప్రయత్నాలు ప్రారంభించారు. పద్మనాయకులతో బహమనీలతో రెడ్డిరాజులు చేసిన యుద్ధాలు సదావకాశంగా తీసుకొని విజయనగర పాలకుడైన మొదటి బుక్కరాయ క్రీ.శ, 1364 లో రెడ్డి రాజ్యం పై దండెత్తాడు. కర్నూలు నెల్లూరు జిల్లాల్లో లభ్యమయిన విజయనగర శాసనాలను బట్టి ఆ ప్రాంతాలు విజయనగర ఆక్రమణలోకి వచ్చినట్లు తెలుస్తున్నది. దువ్వపాడు కైఫీయత్[16] ప్రకారం బుక్కరాయలు మార్కాపురంను ఆక్రమించి అక్కడ తన ప్రతినిధులుగా రావెల వంశస్థులను ఉంచాడు. విజయనగర రాజు మొదటి బుక్కరాయ వెలమలను ఓడించి శ్రీశైలం కూడా ఆక్రమించాడు.

శ్రీశైల ఆక్రమణతో బుక్కరాయ తూర్పు దండయాత్రలు ఆగలేదు. శ్రీశైలం నుండి ఇంకా తూర్పుకు తన దండయాత్రలను కొనసాగించడంతో అనవోతారెడ్డి కొండవీటి రాజ్య ప్రమాదాన్నే గాక తమ ముఖ్య పాలనా కేంద్రమ్మయిన అద్దంకి రక్షణ కూడా గుర్తించాడు. నిరంతర యుద్ధాలు జరుగుచున్న ఆ రోజులలో స్థల దుర్గమైన అద్దంకి సురక్షితం కాదని అనవోతారెడ్డి కొండవీడుకు ప్రాకారాదులు నిర్మించి, దుర్భేద్యం చేసి రాజధానిని కొండవీడుకు మార్చినట్లు క్రీ.శ. 1364 నాటి మన్యమాపురం శాసనం[17] తెలియజేస్తున్నది.

అనవోతారెడ్డి తన జీవితాంతం నిరంతర యుద్ధాలలో నిమగ్నుడై ఉన్నాడు. అత్యంత ధైర్య సాహసాలు గల వీరుడు. కాని అతని కాలంలోనే రెడ్డిరాజ్యం చాలా ప్రదేశాలను నష్టపోయి ప్రతిష్ట కోల్పోయింది. తన రాజ్యంలో శాంతి భద్రతలను నెలకొల్పి రాజ్య ఆర్థిక వనరులను గుర్తించి, దేశీయ, విదేశీయ వాణిజ్యాభివృద్ధికి అనేక రేవు పట్టణాలను పునరుద్ధరించాడు. క్రీ.శ. 1358లో అనవోతారెడ్డి మంత్రి అయిన సోమయ మోటుపల్లి రేవులో ఎగుమతి, దిగుమతి సుంకాలను నిర్ణయించి, అన్యాయకరమైన చట్టాలను రద్దు చేసి వర్తకులకు ప్రోత్సాహకరమైన పరిస్థితులను కల్పిస్తూ అభయ శాసనం ఇచ్చాడు. అనవోతారెడ్డి తండ్రి వలే వైదిక ధర్మాన్ని అభిమానించాడు. శివ భక్తుడు బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలను దానం చేయడమే గాక హేమాద్రి సూచించిన అన్ని దాన ధర్మాలు, వ్రతాలను చేసాడు. వెన్నెలకంటి కవులను పోషించి వారి నుండి కృతులందుకొన్నాడని సూరన పేర్కొన్నాడు గాని ఆ కృతులేవి లభ్యం కావడం లేదు. అతని శాసనాలను రచించినది బాల సరస్వతి అనే కవి పండితుడు. కృష్ణా గోదావరి నదుల మధ్య గల ప్రాంతాన్ని పరిపాలించిన అనవోతారెడ్డికి

కుమారగిరిరెడ్డి అను కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. వీరిలో పెద్ద కుమార్తె దొడ్డాంబికను తన మేనల్లుడైన కాటయ వేమారెడ్డికిచ్చి వివాహం చేసాడు.

## 3.5 అనవేమారెడ్డి (క్రీ.శ. 1364-1386) :

అనవోతారెడ్డి మరణించే నాటికి అతని కొడుకు కుమారగిరి రెడ్డి బాలుడైనందున తమ్ముడు అనవేమారెడ్డి కొండవీటి సింహాసనాన్ని అధిష్టించాడు. నాటి రాజకీయ పరిస్థితులు అనవేమారెడ్డిని కొండవీటి పాలకునిగా చేసినాయి. ప్రోలయ వేమారెడ్డి, అనవోతారెడ్డి ఎంతో కష్టపడి అనేక యుద్ధాలు చేసి సంపాదించిన ప్రాంతాలు అనేకం అనవేముడు వచ్చే నాటికి అనేక ఇతర రాజ్యాలు ఆక్రమించడం జరిగింది. విజయనగర రాజ్యం ఒక పటిష్టమైన రాజ్యంగా రూపొంది రాజ్య సరిహద్దులు దక్షిణ భారతదేశంలో పూర్వ పశ్చిమ సముద్ర తీరాలను తాకి, దక్షిణాన మధుర వరకు విస్తరించినవి. ఈ పరిస్థితుల్లో సమర్ధవంతమైన పాలకుడు అవసరం. అందువలననే మొదటి నుండి అనవోతారెడ్డికి యుద్ధాలలో అత్యంత సహాయం చేసిన, యుద్ధాలలో, రాజనీతిలో ఆరితేరిన అనవేముని కొలువులోని ప్రభువులు, ఉద్యోగులు ప్రోత్సాహించి అనవేముని సింహాసనం ఎక్కించారు. కనుకనే అనవేముని శాసనాలు[18] అనవేమారెడ్డిని "రాజ్యశ్రీ కమణీ స్వయంవరపతి" అని శ్లాఘిస్తున్నాయి. అనవేమారెడ్డి 22 సంవత్సరాలు నిరంతర యుద్ధాలు చేసి, కోల్పోయిన పేరు ప్రతిష్టలను పునరుద్ధరించి రెడ్డిరాజ్య బల, గౌరవ ప్రతిష్టలను పెంపొందించాడు. ఇతని కాలంలో రెడ్డిరాజ్యం అత్యున్నత స్థితికి చేరుకున్నది.

అనవేమారెడ్డి పాలనా కాలమంతా నిరంతర యుద్ధలతోనే పూర్తయింది. అతని శాసనాలు చాల ఉన్నాయి గాని వాటిలో సాంప్రదాయ ప్రశస్తి మినహా అతని గుణగణాలు, విజయాలు, అతని కాలం నాటి రాజకీయ సంఘటనల ప్రస్తావన గాని లేవు. అయితే శ్రీ శైలం శాసనంలో పేర్కొనబడిన అనవేమారెడ్డికి గల బిరుదులను బట్టి అతని దండయాత్రలు, సాధించిన విజయాలు గ్రహించవచ్చు. దివిదుర్గవిభాళా, రాజమహేంద్ర నిరవద్యనగరాది బహువిధ స్థలదుర్గ వర్గవిదళన బలరామ, సాగరగౌతమీ సలిల సంగమ సకల జలదుర్గ సాధన రఘురామ అని శ్రీశైలం శాసనం ప్రస్తుతిస్తున్నది. పై చెప్పిన బిరుదుల ప్రకారం అనవేమారెడ్డి కృష్ణానది దాటి ఉత్తరాన విజయవంతమైన దండయాత్రలు సాగించి గోదావరి తీరంలో గల అనేక కోటలను ఆక్రమించినట్లు తెలియుచున్నది. రెడ్డిరాజులు మొదటి నుండి సింహాచలం వరకు గల కోస్తా ఆంధ్రా ప్రాంతాన్ని తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ప్రయత్నం చేసారు.

### 3.5.1 కళింగ దండయాత్ర :

వేంగిలో వచ్చిన వారసత్వ యుద్ధం అనవేమారెడ్డిని ఆకర్షించింది. వేంగి ప్రాంతంలో చోడ భక్తిరాజు మరణించడంతో అతని కుమారులు అన్నదేవచోడ, చోడభీమల మధ్య సింహాసనంకై పోరు ప్రారంభమయినది. అన్న దేవచోడుడు తన అన్న చోడభీముని ఓడించి పార్రదోలి రాజ్యం ఆక్రమించాడు. చోడభీముడు తన భార్య సోదరుడైన అనవేమారెడ్డిని ఆశ్రయించడంతో అనవేమారెడ్డికి వేంగి రాజకీయాలలో జోక్యం చేసుకోవడానికి అవకాశం వచ్చింది.

అనవేమారెడ్డి ప్రధమంలో దివి దుర్గం ఆక్రమించి వేంగిపై దాడిచేసాడు. వేంగిరాజ్య తూర్పు భాగాన్ని సురవర పట్టణ రాజధానిగా తమ్మరాజు పాలిస్తున్నాడు. తమ్మరాజుని అతని కుమారుడు ఉండిరాజుని ఓడించి ఆ ప్రాంతాన్ని ఆక్రమించి అన్నదేవచోడ పాలిస్తున్న ఉత్తర వేంగిపై దాడి చేసాడు. అనవేమారెడ్డి అల్లాడరెడ్డి సహాయంతో నిరవద్యపురం (నిడదవోలు) దగ్గర అన్నదేవచోడుని ఓడించాడు. ఆ రాజ్యం చోడ భీముని పరం చేసాడు. అనంతరం గోదావరి ముఖద్వారం వద్దగల వసిష్ట గౌతమీ నదుల మధ్యగల మంచికొండ ప్రభువుల ఆధీనంలో గల జలదుర్గాలను ఆక్రమించి పానార, కోన రాజ్యాలను కైవసం చేసుకొన్నాడు. అనవేమారెడ్డి నడుపూరు శాసనం (క్రీ.శ.1374) పలివెల శాసనం (క్రీ.శ.1377), ద్రాక్షారామ శాసనం (క్రీ.శ.1381), వానపల్లి శాసనం (క్రీ.శ.1381) మొదలగునవి గోదావరి ప్రాంతంలోని అనవేమారెడ్డి ఆక్రమణలను బుజువు చేస్తున్నాయి. ఈ దండయాత్రలలో రాజమహేంద్రవర దుర్గం అతని వశం అయింది. రాజమహేంద్రవరం పాలకుడుగా అల్లాడరెడ్డిని నియమించాడు.

పై పేర్కొన్న విజయాలు అనవేమారెడ్డి కళింగ దండయాత్రను సులభతరం చేసాయి. మంచికొండ ముమ్మడి నాయకుడు, పిఠాపురం కొప్పుల నాయకులు, ఎలమంచిలి చాళుక్యులు, వాడ్డాది మత్స్య రాజులు ఓడిపోయారు. అందువలననే అనవేమారెడ్డి శ్రీశైలం శాసనం అతనిని "సింహచలవిద్యపాద ప్రతిష్ఠాపిత కీర్తి స్థంభ" అని వర్ణిస్తున్నది. ఇదే విషయాన్ని అనవేమారెడ్డి సింహచలం శాసనం" కూడ ప్రస్తావిస్తున్నది. ఈ శాసనం అనుసరించి అనవేమారెడ్డి కళింగ దాడులు నిర్వహించిన అతని బ్రాహ్మణసేనాని చెన్నమనాయకుడు క్రీ.శ.1375లో వడ్డాది మత్స్య రాజయిన అర్జునదేవుని నుండి ఆక్రమించిన ప్రాంతంలో గల గొట్టివాడ గ్రామాన్ని సింహచల నరసింహదేవరకు దానమిచ్చాడు. అనవేమారెడ్డి కొన్ని గండమాడలను సింహద్రినాధునికి బహూకరించి సింహచల దేవాలయ ప్రాంతంలో తన పేరున ఒక భవనాన్ని (అనవేమనగరు)[20] క్రీ.శ. 1375లో నిర్మించాడు. వీటి ప్రకారం అనవేమారెడ్డి కళింగ దండయాత్ర క్రీ.శ.1375 నాటికి పూర్తి చేసి కొండవీటి రాజ్య సరిహద్దులను సింహచలం వరకు విస్తరింపజేసాడు. కాని అనవేమారెడ్డి చేసిన ఈ దండయాత్రలు, విజయాలు సుస్థిరమైనవి కావు. కుమారగిరిరెడ్డి పాలనాకాలంలో వాటిని తిరిగి ఆక్రమించవలసి వచ్చింది. దాక్షరామం నుండి సింహచలం వరకు గల ప్రాంతం రెడ్డిరాజుల ప్రత్యక్ష పాలనలోకి వచ్చిందనడం సందేహస్పదమైనదే.

### 3.5.2 అనవేమారెడ్డి - వెలమలు:

కళింగ దండయాత్ర అనంతరం అనవేమారెడ్డి రాచకొండ, దేవరకొండ వెలమలపై దృష్టి సారించాడు. వారు ఓరుగల్లుని ఆక్రమించి తెలంగాణాకు తిరుగులేని పాలకులయ్యారు. రేచర్ల వెలమలకు తన అన్న అనవోతారెడ్డికి ధరణికోట దగ్గర జరిగిన యుద్ధంలో వెలమలు తన అన్నను పరాభవించిన విషయం అనవేమారెడ్డి మరువలేదు. అనవేమారెడ్డి వెలమల సంఘర్షణ విషయంలో శాసన వాఙ్మయ ఆధారాలు భిన్నమైన అభిప్రాయాలను తెలియజేస్తున్నాయి. నల్గొండ జిల్లాలోని వాడపల్లి దగ్గర అనవేమారెడ్డి ఉద్యోగి కడియం పోతినాయకుని శాసనం ఉన్నది (క్రీ.శ.1377)[21]. ఈ శాసనం కడియం పోతినాయక తన ప్రభువు అనవేమారెడ్డి సొదరుడు అనమాచారెడ్డి పుణ్యార్థం వాడపల్లి లోని అగస్త్యేశ్వర మహదేవర గుడికి విమానాన్ని, చంద్రశాల నిర్మాణాన్ని చేపట్టినట్లు సూచిస్తున్నది. దీని ప్రకారం అనవేమారెడ్డి రేచర్ల పద్మనాయకులను ఓడించి ఆ ప్రాంతాన్ని ఆక్రమించినట్లు తెలుస్తున్నది. నల్గొండ జిల్లాలోని బూరుగు గడ్డలో కూడ దేశట్లగోత్రుడైన అన్నమ నాయకుని శాసనం[22] పై విషయాన్ని బలపరుస్తున్నది. అన్నమనాయక దేశట్ల రెడ్లకు సంబంధించినవాడై అనవేమారెడ్డి ఉద్యోగి అయిఉండవచ్చు. ఈ శాసనాలు అనవేమారెడ్డి రేచెర్ల అనవోత నాయుని ఓడించి రెడ్డి రాజ్యాన్ని కృష్ణానదికి ఉత్తరంగా విస్తరింపజేసాడనటానికి నిదర్శనాలు. అయితే వెలుగోటి వారి వంశావళి అనవేమారెడ్డిని రేచర్ల అనవోతానాయుని సొదరుడు మాదాయక ఓడించినట్లు వర్ణిస్తుంది. వాఙ్మయ సాక్ష్యం కంటే శాసన సాక్ష్యం బలమైనది కదా !

### 3.5.3 అనవేమారెడ్డి-విజయనగర రాజులతో సంఘర్షణ :

వెలమ రాజ్యంపై దండయాత్రలో భాగంగానే అనవేమారెడ్డి విజయనగర రాజులను ఓడించి శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించాడు. క్రీ.శ.1378 నాటి అనవేమారెడ్డి శ్రీశైల శాసనం ఇందుకు నిదర్శనం.

అనవేమారెడ్డి శత్రురాజులు ఆక్రమించిన భూభాగాలను తిరిగి ఆక్రమించడమేగాక రెడ్డిరాజ్య సరిహద్దులను దక్షిణ కళింగంలోని సింహచలం దాక విస్తరింప జేసి రెడ్డిరాజ్య ప్రతిష్టను పునరుద్ధరించాడు. అనవేమారెడ్డి మన్యమాపురం శాసనం (క్రీ.శ. 1382)[23] అన వేమారెడ్డి కర్నూలు జిల్లాలోని శ్రీశైలంనుండి విశాఖజిల్లాలోని సింహచలం వరకు విస్తరించిన రాజ్యాన్ని న్యాయ సమ్మతంగా పాలించాడని తెలుపుతున్నది. "పరిచితానేక గటి విశేష సంవారణం ఆమరణోపాయ," "ప్రజాపరిచిత చతుర్విధోపాయ", "ఛురికాకలివేతళ," "ఛూరికాసహయ", కరవాలవైనతేయ", "కలియుగ భేతాళ", "విక్రమపంజరనిగ్రిహితరి రాజసింహ" మొదలగు అనవేమారెడ్డి బిరుదులు అతను యుద్ధాల్లో ఎంత అసహాయసూరుడో, రాజనీతిలో ఎంతటి ప్రజ్ఞావంతుడో తెలియజేస్తున్నాయి.

అనవేమారెడ్డి తండ్రివలె ఆధ్యాత్మిక చింతనాపరుడు. బహుసువర్ణ గోసహస్రాది దానాలు చేసాడు. బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలను దానాలిచ్చాడు. ఈడ్పుగల్లు, దృజ్ఞవరం, నడుపూరు, వనపల్లి, మన్యమావరం, పెదచెరకూరు దానశాసనాలు ఇందుకు నిదర్శనం.

శైవాచారతత్పరుడైనా శ్రీశైల త్రిపురాంతక, పంచారామాలలోనేగాక శ్రీకూర్మ, సింహాచల క్షేత్రాలలో గల వైష్ణవాలయాలకు దానం చేసాడు. పంచారామాలలో గల శైవాలయాలకు గజగంటలను దానం చేసాడు. శ్రీశైలంలో వీరశిరోమండపాన్ని నిర్మించాడు. కవులను, నటులను, గాయకులను, కళాకారులను వసంతోత్సవ సమయంలో ఆహ్వానించి గౌరవించి వసంతరాయలను బిరుదు పొందాడు. పుణ్యక్షేత్రాలలో సత్రాలను ఏర్పాటు చేసి భక్తులకు నాలుగు రకాల భోజనాలను ఏర్పాటు చేసాడు. ఇన్ని దాన ధర్మములు చేసి "ధర్మానవే ముడని" పేరు పొందాడు. ఇన్ని సద్గుణాలున్న అనవేమారెడ్డి రెడ్డి రాజులందరిలో గొప్పవాడని చెప్పడం అతిశయోక్తి కాదు.

## 3.6 కుమారగిరిరెడ్డి (క్రీ.శ 1386-1402) :

అనవేమారెడ్డి అనంతరం అనవోతారెడ్డి పుత్రుడు కుమారగిరిరెడ్డి కొండవీటి సింహాసనం అధిష్టించాడు. క్రీ.శ. 1387-1388 మధ్య సంవత్సరాలలో కుమారగిరి శాసనాలు లేకపోవడం; శ్రీకృష్ణుడు ధర్మరాజును వలె కాటయవేముడు కుమారగిరిని సింహాసనం పై నిల్పాడని కుమారగిరి గోవవరం శాసనం,[24] కాటయవేముని తొత్తరమూడి శాసనాలు వర్ణించడం; వంశపరంపరగా రెడ్డిరాజుల మంత్రులుగా ఉన్న మామిడి వంశస్తులు కుమారగిరి కొలువులో ఉండక పెదకోమటివేముని ఆశ్రయించడం మొదలగు విషయాలు కుమారగిరి ప్రశాంతంగా సింహాసనం అధిష్టించలేదని సూచిస్తున్నాయి. మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అభిప్రాయం ప్రకారము కుమారగిరిని చందోలు పాలకుడు మాచారెడ్డి పౌత్రుడు పెదకోమటి వేమారెడ్డి ప్రతిఘటించి యుద్ధ సన్నద్ధుడు కాగ కుమారగిరి బావమరిది కాటయవేముడు అంతర్యుద్ధం నడిపి చివరకు పెడకొమటి వేమారెడ్డితో సమాధానానికి వచ్చిన తరువాతనే కుమారగిరి రాజ్యపాలన సాగించాడు.

సమర్థవంతమైన పాలనా నిర్వహణకై ప్రోలయవేమారెడ్డి తన పెద్ద సోదరుడు మాచారెడ్డిని చందోలు పాలకునిగా చిన్న తమ్ముడు మల్లారెడ్డిని కందుకూరు పాలకునిగా నియమించాడు, చందోలు పాలకుడైన మాచారెడ్డి పౌత్రుడు పెదకోమటివేమారెడ్డి. పెదకోమటి వేమారెడ్డికి వేమారెడ్డి, మాచారెడ్డి అను ఇద్దరు కుమారులు ఉన్నారు. అనవేముడు చనిపోయిన తరువాత కొండవీటి సింహసనానికి కుమారగిరికి ఎంతహక్కుఉందో తమకూ అంతహక్కు కలదని పెదకోమటి వేమారెడ్డి అతని కుమారులు భావించడం వలననే కొండవీటి సింహసనం కోసం అంతర్యుద్ధం జరిగింది. కుమారగిరి పెదకోమటి వేమారెడ్డితో సమాధానం కుదుర్చుకొని సింహసనం అధిష్టించాడు. పెదకోమటి వేమారెడ్డి తన ప్రాంతంలో కొండవీటి రెడ్డిరాజ్యానికి ప్రమాదం లేనంతమేరకు స్వతంత్రంగా వ్యవహరించేటట్లు, కుమారగిరి అనంతరం పెదకోమటి వేముడు కొండవీటి రాజ్యానికి వచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. అమినామాద్ శాసనం ఈ విషయాన్ని తెలియజేస్తున్నది. కుమారగిరి రెడ్డి సింహచలశాసనం కాటయవేముని ప్రధానిగా సూచిస్తున్నది. ఇది క్రీ.శ.1386 నాటి దైనందువల్ల కుమారగిరి క్రీ.శ. 1386 లోనే సింహాసనం అధిష్టించాడని చెప్పవచ్చు.

అంతర్యుద్ధం జరుగుతున్న సమయంలోనే రెడ్డిరాజ్యానికి శత్రువుల నుండి ప్రమాదమేర్పడింది. విజయనగరరాజు రెండవహరిహరుడు త్రిపురాంతకం ఆక్రమించి అక్కడ దానాలు చేస్తూ రెండు శాసనాలు ఇచ్చాడు (క్రీ.శ.1385, క్రీ.శ.1386).[25] తదనంతరం వినుకొండను రెండవ హరిహరుని రత్నభాండారి తిప్పన వశపరుచుకొన్నట్లు వల్లభామాత్యుని క్రీడాభిరామం వర్ణిస్తున్నది. ఈ దండయాత్ర సమయంలోనే విజయనగర రాజు శ్రీశైలాన్ని కూడా ఆక్రమించాడు. రేచర్ల నాయకులు కళింగ రాజు నాల్గవ నరసింహుని ఓడించి బెండపూడి మొదలగు దుర్గాలను ఆక్రమించారు. నాల్గవ నరసింహుడు తనకూతురు కనక మహాలక్ష్మిని రేచర్ల సింగము నాయకుని కుమారుడు అనవోతానాయని కిచ్చి వివాహం చేసి సంధి చేసుకొన్నాడు. రేచర్ల నాయకులు ఈ విధంగా కళింగలో తమ ప్రాభల్యాన్ని నెలకొల్పారు. ఈ సంఘటన క్రీ.శ. 1387లో జరిగినట్లు దాక్షారామ శాసనం సూచిస్తున్నది. ఇక అనవేమారెడ్డిచే నిరవద్యపుర యుద్ధంలో ఓడి రాజ్యభ్రష్టుడైన అన్నదేవచోడుడు మిత్రుల కొరకై సాగించిన అన్వేషణలో క్రీ.శ. 1388 లో త్రిపురాంతకం వచ్చాడు. క్రీ.శ. 1388లో అన్నదేవచోడుడు త్రిపురాంతక దేవరకు కాంచన పల్లి గ్రామాన్ని దానం చేస్తూ ఇచ్చిన శాసనం పై విషయాన్ని బుజువు చేస్తున్నది. బహుశ కొండవీడు సింహాసనం కోసం జరుగుతున్న అంతర్యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని తన లక్ష్యసిద్ధికై ఏదో ఒక పక్ష ఆలంబన పొందడానికి ప్రయత్నించడంతో పెదకోమటివేమారెడ్డి ప్రోత్సాహం అన్నదేవచోడునికి లభ్యమయి ఉంటుంది. ఇటువంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో కుమారగిరిరెడ్డి తన పాలనా కాలంలో క్రీ.శ.1386 నుండి క్రీ.శ.1390 వరకు విజయనగర రాజాకొండ, కళింగరాజులతో నిరంతర యుద్ధాలు చేసాడు.

### 3.6.1 కుమారగిరిరెడ్డి-విజయనగర రాజుల సంఘర్షణ :

పెదకోమటి వేమారెడ్డితో సమాధాన పడిన తరువాత కుమారగిరిరెడ్డి తన బావమరిది కాటయవేముని శ్రీశైల, త్రిపురాంత కాల పునరాక్రమణ కొరకు విజయనగరంపైకి దండయాత్ర పంపినాడు. అప్పటికే రెండవ హరిహరరాయలు బహమనీ, రేచర్ల పద్మనాయక కూటమిచే కొత్తకొండ[27] వద్ద జరిగిన యుద్ధంలో పరాజయం పొంది ఉన్నాడు. రెండవ హరిహరరాయలు రాజనీతిని ప్రదర్శించి వారికి శత్రువైన రెడ్డి రాజులతో స్నేహం శుభదాయకమని భావించడం, బహమనీలతో పోరాడుతున్న విజయనగర రాజులతో మైత్రి కొండవీడు రాజ్యానికి కూడా అనుకూలమని కాటయవేముడు ఆశించడంతో రాయ రెడ్ల మధ్య సంధి జరిగింది. ఈ సంధి ప్రకారం శ్రీశైల రాజ్యం విజయనగర అధీనంలోనే ఉండేటట్లు, త్రిపురాంతక వినుకొండలు కొండవీడు రెడ్డిరాజులకు వశపరచేటట్లు ఒప్పందం కుదిరింది. క్రీ.శ.1385 తరువాతి శ్రీశైలంలోని విజయనగర శాసనాలు పై విషయాన్ని ధృవపరుస్తున్నాయి. ఈ మైత్రిని బలోపేతం చేసే నిమిత్తం రెండవ హరిహరరాయ తన కుమార్తె హరిహరాంబను కాటయవేమునికిచ్చి వివాహం చేసినాడు.[28]

### 3.6.2 కుమారగిరిరెడ్డి-రేచర్ల పద్మనాయకులు:

రేచర్ల సింగమనాయకుని కుమారుడు మాదానాయక కుమారగిరిని ఓడించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలుపుతున్నది. కాని కుమారగిరి కాలంలో కొండవీటి పక్షాన యుద్ధాలు నిర్వహించినది కాటయవేముడు. కాటయవేముని ప్రస్తావన అందులోలేదు కనుక పై చెప్పిన విషయం విశ్వసనీయం కాదు.

### 3.6.3 కుమారగిరి-కళింగ దండయాత్ర :

విజయనగరంతో సంధి కుదిరిన తరువాత కుమారగిరిరెడ్డి కాటయవేముని, తన కుమారుడు రెండవ అనవోతారెడ్డిని కళింగ దండయాత్రకు పంపినాడు. క్రీ.శ. 1390 నాటి కుమారగిరి రెడ్డి అనపర్తి శాసనం ఈ దండయాత్రను పేర్కొంటున్నది. ఈ తూర్పు దిగ్విజయ యాత్రలో రాజమహేంద్రవర పాలకుడైన అల్లాడరెడ్డి, అతని కుమారులు వేమారెడ్డి, వీరభద్రారెడ్డి, దొడ్డారెడ్డి ప్రముఖ పాత్రనిర్వహించినారు. అనపర్తిశాసనం ఈదండయాత్ర వివరాలు అంతగా ఇవ్వలేదు. శ్రీనాధుని కాశీఖండం, భీమేశ్వరపురాణం, శివలీల విలాసం; కాటయవేముడు అభిజ్ఞానశాకుంతలపై వ్రాసిన వ్యాఖ్యానం; కుమారగిరి గోపవర శాసనం రెడ్డిరాజులు కళింగదండయాత్రలో ఆక్రమించిన ప్రాంతాలను తేలియజేస్తున్నవి. కాటయవేముడు అభిజ్ఞాన శాకుంతలంపై వ్రాసిన వ్యాఖ్యానం అనుసరించి రెడ్డిరాజులు ఈక్రిందిప్రాంతాలను ఆక్రమించినారు:

| | |
|---|---|
| 1. మొల్లేటిదుర్గం | (గోదావరిజిల్లా) |
| 2. కిమ్మూరుదుర్గం | (పెద్దాపురం) |
| 3. బెండపూడి | (తుని ప్రాంతం) |
| 4. వజ్రకూటం | (విశాఖజిల్లా) |
| 5. రామగిరి | (పూర్వపు జయపూర్ ఎస్టేట్‌లోని తానా) |
| 6. వీరకూటం | (విశాఖజిల్లా) |

చాటుపద్యమణి మంజరి ప్రకారం కాటయవేమ గోదావరినది దాటి కాటమరేని కోటను ఆక్రమించినాడని తెలుపుచున్ననూ కాటమరేని కోట నిర్దుష్టంగా గుర్తింపబడలేదు. క్రీ.శ.1395 నాటి కుమారగిరి గోపవరం శాసనం కాటయవేముని "కటక చూరకార"[29] అని

వర్ణిస్తున్నది. దీని ప్రకారం కాటయవేముని దండయాత్రలు కళింగ గజపతుల రాజధాని అయిన కటకం దాక నడిచినాయని చెప్పవచ్చు. క్రీ.శ. 1434 నాటి అల్లాడ రెడ్డి కుమారుడు అల్లయవేమ వేమవరం శాసనం[30] అల్లయవేమ కళింగపై దాడిచేసి సప్తమాడెములు ఆక్రమించి సింహాచలంలో విజయస్తంభం నాటినట్లు పేర్కొంటున్నది. శ్రీనాధుని కాశీఖండ, భీమేశ్వర పురాణం, శివలీల విలాసం అల్లాడరెడ్డి అతని కుమారులు అల్లయవేమ, వీరభద్ర, దొడ్డారెడ్డి సాగించిన దండయాత్రలు, ఆక్రమణలు పేర్కొనుచున్నవి. వీరఘొట్టము, ఝాడేశవనం, జంతురునాడు, వడ్డాది (విశాఖజిల్లా); బారహదొంతి, సప్తమాడియాలు (గంజాంజిల్లా) మొదలగునవి జయించి కటకంవరకు నడచినట్లు తెలియ జేస్తున్నాయి. దొడ్డారెడ్డి చిలక సరస్సుతీరంలో జయస్తంభం నాటినట్లు కాశీఖండం చెపుతున్నది.

కళింగదండయాత్ర పూర్తి చేసుకుని కాటయవేముడు అనేక కానుకలతో కొండవీడు తిరిగి వచ్చాడు. కుమారగిరి కాటయవేముని తగినంతగా సత్కరించాడు. ఈ విజయవంతమైన దండయాత్రలనంతరం రెండవ అనవోతారెడ్డి అనపర్తి గ్రామాన్ని రాజమహేంద్రవరంలోని గోపినాధ దేవరకు దానంచేశాడు. అదేసమయంలో కుమారగిరి దాక్షారామం వచ్చి తులాపురుషదానం చేశాడు.

### 3.6.4 కుమారగిరి-రాజమహేంద్ర వరరాజ్య ఏర్పాటు:

కుమారగిరి కళింగ దండయాత్రవలన అతని సామ్రాజ్యం సింహాచలం వరకు విస్తరించింది. తూర్పుదిగ్విజయ యాత్రలవలన తనకు సంక్రమించిన సీమలన్నీ ఒక రాష్ట్రంగా చేసి రాజమహేంద్రవరం రాజధానిగా[31] చేసాడు. తన కుమారుడు రెండవ అనవోతారెడ్డిని అక్కడ తన ప్రతినిధిగా నియమించాడు. లింగన మంత్రి సోదరుడైన అరయేటి అన్నమంత్రిని బెండపూడి దుర్గాధిపతిగా నియమించాడు. రాజమహేంద్రవరం రాష్ట్రాన్ని పరిపాలనా సౌలభ్యం కోసమై అనేక ప్రాదేశిక విభాగాలుగా చేసి తనకు విశ్వాసపాత్రులైన వారిని అధికారులుగా నియమించాడు.

అల్లాడరెడ్డి అతని మంత్రులను రాజమహేంద్రవరంలో సహాయంగా ఉంచాడు. కాటయ వేముడు తన పౌత్రి హరిహరాంబను అల్లాడ రెడ్డి పెద్ద కుమారుడు వేమారెడ్డికి, తన కూతురు అనితల్లిని అల్లాడరెడ్డి చిన్న కుమారుడు వీరభద్రారెడ్డికి ఇచ్చి వివాహం చేసి మైత్రిని బలవత్తరమైన బంధుత్వంగా మార్చాడు.

క్రీ.శ. 1390 అనపర్తి శాసన కాలం నాటికి కొండవీడు రెడ్డి రాజ్యంలో శాంతి భద్రతలు ఏర్పడి నాలుగు దిక్కులగల రాజ్యాలతో స్నేహసంబంధాలు పెంపొందాయి. విశ్వాస పాత్రుడయిన స్నేహితుడిగా, ధైర్యసాహసాలుగల యుద్ధవీరునిగా కాటయ వేముడు కుమారగిరికి ప్రధానిగా ఉన్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో రసికుడైన కుమారగిరి రెడ్డి తన పూర్తి కాలాన్ని సాహిత్య కళాపోషణలో ప్రొద్దుపుచ్చాడు. కుమారగిరి గొప్ప భాషాభిమాని. సంస్కృతంలో పండితుడు. నాటనాకళాభిమాని. ప్రసిద్ధనర్తకి లకుమదేవి ఇతని ఆస్థానంలోనే ఉంది. ప్రతి సంవత్సరం వసంతోత్సవాలను జరిపి కర్పూరాన్ని వెదజల్లి వసంతరాయలని, కర్పూర వసంతరాయలని పేరు పొందాడు. ఇతని వసంతోత్సవాలను అవచి తిప్పయసెట్టి నిర్వహించే వాడని హరవిలాసం వర్ణిస్తున్నది. సంగీతానికి, నాట్యానికి సంబంధించిన పురాతన గ్రంథాలన్నీ అధ్యయనం చేసి సంగీతం, నాట్యంపై 'వసంత రాజీయం' అనే గ్రంథాన్ని రచించాడు.

## 3.7 రెండవ అనవోత మరణం :

ఇంతటి ఉల్లాసవంతమైన జీవితాన్ని గడుపుతున్న సమయంలో కుమారగిరిరెడ్డి ఏకైక కుమారుడు రెండవ అనవోతారెడ్డి అకాలమరణం చెందాడు. అనవోతారెడ్డి మరణం క్రీ.శ. 1390-95 మధ్యలో జరిగి ఉండవచ్చు. ఇతని మరణం కొండవీటి రెడ్డి రాజ్యగతినే మార్చివేసింది. అనవోతారెడ్డి మరణం కుమారగిరికి పిడుగుపాటే గాక కొండవీటి రెడ్డి రాజ్యంలో అనుకోని పరిణామాలకు దారి తీసింది. తన రాజ్యాన్ని కళింగ గజపతుల దురాక్రమణ నుండి కాపాడుకోవడానికి, తూర్పు సరిహద్దు రక్షణకు రాజమహేంద్రవరంలో సమర్ధవంతుడు, విశ్వాస పాత్రుడు అయిన పాలకుడు ఉండవలసిన అవసరం ఉంది. ఈ ప్రాంతాన్ని జయించింది కాటయవేముడే. చాల కాలం నుంచి కాటయవేముడు చేసిన సేవలకు తగిన బహుమానం చెల్లించాలనే ఉద్దేశ్యంతోనే కుమారగిరి ఉన్నట్లు కనిపిస్తుంది. అంతేగాక తన

తదనంతరం కొండవీటి రాజ్యానికి పెదకోమటి వేమారెడ్డి ప్రభువు అవుతాడు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కుమారగిరి రెడ్డి రాజమహేంద్రవర రాష్ట్రానికి సామంత ప్రతిపత్తి ఇచ్చి కాటయవేమునకు ఇచ్చాడు. ఇది కుమారగిరి ప్రారంభించిన నూతన విధానమేమికాదు. ఆంధ్రదేశంలో పూర్వ కాలం నుండి రాజులు అనుసరిస్తున్న విధానమే. కాకపోతే ఒకటి రెండు గ్రామాలకు సామంత ప్రతిపత్తి పూర్వ రాజులు ఇచ్చేవారు. ఇది పెదకోమటివేమారెడ్డికి రుచించలేదు. రెడ్డి రాజ్య విభజనకై కుమారగిరి దురుద్దేశంతో చేసిన చర్యగా పెదకోమటివేమారెడ్డి అతని వర్గంవారు భావించడంతో కొండవీడు రాజ్యంలో తిరిగి అతర్యుద్ధం ప్రారంభమైనది.

ఈ అంతర్యుద్ధ కాలంలో రెడ్డి రాజ్య శత్రువులు, సామంతులు తిరుగు బాట్లు చేసారు. పైగా క్రీ.శ. 1395 లో దక్షిణ భారత దేశం తీవ్రమైన క్షామానికి గురి అయింది. ఫెరిష్టా రచనలు సంభవించిన క్షామ తీవ్రతను వివరిస్తున్నాయి. ఈ క్షామం 12 సంవత్సరాలు సాగినట్టు తెలుస్తున్నది. ప్రజలు తిండి లేక అనేక బాధలకు గురి అయ్యారు. పన్నులు చెల్లించలేక పోయారు. ప్రభుత్వం ప్రజాభిమానాన్ని కోల్పోయింది. క్రీ.శ. 1396-97లో బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా ఉదయగిరి వరకు దాడిచేసి విజయనగర ప్రాంతాలను ఆక్రమించి కొండవీటి రెడ్డి రాజ్యం పైకి దండయాత్ర నడిపాడు. గజరావుతిప్ప అను కొండవీటి సామంతుడు ఫిరోజ్‌షాను కంభంమెట్టు దగ్గర ఓడించి మరలించాడు. కళింగ గజపతి కొండవీటి రాజ్యం పై దండెత్తగా అతడిని గొగ్గయ కుమారుడు దేవయసేనాని సింహాచలం వద్ద ఓడించి తరిమినట్లు అతని సర్పవరం శాసనం ద్వారా తెలియుచున్నది.[32]

విజయనగర రాజులు కూడ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉదయగిరి దుర్గం నుండి కొండవీటి రాజ్యం పై దాడులు ప్రారంభించి కొండవీటి రాజ్య దక్షిణ భూభాగాలను ఆక్రమించారు. క్రీ.శ. 1400 నాటి ఎనమదలలోని రెండవ హరిహరుని శాసనం[33] మూర్కొండపాడు,[34] పరుచూరు[35]లలో గల మొదటి దేవరాయల శాసనాలు కొండవీటి రెడ్డి రాజ్యంలోని విజయనగర ఆక్రమణలకు సాక్ష్యాధారాలు. కందుకూరు పాలిస్తున్న మల్లారెడ్డి సంతతి వాడైన కోమటివేముడు విజృంభించి తీరాంధ్రంలో తెనాలి వరకు ఆక్రమించినట్లు అతని పెదపూడి శాసనం (క్రీ.శ. 1404)[36] ద్వారా తెలుస్తున్నది.

ఈ తిరుగుబాట్లను ఎదుర్కొవడానికి కుమారగిరి ఏచర్యలు తీసుకొన్నాడో తెలియరావడం లేదు. బహుశ కఠినమైన చర్యలు అనుసరించి ఉండటం వలననే కొన్ని స్థానిక చరిత్రలు అతని పాలన కంటకప్రాయమైనదని వర్ణించాయి. ఈ పరిస్థితులే అతని ప్రభువులు కొంతమంది పెదకోమటివేమారెడ్డి పక్షం చేరేటట్లు చేసి ఉండాలి. శత్రువుల దాడులకు గురి అయిన కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి రెడ్డి సామంతులు తిరుగుబాటు చేసారు. గుంటూరు, బాపట్ల, పలనాడు తాలూకాలలో వెలుగోటి రాయపనాయనింగారి శాసనాలు ప్రత్యక్షమవుతున్నాయి. ఇతడు అతని సామంతుడు గజరావు తిప్పయ నాయక కుమారగిరిని ఎదిరించి పెదకోమటివేముని పక్షం చేరారు. కుమారగిరి కొత్తూరు శాసనం (క్రీ.శ. 1400)[37] కృష్ణా జిల్లాలోని చివరి శాసనంగా కనపడుతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో పెదకోమటివేమారెడ్డి క్రీ.శ. 1402 లో కుమారగిరిని తొలగించి కొండవీటి సింహాసనాన్ని ఆక్రమించాడు. కుమారగిరి రాజమహేంద్రవరం చేరి తన చివరి రోజులు అక్కడ గడిపాడు. కుమారగిరి రెడ్డి రసజ్ఞుడు, విద్యావంతుడు, కళాపోషకుడే గాని రాజనీతి విజ్ఞత, పరిపాలనా సామర్థ్యం లేని వాడగుటవలన కొండవీటి రెడ్డి రాజ్య విచ్ఛిన్నతకు కారకుడయ్యాడు.

## 3.8 పెదకోమటివేమారెడ్డి (క్రీ.శ. 1402-1420) :

పెదకోమటివేమారెడ్డి క్రీ.శ. 1402 లో కొండవీటి సింహాసనాన్ని అధిష్టించాడు. కుమారగిరి శాసనాలు అతను క్రీ.శ. 1402 వరకు జీవించి ఉన్నట్లు తెలుపుతున్నాయి. గోదావరికి పశ్చిమ ప్రాంతంలో కుమారగిరి శాసనాలు 1402 తరువాత లేకపోవడాన్ని బట్టి అతని అధికారం కొండవీడు ప్రాంతంలో అతను మరణించడానికి ముందే అస్తమించిందని చెప్పవచ్చు.[38] పూర్వపు ఒప్పందం ప్రకాం కుమారగిరి అనంతరం కొండవీటి సింహాసనానికి పెదకోమటి వేమారెడ్డి వారసుడు. కొండవీడు రాజ్యంలో ఏర్పడిన ఆంతరంగిక కల్లోల పరిస్థితి నుండి, శత్రు పరివేష్టితమైన రెడ్డి కొండవీటి సింహాసనాన్ని బలవంతంగా ఆక్రమించాడు. ఈ అంతర్యుద్ధంలో వెలుగోటి రాయపనాయక, గజరావు తిప్పయ నాయక మొదలగు కొందరు ప్రభువులు పెదకోమటి వేమారెడ్డి పక్షాన పోరాడి పెదకోమటి వేమారెడ్డి కొండవీటి సింహాసనం పొందటంలో సహాయం చేశారు.

అంతర్యుద్ధంలో భాగంగా కాటయ వేముడు కుమారగిరిని పునరుద్ధరించే లక్ష్యంతో కొండవీటి రెడ్డి రాజ్యంపై దాడి చేసాడు. ఒక తెలుగు చాటు పద్యం[39] అనుసరించి పెదకోమటి వేమారెడ్డి సేనాని గజరావు తిప్పయ నాయక కాటయ వేముని గుండుగొలను, కోనూరు (పశ్చిమ గోదావరి జిల్లా) వద్ద జరిగిన యుద్ధాలలో ఓడించినట్లు తెలుస్తున్నది.

ఈ సమయంలోనే రెండవ హరిహరరాయలు కాటయ వేమునకు సహాయంగా చౌండపసేనానిని కొండవీడు పైకి పంపాడు. విజయనగర సైన్యం ఓడి వెనుదిరిగింది. చివరకు పెదకోమటి ప్రయత్నాలు ఫలించి కొండవీడు సింహాసనాన్ని అధిష్టించాడు. పెదకోమటి వేమారెడ్డి కలువాముల (క్రీ.శ 1404)[40] నందమూరు (క్రీ.శ.1411)[41] శాసనాల ప్రకారం పెదకోమటి వేముని అధికారం కృష్ణానది ఉత్తర దిశగా విస్తరించిందని చెప్పవచ్చు. తదుపరి పెదకోమటి వేముడు తన తమ్ముడైన మాచారెడ్డిని కొండపల్లి పాలకునిగా నియమించాడు.[42]

## 3.8.1 పెదకోమటి వేమారెడ్డి తొలిదిగ్విజయాలు :

పెదకోమటి వేముని అధికారం కొండవీడులో స్థిరపడిన సమయంలో విజయనగర రాజు రెండవ హరిహర రాయలు క్రీ.శ. 1404 లో మరణించగా విజయనగర సింహాసనం కోసం వారసత్వపు యుద్ధం ప్రారంభమయింది. విజయనగరంలో సంభవించిన అరాచక పరిస్థితులను సద్వినియోగపరచుకోవడంలో పెదకోమటి వేమారెడ్డి వెనుకాడ లేదు. తన రాజ్య దక్షిణ ప్రాంతంలో విజయనగర రాజుల వశమైన ప్రాంతాలు, కందుకూరు పాలకుడు రెండవకోమటి వేమారెడ్డి వశమైన తీరాంధ్రప్రాంతాలు పెదకోమటి వేమారెడ్డి తిరిగి స్వాధీనపరుచుకొన్నాడు. పెదకోమటివేముడు తన తమ్ముడైన మాచారెడ్డితో కలసి రాజ్యంలో శాంతి భద్రతలను పునరుద్ధరించాడు.

## 3.8.2 పెదకోమటి వేమారెడ్డి- కాటయవేమారెడ్డి సంబంధాలు :

కుమారగిరి మరణించిన తరువాత కూడా పెదకోమటి వేమారెడ్డి, కాటయ వేమారెడ్డి మధ్య సంబంధాలు మెరుగుపడలేదు. రాజమహేంద్రవర రాజ్యంపై పెదకోమటి వేముడు తన సార్వభౌమాధికారాన్ని నిలిపి, రెండు రెడ్డి రాజ్యాలను కలిపి పాలించడమే అతని ఆశయమయింది. పైగా కాటయ వేముడు పెదకోమటి సార్వభౌమాధికారాన్ని అంగీకరించక ఎదురు తిరిగాడు. ఈ సంఘర్షణ వీరి మధ్యగల సంబంధాలను ఇంకా బలహీనపరచాయి. కుమారగిరి చేసిన పొరపాటు పెద్ద రాజకీయ తప్పిదంగా తయారయి రెడ్డి రాజ్యాన్ని రెండు ముక్కలుగా చేసి ఒకరితోనొకరు పోరాడుకునేటట్లు చేసింది.

కొండవీటి, రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాల సంఘర్షణను అవకాశంగా మొదట వినియోగించుకొన్న ప్రభువు చోడభక్తి రాజు కుమారుడు అన్నదేవచోడుడు. దేవరకొండ పద్మనాయకుడైన పెదవేదగిరి సహాయంతో అన్నదేవచోడ వేంగిలో తాను కోల్పోయిన రాజ్యం తిరిగి సంపాదించాడు. పెదకోమటి వేమారెడ్డి కూడా అన్నదేవచోడుని పోరాటంలో సహాయం అందించాడు. ఈ విధంగా ఏర్పడిన మైత్రివలన తనకు రాబోయే ప్రమాదం కాటయ వేముడు గుర్తెరగకపోలేదు. ఒకవైపు పెదకోమటి వేమారెడ్డి, మరొక వైపు అన్నదేవచోడుడు ఒలియమైన శత్రువులుగా ఉన్నారు. శత్రుపరివేష్టితుడైన కాటయవేముడు వారి ప్రమాదం నుండి తప్పించుకోవడానికై విజయనగరంలో వారసత్వపు యుద్ధం పూర్తి అయి క్రీ.శ.1406 లో మొదటి దేవరాయలు సింహాసనం అధిష్టించాక కాటయ వేముడు స్వయంగా విజయనగరం సందర్శించి ఉండవచ్చునని అహోబిలంలోని అతని శాసనం (క్రీ.శ.1410)[43] సూచిస్తున్నది. రాజమండ్రి మ్యూజియం శాసనం[44] మొదటి దేవరాయలు కాటయ వేమునకు సహాయం చేయడానికి అంగీకరించినట్లు తెలుపుతున్నది.

మొదటి దేవరాయలు తన సైన్యంతో కొండవీడు రాజ్యంపై దాడి చేసి పెదకోమటి వేమారెడ్డి, అన్నదేవచోడుడు కాటయవేమునిపై ఇస్తున్న ఒత్తిడిని తగ్గించప్రయత్నించాడు. క్రీ.శ. 1412 నాటి దేవరాయల ఇంకొల్లు శాసనం ఇందుకు నిదర్శనం.[45] ఈ దండయాత్రలో మొదటి దేవరాయలు కొండవీటి రాజ్య ముఖ్య రేవు పట్టణమైన మోటుపల్లిరేవును ఆక్రమించాడు. కాని విజయనగర రాజుల ఈ విజయం తాత్కాలికమైనదిగా కనిపిస్తున్నది. పెదకోమటి వేముడు, అన్నదేవచోడుడు బహుశ క్రీ.శ. 1412 లో కాటయవేమునిపై దండెత్తారు. అత్తిలి, కాకరపర్రు (పశ్చిమ గోదావరి జిల్లా) ల దగ్గర జరిగిన భీకర పోరాటంలో కాటయవేముడు మరణించాడు. ఈ యుద్ధాల్లో

గజరావు తిప్పనాయక ముఖ్యపాత్ర నిర్వహించాడు. కొప్పునూళ్ల వారి బిరుదు వంశావళిని బట్టి గజరావు తిప్పనాయకకు "కాటయవేముని తలగొండుగండ" అనే బిరుదు కలదని తెలుస్తున్నది. క్రీ.శ. 1414 తరువాత కాటయవేముని శాసనాలు కనిపించవు.

## 3.8.3 పెదకోమటి వేమారెడ్డి- అల్లాడరెడ్డి :

కాటయవేముడు చనిపోయిన తరువాత కూడా రాజమహేంద్రవర రాజ్యం పెదకోమటి వేముని వశంకాలేదు. కాటయవేముని కుమారుడు రెండవ కుమారగిరి రెడ్డి బాలుడైనందువలన అల్లాడ రెడ్డి అతనిని సింహాసనం ఎక్కించి పెదకోమటి వేముని ప్రయత్నాలను ప్రతిఘటించాడు. ఈ సమయంలోనే క్రీ.శ. 1415 లో అల్లాడరెడ్డి అన్నదేవచోడుని వధించాడు. అన్నదేవచోడుని మరణంతో పెదకోమటి వేముడు నిస్సహాయుడయ్యాడు. అల్లాడరెడ్డికి విజయనగర రాజుల అండదండలుండటంతో పెదకోమటి వేముడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా సహాయం అర్థించాడు. గుల్బర్గా, కొండవీడుల మధ్య మైత్రిని కుదర్చడంతో పెదకోమటి వేముని మంత్రి మామిడి సింగన ప్రధాన పాత్ర నిర్వహించినట్లు శృంగార నైషధం[46] సూచిస్తున్నది. వీరిద్దరి మధ్య మైత్రిని వెలుగోటి వారి వంశావళి కూడా పేర్కొంటున్నది. దేవర కొండ పద్మనాయకులకు ఈ మైత్రి రుచించలేదు. కొండవీడుకు సహాయంగా ఫిరోజ్‌షా పెద్ద సైన్యాన్ని తెలంగాణా మీదుగా పంపాడు. వేదాద్రిలోని సుల్తాన్ శాసనాలు, ఫెరిష్టా రచనలు ఈ దాడి క్రీ.శ. 1417లో జరిగినట్లు సూచిస్తున్నవి. రెడ్డి, బహమనీ సైన్యాలు రాజమహేంద్రవరాన్ని ముట్టడించాయి. అక్కడ జరిగిన భయంకర యుద్ధంలో ఫిరోజ్‌షా, పెదకోమటి వేములను అల్లాడి రెడ్డి ఓడించినట్లు కొమ్మిచిక్కాల[47] శాసనం తెలుపుతున్నది. అల్లాడరెడ్డి కోమటి వేముని తరుముతూ రామేశ్వరం (తూర్పు గోదావరి జిల్లా) దగ్గర యుద్ధంలో ఓడించినట్లు శివలీలా విలాసం పేర్కొనుచున్నది.

## 3.8.4 కొండవీటి రెడ్డి రాజ్య అంతం ప్రారంభము :

పెదకోమటి వేమారెడ్డి, ఫిరోజ్‌షాలు రాజమహేంద్రవరం ప్రాంతంలో పరాజయం పొందుతున్న సమయంలో మొదటి దేవరాయలు పానుగల్లును కేంద్రంగా చేసుకొని బహమనీ ప్రాంతాలపైన, కొండవీటి రెడ్డి రాజ్యం పైన దాడులు నిర్వహించాడు. రాజమహేంద్రవరం నుండి తిరోగమిస్తున్న ఫిరోజ్‌షా సైన్యాలు పానుగల్లును ముట్టడించాయి. ఈ సమయంలోనే మొదటి దేవరాయ, రాచకొండ రాజ్యాల మధ్య మైత్రి కుదిరింది. బహమనీల సామంతులుగా ఉంటున్న రాచకొండ, దేవరకొండ పద్మనాయకులు బహమనీలు కొండవీడుతో చేసుకొన్న మైత్రిని వ్యతిరేకించారు. విజయనగర, రాచకొండ పద్మనాయకులు కలసి బహమనీలను తరిమి వేసారు. కొండవీడుపై నడచిన విజయనగర సైన్యాలు మోటుపల్లితో సహా కొండవీటి రెడ్డి రాజ్య దక్షిణ ప్రాంతాలను ఆక్రమించాయి. క్రీ.శ. 1416 నాటి మొదటి దేవరాయ మోటుపల్లి అభయ శాసనం, క్రీ.శ. 1417 నాటి విజయనగర సామంతుడైన కూనపులి అనవోతానాయక పొన్నూరు శాసనం మొదటి దేవరాయలు కొండవీటి రాజ్య దక్షిణ ప్రాంతాలను ఆక్రమించాడనటానికి సాక్ష్యాధారాలు.

## 3.8.5 పెదకోమటి వేమారెడ్డి- రేచర్ల పద్మనాయకులు :

పెదకోమటి వేమారెడ్డి చివరి రోజులు రాచకొండ, దేవరకొండ పద్మనాయకుల సంఘర్షణతోనే గడచింది. వెలుగోటివారి వంశావళి వారి మధ్యగల సంఘర్షణను పేర్కొంటున్నది. ఫిరోజ్‌షా పానుగల్లును ముట్టడిస్తున్న సమయంలో దేవరకొండను పాలిస్తున్న కుమార వేదగిరి దండెత్తి కోమటి వేముని తమ్ముడు మాచారెడ్డిని వధించాడు. ప్రతి చర్యగా కోమటి వేముడు కుమార వేదగిరిని వధించాడు దీనితో రెచ్చిపోయిన వేదగిరి సోదరుడైన లింగమనీడు పెద్ద సైన్యంతో పెదకోమటి వేమారెడ్డిపై దండెత్తి ఓడించి అతని సింహలాంఛనాన్ని, వంశానుగతమైన నందికంటపోతరాజు కటారిని సంగ్రహించి బంధీగా పట్టుకొని వదలివేసాడు. సింగ పుత్రుడు సింగయ అన్న పెదకోమటి వేమారెడ్డిని వధించినట్లు వెలుగోటి వారి వంశావళి పేర్కొంటున్నది. వెలమలతో జరిగిన యుద్ధాలలోనే క్రీ.శ. 1420 నాటికి పెదకోమటి వేమారెడ్డి మరణించి ఉంటాడు. క్రీ.శ. 1419 నాటి శ్రీనాధుడు రచించిన రుద్రవరం శాసనం తరువాత పెదకోమటి వేమారెడ్డి శాసనాలు కనిపించవు.

పెదకోమటి వేమారెడ్డి గొప్పవీరుడు, రాజనీతి చతురుడు, కవి, పండితుడు, కళాకారుడు. కనుకనే అతనికి సర్వజ్ఞ చక్రవర్తి అనే బిరుదు లభించినది. పెదకోమటి వేముడు సింహాసనాన్ని అధిష్టించినప్పటి నుండి కొండవీటి రెడ్డి రాజ్య రక్షణకు, సమగ్రతకు, దాని స్వాతంత్ర్యం కాపాడటానికి నిరంతరం కృషి చేసాడు. కాని నాటి ఆంధ్ర దేశ రాజకీయాలు రెడ్డి రాజ్యసమైక్యతకు అతను చేసిన తప్పిదమే తానూ చేసి తన రాజ్యాన్ని తాను తన తమ్ముడైన మాచారెడ్డి మధ్య పంపకం చేసాడు. కుమారగిరి కాలంలోవలె కొండవీటి రాజ్యం ఇటువంటి విభజన వలన నష్టపోక పోయిననూ పెదకోమటి కాలంలో జరిగిన రాజ్యవిభజన వలన కొండవీటిరెడ్డి రాజ్యం బలహీనపడి విజయనగర నరపతులు, కళింగ గజపతులు, గుల్బర్గా అశ్వపతులు నిరంతర దాడులకు అవకాశమిచ్చింది. పెదకోమటి వేముని బహమనీ సుల్తానులతో మైత్రి విజయనగర రాజులు, పెదకోమటి వేముని సామంతుల వ్యతిరేకతకు కారణమయింది.

పెదకోమటి వేముడు సంగీత, సాహిత్యాలకు సంబంధించి శ్రవ్య, దృశ్య ప్రబంధాలు, పురాతన సంస్కృత గ్రంథాలపై వ్యాఖ్యానాలు రచించాడు. అతను చేసిన దానధర్మాలను కీర్తిస్తూ అనేక చాటుపద్యాలు కలవు.

## 3.9 రాచవేముడు (క్రీ.శ.1420-24) :

కొండవీటి రెడ్డి రాజులలో చివరివాడు పెదకోమటి వేముని కుమారుడు రాచవేముడు. కొండవీటి దండకావిలె, కొండవీటి కైఫీయత్‌లు రాచవేముడు నాలుగు సంవత్సరాలు పరిపాలించినట్లు సూచిస్తున్నాయి. అమీనాబాద్ శాసనం అనుసరించి రాచవేముడు తనతల్లి సూరాంబిక నిర్మించిన సంతాన సాగరం అనే చెరువుకు జగనొబ్బగండ కాలువను ఇతడు నిర్మించినట్లు తెలుస్తున్నది.

రాచవుముడు సింహాసనం అధిష్టించే నాటికి కొండవీటి రాజ్య పరిస్థితులు విషమంగా ఉన్నాయి. సైనిక బలం క్షీణించింది. ఖజానా ఒట్టిపోయింది. శత్రువులు అధికమయ్యారు. ఈ పరిస్థితుల్లో సామర్థ్యంలేని రాచవేముడు ప్రజాకంటకంగా పాలించాడు. అధిక సుంకాలను విధించాడు. ప్రజాదరణ కోల్పోయిన రాచవేముని పాలనతో కొండవీటి రాజ్యం మరీ బలహీనపడింది. రాచవేముడు చివరకు "పురిటిసుంకం" వంటి పన్నులు కూడా విధించాడు. రాచవేముని సవరం ఎల్లయ్య అనే బలిజనాయకుడు వధించాడని కొండవీటి కైఫీయత్ వలన తెలుస్తున్నది. రాచవేముని మరణంతో కొండవీటి రెడ్డి రాజ్యం అస్తమించింది.

రాచవేముని కాలానికే విజయనగర రాజులు రెడ్డి రాజ్య దక్షిణ ప్రాంతాన్ని ఆక్రమించారు. క్రీ.శ. 1420 నాటి మొదటి దేవరాయల శాసనం గుంటూరు జిల్లాలో పొత్తూరులో ఉంది.[48] క్రీ.శ. 1424 లో లాంగూల గజపతి కొండవీడును ఆక్రమించి కొండవీడు కోటకు మరమ్మత్తులు చేయించినట్లు కొండవీడు కైఫీయత్ సూచిస్తున్నది.[49] రాచవేముని మరణంతో కొండవీటి రెడ్డి రాజ్యం విజయనగర, గజపతి రాజ్యాల వశమైనది.

## 3.10 సారాంశము :

ఈ విధంగా ప్రోలయ వేమారెడ్డిచే స్థాపింపబడిన కొండవీటి రెడ్డి రాజ్యం అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్ల కాలంలో అత్యున్నత దశలో ఉండి పెదకోమటి వేమారెడ్డి కాలం నాటి నిరంతర యుద్ధాల వలన బలహీనపడి అతని కుమారుడు రాచవేముని కాలంలో అస్తమించింది.

- ఎం. సోమశేఖర రావు.

పాఠం - 4

# రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం

## 4.0. లక్ష్యం :

రెడ్డి రాజుల రాజ్య విస్తరణ, రాజమహేంద్రవరంలో వారి పాలన వంటి అంశాలను వివరంగా తెలియపరచటం ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :

4.1 పరిచయం

4.2 కాటయవేముడు

4.3 రెండో కుమారగిరి

4.4 మూడో కుమారగిరి, మూడో అనవోతారెడ్డి

4.5 వీరభద్రారెడ్డి

4.6 సారాంశము

## 4.1. పరిచయం :

రాజ మహేంద్రవర రెడ్డి రాజ్య స్థాపన 14 వ శతాబ్ది చివరి పాదంలో జరిగింది. కొండవీటి రెడ్డి రాజులు తమరాజ్య స్థాపన నుండి కోస్తా ఆంధ్ర ప్రాంతం అంతా తమ ఆధీనంలో ఉంచుకోవలసిన అవసరాన్ని గుర్తించడమేగాక తమ అధికారాన్ని స్థిరీకరిపంజేసి ముస్లిం దండయాత్రలనుండి హిందూ ధర్మాన్ని, సంస్కృతిని రక్షించి కాపాడాలనే దృఢసంకల్పంతో ఉండేవారు. కాని రెడ్డి రాజ్య స్థాపకుడైనప్రోలయ వేమారెడ్డి తరువాతనే అనవోతారెడ్డి, అనవేమారెడ్డిల పరిపాలనా కాలాలలో రెడ్డి రాజులు ఆంధ్రదేశ తూర్పు ప్రాంతాలపై దండయాత్రలు జరిపి కృష్ణానదికి ఉత్తరానగల సస్యశ్యామలమైన తీరప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. అనవేమారెడ్డి కాలం నాటికి కొండవీటి రెడ్డి రాజులు తమ అధికారాన్ని రాజమహేంద్రవరందాక విస్తరింపజేస్తారు. అనవోతారెడ్డి, అనవేమారెడ్డి ల తూర్పు దిగ్విజయ యాత్రలసమయంలోనే నెల్లూరు జిల్లాలోని పాకనాటికుటుంబాలు అనేకం రాజమహేంద్రవరం దాని పరిసరప్రాంతాలలో స్థిరపడ్డాయి. వారిలో కాటారెడ్డి, దువ్వూరు వంశానికి చెందిన పెరు మాండిరెడ్డి కుటుంబాలు ముఖ్యమైనవి. రెండవకాటా రెడ్డి మొదటి కాటారెడ్డికి పౌత్రుడు, మారారెడ్డి పుత్రుడు. రెండవకాటారెడ్డి అనవోతా రెడ్డికి, అనవేమారెడ్డికి సమకాలీనుడు. దువ్వూరు వంశానికి చెందిన పెరు మాండి రెడ్డికి అల్లాడ రెడ్డి, పెద కాటారెడ్డి, అనవ్రోతా రెడ్డి , దొడ్డారెడ్డి, పిన కోటారెడ్డి, అను అయిదుగురు కుమారులు కలరు. తమ రాజ్య భద్రతకు, రక్షణకు ఈ కుటుంబాల సహాయసహకారాలు అవసరమని కొండవీటి రాజులు వీరితో వివాహ సంబంధాలు నెరపారు. కాటా రెడ్డి పౌత్రుడైన రెండవ కాటారెడ్డికి ప్రోలయవేమారెడ్డి కుమార్తె దొడ్డాంబికతో వివాహం జరిగింది. ఈ దంపతుల సంతానమే కాటయవేమారెడ్డి. కాటయవేమారెడ్డి తనమేనమామ అనవోతారెడ్డి కూతురును వివాహమాడాడు. కాటయ వేమారెడ్డికి కాటయవేయుడు, కుమార గిరి రెడ్డి అను కుమారులు, అనితల్లి అనుకుమార్తె కలదు.

అయితే దువ్వూరు వంశానికి చెందిన పెరు మాండిరెడ్డి, కుటుంబానికి గోదావరిలోయ ప్రాతంలో గల బలవంతులైన ప్రభువులతో వివాహ సంబంధాలు ఉన్నాయి. ఏరువ ప్రభువైన భక్తి రాజు కుమారుడు భీమ దేవచోడ కూతురు వేమాంబను అల్లాడరెడ్డి మూడవ కుమారుడైన దొడ్డారెడ్డికి వివాహం చేసుకొన్నాడు. అల్లాడరెడ్డి మహావీరుడు. అల్లాడ రెడ్డి అతని సోదరులు, అతని మేనమామలు అందరూ రెడ్డి రాజుల అధికారాన్ని గోదావరిలోయ ప్రాంతానికి విస్తరింపజేయడంలో మనస్ఫూర్తిగా సహకరించారు. ఈ విధంగా కాటా రెడ్డి, దువ్వూరు కుటుంబాల మధ్య, ఉభయులకు కొండవీటి రెడ్లతో వివాహ సంబంధాలు ఉన్నాయి. ఈ రెడ్డి కుటుంబాలే అంతర్యుద్ధ కాలంలో రెడ్డి రాజ్యానికి మూల స్తంభాలుగా నిలిచారు.

కుమార గిరి రెడ్డి రాజ్యానికి వచ్చిన తరువాత తన కుమారుడు రెండవ అనవోతారెడ్డిని, తన బావమరిది కాటయవేముని తూర్పు దిగ్విజయ యాత్రలో అల్లాడరెడ్డి అతని కుమారులు వేమారెడ్డి, దొడ్డా రెడ్లు సహయం చేయగా కొండవీటి రెడ్డి రాజులు ఒరిస్సాలోని కటక్ వరకు విజయ యాత్రలు సాగించినట్లు తెలుస్తునది. చిలకసరస్సు దగ్గర, సింహాచలం దగ్గర వారు విజయ స్తంభాలు నాటారు. ఈదండయాత్ర అనంతరం గొదావరి నదికి ఉత్తరాన సింహచలం వరకు గల ప్రాంతము రాజ మహేంద్ర వరంలో చేర్చి ఆ ప్రాంతం రాజ మహేంద్రవర రాజధానిగా రాజమహేంద్రవర రాష్ట్రం గా రూపొందింపబడింది. రెండవ అనవోతారెడ్డి రాజమహేంద్ర వరంలో ప్రతినిధిగా నియమింపబడినాడు. కాని రెండవ అనవోతారెడ్డి అకాల మరణంచెందటంతో కుమారగిరిరెడ్డి తన బావమరిది కాటయవేముని రాజ మహేంద్రవర పాలకునిగా నియమించాడు.

## 4.2 కాటయ వేముడు (క్రీ.శ. 1394 -1414) :

కుమారగిరిరెడ్డి బావమరిది, అతని ప్రధాన మంత్రి అయిన కాటయవేముడు క్రీ.శ.1395 లో రాజమహేంద్రవర పాలకునిగా నియమింపబడ్డాడు. కొండవీటిరెడ్డి రాజ్య విస్తరణలో కాటయవేయుడు నిరుపమానమైన సేవలు అందించాడు. కాటయవేయుడు చేసిన సేవలకు బదులు కుమారగిరిరెడ్డి రాజ్యమహేంద్రవరరాజ్యానికి స్వయం ప్రతిపత్తి ఇచ్చి అక్కడ కాటయవేయుని పాలకునిగా నియమించి కుమారగిరిరెడ్డి తన కృతజ్ఞతను కనపరచాడు. కాటయవేయుడు రాజమహేంద్రవరానికి పాలకుడుగా నియమింపబడటంతో కొండవీటిరెడ్డి రాజ్యంతో కుమారగిరికి పెదకోమటివేమారెడ్డికి మధ్య అంతర్యుద్ధం ప్రారంభమయింది. ఈ అంతర్యుద్ధంలో పెదకోమటివేమారెడ్డి కుమారగిరిని రాజ్యభ్రష్టుడిని చేయడంతో కుమారగిరి రాజ్యమహేంద్రవరం చేరాడు. కుమారగిరిని పునరుద్ధరించడానికి కాటయవేముడు విజయనగర రాజు రెండవ హరిహర రాయలతో కలసి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కుమారగిరిరెడ్డి మరణంతో కాటయవేమ, పెదకోమటివేమల సంఘర్షణ తారాపథం చేరి సుదీర్ఘమైన అంతర్యుద్ధానికి దారితీసింది.

కాటయవేముడు పెదకోమటి వేమారెడ్డితో సంఘర్షణ పడుతున్న సమయంలో ఏరువప్రభువు చోడభక్తిరాజు కుమారుడు అన్నదేవచోడ తాను కోల్పోయిన వేంగి ప్రాంతాన్ని పునరాక్రమించడానికి రేచర్ల పద్మనాయక ప్రభువైన మొదటి వేదగిరి సహాయంతో కాటయవేమునితో పోరు ప్రారంభించాడు. అన్నదేవచోడ కళింగ రాజ్యం ద్వారా కాటయవేమునిపై దాడి చేయగా ఎలమంచిలిలో రెడ్డిరాజుల సామంతుడైన విశ్వేశ్వరప్రభువు సర్వసిద్ధి (విశాఖ జిల్లా) దగ్గర క్రీ.శ. 1402 లో అన్నదేవచోడ సైన్యాన్ని ఓడించి మరలించాడని పంచదారల శాసనం[50] లోని ఒక శ్లోకం, విన్నకోట పెద్దన రచించిన కావ్యాలంకార చూడామణి పేర్కొనుచున్నవి. కాని అన్నదేవచోడ చేసిన మరొక ప్రయత్నం ఫలించి రాజమహేంద్రవరం రాజ్యంలోని కొంతభాగాన్ని క్రీ.శ.1404 నాటి ఆక్రమించగలిగాడు. క్రీ.శ. 1404 నాడు అన్నదేవచోడుని ద్రాక్షారామశాసనం అన్నదేవచోడుని "రాజాధిరాజపరమేశ్వర" "పూర్వసింహాసనాధీశ్వర" అని కీర్తించడమే ఇందుకు సాక్ష్యం. అయితే అన్నదేవచోడుడు తన అధికారాన్ని అక్కడ ఎంతోకాలం నిలుపుకోలేకపోయాడు. కాటయవేయుడు ఆ ప్రాంతాలను పునరాక్రమించాడు. క్రీ.శ. 1404 నాటి తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ తాలూకాలలో గల కాటయవేముని శాసనాలే ఇందుకు ఆధారాలు. క్రీ.శ. 1405 నాటి వేముని మధిరపూడి, తొర్రేడు (రాజమండ్రి తాలూకా) సర్పవరం (కాకినాడతాలూకా) శాసనాలు కూడా పై విషయాన్ని బలపరుస్తున్నాయి. చివరకు అన్నదేవచోడుడు పెదకోమటి వేమారెడ్డితో మైత్రి చేసుకొని కాటయవేమునిపై యుద్ధాలు సాగించాడు. కాటయవేముడు మొదటి దేవరాయ సహాయం కోరినట్లు అతని అహోబిలం శాసనం ద్వారా తెలుస్తున్నది. మొదటి

దేవరాయ సహాయం చేయడానికి అంగీకరించి అన్నదేవచోడ, పెదకోమటి వేమారెడ్డిల దాడుల వత్తిడినుండి కాటయవేముని కాపాడటానికై కొండవీడు రాజ్యంపై దాడి చేసి బాపట్ల తాలూకా ప్రాంతాన్ని ఆక్రమించాడు.

అయినా అన్నదేవచోడుడు తన పోరాటాన్ని ఆపలేదు. పెదకోమటి వేముని సహాయంతో గోదావరినది పశ్చిమ ప్రాంతాన్ని ఆక్రమించాడు. తూర్పు ప్రాంతంలో కాటయవేముని పాలన సాగుతుంది. చివరకు అన్నదేవచోడకు కాటయవేమునకు గౌతమి నదీతీరంలో గల కాకరపఱ్ఱు వద్ద జరిగిన యుద్ధంలో క్రీ.శ. 1414 లో గజరావు తిప్పనాయక చేతిలో కాటయవేముడు మరణించాడు. రాజమహేంద్రవరం మ్యూజియం శాసనం ఈ యుద్ధాన్ని వర్ణిస్తున్నది. కొప్పునూళ్ల వంశీకుడైన గజరావుతిప్పనాయక పెదకోమటి వేమారెడ్డి సామంతుడు. గజరావు తిప్పనాయకుకు "కాటయవేముని తలగొండుగండ" అన్న బిరుదుకలదు.

కాటయవేముడు గొప్పవీరుడు, రాజనీతి చతురుడు, సాహసికుడు. రెడ్డి రాజ్యాన్ని విస్తరింపజేసి దాని గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపజేసాడు. కాని అతని కారణంగానే రెడ్డి రాజ్యంలో అంతర్యుద్ధం సంభవించి రాజ్యపతనానికి దారితీసింది. కాటయవేముడు గొప్ప విద్వాంసుడు, రచయిత. కాళిదాసు నాటకాలపై వ్యాఖ్యానం రచించి దానికి "కుమారగిరి రాజీయం" అని పేరు పెట్టాడు. కుమారగిరి రెడ్డికి ప్రధానిగా, సైన్యాధిపతిగా విధేయత, విశ్వాసలతో మెలిగాడు. కుమారగిరి పట్ల అతనికి ఉన్న అభిమానం ఆమేయమైనది. బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలను కుమారగిరి పేరు మీద దానాలు చేసాడు. తన కుమారునకు కుమారగిరి అను పుత్రుడుగాక అనితల్లి, హరిహరాంబ అను కుమార్తెలు కలరు. దొడ్డాంబిక ద్వారా తనకు కలిగిన అనితల్లిని అల్లాడరెడ్డి కుమారుడు వీరభద్రారెడ్డికి, హరిహరాంబను వీరభద్రారెడ్డి పెద్ద సోదరుడైన వేమారెడ్డికి ఇచ్చి వివాహం చేసాడు.

## 4.3 రెండో కుమారగిరి (క్రీ.శ. 1414-1416) :

కాటయవేముని మరణానంతరం రాజమహేంద్రవరరెడ్డి రాజ్య రాజకీయాలలో అల్లాడరెడ్డి రంగప్రవేశం చేసి ముఖ్యపాత్ర నిర్వహించాడు. కాటయవేముని పెద్ద కుమారుడు కాటయ చనిపోయినందున అల్లాడరెడ్డి పదేళ్ల బాలుడైన కాటయవేముని రెండవ కుమారుడు రెండవ కుమారగిరిరెడ్డిని సింహాసనం ఎక్కించి తాను సంరక్షకుడుగా పరిపాలన నిర్వహించాడు. అల్లాడరెడ్డి రాజమహేంద్రవరరాజ్య స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడటానికి నిర్విరామంగా కృషి చేసాడు. కాటయవేమారెడ్డి మరణానంతరం అన్నదేవ చోడుడు కాటయవేముని కుటుంబాన్ని బంధించి శరణువేడగా పేరు కోసం వారిని విడిచిపెట్టినట్లు అతని రాజమహేంద్రవరం శాసనం[51] సూచిస్తున్నది. కాటయవేముని మరణానంతరం కూడా అన్నదేవచోడుని ప్రధాన శత్రువు అల్లాడరెడ్డి. అన్నదేవచోడుడు ఈ సమయానికి గోదావరితీరం వెంబడి పట్టిసం, మోటిదీవుల (భద్రాచలం దగ్గర గల చిన్నదీవులు) మధ్యప్రాంతాన్ని ఆక్రమించినాడు. వేంగిరాజ్య సమస్తం ఆక్రమించే ప్రయత్నాలు ప్రారంభించాడు. కోనసీమలో చాలభాగం అతని వశమయింది. ఈ పరిస్థితుల్లో అల్లాడరెడ్డి అన్నదేవచోడుని అతని మిత్రుడైన పెదకోమటివేమారెడ్డిని ఎదిరించడానికి నిర్ణయించుకొన్నాడు. అల్లాడ రెడ్డి అన్నదేవచోడ తమ్ముడైన భీమదేవచోడునికి బావమరిది. కాటయవేమారెడ్డికి ఇంకా దగ్గర బంధువు.

అనవేమారెడ్డి ప్రయత్నాలను అల్లాడరెడ్డి ఎంతో కాలం కొనసాగనివ్వలేదు. క్రీ.శ. 1414 నాటి అల్లాడరెడ్డి పలివెలశాసనం[52] లో ద్రోహికులాన్ని తుదముట్టించి కాటయవేముని వంశాన్ని పునరుద్ధరించినట్లు చెప్పుకున్నాడు. అన్నదేవచోడుని చివరి శాసనమైన పాలకొల్లు శాసనం[53] అతడు క్రీ.శ. 1414 లో జులైనెల వరకు జీవించి ఉన్నట్లు సూచిస్తున్నది. అల్లాడరెడ్డి సేనాని నరహరినీడు తన పాలకొల్లు శాసనంలో (క్రీ.శ. 1416) అల్లాడరెడ్డి అధికారాన్ని పునఃప్రతిష్టించినట్లు చెప్పాడు.

వీటిని బట్టి క్రీ.శ. 1414-1416 సంవత్సరాల మధ్యలో అన్నదేవచోడ, అల్లాడరెడ్డికి మధ్య జరిగిన సంఘర్షణలలోనే అన్నదేవచోడ మరణించి ఉంటాడు. క్రీ.శ. 1416 లోనే రెండవ కుమారగిరి అకాలమరణం పొందాడు. వీరభద్రా రెడ్డిని సింహాసనం ఎక్కించి అల్లాడ రెడ్డి రాజ్యవ్యవహారాలను నిర్వహించాడు. ఈ కాలంలో పెదకోమటి వేమారెడ్డి నుండేగాక ఇతర రాజ్యాల నుండి కూడా రాజమహేంద్రవర రెడ్డి రాజ్యానికి శత్రుభయం ఎక్కువైనది. విజయనగర రాజులు, గజపతులు దండయాత్ర చేయగా అల్లాడరెడ్డి వారితో మైత్రి చేసుకొన్నాడని

అతని వేమవరం శాసనం[54] తెలుపుతున్నది. ఈ సంఘటన అనంతరం అల్లాడరెడ్డికి విజయనగర, గజపతుల మధ్య సుహృద్భావ సంబంధాలు ఏర్పడ్డాయి.

కాని పెదకోమటి వేమారెడ్డి అల్లాడరెడ్డితో తన సంఘర్షణను కొనసాగించాడని సమకాలీన శాసనాలు, సాహిత్యం ద్వారా తెలుస్తున్నది. పెదకోమటి వేముడు తన మంత్రి మామిడి సింగనను బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా కొలువుకు పంపి అతని సహాయం అర్థించాడు. ఫిరోజ్‌షా అంగీకరించి తన వజీర్ నిజాం ఉల్‌ముల్క్‌ను పెద్ద సైన్యంతో తెలంగాణాకు పంపాడు. వాడపల్లిలోని ఫిరోజ్‌షా శాసనం[55] బహామనీ సైన్యం క్రీ.శ. 1417 నాటికి కృష్ణాజిల్లాలోని నందిగామ ప్రాంతానికి వచ్చినట్లు సూచిస్తుంది. అక్కడ నుండి బహామనీ సైన్యం రాజమహేంద్రవరాన్ని ముట్టడించింది. కాని అల్లాడరెడ్డి మొదటి దేవరాయ పంపిన సైన్యంతో ఫిరోజ్ షా, పెదకోమటి వేమారెడ్డి సైన్యాలను తరిమివేసాడు. ఫిరోజ్‌షా సైన్యం వెనుదిరిగిన వెంటనే అల్లాడరెడ్డి ఆలప్‌ఖాన్‌ను ఓడించి అతని గుర్రాలను సంగ్రహించాడని కాశీఖండం, శివలీలవిలాసం, వేమవరం శాసనం పేర్కొంటున్నాయి. ఈ దాడిలో భాగంగానే అల్లాడరెడ్డి రామేశ్వరం దగ్గర పెదకోమటిని ఓడించి అతని సర్వస్వం హరించాడు. అల్లాడరెడ్డి క్రీ.శ. 1419-1420 సంవత్సరంలో మరణించాడు.

## 4.4 మూడో కుమారగిరి, మూడో అనవోతారెడ్డి :

అల్లాడరెడ్డి మరణంతో రాజమహేంద్రవరరెడ్డి రాజ్యాన్ని అతని కుమారుడు వేమారెడ్డి పరిపాలించాడన్న భావన సరియైనది కాదు. అల్లాడరెడ్డి అనంతరం రాజమహేంద్రవరంలో రాజకీయ విప్లవం జరిగింది. క్రీ.శ. 1423 వరకు అనితల్లి, వీరభద్రారెడ్డి శాసనాలు కనిపించవు. అల్లాడరెడ్డి చివరి శాసనం క్రీ.శ. 1420 లో ఉంది. క్రీ.శ. 1420-23 మధ్య కాలంలో రాజకీయ విప్లవం జరిగింది. ఈ నాలుగు సంవత్సరాలలో ఒక తామ్రశాసనం[56] మరియొక్క రాతిశాసనం[57] క్రీ.శ 1422 నాటివి. అనవోతారెడ్డి పెద్దసోదరుడైన కుమారగిరి రెడ్డితో కలిసి రాజమహేంద్రవరాన్ని పరిపాలించాడు. కొమ్మచిక్కాల శాసనం[58] ఈ విషయాన్ని సూచిస్తున్నది.

కాని కోస్తా ఆంధ్రలోని అన్ని కైఫీయత్‌లు క్రీ.శ.1420 నాటికి లాంగూల గజపతి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించినట్లు పేర్కొనుచున్నాయి. ఈ సమయంలో రాజమహేంద్రవరంలో రాజకీయ విప్లవం జరుగుతుంది. బహుశ ఇతని సహాయంతోనే మూడవ కుమారగిరి, మూడవ అనవోతారెడ్డి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించి అతనికి సామంతులై ఉంటారు.

అయితే క్రీ.శ 1422 నాటికి మూడవ కుమారగిరిరెడ్డి మరణించినట్లు అతని పేర అనవ్రోల - కుమారగిరి తెలియజేస్తున్నది. ఈ లోగ వేమ, వీరభద్రారెడ్లు కళింగాధిపతులతో సమాధానం కుదుర్చుకొన్నారు. వారి సహాయంతో మూడవ అనవోతారెడ్డిని ఓడించి తమ రాజ్యంలో కొంత భాగాన్ని గజపతులకు ఇచ్చి రాజమహేంద్రవరాన్ని పునరాక్రమించి ఉంటారు.

## 4.5 వీరభద్రారెడ్డి (క్రీ.శ. 1423-28) :

కాశీఖండం, శివలీల విలాసం వేమ తన చిన్న సోదరుడైన వీరభద్రారెడ్డిని సింహాసనం ఎక్కించాడని తెలుపుతున్నాయి. కాని రాజ్యపాలన అంతా వేమ నిర్వహించాడు. కాని వీరి పాలన ఎంతో కాలం ప్రశాంతంగా ఉండలేదు. విజయనగర రాజులు, గజపతులు, పద్మనాయకులు రాజమహేంద్రవరం పై దాడులు సాగించారు. కొండవీడు కైఫీయత్ అనుసరించి విజయనగర రాజులు గజపతులపై దండయాత్ర చేసారు. తీరాంధ్రంలో గజపతుల అధికారం తుదముట్టించి తమ అధికారాన్ని నెలకొల్పడమే రెండవ దేవరాయ లక్ష్యంగా ఉంది. క్రీ.శ. 1424 నాటికి కొండవీటిరెడ్డి రాజ్యంలో అధిక భాగం విజయనగర రాజులు ఆక్రమించారు. రెండవ దేవరాయల సామంతుడైన తెలుంగు రాయల శాసనం సింహాచలంలో ఉంది. అంటే రెండవ దేవరాయలు తీరాధ్రంపై దండయాత్ర చేసినట్లు తెలుస్తున్నది. ఈ దండయాత్రలో దేవరకొండ పాలకుడు లింగమనీడు, తెలుంగు రాయలు రెండవ దేవరాయలకు సహాయం చేసారు. రెండవ దేవరాయల ముడబిదురె శాసనం రెండవ దేవరాయలు గజపతిని, వీరభద్రారెడ్డిని ఓడించినట్లు పేర్కొంటున్నది. దీన్ని బట్టి రెండవ దేవరాయలు తీరాంధ్రం నుండి గజపతులను పారద్రోలి రాజమహేంద్రవరరెడ్డి రాజులను సామంతులుగా చేసుకొన్నట్లు తెలియుచున్నది. అయితే

క్రీ.శ.1430 నాటి వేమ, వీరభద్రారెడ్డి శాసనాలు సింహాచలంలో కనిపిస్తున్నాయి. దీన్నిబట్టి వారు దక్షిణ కళింగను తిరిగి ఆక్రమించటంతో సింహచలం పర్యంతం వారి అధికారం సాగినట్లు తెలుస్తున్నది.

క్రీ.శ. 1434-35 సంవత్సరంలో కళింగలో జరిగిన రాజకీయ విప్లవం రాజమహేంద్రవర రాజ్యాన్ని ప్రభావితంజేసి ప్రమాదకరంగా పరిణమించింది. కళింగ గాంగులను పదవీచ్యుతులనుజేసి సూర్యవంశజుడైన కపిలేశ్వర గజపతి కళింగ సింహాసనాన్ని ఆక్రమించాడు. కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవరరెడ్డి రాజ్యాన్ని ఆక్రమించడానికి పూనుకోవడంతో రాజమహేంద్రవరం విజయనగర రాజులకు గజపతులకు మధ్య యుద్ధరంగమైంది. రెండవ దేవరాయలు క్రీ.శ. 1434 లో రెడ్డి రాజులకు సహాయంగా కపిలేశ్వర గజపతిపై దండయాత్ర పంపాడు. ఈ దండయాత్రకు మల్లపబిడయార్ నాయకత్వం వహించాడు. గజపతులు తిరోగమనం చెందినారు. క్రీ.శ. 1446 లో రెండవ దేవరాయలు మరణించడంతో విజయనగర రాజ్యపరిస్థితులు అస్తవ్యస్తమయ్యాయి. ఈ సమయంలో కపిలేశ్వరగజపతి, దేవరకొండ లింగమనీడు కలసి రాజమహేంద్రవరం పై దండెత్తి వేమ, వీరభద్రలను ఓడించి రాజమహేంద్రవరం ఆక్రమించాడు. క్రీ.శ. 1448 నాటి పెనుగొండ (తూర్పు గోదావరి జిల్లా) శాసనం కపిలేశ్వరగజపతిని పేర్కొనడంతో రాజమహేంద్రవరరెడ్డి రాజ్యం ఆ సరికి అస్తమించిందని తెలుస్తున్నది.

## 4.6 సారాంశము :

అనవేమారెడ్డి కాలం నాటికి రాజమహేంద్రవరం దాకా కొండవీటి రెడ్డి రాజ్యం విస్తరించింది. కాటయవేముడు, రెండో కుమారగిరి, మూడో కుమారగిరి, మూడో అనవోతారెడ్డి, వీరభద్రారెడ్డి పాలనలో సాగి చివరికి కపిలేశ్వర గజపతి వీరభద్రారెడ్డిని ఓడించడంతో రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం అంతమయింది.

- ఎం. సోమశేఖర రావు.

పాఠం - 5

# రెడ్డి యుగ విశేషాలు

## 5.0. లక్ష్యం :

ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ స్థానం కలిగిన రెడ్డిరాజుల కాలంలో పాలన, ఆర్థిక, న్యాయ, సైనిక, కళారంగాల్లో జరిగిన అభివృద్ధిని తెలియపరచటం ఈ పాఠ్యాంశ లక్ష్యం.

## విషయక్రమం :

5.1 పరిచయం

5.2 పరిపాలనా విధానము

5.3 ఆదాయము

5.4 న్యాయవిధానము

5.5 సైనిక పాలన - యుద్ధాలు

5.6 సాంఘిక పరిస్థితులు

5.7 ఆర్థిక పరిస్థితులు

5.8 పరిశ్రమ - వర్తక వాణిజ్యాలు

5.9 మత పరిస్థితులు

5.10 విద్యలు - సారస్వతం

5.11 సంస్కృత సాహిత్యం

5.12 తెలుగు సాహిత్యం

5.13 కళలు

5.13.1 సంగీత నాట్యాలు

5.13.2 వాస్తు, చిత్రలేఖనం

5.14 సారాంశము

## 5.1 పరిచయం :

దక్షిణ భారతదేశ చరిత్రలో ముఖ్యంగా ఆంధ్రదేశ చరిత్రలో రెడ్డి రాజుల పాలనాకాలం ఒక ముఖ్యమైన ఘట్టం. కాకతీయులకు వారసులుగా సింహాచలం నుండి నెల్లూరు మధ్యస్త తీరాంధ్ర ప్రాంతాన్ని పరిపాలించారు. కాకతీయులవలె తెలుగు భాషా సంస్కృతులకు చక్కటి రూపురేఖలను దిద్దారు. కానీ కాకతీయులు సాధించిన రాజకీయ ఐక్యతను ఆంధ్రదేశానికి ప్రసాదించలేక పోయారు. తీరాంధ్ర ప్రాంతం రెడ్డి రాజుల అధీనం కాగా, రాయలసీమలో అధికభాగం విజయనగర రాజులు ఆక్రమించారు. ఓరుగల్లులో ముసునూరి నాయక రాజ్యం, రాయకొండ, దేవర కొండల్లో పద్మనాయక రాజ్యాలు ఏర్పడ్డాయి.

## 5.2 పరిపాలనా విధానం :

రెడ్డి రాజుల కాలంనాటి శాసనాలు వారి పరిపాలనా విధానం గురించి ఎటువంటి అంశాలను పేర్కొనలేదు. కానీ నాటి నీతి శాస్త్రాలుగా ప్రసిద్ధికెక్కిన సకలనీతి సమ్మతము, రుక్మాంగద చరిత్రము రెడ్డి రాజుల పరిపాలనా విధానాన్ని గురించి తెలియజేస్తున్నాయి. ఈ కాలంలో సాంప్రదాయిక పరిపాలనా విధానమే అమలు జరిగింది. రాచరికము వంశ పారంపర్యము. కొడుకులు లేనపుడు తమ్ముని యువరాజుగా నియమిస్తుండేవారు. వైదిక ధర్మాన్ని రక్షించడం, వర్ణవ్యవస్థను కాపాడటం, హేమాద్రి సూచించిన దానాలు, వ్రతాలు చేయడం రాజులకు ఆదర్శాలు.

రాజ్యానికి అత్యున్నత అధికారి రాజు. ఇతడే పరమోన్నత కార్య నిర్వహణాధికారి. ధర్మశాస్త్రాలలో చెప్పిన సూత్రాల ననుసరించి రాజు రాజ్యపాలన చేయవలెను. రాజ్యపాలనలో విధిగా మంత్రి మండలి సలహాలను తీసుకొనవలెను. ముఖ్య మంత్రిని ప్రధాని అని వ్యవహరించేవారు. మంత్రులుగా బ్రాహ్మణులనే నియమించవలెనని నాటి నీతి శాస్త్రాలు వివరిస్తున్నాయి. రెడ్డి రాజులు మంత్రులు గా బ్రాహ్మణులనే నియమించారు. రామప్రగ్గడ, మల్లినాథలు ప్రోలయ వేమారెడ్డి మంత్రులు. అనవోతారెడ్డి, సోమయ, మల్లినాధలను మంత్రులుగా నియమించాడు. పెదకోమటి మంత్రి మామిడి సింగయ, కుమారగిరి రెడ్డి మాత్రమే మంత్రిగా తన బావమరిది కాటయ వేమారెడ్డిని నియమించాడు.

మంత్రి మండలిలో ప్రధానికాక పురోహిత, సేనాపతి మొదలగు వారు రాజుకు సలహాలు ఇచ్చి తోడ్పడేవారు. మంత్రి మండలి సలహాలను త్రోసిపుచ్చే అధికారం రాజుకుంది. రాజుమాటే శాసనం. ప్రభుత్వ యంత్రాంగంలో రాజు తరువాత యువరాజుకు ప్రత్యేకస్థానం ఉండేది. నాటి నీతి శాస్త్రాలు మంత్రి, యువరాజులు రాజుకు రెండు చేతులని వర్ణిస్తున్నాయి.[59] యువరాజులు ముఖ్య సైన్యాధిపతులుగా ఉండేవారు. ప్రోలయ వేమారెడ్డి కాలంలో యువరాజు అనవోత[60] ; కుమారగిరి రెడ్డి కాలంలో యువరాజు రెండవ అనవోత ; పెదకోమటి వేమారెడ్డి కాలంలో యువరాజు రాచవేముడు.

కవిత సంప్రతులు, రాయసగాండ్రు (లేఖకులు) మొదలగు వారు కేంద్రప్రభుత్వంలో ప్రధాన ఉద్యోగులు. కేంద్ర ప్రభుత్వము తన పాలనాంశాలను వివిధ శాఖలు ద్వారా నిర్వర్తిస్తుండేది. పౌరపాలనా శాఖ, సైనిక శాఖ, భూశిస్తు శాఖ మొదలైనవి వాటిలో ముఖ్యమైనవి.

## 5.3 ఆదాయము :

రెడ్డి రాజ్యంలో అనేక మార్గాలలో రాజ్యానికి ఆదాయం వచ్చేది. భూమిశిస్తు, పరిశ్రమలు, వాణిజ్యము, వృత్తి, రేవులు, వివిధ రకాల అడవులు మొదలగు వాటిపై పన్నులు ఆదాయ మార్గాలు. భూమిశిస్తు ప్రధాన ఆదాయం. పన్నులు ధాన్యాదాయ, సువర్ణాదాయ అను రెండు రూపాలలో వసూలు చేసేవారు. ప్రోలయ నాయక విలస శాసనం[61] నుండి పంటలో ఆరోవంతు పన్నుగా వసూలు చేసినట్లు తెలుస్తున్నది. రాచ వూళ్ళను వ్యక్తులకు కవులుకిచ్చే వారు. కవులుసొమ్ము సాధారణంగా ధనరూపంలో (సువర్ణాదాయ) చెల్లించేవారని ప్రోలయ వేమ చీమకుర్తి శాసనం[62] వలన తెలుస్తున్నది. కవులు సొమ్మును చెల్లించని వారిని కఠినంగా శిక్షిస్తూండేవారు. శ్రీనాథుడు

తనకిచ్చిన బొడ్డుపల్లి గ్రామంతాలూకు కౌలుధనం నది నీరందక పంటపండక పోయినా 700 టంకాలు కట్టవలసిన స్థితిని వర్ణించాడు. దేవబ్రాహ్మణ మాన్యాలపై పన్ను మినహాయింపు వుండేది. మొత్తం మీద ప్రజలపై పన్నుల భారం అధికంగా ఉండేది.

## 5.4 న్యాయవిధానం :

రెడ్డిరాజుల శాసనాలు గాని, వారి కాలం నాటి సమకాలీన సాహిత్యం కానీ న్యాయ విచారణా విధానం గురించి సమగ్రమైన సమాచారం అందించడంలేదు. కాని సమకాలీన సాహిత్యం కొంత సమాచారం అందిస్తున్నది.

న్యాయనిర్వహణ, దోషులను శిక్షించడం రాజు యొక్క విధి. రాజు తన మంత్రుల సహాయంతో న్యాయ నిర్వహణ చేసేవాడు. న్యాయ నిర్వహణకు ధర్మాసనాలు ఏర్పాటు చేయబడ్డాయి. దీనిలోని సభ్యులను ధర్మసభాజనులు అని వ్యవహరించేవారు.[63] రాజ మహేంద్ర వరంలోని ధర్మాసనాన్ని శ్రీనాథుని చాటు పద్యం పేర్కొంటున్నది. ప్రత్యేక నేరాలను విచారించడానికి తాత్కాలిక ధర్మాసనాలు ఏర్పరచేవారు.[64] తప్పు సాక్ష్యాలు చెప్పే కూట సాక్షులను ప్రౌఢకవి మల్లన తన గ్రంథంలో పేర్కొన్నాడు.[65]

సింహాసన ద్వాంత్రింశిక, భోజరాజీయం మొదలగు గ్రంథాలు మడ్డు పట్టుట[66] వంటి దివ్య పరీక్షల ద్వారా నేర నిరూపణ జరిగేదని పేర్కొంటున్నవి. ముస్లింలు కూడా ఇటువంటి దివ్య పరీక్షలను అంగీకరించి అమలు చేసారు.[67] నేర పరిశోధనకు గ్రామస్థాయి నుండే పటిష్టమైన పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేసేవారు. కోట కైఫీయత్ నుండి అచ్చు, కావలి, వెలికావలి అను పోలీసు ఉద్యోగులను అన వేమారెడ్డి నియమించినట్లు తెలుస్తున్నది.[68]

క్రిమినల్ నేరాలకు శిక్షలు చాలా కఠినంగా ఉన్నట్లు భోజరాజీయం ద్వారా తెలుస్తున్నది. శిరచ్ఛేదనం, అంగచ్ఛేదం, గానుగలలో పెట్టి తిప్పడం మొదలగు క్రూరమైన శిక్షలు విధించే వారు. సివిల్ నేరాలకు విధించిన శిక్షలను "రుక్మాంగద చరిత్రం" వర్ణిస్తున్నది. ఒంటిపై వెంటి చుట్టి నిప్పంటించడం, ఎండలో నిలబెట్టి పొగడదండలు వేయడం, వీపుపై ఇనుప గుండ్లు ఎత్తించడం, ముక్కుకు నీత్తడం వంటివి సివిల్ నేరాలకు శిక్షలు. బ్రాహ్మణునకు ఉరిశిక్ష లేదు. అందుకు బదులు ముఖంపై కుక్క పాదం అచ్చొత్తి, గాడిద మీద ఊరేగించి గ్రామం నుండి బహిష్కరించేవారు. శ్రీనాథుడంతటి మహాకవి తన చివరిరోజుల్లో 700 టంకాలు శిస్తు కట్టకపోవడంతో పై చెప్పిన శిక్షలను అనుభవించినట్లు తనచాటు పద్యాలతో చెప్పుకొన్నాడు.

పరిపాలనా సౌలభ్యంకోసం రాజ్యాన్ని భూమి, సీమ, నాడు, స్థల మరియు గ్రామంఅనే ప్రదేశిక విభాగాలుగా విభజించారు. నాడు, స్థల అను ప్రాదేశిక విభాగాలు రెడ్డి రాజులకు పూర్వం నుండే అమలులో వున్నాయి. సీమ విభాగము రెడ్డి రాజుల రూపకల్పన. రెడ్డి రాజుల పాలనా కాలంలో సీమ ముఖ్యమైన విభాగంగా వుండి సీమకు దుర్గం కేంద్రంగా ఉండేది. ప్రతి సీమలోను కొన్ని నాయంకరాలు ఉండేవి. ఒకటి లేక రెండు సీమలు కలిపిన ప్రాదేశిక విభాగము భూమి. కొండవీటి రెడ్డి రాజులు శాసనాలు కోటిభూమి, శ్రీశైల భూమి మొదలగు విభాగాలను తెలియజేస్తున్నాయి. కొండవీటి దండకావిలె, కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ మొదలగు దుర్గాల పేర్లను, కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ, అద్దంకి, ఉదయగిరి, కందుకూరు, అమ్మనబ్రోలు, తంగెడ, నాగార్జున కొండ, కోట, నెల్లూరు, పొదిలి, దూపాడు మొదలగు సీమల పేర్లను పేర్కొంటున్నది. గవర్నర్లు, సామంతులు, ఉన్నత అధికారులు ప్రాదేశిక విభాగాల అధిపతులుగా ఉండేవారు.

పరిపాలనకు పునాది గ్రామం. గ్రామ వ్యవహారాలను 12 మంది ఆయగాండ్రు చూసేవారు. వారికి జీతాలుగా మాన్యాలు ఇచ్చేవారు. వీరిలో రెడ్డి, కరణం, తలారి, పురోహిత, బారికాపు మొదలగు వారు ముఖ్యులు. గ్రామానికి ముఖ్యాధికారి రెడ్డి. ఇతడిని గ్రామ కూట అని కూడ వ్యవహరించే వారు. ప్రతిగ్రామం స్వయం ప్రతిపత్తి కలిగి చిన్న చిన్న గణతంత్ర రాజ్యాలుగా ఉండేవి.

## 5.5 సైనిక పాలన - యుద్ధాలు

రెడ్డి రాజులు గజ, తురగ బలాలను, సైనికులను (కాల్బలం) యుద్ధాలలో ఉపయోగించారు. రాజుల మధ్య పరస్పర యుద్ధాలు నాటి రాజకీయాల ప్రధాన లక్ష్యం. రాజ్యాదాయంలో ఎక్కువ భాగం సైనిక పోషణకు వెచ్చించేవారు. కాల్బలంలో సెలగోల బలము, విలుకాండ్రుకై జీతగాండ్రు, ఎక్కట్లు అను నాలుగు విభాగాలుండేవి. సాంప్రదాయ ఆయుధాలనే ఉపయోగించారు. తుపాకి వాడిన దాఖలాలు ఉన్నాయి. బ్రాహ్మణుల నుండి శూద్రకులముల వారి వరకు అందరినీ సైనికులుగా చేర్చుకొనే వారు. సైనికులను చేర్చుకోవడానికి ప్రత్యేక అధికారులు ఉండేవారు. యుద్ధాలలో దుర్గాలు కీలకమైన పాత్ర వహించాయి. రెడ్డి రాజ్యంలో రాజమహేంద్రవరం, నిడదవోలు మొదలగునవి స్థలదుర్గాలు. కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ, నాగార్జున కొండ మొదలగునవి గిరి దుర్గాలు. అన వేమారెడ్డి స్థలదుర్గాలను, జల దుర్గాలను బద్దలు కొట్టడంలో ఆరితేరిన వాడని అతనికి గల బిరుదుల వలన తెలుస్తున్నది. యుద్ధాలలో సాహస కృత్యాలను ప్రదర్శించిన వారికి గౌరవ బిరుదులు ఇచ్చేవారు. అటువంటి సాహసీకులైన సైనికులను బిరుదుపడగలు అని వ్యవహరించేవారు.

యుద్ధ నిర్వహణలో పైశాచిక క్రూరత్వం ప్రదర్శించేవారు. శత్రుసైన్యాలు నడిచే మార్గంలో నీటి వనరులలో విషం కలిపేవారని మడికి సింగన 'సకల నీతి సమ్మతంలో' సూచించాడు. ఓడిపోయిన వారి విషయంలో విజయం సాధించిన వారు కొన్ని విచిత్రమైన అవమానకర పద్ధతులను ఉపయోగించేవారు. ఓడినవారి బొమ్మను తయారుచేయించి గండపెండేరములోగాని, తమ్మపడగలో గాని అమర్చి అవమానించేవారని వెలుగోటివారి వంశావళి తెలుపుచున్నది. దీనిని బొమ్మ పెట్టుట అంటారు. క్రీ.శ. 1357 నాటి సింహాచలంలోని ఒడ్డాది రాజయిన అర్జున దేవుడు తన 12 మంది శత్రువులను ఓడించి వారి బొమ్మలను తన గండపెండేరము మీద అమర్చాడని తెలుపుచున్నది. వెలుగోటి వారి వంశావళి "రణముకుడుపు" అను మరొక క్రూరమైన ఆచారాన్ని తెలుపుచున్నది. మృతులైన వారి రక్తమాంసాలతో బియ్యం కలిపి వండిన వంటకాన్ని రణ దేవతలకు, భూతప్రేత, పిశాచాలకు నివేదన చేయడమే "రణముకుడుపు" రేచర్ల పద్మనాయక వంశానికి చెందిన ప్రతిఒక్కరూ విజయం సాధించిన తరువాత ఈ ఆచారాన్ని అనుకరించారని తెలుస్తున్నది. యుద్ధ సమయాలలో ప్రజలు పడ్డ బాధలు వర్ణనాతీతం.

## 5.6 సాంఘిక పరిస్థితులు :

ఈ కాలంలో భక్తిదాయకమైన హిందూ మతం రూపొంది సమాజిక ఐక్యతకు ప్రయత్నం జరిగింది. చాతుర్వర్ణ వ్యవస్థ కొనసాగింది. కానీ వర్ణవిభేదాలు ఆ ఐక్యతకు ప్రతికూలమయ్యాయి. వర్ణాల సంఖ్య పెరిగింది. బ్రాహ్మణుల గౌరవ ప్రతిపత్తులు కొనసాగాయి. కానీ పూర్వపు వైదిక కర్మలే ప్రధాన వృత్తిగా వున్న బ్రహ్మణ వర్ణం అంతర్థానమయింది. బ్రాహ్మణులలో చాలామంది సైన్యంలోనూ, ఉద్యోగులు గానూ, రాజస్థానాలలో చేరారు. కొందరు వ్యవసాయ వృత్తిని అవలంబించారు. బ్రాహ్మణవర్గంలో అనేకమంది స్మార్త మతాన్ని, శైవ, వైష్ణవ మతాలను అనుకరించారు. వైదిక, నియోగి విభేదాలు ఈ కాలంలో బలపడ్డాయి. వైదిక బ్రాహ్మణులు వేదశాస్త్రాలను, పురాణ ఇతిహాసాలను అభ్యసించి అధ్యాపన జరిపేవారు. కొందరు అవధానాలు చేసేవారు. మరికొందరు తర్క, శబ్ద, వ్యాకరణ, షడ్దర్శనాలు, జ్యోతిష, గణిత, ఆగమ శాస్త్రాలలో పాండిత్యం సాధించారు. ఈ కాలపు రాజులు యజుర్వేద బ్రాహ్మణులను ఎక్కువ ఆదరించినట్లు వారిచ్చిన దాన శాసనాల ద్వారా తెలుస్తున్నది.

క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు పూర్వంలాగానే బ్రాహ్మణులను మత గురువులుగా ఆదరించి వారి దగ్గర సకల విద్యలు అభ్యసించారు. క్షత్రియులలో వాత్సవాయులు, తెలుగు చోడులు, వేంగి చాళుక్యులు ఎలమంచలి చాళుక్యులు, సురవర పట్టణ ఉండి రాజులు మొదలగు కుటుంబాలు ఈ కాలంలో కనిపిస్తారు. క్షత్రియులు రాజ్యాలు పోగొట్టుకొని నామమాత్రులయినారు. చాలా మంది క్షత్రియులు విజయనగరం వలస వెళ్ళి విజయనగర రాజుల కొలువులో చేరారు. వైశ్యులకు వ్యాపార వాణిజ్యాలు ముఖ్య వృత్తులు. కొందరు సైన్యంలో చేరి ప్రముఖ వ్యక్తులుగా రాజాభిమానం పొందారు. విదేశ వాణిజ్యాల ద్వారా బహుధనార్జన చేసిన వైశ్యులు

పెనుగొండ, కొండవీడు, వినుకొండలలో నివసించేవారు. వారిలో కొండవీడుకు చెందిన అవచికుటుంబం చెప్పుకోదగినది. అవచి కుటుంబము వారు రెడ్డి రాజులకు అనేక సేవలందించి వారినుండి గౌరవం పొందారు.

అవచిసెట్టి రెడ్డి రాజు వేమారెడ్డికి శ్రీశైలం, పాతాళగంగ వద్ద సోపానాలు నిర్మించడానికి, సైన్యసమీకరణకు ధనాన్ని ఋణంగా ఇచ్చాడు. ఈ కాలంలో తయారయిన "వైశ్య వంశ సుధాకరం" వైశ్యులను గూర్చి అనేక విషయాలు తెలియజేస్తున్నది. శూద్రులలో రెడ్డి, వెలమ, కమ్మ మొదలగు కులాలు ఏర్పడినాయి. వ్యవసాయం, సైనిక వృత్తి వారి ప్రధాన వృత్తులు. ఈ కాలంలో రాజకీయ అధికారం శూద్రులపరమైనది. ఈ కాలం నాటి చతుర్థాన్వయులు అనేక సాహసకృత్యాలు యుద్ధాలలో చేసి ప్రముఖ సైన్యాధిపతులుగాను, ఉన్నతోద్యుగులు గాను పేరు పొందారు. కాటయ వేమారెడ్డి దేవనూరి కుటుంబము, కొప్పునూళ్ళవారు, సైసాలవారు చెప్పుకోదగిన వారు. వీరు కాక చండాలురు లేక అంటరాని వారు గ్రామాల బయట నివసించేవారు. అగ్రహారాలలోకి, దేవాలయాలలోకి వీరికి ప్రవేశం లేదు. కానీ వీరికి అన్నదానం చేయడం పుణ్యకార్యంగా తలచేవారు.

ఈ కాలంలో వేశ్యలు సంఘంలో ప్రాముఖ్యత కలిగివున్నారు. వీరు సంగీత, నాట్యాలకు ధర్మకర్తలు లాంటివారు. బ్రాహ్మణులనుండి సంగీత నాట్యాలను నేర్చుకొని ఆ విద్యలందు ప్రావీణ్యం సంపాదించ కలిగారు. ధనిక వేశ్యలు రాజాస్థానాలలో ఆదరణ పొంది సంఘంలోను, రాజ్య పరిపాలనలోను ప్రముఖ పాత్ర నిర్వహించేవారు. భార్యతోపాటు ఒక వేశ్యను, వుంచుకోవడం ఆనాటి సంఘంలో అగౌరవంగా పరిగణింపబడేది కాదు. రేవు పట్టణ ప్రాంతాలలో అరబ్, మూర్ జాతికి చెందిన ముస్లింలు నివశిస్తుండేవారు.

బ్రాహ్మణ, ప్రభువర్గాలలో మాత్రమే విద్యావ్యాప్తి జరిగింది. రాజాస్థానాలు, అగ్రహారాలు విద్యాకేంద్రాలుగా వుండి బ్రాహ్మణులు విద్య నేర్పుతూండేవారు. వైష్ణవ ప్రచారం వలన కింది వర్ణాలలో విద్యపట్ల ఆసక్తి పెరిగింది. శకునాల పట్ల నమ్మకం పెరిగింది. పంచాంగం చూసికానీ ఏ పనీ ప్రారంభించేవారు కాదు. పత్రాలపై వడ్డీకిచ్చే ఆచారం, బ్రాహ్మణులు వడ్డీ వ్యాపారం చేయడం మొదలగునవి ఈ కాలంలో కన్పిస్తాయి. వర్తకంలో, వడ్డీ వ్యాపారంలో జరుగుతున్న మోసాలు సమకాలీన సాహిత్యం పేర్కొంటున్నది. జాతరలలో తిరునాళ్ళలో యువతీ యువకులు విశృంఖలంగా విహరించేవారు.

## 5.7 ఆర్థిక పరిస్థితులు :

నిరంతరం యుద్ధాల వలన ఆర్థిక పరిస్థితి అంత బాగాలేదని చెప్పవచ్చు. వృత్తి సంఘాల, సమయాల, సంతల ప్రసక్తి ఈ యుగంలో ఎక్కువగా కనిపించవు. వ్యవసాయం ప్రధాన వృత్తి. వైశ్య, శూద్రులే కాక బ్రాహ్మణులు కూడా వ్యవసాయం చేయడం గమనిస్తాము. ఈ యుగంలో అనేక భూములు సాగులోకి తీసుకురాబడ్డాయి. భూములను వెలిపొలము, నీరునేల, తోట భూమి అను మూడు రకాలుగా వర్గీకరించినారు. పొలాన్ని కొలవడానికి 'కేసరి పాటిగడ' ను ఉపయోగించేవారు. "సింహాసన ద్వాత్రింశిక" రెడ్డి రాజుల కాలం నాటి నీటిపారుదల సౌకర్యాలను పేర్కొంటున్నది. కాలువలు, బావులు, చెరువులు, పాయలు, కోళ్ళు మొదలగునవి చెరువులు త్రవ్వించడం సప్త సంతానాలలో ఒకటిగా భావించేవారు. పెదకోమటి వేమారెడ్డి భార్య సూరాంబిక సంతాన సాగర తటాకాన్ని నిర్మించింది. పెదకోమటి కొడుకు రాచవేమ జగనొబ్బ గండకాలువను త్రవ్వించాడు. వెలమలు అనపోతు సముద్రం, రాయ సముద్రం, నాగసముద్రం మొదలగు తటకాలు నిర్మించారు. బావులు, చెరువులు బాగు చేయించటానికి నిమిత్తం దశబంధ మాన్యాలు ఉన్నాయి. ఏతము, కపిల, రాట్నము మొదలగు వాటి ద్వారా పొలాలకు నీటి పారుదలగావించే వారు. తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం ప్రాంతంలో రెడ్డిరాజుల కాలంనాటి దిగుడు బావులు ఇప్పటికీ ఉన్నాయి.

వరి, జొన్న, సజ్జ, చెఱకు, నువ్వులు, ప్రత్తి, మిరప నాటి ముఖ్యమైన పంటలు. శ్రీనాథుని హరవిలాసం, భీమేశ్వర పురాణం కలమశాలి, సిరాముఖి, పతంగ, హాయన మొదలగు వరిలోగల పలురకాలను పేర్కొంటున్నాయి. పలు ప్రాంతాల్లో అరటి, కొబ్బరి, వక్క, మామిడి, అనాస, ద్రాక్ష తోటల పెంపకం బాగా ఉండేది. అనంతా మాత్యుని 'భోజ రాజకీయం' అనుసరించి పోడు వ్యవసాయం కూడా జరిగేదని, పొట్టి కందులు, చిక్కుళ్ళు అందులో పండించేవారని తెలుస్తున్నది.

## 5.8 పరిశ్రమలు - వర్తక వాణిజ్యాలు :

వ్యవసాయం ప్రధాన పరిశ్రమ అయిననూ అనేక ఇతర పరిశ్రమలకు గ్రామమే పునాది అయింది. నగల పరిశ్రమ, పంచలోహాలతో వస్తువుల తయారీ, ఇనుము, ఉక్కు పరిశ్రమ, దారు పరిశ్రమ, దంతపరిశ్రమ, వజ్రపరిశ్రమ, ఉప్పు పరిశ్రమ నాటి ముఖ్యమైన పరిశ్రమలు. వస్త్ర పరిశ్రమకు పలనాడు, వినుకొండ ముఖ్యకేంద్రాలుగా వుండేవి. వస్త్ర పరిశ్రమలో నైపుణ్యం సాధించారు. ప్రతి ఇంటిలో స్త్రీలు రాట్నం వడికేవారు. "రంభయైన ఏకులు వడకున్" అని శ్రీనాథుడు తన చాటు పద్యంలో చెప్పాడు. ఇక్కడ తయారయిన నేత వస్త్రములు విదేశీ యాత్రికుల మన్ననలు సైతం అందుకున్నవి. మడికి సింగన తన పోషకుడు ముప్పరాజు ధరించే తెల్లని వస్త్రాలు చంద్ర కాంతివలె తెల్లగా ఉన్నాయని వర్ణించాడు. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా అద్దకము, రంగు పరిశ్రమ సాగింది. తమ కావ్యాలలో తెలుగు కవులు జక్కన, శ్రీనాథులు తెలుపు, రంగు సన్ననినూలు వస్త్రాలను ప్రస్తావించారు. సూరవరము, భీమవరము గ్రామాలలో తయారయే వస్త్రాలు బహు ప్రసిద్ధి చెంది ఉన్నాయి. ప్రతి గ్రామంలో నీలిమందు తయారు చేసేవారు. సింహాసన ద్వాత్రింశిక వెలిపట్టు, నీలిపట్టు, పులి గోరు పట్టు, నేత్రపట్టు, వజ్రపట్టు మొదలగు రకరకాల పట్టుబట్టలను పేర్కొంటున్నది.

పంచాణం వారు పంచలోహాలతో కొలువుచవికెలు, గజఘంటలు, దీపస్తంభాలు, జయస్తంభాలు, ఆయుధాలు తయారుచేసేవారు. విశ్వబ్రాహ్మణులు, బంగారం, వెండిలోహాలతో వివిధ రకాలైన వస్తువులు తయారు చేయడంలో చాలా ప్రావీణ్యం గడించారు. తమ్మె పడగలు, బొమ్మలు, పూలతొట్టెలు, పళ్ళాలు మొదలగు గృహ, దేవాలయ అవసర వస్తువులు తయారు చేసేవారు. ఉక్కు తయారీలో నాటి కమ్మరులు సిద్ధ హస్తులు. నిర్మల్ ఉక్కుకత్తులు దేశాంతరాలలో ప్రసిద్ధి చెందాయి. గాజురెక్కల తలుపులు, అద్దాలు కూడా నాటి సాహిత్యంలో ప్రస్తావన ఉంది. శ్రీనాధుడు కాగితాన్ని పేర్కొన్నాడు. కాగితాన్ని ముస్లింలు ప్రవేశపెట్టివుంటారు. దారు పరిశ్రమ కూడా ప్రసిద్ధి కెక్కింది. చెక్కతోటి అనేకరకాల సామాగ్రి చేసేవారు. పట్టె మంచం, సకినల మంచం, దోమతెర మంచం, గంటల ఉయ్యాల మొదలగునవి నాటి సాహిత్యంలో కనపడుతున్నాయి. ఉత్సవాలలో ఊరేగింపులకు రథాల తయారీ ముఖ్యమైన వడ్రంగ పరిశ్రమగా వుంది. రుక్మాంగద చరిత్ర దంతపు వస్తువుల తయారీని పేర్కొంటున్నది.

దేశీయ, విదేశి వాణిజ్యం, వైశ్య, తెలిక, బలిజ కులాలు నిర్వహించేవి. దేశీయ వాణిజ్యానికి ముఖ్యంగా రాజధాని నగరాలు, పుణ్యక్షేత్రాలు కేంద్రాలుగా వుండేవి. కందుకూరు, అద్దంకి, కొండవీడులను కలుపుతూ రహదారి మార్గాలుండేవి. కేతన తన "ఆంధ్ర భాషా భూషణం"లో అయోధ్య నుండి కంచికి మార్గము నెల్లూరు వరంగల్ ద్వారా వుందని పేర్కొన్నాడు. కృష్ణా, గోదావరి నదులు వర్తక, వాణిజ్యాలకు మార్గాలుగావుండేవి. కళ్యాణ మహోత్సవాలు, వసంతోత్సవాలు, సమయాలలో క్రయ, విక్రయాలు ఎక్కువగా జరిగేవి.

విదేశి వాణిజ్యం మోటుపల్లి కేంద్రంగా సాగింది. ప్రోలయ వేమారెడ్డి తన అధికార స్థాపన తరువాత మోటుపల్లిలో ఓడ దొంగల బెడద లేకుండా చేసాడు. అనవోతా రెడ్డి మోటుపల్లి రేవును జీర్ణోద్ధరణ చేసి పూర్వవైభవ స్థితికి తెచ్చాడు. మోటుపల్లిలో అనవోతారెడ్డి వర్తకులకు అభయమిస్తూ శాసనం వేయించాడు. ఎగుమతి, దిగుమతుల వస్తువుల పైన సుంకాలను స్థిరీకరించాడు. అపుత్రిక దండం కడ్డాయం మొదలగు పన్నులను రద్దు చేసాడు. విదేశీ వాణిజ్యం ద్వారా అవచి తిప్పయ కుటుంబం అపార ధనమార్జించి తద్వారా రాజకీయ ప్రాబల్యం వహించింది. విదేశీ వాణిజ్యం సాగిస్తున్న వివిధ రకాల నౌకలు పేర్లను సమకాలీన సాహిత్యంలో పేర్కొనబడ్డాయి. కప్పలి, జోంగు, వల్లి, వలికా, సమ్మన్ మొదలగునవి వివిధ రకాల నౌకలు. భారతదేశం చైనాల మధ్య తిరిగిన నౌక జోంగు బహుశ చైనావారి నౌక సమ్మన మలయా ద్వీపకల్పం వైపు సంచరించిన నౌక. హరవిలాసం ఆంధ్రదేశానికి ఇతర దేశాలతో సాగిన వాణిజ్యాన్ని గురించి వివరిస్తున్నది. జాప్నా, చైనా, సింహళం, పంజర (సుమత్రా) మలయా, ఇండోచైనా, భూటాన్, ఆర్మీజ్, గోవా మొదలగు దేశాలనుండి చీనాంబరాలు, సుగంధ ద్రవ్యాలు, కుంకుమ పువ్వు, ఏనుగులు, రత్నాలు, గుర్రాలు, ముత్యాలు, గంధపు చెక్క మొదలగునవి దిగుమతి అవుతూ వుండేవి.

## 5.9 మత పరిస్థితులు :

కాకతీయుల కాలం నాటి మత సాంప్రదాయలు రెడ్డి రాజుల యుగంలో కొనసాగిందని చెప్పవచ్చు. రెడ్డిరాజులు ప్రాయికంగా శైవమతస్థులు. శైవంలో పాశుపత శైవం ప్రజల జీవన విధానం పై అత్యంత ప్రభావం చూపింది. రెడ్డి రాజుల కాలంలో ఆంధ్ర దేశంలో శైవంతో బాటు భక్తి కేంద్రమయిన శాక్తేయ వైష్ణవాలు కూడ ఆదరణ పొందాయి. ముసునూరి, రెడ్డి నాయక రాజుల్లో మొదటి వారు శైవ మతాభిమానులు. రేడ్డి, పద్మనాయక రాజులు చివర్లో వైష్ణవాన్ని అభిమానించారు.

రెడ్డిరాజుల యుగంలో ప్రధమంలో సమన్వయ స్మార్త మత విధానానికి ప్రోత్సాహం లభించింది. ముస్లిం దాడులలో నష్టపడిన అగ్రహార పునరుద్ధరణతో ఈ యుగం ప్రారంభమయింది. ప్రోలయ వేమారెడ్డి శైవుడైననూ వైష్ణవాన్ని ఆదరించాడు. "అన వరత పురోహిత కృతసోమ పాన" అన్న బిరుదు ప్రోలయ వేమారెడ్డికి కలదు.

పాశుపత శైవం వంటి తీవ్రవాద శైవానికి ఈ కాలంలో ఆదరణ హెచ్చింది. శివుని ఉగ్రమూర్తులైన భైరవ, మైలారులను వీరు అర్చించేవారు. "రణము కుడుపు" భైరవ ఆరాధనలోదే. పద్మనాయకులు అనేక భైరవ ప్రతిష్టలు చేసారు. శివాచార్యులు రాజులకు గురువులుగాను, దేవాలయాలలో స్థానపతులుగాను వుండేవారు. శ్రీశైలం, త్రిపురాంతకం, ద్రాక్షారామం మొదలగునవి ముఖ్య పాశుపత శైవ కేంద్రాలుగా భాసిల్లాయి. పాశుపత శైవులు ఆచార సాంప్రదాయంలు, పద్దతులు మొదలగునవి క్రీ.శ 14 వ శతాబ్ధికి చెందిన తర్క రహస్య దీపిక గ్రంథం నుండి గ్రహించవచ్చు.

శైవంలో మరొక శాఖవారు వామాచార సంబంధమైన పూజా విధానం ద్వారా మానవాతీతమైన అష్ట సిద్దులు సాధించవచ్చనే విశ్వాసంతో వుండేవారు. వీరిని సిద్దులు లేక నాథులు అనేవారు. వీరు నాలుగు రకాలైన యోగాలనూ చేస్తూ, కాయ సిద్ధితో సహా అన్ని అష్టసిద్దులు సాధించి వుండేవారు. వీరిని నాథపదంతి యోగులు అని కూడా అంటారు. నాథ గురువులు ఆదినాథ మత్స్యేంధ్ర నాథ, గోరక్షనాథ, చేరంగినాథ, మేఘనాథ, విరూపాక్షనాథ, సిద్ద నాగార్జున, కణిక నాథ మరియు వ్యాలిసిద్ద అను 9 మంది కలరు. మత్స్యేంధ్ర నాథుడు తాంత్రిక శాఖకు సంబంధించి కులాచార విభాగాన్ని ప్రవేశపెట్టడంతో ఈ సిద్ధి శాఖ తాంత్రిక శాఖకు దగ్గరగా వుంటుంది. ఈ నవనాథుల చరిత్రలను ప్రజలు పురాణాలుగా చెప్పుకొనేవారు. గౌరన విరచితమైన నవ నాథ చరిత్ర నాథగురువులు సాహస కృత్యాలను వివరిస్తున్నది. నాగార్జున సిద్దుడు సిద్ద శాఖ ప్రచారానికై అనేక దేశాలు సంచరించాడని, రసవాదంలో ఆరితేరిన వాడని రసయోగ శాస్త్ర నిర్మాత పేర్కొంటున్నది. ఆంధ్రదేశంలో ఈ నాథ గురువులకు సంబంధించిన యోగ శాఖ వ్యాప్తిలోకి రావడంతో వారి సాహసకృత్యాలు, వారికి గల అతీతమైన శక్తులు, మహిమలు తెలుగు సాహిత్యంలో ఉటంకిస్తూ అనేక గ్రంథాలు ఆవిర్భవించాయి. తెలుగు సాహిత్యం ప్రభావితమైంది.

తెలుగు సాహిత్యంలో పేర్కొనబడిన భైరవ చక్ర, భైరవ యోగి, యోగినీ చక్ర మొదలగు పదాలను బట్టి తాంత్రిక శాఖ కూడా ప్రాభల్యంలో ఉందని తెలుస్తుంది. తాంత్రిక శాఖవారు శక్తిని అర్చించేవారు. వీరు పంచమ కారలను అనుసరించే వారు. వీరిని కాలలు అని ఈ సాంప్రదాయాన్ని కులాచారం అని వ్యవహరిస్తారు.

కాలు, చేతులు చివరకు తలలను నరుక్కోవడం, నాల్కలు కత్తిరించుకోవడం, కండలు కోసి అర్పించడం, ఒళ్ళంతా నారసాలు గుచ్చి వెలిగించడం వంటి క్రూరకృత్యాలు ఈ కాలంలో సాగాయి. శివుని ఉగ్రరూపాలైన భైరవ, వీరభద్ర శక్తి రూపాలైన దుర్గ, భద్రకాళి ఆరాధనలు రెడ్డి యుగకాలంలో ప్రజలను ఉత్తేజపరచి దైవం కోసం ఆత్మార్పణ చేసుకోవడం, శైవ భక్తులలోనూ, సామాన్య ప్రజానీకంలోనూ ఎక్కువైంది. భైరవ, వీరభద్ర, కాళీదేవాలయాలు ప్రత్యేకంగా "చంపుడు గుడులుగా" ప్రసిద్దికెక్కినాయి.[70] నాటి కావ్యాల్లో చంపుడు గుడుల ప్రసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. ఆత్మార్పణ చేసుకొంటే స్వర్గానికి లేక దేవుని సన్నిధికి నేరుగా చేరుకుంటామనే వారి భావన ఈ విధానానికి దారి తీసింది. అన్ని దేవాలయాల్లో ఆత్మార్పణ జరపడానికి అవకాశం లేదు కనుక అనవేమారెడ్డి శ్రీశైలంలో వీరశిరో మండపం[71] నిర్మించాడు. కొందరు తలలు నరుక్కొనేవారు. దీనిని గండతల అంటారు. వీరభద్ర, వీరముష్టి, మైలార వీరభట్ట

మొదలగు శైవ శాఖలవారు ఈ విధమైన క్రూరకృత్యాలను ఎక్కువగా జరుపుతూండేవారు. దైవం పేర ఆత్మార్పణ చేసేవారి గౌరవార్థం వారి ప్రతిమలున్న శిలలను నిల్పేవారు. వీటిని వీరకల్ అంటారు. ఈ విధమైన వీరకల్ శిలలు ఆంధ్రదేశంలోని అనేక శైవక్షేత్రాలలో కలవు. కొండశిఖరం నుండి దూకి మరణించడం ద్వారా, రథయాత్ర సమయంలో రథచక్రాల కింద తలపెట్టి మరణించడం ద్వారా మోక్షప్రాప్తి కలుగుతుందని కొందరికి నమ్మకంగా ఉండేది.

శైవంతో బాటు వైష్ణవం కూడా ఈ కాలంలో ఆంధ్ర దేశంలో ప్రాబల్యంలో ఉంది. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, మాచర్ల, శ్రీకాకుళం, అహోబిలం, సర్పవరం, సింహాచలం, శ్రీకూర్మం నాటి ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలు. రెడ్డి రాజులు శ్రీశైలంతో బాటు అహోబిల, సింహాచల క్షేత్రాలకు దానాలు చేసారు. కుమారగిరి, కాటయ వేముడు, చి.రి కందుకూరు పాలకులు, వైష్ణవ మతాభిమానులు. దక్షిణ దేశం నుండి తిరుమల, కందాడ, భట్టార వైష్ణవ కుటుంబాలు కోస్తా ఆంధ్రాలో స్థిరపడి వైష్ణవాన్ని ప్రచారం చేసారు. వైష్ణవంలో కూడా క్రమంగా శాఖ లేర్పడినాయి. రామానుజాచార్యులను పెద్దగా గౌరవించని వైదిక సాంప్రదాయం గల వైఖానసులు వీరిలో ముఖ్యులు. రామానుజాచార్యులు రూపొందించిన శ్రీ వైష్ణవం వడగలై, తెంగలై శాఖలుగా చీలిపోయింది. ఆంధ్రదేశంలో వడగలై శాఖ మంచి ప్రచారంలో వుంది. వడగలై శాఖవారు అహోబిలంలో మఠం నెలకొల్పి ప్రచారం చేసారు. శైవ, వైష్ణవాల మధ్య వారి వారి భిన్న సాంప్రదాయాల మధ్య వివాదాలు జరుగుతూండేవి.

ఈ కాలంలో దేవాలయం, మఠం రెండూ ప్రముఖ మత సంస్థలుగా ఉండి ప్రజల పవిత్రమైన మత జీవనాన్ని సాంప్రదాయక కళలను, వృత్తులను అభివృద్ధి చేయడంలో దోహదపడ్డాయి.

దేవాలయము సామాజిక మత కార్యకలాపాలకు కేంద్రమైంది. రాజ్యానికి వుండవలసిన పరిపాలనా విభాగాల హంగులన్నీ దేవాలయానికి ఉండి రాజ్యంలో రాజ్యంగా ఉండేది. ఈ కాలంలో దేవాలయం లేని గ్రామములేదు. దేవాలయ నిర్మాణం విరివిగా సాగింది. రాజధాని కొండవీడులో రాఘవేశ్వర, మూలస్థానం మల్లారదేవ, నగరేశ్వర అంగడి గోపినాథ మొదలగు దేవాలయాలున్నట్లు శాసనాలు సూచిస్తున్నాయి. శివభక్తులు శివుని స్వయం భూ శ్రీ మహాదేవ, త్రిపురాంతక, కళ్యాణ చంద్రశేఖర, మైలర దేవ, వీరభద్ర, ఇష్టకామేశ్వర, మల్లినాథ, కాలభైరవ మొదలగు రూపాలలో ఆరాధించేవారు. వైష్ణవ భక్తులు విష్ణువుని గోపినాథ, కేశవ, నరసింహ, రామ, జనార్ధన మొదలగు రూపాలలో ఆరాధించేవారు. శ్రీశైలం, త్రిపురాంతకం, దాక్షారామం, పాలకొల్లు, భీమవరం, గుడిపూడి, అమరావతి నాటి ప్రసిద్ధ శైవక్షేత్రాలు కాగా, శ్రీ కూర్మం, సింహాచలం, సర్పవరం, శ్రీకాకుళం, బాపట్ల అహోబిలం ప్రముఖ వైష్ణవ క్షేత్రాలుగా భాసిల్లాయి. శైవ వైష్ణవ దేవాలయాలే గాక కుల దేవతలకు ప్రత్యేక ఆలయాలున్నాయి. వైశ్యులకు కన్యకా పరమేశ్వరి, వర్తక వ్యాపారులకు నగరేశ్వర, గుర్రం వ్యాపారులకు గుర్రాల పరమేశ్వరి మొదలగునవి ముఖ్యమైనవి. కానీ ఈ యుగపు ఆలయాలు పరిమాణంలో చిన్నవి. శిల్పంలో నిరాడంబరమైనవి. ఆలయాల్లో అనేక ఉత్సవాలు జరిగేవి. కొలువులు, జాతర్లు, తిరునాళ్ళు నిర్వహించేవారు. వసంతోత్సవం లేక మదన మహోత్సవం మొదలగు ఉత్సవాలు, దావనపున్నమ, నూలి పున్నమ, కార్తీక పున్నమ రోజులలో పండగలు, శ్రీ జయంతి పండగ వైభవోపేతంగా జరిగేవి. ప్రజలకు విద్యా బోధనలలో నాటి మఠాలు ప్రముఖ పాత్ర నిర్వహించాయి. పెద్ద పెద్ద ఆలయాల్లో మఠాలుండేవి. వీటి మఠాధిపతులు సకల విద్యా పారంగతులై వుండేవారు. శ్రీశైలంలో గంటా మఠం, అరసమఠం మొదలైనవి వుండేవి.

భిక్షా వృత్తి మఠం గౌరన, శ్రీనాథ కవులను ఆదరించింది. ఆ మఠాధిపతి గౌరన 'నవనాథ' చరిత్ర వ్రాయడానికి, శ్రీ నాథుడు 'శివరాత్రి మహత్మ్యం' వ్రాయడానికి ప్రోత్సహించాడు. కాకతీయుల కాలంలో ప్రసిద్ధి చెందిన గోళికి మఠానికి చెందిన త్రిపురాంతక, పుష్పగిరి విభాగాలు ఈ కాలంనాటి శాసనాలలో పేర్కొనబడ్డాయి.

## 5.10 విద్యలు - సారస్వతం :

కాకతీయుల తరువాతి కాలంలో సంస్కృత తెలుగు సాహిత్యాలు బాగా అభివృద్ధి చెందినాయి. ఈ కాలం నాటి రాజులు అనేక మంది కవులను పోషించి వారిచే అనేక గ్రంథాలను అంకితం పుచ్చుకొన్నారు. మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్రలో గ్రంథాన్ని అంకితం ఇవ్వడం అనేది సప్త సంతానములలో ఒకటిగా భావించడం చేత రాజులను వారి సామంతులు, మంత్రులు, సైన్యాధికారులు అనుకరించి

అనేక గ్రంథాలను వ్రాయించి అంకితం పుచ్చుకొన్నారు. రెడ్డి రాజులు విద్యా సారస్వతాన్ని పోషించడంలో కాకతీయుల వారసులనిపించుకొన్నారు. రెడ్డి రాజుల కాలంలో వ్యాఖ్యానాలు ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ అయిననూ, అనేక గద్య, పద్య, చంపు మరియు దృశ్య కావ్యాలు ఆవిర్భవించాయి. నాటి ప్రభువులలో చాలా మంది కవులు, పండితులు, అనేక శాస్త్రాలను అభ్యసించిన వారు, నాటి ప్రభువులు వేదాలు, వేదాంగాలు, పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు, ఆయుర్వేద, ధనుర్వేద, భరత శాస్త్ర, కామశాస్త్ర, రాజనీతి కావ్యాలు, లక్షణ గ్రంథాలు, నాటకాలు, అశ్వశాస్త్రము, సామజశిక్ష, అలంకార శాస్త్రాలు మొదలగునవి అభ్యసించేవారని, షోడశ కుమార చరిత్రము, భోజ రాజీయం మొదలగు గ్రంథాల ద్వారా తెలియుచున్నది. విప్రులు జ్యోతిష్యం, షడ్ దర్శనాలు, శబ్ద మీమాంస శాస్త్రాలు, సంగీత సాహిత్యాలు, ధర్మశాస్త్రం, ఆయుర్వేదం మొదలైన విద్యల్లో పరిశ్రమ చేసేవారని విలసతామ్ర శాసనం పేర్కొనుచున్నది.

## 5.11 సంస్కృత సాహిత్యం :

రెడ్డి రాజులు సంస్కృత భాషను మిగుల ఆదరించి పోషించారు. ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా ఉన్న మహదేవుడు సంస్కృత విద్వాంసుడు. అనవోత, అనవేమారెడ్డి కాలాలలో బాలసరస్వతి, త్రిలోచనాచార్యులు, కోలాచాల పద్ది భట్ట అనే సంస్కృత పండితులు వున్నారు. వారిదాన శాసనాలను రచించారు. రెడ్డి రాజుల కాలంలో అనేక ప్రాచీన శాస్త్రాలు, కావ్యాలు, నాటకాలపై వ్యాఖ్యానాలతో బాటు అలంకార శాస్త్రాలు, నాట్య, సంగీత శాస్త్రాలు రూపొందిపబడినవి. రెడ్డి రాజులలో కుమారగిరి రెడ్డి స్వయంగా కవి. అనేకమంది కవులను పోషించాడు. సంస్కృత భాషలో పండితుడు, సంగీత నాట్యాలలో ఆరితేరినవాడు. భరత శాస్త్రంలో ప్రవీణుడైన కుమారగిరి రెడ్డి నాట్యం మీద "వసంత రాజీయం" అనే నాట్య శాస్త్రాన్ని రచించాడు. కుమారగిరి రెడ్డి ప్రోత్సాహంతో అతని భావమరిది కాటయ వేమారెడ్డి కాళిదాసు నాటకాల మీద "కుమారగిరి రాజకీయం" అనే వ్యాఖ్యానం వ్రాసాడు. కొండవీటి రెడ్డి రాజులందరిలో మహాకవుల్లో ఎన్నదగినవాడు పెదకోమటి వేమారెడ్డి. క్రీ.శ. 1404 నాటి పెదకోమటి కుర్నూతల శాసనం ప్రకారం పెదకోమటికి "సర్వజ్ఞ చక్రవర్తి" అను బిరుదు కలదని తెలుస్తున్నది.[72] సాహిత్య చింతామణి అనే సంగీతం పై గ్రంథం, 'అమరుక శతకం' పై "శృంగార దీపిక" అనే వ్యాఖ్య, హాలుని సప్తశతిపై "సప్తశతీ సారటీక" మొదలగునవి పెదకోమటి రచనలు. పెదకోమటి వేమారెడ్డి ఆస్థానాన్ని అలంకరించిన ఇద్దరు మహాకవులు శ్రీనాథుడు, వామన భట్ట భాణుడు. వామనభట్ట బాణుడు సంస్కృత భాషలో గొప్ప రచయిత. విద్యారణ్యుడి శిష్యుడైన వామనభట్ట బాణ, తొలిరోజులలో విజయనగరంలో చదువుకొన్నాడు. పద్య, గద్య, నాటక రచనలలో ఆరితేరినవాడు. శబ్ద రత్నాకరం, శబ్ద చంద్రిక అను నిఘంటువులు, కనకలేఖా కళ్యాణం, ఉషా పరిణయం, పార్వతీ పరిణయం అనే నాటకాలు, నలాభ్యుదయం, రఘునాధాభ్యుదయం అను పద్య కావ్యాలు, వేమభూపాల చరిత్ర అను గద్యకావ్యము, హంస సందేశము అను కావ్యము ఇతని రచనలు. పార్వతి పరిణయం, కనక లేఖా కళ్యాణం, నాటకాలనుండి వామన భట్ట బాణునకు కవి సార్వభౌమ, గద్య కవి సార్వభౌమ, సాహిత్య చూడామణి, సాహిత్య 'సామ్రాజ్య దురంధర' అను బిరుదములు కలవని తెలియుచున్నది. ప్రోలయ వేమారెడ్డి కాలంలోనే నృసింహ అను సంస్కృతకవి 'కాదంబరి' అను నాటకాన్ని రచించాడు. కందుకూరు రెడ్డి రాజు శివలింగ 'తత్వ ప్రకాశిక' అను వ్యాఖ్యానాన్ని సంస్కృతంలో రచించాడు.

రాజమహేంద్రవరం రెడ్డి రాజులు కూడా అనేకమంది కవులను, పండితులను పోషించారు. అగ్రహారాలను పొందిన బ్రాహ్మణులు వేదాలలోను, శాస్త్రాలలోను పండితులు. వీరి ఆదరణలో శ్రీవల్లభుడు, సరస్వతీ భట్టు అను ఇద్దరు కవులు ముఖ్యంగా చెప్పుకోదగినవారు. రాజమహేంద్రవర రెడ్డి రాజు వీరభద్రారెడ్డి సంగీత సాహిత్యాలలో అభిరుచి వున్నవాడు.

## 5.12 తెలుగు సాహిత్యం :

కాకతీయుల పతనానంతరం ఆంధ్రదేశంలో స్వాతంత్ర్య రాజ్య స్థాపనలో తెలుగు భాషా సాహిత్యాలు కూడా నూతన అభివృద్ధి దశకు చేరుకున్నాయి. రెడ్డి రాజులకు పూర్వం తెలుగు భాషను మాండలీకులు మాత్రమే ఆదరించగా సంస్కృత భాష రాజుల ఆదరణ పొంది రాజభాషగా ఉండేది. కాని రెడ్డి రాజులు అధికార స్థాపనతో ఆంధ్రదేశంలో తెలుగు భాష రాజుల ఆదరణ పొంది సంస్కృతానికి సమానస్థాయికి చేరుకొంది. రెడ్డి రాజులు సంస్కృత, తెలుగు భాషలను రెండింటినీ సమానంగా ఆదరించారు. తెలుగు భాష ఆస్థాన

భాషాగౌరవానికై సంస్కృతంతో పోటీపడింది. తెలుగు ప్రజలు ముస్లిం పాలనను ఆంధ్రదేశంలో అంతం చేయడంలో విజయం సాధించడంతో వారిలో స్వభాషాభిమానం పెరిగింది. ఆ అభిమానమే వల్లభామాత్యునిచే "దేశ భాషలందు తెలుగు లెస్స" అని పించింది. శ్రీ నాథుడు పెదకోమటి వేమారెడ్డి విద్యాధికారి కావడంతో తెలుగు భాషా చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమయింది. రెడ్డి రాజుల కాలంలో తెలుగు భాషాభివృద్ధి చెందటానికి దోహదపడిన మరో అంశం సంస్కృత భాషా పండితుడైన గౌడ డిండిమ భట్టును తెలుగు భాషా కోవిదుడైన శ్రీనాథుడు ఓడించడం.

ఆంధ్రభాషా చరిత్రలో రెడ్డి రాజుల పాలనా కాలాన్ని సంధియుగంగా పరిగణిస్తారు. వీరి కాలం నన్నయ సంస్కృత శైలికి, తిక్కన దేశ శైలికి సంగమం. మరొక వైపు పురాణ ప్రబంధ విధానాలకు కూడలి. ఈ సామరస్యాల ఫలితంగా అలంకారికమైన శైలి తయారయింది. ఈ శైలికి ఎర్రాప్రగడ నాంది పలికితే పెంచి, పోషించి అభివృద్ధి చేసినవాడు శ్రీనాథుడు. భాగవతాన్ని తెనిగించిన పోతన కూడా సంస్కృత, తెలుగు భాషల సమన్వయానికి కృషి చేసాడు. రెడ్డి రాజుల కాలంనాటి తెలుగు పద్యభావాన్ని సంతరించుకుంది.

ఈనాటి తెలుగు సాహిత్యం నాటి హిందూ తత్వానికి, పరిస్థితులకు అద్దం పడుతుంది. నాటి కవులు కొందరు సామాజిక అవసరాలకు అనువుగా రచనలు చేసారు. మరికొందరు రాజస్థానాలలో వినోదం కలిగించడానికి చిత్ర కవిత్వాన్ని రూపొందించారు. ఇంకొందరు ముస్లిం దండయాత్రల ఫలితంగా దెబ్బతిన్న హిందూ సంస్కృతిని పునరుద్ధరించి ముస్లింలను ఎదుర్కొనే శక్తిని, ఐకమత్యాన్ని హిందువులలో కలిగించే నిమిత్తం రచనలు సాగించారు. నైతికంగా పతనం చెందిన ఆ కాలంలో హిందూ ధర్మంలో ప్రజలకు ఆసక్తి పెంచి వారిని ఉత్తేజపరచడమే నాటి తెలుగు కవుల ఆశయమయింది. హిందూ మత విశిష్టతను తెలుపుతున్న భారతాంధ్రీకరణను పూర్తి చేయడంలో అదే ఉద్దేశ్యం కనపడుతుంది. ఆంధ్రమహాభారతం నెల్లూరు నుండి వరంగల్ వరకు గల ప్రజలలో ప్రాపకం పొంది హిందూ మత సిద్ధాంతాలను, నీతిని ప్రజలకు తెలపడం ద్వారా ఆంధ్రదేశ ఐక్యతకు తోడ్పడింది.

ఈ కాలంనాటి తెలుగు కవులు శైవ, వైష్ణవమతాలలో ప్రవచించిన ధర్మాన్ని, పురాణాలలోని సంఘటనల ద్వారా పూర్వ రాజులు మత ధర్మాలను నిర్వర్తించి శాశ్వత కీర్తిని ఎలా పొందారో తెలియజేసారు. ప్రజలలో మతపరంగా విశాల థృక్పథాన్ని, దృఢ సంకల్పాన్ని, ధైర్య సాహసాలను పెంపొందించి ముస్లింలను ఎదుర్కొనే శక్తిని కల్పించడమే నాటి తెలుగు రచయితల బాధ్యత అయింది. జీవితం అశాశ్వతమని, పేరు ప్రతిష్టలు శాశ్వతమని, ఆశయ సాధనకు జీవితాన్ని త్యాగం చేసి శాశ్వత కీర్త పొందమని ప్రబోధించి తెలుగు రచనలు సామాన్య మానవుని దరిచేరాయి. పండితారాధ్య చరిత్ర, విక్రమార్క చరిత్ర, సింహాసన ద్వాత్రింసిక, భోజరాజీయం, కేయూర బాహు చరిత్ర, షోడష కుమార చరిత్ర మొదలగునవి పవిత్రమైన కార్యానికి జీవితం త్యాగం చేయవచ్చు అని ప్రబోధించి ప్రజల మానసిక ప్రవృత్తులపై అపార ప్రభావాన్ని చూపించాయి.

సత్యనిష్ట, ధర్మపరాయణత, వ్రతాలపట్ల, దేవతలపూజా విధానం పట్ల, మంత్రోచ్చారణ పట్ల విశ్వాసం కలిగి ఉండటం వంటి విషయాలు తెలుపుతూ నాటి హిందు క్షేత్రాల మహత్యాన్ని, వ్యక్తుల జీవితాలను వర్ణించే గ్రంధాలయిన నృసింహ పురాణం, భాగవతం, రామాయణం, పద్మపురాణం, హరివంశం, వీరభద్ర విజయం, శివలీలా విలాసం, హరవిలాసం, శివరాత్రి మహత్మ్యం, రుక్మాంగద చరిత్ర, నవనాథ చరిత్ర మొదలగు గ్రంథాలు వెలువడ్డాయి. ఈ విధంగా రెడ్డి రాజుల కాలంలో అన్ని రకాల సాహిత్యాలు ప్రజలలో మత సామరస్యాన్ని, విశాల దృక్పథాన్ని కలిగించడానికి దోహదపడ్డాయి.

రెడ్డి రాజుల ఆస్థానాన్ని అలంకరించిన ఆంధ్రకవులలో కవిత్రయంలో ఒకడైన ఎర్రా ప్రగడ చెప్పుకోదగ్గవాడు. ఇతనికి శంభురాస, ప్రబంధ పరమేశ్వర అనుబిరుదులు కలవు. శ్రీవాత్సవ గోత్రజుడైన సూర్య నార్యుని పుత్రుడు. ప్రసిద్ధ శైవగురువు శంకర స్వామిన్ శిష్యుడు. అద్దంకిలో రెడ్డి రాజ్యస్థాపనకు పూర్వం కందుకూరు తాలూకాలోని గుండ్లూరులో నివసిస్తున్నపుడు ప్రోలయ వేమారెడ్డి సోదరుడైన మల్లారెడ్డి అభిమానం పొందాడు. అద్దంకిలో రెడ్డి రాజ్యస్థాపన అనంతరం ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవిగా నియమింపబడ్డాడు. ఎర్రన ప్రథమ కావ్యం రామాయణం లభించడం లేదు. నన్నయ, తిక్కనలచే ప్రారంభించబడిన మహాభారత ఆంధ్రీకరణ ప్రక్రియలో వారి శైలిలోనే అరణ్య పర్వశేషాన్ని పూర్తి చేసాడు. ప్రోలయ వేమారెడ్డి ప్రోత్సాహంతో పూర్వ ఉత్తర అను రెండు భాగాలుగా "హరివంశం"

రచించాడు. ఎర్రాప్రగడ తన ప్రభువుకు అంకితం చేసిన ఏకైక కృతి ఇదే. సాధారణంగా నాటి రాజుల ఆస్థానంలో తయారయిన సాహిత్యాలలో ఉండే అతిశయోక్తులు, దీర్ఘ ప్రశస్తి దీనిలో లోపించడం ఒక ప్రత్యేకత. ఎర్రాప్రగడ చివరికావ్యం "నృసింహ పురాణం" "బ్రహ్మాండ పురాణంలోని లక్ష్మీనృసింహావతార కథ మూ... గా ఈ కావ్యాన్ని రచించి అహోబిల నరసింహదేవునికి అంకితమిచ్చాడు.

ప్రోలయ వేమారెడ్డి పోషణలో గల మరొక కవి ప్రమధ కవిగా పేరుపొందిన శ్రీగిరి అయ్యంగారుగా ప్రసిద్ధి పొందిన శ్రీగిరి కవి "నవనాథ చరిత్ర" రచించాడు. కోస్తా ఆంధ్ర దేశంలో ఇదే కాలంలో పేరుపొందిన మరొక కవి "విక్రమాంక చరిత్ర" రచించిన జక్కన. వెన్నెలకంటి కుటుంబీకులు స్వయంగా కవులు, పండితులై అనేకమంది కవులను ఆదరించి రెడ్డి రాజుల కాలంలో ప్రాపకంలోకి వచ్చారు. వెన్నెలకంటి కుటుంబీకుడైన "అన్నయ్య పోడష కుమార చరిత్ర" రచించాడు. కృష్ణాజిల్లాలోని పెరుమగూరు వాస్తవ్యుడైన అనంత శ్రీనాథునికి సమకాలీనుడై "భోజరాజీయం", "ఛందోదర్పణం", "రసాభరణం", అను గ్రంథాలను రచించాడు.

తెలుగు కావ్యాలను సరైన రీతిలో రూపొందించి పాఠకులకు ఆకర్షణీయంగా చేయడం కోసం చేసిన ప్రయత్నాలలో భాగంగా ఈ కాలంలో అలంకార శాస్త్రాలు ఆవిర్భవించాయి. ప్రథమ అలంకార కావ్యంగా ప్రసిద్ధి చెందిన "కావ్యాలంకార చూడామణి" ని విన్నకోట కుటుంబీకుడైన పెద్దనామాత్యుడు రచించి చాళుక్య విశ్వేశ్వరునకు అంకితం చేసాడు. రాజమహేంద్రవరం రాజైన అల్లాడరెడ్డి కుమారుడు దొడ్డారెడ్డి ఆదరణలో శివలెంక కొమ్మన "వీర మహేశ్వరం", "శివలీలా విలాసం", అను కావ్యాలను రచించాడు. బహుశ అనవేమారెడ్డికి సమకాలీనుడైన రావిపాటి కుటుంబీకుడైన త్రిపురాంతకుడు "త్రిపురాంతకోదాహరణం", "మదన విజయం", "చంద్రతారావళి", "అంబికా శతకం", అను గ్రంథాలను రచించాడు. తిక్కన సోమయాజి కుమారుడైన కొమ్మనకు దౌహిత్రుడైన మడికి సింగన రాజమహేంద్ర వరానికి చెందినవాడు. వీరిది తూర్పు గోదావరి జిల్లాలోని మడికి గ్రామం. మడికి సింగన తండ్రి అయ్యలామాత్యుడు రాజమహేంద్రవరం రాజు తొయ్యేటి అనవోతుని మంత్రి. మడికి సింగన "పద్మపురాణం", "వాశిష్ట రామాయణం", "సకల నీతి సమ్మతం", "భాగవత దశమాస్కంధం" అను గ్రంథాలను రచించాడు.

వినుకొండ వల్లభామాత్యుడు ఈ కాలంలో పేరుపొందిన మరొక కవి, నాటక కర్త. వల్లభామాత్యుడు కడపజిల్లాలోని మోపూరి గ్రామధికారి. త్రిపురాంతక కవి కుమారుడైన వల్లభామాత్యుడు అనవేమారెడ్డికి, కుమారగిరి రెడ్డికి సమకాలీనుడు. వల్లభామాత్యుడు రచించిన "క్రీడాభిరామం" దశరూపకాలలో ఒకటైన వీధినాటకం. ఇది తెలుగు సాహిత్యంలో ప్రథమ వీధి నాటకంగా పరిగణింపబడుతుంది.

ఈ యుగ కవులందరిలో సుప్రసిద్ధుడు కవి సార్వభౌమ బిరుదాంకితుడైన శ్రీనాథ భట్ట. శ్రీనాథుడు భరద్వాజ గోత్రజుడైన మారయ కుమారుడు. శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో ఆంధ్రదేశ తీరం వెంబడి గల కాల పట్టణ అధినేతగా ఉండేవాడు. కమలనాభామాత్యునకు "కవితా విద్యాధర", "సరససాహిత్య చక్రవర్తి", "పద్మ పురాణ సంగ్రహ కళాకావ్య ప్రబంధా దీప" అను బిరుదులు కలవు.

శ్రీనాధుని స్వస్థల విషయం వివాదగ్రస్తమైనది. రాజ మహేంద్రవర రెడ్డిరాజు ఆలయరెడ్డి మంత్రిబెండపూడి అన్నమంత్రి శ్రీనాధుడు రచించిన భీమేశ్వర పురాణాన్ని తనకు అంకితమివ్వమని కోరుతూ "పాకనాంటి వాడవు బాంధవుడవు" అని శ్రీనాధుడు సంబోధించాడు.ఈ సంబోధన శ్రీనాధుడు పాకనాంటివాడని తెలియజేస్తున్నది. కాని శ్రీనాధుడు కన్నడ జాతీయుడనే అభిప్రాయం బలంగాఉంది. కమలనాభామాత్యుడు, "భట్టు" తో అంతమయే పేర్లు నాటి తెలుగు కవుల్లో అరుదుగా ఉన్నాయి. శ్రీనాధుడు తన ఇంటి పేరును కూడా ఎక్కడా ప్రస్తావించలేదు. శ్రీనాధుడు పలికిన మాటలుకూడా అతనిది కర్నాటక ప్రాంతమని సూచిస్తున్నాయి. శ్రీనాధుడు "నాకవిత్వంబు నిజము కర్ణాటక భాష"[73] అనడం, " తల్లి కన్నడ లక్ష్మి" అని సంబోధించడం," కర్నాట కటక పద్మవనహేళి" అని చెప్పుకోవడం[74] అతనిలో అంతర్గతంగా ఉన్న కన్నడ అభిమానాన్ని సూచిస్తున్నాయి. అందువలన ఇతడు తెలుగువాడు కాదనే భావన బలపడుతున్నది. అయితే శ్రీనాధుడు ప్రదర్శించిన ఆంధ్రదేశాభిమానం, ఆంధ్ర ప్రజలపట్ల సానుభూతి, ఆంధ్ర భాషకు అతను చేసిన సేవలు గొప్పగా చెప్పుకోదగినవి. తెలుగు భాషకు చక్కటి గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని సాధించాడు. భాషలో కొత్త సాంప్రదాయాలను నెలకొల్పి ఆంధ్రభాష యుగకర్తగా పేరు పొందాడు.

శ్రీనాధుడు 15 వ శతాబ్ది నాటివాడని తెలిసినా అతని పుట్టుక, మరణాల తేదీలు తెలియరావడంలేదు. కాని చాలా సంవత్సరాలుగా ఆంధ్రదేశంలో ప్రచారంలోవున్న శ్రీనాధుని చాటు పద్యాలు శ్రీనాధుడు మరణించేనాటికి చాల ముసలివాడని తెలుపుతున్నాయి. ఒక దానిలో శ్రీనాధుడు చివరిరోజులలో ప్రభుత్వానికి పన్ను కట్టలేక శిక్షలు అనుభవిస్తున్న దుర్భరమైన పరిస్థితి ఉన్నది. రెండవ దానిలో శ్రీనాధుడు తనను చివరిరోజులలో ఆదరించి పోషించిన రాజులు, ప్రభువులు, మంత్రుల పేర్లను పేర్కొంటూ వారు మరణించినట్లు చెప్పాడు. రాజమహేంద్రవరం రెడ్డిరాజు వీరభద్రారెడ్డి, పంటమైలార తెలుంగురాయ, విస్సన్నమంత్రి, భాస్కర మొదలగు వారిపేర్లను పేర్కొన్నాడు. వీరందరి కాలాలు తెలుసుగనుకే వాటిని బట్టి శ్రీనాధుని కాలాన్ని సుమారుగా నిర్ణయించవచ్చు.

ఓరుగల్లు పతనానంతరం శ్రీనాధుని కుటుంబము కొండవీడు చేరినట్లు తెలుస్తున్నది. కొండవీడులోని అవచితిప్పయ్యసెట్టి శ్రీనాధుడికి బాల్య మిత్రుడు. కొండవీడులోనే "ఆరాధన చరిత్ర" ను అంకితం ఇచ్చి మామిడి ప్రెగడయ్యకు పాత్రుడై, అతని సోదరుడు మామిడి సింగన ఆదరణపొంది తరువాత పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా నియమింపడ్డాడు. మామిడి సింగనకు తన "శృంగారనైషధం" అంకితమిచ్చాడు.

పెదకోమటివేమారెడ్డికి విద్యాధికారిగా తన ప్రభువుకు సంబంధించిన అన్ని శాసన పాఠాలను రచించాడు. శ్రీనాథుడు రచించిన మొదటిశాసన పాఠం క్రీ. శ. 1404 నాటి రుద్రవరం శాసన పాఠం. శ్రీనాథుడు కొండవీటి రెడ్డిరాజుల విద్యాధికారిగా ఉంటూ తన కవితా పరిశ్రమను ఆంధ్రదేశమంతా విస్తరింపజేసాడు. కొండవీడు విద్యాధికారిగా నున్న సమయంలో అతనికి సంబంధించిన రెండు సంఘటనలు ఆంధ్రదేశ సాహిత్య చరిత్రలో చెప్పుకోదగినవి. శ్రీనాథుడు విజయనగర ఆస్థానం సందర్శించి అక్కడ కవిసార్వభౌమగౌడడిండిమ భట్టును ఓడించి, ప్రౌఢదేవ రాయలచే ముత్యాల మండపంలో కనకాభిషేకం చేయించుకొని కవిసార్వభౌమ అనే బిరుదుపొందాడు . ఈ సంఘటన శ్రీనాథుడు భీమేశ్వరపురాణం, కాశీఖండం రచించిన మధ్యకాలంలో అనగా క్రీ. శ. 1428 మరియు క్రీ.శ. 1438 మధ్య సమయంలో జరిగిఉంటుంది. అనంతరం వెలమరాజ్యాల మధ్య బహుశ దౌత్యం జరిపే ఆశయంతో రాచకొండకు వెళ్ళి సర్వజ్ఞ సింగభూపాలుని మర్యాదలు అందుకున్నాడు. సర్వజ్ఞసింగభూపాలుడు రాచకొండ పాలకుడైన రేచర్ల రెండవ అనవోత కుమారుడు, శ్రీనాథుడు రాచకొండ దర్శించి సింగమ మర్యాదలను పొంది తిరుగుప్రయాణంలో దేవరకొండ సందర్శించి తన సాహిత్యపటిమతో లింగమనీడును మెప్పించి వెలమలు పూర్వం రెడ్డిరాజులను ఓడించి వారి వద్ద నుండి తీసుకెళ్ళిన నందికం టపోతరాజు కటారిని తిరిగి తీసుకొచ్చాడు.

కొండవీటి రాజ్యం పతనం చెందిన తరువాత నిరాశ్రయుడై దేశాటనం చేస్తూ గడిపాడు. అనంతరం బంధువైన బెండపూడి అన్న మాత్యుని ఆశ్రయించి రాజ మహేంద్రవర ఆస్థానంలో చేరాడు. ఇక్కడే "భీమఖండం". కాశీఖండం" రచనలు సాగాయి. ఇంతలో క్రీ.శ. 1448 నాటికి కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాన్ని ఆక్రమించాడు. తిరిగి నిరాశ్రయుడైన శ్రీనాథుడు శ్రీ శైలం చేరి భిక్షావృత్తి మఠాదిపతి శాంతలింగయ్య ఆశ్రయం పొంది ఆయన కోరిక పై "శివరాత్రి మహాత్మ్యం" రచించాడు. చివరకు వీరభద్రారెడ్డి విద్వాంసుడుగా గజపతిరాజులు పెట్టిన కష్టాలకు గురి అయి మరణించాడు.

శ్రీనాథుని జీవితం సుడిగాలి వంటిది. కొండవీటి రెడ్డిరాజుల పోషణలో ఎంతో వైభవోపేతమైన జీవితాన్ని గడిపి అనేక గౌరవాలు, బహుమానాలు పొంది చివరకు రాజ పోషణలేక వ్యవసాయాన్ని ప్రారంభించి ప్రభుత్వం నిర్ణయించిన శిస్తు కట్టలేక అనేక శిక్షలు అనుభవిస్తూ మరణించాడు. శ్రీనాథుడు మరుత్తరాత చరిత్ర, శాలివాహన సప్తశతి, ప్రెగడయ్యకు అంకితమిచ్చిన పండితారాధ్య చరిత్ర, మామిడి సింగనకు అంకితమిచ్చిన శృంగా నైషధం, అవచితిప్పయకు అంకితమిచ్చిన హరవిలాసం, బెండపూడి అన్నయకు అంకితమిచ్చిన భీమేశ్వర పురాణం, వీరభద్రారెడ్డికి అంకిత మిచ్చిన ధనుంజయ విజయం, ముమ్మడి శాంతలింగయ్యకు అంకితమిచ్చిన శివరాత్రి మహత్మ్యం, పలనాటి వీర చరిత్ర మొదలగు గ్రంథాలను రచించాడు.

రెడ్డి రాజుల పాలనా కాలంలోని తెలుగు సాహిత్య సమీక్ష తెలంగాణలో రేచర్ల పద్మనాయకుల పోషణలో తయారయిన తెలుగు గ్రంథాలను గురించి తెలుసుకుంటే తప్ప పూర్తికాదు.

దేవరకొండ నేలిన పద్మనాయకుల ఆస్థానంలో విష్ణుపురాణం రచించిన పాశుపతి నాగనాథ, రామాయణాన్ని తెనిగించిన అయ్యలార్యుడు, చెప్పుకోదగిన కవులు. "సరస సాహిత్య చక్రవర్తి" అను బిరుదు గల గౌరన "హరిశ్చంద్రోపాఖ్యానం", "నవ నాథ చరిత్ర", "లక్షణదీపిక", "నవగ్రహస్తవం" అనుగ్రంథాలను రచించిన గోనబుద్ధ రాజు, "సింహాసన ద్వాత్రింసిక" రచించిన కొరవి కుటుంబీకుడు గోపరాజు నాటి ప్రసిద్ధ తెలుగు కవులు. ఆంధ్రకవుల్లో ప్రత్యేకమైన స్థానం గల సహజపాండిత్య బిరుదుగల బమ్మెర పోతన ఏకశిలానగర (ఓరుగల్లు) వాసి. పోతన సర్వజ్ఞ సింగమ భూపాలుని ఆస్థానంలో ఉండి "భోగినీ దండకం" రచించి క్రమేణా వైష్ణవ ప్రభావానికిలోనై మహాభాగవతాన్ని రచించి శ్రీరాముడికి అంకితం చేసాడు.

రెడ్డి వెలమ నాయక యుగంలో సంస్కృత, తెలుగు సాహిత్యాలు రాజుల, మంత్రుల, ప్రభువుల పోషణలో అభివృద్ధి చెందాయి. రాజాస్థానాలలో అనేక సాహితీ ప్రక్రియలు జరుగుతుండేవి. కృతిస్వీకరణ సప్త సంతానములలో ఒకటిగా పరిగణింపబడి గ్రంథరచనకు ప్రోత్సహింపబడింది. ఈ సాహిత్యభివృద్ధి విజయనగర రాజుల కాలంలో పరాకాష్టనొందింది.

## 5.13 కళలు :

రెడ్డి రాజులు సాహిత్యాభిమానులేగాక వివిధ కళలందు స్వయంగా ప్రసిద్ధులు. వీరి కాలంలో సంగీత నాట్యాలకు మంచి ఆదరణ లభించింది. రెడ్డి రాజులు స్వయంగా సంగీత నాట్యాలను నేర్చుకొని వాటిమీద గ్రంథాలను కూడా రచించారు.

### 5.13.1 సంగీత నాట్యాలు :

ఈ కాలంలో సంగీత నాట్యాలు ఎక్కువగా రెడ్డి రాజుల ఆదరణ పొందాయి. ఈ కాలంలో సంగీతాన్ని ఆదరించి పోషించిన వారిలో సురభివంశానికి చెందిన ప్రతాపవీరగాంగరాజు, పోత పీనాల వంశానికి చెందిన కృష్ణదేవ, చాళుక్య వంశానికి చెందిన విశ్వేశ్వరలు చెప్పుకోదగినవారు. కొండవీటి రెడ్డి రాజు పెదకోమటివేమారెడ్డి సంగీతాభిమానే గాక సంగీతంపై "సంగీత చింతామణి" అనే గ్రంథాన్ని రచించాడు. కుమారగిరి రెడ్డి, అతని బావమరిది కాటయ వేమారెడ్డి సంగీత నాట్యాలలో ప్రవీణులు. రేచర్ల రెండవ సింగన సంగీత శాస్త్రంలో ప్రవీణుడై సారంగదేవుని "సంగీత రత్నాకరం" పై "సంగీత సుధాకరం" అను వ్యాఖ్యానాన్ని రచించాడు. రాజమహేంద్రవర రెడ్డి రాజు వీరభద్రారెడ్డి సంగీత శాస్త్రంలోని లక్ష్య, లక్షణాలలో ప్రవీణుడు. "విక్రమార్క విజయం", "శ్రీరంగ మహాత్మ్యం" అను ఈ కాలంలో తయారయిన గ్రంథాలు సంగీతాన్ని గూర్చి ప్రస్తావిస్తున్నాయి.

ఈ కాలంలో నాట్యం కూడ సమాదరణ పొందింది. ప్రాచీన నాట్యశాస్త్రాలు, భరతుని నాట్య శాస్త్రం మొదలగునవి కవి పండితులు అధ్యయనం చేసారు. "సోడష కుమార చరిత్ర" రచించిన సూరామాత్య ఆధునిక భరతాచార్యులుగా పేరుపొందినాడు. ఈ కాలం నాటి కొంతమంది రాజులు నాట్య శాస్త్రంలో ప్రావీణ్యత పొందారు. చాళుక్య వంశీయుడైన విశ్వేశ్వరుడు (ఎలమంచిలి), కుమారగిరిరెడ్డి, అతని బావమరిది కాటయవేముడు, పెదకోమటి వేమారెడ్డి, రేచర్ల కుటుంబీకుడు సింగభూపాలుడు నాట్య శాస్త్రంలో ప్రావీణ్యం పొందారు. నాట్య శాస్త్రం పై కుమారగిరి రెడ్డి "వసంత రాజీయం" అను గ్రంధాన్ని రచించగా అతని బావమరిది కాటయ వేముడు కాళిదాసు నాటకాలపై "కుమారగిరి రాజీయం" అను వ్యాఖ్యాన్ని రచించాడు. పెదకోమటి వేమారెడ్డి రచించిన "సంగీత చింతామణి" నాడు వాడుకలో గల వివిధ నృత్యాలను పేర్కొంటున్నది. కుమారగిరి ఆస్థానంలో గల నాటి ప్రముఖ నర్తకి లకుమగేవి. లకుమదేవి నాట్యంలో తన ప్రతిభను ప్రదర్శించి తన ప్రభువును, ప్రజలను మంత్ర ముగ్ధులను చేసేది. సాంప్రదాయ నృత్యంతో బాటు దేశీనృత్యం కూడా ఈ కాలంలో ప్రాపకం పొందింది. సమకాలీన తెలుగు సాహిత్యంలో పేరణి, గొండ్లి, దండలాసక, కందుక, జక్కిని చిందు, మొదలగు దేశీ నాట్యాలు పేర్కొనబడ్డాయి. ధృవగాన మొదలగు యక్షగానాలు కూడా ప్రాపకంలోకి వచ్చాయి.

ఈ కాలంలో అనేక నాటకాలు కూడా వ్రాయబడ్డాయి. వామన భట్ట బాణ, సింగభూపాల, పశుపతి నాగనాథ, పెదకోమటి వేమారెడ్డి మొదలగువారు సంస్కృతంలో నాటకాలు రచించారు. ఈ నాటకాలు వసంతోత్సవాల సమయంలో, కళ్యాణ మహోత్సవాల

సందర్భాలలో ఆడేవారు. పశుపతి నాగ నాథుడు "మదన విలాస బాణ" వామన భట్టబాణ "శృంగార భూషణ బాణ", రెండవ కుమారగిరి "రత్నపాంచాలిక", మొదలగునవి సంస్కృత నాటకాలు. వినుకొండ వల్లభామాత్యుడు తెలుగులో రచించిన "క్రీడాభిరామం" మొదటి వీధి నాటకంగా పరిగణింపబడుతున్నది.

## 5.13.2 వాస్తు, చిత్రలేఖనం :

రెడ్డి రాజుల కాలం హిందూమత, హిందు సంస్కృతి పునరుద్ధరణను సూచిస్తున్నప్పటికి వారు స్వయంగా ఎటువంటి దేవాలయాలు నిర్మించినట్లు సాక్ష్యాలులేవు. అయితే రెడ్డి రాజులకు సంబంధించి వాస్తు నిర్మాణాలు కొన్ని వారి రాజధాని కొండవీడులో సాక్షాత్కరిస్తున్నాయి. కొండవీడులోని ప్రత్యేక భవనమైన గజరాజు మేడ లేక గజరాజు సౌధము రెడ్డి రాజుల నిర్మాణంగా తెలుస్తున్నది. కాటయ వేమారెడ్డి కుమారగిరి శాసనాల వలన ఈ సౌధాన్ని కుమారగిరి నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ కాలంలో రెడ్డి రాజులు దేవాలయ నిర్మాణం సాగించనప్పటికీ అనేక రకాల ఇతర నిర్మాణాలు చేపట్టారు. రెడ్డి రాజ్య స్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి శ్రీశైలం, అహోబిలం క్షేత్రాలకు, పాతాళగంగకు మెట్లు నిర్మించాడు. ప్రోలయ వేమారెడ్డి కుమారుడు అనవేమారెడ్డి దాక్షారామ దగ్గరగల భీమ నాథనగరులో నాట్య, కళ్యాణ, హోమ, శనివార మండపాలను, దివ్య లింగాలకు గోపురాలను, ప్రాకారాలను నిర్మించాడు. అనవేముని ఆజ్ఞతో శ్రీశైలంలో వీర శిరోమండపం నిర్మింపబడింది. కాటయవేముని ఉద్యోగి కడియం మాచినేడు భార్య పోతసాని దాక్షారామ భీమేశ్వర ఆలయానికి ప్రాకారం నిర్మించింది. కడియం మాచినేడు దాక్షారామ భీమేశ్వర ఆలయంలో ఆస్థాన మండపాన్ని నిర్మించాడు. అల్లారెడ్డి ఉద్యోగి నారాయణ పెద్ది పలివెల (తూర్పు గోదావరి జిల్లా) లో కొప్పేశ్వర దేవరకు కళ్యాణ వేదికతో కూడిన శిలామండపాన్ని నిర్మించాడు. బెండపూడి అన్నయమంత్రి దాక్షారామ భీమేశ్వరాలయానికి ముందు 12 స్తంభాల గోపుర మండపాన్ని నిర్మించాడు.

రెడ్డి రాజుల కాలంలో చిత్రలేఖనం కూడా మంచి ఆదరణ పొందింది. రెడ్డి రాజుల ఆస్థానంలో ఉద్యోగుల గృహాలలో గోడలపైన రకరకాల చిత్రాలు వేయించుకున్నారు. పోతన, శ్రీనాథుడు చిత్రాలలో ఉపయోగించే రంగుల సంఖ్యను పేర్కొన్నారు. తెలుపు, ఎరుపు, పసుపు మరియూ నలుపు అను నాలుగు రంగులను చిత్రాలలో వాడేవారని శ్రీనాథుడు పేర్కొన్నాడు.

## 5.14 సారాంశము :

కాకతీయులకు వారసులుగా ఉన్న రెడ్డిరాజుల పాలన ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ స్థానం కలిగినది. వారి కాలంలో అన్ని రంగాలు ముఖ్యంగా ఆర్థిక, న్యాయ, సైనిక, కళ మొ॥ రంగాలలో తమదైన శైలిలో ప్రాముఖ్యతను సంపాదించుకున్నారు. అన్నిటికన్న ముఖ్యంగా తెలుగుభాషాభివృద్ధికి రెడ్డిరాజుల కాలంలో విశేష కృషి జరిగింది.

## References


1. Bhimesvara Puranam, I, pr. 31
2. Nellore District Inscriptions, III, O,P. 1022 ;
   M. Soma Sehara Sarma, "A Forgotten Chapter of Andhra History", pp 39 - 40, Foot Notes
3. Epigraphical Collections, No, 753 of 1920
4. Mackenzie Manuscripts, No. 15 - 4 - 27.
5. Ibid., No. 15 - 4 - 30
6. Ibid., No. 15 - 4 - 42
7. Journal of Oriental Research, pp. 128 ff ; Bharati, Vol. VIII, 1931

8. Nellore District Inscriptions, No. 15 - 4 - 42
9. Srikakulam Inscriptions of Narasimhadeva IV, South Indian Inscriptions, Vol. IV, No. 975
10. Epigraphia Indica, Vol. III, pp. 82 ff ; Velugotivarivamsa Charitra, 21 and 23
11. Epigraphical Collections, 44 of 1912 ;
Epigraphical Report, 1912, p. 68
12. Epigraphia Indica, 44 of 1912 ;
Journal of Andhra Historical Research Society, Vol . I. pp. 172 ff
13. Suravaram is in the Nuzvid Taluq of Krishna District.
14. Velugotivarivamsavali, Verse 51.
15. South India Inscriptions, Vol. VI, No : 226
16. Mackenzie Manuscripts, 15-6-19
17. Elliot's Collection, Vol. I, pp. 270 ff
18. Epigraphia Indica, Vol. XXI, pp. 269 B
19. South Indian Inscriptions, Vol. VI, No. 785
20. Ibid., Vol. VI, No. 800
21. Archaeological Reports of Andhra State, 1934 - 35 (1344 F), Appendix
22. Inscriptions in theTelengana Districts of Hyderabad State, No. 19, pp 71 - 72
23. Epigraphical Collections, No. 20 of 1915
24. Jounal of Andhra Historical Research Society, Vol. XI, pp. 211 ff.
25. Epigraphical Collections, No. 270 of 19-5
26. Ibid., No. 254 of 1905
27. Epigraphia Carnatika, Vol. XII, p. 121
28. Epigraphia Indica, Vol, XIII, V.22, P. 242
29. Journal of Andhra Historical Research Society, Vol. XI, p. 213
30. Epigraphia Indica, Vol. XIII, P. 242. V. 17
31. Journal of Andhra Historical Research Society, Vol. XI, p. 194 - 195.
32. South Indian Inscriptions, Vol. V, Nol. 1, V.8
33. Epigraphical Collections, No. 417 of 1915
34. Mackenzie Manuscripts, No. 15-6-21,
35. Nellore District Inscriptions Vol. I, Cp. No. 1.
36. Mackenzie Manuscripts, No. 15-4-42

37. Epigraphical Collections, No. 395 of 1926
38. Andhra Sahitya Parishat. Vol X, No.1
39. Chatupadyamanimanjari, Vol. II, p. 65.
40. Copper Plate No. 14 of 1919 - 20
41. Sringarasrinatham, Veturi Prabhakara Sastri, pp. 12-14, Anubandham.
42. Balayampalli Grant of Maca dated in A.D. 1414
43. Epigraphical Collections, No. 293 of 1920
44. Journal of Andhra Historical Research Society, Vol. I, pp. 172 ff.
45. Mackenzie Manuscripts, No. 15-5-32 and 15-4-3
46. Sringara Naisadham, II, V. 144.
47. Journal of Andhra Historical Reseacrch Society, Vol. III, p. 228
48. Epigraphical Colletions, No. 125 of 1917
49. Kaifiyat of Kondaveedu, pp. 10-11.
50. Epigraphia Indica, Vol. XXVI, p. 29
51. Ibid., Vol. XXVI, p.45
52. South Indian Inscription, Vol. V no. 113
53. Ibid., Vol. V No. 145
54. Ibid., Vol V, No. 133
55. Epigraphical Collections, Nos. 306 and 307 of 1924
56. Journal of Andhra Historical Reseach Society, Vol. III, pp. 323 ff.
57. South Indian Inscriptions, Vol. V, No. 129
58. Journal of Andhra Historical Research Society, Vol V, p. 229
59. Sakalanitisammatam, II, V, 605
60. Haravilasam, I pt i
61. Forgotten Chapter of Andhra History,
M. Soma Sekhara Sarma, Appendix I
62. Epigraphia Indica, Vol. XXI, p. 150
63. Simhasanadvatrmsiaka, Koravi Goparasu, I, iii, V. 102
64. Kridabhiraman, VU . 264 and 265
65. Rukmangada Charitra, I. V. 164
66. Means to hold a highly heated Iron ball

67. Nuh Siphir, Amir Khusrau, p. 560

68. Mackenzie Manuscripts, No : 15-6-1.

69. Sthala durga Vidalana Balarama, Jaladurga Sadhana Raghurama,

70. Simhasanadvantrimsika, I, IV, V. 17

71. Epigraphical Collections, Anavema Reddi's Simhachalam Inscription No. 20 of 1915

72. Epigraphia Indica, Vol. X, P. 325

73. Bhimesvara Puranam, I, V. 15

74. Kasikhandam, I, V. 7

**ఉపయుక్త గ్రంథాలు**


1. Appa Rao, V, Reddi Sanchika (Tel)
2. Arudra, Samagra Andhra Sahityam (Tel)
3. Hanumantha Rao, B.S.L, Andhrula Charitra (Tel)
4. Sherwani, H.K and
   Joshi, P.M, History of Medieval Deccan, Vol. I
5. Soma Sekhara Sarma, M.
   1. Forgotten Chapter of Andhra History
   2. History of the Reddi Kingdoms
6. Venkataramanaiah N.
   Early Muslim Expansion in South India
7. Yashoda Devi V. After the Kakatiyas.


- ఎం. సోమశేఖర రావు.

పాఠం - 6

# విజయ నగర సామ్రాజ్యము - అవతరణ

## 6.0 లక్ష్యం :

దక్షిణ భారతదేశ చరిత్రలో విశిష్టమైన ఘట్టంగా పేర్కొనదగిన విజయనగర సామ్రాజ్య అవతరణ, విజయనగర సామ్రాజ్య స్థాపనకు పూర్వం ఉన్న పరిస్థితులు, విజయనగర స్థాపనకు సంబంధించిన వివిధ సిద్ధాంతాలను వివరంగా తెలియపరచటం ఈ పాఠం లక్ష్యం. విజయనగర చరిత్ర రచించటానికి కావలసిన పురావస్తు, సాహిత్య ఆధారాలను కూడా చర్చించడం జరిగింది.

## విషయక్రమం :


6.1 పరిచయం

6.2 విజయనగర రాజ్యస్థాపనకు పూర్వం దక్షిణ భారతదేశ రాజకీయ పరిస్థితులు

6.2.1 దక్షిణ భారతదేశాన్ని ముస్లింలు జయించుట

6.2.2 ముస్లింల పాలనలో దక్షిణ భారతదేశ పరిస్థితి

6.2.3 విమోచనోద్యమాలు

6.2.4 విజయనగర రాజుల కాలక్రమపట్టిక

6.3 విజయనగర సామ్రాజ్య చరిత్రకు ఆధారాలు

6.3.1 పురావస్తు ఆధారాలు

6.3.2 సాహిత్య ఆధారాలు

6.4 విజయనగర స్థాపనకు సంబంధించిన సిద్ధాంతాలు

6.4.1 హరిహర రాయలు, బుక్కరాయలు

6.4.2 హరిహర, బుక్కరాయల పుట్టుపూర్వోత్తరాలు

కన్నడ సిద్ధాంతం

తెలుగు సిద్ధాంతం

6.4.3 విజయనగర సామ్రాజ్య స్థాపనోద్దేశాలు, ఆదర్శాలు

6.4.4 మంతాంతరీకరణ వృత్తాంతం

6.4.5 విద్యారణ్య సమస్య

6.4.6 నగర నిర్మాణం.

6.5 సారాంశము

## 6.1 పరిచయం :

మధ్యయుగ భారతదేశ చరిత్రలో ప్రత్యేకించి దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్యం అత్యంత కీలకమైన పాత్ర నిర్వహించింది. ముస్లిం దాడుల నుండి భారతీయ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని పరిరక్షించే ధ్యేయంతో క్రీ.శ 1336 సంవత్సరంలో విజయనగర సామ్రాజ్య స్థాపనకు అంకురార్పణ జరిగింది. విజయనగర సామ్రాజ్య స్థాపనకు కొన్ని ప్రత్యేకమైన పరిస్థితులు దోహదం చేశాయి. ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలం నుంచి ముస్లింల దండయాత్రలు దక్షిణ దేశంపై ఉధృతమయ్యాయి. క్రీ.శ. 1323 లో కాకతీయ సామ్రాజ్యం పతనం చెందిన కొంతకాలానికే దక్షిణ భారతదేశమంతా ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బీన్ తుగ్లక్ పాలనలోకి వచ్చింది. మహ్మద్ బీన్ తుగ్లక్ దక్షిణ భారతదేశాన్ని దేవగిరి, తెలంగాణా, కంపిలి, ద్వార సముద్రం, మధుర అనే అయిదు రాష్ట్రాలుగా విభజించి తన ప్రతినిధులను నిల్పాడు. వీరి నిరంకుశ పరిపాలనలో ప్రజలు నుగ్గిపోయారు. ముస్లిం పాలన వల్ల నానాబాధలు అనుభవిస్తున్న ప్రజలలో నెలకొన్న అసంతృప్తిని, వ్యతిరేకతను అవకాశంగా తీసుకొని, దేశవ్యాప్తంగా మహమ్మద్ బీన్ తుగ్లక్‌కు వ్యతిరేకంగా చెలరేగిన తిరుగుబాట్లలో భాగంగా నేటి రాయలసీమ ప్రాంతంలో ఆరవీటి సోమరాజు, తీరాంధ్రలోని అద్దంకి ప్రాంతంలో ప్రోలయ వేమారెడ్డి, తెలంగాణాలో ముసునూరి ప్రోలయ నాయకుడు, కర్ణాకంలో ముడో వీరబల్లాలుడు స్వాతంత్ర్యోద్యమాలను ప్రారంభించారు. ఈ తరుణంలోనే విజయనగర సామ్రాజ్యానికి అంకురార్పణ జరిగింది.

దక్షిణ భారతదేశంలో తుగ్లక్ ప్రతినిధులకు ఈ స్వాతంత్ర్యోద్యమాలను అణచడం సాధ్యపడలేదు. ఇట్టి పరిస్థితులలో తన అధికారాన్ని పరిరక్షించుకునే ఉద్దేశంలో మహమ్మద్ బీన్ తుగ్లక్ తన దగ్గర విధేయులుగా ఉన్న స్థానికులైన హరిహర, బుక్క సోదరులను తన ప్రతినిధులుగా ఆనెగొందిని పాలించడానికి పంపాడు. తుగ్లక్ ప్రతినిధులుగా ఈ ఇద్దరు సోదరులు ఆనెగొంది వచ్చి స్థానిక తిరుగుబాట్లను విజయవంతంగా ఎదుర్కొన్నారు. కాని ఈ హరిహర బుక్క సోదరులు శృంగేరిమఠ పీఠాధిపతి విద్యారణ్యస్వామి ప్రోత్సాహంతో ఆనెగొందిలో స్వతంత్రించి క్రీ.శ. 1336 లో విజయనగర సామ్రాజ్యస్థాపనకు అంకురార్పణ చేసారు. తాము స్థాపించిన రాజ్యానికి ఆనెగొంది రాజధానిగా తగదని భావించి తుంగభద్రానదికి దక్షిణపు ఒడ్డున ఒక నూతన నగరాన్ని నిర్మించి దానికి విజయనగరం అనిపేరు పెట్టారు. రాజధానిని క్రీ.శ. 1344 - 1345 లో విజయనగరానికి మార్చారు. క్రీ.శ 1336 లో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యాన్ని నాలుగు వంశాలకు చెందిన రాజులు క్రీ.శ 1646 వరకు అవిచ్ఛిన్నంగా పాలించారు. ఆ నాలుగు వంశాలు : (1) సంగమ వంశం (2) సాళువ వంశం, (3) తుళువ వంశం (4) ఆరవీటి వంశం. ఈ పాఠంలో తొలి మూడు వంశాల చరిత్రతో బాటు విజయనగర రాజ్యస్థాపనకు పూర్వం దక్షిణ భారత రాజకీయ పరిస్థితి, ఆధారాలు, విజయనగర రాజ్యస్థాపకాల పుట్టుపూర్వోత్తరాలు, సామ్రాజ్యస్థాపన ఉద్దేశాలు వివరించడం జరిగింది.

## 6.2 విజయనగర రాజ్యస్థాపనకు పూర్వం దక్షిణ భారతదేశ రాజకీయ పరిస్థితులు

### 6.2.1. దక్షిణ భారతదేశాన్ని ముస్లింలు జయించుట :

ఢిల్లీ సుల్తాన్ అల్లా ఉద్దీన్ ఖిల్జీ సింహాసనమధిష్ఠించే నాటికి దక్షిణ భారతదేశంలో కాకతీయ, యాదవ, హోయసాల, పాండ్య అను నాల్గు హిందూ రాజ్యాలుండేవి. వీటిని ఖిల్జీ జయించాడు. ఖిల్జీల తరువాత రాజ్యానికి వచ్చిన ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ తన కుమారుడైన ఉల్ఘ ఖాన్‌ను కాకతీయుల రాజ్యం మీదికి దండయాత్ర పంపాడు. ఉల్ఘుఖాన్ కాకతీయుల రాజధాని ఓరుగల్లుని ముట్టడించి ఆక్రమించాడు. ఫలితంగా కాకతీయ సామ్రాజ్యం పతనమయింది. కాకతీయ రాజ్యపతనానికి ముందే యాదవ రాజ్యం పతనమయి ఢిల్లీ సుల్తానత్‌లో భాగమయింది. ఓరుగల్లుని ఆక్రమించిన తరువాత ఉల్ఘుఖాన్ తీరాంధ్రంలోని కొండపల్లి, కొండవీడు, నిడుదవోలు, రాజమహేంద్రవరం, నెల్లూరు దుర్గాలను ఆక్రమించాడు. ఆంధ్రదేశమంతా ఉల్ఘుఖాన్ పర్యవేక్షణలో ఢిల్లీ సుల్తానత్ సైనిక పరిపాలన కిందికి వచ్చింది.

ఓరుగల్లు నగరానికి ఆపేరును తీసివేసి సుల్తాన్‌పూర్ అని పేరుపెట్టినాడు. దక్షిణ దేశంలో మధుర రాజధానిగా పాండ్యులు అధికభాగాన్ని ఆక్రమించి పాలించారు. అయితే తరువాత పాండ్యులలోని అంతఃకలహాలు అవకాశంగా తీసుకొని వారి సామంతులు వారి అధికారానికి ఎదురు తిరగడంతో పాండ్యరాజ్యం బలహీనమయింది. ఆంధ్రదేశాన్ని ఆక్రమించిన ఉల్లుఖాన్ దక్షిణ దేశంపై దండెత్తి పాండ్యరాజ్యాన్ని ఆక్రమించి దానికి 'మాబర్' అనే ముస్లిం పేరుపెట్టి, దానిని ఢిల్లీ సుల్తానత్‌లో విలీనం చేశాడు. ఈ 'మాబర్' రాజ్యానికి విజయనగర రాకుమారుడు కుమార కంపన క్రీ.శ. 1372 లో విమోచన కలిగించాడు. కంపన భార్య గంగాదేవి తన 'మధురా విజయ' కావ్యంలో కంపన మధుర ఆక్రమణను వర్ణించింది.

బళ్ళారి, రాయచూర్, ధార్వాడ్ జిల్లాలతో కూడిన కంపిలి రాజ్యం మొదట యాదవ రాజ్యానికి సామంత రాజ్యంగా ఉండేది. యాదవ రాజ్య పతనానంతరం రెండో కంపిలదేవుడు ఆనెగొంది రాజధానిగా స్వతంత్ర కంపిలి రాజ్యం రూపొందించాడు. ఖిల్జీల కాలంలో కంపిలి రాజ్యం తన స్వాతంత్ర్యాన్ని కాపాడుకొంది. అంతేగాక కంపిలిదేవుడు తన రాజ్యాన్ని అనంతపురం, చిత్రదుర్గ, షిమోగా జిల్లాలకు విస్తరింప చేశాడు. సాగర్ పాలకుడయిన బహుఉద్దీన్ గుర్ షాస్ప్ ఢిల్లీ సల్తనత్ మీద తిరుగుబాటు చేసి, పరాజయం చెంది పారిపోయి కంపిల దేవుని శరణుజొచ్చాడు. కంపిల దేవుడు బహాఉద్దీన్ గుర్ షాస్ప్‌కు ఆశ్రయమిచ్చాడు. దీనితో ఆగ్రహించిన ఢిల్లీ సుల్లాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ తన సైన్యాలను కంపిలి పైకి పంపాడు. కంపిలిదేవుడు సుల్తాన్ సేనలను ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయాడు. అంతఃపుర స్త్రీలు ఆత్మాహుతి చేసుకొన్నారు. కంపిలి రాజ్యం ఢిల్లీ సల్తనత్‌లో విలీనమయింది. కంపిలి పాలకునిగా మలిక్ మహమ్మద్‌ను నియమించారు. కంపిలి ఆక్రమణ సందర్భములోనే అనేక మందిని ఖైదీచేసి ఢిల్లీకి తీసుకొనిపోయారు. వీరిలో తరువాత విజయనగర సామ్రాజ్యస్థాపకులయిన హరిహర బుక్క సోదరులున్నారు. అందువల్ల కంపిలి దేవునిమరణం వృథా కాలేదు. కంపిల రాజ్యశిధిలాల నుంచే దక్షిణ భారతదేశంలో ఒక మహోన్నతమైన హిందూ సామ్రాజ్యం ఉత్పన్నమయింది.

కంపిల దేవుడు తనను ఆశ్రయించిన బహాఉద్దీన్ గల్ షాస్ప్‌ను తాను మరణించడానికి ముందే రహస్యంగా హోయసాల రాజ్యానికి పంపాడు. దీంతో ఢిల్లీ సైన్యాలు హోయసాల రాజధాని ద్వార సముద్రం మీదికి దండెత్తినాయి. కంపిలదేవుని దుర్గతి తనకు పట్టకుండా ఉండడానికి హోయసాలరాజు మూడవ బల్లాడు బహుఉద్దీన్ గుర్‌షాస్ప్‌ను ఢిల్లీ సేనకు అప్పగించి, ఢిల్లీ సల్తనత్ ఆధిపత్యాన్ని అంగీకరించాడు.

పై విధంగా దక్షిణ భారతదేశమంతా ఢిల్లీ సల్తనత్ ఆధీనం క్రిందికి వచ్చింది. వీటిని దేవగిరి, తెలంగాణా, కంపిలి, ద్వారసముద్రం, మాబర్ అనే ఐదు రాష్ట్రాలుగా విభజించి ఢిల్లీ సుల్తాన్ పరిపాలించాడని ముస్లిం చరిత్రకారులు పేర్కొన్నారు.

## 6.2.2 ముస్లిముల పాలనలో దక్షిణ భారతదేశ పరిస్థితి :

ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ తరువాత అతని కుమారుడైన ఉల్లుఖాన్, మహమ్మద్ బిన్ తుగ్లక్ అనే పేరుతో సింహాసనం ఎక్కి ఢిల్లీ సల్తనత్‌ను పాలించసాగాడు. ఇతని పాలనలో ఆంధ్రదేశంలో, తమిళదేశంలో ఏర్పడిన అరాచక పరిస్థితిని, ముస్లిం చర్యలను సమకాలీన విలస తామ్ర శాసనము, మధురా విజయం అనే సంస్కృత కావ్యం విపులంగా వర్ణించాయి. "ప్రతాపరుద్రుడను భానుడు అంతర్హితుడు కాగా లోకంలో అంధకారం వ్యాపించింది. దేశం యవనా క్రాంతమయిన తరువాత ధనవంతులు, అనేకాలయిన పాపపు ఉపాయాలచేత ధన నిమిత్తం పీడింపబడినారు. కొందరు పారశీకులను చూసీచూడగానే తమ ప్రాణాలను వదిలారు. ద్విజులు తమ యజ్ఞకర్మలను వదులు కొనవలసిన వారయ్యారు. దేశ ప్రతిమలు సమస్తం భగ్నములై పోయినవి. చిరకాలం మహాపండిత భుక్తాలవుతున్న అగ్రహారాలన్నీ అపహరించడం జరిగింది. పాపులయిన యవనులు బలాత్కారంగా వ్యవసాయం చేసినందువలన పంట పర్యాయాలు లాగుకొనుటచేత దరిద్రులు, ధనికులు అనే భేదం లేక రైతుల కుటుంబాలన్నీ నాశనం అయిపోయాయి. ఆ మహి విపత్కాలంలో ధనం, భార్యలు మొదలైన వేటిలోనూ ప్రజలకు ఇది నాది అనే భావం పోయింది. వారి వ్యాపారము ఇట్లున్నపుడు ఇంక భూమి మీద ప్రాణిలోకం బతకడం ఎట్లా ? ఈ విధంగా పీడింపబడిన త్రిలింగదేశాన్ని రక్షించువారెవరును మనస్సును కూడా తట్టక కార్చిచ్చు చుట్టుకొన్న అడవివలెనంతరించి పోయినది" అని విలసతామ్రశాసనం చెబుతుంది.

పరమతస్థులు దేశాన్ని ఆక్రమించడం వల్ల వైదికమత ధర్మానికి భంగం వాటిల్లిందని విలాస తామ్ర శాసనంలో ప్రస్తావించబడింది. ముస్లింలు కొన్ని దేవాలయాలను ధ్వంసం చేసి వాటి స్థానంలో మసీదులు నిర్మించారు. రాజ మహేంద్రవరంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని మసీదుగా మార్చారు. ఈ రకంగానే ఏలూరు, కొండపల్లి మొదలగుచోట్ల ఆలయాలను ధ్వంసం చేసి వాటి స్థానంలో మసీదులు నిర్మించారు

ద్రావిడ దేశ పరిస్థితి కూడా ముస్లింల పాలనలో ఆంధ్రదేశ పరిస్థితికి భిన్నంగా లేదు. విజయనగర రాకుమారుడు కంపరాయల భార్య గంగాదేవి రచించిన మధురావిజయంలో ద్రావిడ దేశ పరిస్థితి ఈ విధంగా వివరించబడింది. "పూజ పురస్కారాలు నిలిచిపోవుటవల్ల దేవాలయాలు పాడుపడిపోయాయి. అగ్రహారాలలో సతతా ధ్వర సౌరభాలకు బదులు పచ్చి మాంసపు పొలగుబులు కొంటున్నది, వేద ఘోషణకు బదులు వికృత నాదాలు వినవస్తున్నవి. మదురాపురి పరిసరాలోని ఉపవనాలు చూచుటకు ఘోరంగా ఉన్నాయి. నారికేళ షండాలు ఖండితాలయ్యాయి, ఎటు చూసినా మనుష్యకపాల మాలికలు వేలాడు శూలపరంపరలు కానవస్తున్నాయి. తామ్ర పర్ణిపావనోదకాలు నేడు రక్తంతో ఎర్రనై పారుతున్నాయి, వేదం విస్మరించడమయి ధర్మం దాగింది. న్యాయకదార్యాలు భూమిలో ఎక్కడా కానరాదు. దిక్కులేని ద్రావిడుల ముఖాలలో నిరాశ నెలకొనిఉంది."

## 6.2.3 విమోచనోద్యమాలు :

పైన పేర్కొన్నట్లు పరాయి పాలనకులోనై, అరాచట స్థితికి పాల్పడిన దక్షిణ భారతదేశానికి ముస్లిం దురాక్రమణలనుంచి విమోచన **కలిగించడానికి** కాకతీయ ప్రతాపరుద్రుని సేనానులైన తెలుగు నాయకులు ఆంధ్రదేశంలోను, హోయసాల రాజా మూడో బల్లాలుడు **కర్ణాటక**, ద్రావిడ దేశాలలోనూ విమోచనోద్యమాలను నడిపారు. దేశాన్ని ముస్లిం పాలన నుంచి విడిపించాలనే ఏకైక లక్ష్యంతో **ఆంధ్రదేశ**నాయకులు ఒక్క తాటిమీద నిలబడి ఒక రాజకీయ సమాఖ్యగా ఏర్పడినారు. వీరికి ముసునూరి ప్రోలయనాయకుడు నాయకత్వం వహించాడు. అద్దంకి వేమారెడ్డి వంటి రెడ్డినాయకులు, రేచర్ల సింగమనాయకుని వంటి వెలమనాయకులు, మంచి కొండ గణపతినాయకుడు మొదలైన కమ్మనాయకులు ప్రోలయకు సహాయంగా నిలిచారు. ఏరువను పాలిస్తున్న చోడ భక్తిరాజా కూడా వీరితో సహకరించాడు. ఈ విమోచన ఉద్యమంలో కాకతీయుల కాలంలో వున్న 75 మంది నాయకులు పాల్గొన్నారని రెడ్డిరాణి అని తల్లి **కలువచేరు** శాసనం చెబుతుంది.

### ముసునూరి నాయకులు :

గోదావరీ తీరంలోని రేకపల్లి కేంద్రంగా ముసునూరి వంశానికి చెందిన ప్రోలయ నాయకుడు ముస్లిం దురాక్రమణల నుంచి విమోచన కలిగించటానికి ఉద్యమాన్ని నడిపాడు. ఇతనికి పినతండ్రి కుమారుడైన కాపయనాయకుడు సహాయంగా ఉన్నాడు. అయితే ఈ ఉద్యమ వివరాలు తెలియవు. కాని తీరాంధ్రదేశం ముస్లిం పాలన నుంచి విముక్తి పొందినట్లు క్రీ.శ. 1326 నాటి శాసనాల వల్ల తెలుస్తుంది. ప్రోలయవేమారెడ్డి 'మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవు'డని 1325 నాటి ఒక శాసనం చెబుతుంది. ప్రతాపరుద్రుని సేనాపతి కోలని రుద్రదేవుడు ప్రతాపరుద్రుడికి పూర్వంగా చేసిన దానాన్ని గురించి 1326 నాటి మరొక శాసనం చెబుతుంది. అందుచేత క్రీ.శ. 1325 - 1326 మధ్యకాలంలో తీరాంధ్రదేశం ముస్లిం పాలననుంచి విముక్తిని పొందినట్లు భావించవచ్చు. 1326 కు తరువాత ముద్రించిన తుగ్లక్ నాణేలు ఆంధ్రదేశంలో లభ్యం కాకపోవటం కూడా ఈ విషయాన్ని సమర్ధిస్తుంది. ప్రోలయ తరువాత కాపయ నాయకుడు ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణాకు ముస్లిం పాలననుంచి విముక్తి చేకూర్చాడు. హోయసాల మూడో బల్లాలుని సహాయంతో కాపయ ఓరుగల్లు పై దండెత్తి వెళ్లి దాని పాలకుడయిన నాయబ్ వజీర్ మాలిక్‌మక్బూల్ ను ఓడించి పారద్రోలి ఆక్రమించాడు.

### రెడ్డిరాజులు :

తీరాంధ్రంలో గోదావరి మొదలు గుండ్లకమ్మ వరకు గల ప్రాంతాన్ని ఆక్రమించి ప్రోలయవేమారెడ్డి స్వాతంత్ర్యాన్ని ప్రకటించి రెడ్డి రాజ్యస్థాపన చేశాడు. రెడ్డి రాజులు తీరాంధ్ర దేశాన్ని వంద సంవత్సరాలు పాలించారు. రెడ్డి, వెలమ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా

ఉండేది. రెడ్డి, విజయనగర రాజ్యాలకు గుండ్లకమ్మ సరిహద్దుగా ఉండేది. రెడ్డి రాజ్య స్థాపకుడైన వేమారెడ్డి మొదట్లో కాపయకు విధేయుడుగా ఉండేవాడు.

**ఆరవీటి వంశస్థులు :**

కృష్ణానదికి దక్షిణంగా ఈ విమోచన ఉద్యమం ఆరవీటి వంశ పూర్వుడయిన ఆరవీటి సోమరాజు నాయకత్వంలో నడిచింది. సోమదేవుడు, అతని సవతి తల్లి కుమారుడు కోటి కంటి రాఘవుడు బళ్ళారి, కర్నూలు, రాయచూర్ జిల్లాలలో చాలా కోటలను స్వాధీనం చేసుకుని కంపిలి రాజ్యంపై దండెత్తాడు. ఢిల్లీ సుల్తాన్ ప్రతినిధిగా ఆనెగొంది రాజధానిగా కంపిలి రాష్ట్రాన్ని పాలించే మాలిక్ మహమ్మద్ సోమదేవుని ఎదిరించి ఓడిపోయినాడు. మాలిక్ సోమదేవుని ఆధిపత్యాన్ని అంగీకరించాడు. అయితే తరువాత మాలిక్ కంపిలి కోటకు పారిపోయి సుల్తాన్‌కు విధేయుడిగా గతంలాగే ఉన్నాడు.

**బహమనీలు :**

ముసునూరి నాయకులు, రెడ్డిరాజులు, ఆరవీటి వంశస్థులు ఆంధ్రదేశంలో లేవదీసిన విమోచన ఉద్యమం ఆంధ్రదేశానికే పరిమితం గాక దక్షిణ భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించి, తుగ్లక్ పాలన నుంచి విముక్తి పొందడానికి ఉత్తేజం కలిగించింది. జాఫర్ ఖాన్ అనే ముస్లిం నాయకుడు మహమ్మద్ బిన్ తుగ్లక్ పై తిరుగుబాటుచేసి గుల్బర్గా రాజధానిగా ముస్లిం రాజ్యం స్థాపించాడు. దూరదృష్టితో ఆలోచించక ముసునూరి కాపయనాయకుడు ఈ ముస్లిం రాజ్యస్థాపనకు కొంత సైన్య సహాయం చేసినాడు. అల్లా ఉద్దీన్ హసన్ గంగూ బహ్మాద్‌షా అనే పేరుతో జాఫర్ ఖాన్ 1347 లో సింహాసన మెక్కి బహమనీ రాజ్యస్థాపకుడయ్యాడు. బహమనీ రాజ్యం ఆ తరువాత కాపయ నాయకునికి, విజయనగర రాజులకు పక్కలో బల్లెమయింది.

**వెలమలు :**

కాపయ నాయకుడు బహమనీలతో పోరాటం సాగిస్తున్న సమయంలో రేచెర్ల సంగమనాయకుడు స్వాతంత్ర్యం ప్రకటించి తెలంగాణాలోని అమరుగల్లు, పిల్లలమర్రి ప్రాంతాలను జయించి రేచెర్ల వెలమ రాజ్యాన్ని స్థాపించాడు. వీరి చేతులలోనే ఆ తరువాత కాపయనాయకుడు మరణించాడు.

**సంగమ వంశస్థులు :**

ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రతినిధిగా కంపిలి రాజ్యాన్ని పాలించే సంగమ వంశస్థులైన హరిహర, బుక్కసోదరులు విద్యారణ్య స్వామి ప్రేరణ, ప్రోత్సాహలతో సుల్తాన్‌పై తిరుగుబాటు చేసి క్రీ.శ. 1336 లో స్వాతంత్ర్యం ప్రకటించారు. ఆనెగొదింలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన హరిహరరాయలు తన సోదరుల సహాయంతో తుంగభద్రానదీ దక్షిణ తీరంలో విద్యానగరం అనే పేరుతో విజయనగరాన్ని నిర్మించి రాజధానిగా చేసి విజయనగర సామ్రాజ్య స్థాపకుడయినాడు.

## 6.2.4 విజయనగర రాజుల కాలక్రమ పట్టిక :

క్రీ.శ. 1336 లో హరిహర, బుక్క సోదరులచే, విద్యారణ్యస్వామి ప్రేరణతో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం క్రీ.శ. 1646 వరకు సుమారు మూడు వందల సంవత్సరాలు కృష్ణానదికి దక్షిణంగా ఉన్న దక్షిణ భారతదేశంమీద అధికారం చెలాయించింది. వీరి పాలన వలన దక్షిణ భారతదేశ సమాజం మీద ఇస్లాం సంస్కృతీ ప్రభావం ప్రసరించక భారతదేశ చరిత్రలో, దక్షిణ భారతదేశ చరిత్ర, సంస్కృతి ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. నేడు ద్రావిడ భాషలు మాట్లాడే రాష్ట్రాలన్నీ ఆనాడు విజయనగర సామ్రాజ్యంతర్గతంగా, ఏకచ్ఛత్రాధిపత్యంలో ఉండేవి. విజయనగర సామ్రాజ్య ఆశయాలకు తరువాత మహారాష్ట్ర ఛత్రపతులు వారసత్వం వహించారు.

విజయనగర సామ్రాజ్యాన్ని నాల్గు వంశాలకు చెందిన రాజులు పాలించారు. ఆ నాలుగు వంశాలు 1. సంగమ 2. సాళువ 3. తుళువ 4. ఆరవీటి వంశాలు.

**1. సంగమ వంశం : (1336 - 1485)**

మొదటి హరిహరరాయలు (1336 - 1354 - 55)

మొదటి బుక్కరాయలు (1354 -55 - 1377)

రెండో హరిహరరాయలు (1377 - 1404)

రెండో బుక్కరాయలు (1404 - 1406)

మొదటి విరూపాక్షరాయలు (వివాద వారసత్వం)

మొదటి దేవరాయలు (1406 - 1422)

విజయ రాయలు (1422)

రెండో దేవరాయలు (1422 - 1446)

మల్లిఖార్జున రాయలు (1446 - 1465)

రెండో విరూపాక్షరాయలు (1465 - 1485)

**2. సాళువ వంశం : (1485 - 1506)**

సాళువ నరసింహుడు (1485 - 1492 - 93)

ఇమ్మడి నరసింహుడు (1492 - 93 - 1505)

**3. తుళువ వంశం : (1506 - 1570)**

వీరనరసింహ రాయలు (1506 - 1509)

కృష్ణదేవ రాయలు (1509 - 1529)

అచ్యుత దేవరాయలు (1529 - 1542)

మొదటి వెంకటపతి రాయలు (1542)

సదాశివ రాయలు (1542 - 1570)

**4. ఆరవీటి వంశం : (1570 - 1646)**

తిరుమల దేవ రాయలు (1570)

మొదటి శ్రీరంగ రాయలు (1570 - 1586)

రెండో వెంకటపతిరాయలు (1586 - 1614)

రెండో శ్రీరంగరాయలు (1614)

రామరాయలు (1614 - 1630)

మూడో వెంకటపతిరాయలు (1630 - 1642)

మూడో శ్రీరంగరాయలు (1642 - 1646)

మూడో శ్రీరంగరాయలు (1646)

## 6.3 విజయనగర సామ్రాజ్య చరిత్రకు ఆధారాలు

### 6.3.1 పురావస్తు ఆధారాలు :

విజయనగర సామ్రాజ్య చరిత్రను పునర్నిర్మించడానికి అవసరమైన సాధన సామగ్రిని ప్రామాణిక ప్రాధాన్యత క్రమంలో చెప్పాలంటే మొదట పురావస్తు ఆధారాలను చెప్పవచ్చు. ఈ పురావస్తు ఆధారాలలో పేర్కొనదగినవి శాసనాలు, నాణేలు, కట్టడాలు.

**శాసనాలు :**

విజయనగర సామ్రాజ్యచరిత్రకు ప్రప్రథమంగా పేర్కొన దగిన మౌలికాధారాలు శాసనాలు. వీటిలో శిలాశాసనాలు, తామ్రశాసనాలు గలవు. శిలాశాసనాలు కొన్ని సంస్కృతంలోను, అధికంగా ద్రావిడ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ భాషలలో ఉన్నాయి. వీనిలో కొన్ని సంస్కృత ఉపోద్ఘాతాలతో, దేశ భాషా పాఠాలలో ఉన్న ద్విభాషా శాసనాలు .

దేవాలయాల గోడలపై, రాతి స్థంభాలపై వేలాదిగా గల శాసనాలలో కొన్ని ముఖ్యమైనవి గలవు. అలాగే కొన్ని ముఖ్యమైన తామ్రశాసనాలు గలవు. మొదటి హరిహరరాయల బాగేపెల్లి తామ్రఫలక శాసనం హరిహరరాయలు సాధించిన ఘనకార్యాలను వివరిస్తుంది. కంపన కుమారుడైన రెండో సంగముని బిట్రగుంట దానం, విజయనగర సామ్రాజ్య స్థాపనకు కారకులయిన 5 మంది సంగమ సోదరుల వంశవృక్షాన్ని గురించి వివరిస్తుంది. రెండో హరిహరుడి చెన్నరాయపటనా శాసనం, అనేక ప్రాంతాలను జయించడంలో మొదటి బుక్కరాయలు విజయవంతుడయ్యాడని పేర్కొంటుంది. రెండో దేవరాయలు శ్రీరంగం తామ్రఫలకాలు, పాలకుడికి సంబంధించిన వివిధ ఘనకార్యాలను వివరిస్తాయి. ఇమ్మడి నరసింహుడి దేవులపల్లి తామ్రఫలకాలు, సాళువ వంశానికి సంబంధించిన వివరాలను మనకందిస్తాయి. శ్రీకృష్ణదేవరాయల సింహాచలం శాసనంలో అతని తూర్పు దిగ్విజయయాత్ర, పందిళ్ళపల్లి శాసనంలో నాటి రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులు వివరించబడింది.

వందల, వేల సంఖ్యలో గల విజయనగర శాసనాలు దక్షిణ భారతదేశ శాసన సంపుటాల్లో ప్రచురించబడింది. ఈ శాసనాలలోని విషయం సంగ్రహంగా 'దక్షిణ భారత శాసనాలపై వార్షిక నివేదికలు' 'శాసనాలపై వార్షిక నివేదికలు' సంపుటాలలో పొందుపరచబడింది. ఇవిగాక శాసనాలలోని ప్రధానాంశాలను క్లుప్తంగా వివరిస్తూ వి. రంగాచార్య, రాబర్ట్ సూయల్, పి.వి. పరబ్రహ్మశాస్త్రి మొదలైన శాసన పరిశోధకులు ప్రచురించిన 'టొపోగ్రాఫికల్ లిస్ట్', 'క్రోనోలాజికల్ లిస్ట్'ఉన్నాయి. హైదరాబాద్ ఆర్కియలాజికల్ సిరీస్ క్రింద తెలంగాణా జిల్లాలలోని తెలుగు, కన్నడ శాసనాలు కొన్ని సంపుటాలుగా ప్రచురించబడినాయి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ వారు జిల్లాల వారిగా శాసనాలు సేకరించి, వానిని ప్రత్యేక సంపుటాలుగా ప్రకటించారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి 'నెల్లూరు జిల్లాశాసనాలు' పేరుతో బట్టర్ వర్త్, వేణుగోపాలచెట్టి మూడు సంపుటాలు ప్రకటించారు. ఎపిగ్రాఫియా కర్ణాటకా సంపుటాలలో కర్ణాటక రాష్ట్రంలోని శాసనాలు, మూలాలతో ఇంగ్లీష్ అనువాదాలతో దాదాపు సమగ్రంగా ప్రకటించబడినాయి. 'ఎపిగ్రాఫియా ఆంధ్రియా', 'ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జర్నల్', భారతి మొదలైన పత్రికలలో కొన్ని అమూల్యమైన శాసనాలు, సంపాదకుల వివరణలలో ప్రచురించబడ్డాయి. తామ్రశాసనాలు చాలా వరకు 'ఎపిగ్రాఫియా ఇండిక', భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలలో పండితుల వివరణలతో ప్రచురింపబడ్డాయి

**నాణేలు :**

శాసనాలవలె నాణేలు కూడా విజయనగర చరిత్రకు అమూల్యమైన ఆధారాలు. విజయనగర రాజుల నాణేలు అనేకం దక్షిణ దేశమంతా దొరికాయి. నాణాలను వాడిన లోహాన్ని బట్టి, వాటిమీదగల లాంఛనాలు, బొమ్మలు, ఆఖ్యలను బట్టి నాటి రాజకీయ, ఆర్థిక, మత, వాణిజ్య పరిస్థితులే గాక, ఆయా రాజుల గుణగణాలు, రాజ్యవిస్తీర్ణం, కళాభినివేశము మొదలగు అంశాలు గ్రహించవచ్చు. విజయ నగర రాజులు ముద్రించిన నాణాలు సాంకేతికంగాను, కళాత్మకంగాను ఎంతో ఉన్నతమైనవి. వీరు బంగారు, వెండి, రాగి నాణేలను ముద్రించారు. బంగారు నాణాలు ఎక్కువగా లభ్యమైనాయి. వీరి బంగారు నాణేలను 'గాద్యాణాలు' లేక 'పగోడాలు' అని పిలుస్తారు. వీటినే 'వరాహాలు' అని కూడా అంటారు.

విజయనగర రాజులు ముద్రించిన బంగారు నాణాలపైన ఒక వైపు సామాన్యముగా శైవ, వైష్ణవతలు ప్రతిమలు - ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, గండబేరుండ, రెండోవైపు నాగర లేదా కన్నడలిపిలో ఆ నాణాన్ని విడుదల చేసిన రాజుపేరు ముద్రించి ఉంటుంది. వెండినాణేలు రెండో దేవరాయలవి మాత్రమే లభించాయి. దీనికి 'తార్' అని పేరుంది. విజయనగర రాగి నాణాలపై గరుడ, నందీశ్వర, ఏనుగు, గండబేరుండ మొదలగు చిహ్నాలు ఉన్నాయి. వీటిని 'జిటలు', 'కాసులు' అని అంటారు. రెండో దేవరాయలు జారీచేసిన కొన్ని పావు 'వరాహాలు' అతనిని 'గజబెంటకార'గా వర్ణించాయి. శ్రీకృష్ణ దేవరాయలు ముద్రించిన నందీశ్వర ప్రతిమ ఉన్న రాగి నాణేలమీద కన్నడ లిపి, మిగిలిన అన్ని రకాల నాణేలమీద నాగరలిపి వుంది. చిక్కరాయలు ముద్రించిన నందీశ్వర గుర్తు కలిగిన నాణాలపై తెలుగు లిపి వాడడం గమనించవచ్చు.

**కట్టడాలు :**

పురావస్తు సముదాయాలైన భవన శిధిలాలు, దేవాలయాలు, శిల్పాలు, చిత్రలేఖనం విజయనగర చరిత్రను పునర్నిర్మించుటకు తోడ్పడుతుంది. విజయనగర దేవాలయవాస్తు చరిత్రకు హంపిలోని విఠలాలయం, హజారా రామాలయం, విరూపాక్షాలయం, అచ్యుత రామాలయం, పట్టాభి రామలయం, లేపాక్షి, తాడిపత్రి, పుష్పగిరి, చంద్రగిరి, పెనుగొండ, కంచి మొదలగు చోట్ల గల ఆలయాలు, శ్రీశైలం, కాళహస్తి, తిరుపతి మొదలగుచోట్ల గల గోపురాలు, అహోబిలం, మర్కాపురం, సింహాచలాలలో గల మంటపాలు ప్రత్యక్ష సాక్ష్యాలు. హంపిలో గల పద్మమహల్, గజశాలలు, చంద్రగిరి మహల్ ఇండో - ఇస్లామిక్ వాస్తురీతికి ప్రతీకలు. లేపాక్షి వర్ణచిత్రాలకు ప్రసిద్ధి. ఇచటి చిత్రాలను బట్టి విజయనగర రాజుల కాలం నాటి స్త్రీ పురుషుల వస్త్ర ధారణ, ఆభరణాల తీరు తెన్నులు గ్రహించవచ్చు. ఇచట గల ఆలయ నాట్య మండపములోని స్థంభాలపై వివిధ నాట్య విన్యాసాలు మనోహరంగా చెక్కబడ్డాయి.

## 6.3.2 సాహిత్య ఆధారాలు :

విజయనగర చరిత్ర పునర్నిర్మాణానికి ఉపయోగపడే వాఙ్మయ ఆధారాలలో దేశీయ, విదేశీయ రచనలున్నాయి.

**దేశీయ వాఙ్మయం :**

విజయనగర పాలకుల సమకాలీన సంస్కృత, కన్నడ, తమిళ, తెలుగు భాషలలో రచింపబడిన అనేక గ్రంధాలు విజయనగర సామ్రాజ్యచరిత్ర - సంస్కృతీ వైభవాన్ని తెలుసుకొనటానికి తోడ్పడుతున్నాయి. వాటిలో ప్రధానంగా పేర్కొనదగినవి విద్యారణ్య కాలజ్ఞానం, శివయ్య కాలజ్ఞానం, వీరపయ్య కాలజ్ఞానము, ప్రముఖ గ్రంధాలైన 'మధురావిజయం', 'సాళువాభ్యుదయం', 'రామాభ్యుదయం', జైమినీ భారతం, 'ఆముక్త మాల్యద మొదలగునవి.

శ్రీ కృష్ణ దేవరాయల 'ఆముక్తమాల్యద' విజయనగర పాలకుల రాజకీయ వ్యవస్థను గురించి, రాజకీయ ధర్మాల గురించి మనకు తెలియజేస్తుంది. గంగాదేవి 'మధురావిజయం', మొదటి బుక్కరాయల పాలనాకాలంలో కంపరాయలు మధురపై సాధించిన విజయాన్ని

వివరిస్తుంది. సాళువ వంశానికి చెందిన ఒక చారిత్రక కథనం 'సాళువాభ్యుదం' దీని రచయిత రాజనాథడిండిముడు. రెండో దేవరాయల మరణంతరువాత బహమనీలూ, గజపతులూ విజయనగరాన్ని ఆక్రమించుకోవడాన్ని గంగాధరుడి 'గంగ దాసప్రలాప విలాసం' వివరిస్తుంది. విజయనగర సామ్రాజ్యంలోని సామాజిక పరిస్థితులను ముఖ్యంగా కులవ్యవస్థను గురించి అల్లసాని పెద్దన 'మనుచరిత్ర' వివరిస్తుంది. అయ్యలరాజు రామభద్రుడు తన 'రామాభ్యుదయము' ను రచించాడు. కందుకూరి రచించిన 'సుగ్రీవ విజయం' యక్షగానం గురించి చెబుతుంది. ఈ యుగం చివర వేమనయోగి అతి సామాన్యులకు అర్థమయ్యేరీతిలో సమాజంలోని దురాచారాలను, మత ద్వేషాలను మాన్పి, నైతిక ప్రవర్తన వైపు దృష్టి మళ్ళించడానికి చిన్నచిన్న పద్యాలు అనేకం వ్రాసాడు. ఈ పదాలు వేమన శతకం పేరిట ఆంధ్రదేశమంతా బహుళ ప్రచారంలో ఉన్నాయి. మధుర, భాస్కర, జీవందర రాజాదులైన జైన కవులు జైన ధర్మాన్ని వివరిస్తూ, తపోనియమాల ప్రాశస్త్యాన్ని ఉగ్గడిస్తూ గ్రంధాలు రాశారు. తెలుగువేమన లాగా సమకాలీన సాంఘిక మత దురాచారాలను ఖండిస్తూ సర్వజ్ఞమూర్తి అనే అతడు 'సర్వజ్ఞపదగళం' అనే 10వేల పదాలు వ్రాసాడు. ఈ యుగంలో వెలువడిన తమిళ సాహిత్యం ఎక్కువగా మత సంబంధమైంది.

భారతదేశంలో ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో ముస్లిం రాజ్యాలు గురించి ముస్లిం చరిత్రకారుల రచనలు ముస్లిం రాజ్యాలగురించి చెప్పేవైనా, ఆ ముస్లిం రాజ్యాలలో సమకాలికంగా ఉన్న హిందూ రాజ్యాలచరిత్రను తెలుసుకోవటానికి, దేశభాషా వాఙ్మయం నుంచి, శాసనాల నుంచి తెలియజేసే చారిత్రక విషయాలను సరిచూసి విషయం నిగ్గు తేల్చడానికి చాలా ఉపయోగకరమైన మౌలికాధారాలు.

## విదేశీయ వాఙ్మయం :

విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించిన విదేశీ రాయబారుల రచనలు కూడా విజయనగర రాజులు పరిపాలనా విషయాలను, నాటి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోవడానికి తోడ్పడుతున్నాయి. ఆనాటి విదేశీ రాయబారులలో **న్యూనిజ్**, అబ్దుల్ రజాక్, నికోలో కొంటి, బార్బోసా, అథెనీసియస్ నికిటన్, డామింగో పేస్ మొదలగు వారు ముఖ్యులు.

మొదటి హరిహరరాయలు కాలంనాటి విజయనగర సామ్రాజ్యం గురించి మొరాకో (ఆఫ్రికా) యాత్రికుడైన ఇబిన్ బటూటా మంచి సమాచారం అందించాడు. మొదటి దేవరాయల కాలంలో వెనిస్ (ఇటలీ) యాత్రికుడైన నికోలాడికాంటి విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించి నాటి పరిస్థితులను గ్రంధస్తం చేశాడు. రెండో దేవరాయల పాలనలో విజయనగర సామ్రాజ్యానికి సంబంధించి పర్షియాకు చెందిన అబ్దుల్ రజాక్ వివరణాత్మకమైన కథనాన్ని మనకందించాడు. డోమింగో పేస్ కృష్ణదేవరాయల సామ్రాజ్యాన్ని దర్శించిన పోర్చుగీసు దేశస్థుడు. ఇతడు కృష్ణదేవరాయల గూర్చి తెలియజేసాడు. మరో పోర్చుగీసు దేశీయుడైన బార్బోసా కూడా శ్రీ కృష్ణ దేవరాయల పాలనా కాలంలో విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించాడు. మరో పోర్చుగీసు యాత్రికుడు నూనిజ్ అచ్యుత్ దేవరాయల కాలంలో విజయనగర రాజ్యాన్ని దర్శించాడు. విజయనగర రాజ్యంలో రెండు ఓడరేవులున్నట్లు వాటిలో గోవా, మోటుపల్లి ప్రధానమైనవని అబ్దుల్ రజాక్ రాశాడు. ఆనాటి దిగుమతులు, ఎగుమతులు గురించి వివరించాడు.

## 6.4 విజయనగర స్థాపనకు సంబంధించిన వివిధ సిద్ధాంతాలు

క్రీ.శ. 13 వ శతాబ్దం చివరి నాటికి దక్షిణ భారత పాలకులు రాజకీయ ఆధిక్యత కొరకు తమలో తాము కలహించుకుంటూ ఉండేవారు. ఇట్టి పరిస్థితులను అవకాశంగా తీసుకుని ఢిల్లీ సల్తనత్ పాలకులు అనేక మార్లు దక్షిణ భారతదేశంపై దండయాత్రలు జరిపారు. క్రీ.శ. 1327 నాటికి ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ దక్షిణ భారతాన్ని పూర్తిగా జయించి తన ప్రతినిధులను పాలకులుగా నియమించాడు. మహమ్మద్ విధానాలపట్ల, అతని ప్రతినిధుల పరిపాలన పట్ల ప్రజలలో అసంతృప్తి ఏర్పడింది. ఈ అసంతృప్తి తిరుగుబాట్లుగా విజృంభించాయి. ఈ తిరుగుబాట్లనే దాస్య విమోచనోద్యమంగా కొందరు పేర్కొన్నారు. కోస్తా ఆంధ్రప్రాంతంలో, తెలంగాణాలో ప్రోలయ, కాపయనాయకత్వంలో ఉద్యమం కొనసాగింది. ఇదే సమయంలో మధుర నవాబు జలాల్ ఉద్దీన్ హసన షా తిరుగుబాటు చేసి స్వతంత్రించాడు. ఢిల్లీ సుల్తాన్ ఈ తిరుగుబాటును అణచివేయలేకపోవడంతో ఉద్యమనాయకులలో ధైర్యం ద్విగుణీకృతమై నేటి రాయలసీమ ప్రాంతంలో సోమదేవుడు, కర్ణాటకలో మూడో బల్లాలుడు, కంపిలిలో మాలిక్ మాక్బూల్ తిరుగుబాటు

చేశారు. ఈ తిరుగుబాట్లను అణచి, తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి మహమ్మద్ బిన్ తుగ్లక్ హరిహర, బుక్కసోదరులను తన ప్రతినిధులుగా పంపాడు. ఈ ఇద్దరు సోదరులు అంతకు ముందు కంపిలి నుండి బందీలుగా ఢిల్లీకి తీసుకొని పోబడి ఇస్లాం మతం స్వీకరించి మహమ్మద్ కు విధేయులైన వారు. కంపిలికి సుల్తాన్ ప్రతనిధులుగా వచ్చిన హరిహర, బుక్క సోదరులు విమోచన ఉద్యమం పట్ల ఆకర్షితులై, విద్యారణ్య స్వామి ఆశీస్సులతో తిరిగి హిందూ మతాన్ని స్వీకరించి క్రీ.శ. 1336 లో విజయ నగర సామ్రాజ్యాన్ని స్థాపించారు.

## 6.4.1 విజయనగర రాజ్యస్థాపకులు - హరిహరరాయలు, బుక్కరాయలు :

ఢిల్లీ సుల్తాన్ ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ క్రీ.శ. 1323 లో మదురను ఆక్రమించి దానికి తన ప్రతినిధిగా జలాలుద్దీన్ హసన్ షాను నియమించాడు. ఇతడు 10 సంవత్సరాల తరువాత తిరుగుబాటు చేసి (1333 - 34) స్వతంత్రించాడు. ఇతనిని శిక్షించడానికి నాటి ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ ఓరుగల్లు వరకు వచ్చాడు. కాని అక్కడ తన సైన్యంలో ప్లేగువ్యాధి వ్యాపించడంచేత, ఉత్తర భారతదేశంలో తిరుగుబాట్లు చెలరేగినందువల్ల తుగ్లక్ దక్కన్ నుంచి వెనుదిరిగి పోయాడు. సుల్తాన్ దక్కన్ నుంచి ఢిల్లీకి వెళ్ళిపోయిన తరువాత కర్ణాటకంలోని హోయసాల మూడో బల్లాలుడు సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించి తిరుగుబాటు చేసాడు.

ఇదే సమయంలో కంపిలి రాష్ట్ర ప్రజలు తనకు ఎదురుతిరిగారని, కంపిలి దుర్గాన్ని ముట్టడించి తనకు ఎటువంటి ఆహారపదార్థాలు చేరనీయడం లేదని, పన్నులు కట్టడం లేదని వారిని అదుపులోకి తేవడం తనకు సాధ్యం కాదని, స్థానికుడే అక్కడికి రాష్ట్రపాలకుడుగా వస్తే అచటి ప్రజల్లో కొంత అసంతృప్తి తగ్గి వారు సుల్తాను లోబడి ఉండవచ్చని కంపిలి రాష్ట్ర పాలకుడు మలిక్ మహమ్మద్ ఢిల్లీ సుల్తానుకు వర్తమానం పంపాడు. ఈ విషయం న్యూనిజ్ రచనల వల్ల తెలుస్తుంది. ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ తన వజీర్లతో చర్చించి హరిహర, బుక్క సోదరులను తన ప్రతినిధులుగా కంపిలి రాజ్యాన్ని పాలించడానికి పంపాడు. ఈ ఇద్దరు సోదరులు గతంలో కంపిలి రాజ్యంలోని ఆనెగొంది దుర్గాన్ని ఆక్రమించినపుడు, అక్కడ బందీలుగా పట్టుబడి, ఢిల్లీకి తీసుకొనివచ్చి, ఇస్లాం మతంలోకి మార్చబడినవారు. మూడో బల్లాలుని తిరుగుబాటుని అణచడానికి, కంపిలి రాజ్యంలోని ప్రజలను అదుపులోకి తీసుకుని కంపిలి రాజ్యాన్ని తన సామంతులుగా పాలించడానికి, తుగ్లక్ ఈ సోదరులచేత సామంతులుగా ఉండేటట్లు ప్రమాణాలు చేయించి కంపిలి పంపాడు. మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆదేశం మీద హరిహర, బుక్కసోదరులు కంపిలి రాజ్యానికి వచ్చి ప్రజలను సమాధాన పరచి, కంపిలి రాజ్యంలో తమ స్థానాన్ని పటిష్ఠపరచుకోసాగిరి. అయితే ఈ సోదరులు ముస్లింలుగా ఉండటం వల్ల, ప్రజలనుంచి పూర్తి సహకారం లభించలేదు. సోదరులు మొదట గుత్తి ప్రాంతాన్ని ఆ తరువాత కంపిలి రాజ్యం మొత్తాన్ని ఆక్రమించి మూడో బల్లాలునితో పోరు ప్రారంభించారు. ఇదే సమయంలో ఆంధ్రదేశంలో నడుస్తున్న దాస్యవిమోచనోద్యమాల వల్ల ప్రేరితులై, విద్యారణ్యస్వామి ప్రేరణతో ఈ సోదరులు ఇస్లాం మతాన్ని వదలి మరల హిందూమతాన్ని అవలంబించి, హిందూమతోద్ధరణకు కంకణం కట్టుకొన్నారు. వీరు క్రీ.శ. 1336 లో ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్ర్యం ప్రకటించారు.

ముస్లిములతో, స్థానిక హిందూ పాలకులతో నిరంతరం యుద్ధాలు చేయవలసినందువల్ల ఆనెగొంది సురక్షితమైన రాజధాని కాదని తలచి, విద్యారణ్యమహర్షి ప్రోత్సాహంతో, తుంగభద్రానదికి దక్షిణం వైపు 'విద్యానగరం' అనే పేరుతో విజయనగర నిర్మాణాన్ని ప్రారంభించారు. విజయనగర నిర్మాణాన్ని, దాని నిర్మాతను గూర్చి న్యూనిజ్ ఇలా చెబుతాడు. "సుల్తాన్ మహమ్మద్ తుగ్లక్ నాగుండి రాజ్యాన్ని పాలించడానికి పంపిన దేవరాయ్ విద్యాజన మహర్షి సలహామీద నాగుండి నదీతీరంలో కొత్త నగరాన్ని నిర్మించాడు. నాగుండిని పాలించడానికి పూర్వం, ఈ దేవరాయ్ క్రీ.శ. 1330 ప్రాంతంలో సుల్తాన్ చంపిన నాగుండి పాలకుని కొలువులోని వాడు". హరహర, బుక్క సోదరులు విద్యారణ్యుని పట్ల కృతజ్ఞతతో తాము ప్రారంభించిన ఈ కొత్త రాజధానికి విద్యానగరమని పేరుపెట్టారు. విజయనగర నిర్మాణం క్రీ.శ. 1344 నాటికి పూర్తి అయింది. ఈ విజయనగంలోనే హరిహర రాయలు 1336 ఏప్రిల్ 18 న వైదిక ధర్మానుసారంగా విరూపాక్ష దేవుని సన్నిధిలో, రాజ్యం భగవంతునిదనే భావంతో రాజ్యపాలనలో ఆ దేవుని ప్రతినిధిగా పట్టాభిషిక్తుడయినాడు.

## 6.4.2 హరిహర, బుక్క రాయల పుట్టుపుర్వోత్తరాలు :

విజయనగర రాజ్య తొలి చరిత్ర ఇతమిద్దముగా లేదు. విజయనగర చరిత్రపై విస్తృతంగా పరిశోధన చేసిన బళ్ళారి జిల్లా కలెక్టర్ రాబర్ట్ సీవెల్ తన గ్రంథమగు 'విస్మృత విజయనగర చరిత్ర' లో విజయనగర తొలిచరిత్రపై ఉన్న ఆధారాలను నిశితముగా పరిశీలించి, విజయనగర స్థాపనకై ఏడు భిన్నమైన గాధలు కలవని తెలియజేసాడు. ఇవన్నీ చాలా వరకు కట్టుకథలని అతడు అభిప్రాయపడినాడు. 'కురుబ' తెగకు చెందిన ఈ సోదరులు కాకతి ప్రతాపరుద్రుని కోశాగార ఉద్యోగులనీ క్రీ.శ. 1323 లో ఓరుగల్లు పతనమయ్యాక ఆనెగొంది ఆస్థానంలో చేరారనీ, ఆ తరువాత ఆనెగొందిని ఆక్రమించిన ఢిల్లీ సుల్తాన్ తన ప్రతినిధిని అక్కడ నియమిస్తే ప్రజలు తిరగుబాటు చేశారనీ, అప్పుడు సుల్తాన్ స్థానికులైన ఈ సోదరుల్ని పాలకులుగా నియమించాడని సీవెల్ పేర్కొన్నాడు.

ప్రాచీన దక్షిణ భారతదేశ చరిత్రలో దక్షిణా పథాన్నంతా పాలించిన సాతవాహనుల పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించి వారి జన్మస్థలమేది, వారు ఆంధ్రులా, కన్నడిగులా, మహారాష్ట్రులా అని చరిత్రకారులలో భేదాభిప్రాయాలున్నట్లే, విజయనగర రాజ్యాన్ని స్థాపించక పూర్వం హరిహర, బుక్కసోదరులు ఎవరు ? వారు ఎక్కడి వారు ? వారు కన్నడిగులా, తెలుగువారా ? అని చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. సాతవాహనులుగాని, విజయనగర రాజ్యస్థాపకులు కాని వారి వారి శాసనాలలో ఎక్కడ వారు భాషా పరంగా కాని, ప్రాంతీయంగాకాని తాము ఆంధ్రులమని కాని, కన్నడిగులమని కాని ఎక్కడా చెప్పుకోలేదు. ప్రాచీన , మధ్యయుగాలలో హిందూరాజులందరూ వారి శాసనాలలో భాషాపరంగా, ప్రాంతపరంగా చివరకు జాతి పరంగా కూడా తమను గూర్చి శాసనాలలో చెప్పలేదు. వారు తమ శాసనాలలో వారునుసరించిన మతధర్మంగా తాము పరమబ్రాహ్మణ్యులమనో, పరమ మహేశ్వరులమనో, పరమ వైష్ణవులమనో, ఆగమ నిలయులనో, విరూపాక్షుని, వెంకటేశ్వరుని, రామచంద్రుని ఆరాధించేవారమనో తెలుపుకొన్నారు.

ఆధునిక చరిత్రకారులు కొంతమంది పాలకులకు గల భాషాపరమైన ప్రాంతీయ తత్వాన్ని బట్టి, చారిత్రకాధారాలను వారి అభిప్రాయాలకు వీలుగా సమన్వయపరచి, వారి అభిప్రయాలకు అనుకూలంగా లేని చారిత్రకాధారాలను పక్కకునెట్టి, విస్మరించి సాతవాహనులను కన్నడిగులనో, మహారాష్ట్రులనో, ఆంధ్రులనో చెప్పినట్లే, విజయనగర స్థాపకులను కన్నడిగులనో, ఆంధ్రులనో నిర్ణయించి దానిపై వాద ప్రతివాదాలను కొనసాగించడమయింది.

### కన్నడసిద్ధాంతం :

విజయనగర రాజ్యనిర్మాత కన్నడిగుడైన మూడవబల్లాలుడని హీరాస్, కృష్ణస్వామి అయ్యంగారు, కృష్ణశాస్త్రి, దేశాయ్, గాయ్, సాలెటోర్ మొదలగు చరిత్రకారులు అభిప్రాయపడినారు.

ఫెరిష్టారచనల ఆధారంగా హీరాస్ పండితుడు విజయనగర నిర్మాత కర్ణాటకకు చెందిన హోయసాల మూడో బల్లాలుడని సిద్ధాంతీకరిస్తూ, బల్లాలుడు తన రాజ్యం ఉత్తర సరిహద్దులో క్రీ.శ. 1344 లో తన కుమారుడు విజయ విరూపాక్షుని పేర రక్షణావసరాల దృష్ట్యా 'బిజ్‌నగర్' నిర్మించి, దానికి తన ఆస్థానంలో ఉన్న తనకు ఆప్తుడైన హరిహరుని పాలకునిగా నియమించాడని పేర్కొన్నాడు. ఇదే విధంగా కృష్ణస్వామి అయ్యంగారు, కృష్ణశాస్త్రి, దేశాయ్, గాయ్, సాలెటోర్ వంటి చరిత్రకారులు హీరాస్ సిద్ధాంతాన్ని బలపరుస్తూ హరిహర, బుక్కసోదరులు బల్లాలుని ఆస్థాన ఉద్యోగులనీ, అందుచేత వారు కన్నడిగులేనని పేర్నొన్నారు. అంతేగాక విజయనగరం కర్ణాటకంలో ఉందని, వల్లభరాయ, శ్రీనాధుని వంటి తెలుగు కవులు కూడా విజయనగరాన్ని కన్నడ రాజ్యలక్ష్మి అని, విజయనగర రాధీశుల్ని కర్ణాటక్షితి పాలుర' ని సంబోధించారనీ, సంగములు కన్నడ బిరుదులు ధరించారనీ, లభ్యమైన విజయనగర శాసనాల్లో అధికశాతం కన్నడంలోనే ఉన్నవనీ పేర్కొన్నారు. పైగా న్యూనిజ్ రచనలలో పేర్కొనబడిన 'దేవరాయ్' హోయసాల ప్రభువైన మూడో బల్లాలుడని విశ్వసించారు.

కన్నడ వాదాన్ని ప్రబోధించిన చరిత్రకారుల ప్రకారం హరిహర రాయలకు తెలుగుదేశంతో గాని, కాకతి ప్రతాపరుద్రుని ఆస్థానంతోను ఏ విధమైన సంబంధంలేదు. హరిహర రాయల కన్నడిగుడు, అతడు మొదటనుండి మూడవ బల్లాలుని కొలువులోనే ఉండేవాడు.

మూడో బల్లాలుడే విజయనగరాన్ని నిర్మించి, ముస్లిందాడులనెదుర్కోడానికి హరిహరరాయలను హోయసాల రాజ్య ఉత్తర భాగంలో సర్వాధికారాలతో పాలకుడు నియమించాడు.

పరస్పర విరుద్ధమైన అంశాలతో, పాక్షిక దృక్పథంతో నిండిన ఫెరిష్టా రచనల ఆధారంగా సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం, దానిని బలపరచడం సమర్థనీయం కాదు. మూడో బల్లాలుడే విజయనగరాన్ని స్థాపించెనని చెప్పిన ఫెరిష్టా మరల తానే విజయనగర నిర్మాత ముస్లింల బందిఖానా నుంచి విముక్తి పొందిన హిందూ రాకుమారుడని పేర్కొన్నాడు. మూడోబల్లాలుడు క్రీ.శ. 1344 లో విజయనగరాన్ని నిర్మించెనని చెప్పిన ఫెరిష్టా మరల తానే బల్లాలుడు క్రీ.శ 1342 లో మరణించాడని చెప్పాడు. హరిహర, బుక్కసోదరులు బల్లాలుని ఆస్థానంలోని ఉద్యోగులని రుజువు చేసే సాక్ష్యం లేదు. ఇంకా దీనికి విరుద్ధంగా వారు హోయసాలులతో పోరాడినట్లు ఆధారాలున్నాయి. విజయనగర చరిత్రపై గల భిన్న ఆధారాలను కూలంకషముగా పరిశీలించి న్యూనిజ్ రచనలలోని దేవయ్ మొదటి హరిహరుడని పెక్కుమంది చరిత్రకారులు అభిప్రాయపడిరి. దేశం కర్ణాటకమయినంత మాత్రాన ఆ రాజ్యస్థాపకులు కన్నడిగులే అయి ఉండాలని నియమం లేదు. అంతే గాక ఒక భాషా ప్రాంతం వారు అన్యభాషా ప్రాంతంలో రాజ్యం నిర్మించినపుడు స్థానిక సంప్రదాయాలను గౌరవించడం, ఆయా భాషలను ఆదరించడం రాజనీతి లక్షణం. దీనికి అనుగుణంగానే విజయనగర పాలకులు వ్యవహరించారు. విజయనగర రాజులు సమ్యక్ దృష్టిలో తెలుగు, కన్నడ విభేదాలకు అవకాశం ఇవ్వకుండా పరిపాలించారు. కాబట్టి హోయసాల మూడోబల్లాలుడు విజయనగర స్థాపకుడనే వాదం నిలవదు.

## తెలుగు సిద్ధాంతం :

న్యూనిజ్ వృత్తాంతం, బరనీ రచించిన 'తారీఖ్ - ఇ - ఫీరోజ్ షాహీ', ఇసామి రచించిన 'ఫుతూహుస్సలాతీన్', రాజకాల నిర్ణయం, విద్యారణ్య వృత్తాంతం, కమారరామన కథే, వీరప్పయ్య కాలజ్ఞానం మొదలగు విదేశీయ, దేశీయ గ్రంథాలలోని విషయాలను సమన్వయించి సూయల్, రంగాచారి, నేలటూరి వెంకటరమణయ్య, నీలకంఠశాస్త్రి, ఆర్. సుబ్రహ్మణ్యం మొదలగు చరిత్రకారులు హరిహర, బుక్కల చేత విజయనగర రాజ్యస్థాపన జరిగిందని, హరిహరుడు అతని సోదరుడు తెలుగు దేశానికి చెందిన వారని నిర్ణయించారు.

నేలటూరి వెంకటరమణయ్య, నీలకంఠశాస్త్రి సిద్ధాంతం ప్రకారం మంగళనిలయ నివాసి సంగముని కుమారులైన హరిహర బుక్కలు కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థాన ఉద్యోగులు. ఓరుగల్లు పతనం తరువాత వారు కంపిలి పారిపోయి కంపిలిదేవుని ఆశ్రయం పొంది, అతనితో వియ్యమంది అతని కోశాధికారులయ్యారు. క్రీ.శ. 1328 లో సుల్తాన్ కంపిలిని ఆక్రమించినపుడు వారు అతనికి బందీలుగా ఢిల్లీ చేరారు. సుల్తాన్ ఢిల్లీకి వెనుదిరిగిన వెంటనే కంపిలిలోని అతని ప్రతినిధిపై తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటుదార్లు ఆ ప్రతినిధిని తరిమివేయగా అపుడు కంపిలిదేవునికి బంధువులైన సంగమసోదరులచే ఇస్లాం మతం స్వీకరింపజేసి వారిని కంపిలి తిరుగుబాటును అణచడానికి సుల్తాన్ పంపాడు. ఆ విధంగా కంపిలికి వెనుదిరిగి వచ్చిన సోదరులు మొదట్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారు ముస్లిములుగా ఉండటం వల్ల ప్రజలువారిని వెంటనే విశ్వసించలేదు. దీనితో వారు మొదట గుత్తి ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. అదే సమయంలో వారికి ప్రసిద్ధ వైదిక విద్వాంసుడు విద్యారణ్యుని ప్రోత్సాహం లభించింది. ఆ యతీంద్రుని ప్రేరణతో ఇస్లాం వదలడంతో వారు ప్రజలకు చేరువయ్యారు.. ఆ తరువాత వారు మూడో బల్లాలునితో పోరాడి ఆనెగొందిని ఆక్రమించుకొన్నారు. క్రీ.శ. 1336 లో ఓరుగల్లుని కాపయనాయకుడు ఆక్రమించిన సమయంలోనే హరిహరుడు సుల్తాన్ అధికారాన్ని కాదని స్వాతంత్ర్యం ప్రకటించుకొని ఆనెగొందిలో రాజ్యాన్ని స్థాపించాడు.

ఆనాటి విపత్కర పరిస్థితులలో ఆనెగొంది రాజ్య రాజధానిగా సురక్షితం కాదని భావించి విద్యారణ్య స్వామి సలహామీద హరిహరుడు తుంగభద్ర దక్షిణ తీరంలో ప్రకృతి సహజమైన రక్షణవలయంలో నూతన రాజధానిని నిర్మించాడు. ఈ నూతన రాజధానిని సంగమ కుమారులు సాధించిన విజయమునకు చిహ్నముగా 'విజయనగరమని', నూతన సామ్రాజ్యస్థాపనలో విద్యారణ్యస్వామి వహించిన పాత్రకు చిహ్నంగా 'విద్యానగరమని' పిలువబడెను.

ఈ విధంగా తెలుగువారైన హరిహర, బుక్కసోదరులు క్రీ.శ. 1336 లో విజయనగర సామ్రాజ్యస్థాపన చేసిరనుట నిర్వివాదాంశము క్రీ.శ. 1344 నాటికి విజయనగర నిర్మాణము పూర్తియై, రాజధాని ఆనెగొంది నుండి విజయనగరమునకు మార్చబడెను.

### 6.4.3 విజయనగర సామ్రాజ్య స్థాపనోద్దేశాలు - ఆదర్శాలు :

మహమ్మదీయుల పాలననుంచి దక్షిణ భారతదేశ దాస్యవిమోచనోద్యమంలో ఒక భాగంగా విజయనగర సామ్రాజ్య స్థాపన క్రీ.పూ. 1336 లో జరిగింది. ఈ ఉద్యమంలో ఆంధ్రదేశంలోని నాయకులు లేదా మూడోబల్లాలుడు జాతిపరమైన స్వాతంత్రేచ్ఛతో చేసిన పోరాటాలుగా చెప్పడానికి వీలులేదు. అలాగే హిందూ పాలకులంతా కలసి హిందూ ధర్మరక్షణ కోసం చేసిన ఉద్యమంగా కూడా ఈ పోరాటాలను వర్ణించలేము. ఢిల్లీ సుల్తాన్ పాలనను అంతం చేసి, స్వతంత్రరాజ్యాలు స్థాపించుకోవడానికి దక్షిణ భారత పాలకులు, నాయకులు చేసిన ప్రయత్నాలుగా మాత్రమే ఈ పోరాటాలను అర్థం చేసుకోవలసి ఉంది.

**హిందూ ధర్మ పరిరక్షణ :**

విజయనగర సామ్రాజ్య స్థాపనలో హరిహర, బుక్క సోదరుల ప్రధాన ఉద్దేశం దక్షిణ భారతదేశంలో ఇస్లాం మత వ్యాప్తిని అరికట్టి హిందూ ధర్మపరిరక్షణ చేయటమేగాని, అది రాజ్యకాంక్షతో రాజకీయోద్దేశాలతో మాత్రమే నెలటూరి వెంకట రమణయ్య, సోమశేఖర శర్మ, దేశాయ్, రిత్తి, బి.ఆర్. గోపాల్, ఆర్. సుబ్రహ్మణ్యం, కృష్ణశాస్త్రి, సాలెటోర్ మొదలగు పండితులు భావించారు. విజయనగర సామ్రాజ్య స్థాపనకు హరిహర, బుక్కసోదరులు పూనుకొన్న ప్రత్యేక పరిస్థితులను బట్టి, ఆ సామ్రాజ్యం తన 300 సంవత్సరాల ఉనికిలో హిందూ ధర్మ పరిరక్షణకు, సంస్కృతీ అభ్యుదయానికి చేసిన సేవలను బట్టి, ముస్లిం పాలనలో హిందూ సమాజంలో ఏర్పడిన అరాచక పరిస్థితిని బట్టి, హిందూ ధర్మ, సంస్కృతులకు కలిగిన తీవ్రభంగపాటు బట్టి, హిందూధర్మ పరిరక్షణ చేయాలనే విద్యారణ్యస్వామి సంకల్పాన్ని బట్టి, వీరశైవమత ప్రాబల్యాన్ని బట్టి పై చరిత్రకారులు విజయనగర సామ్రాజ్య స్థాపన హిందూధర్మ పరిరక్షణ కొరకు అని భావించారు. దక్కన్‌లో స్థాపించబడిన బహమనీ ముస్లిం రాజ్యం వల్ల విజయనగరం సైనిక రాజ్యంగా రూపొంది, సమాజంలో పూర్వమర్యాదను రక్షించే బాధ్యతను స్వీకరించిరని ఈ పండితులు అభిప్రాయపడినారు.

**రాజ్య కాంక్ష :**

విజయనగర స్థాపనలో ప్రధానమైన ఉద్దేశం రాజ్యకాంక్షే కాని, హిందూ మత రక్షణకు, ముస్లిం వ్యాప్తి ప్రతిఘటనకు అయిన ఆదర్శం కాదని బర్టన్ స్టెయిన్, హనుమంతరావు మొదలగు పండితులు పేర్కొన్నారు. వీరివాదం ప్రకారం విజయనగర వ్యాప్తి ప్రథమంలో హిందూ రాజ్యలైన హోయసాల, రెడ్డిరాజ్యాలను కబళించడంతో ప్రారంభమయింది. అంతేగాని ముస్లిం రాజ్యాలను ఎదుర్కోవడంతో ప్రారంభం కాలేదు. 15 వ శతాబ్దంలో విజయనగరం దక్షిణంలో చేసిన దండయాత్రలు చాలా వరకు దోపిడి దండయాత్రలే. తమిళ దేశంలో అనాదిగా వున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు నశించిపోతుంటే విజయనగర రాజులు దానిని రక్షించడానికి ఏ విధమైన ప్రయత్నం చేయకపోతే వానిని అణగదొక్కే ప్రయత్నాలు చేసారు. ఇస్లాంను ప్రతిఘటించి హిందూధర్మాన్ని రక్షించడానికి ఉన్నామని చెప్పుకొన్న విజయనగరానికి ప్రధాన శత్రువులు హిందూ రాజులే. రాజధాని నగరంలో తురుష్కులపేట, మసీదు, ముస్లిం సమాధులు ఉండేవి. దాని భవన నిర్మాణ పద్ధతిలో ముస్లిం లక్షణాలు కలవు. విజయనగర సైన్యంలో ముస్లింలు ఉండేవారు. రాజధానిలోని నిర్మాణాలను పరిశీలిస్తే అక్కడ అధికారం లౌకికమైనదే గాని మత దృష్టి కలిగింది కాదు. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఆంధ్ర దేశంలోని నాయకులు స్వతంత్ర రాజ్యాలు స్థాపించుకోవాలనే రాజకీయ కాంక్షతో ఉద్యమాలు నడిపినట్లే, విజయనగర స్థాపనలో రాజ్యస్థాపకులు ప్రధాన ఆశయం రాజకీయ పరమైన అధికారకాంక్షే గాని హిందూమత పరిరక్షణ కాదు.

**పరిశీలన :**

పై వాదాలను నిశితంగా పరిశీలిద్దాం. ఆంధ్రదేశంలోని నాయకులు రాజ్యకాంక్షతో స్వతంత్రరాజ్యాలు స్థాపించిన విధానానికి, విజయనగర రాజ్యస్థాపన చేసిన విధానానికి సామ్యంలేదు. కంపిలికి తిరిగి రాక పూర్వం హరిహర బుక్కసోదరులు ఇస్లాం మతానికి మారారు. విద్యారణ్యస్వామి ప్రేరణతో వీరు తిరిగి హిందూమతంలో ప్రవేశించారు. ఇటువంటి మార్పు యధాలాపంగా జరిగిందని చెప్పటానికి వీలులేదు. హరిహర, బుక్క సోదరుల ఆకాంక్ష రాజ్య స్థాపన మాత్రమే అయితే వారు హిందూ మతానికి మారవలసిన

అవసరం లేదు. ఒక మహోన్నత ఆశయంతోనే విద్యారణ్యస్వామి సోదరులను హిందూమతంలోనికి స్వీకరించాడు. నాటి పరిస్థితులలో హిందూ సమాజాన్ని, ధర్మాన్ని రక్షించడమే విద్యారణ్యుని ఆశయము. ఈ ఆశయ సాధనకు సోదరులను విద్యారణ్యుడు, ప్రేరేపించాడు. ఈ ప్రేరణతోనే సోదరులు విజయనగరాన్ని క్రీ.శ. 1336 లో స్థాపించారు. కేవలం రాజకీయ పరమైన ఒక రాజ్యాన్ని నిర్మించడానికి సర్వసంగ పరిత్యాగి అయిన విద్యారణ్యులు సోదరులకు ప్రేరణ ఇచ్చి ఆదరించవలసిన అవసరం లేదు. అలాగే సోదరులు విద్యారణ్యుల ఆశీర్వాదం కాని, సహాయ సహకారాలు పొందనవసరం లేదు. పైగా విజయనగర స్థాపకాల ఆశయం హిందూ ధర్మరక్షణ అని చెప్పటానికి మరో నిదర్శనం విజయనగర రాజులందరూ తన శాసనాలలో విరూపాక్ష, రామచంద్ర, వెంకటేశ్వర అని దైవాలకు ప్రతినిధులుగా రాజ్యాన్ని పాలిస్తూ, హిందూ ధర్మ రక్షణ చేయడానికి అంకితమైన వారని తెలుపుతుంది. విజయనగర తొలి రాజులు సామంతబిరుదులు ధరించడం, తాము దేవుని ప్రతినిధులుగా, ధర్మరక్షణ చేయటానికి రాజ్యం పాలిస్తున్నామని తెలపడానికే, హరిహర, బుక్కసోదరులు ముస్లిములుగా ఉండి హిందువులుగా మారినందువల్ల, ప్రజలు వారి చిత్తశుద్ధి శంకించకుండా ఉండటానికి విద్యారణ్యుని ఉపదేశం మీద రాజ్యందైవానిదనీ, తాము దైవ ప్రతినిధులుగా రాజ్యం చేస్తున్నామని ప్రజలకు తెలియచెప్పటానికి వారు ఇట్లా చేశారని నేలటూరి అభిప్రాయపడినాడు. ఆ తరువాత కాలంలో కూడా విజయనగర రాజులు రాజముద్రను దైవం పేరుతో వేయడం, వారు విజయనగర స్థాపనాశయమైన హిందూ ధర్మ రక్షణకు అంకితమయి ఉన్నామని తెలపడానికే విజయనగర రాజ్యస్థాపన జరిగిన తరువాత సోదరుల ఆదరణలో సాయణాచార్యులు వేద భాష్యం రాయటం విజయనగర స్థాపకులు వైదిక ధర్మోద్ధరణ ఆశయాన్ని సూచించేదే. అలాగే మాధవాచార్యులు 'పరాశర మాధవీయ వ్యాఖ్య' రాయటం రాజ్యవ్యవహారాలను హిందూధర్మానుసారంగా నడపడానికే చాళుక్యులకు, కాకతీయులకూ రాజశిఖా ముద్రగా ఉన్న ఆదివరాహాన్ని విజయనగర పాలకులు గ్రహించడం, వారి శాసనాలలో ప్రారంభ శ్లోకంగా ఉన్న శివస్తుతి శ్లోకాన్ని తమ శాసనాలలో గూడ వ్రాయడం పూర్వ మర్యాదను పాటించి ధర్మ రక్షణ చేస్తామని తెలపడానికే. అంతేగాక వరాహముద్ర, శివస్తుతి శ్లోకం సోదరులకు కాకతీయులలో గల సన్నిహిత సంబంధాన్ని సూచిస్తుంది.

విజయనగర రాజ్యం రాజకీయంగా రూపొందిన ఒక లౌకిక రాజ్యమే గాని ధార్మిక రాజ్యం కాదని చెప్పటానికి చూపిన కారణాలు పరిశీలనకునిలవవు. విజయనగర సామ్రాజ్యం హిందూ రాజ్యాలను ఆక్రమించి వ్యాప్తి చెందినందువల్ల అది హిందూ ధర్మరక్షణ ఆశయంలో స్థాపించబడలేదని చెప్పడం సరికాదు. ఔరంగజేబు దక్కన్‌లోని ముస్లిం రాజ్యాలను కబళించాడు. అందువల్ల అతను ముస్లిం ధర్మ వ్యాప్తికి అంకితం కాలేదని చెప్పలేం. సార్వభౌమ ఆశయ సిద్ధిలో భాగంగా విజయనగర రాజులు పొరుగున ఉన్న హిందూ రాజ్యాలను జయించారు. దీని అర్థం హిందూ ధర్మరక్షణకు అంకితం కాలేదని కాదు. విజయనగర సైన్యంలో ముస్లిములున్నారని, రాజధానిలో ముస్లిం నిర్మాణాలున్నాయని అందుచేత విజయనగర సామ్రాజ్య ఆశయం హిందూ మత రక్షణకాదని చెప్పటం కూడా సరికాదు. విజయనగర సైన్యంలో వుండిన ముస్లింల సంఖ్య చాలా తక్కువ. తమ సైనికులకు శిక్షణ ఇవ్వడానికి విజయనగర రాజులు నిపుణులయిన కొంతమంది ముస్లింలను రాజకీయ ప్రయోజనాలలో నియమించారు. దీనికి విజయనగర రాజకీయాలకు సంబంధంలేదు. రాజధానిలోని నిర్మాణాలలో ముస్లిం లక్షణాలు ఉన్నందువల్ల విజయనగర రాజులు హిందూ ధర్మ రక్షకులు కాదని చెప్పడం కూడా సరికాదు. ఆనాడు కళారంగంలో, సారస్వత రంగంలో ఇలాంటి పరస్పర ప్రభావాలు సహజమైనవి.

పై చర్చను బట్టి హరిహర, బుక్క సోదరులు విద్యారణ్యస్వామి ప్రేరణతో క్రీ.శ. 1336 లో విజయనగర రాజ్య స్థాపన చేయటంలో ఉద్దేశం దక్షిణ భారతదేశంలో ఇస్లాం మత వ్యాప్తిని అరికట్టి, హిందూ ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని పరిరక్షించడమేనని నిస్సంశయంగా చెప్పవచ్చు. విజయనగర సామ్రాజ్యం తన 300 సంవత్సరాల ఉనికిలో, ఈ ధ్యేయంలో విఫలం కాలేదని చెప్పడానికి కృష్ణానదికి దక్షిణంగా నేటికి నిలిచి వున్న అద్భుత దేవాలయాలే. విజయనగర సామ్రాజ్య ధ్యేయమైన హిందూ సంస్కృతి రక్షణ, ఆ సామ్రాజ్య పతనంలో అంతమైపోలేదు. విజయనగర రాజులు తరవాత వారి ఆశయాలను మహారాష్ట్ర ఛత్రపతులు కొనసాగించాడు.

## 6.4.4 మతాంతరీకరణ వృత్తాంతం :

ఇస్లామీ రచనలు ఆధారంగా హరిహర, బుక్కసోదరులకు మహమ్మద్ బిన్ తుగ్లక్ ఇస్లాంమతం ఇచ్చినాడని, ఆనెగొందిని ఆక్రమించిన తరువాత వారు మతం మార్చుకొని స్వాతంత్ర్యం ప్రకటించారని అనేకమంది పండితులు అభిప్రాయపడినారు. హరిహర, బుక్కసోదరులు

మత మార్పిడి విషయాన్ని హిందూ రచనలేవి ప్రస్తావించలేదు. ఉత్తర భారతదేశంలో ఇటువంటి మతమార్పిడిలు జరుగుతూనే ఉన్నాయి. మతం మార్చుకున్నవారిపై హిందువులకు సానుభూతే గాని ద్వేషం ఉండేదికాదని తెలుస్తుంది. అయినచో స్థానిక హిందూరచనల బట్టి ఈ సోదరుల మత మార్పిడిని సందేహించవలసివస్తుంది. మహమ్మద్ బిన్ తుగ్లక్ ఇస్లాం దురాభిమాని కాకపోవడమే గాక హిందువుల పట్ల ఉదారంగా ఉన్నాడని, అందుచే అతనిని 'మతద్రోహి' అని సనాతన ముస్లింలు వ్రాసారు. అట్టి మహమద్ సోదరులకు నిర్బంధంగా ఇస్లాం ఇచ్చినాడనడం నమ్మదగిన విషయం కాదు. అదీగాక స్థానికులకు పంపడం ద్వారా ఆనెగొందిలో తన అధికారాన్ని కాపాడుకోవాలనే ఆశయంతో సోదరులను పంపాడు. అట్లయితే వారికి ఇస్లాం ఇవ్వడం వల్ల సుల్తాన్ ఆశయానికే భంగం వాటిల్లుతుంది. నాటి ముస్లిం రచయితలు ఇస్లాం ఘనతను గుడ్డిగా నమ్మినవారు. దేశంలోని ప్రజలంతా ఇస్లాం స్వీకరించాలని, సుల్తాన్ అందుకు సహాయపడాలని ముస్లింలను మాత్రమే ఆదరించాలని వారి ఆకాంక్ష, కేవలం అట్టివారి రచనలే ఆధారంగా హరిహర, బుక్క సోదదరుల మతాంతరీకరణ కథను నమ్మడం సమంజసం కాదు.

### 6.4.5 విద్యారణ్య సమస్య :

విజయనగర స్థాపనలో విద్యారణ్యులు ప్రముఖపాత్ర వవహించారనీ, విద్యానగరంం అతని సలహామీదనే నిర్మించబడిందనీ, అదే విజయనగరం అయిందని శృంగేరి మఠాచార్యులు సృష్టించిన గాథల్ని, విద్యారణ్య వృత్తాంతం వంటి స్థానిక చరిత్రలు ప్రచారం చేయడంతో ఇస్లాం మతానికి వ్యతిరేకంగా విజయనగర స్థాపన జరిగిందని, హిందూ మతానికి రక్షణ లభించిందని నమ్మే మత తత్త్వ వాదులైన చరిత్రకారులకు ఊతం లభించినట్లయింది. కాని నిజానికి శాసనాల ప్రకారం విజయనగర స్థాపన జరిగింది మొదలు క్రీ.శ. 1376 వరకు భారతీ తీర్థులు శృంగేరీ పీఠాధిపతి. అంతేగాక గంగాదేవి రచనల్లో విద్యారణ్యాల ప్రసక్తి లేదు. పైగా దేవరాయల కాలం వరకు సంగముల కులగురువులు క్రియాశక్తి ఆచార్యులు వీటన్నిటినీ బట్టి చూస్తే విజయనగర స్థాపనలో విద్యారణ్యులపాత్ర లేదనేచెప్పాలి.

### 6.4.6 నగర నిర్మాణము :

హరిహరరాయలు విజయనగర రాజ్యస్థాపన చేసిన తరువాత కొంత కాలం ఆనెగొంది రాజధానిగా వుంది. ఆనాటి రాజకీయ పరిస్థితుల్లో ఆనెగొంది రాజధానిగా సురక్షిత ప్రదేశం కాదని, తుంగభద్రానది దక్షిణ తీరంలో కొత్త నగరం నిర్మించి తన విజయాలకు సూచనగా విజయనగరం అని పేరు పెట్టినాడు. హరిహరుని సోదరుడైన బుక్కరాయల పర్యవేక్షణలో నగర నిర్మాణం క్రీ.శ. 1343 నాటికి పూర్తికాగా, రాజధానిని క్రీ.శ. 1344 లో ఆనెగొంది నుండి విజయనగరానికి మార్చడమయింది. ఈ విజయనగరాన్ని అభేద్యమైన దుర్గంగా నిర్మించారు. నగరానికి తూర్పుపడమర దిశల్లో పర్వతపంక్తులు, దక్షిణ వైపున రామదుర్గమనే గుట్టలు, ఉత్తరాన తుంగభద్రానది ఉన్నందున విజయనగరం గిరి దుర్గంగా రూపొందింది. నగరం చుట్టూ 7 శిలా ప్రాకారాలను నిర్మించారు 7 ప్రాకారాలలోపల ఒక గుట్ట మీద రాజమందిరం, టంకశాల, సేనాధిపతి నివాసం ఉండేవి. విజయనగరం మొత్తం మీద 14 మైళ్ళపొడవు, 10 మైళ్ళ వెడల్పు కలిగి సకలైశ్వర్యాలకు, సమస్త విద్యలకు నిలయమై కీర్తిని ఆర్జించింది.

## 6.5 సారాంశము :

దక్షిణ భారతదేశ చరిత్రలో అత్యంత కీలకమైనపాత్ర నిర్వహించినది విజయనగర సామ్రాజ్యం. ముస్లిందాడుల నుంచి భారతీయ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని పరిరక్షించే ధ్యేయంతో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం దక్షిణ భారతదేశం మొత్తం మీద అధికారం చెలాయించింది. దాదాపు 300 సంవత్సరాలపాటు దక్షిణ భారతదేశాన్ని విజయనగర రాజులు పాలించి హిందూ సంస్కృతిని పరిరక్షించే క్రమంలో అనేక అద్భుత దేవాలయాలను నిర్మించారు. వారు హిందూ సాంప్రదాయానికి, సంస్కృతికి ఎనలేని సేవ చేశారనటంలో అతిశయోక్తి లేదు.

- డా. వి.కె. మోహన్.

పాఠం : 7

# సంగమ - సాళువ వంశములు

**లక్ష్యం :**

క్రీ.శ. 1336 లో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం 1646 వరకు కొనసాగింది. ఈ మధ్య కాలంలో విజయనగర సామ్రాజ్యాన్ని 4 రాజవశంశాలు పాలించాయి. వాటిలో మొదటిదైన సంగమ వంశం 150 సంవత్సరాలు పాలించింది. ఈ వంశస్థుల పరిపాలనా కాలంలో విజయనగర రాజ్యం కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రదేశంలోని రాయలసీమ ప్రాంతాలకు విస్తరించి సామ్రాజ్యంగా రూపుదిద్దుకుంది. సంగమ వంశ పాలకుల తరువాత సాళువ వంశరాజులైన సాళువ నరసింహరాయలు ఇమ్మడి నరసింహరాయలు విజయనగరాన్ని పాలించారు. సంగమ, సాళువ వంశాల రాజకీయ చరిత్రను తెలియజేయటమే ఈ పాఠం లక్ష్యం.

**విషయక్రమం :**


7.1 పరిచయం

7.2 సంగమ వంశము

7.2.1 మొదటి హరిహరరాయలు

7.2.2 మొదటి బుక్కరాయలు

7.2.3 రెండవ హరిహరరాయలు

7.2.4 రెండవ బుక్కరాయలు

7.2.5 మొదటి దేవరాయలు

7.2.6 రెండవ దేవరాయలు

7.3 సంగమవంశ అస్తమయం

7.3.1 మల్లికార్జున రాయలు

7.3.2 రెండో విరూపాక్షరాయలు

7.4 సాళువ వంశము

7.4.1 సాళువ నరసింహరాయలు

7.4.2 ఇమ్మడి నరసింహరాయలు

7.5 సారాంశము

## 7.1 పరిచయం :

విజయనగర సామ్రాజ్యస్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయలు సంగముని కుమారులయినందువల్ల వీరి వంశానికి సంగమ వంశం అని పేరు వచ్చింది. వీరి వంశీయులు క్రీ.శ. 1336 నుండి 1485 వరకు 8 మంది రాజులు 150 సంవత్సరాలు పాలించారు. హరిహరరాయలు తన సోదరులైన కంప, బుక్క, మారప్ప, ముద్దప్ప సహాయంతో విజయనగర రాజ్యాన్ని క్రమక్రమంగా విస్తరింపచేసి, రాజ్య పునాదులను పటిష్టంగా నిర్మించి, దానికి స్థిరమైన పాలనా వ్యవస్థను ఏర్పరచాడు. ఈ వంశంలో సుప్రసిద్ధుడు రెండో దేవరాయలు. ఇతని కాలంలో విజయనగర రాజ్యం మునుపెన్నడూ లేనంతగా విస్తరించింది. విజయనగర గౌరవ ప్రతిష్టలు ఇనుమడించాయి. ఇటలీయాత్రికుడు కాంటే, పర్షియా రాయబారి రజాక్ ఇతని ఆస్థానాన్ని దర్శించి విజయనగర వైభవాన్ని వర్ణించారు.

## 7.2 సంగమ వంశము

### 7.2.1 మొదటి హరిహర రాయలు :

విజయ నగర సామ్రాజ్య స్థాపకుడు మొదటి హరిహర రాయలు. ఇతడే విజయనగరమును పాలించిన తొలిరాజు. ఇతని తల్లి దండ్రులు మానాంబిక, సంగమరాజు. ఇతడు యదువంశ క్షత్రియుడు. ఇతనికి కంపరాయలు, బుక్కరాయలు, మారప్ప, ముద్దప్ప అనే నల్గురు సోదరులు కలరు. తన సోదరుల సహాయంతో ముఖ్యంగా బుక్కరాయల సాయంతో హరిహరరాయలు విజయనగర రాజ్యాన్ని, గొప్ప సామ్రాజ్యముగా రూపొందించాడు.

క్రీ.శ. 1339 నాటికే హరిహర రాయలు రాజ్యం తూర్పున బంగాళాఖాతం నుండి పడమర అరేబియా సముద్రం వరకు వ్యాపించినట్లు క్రీ.శ. 1339 నాటి 'అటకల గుండు' శాసనం, 'ఆకుమళ్ళ' తామ్రశాసనం చెబుతుంది. ఈ శాసనాలను హరిహర రాయలను 'పూర్వ పశ్చిమ సముద్రాధిపతి' అని వర్ణించింది. క్రీ.శ. 1340 నాటికి హరిహర రాయలు రాజ్యం ఉత్తర దిక్కున బాదామి వరకు విస్తరించినట్లు అక్కడ లభించిన అతని శాసనం వల్ల తెలుస్తున్నది. హరిహర రాయలు 'చతుస్సముద్రాధిపతి' అని 1340 నాటి శాసనం పేర్కొన్నది. 1342 లో పశ్చిమ సముద్ర తీరంలోని హొనావర్‌ను హరియన్ (హరిహరరాయలు) అనే ముస్లిమేతరుడికి ఒక సుల్తాన్ లోబడి పాటించే వాడని ఇబన్ బటూటా పేర్కొన్నాడు.

#### ఉదయగిరి దుర్గ ఆక్రమణ :

క్రీ.శ. 1343 నాటికి తూర్పు సముద్రతీరం ప్రాంతంలోని ఉదయగిరి దుర్గాన్ని హరిహరుని సోదరుడైన బుక్కరాయలు ఆక్రమించాడు. ఈ తూర్పు ప్రాంతానికంతా ఉదయగిరిని కేంద్రంచేసి, ఆ దుర్గాన్ని విజయనగర రాజులు పటిష్టం చేశారు. 'రాయసింహాసనానికి మొదటి దుర్గమైన ఉదయగిరి' అని శాసనాలు ఉదయగిరి ప్రాముఖ్యాన్ని గూర్చి పేర్కొన్నాయి. అప్పటి వరకు తూర్పు తీరంలో ప్రాముఖ్యంలో ఉన్న నెల్లూరు తన ప్రాముఖ్యాన్ని కోల్పోయింది. రాజకీయాధికారం నెల్లూరు నుండి ఉదయగిరికి మారింది. ఈ దుర్గానికి మొదటి బుక్కరాయలు కుమారుడైన విరూపాక్షరాయలు అధిపతిగా ఉన్నాడు. ఇతని తరువాత ఈ దుర్గాన్ని కంపరాయలు పాలించారు. "ఉదయగిరి విజయం అద్దంకి రెడ్డి రాజ్య ఆక్రమణకు అంకురార్పణ, భవిష్యత్కాల తీరాంధ్ర దేశ చరిత్ర గతిని అది మారు త్రోవకు తిప్పినది" అని నేలటూరి వెంకట రమణయ్య పేర్కొన్నాడు.

#### హోయసాల రాజ్య ఆక్రమణ :

హరిహరుని కాలంలో హోయసాల రాజ్యం విజయనగర రాజుల స్వాధీనమయింది. మధుర సుల్తానుతో జరిగిన యుద్ధంలో హోయసాల రాజు మూడో బల్లాలుడు మరణించాడు. ఇతని తరువాత ఇతని కుమారుడు విరూపాక్ష నాల్గో బల్లాలుడు రాజ్యానికి

వచ్చాడు. ఇతడు సమర్థుడు కాదు. విజయనగర సైన్యం హోయసాల రాజ్యంపై దండెత్తి రాగా నాల్గో బల్లాలుడు పారిపోయి బనవాసిని పాలించే కదంబుల వద్ద ఆశ్రయం పొందాడు. 1346 నాటికి హరిహరుని తరవున బుక్కరాయలు హోయసాల రాజ్యాన్ని జయించి విజయనగర రాజ్యంలో విలీనం చేశాడు.

## విజయనగర - బహుమనీ సంఘర్షణ :

మొదటి హరిహరరాయల కాలంలోనే విజయనగర రాజులకు బహమనీ సుల్తానులకు మధ్య పోరు ఆరంభమైంది. విజయనగర బహమనీ సంఘర్షణ గత కాలపు వారసత్వంగా సంక్రమించినది అని గొర్తి వెంకటరావు అంటాడు. హరిహరుని కాలంలోనే దక్కన్‌లో క్రీ.శ. 1347 లో బహమనీ రాజ్యస్థాపన జరిగింది. దానికి మొదటి సుల్తాన్ అయిన అల్లా ఉద్దీన్ హసన్ బహమన్ షా హిందూ రాజ్యాలను జయించి తన రాజ్యాన్ని విస్తరింపజేసుకోవడానికి ప్రయత్నించాడు. కృష్ణా, తుంగభద్ర, అంతర్వేది దక్షిణాపథంలో కీలక స్థానం ఉంది. దీనిని ఆక్రమిస్తే దక్షిణాపథ సార్వభౌమత్వం సులభసాధ్యం. అందువల్లనే దీనిపై ఆధిపత్యం కోసం గతంలో పల్లవ - చాళుక్య, చాళుక్య చోళ, యాదవ - హోయసాల సంఘర్షణలు జరిగాయి. ఇపుడు విజయనగర - బహమనీ సంఘర్షణ అందుకోసమే. అందులోనూ రాయచూరు, ముద్గల్ వంటి బలమైన దుర్గాల ఉనికి ఈ అంతర్వేది ప్రాముఖ్యాన్ని పెంచింది. రాజ్య విస్తరణకాంక్ష విజయనగర బహమనీ రాజ్యాల రాజులకూ సహజమే. సారవంతమైన భూములతోనూ, తీర వాణిజ్యంతోను వృద్ధి చెందిన విజయనగర రాజ్య ఐశ్వర్యం కూడా నిస్సార పీఠభూమి ప్రాంతంలో ఉన్న బహమనీ రాజ్యపాలకులను ప్రేరేపించింది. పైగా ముసునూరి, విజయనగర పాలకులు బహమనీ రాజ్యపు అరబ్బీ గుర్రాలకు సంబంధించిన వాణిజ్యానికి అడ్డంకులు కల్పించేవారు. విదేశీ వాణిజ్య కేంద్రమైన గోవా మీద ఇరువర్గాల దృష్టి పడింది. వీటికి తోడు పరిసర రాజ్యాలు బహమనీల బంగారు నాణేలను కరిగించి వారి ద్రవ్య విధానానికి నష్టం కలిగించేవారు. ఈ రాజకీయ, ఆర్థిక కారణాలకు మతమనే మారణాయుధం తోడయింది. ఇస్లాం మత వ్యాప్తి బహమనీ సుల్తానుల ధ్యేయమైతే దీనిని నిరోధించడం, తమ తమ సంస్కృతులకు తగిన రక్షణ కల్పించడం విజయనగర పాలకుల లక్ష్యమయింది. ఈ కారణాల వల్ల విజయనగర - బహమనీ రాజులకు మధ్య నిరంతర తీవ్ర సంఘర్షణ తప్పలేదు. ఈ సంఘర్షణ మధ్యయుగ దక్షిణాపథ రాజకీయ చరిత్రలో ప్రధానాంశమయింది.

క్రీ.శ 1347 లో విజయనగర రాజ్య ఉత్తర సరిహద్దుల్లో ఒక తిరుగుబాటు జరిగింది. ఇది అవకాశంగా తీసుకుని బహమనీ పాలకుడు అల్లా ఉద్దీన్ హసన్ బహ్మన్ షా తన సేనాని ముబారక్ ఖాన్ ను హరిహర రాయల రాజ్యం పైకి పంపాడు. ముబారక్ దండెత్తి వెళ్ళి రాయచూర్ వరకు గల ప్రాంతాన్ని జయించాడు. రాయచూర్ వద్ద ఉభయపక్షాలకు తీవ్ర పోరాటం జరిగింది. ఈ పోరాటంలో విజయనగర సైన్యాలు బహమనీ సైన్యాలను ఓడించి మళ్ళించాయి. అయితే హరిహర రాయలు రాయచూర్ దుర్గానికి పశ్చిమంలో, ఉత్తరంలో బాదామి వరకుగల ప్రాంతాన్ని కోల్పోయాడు. విజయనగర పాలకులకు బహమనీ సుల్తానులకు మధ్య జరిగిన తొలి యుద్ధం ఇదే. నాటినుండి అంతర్వేది కోసం ఇరు పక్షాల మధ్య భయంకర పోరు కొనసాగింది.

## కదంబ రాజ్య ఆక్రమణ :

హరిహర రాయల కాలంలో మరో విజయం కదంబ రాజ్య ఆక్రమణ. హోయసాల నాల్గో బల్లాలునికి ఆశ్రయమిచ్చి బన వాసిని పాలిస్తున్న కదంబులు హరిహర రాయల కోపానికి కారకులయినారు. హరిహరరాయలు తమ్ముడు మారప్ప పెద్ద సైన్యంతో దండెత్తి వెళ్ళి బనవాసి పాలకుని ఓడించి, అతని రాజ్యాన్ని విజయనగర రాజ్యంలో విలీనం చేశాడు.

## మధుర దండయాత్ర :

హరిహరరాయల కాలంలో జరిగిన ఒక ముఖ్య సంఘటన మధుర దండయాత్ర. మధుర సుల్తాన్‌చే ఓడించబడి బందీగా ఉన్న తొండమండల పాలకుడు సంబువరాయలను రక్షించడానికి ఈ దండయాత్ర జరిగింది. క్రీ.శ 1352 లో ఉదయగిరి నుంచి కంపరాయల కుమారుడు సావణ్ణ ఒక సైన్యంతో, కోలార్ జిల్లా ముళబాగల్ నుంచి బుక్కరాయల కుమార కంపన మరొక సైన్యంతో ఏక కాలంలో

మధురపైకి దండెత్తి వెళ్ళారు. మధుర సుల్తాన్ వారిని ఎదిరించి పరాజయం చెందాడు. సాంబువరాయుని బంధవిముక్తిని చేసి మరల అతనిని తొండమండలం రాజుగా చేసి సావణ్ణ, కంపనలు 'శంబువరాయ స్థాపనాచార్య' అనుబిరుదులు ధరించారు.

హరిహరరాయలు సమర్థుడైన పాలకుడు. తన సోదరుల సహాయంతో స్వతంత్ర విజయనగర రాజ్య స్థాపన చేయడమే గాక, రాజ్యాన్ని సువిశాల భూభాగాలతో విస్తరింపజేసాడు. తన మంత్రుల సహాయంతో చక్కని పరిపాలనా వ్యవస్థను రూపొందించాడు. హరిహరుని మంత్రులలో ఒకడైన అనంతరసు పాలన సౌకర్యం కోసం విజయనగర రాజ్యాన్ని సీమలుగా, నాడులుగా, స్థలాలుగా విభజించాడు. కరణీకపు మిరాసులను ఏర్పరచి, కావలి కట్టుబాట్లను చేసి చక్కని పాలనా వ్యవస్థను నిర్మించాడు. అనేక చెరువులను త్రవ్వించి వ్యవసాయాభివృద్ధికి పాటుబడినాడు. ఇతని సేవలకు మెచ్చి హరిహర రాయలు ఇతనికి 'సర్వ శిరః ప్రధాని', 'చిక్కడదయుడు' అనే బిరుదులనిచ్చి సత్కరించాడు. హరిహర రాయలు తన సోదరులను రాజ్యంలోని వివిధ ప్రాంతాలకు ప్రతినిధులుగా నియమించాడు. ఉదయగిరి రాజ్యానికి కంపరాయలు, హోయసాల రాజ్యానికి బుక్కరాయలు, అరగమలెనాడు రాజ్యానికి మారప్ప, ముళువాయి రాజ్యానికి ముద్దప్ప మండలేశ్వరులైనారు.

## 7.2.2 మొదటి బుక్కరాయలు : (క్రీ.శ. 1356 - 1377)

హరిహర రాయల తరవాత అతని తమ్ముడైన బుక్కరాయలు విజయనగర సింహాసనమధిష్టించాడు. ఇతడు విజయనగర రాజ్యస్థాపనలో, ఆ తరువాత రాజ్య విస్తరణలోను హరిహరునితో బాటు తీవ్రంగా కృషిచేశాడు.

**కంపరాయల దక్షిణ దిగ్విజయ యాత్ర :**

బుక్కరాయల కాలంలో జరిగిన తొలి ముఖ్య సంఘటన తొండమండలాన్ని ఆక్రమించడం. కంచి పరిసర ప్రాంతాలను తొండమండలమంటారు. క్రీ.శ. 1335 లో హరిహర రాయలచే ప్రతిష్ఠితుడైన సంబువ రాయలు కొంత కాలం విజయనగర రాజుకి విధేయ సామంతుడై పాలించాడు. హరిహరుని మరణం తరువాత విజయనగర అధికారాన్ని ధిక్కరించి, మధుర సుల్తాన్‌తో కలిసి కుట్రలు పన్నసాగాడు. ఉత్తరం వైపునుంచి విజయనగరంమీద బహమనీ దాడులు అవకాశంగా తీసుకొని ద్రావిడదేశంలో విజయనగరానికి చెందిన కొంతభాగాన్ని ఆక్రమించాడు. దీనితో ఆగ్రహించిన బుక్కరాయలు, సంబువరాయలను శిక్షించడానికి తన కుమారుడైన కుమార కంపనను దక్షిణం మీదికి పంపాడు. సంబువ రాయలకు, కుమార కంపనకు మధ్య జరిగిన యుద్ధంలో సంబువరాయలు, అతని కుమారుడు రెండో వెనుమ కొండాన్ మరణించినట్లున్నారు. దీనితో తుండీర రాజ్యం లేక రాజగంభీర రాజ్యం అనే పేరుతో గల సంబువ రాజ్యం అంతమయింది. తొండమండలం విజయనగర రాజ్యంలో విలీనమయింది. ఈ విజయం 1360 లో జరిగిందని కొందరుపండితులు అభిప్రాయపడినారు. అయితే మరికొందరు పండితులు ఈ విజయం 1362 లో జరిగిందని, కంపన సంబువరాయలను బందీచేసి తిరిగి అతని రాజ్యంలో నిలిపాడని, విజయనగర సామంతుడుగా నంబువరాయలు తన పాలన కొనగించాడని అభిప్రాయపడినారు.

**విజయనగర - బహమనీ సంఘర్షణ :**

బుక్కరాయల కాలంలో విజయనగర రాజులకు బహమనీ సుల్తానులకు మధ్య జరిగిన యుద్ధాల గూర్చి ఫెరిష్టా తన రచనల్లో పొందుపరిచాడు. కాని ఇతని రచనలు నమ్మదగినవి కావని కొందరు చరిత్ర కారులు అభిప్రాయ పడినారు. అల్లా ఉద్దీన్ తరువాత అతని మొదటి కుమారుడు మొదటి మహమ్మద్ షా బహమనీ పాలకుడయ్యాడు. ఇతడు రాజ్యానికి రాగానే కొంతమంది అమీర్లు తిరుగుబాటు చేశారు. ఇది అవకాశంగా తీసుకుని రాయచూర్ ప్రాంతాన్ని తనకు తిరిగి ఇవ్వాలని బుక్కరాయలు, కౌలసను తిరిగి ఇవ్వాలని ముసునూరి పాలకుడు మహమ్మద్ షా దగ్గరికి ఒకేసారి రాయబారం పంపారు. ఇదే సమయంలో ఢిల్లీ సుల్తాన్ దక్కన్ పై దండెత్తి వస్తున్నాడని తెలిసి హిందూ రాజులను శిక్షించడానికి ఇది సమయం కాదని తలచి రాయబారులను తన ఆస్థానంలోనే ఉంచుకొని

యుద్ధ సన్నాహాలు చేయసాగాడు. ఢిల్లీ సుల్తాన్ తన దాడిని విరమించుకోవడంతో మహమ్మద్ షా హిందూ రాజులు తనకు సామంతులనీ, అందువల్ల వారు తనకు చెల్లించవలసిన కప్పం వెంటనే చెల్లించాలనీ రాయబారుల చేత తిరుగు కబురు పంపాడు. దానితో బుక్కరాయలు, ముసునూరి కాపయ ఆగ్రహించి ఏక కాలంలో బహమనీ రాజ్యంపై దండెత్తి వచ్చారు. కాపయ కుమారుడు కౌసలను ఆక్రమించాడు. బుక్కరాయలు అంతర్వేదిని ఆక్రమించాడు. కాని బహమనీ సేనలు కాపయసేనలను ఓడించి ఒక లక్ష బంగారు హన్నులు, 26 ఏనుగులు తీసుకొని వెళ్ళాయి. చివరకు మహమ్మద్ బుక్కరాయలను కొన్ని సంధి షరతులకు ఒప్పించినట్లు ఫెరిష్టా వ్రాసాడు. ఈ సంధి ప్రకారం ఉభయరాజ్యాల మధ్య కృష్ణానది సరిహద్దుగా ఉండవలె. ఉభయపక్షాల వారు యుద్ధంలో చిక్కి బందీలయిన వారిని విడిచి పెట్టాలి. ఇకముందు యుద్ధం జరిగితే స్త్రీలను, శిశువులను వధించకూడదు. ఒక 10 సంవత్సరాల పాటు ఇరు పక్షాలు సంధిషరతులను పాటించాయి. ఈ కాలంలో (1365 - 1375) విజయనగర, బహమనీ రాజ్యాల మధ్య ఎలాంటి యుద్ధాలు జరగలేదు.

**రెడ్డి రాజులు :**

బహమనీ సుల్తానులతోటి యుద్ధాలు తరవాత బుక్కరాయలు కొండవీటి రెడ్డిరాజులతో యుద్ధానికి దిగాడు. బుక్కరాయలు దండెత్తి వెళ్ళి కొండవీటి రెడ్డి రాజైన అనపోతారెడ్డిని ఓడించి అతని రాజ్యంలోని అహోబిలం, వినుకొండ ప్రాంతాలను ఆక్రమించాడు. బుక్కరాయలు ఈ తూర్పు తీర దండయాత్ర 1364 ప్రాంతంలో జరిగినట్లు శాసనాలు, స్థానిక చరిత్రల వల్ల తెలుస్తుంది.

**మధురా విజయం :**

బుక్కరాయల పరిపాలనా కాలంలో జరిగిన ఘనకార్యాలలో ప్రధానమయింది కుమార కంపరాయల మధురా విజయం. తొండమండల విజయంతో విజయనగర రాజ్య సరిహద్దు మధుర రాజ్యాన్ని తాకింది. దానితో రెండు రాజ్యాల మధ్య ఘర్షణ తప్పనిసరి అయింది. కేవలం రాజ్యవ్యాప్తికే గాక హిందూ ధర్మ సముద్ధరణ కొరకు కుమార కంపణ మధుర దండయాత్ర తలపెట్టినాడు. ఈ దండయాత్రకు సంబంధించిన వివరాలు గంగాదేవి రచించిన 'మధురా విజయం'లో వర్ణించబడింది. ఈ దండయాత్రలో కుమార కంపణతో బాటు గోపన దండనాయకుడు, సాళువ మంగు పాల్గొన్నారు. సాళువ మంగు అతి శౌర్య సాహసాలతో పోరాడి, మధుర సుల్తాన్ ను సంహరించి 'పరపక్షి సాళువ' అను బిరుదాన్ని ధరించాడు. మధుర సుల్తాన్‌ను బుక్కన్ చంపివేసి మధురను ఆక్రమించినట్లు అఫీఫ్ అను ముస్లిం చరిత్రకారుడు చెప్పాడు. ముస్లిం దండయాత్రకాలంలో శ్రీరంగం నుంచి రక్షణకు తిరుమల తిరుపతి కి తీసుకొని పోయిన శ్రీరంగనాధస్వామిని మళ్ళా మధురా విజయం తర్వాత 1371 లో యధాస్థానానికి చేర్చారు. మధురా విజయంతో విజయనగరం గొప్ప సామ్రాజ్యమై ఉత్తరాన తుంగభద్ర నుంచి దక్షిణాన సేతుబంధ రామేశ్వరం వరకు వ్యాపించింది. బుక్కరాయలు ద్రావిడ దేశానికి కుమార కంపణను పాలకునిగా నియమించాడు. కాని దురదృష్టవశాత్తు ఇతడు 1374 లో అకాలమరణం పొందాడు.

హరిహర రాయలు ప్రారంభించిన విజయనగర సామ్రాజ్య స్థాపనా లక్ష్యాన్ని బుక్కరాయలు పూర్తి చేశాడు. బుక్కరాయ మహాప్రధాని అయిన అనంత రాయలు పెనుగొండ దుర్గాన్ని నిర్మించాడు. తన సామ్రాజ్యాన్ని బుక్కరాయలు రాజ్యాలుగా విభజించి వాటిలో పాలకులుగా రాజకుమారులను, మంత్రులను, దండనాయకులను నియమించాడు. ఇతని సామ్రాజ్యంలో ఉదయగిరి రాజ్యం, పెనుకొండ రాజ్యం, ముళువాయి రాజ్యం, అరగ - మలైనాడు రాజ్యం, తుళురాజ్యం, రాజగంభీర రాజ్యం ఉన్నాయి. ధర్మపాలనలో బుక్కరాయలు మనువు వంటివాడని గంగాదేవి వ్రాసింది. వేద భాష్యకారుడైన శాయణాచార్యులు, మాధవుడు ఇతని మంత్రులు. వారణాసి నుండి విద్యారణ్యులను విజయనగరానికి బుక్కరాయలు రప్పించాడు. వైదిక వాఙ్మయానికి భాష్యరచన ప్రారంభమయింది. 'వైదిక మార్గ ప్రవర్తక' బిరుదం బుక్కరాయలకు సార్థకం. తెలుగు కవి నాచన సోమనాధుని బుక్కరాయలు ఆదరించాడు. బుక్కరాయలు తన కుమారుడైన రెండో హరిహరరాయలను తనకు వారసునిగా నియమించి మరణించాడు.

బుక్కరాయల తన పాలనా కాలం చివరలో క్రీ.శ 1374 లో చైనాకు ఒక రాయబారాన్ని పంపినట్లు చైనాను పాలించిన మింగ్ వంశ చరిత్ర తెలుపుతున్నది.

## 7.2.3 రెండో హరిహరరాయలు : (క్రీ.శ. 1377 - 1404)

బుక్కరాయలు తరువాత రెండో హరిహరరాయలు విజయనగర సింహాసనం అధిష్టించాడు. ఇతని కాలంలో రాజ్యపాలనా విధానంలోను, వైదేశిక నీతిలోను ముఖ్యమైన మార్పులు వచ్చాయి. నాటి వరకు సామ్రాజ్య భాగాలను దాయాదులు పాలించేవారు. కేంద్రాధికారం పట్ల వారి విధేయత క్రమంగా క్షీణించే ప్రమాదం ఉన్నందున వారిని తొలగించి రెండో హరిహరరాయలు తన కుమారులను నియమించాడు. ఉదయగిరిలో దేవరాయలు, మధురలో విరూపాక్షరాయలు, యువరాజు రెండో బుక్కరాయలు ములబాగల్ ప్రాంతంలో నియమించబడినారు. అరగరాజ్యంపై నమ్మకస్తుడైన మాధవ మంత్రి నియమితుడయినాడు. రాష్ట్రాలీవిధంగా విశ్వాసపాత్రులైన ఉద్యోగుల, రాకుమారుల పరమై, అధికారం కేంద్రీకృతమయినందున రెండో హరిహరుడు 'మహామండలేశ్వర' బిరుదానికి బదులు సార్వభౌమాధిపత్యం సూచించే రాజాధిరాజు, రాజపరమేశ్వర అనుబిరుదులు ధరించాడు.

### నాటి పరిస్థితులు :

రెండో హరిహరుని కాలానికి బహమనీలతో మైత్రి వహించిన పద్మనాయకులు ఓరగల్లును ఆక్రమించారు. వెలమ - బహమనీ కూటమి విజయనగరానికి ప్రమాదకరమని దాన్ని విచ్ఛిన్నం చేయడానికి హరిహరుడు ప్రత్నించాడు. అంతేగాక సాధ్యమైతే రెడ్డి రాజ్యాన్ని జయించి కృష్ణానదిని విజయనగర ఉత్తర సరిహద్దు చేయడం, కనీసం రెడ్డి రాజ్యంతో సఖ్యంచేయడం అతని ఆశయం. ముజహిద్ షా హత్యతో గుల్బర్గాలో చెలరేగిన అలజడులు, అనంతరం సింహాసన మెక్కిన రెండో మహమ్మద్ షా శాంతి కాముకుడు కావడం, కొండవీటిలో కుమారగిరి, పెద కోమటి వేమారెడ్డి మధ్య స్పర్థ అతనికి ప్రోత్సాహాన్నిచ్చింది.

### రెడ్డి రాజ్యంపై దండయాత్ర :

రెండో హరిహర రాయలు రెడ్డి రాజ్యంలోని శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించి రెడ్డి సేనాని అయిన కాటయవేమారెడ్డి చేతిలో ఓడి అతని కుమారునికి తన కుమార్తెను ఇచ్చి సంధిచేసుకొన్నాడు. కుమారగిరి రెడ్డి చివరి కాలంలో జరిగిన అంతర్యుద్ధాలను ఆసరాగా తీసుకుని హరిహరుడు ఉదయగిరి పాలకుడైన దేవరాయలను రెడ్డి రాజ్యంపైకి పంపాడు. దేవరాయలు క్రీ.శ. 1400 లో మోటుపల్లి దుర్గాన్ని ఆక్రమించాడు. క్రీ.శ. 1402 లో పెదకోమటి వేమారెడ్డి పైకి చౌండప సేనానిని హరిహరుడు పంపాడు. కాని ఈ ప్రయత్నాలేవీ ఫలించలేదు. పెదకోమటి వేమారెడ్డి సింహాసనమధిష్టించిన తరువాత తన రాజ్యభాగాలన్నిటినీ తిరిగి స్వాధీనం చేసుకొన్నాడు.

### ... నగర - బహమనీ సంఘర్షణ :

...ండో హరిహర రాయలు వెలమ - బహమనీ కూటమిపై రెండు దండయాత్రలు పంపినాడు. మొదటి దండయాత్ర తెలంగాణాపై ...ంది. దీనిని యువరాజు బుక్కరాయలు, సాళువ రామదేవుడు నిర్వహించినారు. యుద్ధంలో సాళువ రామదేవుడు ప్రాణాలు కోల్పోయాడు. బహమనీ సైన్యం చేత కొత్తకొండ యుద్ధంలో పరాజయం పొంది బుక్కరాయలు తిరోగమించినాడు. ఈ పరాజయానికి ప్రతీకారంగా 1397 ప్రాంతంలో రెండో దండయాత్ర జరిగింది. దీనికి బుక్కరాయలు, గుండ దండనాయకుడు నాయకత్వం వహించినారు. ఈ దాడిలో భాగంగానే దేవరాయలు అలంపురంపై దాడి చేసినట్లు తెలుస్తుంది. సుల్తాన్ ఫిరోజ్ షా ఈ దాడిని తీవ్రంగా ప్రతిఘటించినాడు. భీకర పోరాటం తరువాత పానగల్లు బుక్కరాయల స్వాధీనమయింది.

### గోవా ఆక్రమణ :

రెండో హరిహరరాయల మంత్రియైన మాధవుడు క్రీ.శ. 1378 లో గోవాను జయించి అక్కడనుండి ముస్లింలను పారద్రోలాడు. గోవాతోబాటు పశ్చిమ తీరంలోని రేవు పట్టణాలైన బేల్, దాభోల్‌లు కూడా విజయనగర సామ్రాజ్యంలో చేరినవి.

**సింహళముపై దాడి :**

రెండో హరిహరరాయలు రాజ్యానికి వచ్చిన తొలి రోజులలో అతని కుమారుడైన విరూపాక్షరాయలు సింహళ ద్వీపాధిపతిని జయించిఅతని నుండి కప్పం వసూలు చేశాడు.

విజయనగర రాజులలో రెండో హరిహరరాయల స్థానం ప్రముఖమైనది. ఇతడు పండితుడు. కవి పండిత పోషకుడు. ఇరుగప్ప దండనాయకుడు, మంత్రి పండితుడు అయిన సాయణాచార్యుల సహాయంగా హరిహరుడు రాజ్యాన్ని ఉదాత్తంగా పాలించాడు. ఇతని చివరి పాలనా కాలంలో దక్షిణా పథంలో భయంకరమయిన కరువు సంభవించింది. ప్రజలు కరువును తప్పించుకోవడానికి తాము ఉన్న ప్రాంతాలు వదిలి పోయారు. మహరాష్ట్ర ప్రాంతంలో దీనిని 'దుర్గాదేవి' కరువు అన్నారని దీని ప్రభావం 12 సంవత్సరాలు ఉందని సమకాలిక రచనలు చెబుతుంది. బహుమనీ సుల్తాన్ క్షామనివారణోపాయాల పట్ల చాలా శ్రద్ధ వహించినాడు. రెండో హరిహర రాయల కాలంలో విజయనగర రాజ్యం నాల్గువైపులా విస్తరించి మహాసామ్రాజ్యంగా రూపొందినది. విజయనగర సామ్రాజ్యంలో కృష్ణా - తుంగభద్ర అంతర్వేది, ఉత్తర కర్ణాట, కొంకణ దేశాలు, అద్దంకి, శ్రీశైల ప్రాంతాలు చేరాయి. పశ్చిమ సముద్ర తీరమంతా స్వాధీనం కావటం వల్ల విదేశీ వ్యాపారం విస్తరించి రాజ్యసంపద అభివృద్ధి చెందింది.

## 7.2.4 రెండో బుక్కరాయలు : (క్రీ.శ. 1404 - 1406)

రెండో హరిహర రాయల మరణం తరువాత విజయనగర చరిత్రలో మొదటి వారసత్వయుద్ధం జరిగింది. యువరాజుగా ఉన్న రెండో బుక్కరాయలను కాదని విరూపాక్షరాయలు విజయనగర సింహాసన మధిష్టించాడు. అయితే త్వరలోనే విరూపాక్షరాయలను జయించి రాజై రెండేళ్ల రాజ్యపాలన చేశాడు. క్రీ.శ. 1406 లో బుక్కరాయలను తొలగించి మొదటి దేవరాయలు విజయనగర సింహాసనం అదిష్టించాడు.

## 7.2.5 మొదటి దేవరాయలు : (క్రీ.శ. 1406 - 1422)

మొదటి దేవరాయల పాలనా కాలంలో చాలా భాగం యుద్ధాలతో గడిచిపోయింది. బహమనీ, రెడ్డి రాజ్యాలపట్ల ఇతడు తన తండ్రి అనుసరించిన విధానమే అనుసరించాడు. రేచర్ల పద్మనాయకులతో మైత్రిని సంపాదించడం ఈతని కాలంలోని క్రొత్త పరిణామము.

**విజయనగర - బహమనీ ఘర్షణ :**

సింహాసనానికి వచ్చిన వెంటనే మొదటి దేవరాయలు బహమనీ సుల్తాన్ ఫిరోజ్ షా దండయాత్రను ఎదుర్కొనవలసి వచ్చింది. క్రీ.శ. 1406 లో ఫిరోజ్ షా విజయనగరం పై దండెత్తాడు. ఈ దండయాత్రకు గల కారణం గురించి ముస్లిం చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలు గలవు. ముద్గల్ వాస్తవ్యుడైన ఒక కంసాలి కుమార్తె అయిన నెహల్ గొప్ప సౌందర్యవతి. ఆమెను దేవరాయలు మోహించి ఆమెను తీసుకొని రావటానికి ఒక సైన్యాన్ని పంపాడు. ముద్గల్ బహమనీ రాజ్యంలో ఉన్నది. తన అనుమతి లేకుండా తన రాజ్యంలోకి సైన్యాన్ని పంపినందుకు కోపించి బహమనీ సుల్తానైన ఫిరోజ్ షా విజయనగరం పై దండెత్తాడని ఫెరిష్టా, నిజాముద్దీన్ అహమ్మద్‌లు వ్రాశారు. రెండు రాజ్యాలమధ్య తరతరాలుగా వున్న వైరం, దేవరాయల రాజ్యానికి వచ్చిన వెంటనే ఏర్పడిన అస్తవ్యస్త పరిస్థితి ఫిరోజ్ షా దండయాత్రకు కారణం కావచ్చు. ఈ దండయాత్రలో దేవరాయలు ఓడిపోయాడు. రాయచూర్ జిల్లా వాయవ్య దిశలో వున్న బానూరు, ముసలికల్లు దుర్గాలు ఫిరోజ్ షా స్వాదీనమయింది.

**రెడ్డి రాజులతో ఘర్షణ :-**

కుమారగిరి రెడ్డి మరణం తరువాత రెడ్డి రాజ్యంలో ఏర్పడిన అంతఃకలహాలలో దేవరాయలు కల్పించుకొన్నాడు. పెదకోమటి వేమారెడ్డికి, [illegible]టయ వేమారెడ్డికి జరిగిన యుద్ధాలలో దేవరాయలు కాటయ వేమారెడ్డికి సహాయం చేశాడు. క్రీ.శ 1411 లో విజయనగర

సైన్యా ' రెడ్డి రాజ్యంలో బాపట్ల తాలుకా ఇంకొల్లు వరకూ వచ్చి మోటుపల్లి రేవును స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలుడయినాడు. కాటయ వేమారెడ్డి తరువాత పెద్దకోమటి వేమారెడ్డి కి ఫిరోజ్ షా సహాయం సంపాదించాడు. అల్లాడరెడ్డి దేవరాయల సహాయం అర్థించాడు. అల్లాడ రెడ్డికి తోడ్పడటానికి దేవరాయలు తన సైన్యాన్ని రెండుగా విభజించి బహమనీ సైన్యంపైకి కొంత సైన్యాన్ని, కొండవీడు రాజ్యంపైకి మిగిలిన సైన్యాన్ని పంపాడు. రాజమండ్రి దగ్గర అల్లాడరెడ్డితో జరిగిన యుద్ధంలో పెదకోమటి వేమారెడ్డి, ఫిరోజ్ షాలు ఓడిపోయారు. ఫిరోజ్ షా తెలంగాణాలోని తన దుర్గాలను రక్షించుకోవటానికి విజయనగర రాజ్యానికి చెందిన పానగల్లు దుర్గాన్ని క్రీ.శ. 1417 లో ముట్టడించాడు. అక్కడ జరిగిన భీకర యుద్ధంలో పద్మనాయకులు దేవరాయలకు తోడ్పడినారు. ఫిరోజ్ షా ఓడిపోయాడు. పానగల్లు, నల్గొండ ప్రాంతం విజయనగరం స్వాధీనమైంది. కొండవీటి రాజ్యంపైకి పంపిన విజయనగర సైన్యాలు మోటుపల్లిని క్రీ.శ. 1417 లో ఆక్రమించాయి. దేవరాయలు బహమనీలతో పోరాడుతున్న సమయంలో కందుకూరు రెడ్డిరాజులు రాయల రాజ్యంపై దండెత్తి కడప జిల్లాలోని పొత్తపి, పులుసలపాడులను ఆక్రమించారు. 1414 లో దేవరాయలు వారిని ఓడించి తరిమివేసి ఆ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొన్నాడు.

**కళింగ గజపతులు :**

రెడ్డి రాజ్యంలో జోక్యం చేసుకోవడం వల్ల దేవరాయలకు కళింగ గజపతులతో ఘర్షణ ప్రారంభమయింది. అంతఃకలహాలవల్ల రెడ్డి రాజ్యంలో ఏర్పడిన అస్తవ్యస్థ పరిస్థితులను ఆసరాగా తీసుకొని కళింగ గజపతిరాజు నాల్గో భానుదేవుడు రాజమహేంద్రవరరెడ్డి రాజ్యంపై దండెత్తినాడు. రాజమహేంద్రవర రాజైన అల్లాడరెడ్డి రాజుకు సహాయం చేయడానికి దేవరాయలు తన సైన్యాన్ని పంపాడు. దేవరాయల సైన్యాలు, గజపతి సైన్యాలు రాజమహేంద్రవరం రాజ్యంలో యుద్ధానికి సిద్ధమైనవి. అయితే ఈ యుద్ధం వల్ల తన దేశం పాడైపోతుందని భావించి అల్లాడరెడ్డి రాయలకు, గజపతికి సంధిచేసి ఎవరి రాజ్యానికి వారిని పంపివేశాడు. విజయనగర రాజులకు, కళింగ గజపతులకు కలహానికి ప్రారంభం ఈ యుద్ధమే.

దేవరాయలు విజయనగర ప్రాకారలను బలపరచి బురుజులు నిర్మించినాడు. తుంగభద్రానదికి ఆనకట్టవేయించి, 15 మైళ్ళ కొండ ప్రాంతాన్ని తొలిపించి కాలువల ద్వారా నగరానికి నీటి సౌకర్యం సమకూర్చినాడు. జక్కన కవి రచించిన 'విక్రమార్క చరిత్ర' ను కృతి పొందిన సిద్దనను ఆదరించిన చామదండనాయకుడు దేవరాయల మంత్రి.

దేవరాయల మరణానంతరం అతని కుమారుడైన రామచంద్ర రాయలు రాజయినాడు. కాని అతణ్ణి కొన్ని నెలల్లోనే పదభ్రష్టుని చేసి తమ్ముడు విజయరాయలు సింహాసనం ఆక్రమించాడు. ఈతడు కూడా సమర్థుడు కాదు. అందుచే ఈతని పాలనాకాలం నాల్గుసంవత్సరాలు కుమారుడైన రెండో దేవరాయలు ప్రభుత్వాన్ని నిర్వహించాడు. విజయరాయల మరణానంతరం రెండోదేవరాయలు రాజ్యసింహాసనం అధిష్టించాడు.

## 7.2.6 రెండో దేవరాయలు : (క్రీ.శ. 1422 - 1446)

రెండో దేవరాయలు సంగమ వంశంలో సుప్రసిద్ధుడు. ఇతనిని ప్రౌఢదేవరాయలని కూడా వ్యవహరించేవారు. ఇతని కాలంలో విజయనగర సామ్రాజ్యం మున్నెన్నడూ లేనంతగా విస్తరించింది. విజయనగర గౌరవప్రతిష్ఠలు ఇనుమడించి విదేశీయులను ఆకర్షించాయి.

### 7.1. విజయనగర - బహమనీ సంఘర్షణ :

రెండో దేవరాయల కాలంలో విజయనగర బహమనీ రాజ్యాల మధ్య రెండు యుద్ధాలు జరిగినాయి. అహమ్మద్ షా, రెండో అల్లాఉద్దీన్ బహమన్ షా అనువారు దేవరాయల సమకాలీనులు. అహమ్మద్ షా సింహాసనం ఎక్కినవెంటనే గుల్బర్గా రాజకీయ కుట్రలకు కేంద్రంగా ఉందనీ, శీతోష్ణ పరిస్థితులు అనుకూలంగా లేవనీ రాజధానిని బీదర్‌కు మార్చినాడు. అనంతరం సైన్యాన్ని సమకూర్చుకొని పాలనగల్లులో ఫిరోజ్ షాకు జరిగిన పరాజయానికి ప్రతీకారం తీర్చుకొనే ఉద్దేశంతో అహమ్మద్ షా 1422 లో విజయనగరంపై

దండెత్తాడు. ఈ యుద్ధంలో బహమనీ సుల్తాన్ విజయం సాధించాడని ఫెరిష్టా వ్రాసాడు. కాని సమకాలీన శాసనాల వల్ల విజయనగరమే విజయం సాధించినదని తెలుస్తున్నది. ఆ తదుపరి అహమ్మద్ షా వెలమలను శిక్షించడానికి తెలంగాణాపై దండయాత్ర చేసి ఆక్రమించాడు. రాయల సహాయం పద్మనాయకులకు లభించలేదు. దీనితో విజయనగరానికి వెలమలకు మధ్యగల మై త్రి విచ్ఛిన్నమయింది.

బహమనీలతో రెండో యుద్ధాన్ని దేవరాయలే ప్రారంభించాడు. క్రీ.శ. 1443 లో దేవరాయలు దండెత్తి ముద్గల్‌ను ఆక్రమించి రాయచూర్, బంకాపూర్‌లను ముట్టడించాడు. అతని సైన్యాలు బిజాపూర్, సాగర్‌ల వరకు పురోగమించాయి. అల్లాఉద్దీన్ తెలంగాణా, దౌలతాబాద్, చీరాల నుండి సైన్యాలు రప్పించి రాయలను ఎదిరించాడు. యుద్ధం దీర్ఘకాలం జరిగింది. యుద్ధ ఫలితాలగురించి ఫెరిస్టా, అబ్దుల్ రజాక్ ల నుంచి భిన్నాలైన సమాచారాలు లభిస్తున్నాయి. రాయలు ఓడి కప్పం చెల్లించడానికి అంగీకరించగా కృష్ణానదిని ఇకముందు దాటరాదని సుల్తాన్ వాగ్దానం చేసినాడని ఫెరిష్టా వ్రాసాడు. ఈ యుద్ధంలో గుల్బర్గా వరకు నడిచి విజయవంతంగా రాయలు రాజధానికి మరలినాడని రజాక్ వ్రాసాడు.

**రెడ్డి రాజులు :**

రెడ్డిరాజులనుండి తీరాంధ్రాన్ని జయించాలనే విజయనగరరాజుల కోరిక రెండోదేవరాయల కాలంలో ఫలించింది. క్రీ.శ. 1424 లో రాచవేమారెడ్డితో కొండవీటి రాజ్యం అంతంకాగా, రెండో దేవరాయలు కొండవీడు ఆక్రమించి విజయనగర సామ్రాజ్యంలో కలిపాడు. ఆ సమయంలో రాజమహేంద్రవరము రాజధానిగా రెడ్డి రాజ్యాన్ని పాలిస్తున్న వీరభద్రారెడ్డి విజయనగర సామంతుడైనాడు. 1435 లో కళింగ సింహాసనాన్ని ఆక్రమించిన కపిలేశ్వర గజపతి క్రీ.శ. 1444 లో రాజమహేంద్రవర రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించాడు. కాని ఈ దాడిని రెండో దేవరాయల ప్రధాని మల్లప్ప బడయర్ త్రిప్పి కొట్టాడు. ఆ తరువాత నాల్గు సంవత్సరాలకు రాజమహేంద్రవరం ప్రాంతం కపిలేశ్వర గజపతి స్వాధీనమైంది.

**కేరళ :**

రెండో దేవరాయలకాలంలో కేరళలో అధికభాగం విజయనగర అధికారాన్ని అంగీకరించింది. విజయనగరాధీశుడు దక్షిణ దేశాధీశుడైనాడు.

**సింహళ దండయాత్ర :**

బహమనీలతో పోరాడుతున్న సయంలోనే రెండో దేవరాయలు సింహళముపై రెండు నౌకా దండయాత్రలు పంపాడు. సింహళం రెండో హరిహర రాయలకాలంనుండి విజయనగర అధికారాన్ని గుర్తించి ఉండేది. క్రీ.శ. 1442 లో రెండో దేవరాయల ప్రధాని, సైన్యాధ్యక్షుడు అయిన లక్కణ దండనాయకుడు నావికాదళంతో సింహళముపై దండెత్తి వెళ్ళాడని రజాక్ వ్రాసాడు. దక్షిణ సముద్రాధిపత్యానికై విజయనగర సింహళాలమధ్య ఏర్పడిన సంఘర్షణ రాయల సింహళ దండయాత్రకు కారణమై ఉండవచ్చు. ఈ నౌకాదళయాత్ర జయప్రదంగా సాగింది. సింహళ పాలకుడు రాయలకు కప్పం కట్టడానికి ఒప్పుకున్నాడు. ఈ విజయ సూచకంగా లక్కణ దండ నాయకుడు శాసనాలలో దక్షిణ సముద్రాధీశ్వర అను బిరుదు వహించాడు. కొన్ని శాసనాలు రెండో దేవరాయలను 'ఇరంతిరై కొండ' (సింహళం నుండి కప్పం వసూలు చేసినాడు) అని పేర్కొన్నాయి. కాబట్టి ఈ నౌకాదండయాత్రవల్ల సింహళం విజయనగర సామ్రాజ్యం కిందికి వచ్చిందని చెప్పవచ్చు.

**ఘనత :**

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సంగమ వంశీయులలో అగ్రగణ్యుడు రెండో దేవరాయులు లేక ప్రౌఢ దేవరాయలు. ఇతడు శక్తి సంపన్నుడు. కృష్ణానది మొదలు సింహళం వరకు, అరేబియా సముద్రంనుంచి బంగాళాఖాతం వరకు గల దక్షిణ భారతదేశాని కంతటికి అతడు సర్వాధికారి. అతనికి కొల్లం, సింహళం, పెగు, దనాసరి దేశ పాలకులు కప్పం చెల్లించేవారని న్యూనిజ్ పేర్కొన్నాడు.

రెండో దేవరాయలు గొప్ప రాజనీతిపరుడు. ఒకే కాలంలో అంతర్వేది, తెలంగాణా, సింహళం మొదలైన యుద్ధరంగాలలో విజయవంతంగా యుద్ధ తంత్రాలను నడిపిన గొప్ప యుద్ధ తంత్రజ్ఞుడు మొదటి దేవరాయలు ప్రారంభించిన తూర్పు ఆంధ్ర రాజ్య ఆక్రమణను ఇతడు పూర్తిచేశాడు.

రెండో దేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడు. శత్రువులతో నిరంతరంపోరాడవలసి వచ్చినప్పటికి ప్రజాపాలనా వ్యవహారాలను శ్రద్ధతో నిర్వహించాడు. ఇతని పాలనలో ప్రజలు శాంతి సౌభాగ్యాలతో కాలం గడిపినారు. రాజ్యం సంపన్నమైన అనేక నగరాలతో వెలసిల్లింది. ఆనాడు విజయనగర సామ్రాజ్యంలో 300 రేవు పటణాలు ఉన్నట్లు రజాక్ తెలిపాడు.

రెండో దేవరాయలు శైవుడయినప్పటికి, అన్ని మతాలను ఆదరించి గౌరవించాడు. రాజధాని హంపిలో ముస్లింలకు మసీదు నిర్మించాడు. అక్కడి పాన్ సుపారి బజారులో ఒక జైనాలయాన్ని నిర్మించాడు. ఇతని కాలంలోనే సప్తస్వరాలు వినిపించే మండపమున్న విఠలాలయ నిర్మాణం జరిగింది. ఇతని కాలంలో లలిత కళలకు గొప్ప ప్రోత్సాహం లభించింది.

రెండో దేవరాయలు సారస్వతాభిమాని. ఇతడు స్వయంగా విద్వాంసుడు, కవిపండిత పోషకుడు. ఇతడు సంస్కృతంలో 'మహా నాటక సుధానిధి' అనే చంపూకావ్యాన్ని, 'బ్రహ్మసూత్ర' భాష్యాన్ని రచించాడు. ఇతని ఆస్థాన కవి అయిన చామరసు సుప్రసిద్ధ కన్నడకవి, వీర శైవ రచయిత, 'ప్రభురంగలీల' గ్రంథకర్త. ఇతని ఆస్థానంలోని సంస్కృత కవి, మహా విద్వాంసుడు అయిన 'డిండిమభట్టు'ని ఆంధ్ర కవి సార్వభౌముడయిన శ్రీనాధుడు వాదంలో ఓడించినాడు. అందుకుగాను రెండో దేవరాయలచేత శ్రీనాధుడు కనకాభిషేకం చేయించుకొని, 'కవి సార్వభౌమ' అనే బిరుదు పొందాడు.

దేవరాయల కీర్తి ప్రతిష్టలు నలుదిశలకు వ్యాపించినది. పర్షియా రాయబారి అబ్దుల్ రజాక్ క్రీ.శ. 1443 లో, నికోలో కాంటే అనే ఇటలీ యాత్రికుడు క్రీ.శ. 1442 లో దేవరాయల ఆస్థానాన్ని దర్శించి, విజయనగర వైభవాన్ని కన్నులకు కట్టినట్లు వర్ణించారు.

కాంటే మాటలలో, "విజయనగరం చుట్టుకొలత 60 మైళ్ళ కొండలనూ, తుంగభద్రానదికి కలుపుతూ 7 ప్రాకారలున్నాయి. ప్రాకారాల మధ్య పంటపొలాలు, అంగళ్ళు, నివాసగృహాలున్నాయి. ఏదో ప్రాకారంలో రాజప్రాసాదము, ఉద్యోగుల నివాసాలున్నాయి. నగరంలో 90 వేలమంది ఆయుధోప జీవులున్నారు. ప్రజలలో బహు భార్యాత్వము ఎక్కువ. భారతదేశంలోని రాజులందరిలోను రాయలు మిక్కిలి బలశాలి అతనికి 12 వందలమంది భార్యలున్నారు".

అబ్దుల్ రజాక్ మాటలలో, "రాయలు చాలా బలంతుడు దూరదేశాలైన పెగూ, టెనాసరిమ్‌లు అతనికి కప్పం చెల్లిస్తాయి. అతని రాజ్యంలో 3 వందల ఓడరేవులున్నాయి. రాజ్యం గొప్ప ఐశ్వర్యవంతమైనది. విజయనగరం వంటి వైభవోపేతమైన మరొక నగరాన్ని కనులతో చూడలేదు. చెవులతో వినలేదు. నగరం లోపల రాజప్రాసాదం మనోహరంగా ఉన్నది. విజయనగర వీధులలో బంగారం, రత్నాలు, వజ్రవైఢూర్యాలు రాశులుగా పోసి బహిరంగంగా విక్రయిస్తారు. ప్రజలు విలాసప్రియులు, ఉల్లాసజీవనులు. వారికి ఆహారం ఎంత అవసరమో గులాబీలు అంతే ముఖ్యం".

విజయనగర చక్రవర్తుల బిరుదులలో ఒకటైన 'గజబేటకార' (ఏనుగుల వేటకాడు) అనే బిరుదాన్ని మొదట ధరించినవాడు రెండో దేవరాయలు. ఇతడు 1446 లో మరణించాడు. ఈతని మరణం తరువాత రాజ్యానికి వచ్చిన రాజులు బలహీనులు కావటం సంగమ వంశం క్రమక్రమంగా క్షీణించింది.

## 7.3. సంగమవంశ అస్తమయం :

రెండో దేవరాయల తరువాత విజయనగర సింహాసనమధిష్టించిన మల్లికార్జున రాయలు, రెండో విరూపాక్షరాయలు అసమర్థులైనందున రాజ్యబల గౌరవాలు క్షీణించి సంగమ వంశానికే గాక విజయనగర రాజ్యానికే ప్రమాదం వాటిల్లింది.

## 7.3.1 మల్లికార్జున రాయలు : (క్రీ.శ. 1446 - 1465)

రెండో దేవరాయల తరువాత, అతనికి పొన్నల దేవికి జన్మించిన మల్లికార్జున రాయలు విజయనగర సింహాసనమధిష్టించాడు. ఇతని బలహీనతను గుర్తించిన విజయనగర శత్రువులైన బహమనీ సుల్తానులు, గజపతులు విజృంభించి విజయనగర రాజ్యభాగాలను ఆక్రమించసాగినారు. గజపతులకు వెలమలు తోడైనారు.

కపిలేశ్వర గజపతి క్రీ.శ. 1448 లో తీరాంధ్రంపై దాడి జరిపినట్లు పెనుగొండ శాసనం చెబుతుంది. వెలమల సహాయంతో గజపతి రాజమహేంద్రవరకు ఆక్రమించి, విజయనగర దుర్గమైన కొండవీడును క్రీ.శ. 1450 లో ఆక్రమించాడు. ఆ తరువాత కపిలేశ్వర గజపతి బెల్లంకొండ, వెలుగోడు, అద్దంకి, శ్రీశైల ప్రాంతాలను ఆక్రమించి విజయనగరం ముట్టడించాడు. రాయలు ఓడి కప్పం చెల్లించినట్లు ప్రతాపరుద్ర గజపతి అనంతవరం శాసనం చెబుతుంది.

ఇదే సమయంలో బహమనీ సుల్తాన్ కూడా విజయనగరంపై దాడిచేసినాడు కాని దండయాత్ర ఫలితం తెలియదు. బహమనీ సుల్తాన్ విజయనగరం మీద దాడిచేసి దానిని పట్టుకొనటాన్ని రష్యాయాత్రికుడు నికిటిన్ ప్రస్తావించాడు. గజపతి, సుల్తాన్ కలిసి విజయనగరాన్ని ముట్టడించినారని కొందరి అభిప్రాయం కాని, ఈ అభిప్రాయానికి స్పష్టమైన ఆధారం లేదు.

తెలంగాణా ప్రాంతంలో భోన్‌గిరి పాలకుడైన జలాల్ ఖాన్ క్రీ.శ. 1453 లో తిరుగుబాటు చేయగా అతనిని శిక్షించడానికి బహమనీ సుల్తాన్ రెండో అల్లా ఉద్దీన్ తన సేనాని గవాన్ ను పంపినాడు. గవాన్ వెలమల సాయంతో తిరుగుబాటుదారుని ఓడించి క్షమించినాడు. అల్లా ఉద్దీన్ మరణానంతరం హుమయూన్ కాలంలో తిరిగి జలాల్ ఖాన్ తిరుగుబాటు చేసాడు. వీరితో కలసి వెలమలు తమ స్వాతంత్ర్యం పొందాలని ఆశించారు. కాని సుల్తాన్ హుమయూన్ పంపిన ఖ్వాజా జహాన్, నైజామ్ ఉల్‌ముల్క్‌లు తిరుగుబాటుదారులను అంతమొందించి దేవరకొండపైకి దండెత్తినారు.

దేవర కొండ పాలకుడు లింగమనీడు కపిలేశ్వర గజపతి సహాయం కోరాడు. కపిలేశ్వరుడు తన కుమారుడైన హరి వీరుని నాయకత్వంలో పంపిన సైన్యం బహమనీ సైన్యాలను ఓడించింది. సుల్తాన్ తెలంగాణా రక్షణ బాధ్యత గవాన్‌కు అప్పగించాడు. హంవీరుడు గవాన్‌ను ఓడించి ఓరుగల్లును ఆక్రమించాడు. గవాన్ బీదర్‌కు మరలడంతో తెలంగాణా గజపతుల స్వాధీనమయింది. హుమయూన్ మరణానంతరం వెలమ నాయకులు సాయంగా గజపతి సైన్యాలు బహమనీ రాజ్యంలో ప్రవేశించి బీదర్‌ను ముట్టడించాయి. కాని గజపతి రాజ్యం ఉత్తర సరిహద్దులో ప్రమాదం ఏర్పడినందున బీదర్ ముట్టడి విరమించి మరలవలసి వచ్చింది. అయినా రాయలని, సుల్తానును ఓడించిన సూచకంగా కపిలేశ్వరుడు 'నవకోటి కర్ణాటకలు బరిగేశ్వర' బిరుదును ధరించినాడు.

ఆ తరువాత కపిలేశ్వర గజపతి దక్షిణ తీరాన్ని జయించడానికి క్రీ.శ. 1464 లో హంవీరుని పంపాడు. ఈ దండయాత్ర రామేశ్వరం వరకు నడిచింది. చంద్రగిరి, ఉదయగిరి రాజ్యాలు గజపతుల స్వాధీనమయింది. హంవీరుని కుమారుడు దక్షిణ కపిలేశ్వరమహాపాత్రుడు కొండపల్లి, అద్దంకి, వినుకొండ, దండపాటు, ఏడైవీడు, వలుదుల పట్టు, తిరువనల్లూరు, తిరుచినాపల్లి, చంద్రగిరి ప్రాంతాలను పాలిస్తున్నట్లు క్రీ.శ. 1464 నాటి దక్షిణ ఆర్కాట్‌లోని మన్నూరు శాసనాలు పేర్కొంటున్నాయి. ఈ దండయాత్రను తమిళదేశంలోని శాసనాలు 'ఒడ్డియన్ గలభై' అని పేర్కొన్నాయి. గజపతి సైన్యము ఎలాంటి అడ్డంకులు లేకుండా రామేశ్వరం వరకు నడిచాయి.

గజపతుల ఈ దక్షిణ దేశ ఆక్రమణ స్వభావాన్ని గురించి చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చారు. ఈ గజపతి దండయాత్ర తరువాత గజపతి సైన్యం వెనుదిరిగి పోయిందా లేక దక్షిణ దేశాన్ని ఆక్రమించి గజపతులు కొంతకాలం పాలించారా అనే విషయాలలో ఏకాభిప్రాయం లేదు. గజపతులు క్వావేరీనది వరకు గల విజయనగర సామ్రాజ్య తీర ప్రాంతాన్నంతా ఆక్రమించి కొంతకాలం పాలించారని శాసనాధారాలుగా కృష్ణశాస్త్రి పేర్కొన్నాడు. ఇదే భావాన్ని బెనర్జీ, సుబ్రహ్మణ్యం పండితులు వెలిబుచ్చారు.

గజపతుల పాలన దక్షిణ దేశంలో లేదని వెంకట రమణయ్య భావించాడు. కాని ఈ దండయాత్ర తరువాత 10 సంవత్సరాలనాటి శాసనాలు ఈ 'ఒడ్డియన్ గలబై' ను (వడ్డరుల గోల) పేర్కొనటంచేత అక్కడి గజపతి సైన్యాలు ఎక్కువ కాలం పోరాడాయని, తమిళ ప్రాంతంలో గజపతుల అధికారం ఉన్నదని భావించాలి. గజపతుల దండయాత్ర తరవాత అనతి కాలానికే మల్లికార్జునరాయలు మరణించాడు. ఇతని తరువాత రెండో విరూపాక్షరాయలు విజయనగర సింహాసనమధిష్టించాడు.

## 7.3.2 రెండో విరూపాక్షరాయలు : (క్రీ.శ. 1465 - 1485)

మల్లికార్జున రాయల మరణానంతరం రెండో విరూపాక్షరాయలు విజయనగర సింహాసనం ఆక్రమించాడు. ఇతడు రెండో దేవరాయల తమ్ముని కొడుకు. దాయాదులను నిద్రలో వధించి రెండోవిరూపాక్షుడు సింహాసనం హస్తగతం చేసుకున్నట్లు 'ప్రసన్నామృతం' చెబుతుంది. ఇతడు సమర్థుడు కాడని వ్యసనలోలుడని న్యూనిజ్ వ్రాసినాడు. ఇతని కాలంలో సామంతులు నామమాత్రంగానే విజయనగర సార్వభౌమత్వాన్ని అంగీకరించి స్వతంత్రంగా పాలించసాగారు.

అయితే విరూపాక్షరాయల కాలంలోనే సామ్రాజ్యం దక్షిణ తూర్పు ప్రాంతాలనుండి పెనుగొండ పాలకుడైన సాళువ నరసింహుడు గజపతులను ఓడించి తరిమివేశాడు. సాళువ నరసింహుడు ఉదయగిరిని జయించాడని రాజనాథ డిండిముడు సాళువాభ్యుదయంలో పేర్కొన్నాడు. క్రీ.శ. 1470 లో కపిలేశ్వర గజపతి మరణించిన తరువాత కృష్ణానది వరకు గల తీరాంధ్రమును నరసింహుడు ఆక్రమించాడు. క్రీ.శ. 1477 లో గోదావరీ ప్రాంతంలో నరసింహుని అధికారం చెల్లినట్లు ముస్లిం చరిత్రలు చెబుతున్నాయి.

కపిలేశ్వర గజపతి మ రణానంతరం సింహాసనం కొరకు జరిగిన కలహాలలో హంవీరుని ఓడించి పురుషోత్తముడు రాజయినాడు. హంవీరుడు బహమనీల సహాయం అర్థించినాడు. నాటి సుల్తాన్ మూడో మహమ్మద్ షా వీరుడు, పరిపాలనా దక్షుడు. ఇతని ప్రధాని గవాన్. వీరి కాలంలో బహమనీ రాజ్యాధికారం ఉచ్ఛస్థితిలో ఉంది. సింహాసనానికి వచ్చిన అనతికాలానికే విజయనగరంలోని అరాజకాన్ని అవకాశంగా తీసుకొని మహమ్మద్ షా చౌల్, దాబోల్, గోవాలను ఆక్రమించాడు.

హంవీరుడు రాజమహేంద్రవర, తెలంగాణాలను దత్తం చేస్తాననడంతో మహమ్మద్ షా అతనికి సహాయం చేయడానికి అంగీకరించి మాలిక్ హసన్ బహ్రీని పెద్ద సేనతో పంపాడు. బహమనీ సైన్యాలు కొండవీడు, రాజమహేంద్రవరాలను ఆక్రమించి ఒరిస్సా పై పురోగమించి హంవీరుని సింహాసనం పై నిలిపింది. హంవీరుడు ఎంతోకాలం సింహాసనం నిలుపుకోలేక పోయాడు. పురుషోత్తముని చేతిలో ఓడి ఉభయులు సమాధానపడి కృష్ణా గోదావరీ అంతర్వేదిని జయించడానికి ప్రయత్నించారు. ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న మాలిక్ వారినెదిరించలేక తిరోగమించడంతో తీరాంధ్రం గజపతుల స్వాధీనమయింది. సుల్తాన్ మహమ్మద్ షా ఆగ్రహించి స్వయంగా ఆంధ్రదేశంపై దండెత్తినాడు. రాజమహేంద్రవరం ఆక్రమించి ఒరిస్సాపైకి పురోగమించాడు. గజపతులు సుల్తాన్ తో సంధిచేసుకొన్నారు. తిరిగి రాజమహేంద్రవరం బహమనీల స్వాధీనమయింది. ఆ తదుపరి సుల్తాన్ దక్షిణ తీరాంధ్రంపైకి దండెత్తి కొండవీడును స్వాధీనం చేసుకొని క్రీ.శ. 1481 నాటికి కంచి చేరి అచట అపార సంపదను దోచుకుని మరలినాడు. సుల్తాన్ కంచి దండయాత్రలో వుండగా సాళువ నరసింహుడు మచిలీపట్టణ ప్రాంతాలనాక్రమించినట్లు తెలుస్తుంది. నరసింహుని సేనాని తుళువ ఈశ్వర నాయకులు సుల్తాన్ సైన్యాలను కందుకూరు దగ్గర ఓడించి అతని శిబిరాన్ని దోచుకొన్నాడు. ఇది తీరని అవమానంగా భావించి నరసింహుని శిక్షించడానికి సుల్తాన్ కొంతసైన్యాన్ని పెనుకొండపైకి పంపి తాను మచిలీపట్నం పైకి దండెత్తినాడు. పెనుగొండపై నడిచిన సైన్యాలు పరాజయం చెందాయి. కాని సుల్తాన్ విజయం సాధించి మచిలీపట్టణాన్ని స్వాధీనపరచుకొన్నాడు. మహమ్మద్ మరణానంతరం బహమనీ రాజ్యం విచ్ఛిన్నం కాసాగింది.

విజయనగరంలో సయితం పరిస్థితులు విషమించినాయి. వ్యసనలోలుడైన విరూపాక్షరాయల దుష్పరిపాలనను, అతని కుమారుడు సహించలేక అతణ్ణి హత్యచేసినాడు. కాని, పశ్చాత్తాపంతో సింహాసనాన్ని తమ్ముడు ప్రౌఢరాయలకు దత్తం చేసినాడు. ప్రౌఢరాయలు కూడా దుర్మార్గుడే. సింహాసనమెక్కి వెంటనే అందుకు కారకుడుయిన అన్నను వధించి విలాసాల్లో మునిగితేలసాగినాడు. అతనిని

బాగుపరచడం అసంభవమనీ, అతని పాలన కొనసాగితే విజయనగరరాజ్యం విచ్ఛిన్నం అయ్యేప్రమాదం ఉందని సామంతులందరూ గుర్తించారు. ఈ పరిస్థితుల్లో రాజ్యాన్ని రక్షించగల సమర్థుడు సాళువ నరసింహరాయలే. తన సేనాని తుళువ నరసనాయకుని నరసింహుడు విజయనగరం పైకి పంపాడు. నరసనాయకుని దాడివార్త సయితం రాయలను కదిలించలేకపోయింది. నరసనాయకుడు రాజధాని నగరాన్ని ఆక్రమించి రాజప్రాసాదంలో ప్రవేశించాడు. ప్రౌఢరాయలు పారిపోయాడు. దీనితో సంగమ వంశపాలన అంతరించి సాళువవంశపాలన ప్రారంభమయింది.

## 7.4 సాళువ వంశం (క్రీ.శ. 1485 - 1505)

విజయనగర రాజ్యం విచ్ఛిన్నమయ్యే ప్రమాదకర పరిస్థితుల్లో సంగమ వంశంలో చివరివాడైన ప్రౌఢరాయలను పారద్రోలి నరసింహదేవరాయలు రాజ్యాధికారం చేపట్టినాడు. ఇతడు సాళువ వంశస్థుడు. 'సాళువ' అనేది బిరుదనామం. అదే వీరి వంశనామం అయింది. వీరి అసలు వంశనామం తెలియదు. నరసింహుని పూర్వుల్లో 'కటారి సాళువ' బిరుదం ఉంది. నరసింహుని ప్రపితామహుడైన మంగిరాజుకు 'ప్రతిపక్షసాళువ' బిరుదం ఉంది. సాళువ వంశజన్మస్థలం కర్ణాటకంలోని కల్యాణనగరం. ఈ వంశస్థులు కల్యాణ పురవరాధీశ్వర బిరుదం ధరించినారు. బహుశా ముస్లిం దండయాత్రల కాలంలో వీరు ఆంధ్ర దేశానికి వలస వచ్చివుంటారు. కర్నూలు, చంద్రగిరి ప్రాంతాల్లో వీరి రాజకీయ ప్రాబల్యం ప్రారంభమయింది. కుమార కంపన మధురమీద దాడి చేసినపుడు అతడికి తోడ్పడిన మంగిరాజు ఈ వంశానికి చెందినవాడు. మధుర దండయాత్రలో మంగిరాజు శ్రీరంగనాథుని పునఃప్రతిష్టలో ప్రముఖపాత్ర నిర్వహించేవాడు. ఈ సందర్భములోనే మంగిరాజు శ్రీరంగనాధునికి 60, వేల మాడలు, ఎనిమిది గ్రామాలు దానం చేశాడు. మంగిరాజు మనుమడు గుండరాజు. ఈ గుండరాజు సోదరుడు తిప్పరాజు మొదటి దేవరాయల మనుమరాలిని వివాహమాడటంతో సాళువ - సంగమ వంశాలమధ్య బంధుత్వం ఏర్పడింది. గుండరాజు కుమారుడే నరసింహ దేవరాయలు.

మధుర దండయాత్రలో ప్రముఖ పాత్ర వహించిన సాళువ మంగు ధైర్యసాహసాలకు మెచ్చి కుమార కంపరాయలు (మొదటి బుక్కరాయల కుమారుడు) చంద్రగిరి రాజ్యానికి చెందిన నారాయణవన ప్రాంతాన్ని జాగీర్‌గా ఇచ్చాడు. ఇచట సాళువమంగు సంతతి వారు తమ పాలన క్రింద రాష్ట్రాన్ని వృద్ధిచేసి, చివరకు చంద్రగిరి దుర్గాన్ని రాజధాని చేసుకొని, చంద్రగిరి రాజ్యాన్ని విజయనగర రాజుల సామంతులుగా పాలించారు. ఈ వంశానికి చెందిన నరసింహుడు చంద్రగిరి పాలకుడుగా తన పలుకుబడి వృద్ధి చేసుకొని, విజయనగర రాజ్యం విచ్ఛిన్నమయ్యే ప్రమాదకర పరిస్థితి ఏర్పడడంతో క్రీ.శ. 1485 లో ప్రౌఢరాయలను పారద్రోలి సింహాసనమాక్రమించాడు.

### 7.4.1 సాళువ నరసింహరాయలు : (క్రీ.శ. 1485 - 1490)

సాళువ నరసింహరాయలు గొప్పయోధుడు, రాజనీతిపరుడు. విరూపాక్షుని దుండగాలవల్ల విచ్ఛిన్నమైపోతున్న విజయనగర సామ్రాజ్యాన్ని రక్షించడానికి నరసింహుడు అనేక విధాల ప్రయత్నించాడు. ఇతడు చంద్రగిరి కేంద్రంగా దక్షిణ దేశంలో మల్లికార్జునుని కాలంనుంచి రాజ ప్రతినిధిగా ఉన్నాడు. తర్వాత ఇతడు పెనుగొండ అధిపతిగా బలవంతుడయినాడు. కపిలేశ్వర గజపతి మరణానంతరం కళింగలో చెలరేగిన అంతర్యుద్ధకాలంలో నరసింహుడు దక్షిణ తీరాంధ్రాన్ని జయించాడు. కంచిలో తిరుగుబాటును అణి విజయనగర అధికారాన్ని పునరుద్దరించాడు. బహమనీలతో యుద్ధాల్లో విజయాలు సాధించాడు. ఈ విజయాలతో సాళువవంశ బలగౌరవాలు ఇనుమడించాయి. చివరి సంగమ వంశీయుల విషయలోలత్వం, అసమర్థలతో రాజ్యం చిన్నాభిన్నమయ్యే పరిస్థితుల్లో క్రీ.శ. 1485 లో సాళువ నరసింహరాయలు విజయనగర సింహాసనం అధిష్టించాడు.

**సాళువ నరసింహుడు దురాక్రమణ దారుడా ? :**

పెనుగొండ రాష్ట్రపాలకుడూ, విజయనగర సేనాని అయిన సాళువ నరసింహుడు తన సేనాని తుళువ నరసనాయకుని ద్వారా సంగమ వంశానికి చెందిన ప్రౌఢరాయలను పారదోలి విజయనగర సింహాసనం అధిష్టించాడు. కొందరు చరిత్రకారులు సాళువ

నరసింహుని విజయనగర సింహాసనం అక్రమంగా ఆక్రమించుకొన్నవానిగా పేర్కొన్నారు. ఇది దురాక్రమణ అని అనుకుంటే అప్ప పరిస్థితులలో ఇది తప్పని సరి. నిజానికి చరిత్రలో దురాక్రమణ అనేది సమర్థనీయమని చెప్పవలసివస్తే అది ఈ సందర్భములో రాజ్యాధినేతగా నరసింహుడు పాలించిన ఆరుసంవత్సరాల కాలంలో విజయనగర ప్రతిష్ట పునరుద్ధరించడానికి తీవ్రమైన కృషిచేశాడు బహమనీలనుంచి గోవా, చౌల్, దాభోల్‌లు స్వాధీనం చేసుకొన్నాడు. విజయనగరంలో అరబ్బుల వాణిజ్యం ప్రోత్సహింపబడింది. దీని విజయనగర అశ్వికదళం అభివృద్ధి చెందింది. తన పాలనాకాలంలో విజయనగర సాంస్కృతిక సంప్రదాయాలను నిలబెట్టినాడు.

నరసింహరాయలకు విజయనగర సింహాసన ఆక్రమణ, పరిస్థితుల ప్రభావం వల్ల తప్పనిసరి అయింది. నరసింహరాయ సింహాసనాన్ని ఆక్రమించకపోయినట్లయితే విజయనగర సామ్రాజ్యం 16 వ శతాబ్ది ఆరంభానికే క్షీణించి, పతనమయి ఉండేదని చరిత్రకారు అభిప్రాయం. 'నరసింహుడి దురాక్రమణ ఫలితంగానే రక్షస - తంగడి (తళ్ళికోట) యుద్ధం 80 సంవత్సరాల తరువాత జరిగింది అన్న వాదంలో ఎంతో సత్యం ఉంది.

**సామంతుల నణచుట :**

సాళువ నరసింహునకు సింహాసనం ఆక్రమించడం ఒక ఎత్తు, రాజ్యంలోని అలజడులనణచి శాంతి భద్రతలు నెలకొల్పి విజయనగ గౌరప్రతిష్టలను పునరుద్ధరించడం మరొక ఎత్తుగా పరిణమించింది. అతని పాలనా కాలం 6 సంవత్సరాలు ఆ ఆశయసాధనలోనే గడిచి పోయింది.

ముందుగా నరసింహుని దృష్టి తిరుగుబాటు చేస్తున్న విజయనగర సామంతులపైకి మరలింది. వారిలో పెరనిపాడు (కడప పాలిస్తున్న సంబెటవారు, ఉమ్మత్తూరు (మైసూరు), సంగీతపురం (తులునాడు) పాలెగార్లు బొమ్మవరం ప్రభువైన సాళువ మల్లిదేవుడ ముఖ్యులు. సంబెట శివరాజు, అతని బంధువు వీర నరసింహుడు విజయనగరాన్ని దిక్కరించి, పరిసర ప్రాంతాల ప్రజలన భయభ్రాంతులను చేస్తున్నారు. వర్తకులకు, ప్రయాణీకులకు భద్రత లేకపోయింది. అందుచే సాళువ నరసింహుడు దండెత్తి సంబెటవారి నణచి, ఆ ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొల్పినాడు. అనంతరం ఉమ్మత్తూరు, సంగీతపుర సామంతుల నణిచాడు. మళయాళంలోని స్థానిక చరిత్రను బట్టి, సాళువ నరసింహుడు పశ్చిమ తీర ప్రాంతాలను జయించినట్లు తెలుస్తున్నది. హానోవర్, భట్కల్, మంగళాపురం మొదలైన రేవులు విజయనగరానికి స్వాధీనమయినాయి.

**దండయాత్రలు :**

బహమనీ రాజ్యంలో చెలరేగిన అరాజకాన్ని అవకాశంగా తీసుకుని పురుషోత్తమ గజపతి తీరాంధ్రాన్ని జయించడానికి నిశ్చయించినాడు రాజమహేంద్రవరాన్ని ఆక్రమించిన గజపతి సైన్యం క్రీ.శ. 1484 నాటికి కొండపల్లి, కొండవీడులను స్వాధీనం చేసుకున్నది. గజప సేనాని అజయ్ ఖాన్ వినుకొండ తాలూకాలోని మతుకుమల్లిని దానం చేసినాడు. దక్షిణ తీరాంధ్రంలో సాళువ నరసింహుని అధికారం బలంగా లేదు. వినుకొండ, ఉదయగిరి మధ్య భూమిలో సరియపల్లి తిమ్మారెడ్డి పాలిస్తున్నాడు. ఇతడు గజపతులకు లొంగిపోయాడు అనంతరం గజపతి ఉదయగిరిని ముట్టడించినాడు. ఉదయగిరిని రక్షించడానికై సాళువ నరసింహుడు దండెత్తి, మార్గమధ్యంలో సాళువ మల్లదేవుని తిరుగుబాటునణచి, బొమ్మవర దుర్గాన్ని పూర్తిగా నిర్మూలించి ఉదయగిరిపై నడిచినాడు. అయితే, ఉదయగిరిని పాలిస్తున్న పూసపాటి బసవ భూపాలుడు గజపతితో చేరి, నరసింహునినే ఎదిరించినట్లు కన్పిస్తుంది. బసవ భూపతి మంత్రియైన గంగయ్యను 'నృసింహనృపతి వశీకరణ నయవిద్యాకరణ' అని ప్రబోధచంద్రోదయం వర్ణిస్తుంది. దీనిని బట్టి సాళువ నరసింహుని మోసంతో గజపతి బందీచేసినట్లు తెలుస్తుంది. ఉదయగిరిని గజపతికి సమర్పించి, నరసింహుడు సంధిచేసుకున్నాడు. ఇది జరిగిన అనతి కాలానికే క్రీ.శ. 1490 లో మరణించాడు.

తన 6 సంవత్సరాల పాలనాకాలంలో సాళువ నరసింహుడు విజయనగరాన్ని బలపరచి, సంగమ వంశస్థులు నెలకొల్పిన సాంస్కృతిక సంప్రదాయాలను పదిలపరచినాడు. ప్రజల్లో ధైర్యసాహసాలు కల్పించే సాముగరిడీలను ఈతడు ప్రోత్సహించాడు. అరబ్బు వర్తకులకు

ణ కల్పించి వారు దిగుమతి చేస్తున్న గుర్రాలతో సైన్యాన్ని వృద్ధిచేసినాడు. కవుల, పండితులపట్ల నరసింహునకు అభిమానం ఎక్కువ స్కృతాంధ్రాలను పోషించినాడు. రాజనాధ డిండిముడు ఇతని ఆస్థానకవి. ఇతడు 'సాళువాభ్యుదయం' అను సంస్కృత గ్రంథము ంచాడు. ఇతని ఆస్థానంలోని పిల్లలమర్రి పిన వీరభద్రుడు 'శృంగార శాకుంతలము', 'జైమిని భారతం' అను తెలుగు కావ్యాలను ంచాడు.

తన మరణానంతరం సర్వసేనాధిపతి అయిన తుళువ నరసనాయకుడు బాలురయిన తన కుమారులలో అర్హుడికి పట్టాభిషేకం అతడికి యుక్త వయస్సు వచ్చేవరకు సంరక్షుడై సామ్రాజ్య భారం వహించవలసిందని, తన తరువాత రాజులు ఉదయగిరి, కొండవీడు, యచూర్ దుర్గాలు సాధించాలని తన తుది కోర్కెలను వెలిబుచ్చి సాళువ నరసింహుడు మరణించాడు.

## 4.2 ఇమ్మడి నరసింహరాయలు : (క్రీ.శ. 1490 - 1505) తుళువ నరసనాయకుని దురాక్రమణ :

సాళువ నరసింహుని ఆదేశం ప్రకారం తుళువ నరసనాయకుడు సాళువ నరసింహుని కుమారులలో పెద్దవాడైన తిమ్మరాయలను హాసనం మీద నిలిపాడు. కాని ఇతడు కొద్ది కాలానికే మరణించాడు. తరువాత నరసనాయకుడు తిమ్మరాయల తమ్ముడైన ఇమ్మడి సింహుని సింహాసనమెక్కించి రాజ్యమేలసాగాడు.

### యనగర చరిత్రలో రెండో దురాక్రమణ - నరసనాయకుడు :

సాళువ నరసింహుని సేనాని నరసనాయకుడు కడుసమర్థుడు. ఇతని సహాయంతోనే నరసింహుడు సంగమవంశాన్ని పారదోలి యనగర సింహాసనమధిష్టించాడు. నరసింహుడు 6 సంవత్సరాలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించి, స్వల్ప వయస్కులైన తన గురు కుమారులను సేనాపతి, ప్రధాని, కార్యకర్త అయిన తుళువ నరసనాయనకు అప్పగించి మరణించాడు. నరసింహుని కోర్కె కారం అతని పెద్ద కుమారుడైన తిమ్మరాయలను సింహాసనంమీద నిలపగా అతడు అతి తక్కువ కాలంలోనే మరణించడంతో మ్మరాయల సోదరుడైన ఇమ్మడి నరసింహుడి సింహాసనం మీద, రాజ్యం చేయసాగాడు.

పేరు ఇమ్మడి నరసింహుడైనా, పెత్తనమంతా తుళువ నరసనాయకుడే చెలాయించాడు. యుక్త వయస్సు వచ్చిన తరువాత ండవ (ఇమ్మడి) నరసింహరాయలు స్వయంగా సామ్రాజ్యపాలన నిర్వహించడానికి నిశ్చయించాడు. అంతేగాక ఇమ్మడి నరసింహుడు రసనాయకుని ప్రాబల్యం సహించలేక అతనిని తొలగించి నాదెండ్ల తిమ్మరుసును ప్రధానిగా నియమించాడు. నరసనాయకుడు ఇది హించక పెనుగొండకు మరలి సైన్యం కూర్చుకుని విజయనగరంపై దండెత్తినాడు. యుద్ధంలో తిమ్మరుసు మరణించాడు. ఇమ్మడి సింహుని బందీగా పట్టుకొని పెనుగొండకు పంపి నరసనాయకుడు ప్రభుత్వం నిర్వహించసాగాడు. న్యూనిజ్ ఇచ్చిన ఈ వివరాలను ష్టా రచనలు, శాసనాలు బలపరుస్తాయి. ఇమ్మడి నరసింహుడు బందీకావడంతో సాళువవంశ పాలన అంతమయింది. అయితే సనాయకుడు సింహాసనం ఎక్కినాడా ? లేదా అనే విషయమై పండితులలో భిన్నాభిప్రాయాలు గలవు. సమకాలిక ముస్లిం చరిత్రలు, టి కవులు నరసనాయకుడు సింహాసనం ఎక్కి పాలించినట్లు వర్ణిస్తున్నాయి. 'విజయనగర భద్రసింహాసనస్థు', అని పారిజాతపహరణంలో ంది. నరసనాయకుడు స్వతంత్రాధికారం సూచించే విజయనగరాధీశుల భాషనె తప్పువరాయర గండ రాజాధిరాజ, రాజపరమేశ్వర ుదులు ధరించినట్లు శాసనాలనుండి తెలుస్తుంది. నరసనాయకుని రక్షాకర్త, స్వామి, సేనాధిపతి, మహాప్రధాని, కార్యకర్త అని మాత్రమే లి శాసనాలలో ప్రస్తావించబడింది. నరసనాయకుడు వజ్ర సింహాసనమధిష్టించి, పూర్వం విద్యారణ్యులు స్థాపించిన విద్యానగర జ్యాన్ని పాలిస్తున్నట్లు నరసనాయకుని కుమారుడైన వీరనరసింహుని క్రీ.శ. 1505 నాటి శాసనము ఒకటి చెబుతుంది. నరసనాయకుని ్యలను బట్టి అతడు సింహాసన మాక్రమించాడని స్పష్టమవుతుంది. విజయనగర చరిత్రలో ఇది రెండో దురాక్రమణ. నేలటూరి ంకటరమణయ్య న్యూనిజ్ కథనాన్ని సమర్థించగా, సూయల్, సుబ్రహ్మణ్యశాస్త్రి న్యూనిజ్ కథనాన్ని అంగీకరించలేదు.

**సామంతుల నణచుట :**

నరసనాయకుని పై ఆక్రమ చర్యకు సామంతులు అతనిపై తిరుగుబాటు చేశారు. ఇదే సమయంలో ప్రతాపరుద్ర గజపతి, బీజపూర్ పాలకుడు యూసుఫ్ ఆదిల్‌షా విజయనగరంపై దండెత్తి వచ్చారు. మొదటి నరసనాయకుడు దక్షిణ దండయాత్ర జరిపి తిరుగుబాటు చేస్తున్న సామంతులనణచినాడు. ఇతడు చోళ, పాండ్య, చేర రాజులను, మధుర రాజైన మానభూషణుని ఓడించి కప్పం వసూలు చేసినట్లు కోనేటి రాజును జయించినట్లు 'వరదాంబికా పరిణయం' నుండి తెలుస్తుంది. ఈ రాజులను గుర్తించడం కష్టం. మాన భూషణుడు చోళసామంతుడుగా మధురను పాలించేవాడు. 'కోయి లొలుగు' ను బట్టి కోనేటి రాజా తిరుచునాపల్లి సీమను పాలిస్తూ వుండేవాడు. అతనికి మహామండలేశ్వర, రాయబసువశంకర, రాజరాజగండ మొదలైన బిరుదులున్నాయి. ఈతడు శ్రీరంగంలోని శ్రీ వైష్ణవులను హింసిస్తుండగా వారు నరసనాయకునితో మొరపెట్టుకొన్నారు. నరసనాయకుడు కోనేటి రాజునోడించి పదవీచ్యుతుని చేసినాడు. అనంతరం కావేరిని దాటి శ్రీరంగ పట్టణం ముట్టడించాడు. ఈ ప్రాంతాన్ని గంగవంశజుడనని చెప్పుకున్న నంజరాజా పాలిస్తున్నాడు. నంజరాజు ఓడి సామంతుడయినాడు. అచటనుండి పశ్చిమ తీరంలోని దమకార, తరనంగి దుర్గాలనాక్రమించి నరసనాయకుడు గోకర్ణ క్షేత్రం దర్శించి అచట తులాపురుషదానం చేసినట్లు 'వరదాంబికా పరిణయం' చెబుతున్నది. నరసనాయకుడు చేర రాజ్యంపై దండెత్తి కాయల్ నాక్రమించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు.

**దండయాత్రలు :**

తన తండ్రికాలంలో బహమనీల స్వాధీనమయిన తెలంగాణా ప్రాంతాలను, చేజారిపోయిన తమిళ ప్రాంతాలను తిరిగి జయించాలని పురుషోత్తమ గజపతి సంకల్పించినాడు. నాటికి కులీకుతుబ్ ఉల్‌ముల్క్ వరంగల్, కోయిల కొండలను ఆక్రమించి తెలంగాణాలో బలవంతుడై ఉన్నాడు. పురుషోత్తమ గజపతి దండెత్తి పెన్నానదీతీరం వరకు నడచినట్లు రాజవోలు శాసనం చెబుతుంది. అయితే నరసనాయకుని 'గజపతిరాయే భగండ భేరుండ' బిరుదాన్ని బట్టి నరసనాయకుడు గజపతిని ఓడించి మరలించినాడని చెప్పవచ్చు. కాని ఈ విజయాలవల్ల విజయనగరానికి లాభం కలగలేదు. ఇదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో చితాబ్‌ఖాన్ (సీతాపతి) విజృంభించినాడు. ఇతనిని పురుషోత్తమ గజపతి సేనానిగా 'రాయవాచకం' వర్ణిస్తున్నది. క్రీ.శ. 1504 నాటి ఈతని ఓరుగల్లు శాసనాన్ని బట్టి నాటికాతడు ఆ ప్రాంతం జయించి పాలిస్తున్నాడు. రాజుకొండ మొదలుగా దక్షిణ తెలంగాణా సయితం అతని స్వాధీనమయినట్లు క్రీ.శ. 1510 నాటి గజపతి ఉండ్రకొండ శాసనం స్పష్టం చేస్తున్నది. తెలంగాణాలో అధికభాగం తిరిగి గజపతుల స్వాధీనమయింది.

ఆంతరంగిక కల్లోలాల నణచి విజయనగర రాజ్యానికి భద్రత, సౌష్టం చేకూర్చడానికి సాళువ నరసింహుడు ప్రారంభించిన కృషిని కొనసాగించి నరసనాయకుడు చాలావరకు విజయం సాధించినాడు. నరసనాయకుని సంతతి వారి శాసనాలు నరసనాయకునిచే ఓడిపోయిన సామంతులలో శ్రీరంగపట్టణ ప్రభువుని, చోలుని, పాండ్యుని, మధుర పాలకుని, పరరాజులలో తురుష్కుని, గజపతిని పేర్కొన్నాయి. కాని శత్రువుల హస్తగతమైన ఉదయగిరి, రాయచూరు ప్రాంతాలను తిరిగి ఆక్రమించక పూర్వమే, రాజ్యాన్ని కొడుకు వీర నరసింహుని కప్పగించి క్రీ.శ. 1500 లో నరసనాయకుడు మరణించాడు.

నరసనాయకునికి ముగ్గురు భార్యలు. వీరిలో తిప్పాంబకు వీరనరసింహుడు నాగాలాంబికకు శ్రీకృష్ణదేవరాయలు, ఓబాంబికకు అచ్యుత రాయలు, రంగరాయలు అనే నల్గురు కుమారులు కలిగినారు. వీర నరసింహుని ఇమ్మడి నరసనాయకుడు అనేవారు. నరసనాయకుడు మరణించాక వీరనరసింహుడు కార్యకర్తగా అధికారం చేపట్టినాడు. కాని చివరకు క్రీ.శ. 1505 లో పెనుగొండలో బందీగా వున్న సాళువ ఇమ్మడి నరసింహుని హత్యచేయించి తుళువ వీరనరసింహరాయలు విజయనగర సింహాసనమధిష్టించాడు. దీనితో సాళువ వంశపాలన అంతరించి తుళువ వంశ పాలన ప్రారంభమైంది.

## 7.5 సారాంశము :

విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర, బుక్కరాయలు సంగమ వంశానికి చెందినవారు. సంగమ వంశస్థులు విజయనగర సామ్రాజ్యాన్ని 150 సంవత్సరాలు పాలించి విజయనగర సామ్రాజ్య విస్తరణకు, పటిష్టమైన పునాదికి, వైభవానికి బాటలు వేశారు. సంగమ వంశస్థుల తర్వాత విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సాళువ వంశంలో కేవలం ఇద్దరే రాజులు ఉన్నారు. వీరిలో రెండవ వాడైన ఇమ్మడి నరసింహుడు నరసనాయకుని చేతికి బందీగా చిక్కడంతో సాళువ వంశం అంతరించి ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం.

- డా. వి.కె. మోహన్.

పాఠం - 8

# తుళువ వంశం

## 8.0 లక్ష్యం :

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మూడవ వంశం తుళువ వంశం ఈ వంశంలో ఐదుగురు రాజులు రాజ్యమేలినారు. వారిలో సుప్రసిద్ధుడు శ్రీ కృష్ణదేవరాయలు. తుళువ వంశపాలకుల రాజకీయ చరిత్ర గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :


8.1 పరిచయం

8.2 వీర నరసింహరాయలు

8.3 శ్రీకృష్ణ దేవరాయలు

8.3.1 తొలిజీవితం

8.3.2 నాటి రాజ్య పరిస్థితులు

8.3.3 పోర్చుగీసులతో ఒడంబడిక

8.3.4 కృష్ణరాయలు - బహమనీలు

8.3.5 ఉమ్మత్తూర్‌పై దాడి

8.3.6 కళింగ దండయాత్ర

8.3.7 రాయలు - ఆదిల్ షా

8.3.8 విషాదాంతము

8.3.9 ఘనత

పరిపాలనా విధానము

సాహిత్య సేవ

మత విధానం

భవన నిర్మాణము

8.4 అచ్యుత దేవరాయలు

8.5 మొదటి వేంకటపతిదేవరాయలు

8.6 సదాశివరాయలు

8.7 సారాంశము

## 8.1 పరిచయం :

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన వంశాలలో మూడో వంశం తుళువ వంశం. మైసూర్‌లోని తుళువనాడు వీరి జన్మస్థలమయినందువల్ల వీరి వంశానికి తుళువ వంశమని పేరువచ్చింది. వీరు తమది చంద్రవంశమని చెప్పుకున్నారు. సంగమ వంశానికి చెందిన హరిహరరాయలు తుళువనాడును జయించినప్పటినుండి ఈ వంశస్థులు విజయనగర ఆస్థానంలో ఉద్యోగాలు నిర్వహించసాగిరి. ఈ వంశానికి మూల పురుషుడు తిమ్మరాజు. ఇతని కుమారుడైన ఈశ్వరనాయకుడు సాళువ నరసింహుని సేనాపతిగా క్రీ.శ. 1488లో మహమ్మద్ షాను కందుకూరి దగ్గర ఓడించి, అతని శిబిరం దోచుకున్నాడు. ఇతనిని 'దేవకీ పురాధిపుడ' ని వరాహపురాణం ప్రస్తావించింది. ఉత్తర ఆర్కాటు జిల్లా ఆరణి తాలూకాలోని దేవికాపురములో తుళువ వంశీయుల శాసనాలు గలవు. ఈశ్వర నాయకుని కుమారుడు నరసనాయకుడు సాళువ నరసింహుని దండనాధునిగా, మంత్రిగా సేవించాడు. ఈ నరసనాయకుడే నరసింహుని తరపున క్రీ.శ. 1486 లో చివర సంగమ రాజును తరిమివేసి విజయనగరాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. సాళువ నరసింహుని మరణానంతరం 13 సంవత్సరాలు ఇతడు విజయనగర రాజ్య వ్యవహారాలు నిర్వహించాడు. ఆ తరువాత అతని కొడుకు వీరనరసింహుడు క్రీ.శ. 1505 లో సాళువ వంశపాలన అంతమొందించి సింహాసనం ఆక్రమించాడు. శ్రీకృష్ణదేవరాయలు తుళువ వంశంవాడే. వీరి మాతృభాష కన్నడం, అభిమాన భాష తెలుగు. అయితే వీరిలో తాము కన్నడిగులమనే భావం ఉండేది.

## 8.2 వీరనరసింహరాయలు : (1505 - 1509)

తుళువ వంశ స్థాపకుడు వీరనరసింహరాయలు. ఇతడు పాలించిన 5 సంవత్సరాలు సామంతుల తిరుగుబాట్లు నణచడంలోను, బీజపూర్ పాలకుని ఎదిరించి ఓడించడంలోను గడిపాడు. దీనికి తోడు గజపతులు రాజధానిపైకి దండెత్తివచ్చారు.

క్రీ.శ. 1509 లో ప్రతాపరుద్ర గజపతి విజయనగరం మీద దండెత్తినట్లు కటక రాజవంశావళి చెబుతుంది. ఈ విషయాన్ని చైతన్య భాగవతం కూడా ప్రస్తావించింది. గజపతి దండయాత్రను ఎదుర్కొనుటకు వీరనరసింహుడు తన తమ్ముడైన శ్రీ కృష్ణదేవరాయలను పంపాడు. కృష్ణరాయలు గజపతిపై విజయం సాధించి అతనిని వెనకకు తిప్పి కొట్టాడు. కృష్ణరాయలు తన రాజ్యాభిషేక కాలంలో వేయించిన హంపీ శిలా శాసనంలో 'గజపతి గజకూట పాకలేన' అనే విశ్లేషణ వాక్యంవల్ల ఈ యుద్ధంలో కృష్ణరాయలకు విజయం చేకూరినట్లు తెలుస్తుంది.

బహమనీ సుల్తానైన మహమద్ షా తన సర్దారులను బీదర్ లో సమావేశపరచి ప్రతి సంవత్సరం హిందువులపై 'జీహద్' జరపాలని నిర్ణంచాడు. ఈ నిర్ణయంలో భాగంగానే యూసఫ్ ఆదిల్ ఖాన్ విజయనగరంపై దండెత్తాడు. ఆదోని పాలకుడైన కాసప్ప అతనితో చేరాడు. కాని కందనవోలు పాలిస్తున్న ఆరవీటి రామరాజు, అతని కుమారుడు తిమ్మరాజు యూసఫ్‌ను ఓడించి తరిమివేశారు. ఇందుకు ప్రతిఫలంగా వీరనరసింహుడు ఆరవీటి వారికి కందనవోలు, ఆదోని రాజ్యాలనిచ్చాడు.

వీర నరసింహుడు ఉమ్మత్తూరు, శ్రీరంగ పట్టణం రాజ్యాలపై దండెత్తాడు. మూడు నెలల పాటు ముట్టడి చేసినప్పటికీ ఉమ్మత్తూర్ రాయల స్వాధీనం కాలేదు. దాంతో రాయలు శ్రీరంగ పట్టణంపై దండెత్తాడు. శ్రీరంగ పట్టణ పాలకుడు ఉమ్మత్తూరు, తలనాడుల నుండి సైన్యాలను రప్పించి రాయల సైన్యాలను ఓడించినట్లు కొందరు చరిత్రకారులు అభిప్రాయం. ఏది ఏమైనా ఎదురుతిరిగిన ఉమ్మత్తూరు, శ్రీరంగ పట్టణ పాలకులను జయించకుండానే వీర నరసింహరాయలు క్రీ.శ. 1509 లో వ్యాధిగ్రస్థుడై మరణించాడు. అతని మరణం తరువాత అతని తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు సింహాసనాన్ని అధిష్టించాడు.

వీరనరసింహ రాయల కాలంలో జరిగిన ఒక ముఖ్య సంఘటన పోర్చుగీసు వారితో లభించిన మైత్రి. వీర నరసింహుని కాలానికి పశ్చిమ తీరంలో స్థిరపడిన పోర్చుగీసు వారితో వారు దిగుమతి చేసే గుర్రాలన్నిటినీ విజయనగరానికి అమ్మాలని ఒక ఒడంబడిక కుదుర్చుకొని విజయనగర అశ్వికదళాన్ని పెంపొందించాడు.

వీర నరసింహరాయలు ఉదారుడైన పాలకుడు. కర్షకుల కష్టాలను శ్రద్ధతో విచారించి అనేక సౌకర్యాలను కల్పించాడు. ప్రజాక్షేమాన్ని కాంక్షించి పెండ్లి సుంకాలను రద్దుచేయడానికి ప్రయత్నించి శ్రీకృష్ణదేవరాయలకు మార్గదర్శకుడైనాడు.

## 8.3. శ్రీ కృష్ణ దేవరాయలు : (క్రీ.శ. 1509 - 1529)

విజయనగర పాలకులలో శ్రీ కృష్ణదేవరాయలు అగ్రగణ్యుడు. ఇతడు మహావీరుడు, విజేత, రాజనీతిపరుడు, పరిపాలనాదక్షుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు, కావ్యస్రష్ట. ఈతని పాలనాకాలంలో విజయనగర అధికార గౌరవాలు ఉచ్ఛస్థితినందుకొన్నాయి. ఈతని కాలంలో విజయనగరాన్ని దర్శించిన డామింగో పేఫ్ అను పోర్చుగీసు వర్తకుడు రాయల మూర్తిని ఇలా వర్ణించాడు. రాయలు అంత పొడవరి కాదు. అంత పొట్టిరి కాదు. నిండుగా, బొద్దుగా ఉంటాడు. ముఖం మీద స్ఫోటకపు మచ్చలు కలవు. ఉత్సాహవంతుడు విదేశీయులను ప్రేమతో ఆదరించును. అతని పేరు చెప్పిన హిందూ దేశములోని రాజులకందరికి హడలు.

### 8.3.1. తొలి జీవితం :

శ్రీకృష్ణ దేవరాయలు నరసనాయకుడు, నాగాంబిలకు క్రీ.శ. 1487 లో జన్మించాడు. చిన్నిప్పటినుండి సాళువ తిమ్మరుసు మంత్రిచే పెంచబడి సకల విద్యలలోఆరితేరినాడు. వీరనరసింహరాయల మరణ సమయంలో తన తమ్ముడైన శ్రీకృష్ణదేవరాయల గుడ్లు పీకించి బందీచేసి, బాలుడైన తన కుమారుని సింహాసనం ఎక్కించవలెనని మంత్రి తిమ్మరుసును కోరాడని, తిమ్మరుసు అందుకు విరుద్ధంగా శ్రీకృష్ణదేవరాయలను రాజును చేశాడని న్యూనిజ్ వ్రాసాడు. కాని రాయవాచకం మొదలైన ఇతర ఆధారాలలో ఈ వృత్తాంతం లేదు. వీర నరసింహుడు, కృష్ణ రాయల మధ్య సత్సంబంధాలే ఉన్నట్లు కన్పిస్తుంది. ఉమ్మత్తూర్‌పై దండెత్తినపుడు వీరనరసింహుడు ప్రభుత్వాన్ని కృష్ణరాయలకే అప్పగించాడు. అయినా నూనిజ్ రచన కేవలం కట్టుకథగా తోసి పుచ్చడానికి వీల్లేదని చరిత్రకారుల అభిప్రాయం. క్రీ.శ. 1509 ఆగస్టు 8 న శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేకం చేసుకొన్నట్లు విజయనగర సామ్రాజ్యం అనే కడితలో చెప్పిఉంది. రాయలు తిమ్మరుసును ప్రధాన మంత్రిగా చేసి అతనిని 'అప్పాజీ' అని సంబోధించసాగాడు.

### 8.3.2. నాటి రాజ్యపరిస్థితులు :

శ్రీకృష్ణదేవరాయలు రాజ్యానికి వచ్చేనాటికి దక్షిణ దేశపరిస్థితి, ముఖ్యంగా విజయనగర రాజ్యపరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. ఉత్తరాన బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై బీజపూర్, అహమ్మద్‌నగర్, బీరార్, బీదర్, గోల్కొండ అనేక రాజ్యాలుగా విడిపోయింది. ఈ రాజ్యాల రాజులు తమలో తాము కలహించుకుంటూనే విజయనగర రాజ్యాన్ని కూడా కబళించడానికి ప్రయత్నించసాగిరి. సామంతులైన ఉమ్మత్తూరు, శ్రీరంగ పట్టణం పాలకులు తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యాన్ని ప్రకటించారు. తూర్పున కళింగాధిపతి ప్రతాపరుద్రగజపతి ఉదయగిరిని ఆక్రమించి విజయనగరాన్ని కబళించడానికి పొంచి ఉన్నాడు. పశ్చిమతీరంలో పోర్చుగీసు వారి బెడద ఎక్కువైంది. వీరు విజయనగర సామంతులైన భట్కల్, హోనోవర్ పాలకులనే గాక కళ్ళికోటను పాలించే జామోరిన్ అధికారాన్ని కూడా దిక్కరించసాగారు. కొచ్చిన్, కన్ననూర్‌లలో కోటలు కట్టుకొన్నారు. క్రీ.శ. 1509 లో కళ్ళికోట, ఈజిప్టుల సంయుక్త నౌకాబలంపై సాధించిన విజయంతో నాటివరకు అరబ్బుల ఆధీనంలోని వాణిజ్యం అంతా పోర్చుగీసుల స్వాధీనమై హిందూ మహాసముద్రంపై వారి కత్తికి ఎదురులేకపోయింది. కొత్తగా పోర్చుగీసు గవర్నరైన అల్బూకర్క్, గోవా ఆక్రమించి తమకు కేంద్రంగా చేసుకోవాలని సంకల్పించి జామోరిన్ మీద, ఆదిల్ ఖాన్ మీద తాను జరిపే యుద్ధాల్లో కృష్ణరాయల సహాయం అర్థిస్తూ లూయిజ్ ఫ్రేయర్‌ను రాయబారిగా విజయనగరం పంపినాడు.

### 8.3.3. పోర్చుగీసులతో ఒడంబడిక :

ఇటువంటి పరిస్థితుల్లో కృష్ణదేవరాయలు విజయనగర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాడు. విజయనగర విరోధియైన బీజపూర్‌తో వైరం వహించిన పోర్చుగీస్ వారితో మైత్రి చేసుకోవడం రాజనీతిగా భావించాడు. గోవాను ఆక్రమించడంతో పోర్చుగీసులకు రాయలు సాయం చేసేటట్లు, పోర్చుగీసులు తాము దిగుమతి చేస్తున్న గుర్రాలను గుత్తగా రాయలకు విక్రయించేటట్లు ఒడంబడిక

జరిగింది. పోర్చుగీసులు భట్కల్ కోటలు కట్టుకోవడానికి కూడా రాయలు అనుమతించాడు. క్రీ.శ. 1509 లో పోర్చుగీసులు గోవాను ఆక్రమించారు. యూసఫ్ ఆదిల్ గోవాపై దండెత్తినాడు గాని ఆక్రమించలేకపోయాడు. అదే సమయంలో బహమనీ రాజ్యంపై కృష్ణరాయల దాడులు జరుగుతున్నాయి. బహుశ అందువల్లనే ఆదిల్ గోవాపై తన బలం కేంద్రీకరించి ఆక్రమించలేకపోయినాడు.

## 8.3.4 కృష్ణరాయలు - బహమనీలు :

పోర్చుగీసులు సరఫరా చేసిన గుర్రాలలో సైన్యాన్ని బలపరిచి, ఆర్థిక వనరులను కట్టుదిట్టం చేసి కృష్ణరాయలు బహమనీలపై దృష్టి సారించాడు. క్రీ.శ. 1509 లో బీజపూర్ పాలకుడయిన యూసఫ్ ఆదిల్ ఖాన్‌చే ప్రేరితుడై బహమనీ సుల్తాన్ రెండో మహమ్మద్ షా విజయనగరం పై 'జిహాద్' ప్రకటించి తన సామంతులైన బీజపూర్, గోల్కొండ, అహమ్మద్ నగర్ పాలకులలో పెద్ద సైన్యంతో విజయనగర సామ్రాజ్యంపై దండెత్తినాడు. విజయనగర సరిహద్దులో కృష్ణరాయలు వారిని ఎదుర్కొని ఓడించి మళ్ళించాడు. క్రీ.శ. 1510 నాటి హంపీ శాసనంలో రాయలు విజయం సాధించినట్లు చెప్పబడింది. తిరోగమిస్తున్న సైన్యాన్ని తరుముతున్న విజయ నగర సైన్యాలను బీజపూర్ పాలకుడు యూసఫ్ ఆదిల్‌ఖాన్ అటకాయించి కోవెల కొండవద్ద ప్రాణాలు కోల్పోయాడు. విజయనగర సైన్యాలు కోవెల కొండను సులభంగా స్వాధీనం చేసుకొన్నాయి.

యూసఫ్ ఆదిల్ ఖాన్ మరణానంతరం అతని కుమారుడు ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ బీజపూర్ సింహాసనమధిష్టించాడు. ఇతని కాలలో బెల్గాం నగర ప్రజలు బీజపూర్ పాలకునిపై తిరుగుబాటుచేసి తను పట్టణాన్ని స్వాధీనం చేసుకోవలసిందిగా కృష్ణరాయలను ఆహ్వానించాడు. అందుచేత కృష్ణరాయలు బీజపూర్ పై దండెత్తి వెళ్ళి కృష్ణా తుంగభద్రా అంతర్వేదిలోని రాయచూర్ దుర్గాన్ని ఆక్రమించాడు. ఆ తరువాత కృష్ణరాయలు గుల్బర్గాను స్వాధీనం చేసుకొన్నాడు. ఆ తరువాత బీదర్ పై దండెత్తివెళ్ళి ఆ కోటను స్వాధీనం చేసుకొని, అక్కడ బందీగా ఉంచిన బహమనీ సుల్తాన్‌ను విడుదల చేసి అతనిని సింహాసనంపై తిరిగి కూర్చుండబెట్టినాడు. దీనివల్ల కృష్ణరాయలకు 'యవన రాజ్యస్థాపనాచార్య' అను బిరుదు వచ్చింది. చాటువులు, కైఫియతులు ఆధారంగా కృష్ణరాయలు గుల్బర్గా, బీదర్ నగరాలను పట్టుకొన్నాడని చరిత్రకారులు పేర్కొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు బహమనీ సుల్తాన్‌ను పునఃప్రతిష్టితుడిని చేయడం అనాలోచితంగా చేసిన పనికాదు. ఇది స్వశక్తి సహాయమైనప్పటికి ప్రతిష్టాకరమైన పనికావడం వల్ల ఇలా చేసివుండవచ్చు. ముస్లింల సహృదయతను కూడా ఆశించి వుండవచ్చు. బహమనీ సుల్తాన్ నామమాత్రంగా అయినా ఉన్నంతవరకూ మిగిలిన దక్కన్ ముస్లిం పాలకుల మధ్య ఐకమత్యం అసంభవమని తెలిసే కృష్ణరాయలు ఈ పనిచేశాడు.

## 8.3.5. ఉమ్మత్తూర్ పై దాడి :

వీరనరసింహరాయల కాలంనుంచి విజయనగరాన్ని ధిక్కరించి స్వతంత్రులుగా ఎగువ కావేరి ప్రాంతాన్ని పాలిస్తున్న ఉమ్మత్తూర్, శివసముద్రం పాలకులను అణచడానికి ముందు కృష్ణరాయలు సైన్యసమీకరణ చేశాడు. ఆ తరువాత రాయలు ఉమ్మత్తూర్ పాలకుడిపై దండెత్తాడు. అపుడు ఉమ్మత్తూర్ పాలకుడు గంగరాజు. ముందుగా రాయలు గంగరాజు ఆధీనంలోని పెనుగొండ దుర్గాన్ని స్వాధీనం చేసుకొని, దానికి దాయసల కొండమరుసయ్యను అధిపతిగా నియమించాడు. తరువాత గంగరాజును ఓడించి ఉమ్మత్తూర్, శివసముద్ర దుర్గాలను నేలమట్టం చేశాడు. శివసముద్రం నుంచి పారిపోతూ కావేరిలోని ఒక మడుగులో పడి గంగరాజు మరణించాడు. 'ఉమ్మత్తూర్ శివసముద్ర పుర వీథ్రోన్నూల మాడంబరా' అని రాయలను పారిజాతపహరణ వర్ణించిది. ఆ తరువాత రాయలు శ్రీరంగ పట్టణ దుర్గాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ఈ దండయాత్రలో తాను జయించిన ప్రాంతాన్నంతా ఒక రాజ్యంగా ఏర్పరచి, దానికి ప్రతినిధిగా సాళువ గోవిందరాజును రాయలు నియమించాడు.

## 8.3.6. కళింగ దండయాత్ర :

ఉమ్మత్తూర్ విజయం రాయలకు ఎనలేని బలాన్ని చేకూర్చింది. వెంటనే రాయలు గజపతి ఆక్రమణలో ఉన్న తీరాంధ్ర, తెలంగాణాలను జయించడానికి రాయలు సంకల్పించాడు. ఈ ప్రాంతంలో అనేక దుర్గాలున్నాయి. వానిలో ఉదయగిరి, కొండపల్లి, కొండవీడు బలమైనవి. వీనిలో సన్నిహితులు, విశ్వాసపాత్రులైన వారిని తన ప్రతినిధిగా గజపతి నియమించి, వారికి సాయంగా ప్రసిద్ధ సేనానులను, పెద్ద సైన్యాలను నిలిపాడు. కొండవీడు ప్రధాన కేంద్రంగా ప్రతాపరుద్రుని కుమారుడు వీరరుద్ర గజపతి పాలనలో ఉండేది.

కృష్ణరాయల పూర్వ దిగ్విజయ యాత్ర, కళింగ జైత్రయాత్ర ఏకధాటిగా సాగలేదు. క్రీ.శ. 1513 మొదలు క్రీ.శ. 1518 వరకు సాగిన ఈ జైత్రయాత్రలో 5 ఘట్టాలున్నట్లు ఆముక్త మాల్యద ద్వారా తెలుస్తుంది. అవి 1) ఉదయగిరి ముట్టడి 2) కొండవీడు పతనం 3) కొండపల్లి పతనం 4) సింహాద్రి పొట్నూరులో జయస్థంభ ప్రతిష్ట 5) కటకాన్ని పట్టుకోవడం. రాయలు మధ్య మధ్య రాజధానికి మరలుతూ అమరావతీ, శ్రీకాకుళం, అహోబిలం, శ్రీశైలం, తిరుపతి, చిదంబరం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించి, తన విజయాలకు కృతజ్ఞతగా అచట దేవతలకు కానుకలు సమర్పిస్తూ ఉండేవాడు. స్వయంగా రెండుమార్లు రాయలు కళింగపై నడిచినట్లు సింహాచలం శాసనాలు చెబుతుంది.

### ఉదయగిరి ముట్టడి :

కృష్ణరాయల కళింగ దండయాత్ర క్రీ.శ. 1513 లో ఉదయగిరి ముట్టడితో ప్రారంభమయింది. ఈ ఉదయగిరి ముట్టడిని న్యూనిజ్ వర్ణించాడు. రాయలను ఎదుర్కోడానికి ప్రతాపరుద్ర గజపతి సైన్యంతో కదలివచ్చాడు. బలిష్టమైన దుర్గం కావడంవల్ల దుర్గముట్టడి 18 నెలలవరకు సాగింది. రాయలు గజపతిని ఓడించి కొండవీడు వరకు తరిమి తిరిగివచ్చి ఉదయగిరిని ఆక్రమించి దాని పాలకునిగా కొండమరుసయ్యను నియమించాడు. అక్కడ దుర్గాధిపతిగా ఉన్న గజపతి పిన తండ్రి తిరుమల రాహుత్త రాయడు బందీ అయినాడు.

### కొండవీడు ముట్టడి :

ఉదయగిరి విజయం తరువాత రాయల సైన్యం పురోగమించి, తీరాంధ్రంలోని కందుకూరు, అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జున కొండ, తంగెడ, కేతవరం మొదలగు చిన్న దుర్గాలను ఆక్రమించి కొండవీడును ముట్టడించింది. సాళువ తిమమ్మరుసు నాయకత్వంలో కోట ముట్టడి జరిగింది. మూడు నెలలయినా కోట స్వాధీనం కాలేదు. అంతట కృష్ణరాయలు కోటను దిగ్బంధనం చేసి క్రీ.శ. 1515 లో స్వాధీనం చేసుకొన్నాడు. రాయలు కొండవీడు దుర్గ పాలనను తిమ్మరుసుకు అప్పగించాడు. దుర్గంలోని గజపతి రాణి, అతని కుమారుడు, దుర్గాధిపతి వీరభద్ర గజపతి బందీలయ్యారు.

### కొండపల్లి పతనం :

కొండవీటి పతనం తరవాత రాయల సైన్యం కృష్ణను దాటి బెజవాడను స్వాధీనం చేసుకుంది. తరువాత రాయల సైన్యం కొండపల్లిని ముట్టడించింది. ఈ ముట్టడి సాగుతున్నపుడు ప్రతాపరుద్ర గజపతి కృష్ణను దాటి వెనుకనుంచి రాయల సైన్యంపై దాడికి ప్రయత్నించాడు. కాని కృష్ణరాయలు కొంత సైన్యాన్ని కోట చుట్టు కాపుంచి, తక్కిన సేనతో ప్రతాపరుద్ర గజపతిని ఎదిరించి, యుద్ధంలో ఓడించి తరిమి కొట్టాడు. తరువాత రాయలు కొండపల్లిని ఆక్రమించాడు. కొండపల్లినుంచి రాయల సైన్యం తెలంగాణా పైకి దండెత్తింది. తెలంగాణాలో అధికభాగం గజపతి సామంతుల పాలనలో ఉంది. రాయల సైన్యం మొదట షితాబ్‌ఖాన్ అను బిరుదనామం గల సీతాపతిని ఓడించి ఖమ్మం మెట్టు, వరంగల్లు, అనంతగిరి, ఉంద్రకొండ, ఉర్లకొండ, అరవపల్లి, జల్లిపల్లి, కందికొండ, నల్లగొండ, రాచకొండ, దేవరకొండ, కనకగిరి మెదలగు దుర్గాలను ఆక్రమించి సింహాచలం వైపు పురోగమించాయి.

### పొట్నూరులో జయస్థంభ ప్రతిష్ఠ :

రాయల సైన్యం తెలంగాణా విజయం తర్వాత సింహాచలంవైపు పోతుండగా గజపతి ఆజ్ఞ మేరకు సీతాపతి 60 వేల అశ్వరూఢులైన విలుకాండ్రతో ఎదిరించి పరాజయం చెందాడు. ఇంతలో రాజమహేంద్రవరం రాయల స్వాధీనమైంది. తరవాత రాయల సేన సింహాచలం చేరింది. సింహాచలంలో రాయలు 6 నెలలు వేచివున్నా, గజపతి వచ్చి ఎదిరించలేదు. అంతట కృష్ణరాయలు సింహాచలం సమీపంలో ఉన్న పొట్నూరు వద్ద విజయస్తంభం నాటి విజయనగరానికి తిరిగిపోయాడు. రాజధానిలో కళింగ దిగ్విజయానికి చిహ్నంగా భువన విజయమనే నూతన సభాభవనాన్ని నిర్మించాడు.

### కటకంపై దండయాత్ర

కృష్ణరాయలు రాజధానిలో మళ్ళీ సైన్యాలను సమకూర్చుకొని ప్రతాపరుద్ర గజపతి రాజధాని కటకంపై దండెత్తినాడు. గజపతి తన సామంతులతో కలసి రాయలను ఎదుర్కోవడానికి చేసిన ప్రయత్నాన్ని మహామంత్రి తిమ్మరుసు విఫలం చేశాడు. కృష్ణరాయలు కటకం చేరగానే ప్రతాపరుద్ర గజపతి పారిపోయినట్లు, రాయల సైనికులు కటకాన్ని కాల్చినట్లు రాయవాచకం, ఆముక్త మాల్యద తెలుపుతాయి. చివరకు ప్రతాపరుద్ర గజపతి రాయలకు తన కుమార్తె అయిన అన్నపూర్ణాదేవిని ఇచ్చి వివాహం చేసి సంధి చేసుకొన్నాడు. కృష్ణరాయలు కృష్ణానదికి ఉత్తరాన తాను జయించిన దుర్గాలను, ప్రాంతాలను తిరిగి గజపతికి ఇచ్చివేశాడు.

## 8.3.7 రాయలు - ఆదిల్ షా :

కళింగ దండయాత్ర తరువాత కృష్ణరాయలు బహమనీ వ్యవహారాలలో ముఖ్యంగా బీజపూర్‌తోటి యుద్ధాలలో గడపవలసి వచ్చింది. క్రీ.శ. 1510 లోనే మహమద్‌షాను ఉద్ధరించడం ద్వారా బహమనీ వ్యవహారాల్లో రాయలు జోక్యం కలిగించుకొన్నాడు. మహమద్ మరణంతో సుల్తాన్ మరింత నామమాత్రుడై అధికారం ఆలీబరీద్ హస్తగతమయింది. మహమ్మద్‌కు ముగ్గరు కుమారులు. వారిలో అహమ్మద్‌షా, వాలి యుల్లాలు అకాల మరణానికి గురికాగా మూడో వాడైన కాలిముల్లా సుల్తానై రాజ్య నిర్మాతగా వ్యవహరిస్తున్న ఆలీ బరీద్‌ను తొలగించడానికి ప్రయత్నించి పదభ్రష్టుడై బీదర్ విడిచి పారిపోయాడు. బహమనీ రాజవంశం అంతరించి రాజ్యం విచ్ఛిన్నమై 5 రాజ్యాలకు స్పష్టమైన రూపం ఏర్పడింది. ఈ రాజ్యాలలో బీజపూర్ మొదటి నుండి బలవత్తరంగా ఉంది. అందుచే ఇతర రాజ్యాలు బీజపూర్ పట్ల ద్వేషం వహించినాయి. ఆ సుల్తానులు బీజపూర్ తోటి యుద్ధం మొదటి దశలో కృష్ణరాయలను బలపరిచారు.

కృష్ణరాయలకు బీజపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్ షాకు పలుమారు యుద్ధం జరిగింది. ఈ యుద్ధాల తేదీలను గురించి, ఫలితాల గురించి అభిప్రాయ భేదాలున్నాయి. అందుకు న్యూనిజ్, ఫెరిస్టాల రచనలలోని వ్యత్యాసాలే కారణం. వీరి రచనలు పరిశీలించిన రాబర్ట్ సూయల్ నిర్ణయం ప్రకారం కృష్ణరాయలు కళింగ దండయాత్రలో ఉండగా, అదే అవకాశంగా భావించి క్రీ.శ. 1516 లో బీజపూర్ పాలకుడు ఇస్మాయిల్ ఆరిల్‌ఖాన్ గోల్కొండ, అహమ్మద్ నగర్ పాలకులతో కలసి విజయనగర రాజ్యంపై దండెత్తి కోవెల కొండ, పానుగల్లు, దేవరకొండ, ఘన్‌పూర్ దుర్గాలను స్వాధీనం చేసుకొన్నాడు. అందువల్ల రాయలు వారి ఆట కట్టించడానికై కళింగ దిగ్విజయ యాత్ర కాలంలోనే క్రీ.శ. 1516 లో వారిమీద దండెత్తవలసి వచ్చింది. రాయలు కోవెలకొండ మొదలగు దుర్గాలపైకి ఒక సేనను పంపి, ఇంకో సేనతో బీజపూర్ పై దండెత్తాడు. కోవెల కొండను రక్షించుకోవలసినందున గోల్కొండ పాలకుడు కులీ మిగిలిన వారితో కలసి రాయలను ఎదిరించలేక పోయాడు. అందువల్ల బీజపూర్, అహమ్మద్ నగర్ పాలకులే రాయలను ఎదిరించినారు. ఈ దండయాత్రలో రాయలు కెంబాని వద్ద ఘన విజయం సాధించి, అహమ్మద్ నగరాన్ని నేలమట్టం చేసినట్లు ఆముక్త మాల్యద తెలుపుతుంది.

ఈ సమయంలోనే పోర్చుగీసు రాయబారి ఫైయల్ లూయీనిని ఒక ముస్లిం విజయనగరంలో చంపివేశాడు. కాని దీనివల్ల విజయనగర - పోర్చుగీస్ సంబంధాలు చెడలేదు.

ముస్లింల ఆధీనంలో ఉన్న రాయచూర్ ని స్వాధీనపరచుకొనుటకు కృష్ణరాయలు క్రీ.శ. 1520 లో గొప్ప సైన్యంతో వెళ్లి దానిని ముట్టడించాడు. బీజపూర్ పాలకుడు, ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ రాయలను ఎదిరించాడు. ఇరు పక్షాలకు మధ్య కృష్ణానదీ దక్షిణ తీరంలో ఉన్న గొంబ్బూరు వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఆదిల్‌ఖాన్ పూర్తిగా పరాజయం చెంది తన సమస్త సైన్యాన్ని కోల్పోయాడు. ఈ యుద్ధంలోనే పోర్చుగీసు రాయబారి క్రిస్టోవోడ ఫిగరడో తన నాయకత్వంలో పోర్చుగీసు తుపాకి దళంలో రాయలకు సహాయపడ్డాడు. ఆదిల్‌ఖాన్ పారిపోయాడు. రాయలు ఈ యుద్ధం తరువాత రాయచూర్ ముట్టడిసాగించి దానిని స్వాధీనం చేసుకొన్నాడు. కృష్ణా, తుంగభద్రా, అంతర్వేది అంతా తిరిగి విజయనగర పాలన కిందికి వచ్చింది. ఈ విజయం వల్ల రాయల కీర్తి ప్రతిష్టలు ఇనుమడించినాయి.

రాయచూరు దండయాత్ర తరువాత ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ రాయలతో సంధి చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని సంధి షరతులకు ఇష్టపడనందున రాయలు కోపించి, దండెత్తి వెళ్ళి బీజపూర్ ప్రవేశించాడు. అచట నీటి వసతి లేక అచటినుండి తిరిగి వచ్చి ముద్గల్ దుర్గం చేరాడు. రాయలతో సంధికుదుర్చుకోవడానికి ఆదిల్ ఖాన్, అసద్ ఖాన్ లారీని పంపాడు. కాని లారీ దుస్తంత్ర వల్ల సంధి కుదరలేదు. కృష్ణరాయలు ఆగ్రహించి క్రీ.శ. 1523 లో బీజపూర్ రాజ్యంపై మళ్ళీ దండెత్తిపోయి కలుబరిగె (గుల్బర్గా) కోటను ముట్టడించి స్వాధీనం చేసుకొన్నాడు. అచట బందీలుగా ఉన్న బహమనీ సుల్తాన్ కుమారులు రాయల చేతికి చిక్కారు. రాయలు వారిని విడుదల చేసి వారిలో మొదటి వాడిని సింహాసనస్థుడిని చేసి, మిగిలిన ఇద్దరిని తనతో విజయనగరానికి తీసుకొని పోయాడు. కలుబరిగె దండయాత్ర రాయలు జైత్ర యాత్రలలో చివరిది.

అయితే రాయల పరిపాలనా కాలం చివర్లో (క్రీ.శ. 1528 - 1529) బీరారు, బీదర్ నాయకుల సహాయంతో ఆదిల్ షా రాయచూరు, ముద్గల్లులను ఆక్రమించుకొన్నాడు. అంతర్వేదిని తిరిగి ఆక్రమించే ప్రయత్నంలో ఉండగానే రాయలు జబ్బుపడి మరణించాడు.

## 8.3.8 విషాదాంతము :

ఎంతో వైభవోపేతమైన జీవితం గడిపిన కృష్ణరాయలు జీవితంలో చివరి రోజులు విషాదాంతమైనవి. కృష్ణరాయలకు తిరుమల దేవరాయలను ఒక కుమారుడు కలిగాడు. ఇతడు బాలుడైనా, రాయలు ఇతనిని తన వారసుడిగా నిర్దేశించి, పట్టాభిషేకమొనర్చి అతని పేర మహామంత్రి తిమ్మరుసు సహాయంతో రాచకార్యాలను నిర్వహిస్తున్నాడు. అయితే ఆ కుమారుడు ఏ కారణం చేతనో 1524 లో మరణించాడు. తన కుమారుని తిమ్మరుసు విషప్రయోగం చేశాడని రాయలు అనుమానించి తిమ్మరుసును, అతని కుటుంబ సభ్యులను బంధించాడు. కాని తిమ్మరుసు కుమారుడైన తిమ్మదండ నాయకుడు చెరసాలనుంచి తప్పించుకొని రాయలపై తిరుగుబాటు చేసి అల్లర్లు సృష్టించాడు. దీనితో ఆగ్రహించిన రాయలు చెరసాలలో ఉన్న తిమ్మరుసు కండ్లు పీకించాడని న్యూనిజ్ కథనం. ఈ పరిస్థితుల్లోనే ఆదిల్‌షా రాయచూరును ఆక్రమించాడు. తరువాత తిమ్మరుసు నిర్దోషియని తెలిసి రాయలు ఎంతో కుంగి కృశించి చివరకు క్రీ.శ. 1529 లో మరణించాడు.

దీంతోబాటు సామ్రాజ్యం యొక్క వారసత్వ సమస్య కూడా కృష్ణరాయలను ఎంతో కలతపెట్టింది. రాయల తరువాత రాజ్యానికి వారసులుగా ఎన్నదగినవారు నల్గురు కలరు. వారిలో మొదటివాడు రాయలు కుమారుడు తిరుమల దేవరాయలు ఇతడు మరణించాడు. రెండోవాడు కృష్ణరాయలు అన్న వీరనరసింహరాయలు కుమారుడు. మూడోవాడు కృష్ణరాయల సవతి తమ్ముడైన అచ్యుత దేవరాయలు. నాల్గవ వాడు అచ్చుత రాయల అన్న రంగరాయల కుమారుడైన సదాశివరాయలు. వీరిలో అచ్చుత రాయలను తన వారసునిగా రాయలు నిర్ణయించాడు. అయితే ఈ నిర్ణయాన్ని కృష్ణరాయల అల్లుడు రామరాయలు వ్యతిరేకించాడు. కృష్ణరాయల మరణం తరువాత ఇది వారసత్వ యుద్ధానికి దారితీసింది.

## 8.3.9 ఘనత :

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తులలో శ్రీకృష్ణదేవరాయలు అగ్రగణ్యుడు. భారతదేశాన్ని పాలించిన అగ్రగణ్యులైన చక్రవర్తులలో కృష్ణరాయలు ఒకరు. ఇతని పాలనా కాలం విజయనగర సామ్రాజ్య చరిత్రలో స్వర్ణయుగం. తన దిగ్విజయాలతో రాయలు విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరింపజేసి విజయనగర గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపజేశాడు.

**పరిపాలన విధానము :**

శ్రీ కృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడు. రాజనీతి పరుడు. ఆముక్త మాల్యదలో తన రాజనీతిని రాయలు వివరిస్తాడు కాని అందులో చాలా భాగం సాంప్రదాయక హిందూ రాజనీతి సూత్రాలే కన్పిస్తాయి. రాచరికం దైవదత్తమని, ప్రజలు దైవస్వరూపులు గాన వారి శ్రేయోభివృద్ధికి కృషిచేస్తూ వర్ణ ధర్మాలను రక్షించడం రాజు కర్తవ్యమని అతని విశ్వాసం. మహామంత్రి తిమ్మరుసు సాయంతో రాయలు పాలనా యంత్రాంగాన్ని రూపొందించాడు. విశ్వాసపాత్రలు, విద్యావంతులునైన విప్రులను మంత్రులుగా నియమించి తరుచు మంత్రి పరిషత్తును సమావేశపరచి సలహాలు తీసుకొనేవాడు. దుర్గాధిపతులు, సేనాపతులు బ్రాహ్మణులైనచో ఇతర వర్ణాల అపహాస్యానికి పాలవుతామనే భయంతో ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధిస్తారని రాయల అభిప్రాయం. రాయల యుద్ధాలు చాలా వరకు తిమ్మరుసే నిర్వహించాడు. కృష్ణరాయుల సైన్యంలో బోయవిభాగం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రజలపై పన్నుల భారం ఎక్కువ కారాదని రాయల ఆశయం కాని అతని కాలంలో పన్నుల భారం ఎక్కువగానే ఉండేది. పోర్చుగీసు ఇంజనీర్ల సాయంతో కాలువలు, చెరువులు తవ్వించి, నీటి వనరులు కల్పించాడు. తన తల్లిపేర నాగలాపురాన్ని నిర్మించాడు.

**సాహిత్య సేవ :**

శ్రీ కృష్ణరాయుల కాలంలో గొప్ప సాహిత్య సృష్టిజరిగినది. అందుకతనికి సంగీత సాహిత్య సమరాంగణ సార్వభౌమ అను బిరుదు వచ్చినది. ఇతడు సంస్కృతాంధ్ర, కన్నడ భాషలకు ఎనలేని సేవచేశాడు. అందువల్ల ఇతని పాలనా కాలాన్ని సాహిత్యపరంగా స్వర్ణయుగమని చెప్పవచ్చు. రాయలు స్వయంగా కవి. తెలుగులో ఆముక్త మాల్యద అను గ్రంధాన్ని వ్రాసాడు. సంస్కృతంలో జాంబవతీ పరిణయం, మదాలస చరిత్ర, సత్యావధు ప్రేతకం అను కావ్యాలు వ్రాశాడు. అష్ట దిగ్గజాలు అను కవులను పోషించి 'ఆంధ్రభోజుడు' అని కీర్తింపబడినాడు. కృష్ణరాయల ఆస్థానమైన 'భువన విజయం' సకల కళలకు నిలయమైనది. రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజములు వారి రచనలు :

| | | | |
|---|---|---|---|
| 1. | అల్లసాని పెద్దన | - | మనుచరిత్ర |
| 2. | నంది తిమ్మన | - | పారిజాతాపహరణం |
| 3. | అయ్యలరాజు రామభద్రుడు | - | రాజశేఖర చరిత్రము |
| 4. | మాదయగారి మల్లన | - | రామాభ్యుదయం |
| 5. | పింగళిసూరన | - | కళాపూర్ణోదయము, ప్రభావతీ ప్రద్యుమ్నము |
| 6. | దూర్జటి | - | కాళహస్తీశ్వర మహాత్యము, కాళహస్తీశ్వర శతకం |
| 7. | తెనాలి రామకృష్ణుడు | - | పాండురంగ మహాత్యం |
| 8. | భట్టుమూర్తి | - | వసు చరిత్ర |

ఈ కవులందరూ కృష్ణరాయల ఆస్థానంలో లేరని కొందరి చరిత్రకారుల అభిప్రాయం. ముఖ్యంగా పింగళి సూరన, తెనాలి రామకృష్ణ కవి అష్టదిగ్గజాలలోని వారు కారని భాషా పండితుల అభిప్రాయం.

కృష్ణరాయల ఆస్థానంలోని లక్ష్మీనారాయణ కవి సంస్కృతంలో 'సంగీత సూర్యోదయం' అనే సంగీత శాస్త్రగ్రంధాన్ని వ్రాసి రాయలకు అంకితం చేశాడు. రాయలు తెలుగు కవులనే గాక అనేకమంది కన్నడ కవులను పోషించాడు. కన్నడంలో సుప్రసిద్ధుడైన తిమ్మన కవి రాయల ఆస్థాన కవి.

**మత విధానం :**

శ్రీ కృష్ణదేవరాయలు వైష్ణవుడు. ద్వైతమతాచార్యులైన వ్యాసరాయలు రాయల గురువు. కృష్ణరాయలు వైష్ణవ మతాభిమాని అయినా అన్ని మతాలకు సమానంగా ఆదరించి పరమత సహనం ప్రదర్శించాడు. వల్లభాచార్యుడను వైష్ణవ మతాచార్యుని, అప్పయ దీక్షితుడు అను శైవ పండితుని ఆదరించాడు. ముస్లింలకు తన రాజ్యంలో స్వేచ్ఛను ప్రసాదించాడు. శైవ, వైష్ణవ ఆలయాలను దర్శించి దాన ధర్మాలు చేశాడు.

**భవన నిర్మాణము:**

శ్రీ కృష్ణదేవరాయలు గొప్ప భవన నిర్మాత. విజయనగరంలోని కృష్ణస్వామి ఆలయం, హజారా రామాలయం నిర్మించాడు. కాళహస్తి, తిరుపతి, శ్రీశైలం, కంచి, సింహాచలం ఆలయాలకు గోపుర మండపాలు నిర్మించి దాన ధర్మాలు చేసాడు. తన తల్లి నాగాంబిక గౌరవార్థం నాగలాపురమను పట్టణాన్ని నిర్మించాడు. కృష్ణరాయల కాలంలో విజయనగరం సుందర ఉద్యాన వనాలతో, సరోవరాలతో అత్యంత రమణీయమై రోమ్ నగరంతో సరిసమానంగా తులతూగుతున్నదని పేస్ అనే పోర్చుగీస్ యాత్రికుడు వర్ణించాడు. కృష్ణరాయలు, అతని రాణులైన తిరుమలదేవి, చిన్నాదేవిల కాంస్య విగ్రహాలు తిరుమల వేంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఉన్నాయి.

## 8.4 అచ్యుత దేవరాయలు : (క్రీ.శ. 1530 - 1542)

శ్రీ కృష్ణదేవరాయలు తన సవతి తల్లి కొడుకైన అచ్యుత రాయలను వారసుడుగా నియమించిన తరువాత చంద్రగిరిలో బందీగా ఉన్న అతడు విజయనగరం చేరటానికి కొంతకాలం పట్టింది. అచ్యుత రాయలను సింహాసనం మీద కూర్చుండ బెట్టే బాధ్యత అప్పటిలో సర్వశర: ప్రధానిగా ఉన్న చెల్లప్ప అనే నామాంతరం గల సాళువ నరసింగ రాయలకు అప్పగించి కృష్ణరాయలు కండ్లు మూశాడు. కాని అధికార కాంక్షగల కృష్ణరాయల అల్లుడు రామరాజుకు ఈ ఏర్పాట్లు నచ్చలేదు. అందువల్ల అతడు కృష్ణరాయల పుత్రుడైన పసిబిడ్డను సింహాసనంపై కూర్చుండ బెట్టి, అతనికి సంరక్షుడుగా తాను అధికారం చెలాయించదలిచాడు. కాని కృష్ణరాయల ఆదేశం మేరకు చెల్లప్ప అచ్యుత రాయలు సంహాసనమధిష్టించడానికి గట్టి ఏర్పాట్లు చేసి రామరాజు ప్రయత్నాన్ని విఫలంచేశాడు. అచ్యుత రాయలు, తన పట్టాభిషేకం విజయనగరంలో నిర్విఘ్నంగా జరుగదని శంకించి, తిరుపతిలో తన ఇష్టదైవమైన వేంకటేశ్వరుని సన్నిధిలో పట్టాభిషేకం చేసుకొని విజయనగరానికి బయలుదేరాడు.

విజయనగరంలో చెలరేగిన అంతఃకలహాన్ని అసరాగా తీసుకొని అంతర్వేదిపై బీజపూర్ సుల్తాన్, తీరాంధ్రంపై గోల్కొండ నవాబులు దాడి ప్రారంభించారు. విజయనగర సామంతులైన గుత్తి, శ్రీరంగ పట్టణం దుర్గాధిపతులు తిరుగుబాటుచేశారు.

బీజపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్, బీదర్, బీరార్ పాలకుల సాయంతో అంతర్వేదిపై దండెత్తి వచ్చాడు. వీరిని ఆరవీటి రామరాజు తిమ్మరాజు పుత్రుడైన అప్పలరాజు ఎదిరించి కూరక చెర్లవద్ద జరిగిన యుద్ధంలో మరణించాడు. ఇస్మాయిల్ రాయచూర్, ముద్గల్ దుర్గాలను ఆక్రమించాడు. సుల్తాన్ కులీ కుతుబ్ ఉల్ ముల్క్ కొండవీడును ముట్టడించాడు. ఇతనికి వెలగోటి తిమ్మనాయుడు సహాయం చేశాడు. అచ్యుత రాయలు స్వయంగా దండెత్తి వెళ్ళి గోల్కొండ సైన్యాలను ఓడించి మళ్ళించాడు.

తిరుమలలో పట్టాభిషేకం చేసుకొన్న తరువాత విజయనగరం చేరిన అచ్యుత రాయలు అంతఃకలహాలు మాన్పటానికి రామరాజుతో ఒప్పందం చేసుకొన్నాడు. ఈ ఒప్పందాన్ని సహించక సాళువ నరసింగరాయలు ద్రావిడ దేశానికి పోయి తిరుగుబాటు లేవదీశాడు. ఇతనితో తిరువడి తుంబిచ్చి నాయకులు సహకరించారు. ఇదే అదనుగా ఉమ్మత్తూర్ పాళెగాండ్రు రాయల అధికారాన్ని ధిక్కరించారు.

అచ్యుత రాయలు తన బావమరిది సలకరాజు చిన తిరుమలరాజు సహాయంతో సాళువ నరసింగరాయలపై దండెత్తి అతనిని ఓడించాడు. నరసింగరాయలు పారిపోయి తన మిత్రుడైన తిరువడిని చేరాడు. సాళువ నరసింగరాయలను, తిరువడిని ఓడించిన తరువాత అచ్యుత రాయలు ఉమ్మత్తూర్ మీదికి దండెత్తాడు. అక్కడి పాలెగాండ్రను ఓడించి వారినుండి కప్పం వసూలు చేసి రాయలు విజయనగరాన్ని చేరాడు.

అచ్యుత రాయల దక్షిణ దండయాత్ర తరువాత కొద్దికాలానికే కృష్ణరాయల కుమారుడు మరణించాడు. దీంతో అప్పటివరకు అతని కార్యకర్తగా రాజ్యాధికారంలో పాలుపంచుకొన్న రామరాజు పట్టుసడలింది. నాటినుండి అచ్యుత రాయలు రామరాజును లక్ష్యపెట్టక, తన బావమరుదులకు ప్రాముఖ్యమిచ్చాడు

ఇదే సమయంలో బీజపూర్‌లో ఇస్మాయిల్ ఆదిల్ షా మరణం తరవాత బీజపూర్‌లో ఏర్పడ్డ అంతఃకలహాలు ఆసరాగా అచ్యుతరాయలు రాయచూర్ దుర్గం పై దండెత్తి స్వాధీనం చేసుకొన్నాడు. ఆ తరువాత అచ్యుత రాయలు గుత్తి దుర్గాన్ని స్వాధీనం చేసుకొన్నాడు.

అచ్యుత రాయలు రాజధానిలో లేని సమయంలో రామరాజు రాజకీయ కార్యకలాపాలు నిర్వహించసాగాడు. ఇతని అధికారాన్ని దక్షిణ దేశంలోని అమరనాయకులు వ్యతిరేకించారు. వారిని శిక్షించడానికి రామరాజు ద్రావిడ దేశంమీద దండెత్తగా, రాజధానిలో అచ్యుత రాయల బావమరిది సలకరాజు తిరుమల రాజు అధికారం హస్తగతం చేసుకొని, అచ్యుత రాయల పేరుతో రాచకార్యలు నిర్వహించసాగాడు.

రాబోవు ప్రమాదాలు గుర్తించి అచ్యుత రాయలు రామరాజుతో సంధిచేసుకొన్నాడు. ఫలితంగా కొంతకాలం దేశానికి శాంతి లభించింది. కొద్దికాలానికే అచ్యుత రాయలు మరణించాడు.

అచ్యుత రాయలు క్రూరుడు, దుష్టుడు, విషయలోలుడు, రణభీరువు అనీ, అతని పాలన ప్రజలకు గానీ ఉద్యోగులకు గానీ తృప్తి నివ్వలేదని న్యూనిజ్ అనే పోర్చుగీసు యాత్రికుడు వ్రాశాడు. కాని న్యూనిజ్ వ్రాతలు యధార్థం కావని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. కృష్ణరాయల వలె అచ్యుత రాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు, రామరాజు వలె శక్తి సంపన్నుడు కాకపోవచ్చుగాని క్రూరుడు, దుష్టుడు, రణభీరువు కాదని ఆ చరిత్రకారుల అభిప్రాయం. విజయనగర రాజులందరివలె ఇతడు గొప్ప దైవ భక్తుడు, సాహిత్య పోషకుడు.

## 8.5 మొదటి వేంకటపతి దేవరాయలు (క్రీ.శ. 1542)

అచ్యుత రాయల తరువాత అతని కుమారుడైన వేంకటపతి దేవరాయలు సింహాసనం అధిష్టించాడు. అతడు బాలుడు కావడం వల్ల అతని మేనమామ సలకం చిన తిరుమల రాజు అతనికి రక్షకునిగా కొంతకాలం రాజ్యపాలన నిర్వహించాడు. తరువాత తిరుమల రాజు క్రూరుడై వెంకటపతిరాయలను చంపించి సింహాసనాన్ని ఆక్రమించాడు. ఈ అకృత్యాన్ని సంహించలేక రాజోద్యోగులు అనేకమంది అతనిని వదిలిపోయారు.

విజయనగర రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి ఇదే తగిన సమయం అని భావించి, రామరాయలు గుత్తి దుర్గంలో బందీగా ఉన్న అచ్యుత రాయల అన్న శ్రీరంగ రాయల కుమారుడు అయిన సదాశివరాయలను చెలసాలనుండి విడిపించి, రాజుగా ప్రకటించి విజయనగరంపై దండెత్తాడు. తుంగభద్రానదీ తీరంలో రామరాయలు తిరుమల రాజును ఓడించి, చంపి, సదాశివరాయలను విజయనగర సింహాసనంపై నిలిపాడు.

## 8.6 సదాశివరాయలు : (క్రీ.శ. 1543 - 1573)

స్వీయ వ్యక్తిత్వం లేని సదాశివరాయలు నామమాత్రపు రాజు. అతని పేరున రామరాయలే 23 సంవత్సరాలు రాజ్యచక్రం తిప్పి వైభవంతో పరిపాలించాడు. ఇతడు దక్కన్ సుల్తానుల పట్ల అనుసరించిన విధాన ఫలితంగా క్రీ.శ. 1565 లో రక్షసతంగడి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో రామరాయలు ప్రాణాలు కోల్పోయాడు. విజయనగర సైన్యం చెల్లాచెదురయింది. ఈ యుద్ధంలో బతికి బయట పడిన రామరాయల సోదరుడు తిరుమల రాయలు విజయనగరం చేరి బందీగా ఉన్న సదాశివరాయలను, తన కుటుంబీకులను అపార సంపదను రత్న ఖచిత సింహాసనంతో సహా పెనుగొండ దుర్గానికి పారిపోయిడు. యుద్ధానంతరం విజయనగర పూర్వ గౌరప్రతిష్ఠలను, వైభవాన్ని పునురుద్ధరించడంలో విఫలుడైన తిరుమల రాయలు పెనుగొండ మరలాడు. ఇతడు పెనుగొండలో పట్టాభిషిక్తుడవడంతో ఆరవీటి వంశీయుల స్వతంత్ర పాలన ప్రారంభమయింది. తిరుమల రాయలు సదాశివరాయలను హత్యచేసినాడన్న రాబర్ట్ నూయల్ కథనంలో సత్యంలేదు. క్రీ.శ. 1576 వరకు సదాశివరాయల గురించి శాసనాలు పేర్కొంటున్నాయి. నాటి వరకు విజయనగరంలోనే నామమాత్రమైన అధికారం చెలాయిస్తూ సదాశివరాయలు జీవించి వున్నాడు. అతనితో తుళువవంశం అస్తమించింది. రాజకీయాధికారం అంతర్హితం గావడంతో ఆలనాపాలన లేక విజయనగరం పూర్తిగా శిధిలమయింది.

## 8.7 సారాంశము :

సాళువ వంశం తరువాత విజయనగర సామ్రాజ్యాన్ని పాలించినది తుళువ వంశం. వీరనరసింహరాయలు ఈ వంశస్థాపకుడు. ఇతని తర్వాత విజయనగరాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయలు దక్షిణ భారతదేశం గర్వించదగ్గ పాలకులలో ఒకడిగా పేరుపొందాడు. అతని తరువాత అచ్యుత దేవరాయలు, వేంకటపతి దేవరాయలు, సదాశివరాయలు విజయనగరాన్ని పాలించారు. ఆ తరువాత తుళువ వంశం పాలన అంతమయింది.

- డా. వి.కె. మోహన్.

పాఠం - 9

# అళియ రామరాయలు : తళ్ళికోట యుద్ధం (క్రీ.శ. 1565)

## 9.0 లక్ష్యం :

శ్రీ కృష్ణదేవరాయుల అల్లుడైన రామరాయలు క్రీ.శ. 1543 లో సదాశివరాయలను విజయనగర సింహాసనంపై అధిష్టింపజేసి సామ్రాజ్యంలోని సర్వాధికారాలకు కర్తఅయ్యాడు. అళియ రామరాయల పాలన, తళ్ళికోట (రక్షస తంగడి) యుద్ధం గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం :

## విషయక్రమం :

9.1 పరిచయం

9.2 రామరాయలు

9.3 రామరాయల పాలనలో మార్పులు

9.4 దక్షిణ రాజ్యాలపై దండయాత్ర

9.5 రామరాజు - దక్కన్ సుల్తానులు

9.5.1 మొదటి దశ (క్రీ.శ. 1543 - 1557)

9.5.2 రెండవ దశ (క్రీ.శ. 1557 - 1563)

9.6 తళ్ళికోట యుద్ధం (లేదా) రక్కస - తంగడి యుద్ధం

9.6.1 తళ్ళికోట యుద్ధకారణాలు

9.6.2 తళ్ళికోట యుద్ధగమనం

9.6.3 రామరాయల మరణం

9.6.4 విజయనగర పతనం - రామరాయల బాధ్యత

9.6.5 యుద్ధ స్థలం

9.6.6 యుద్ధకాలం

9.6.7 విజయనగర విధ్వంసనం

9.6.8 ఫలితాలు

9.7 సారాంశము

## 9.1 పరిచయం :

శ్రీ కృష్ణ దేవరాయల మరణానంతరం విజయనగర సింహాసనం కొరకు అల్లుడు రామరాయలు, తమ్ముడు అచ్యుత దేవరాయల మధ్య ఘర్షణ ప్రారంభమయింది. కృష్ణరాయల అభీష్టం మేరకు సర్వశిరం ప్రధానియైన సాళువ నరసింగరాయలు అచ్యుత రాయలను సింహాసనం మీద నిలిపాడు. అచ్యుత రాయల తరువాత తిరిగి అధికారం కోసం జరిగిన పోరులో అచ్యుత రాయల బావమరిది సలకం చిన తిరుమల రాజును చంపి, అచ్యుత రాయల అన్న శ్రీరంగరాయల కొడును సదాశివరాయలను సింహాసనం మీద నిలిపి రామరాయలు సర్వాధికారాలు హస్తగతం చేసుకొన్నాడు. రామరాయలు అధికారం చేపట్టగానే పాలనలో అనేక మార్పులు చేశాడు. తిరుగుబాటు దారులైన దాక్షిణాత్య పాలకులను అణచి, దక్కన్ సుల్తానుల పట్ల విభజించు - పాలించు విధానం పాటించి తళ్ళికోట యుద్ధానికి కారకుడయ్యాడు. యుద్ధ ఫలితంగా విజయనగరం విధ్వంసమయింది. రామరాయలు చంపబడినాడు.

## 9.2. రామరాయలు :

సదాశివరాయలను విజయనగర చక్రవర్తిగా పట్టాభిషిక్తుడిని చేసి సామ్రాజ్యంలోని సర్వాధికారాలకు కర్తఅయిన రామరాయలు అధికారంలోకి వచ్చేనాటికి వయోవృద్ధుడు. రామరాయలు సమర్థుడు, కాకలు తీరిన యోధుడు. రాజనీతి చతురుడు. రెండు దశాబ్దాల పాటు దక్షిణ భారతంలో తన మాటకు, కత్తికి ఎదురు లేదనిపించుకొన్నాడు. సదాశివరాయలను పట్టాభిషిక్తుడిని చేసిన తరువాత కొంతకాలానికే రామరాయలు రాయ బిరుదావళులు ధరించసాగాడు.

ఆరవీటి వంశానికి చెందిన రామరాయలు సాళువ నరసింహుని సేనాని, మంత్రి అయిన ఆరవీటి బుక్కని మునిమనుమడు. అతనికి తిరుమలరాయ, వెంకటాద్రులనే ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. గోల్కొండ సుల్తాన్ కులీకుతుబ్‌షా ఆస్థాన ఉద్యోగిగా మొదట ప్రాముఖ్యానికి వచ్చాడు. సరిహద్దుల్లో ఉన్న విజయనగర భూభాగాలను జయించినందుకు ప్రతిగా రామరాయలకు మస్ - సొంత జాగీరునిచ్చి కొత్తగా జయించిన ప్రాంతాలకు ప్రతినిధిగా నిలిపి అతణ్ణి సన్మానించాడు. ఒకసారి ఆదిల్ షాతో జరిగిన యుద్ధంలో ఓడిపోగా రామరాయలను కులీ అవమానించాడు. ఈ అవమానమును సహించలేక రామరాయలు కులీ కొలువు చాలించి శ్రీ కృష్ణదేవరాయలను ఆశ్రయించాడు. గోల్కొండ కొలువులో ఉన్నపుడు బహమనీ రాజకీయాలను క్షుణ్ణంగా గ్రహించడమేగాక అనేక మంది హిందూ, ముస్లిం మిత్రులను సంపాదించుకొన్నాడు.

ఆ తరువాత రామరాయలు కృష్ణరాయల ప్రాపకం సంపాదించి తన శక్తి సామర్థ్యాలు చూపించి, రాయల మెప్పుపొంది అతని కుమార్తె తిరుమలాంబను పెళ్ళాడి అళియ (అల్లుడు) రామరాయలిగా ప్రసిద్ధుడయ్యాడు. కృష్ణరాయల సైన్యంలో ప్రముఖ సేనానాయకునిగా, రాష్ట్రపాలకునిగా ప్రఖ్యాతి పొందాడు. అచ్యుత రాయలు మరణించినపుడు అతడు పులికాట్‌నుంచి విజయనగరానికి వచ్చినట్లుగా తెలుస్తుంది. రాజహంతకులైన సలకం తిరుమల సోదరుల్ని తుదముట్టించి అచ్యుత రాయల అన్నకొడుకు సదాశివరాయల్ని అతడు సింహాసనం ఎక్కించి సర్వం తానే అయి పరిపాలించాడు.

సదాశివరాయల్ని నామమాత్రపు ప్రభువును చేసి రాజప్రతినిధిగా సర్వాధికారాలు చేబూనిన రామరాయలకు మొదటినుంచి అండగా ఉన్న అతని సోదరులు తిరుమల రాయలు, వెంకటాద్రి ఇద్దరూ అతనికి రాజ్యకార్య నిర్వహణలో తోడ్పడ్డారు. తిరుమల మంత్రిగా, వెంకటాద్రి సేనా నాయకునిగా వ్యవహరించారు. రాజప్రతినిధిగా రామరాయలు అధికార నిర్వహణలో మూడు భిన్నమైన దశలు కనిపిస్తున్నాయి. మొదటి దశలో (క్రీ.శ. 1543 - 1550) రామరాయలు 'మహామండలేశ్వర' బిరుదంతో కేవలం రాజప్రతినిధిగా వ్యవహరించాడు. ఈ కాలంలో సదాశివరాయలు చాలావరకు రాజధానిలోనే ఉండేవారు. రెండో దశలో (క్రీ.శ. 1550 - 63) రాజ గౌరవం పొందుతూనే సదాశివుడు బందీ అయ్యాడు. ప్రజలకు సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే రాజు దర్శనం లభించేది. ఈ దశలోనే రామరాయల బంధువులందరికీ కీలకమైన పదవులు లభించాయి. మూడవ దశలో (1563 నుంచి) ప్రజలకూ, పరివారానికే

రాజ దర్శనం ఆగిపోయింది. రామరాయల పేరుమీద కొత్త నాణాలు ముద్రించబడినాయి. రామరాయలు విశ్రాంతిగా సంగీత సాహిత్యాలతో గడిపాడు. అతని తమ్ముడు తిరుమల రాయలు ప్రభుత్వాన్ని నిర్వహించాడు.

## 9.3. పాలనలో మార్పులు

తన అధికార ప్రాభవాలను పెంపొందించుకోవడానికి రామరాయలు సామ్రాజ్య పాలనలో కొన్ని మార్పులు చేశాడు. అంతకుముందున్న ఉన్నతోద్యోగులలో అధిక సంఖ్యలో ఉన్న బ్రాహ్మణాధికారులను తొలగించి వారిస్థానంలో తనకు విధేయులు, విశ్వాసపాత్రులు అయిన వెలుగోటి, పెమ్మసాని, రావెల, కంటకం మొదలయిన కుటుంబాల వారిని నియమించాడు. పులిగడ్డ పాపయ్య అనే బ్రాహ్మణు డొక్కడిని మాత్రమే రామరాజు చివరివరకు తన కొలువులో ఉంచుకొన్నట్లు కైఫియతుల వల్ల తెలుస్తుంది. ఆరవీటి వంశం వారైన తన బంధువులను రామరాయలు ఉన్నత పదవుల్లో నియమించాడు. మార్గమేదైనా లక్ష్యసాధన ముఖ్యమనే సిద్ధాంతానికి రామరాయలు కట్టుబడినట్లు కనిపిస్తుంది. ఈ సూత్రమే అతని విదేశాంగ విధానాన్ని నిర్దేశించింది. మత విద్వేషమనేది అతనికి ఆపాదింపబడిన లేకాని అతని చర్యల్లో అది కనిపించదు. సైన్యంలో అసంఖ్యాకముగా ముస్లింలను చేర్చుకోవడం, వారిలో సమర్థులకు ఉన్నతోద్యోగాలివ్వడం, తురుష్కరాజ్యాల నుంచి పారిపోయి వచ్చిన ముస్లింలకు ఆశ్రయమివ్వడం, ఆలీ ఆదిల్ షాను దత్తపుత్రునిగా ఆదరించడం మత పరంగా రామరాయల విధానాన్ని చాటేవే.

## 9.4. దక్షిణ రాజ్యాలపై దండయాత్ర :

రాజప్రతినిధిగా పరిపాలన చేపట్టిన వెంటనే రామరాయలు దక్షిణ దేశంపైకి దండయాత్ర పంపవలసి వచ్చింది. మొదటి నుంచి లొంగక రామరాయలను ప్రతిఘటిస్తున్న దాక్షిణాత్య సామంతులు అతని అధికారాన్ని అంగీకరించక తిరుగుబాటు చేశారు. తిరువాన్కూరు పాలకుడు బలవంతుడై తిరునల్వేలి మండలంలోని విజయనగర సామ్రాజ్యసీమలను కొన్నింటిని ఆక్రమించాడు. మధుర ప్రాంతంలోని తీరభూములలో నివశిస్తున్న బెస్తవారిని క్రైస్తవ మతానికి మార్చి, రోమన్ క్యాథలిక్ ప్రచారకులు, ఆ ప్రాంతంలో పోర్చుగీసు రాజ్యాధికారాన్ని నెలకొల్పటానికి తీవ్ర ప్రయత్నాలు చేయసాగారు. అంతేగాక గోవాలో పోర్చుగీసు గవర్నరయిన మార్టిన్ అఫాన్సోడ సూజా నౌకాబలంతో తూర్పు తీరంలోని హిందూ దేవాలయాలను కొల్లగొట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సమస్యలన్నీ పరిష్కరించి, తన అధికారాన్ని సుప్రతిష్ఠితం చేయడావికి రామరాయలు తన జ్ఞాతులయిన అవుకు చిన్న తిమ్మరాజు, విఠల రాజుల నాయకత్వంలో ఒక పెద్ద సేనను దక్షిణ దేశం మీదికి పంపాడు.

రామరాయలు పంపిన దక్షిణ దండయాత్ర విజయవంతంగా కొనసాగింది. చిన్న తిమ్మరాజు, విఠలరాజు చంద్రగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకొని, అక్కడనుంచి తొండమండలం, చోళ మండలం ప్రవేశించి అక్కడి దుర్గాలను స్వాధీనం చేసుకొన్నారు. అచట నుండి సముద్ర తీరం వెంబడి నడచి తిరువాన్కూరు పాలకుడయిన తిరువడిపై దండెత్తి అతనిని ఓడించారు. తిరువడి శరణువేడి తన రాజ్యంలో మళ్ళీ నియమితుడైనాడు. విఠలరాజు సేవలకు మెచ్చి రామరాయలు అతనిని ద్రావిడ, కేరళ దేశాలకు రాజప్రతినిధిగా నియమించాడు. ఈ దండయాత్రలోనే విఠలరాజు నాగూరు ప్రాంతంపై దండెత్తి పోర్చుగీసులను అదుపులోనికి తెచ్చాడు. ఇంతలో గోవా గవర్నర్‌గా డసూజా స్థానంలో జాన్ డకాస్ట్రో నియమితుడయ్యాడు. ఇతడు విజయనగర రాయలతోటి వైరం మంచిది కాదని సంధిచేసుకొని, వర్తకాన్ని పెంపొందిచుకునే ఏర్పాట్లు చేసుకొన్నాడు.

## 9.5. రామరాజు - దక్కన్ సుల్తాన్ :

రామరాయలు దక్కన్ సుల్తానులపట్ల అనుసరించిన విధానం సిద్ధాంత పరమైనది కాదు. ఆయా పరిస్థితుల్లో కార్యసాధనగా, ప్రయోజనకరంగా ఏది ఉచితమో అది నిర్వహించేటట్లు రూపొందించబడింది. దక్కన్ రాజకీయాలలో విజయనగరానికి గౌరవ ప్రాబల్యాలను సంతరింపజేయటం సమస్త వ్యవహారాలకు తానే నిర్దేశకునిగా ఉండటం అతని లక్ష్యం. ఈ లక్ష్యానికి అనుగుణంగా ఇరుగు పొరుగు

ముస్లిం రాజ్యాల అంతరంగిక రాజకీయాలలో అతడు ఏ ఇతర విజయనగర పాలకుడూ జోక్యం చేసుకోనంతగా తల దూర్చాడు. ఒ. ముస్లిం రాజ్యాన్ని మరో ముస్లిం రాజ్య సహాయంతో నిర్జించడం, తద్వారా ఆయా సుల్తానులపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడ అతనిగమ్యం. శత్రువు యొక్క శత్రువు మిత్రుడనేది అతని రాజనీతి.

రామరాయలు అధికారానికి రాక పూర్వము విజయనగర రాజులు బహమనీ సుల్తానులపై దండెత్తడం, లేదా వారు దండెత్తి వస్తే ప్రతిఘటించడం తప్ప, వారితో ఎన్నడు మైత్రి పాటించి ఎరుగరు. కాని బహమనీ రాజ్యం క్షీణించిన బీజపూర్, అహమ్మద్ నగర్, గోల్కొండ, బీదర్, బీహార్ సుల్తానుల రాజ్యాలుగా విభజన జరిగిన తర్వాత, వాటిలో ప్రతి ఒకటి ఈర్ష్య, అసూయలచే ప్రేరేపితులై విజయనగర రాజుల మైత్రికై ప్రాకులాడి, అతని సహాయం మిగిలిన రాజ్యాలను అంతం చేయటం తమ ధ్యేయంగా పెట్టుకొన్నాయి.

శ్రీకృష్ణరాయల అల్లుడు కావడానికి పూర్వం రామరాయలు గోల్కొండ కుతుబ్ షాహి కొలువులో ఉన్న కారణం వల్ల, అతనికి ముస్లిం సుల్తానుల మనస్తత్వం బాగా తెలుసు. దక్కన్ సుల్తానుల పరస్పర వైషమ్యాలను తన రాజకీయాధిపత్యాన్ని నిలుపుకోవటానికి, తన రాజ్యాన్ని విస్తరింప చేయడానికి రామరాయలు ఉపయోగించగలిగాడు.

రామరాయలకు, దక్కన్ సుల్తానులకు మధ్య జరిగిన యుద్ధాలను రెండు దశలుగా విభజించవచ్చు. మొదటి దశలో (క్రీ.వ. 1543 - 1557) అహమద్ నగర్, బీజపూర్‌ల మధ్య జరిగిన యుద్ధాలలో రామరాయలు నిజాం షాతో చేరి ఆదిల్ షా, బరీద్ షాలను ఓడించాడు. రెండోదశలో (క్రీ.శ. 1557 - 1563) రామరాయలు ఇబ్రహీం ఆదిల్ షాతో చేరి నిజాం షా, కుతుబ్ షాలను ఓడించాడు.

ఈ యుద్ధాల గురించి ముస్లిం చరిత్రకారులు, ఫెరిస్టా రచనలు, కెళదినృప విజయం, వెలుగోటి వారి వంశావళి సమాచారం అందిస్తాయి. శివతత్త్వ రత్నాకరంలో కూడా బీదర్ తో చేసిన యుద్ధాల గురించి వివరించబడింది.

## 9.5.1. మొదటి దశ : (క్రీ.శ. 1543 - 1557)

రామరాయలు మొదట క్రీ.శ. 1543 లో అహమ్మద్ నగర్ సుల్తానైన బర్హన్ నిజాంషా, గోల్కొండ సుల్తానైన కుతుబ్ షాలతో చేరి బీజపూర్ సుల్తానైన ఇబ్రహీం ఆదిల్ షాను ఓడించి బీజపూర్ నుండి షోలాపూర్ దుర్గాన్ని అహమ్మద్ నగర్ కు ఇప్పించాడు. క్రీ.శ. 1549 తరవాత రామరాయలు అహ్మద్ నగర్‌లో చేరి బీజపూర్, బీదర్‌లను ఓడించి బీదర్ కు చెందిన కల్యాణి దుర్గాన్ని అహమ్మద్ నగర్‌కు ఇప్పించాడు.

## 9.5.2. రెండో దశ : (క్రీ.శ. 1557 - 1563)

రామరాయలు క్రీ.శ. 1558 లో బీజపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా కుమారుడైన ఆలీ ఆదిల్ షాతో చేరి అహమ్మద్ నగర్ పై దండెత్తి, కల్యాణి, షోలాపూర్ దుర్గాలను ఆదిల్ షాకు ఇప్పించాడు. బీజపూర్ వల్ల తనకు కలిగిన ఓటమికి ప్రతీకారంగా అహమ్మద్ నగర్ సుల్తానైన హుసేన్ నిజాం షా, గోల్కొండ సుల్తానైన ఇబ్రహీం కుత్‌బ్ షాతో కలసి బీజపూర్‌పై దండెత్తి కల్యాణి దుర్గాన్ని ముట్టడించారు. బీజపూర్‌కు సహాయంగా రామరాయయల సైన్యం వచ్చింది. అహమ్మద్ నగర్, గోల్కొండ సుల్తానులు ఓడి పారిపోయారు. గోల్కొండకు చెందిన పానుగల్లు, గణపుర దుర్గాలను రామరాయల స్వాధీనమైంది.

రామరాయలు సాధిస్తున్న విజయాలు దక్కన్ సుల్తానులలో భయాన్ని కల్గించాయి. ఇంకా తాము అంతఃకలహాలతో మునిగి ఉంటే రామరాయలు తమ రాజ్యాలను కబళించడం ఖాయం అనే భయంతో విజయనగర సామ్రాజ్యాన్ని నిర్మూలించడానికి దక్కన్ సుల్తానులు బద్ధ కంకణులైనారు. తామంతా ఒక కూటమిగా ఏర్పడితేనే కాని రామరాయలను ఓడించలేమనే నిర్ణయానికి వచ్చారు. ఈ కూటమికి రామరాయల వల్ల అధికంగా నష్టపోయిన గోల్కొండ, అహమ్మద్‌నగర్ సుల్తానుల నాయకత్వం వహించారు. ఈ కూటమిని ఏర్పరచటానికి తొలి ప్రయత్నం చేసినదెవరు ? అనే దాని గురించి చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. ఈ కార్యానికి

మొదటిగా ప్రయత్నించిన వాడు ఇబ్రహీం కుతుబ్ షా అని ఫెరిష్టా పేర్కొన్నాడు. ఈ కార్యాన్ని ప్రారంభించిన వాడు హుసేన్ నిజాంషా అని కూటో, తబతబా పేర్కొన్నారు.

## 9.6. తళ్ళికోట యుద్ధం (క్రీ.శ. 1565) (రక్షస తంగడి యుద్ధం) :

భారతదేశ చరిత్రలో అందులోనూ ప్రత్యేకించి దక్షిణ భారతదేశ చరిత్రలో తళ్ళికోట (రక్షస తంగడి) యుద్ధం అత్యంత విషాదకర దారుణ సంఘటనగా నిలిచిపోయింది.

### 9.6.1 తళ్ళికోటయుద్ధ కారణాలు :

విజయనగర సామ్రాజ్య అవతరణ క్రీ.శ 1336 తరువాత దశాబ్ద కాలానంతరం క్రీ.శ 1347 దక్కన్‌లలో అవతరించిన బహమనీ సామ్రాజ్యం. ఇది విజయనగర సామ్రాజ్యానికి సరసన ఉన్నందున ఇరు సామ్రాజ్యాలు మధ్య నిరంతరం కలహాలు జరిగేవి. వీరి కలహాలకు ప్రధాన కారణం మత సమస్యలు, సరిహద్దు ప్రాంతాలు, సారవంతమైన రాయచూర్ అంతర్వేది ప్రాంతాన్ని ఇరువురూ ఆక్రమించుకోవాలనే ఆశయం మొదలైనవి. ఈ కారణాల వల్ల బహమనీ - విజయనగర రాజ్యాల మధ్య తీవ్ర సంఘర్షణ తప్పలేదు. కృష్ణరాయల కాలంలో బహమనీ పాలకుల్లో రాజకీయ అనైక్యత ఏర్పడింది. ఈ కారణంగా బహమనీ రాజ్యం అహమ్మద్‌నగర్, బీజపూర్, గోల్కొండ, బీదర్, బీరార్ అను ఐదు రాజ్యాలుగా విడిపోయింది. కృష్ణరాయలు వీరి అంతర్గత రాజకీయములలో జోక్యం కలిగించుకోవడం ప్రారంభించాడు. రామరాయలు కూడా ఈ సుల్తానుల విషయంలో జోక్యం కలగజేసుకొని విజయనగర సామ్రాజ్యానికి ఎనలేని గౌరవాలు సంపాదించాడు. ఇతడు సుల్తానుల పట్ల 'విభజించి పాలించు' అనే సిద్ధాంతాన్ని అనుసరించి అహమ్మద్ నగర్ సుల్తాన్‌లో చేరి బీజపూర్, బీదర్ సుల్తానులను, తరువాత బీజపూర్ సుల్తాన్‌తో చేరి అహమ్మద్ నగర్, గోల్కొండ సుల్తానులను, తరువాత గోల్కొండ పక్షం వహించి బీజపూర్ సుల్తాన్‌ను ఓడించాడు. చివరకు దక్కన్ సుల్తానులు రామరాయల విధానాన్ని గ్రహించి వారంతా ఏకమై రామరాయలతో తలపడ్డారు. దాని ఫలితమే రక్షస - తంగడి యుద్ధం.

దక్కన్ సుల్తానులు, విజయనగరానికి వ్యతిరేకంగా ఏకం కావడానికి దారి తీసిన పరిస్థితులను ముస్లిం చరిత్రకారులు పేర్కొన్నారు. రామరాయలు ఇస్లాం మతాన్ని అగౌరవపరచి, ముస్లింల మత భావాలను గాయపరచినాడనేది ఒక కారణంగా చెప్పారు. రామరాయలు అహమ్మద్ నగర్ మీద దండెత్తి పోయినపుడు అతని సైనికులు ఖురాన్‌ను, ముస్లిం స్త్రీలను అవమాన పరచి, మసీదులను ధ్వంసం చేయడం మరొక కారణంగా చెప్పారు. రామరాయలు సుల్తానుల పట్ల, వారి తరపున వచ్చిన రాయబారుల పట్ల ప్రదర్శించిన అహంభావ పూరిత ప్రవర్తన, వారి రాజ్య భాగాలను ఆక్రమించడం ఇంకొక కారణంగా చెప్పారు.

కాని సమకాలిక హిందూ ఆధారాలు పరిశీలిస్తే ముస్లిం చరిత్రకారులు చెప్పిన పైకారణాల వల్ల సుల్తానులు ఏకం కాలేదు అని తెలుస్తుంది. కూటమిని ఏర్పరచడంలో ఆదిల్‌షాను నయభయాలతో కుతుబ్ షా, నిజాం షా తమ వైపుకు తిప్పుకొన్నారు. నిజాం షా, ఆదిల్ షా వివాహ సంబంధాలతో సన్నిహితమయ్యారు. బరీద్ షా ఈ కూటమిలో చేరగా బీరార్ పాలకుడు కూటమికి దూరంగా ఉన్నాడు. ఈ కూటమిలోని నల్గురు సుల్తానులు తమ గత శత్రుత్వాలను మరచి, ఒక్కటై విజయనగరం మీదికి దండెత్త నిశ్చయించుకొన్నారు.

### 9.6.2. తళ్ళికోట యుద్ధ గమనం :

నల్గురు దక్కన్ సుల్తానులు అధిక సంఖ్యలో సైన్యాలను సమీకరించి యుద్ధ సన్నాహాలు పూర్తి చేశాక కృష్ణా తుంగభద్ర అంతర్వేదిని తన ఆధీనం చేయవలసిందిగా బీజపూర్ సుల్తాన్ రామరాయలకు వర్తమానం పంపాడు. రామరాయలు దీనిని తిరస్కరించాడు. దీనితో కూటమి సేనలు బీజపూర్ నుంచి క్రీ.శ. 1564 డిశంబర్ 25 న విజయనగరం మీదికి కదిలాయి. ముస్లిం సేనలు కృష్ణానదికి ఉత్తర తీరాన 42 కి.మీ. దూరంలో ఉన్న రక్షస - తంగడి వద్ద విడిదిచేశాయి. సుల్తానుల సైన్యం మూడు లక్షలని ఒక అంచనా.

ముస్లింలు కృష్ణానదిని దాటి వచ్చి రామరాయలను ఎదుర్కోవాలని తలచారు. కాని రామరాయలు వారికి అవకాశమివ్వక ఆరులక్షల సైన్యాన్ని సమీకరించి, తన సోదరులు తిరుమల రాయలు, వెంకటాద్రి సహాయులుగా కృష్ణను దాటి కృష్ణా - మలప్రభా నదుల సంగమ ప్రదేశం వద్ద ఉన్న రక్షస - తంగడి అనే రెండు గ్రామాల మధ్య ప్రదేశంలో ముస్లింలతో తారసిల్లాడు. ఈ రక్షస తంగడినే కొందరు ముస్లిం చరిత్రకారులు తళ్ళికోట యుద్ధమన్నారు. ఇక్కడ జరిగిన యుద్ధంలో రామరాయలకు విజయం చేకూరింది.

దక్కన్ సుల్తానులు 33 కి.మీ. వెనుకకు పోయి మోసబుద్ధితో సంధి సంప్రదింపులు ప్రారంభించారు. సంప్రదింపులు జరుపుతూనే సుల్తానులు రామరాయల కొలువులోని ముస్లిం సేనాధిపతులతో కుట్ర చేసి వారిని స్వామి ద్రోహానికి పురి కొల్పారు. సుల్తానుల సంధి సంప్రదింపులను నమ్మి విజయనగర సైన్యం అశ్రద్ధగా ఉన్న సమయంలో ఆదిల్ షా రామరాయల పై హఠాత్తుగా దాడి చేశాడు. కుతుబ్ షా, నిజామ్ షాలు తమ సైన్యాలతో అతనిని కలిశారు. ఎనభై సంవత్సరాల పైబడిన వృద్ధుడైన రామరాజు జంకక, సైనికులను ఉసిగొల్పుతూ శత్రు సైన్యాలను ఢీ కొన్నాడు. సుల్తానుల ఫిరంగులకు, అశ్వికదళ ధాటికి ఎదుర్కొనటం విజయనగర సైన్యాలకు కష్టమయింది. ఇదే సమయంలో రామరాయల కొలువులో ఉన్న ఇద్దరు ముస్లిం దండనాయకులు ద్రోహం తలపెట్టి 80 వేల సైనికులున్న తమ సైన్య దళాలతో సుల్తానులు వైపు చేరారు. కాని రామరాయలు ధైర్యం వీడక పోరాడి ప్రాణాలు కోల్పోయాడు. విజయనగర సైనికులు బెదరి, చెల్లాచెదరై పారిపోయారు. వీరిలో కొందరు ప్రాణాలు కోల్పోయారు.

## 9.6.3. రామరాయల మరణం :

రామరాయలు తళ్ళికోటయుద్ధంలో ఎట్లా మరణించాడనే విషయాన్ని గురించి అనేక అభిప్రాయాలు గలవు. రామరాయలు కొలువులో ఉన్న ఒక ముస్లిం సర్దార్ వెనుకనుంచి రామరాయలను బల్లెంతో పొడిచి చంపినట్లు కొందురు చెపుతారు. రామరాయలు ఏనుగు నుంచి దిగి గుర్రాన్ని ఎక్కుతుండగా నిజాం షా సైనికులకు చిక్కాడని, హుసేన్ నిజాం షా అతని తలను కొట్టించి బల్లెంపై ఎత్తిచూపగా విజయనగర సైన్యం చెల్లాచెదరై పారిపోయిందని మరికొందరు చెప్తారు. యుద్ధంలో విజయం రామరాయల వైపు మొగ్గుతుండగా, హుసేన్ నిజాం షా, సైనికులు కాల్చిన ఫిరంగి గుండు ఒకటి రాయల తలను తాకి ముక్కలు చేసిందని దాంతో విజయనగర సైనికులు బెదిరి, చెల్లా చెదరై పారిపోవడం మొదలు పెట్టారని, సుల్తానుల సైన్యం వారిని పారిపోనీక చుట్టుముట్టి నిశ్శేషంగా సంహరించిందని సమకాలీన చరిత్ర కారుడైన నిజాముద్దీన్ అహ్మద్ వ్రాసాడు. మొత్తం మీద రామరాయలు శత్రువుల చేత చిక్కి హతుడయ్యాడు. యుద్ధం అంతమయింది.

## 9.6.4. విజయనగర పతనం - రామరాయల బాధ్యత :

భారతదేశ చరిత్ర గతిని మార్చిన గొప్ప యుద్ధాలలో తళ్ళికోట యుద్ధమొకటి. కొందరు చరిత్రకారులు కేవలం రామరాయలే ఈ యుద్ధానికి పూర్తి బాధ్యుడని పేర్కొన్నారు. ఈ విషాదాంత నాటకానికి అతడే ప్రతినాయకునిగా చిత్రించటం జరిగింది. ఈ విషాద సంఘటనపై అతడు అనుసరించిన విధానాల ప్రభావం కనిపించినంత మాత్రాన అతడే దీనికి పూర్తి బాధ్యుడనటం సమంజసము కాదు.

### ఇస్లాం మతాన్ని కించపరచే చర్యలు :

రామరాయల ప్రవర్తనే విజయనగర పతనానికి దారి తీసిందని చాలా మంది చరిత్రకారులు తీవ్రంగా విమర్శించారు. ఇతడు సామ్రాజ్యాధిపత్యాన్ని అక్రమంగా చేజిక్కించుకొన్న స్వార్థపరాయణుడని, కుతంత్రాలలో ఆరితేరిన వాడని, దక్కన్ సుల్తానులలో ఒకరితో ఒకరికి తగవు పెట్టి, వారి బలాబలాలననుసరించి పక్షాలు మార్చి వారి రాజ్యభాగాలనాక్రమించాడని, మత ద్వేషం కనపరిచి వారి రాజ్యాలను, మసీదులను పాడు చేసి, ఖురాన్ ను అగౌరవపరచి, ముస్లిం స్త్రీలను అవమానించాడని, అందుచేత అతని దుండగాలను సహించలేక చివరకు ముస్లిం సుల్తానులందరూ తమ వైరాలను విస్మరించి ఒక్కటై రక్షస - తంగడి యుద్ధంలో అతనిని వధించి, అతని పనులకు ప్రతీకార చర్యగా విజయనగర రాజధానిని నేలమటం చేశారని, అతని కుతంత్రాలే విజయనగర సామ్రాజ్య పతనానికి ప్రధాన కారణమని, అతని ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు.

కాని ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. దక్కన్ సుల్తానులతో రామరాయలకు ఉన్న రాజకీయ సంబంధాలను తెలియజేసే ముఖ్య ఆధార గ్రంధాలన్నీ ముస్లిం చరిత్రకారులవే. ఈ ముస్లిం చరిత్రకారులు సుల్తానుల పట్ల పక్షపాతం కలవారు. సహజంగా వారు రామరాయలను గూర్చి ఎన్నో అసత్యాలు చెప్పిఉన్నారు. రామరాయలు మసీదులను పాడుచేశాడని, ఖురాన్ ను అగౌరవ పరచాడని, ముస్లిం స్త్రీలను భంగపరచాడని వ్రాసిన వాడు ఫెరిస్టా. ఇతని రచనలు చాలా వరకు ఏక పక్షరచనలే. అందువల్ల వాటిని యధాతథంగా నమ్మటానికి వీలులేదు. రామరాయలు వేల సంఖ్యలో ముస్లింలను తన సైన్యంలో చేర్చుకొని, విజయనగరంలో వారికి మతాన్ని అనుసరించడానికి కావలసిన ఏర్పాట్లన్నీ చక్కగా అమర్చాడు. అంతేగాక, ఆలీ ఆదిల్ షా రాయలకు మొదటినుంచి ఆప్తమిత్రుడు. ఇట్లాంటి పరిస్థితుల్లో, రామరాయలు ఇస్లాం మతాన్ని కించపరచే చర్యలు చేసినాడని చెప్పడం నమ్మదగిన విషయం కాదు.

## విభజించు పాలించు విధానం:

రామరాయలు దక్కన్ సుల్తానులకు **ఒకరితో** ఒకరికి తగవులు పెట్టి, తాను లాభపడడటానికి ప్రయత్నించాడని చెప్పడం సరికాదు. దక్కన్ సుల్తానులు స్వభావంచే కలహ **ప్రియులు**, ఈర్ష్య, స్పర్థ, దురాశ వారి లక్షణాలు. సుల్తానులలో ఒకరిలో మరొకరికి విశ్వాసం లేదని వారు కుక్కల వలె కలహించుకుంటూ ఒకరి వినాశనం మరొకరు కాంక్షించే వారని న్యూనిజ్ వ్రాసాడు. సుల్తానులు ఒకరితో ఒకరు పోరాడుతూ, తనను వచ్చి సహాయమర్థించిన వారికే రామరాయలు సహాయపడినాడేగాని, వారికి తానుగా తగవులు పెట్టి లాభపడలేదు. వారిని చివరకు ఒకటిగా చేసింది రామరాయల విదేశాంగనీతి గాక అతని ప్రభావ పరాక్రమాలలో వారికి గల ద్వేషము, అతను తమ రాజ్యాలను కబళించునేమోనని భయం. ముస్లిం చరిత్ర కారుల రచనలు మాత్రమే ఆధారంగా రామరాయల వ్యక్తిత్వాన్ని అంచనా వేయుటం సరికాదు.

రామరాయల వ్యక్తిత్వాన్ని గురించి ఒక చరిత్ర కారుడు చెప్పిన అభిప్రాయం గురించి తెలుసుకోవడం అవసరం. "రామరాజు **(రామరాయలు)** అపుడు భారతఖండాన్ని పరిపాలించిన హిందూ రాజులలోకెల్లా కడు దొడ్డ ప్రభువని చెప్పాలి. సమకాలిక ఆంధ్రప్రపంచం అతనిని బడే రామరాజనియు, బడే రాపప్పయ్య అనియు ప్రశంసించింది. యుద్ధానికి వస్తున్న మహమ్మదీయ వాహినీ తరంగాలకు చెలియలకట్టలా అడ్డుపడటమే దీనికి సాక్షి. గుణగ్రహణ పారీణుడైన శ్రీ కృష్ణదేవరాయలతనిని చేరదీసి తన ప్రియ తనయ తిరుమల దేవిని ఇచ్చి వివాహం చేశాడు. నీతి, విద్యావిచక్షణుడు కావడం వల్ల కార్యసాధనానికి దండంకన్నా సామదాన భేదాలే పరమ ఉపయుక్తాలని అతని వాదం. ఎత్తులు వేయడంలో అతనిది అందె వేసిన చేయి. జయాపజయాలలో సంభ్రమం పొందనిది అతని చిత్తం. అతడు రాజసమూర్తి. అతి జనానురంజకుడు. శత్రుదుర్నిరీక్ష్యుడయినా మిత్రాహ్లాదకరుడు, బంధుప్రియుడు కనుకనే నానాజాతి ప్రజలు అతనిని సేవించి అతని కొలువులో తమ ప్రాణాలను ధారపోయడానికి సంసిద్ధులయినారు. రామరాజు భాషాభిమాని విద్వాంసులను చేరదీసి గ్రాసవాసాలకు తగిన వసతులు కల్పించి వారిని గ్రంధరచనకు పురికొల్పినాడు. ఇతనిని ఆశ్రయించిన విద్యాంసులలో రామయామాత్యుడు ఒకడు. ఒక దృష్టితో చూస్తే రాయల సామ్రాజ్యాన్ని పాలించిన చక్రవర్తులలో ఇతడు అగ్రసరుడని చెప్పవలసి ఉన్నది.

బహమనీ సామ్రాజ్యం ఒకటిగా ఉన్నంత కాలం కృష్ణానదికి ఉత్తరంగా విజయనగర సామ్రాజ్యం విస్తరిస్తుందనే భయంలేదు. కాని ఆ బహమనీ రాజ్యం ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యాలుగా విభజింపబడడంతో వారు బలహీనులయ్యారు. వీరికి విజయనగరాన్ని ఎదిరించడం అసాధ్యం అయింది. బహమనీలతో జరిగిన యుద్ధాలలో పూర్వపు విజయనగర పాలకుల్లో గొప్ప విజేతలుగా బయటపడిన వారెవరూలేరు. వారు చేయగలిగిందల్లా రాజధానిని పట్టుకోవాలన్న ముస్లిం ప్రభుత్వాలను నిరోధించి విజయనగర వైభవాన్ని రక్షించటము మాత్రమే. అంతేగాని ముస్లిం భూభాగాలను వారు ఆక్రమించలేక పోయారు. కృష్ణదేవరాయలు మినహా మిగతావారందరూ తరచూ బహమనీలతో జరిగిన యుద్ధాలతో పరాజయం చెందిన వారే. కృష్ణరాయల కాలంలో రాయచూర్ విజయం విజయనగరం వారిలో గర్వాన్ని పెంచింది. దీంతో ముస్లింలలో విజయనగరం పట్ల అసహనం పెరిగిపోయింది. దీనిని బట్టి చూస్తే రామరాయలనాటి కంటే ముందే విజయనగరం పట్ల దక్కన్ రాజ్యాలు వ్యతిరేకమై ఉన్నట్లు విదితమవుతుంది. అయితే రామరాయలు అనుసరించిన అత్యాశాపూరిత విధానం వల్ల పరిస్థితి విషమించింది. ప్రేలటానికి సిద్ధంగా వున్న అగ్ని **పర్వతం పై** చివరి సమిధను రామరాయలు వేశాడని చెప్పవచ్చు.

**పెరిగిపోతున్న రామరాయల ప్రాబల్యం :**

యుద్ధానికి అసలు కారణం చెప్పుకోవాలంటే నేలటూరి వేంకటరమణయ్య చెప్పినట్లు దక్కను సుల్తానుల మనస్సులో విపరీతంగా పెరిగిపోతున్న రామరాయల ప్రాబల్యమంటే నెలకొన్న భయం అని చెప్పాలి. దక్కన్ సుల్తానుల అంతఃకలహాలను అవకాశంగా తీసుకొని రామరాయలు, ముస్లింలు అంతకు ముందు కాలంలో ఆక్రమించుకొన్న భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడమే గాక వారిమీద తన అధిపత్యాన్ని నెలకొల్పే ప్రయత్నంలో సఫలీకృతుడయ్యాడు. అతని ఆధిక్యత, ప్రాభవం ముస్లిం పాలకుల్లో ఈర్ష్యా ద్వేషాలను రగుల్కొల్పాయి. ఇనుమడించిన అతని అధికారం ఎవరికి వారుగా అతనిని ఏమిచేయలేని వారి నిస్సహాయత వారిని సమైక్యచర్యకు పురికొల్పినాయి. రామరాయల పతనానికి దారి తీసిన సుల్తానుల కూటమి ఏర్పడటానికి ఇదే అసలు కారణం.

## 9.6.5 యుద్ధ స్థలం :

విజయనగర విధ్వంసానికి కారణమైన ఈ మహాయుద్ధం జరిగిన స్థలం ఏది ? అను విషయంలో చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. ఈ యుద్ధం జరిగిన స్థలం నిర్ణయించి, ఆ స్థలం పేరుతో ఈ యుద్ధం కృష్ణానదికి ఉత్తర తీరాన ఉన్న రకసిగి (రక్కసి, రక్షస), తందగడిగి (తంగడి) అనే రెండు గ్రామాల మధ్య నున్న మైదానంలో జరిగిందని నిర్ణయించి దీనిని రక్షస - తంగడి (రాక్షస - తంగడి, రక్కస తంగడి) యుద్ధమని పిలిచారు. ఈ యుద్ధం కృష్ణానదికి దక్షిణ తీరంలో బన్నిహట్టి అనే స్థలం వద్ద జరిగిందని నిర్ణయించి ఈ యుద్ధాన్ని బన్ని హట్టి యుద్ధమని మరికొందరు చరిత్రకారులు పిలిచారు. ముస్లిం చరిత్రకారులు కొందరు దీనిని తళ్ళికోట యుద్ధమని పిలిచారు.

**తళ్ళికోట :**

ఫెరిస్టా మొదలైన ముస్లిం చరిత్రకారుల రచనల ప్రకారం దక్కన్ సుల్తానుల సైన్యం బీజపూర్ నుంచి విజయనగరం వైపు దక్షిణంగా నడిచి కృష్ణానదీ తీరానికి ఉత్తరాన 35 కి.మీ. దూరంలో ఉన్న తాళికోట వద్ద తమ స్కందావారాలు నెలకొల్పి, తమ సైన్యాలను యుద్ధ సన్నద్ధం చేశారు. అక్కడ ఎలాంటి యుద్ధం జరుగలేదు. కనుక ఈ యుద్ధాన్ని తాళికోట (తళ్ళికోట) యుద్ధమని పిలవడానికి వీలులేదు.

**రాక్షస - తంగడి :**

ఈ యుద్ధం కృష్ణానదికి ఉత్తర తీరంలో కృష్ణా, మల ప్రభానదుల సంగమ స్థానంలో ఉన్న రక్కసి - తంగడి అనే రెండు గ్రామాలకు మధ్య గల మైదానంలో జరగటం వల్ల దీనిని రక్కసి - తంగడి, రాక్షసి - తంగడి యుద్ధమని రామరాజన బఖైర్, కెళదినృప విజయం పేర్కొన్నాయి. దీని ఆధారంగా ఈ యుద్ధాన్ని రక్కసి - తంగడి యుద్ధమని పిలవటం సమంజసమని నేలటూరి వెంకట రమణయ్య, నీలకంఠశాస్త్రి, పి.సి. దేశాయ్ మొదలగు ఆధునిక చరిత్రకారలు అభిప్రాయపడినారు.

**బన్నిహట్టి :**

ఫెరిస్టా, రఫీ ఉద్ - దీన్ షిరాజీ మొదలగు ముస్లిం చరిత్రకారుల రచనల ఆధారంగా ఇటీవల షీర్వాణి, రాధేశ్యామ్ మొదలగు ఆధునిక చరిత్రకారులు ఈ యుద్ధం కృష్ణాది దక్షిణ తీరంలో ఆ నదికి సుమారు 20 కి.మీ. దూరంలో కృష్ణా - మలాపహరి సంగమ స్థలంలో ఉన్న బన్ని హట్ట అనే పట్టణ సమీపంలో జరిగిందని పేర్కొని, ఈ యుద్ధాన్ని బన్ని హట్టి యుద్ధమని పిలవాలని, రక్కస - తంగడి యుద్ధమని పిలువకూడదని చెప్పారు.

మెకంజీ సేకరించిన గ్రామ కైఫియతులన్నీ ఈ యుద్ధాన్ని రక్షస - తంగడి యుద్ధమనే పేర్కొన్నాయి. ఈ గ్రామ కైఫియతులను వెంకట రమణయ్య తన గ్రంధమయిన 'ఫర్దర్ సోర్సస్ ఆఫ్ విజయనగర హిస్టరీ' లో ఇచ్చాడు. ఈ గ్రామ కైఫియతులు ప్రజలలో నిలిచి

పోయిన యదార్థకథనాలు. రామరాజన బఖైర్, బుర్హాన్ - ఇ - మాసిక్ గ్రంధాలను బట్టి ఇరుపక్షాలు మధ్య యుద్ధాలు అనేకం జరిగిన తరువాత, రామరాయల మరణానికి కారమైన చివరి యుద్ధం క్రీ.శ. 1565 జనవరి 23 న జరిగింది. చివరి యుద్ధానికి ముందు జరిగిన యుద్ధాలలో ఒకటి బన్నిహట్టి సమీపంలో జరిగి ఉండవచ్చు. అందుచేత ఈ యుద్ధాన్ని రక్కస - తంగడి యుద్ధమనే పిలవడం సమంజసం.

## 9.6.6 యుద్ధకాలం :

తళ్ళికోట యుద్ధం ఎంతకాలం జరిగిందనే అంశం మీద కూడా చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. ముస్లిం చరిత్రకారులు దీనిని చాలా స్వల్పకాలిక విషయంగా అందులోనూ అత్యంత తీవ్రమైన పోరాటఘట్టం క్రీ.శ. 1565 జనవరి 23 న కేవలం 4 గంటల వ్యవధిలోనే ముగిసిందని పేర్కొన్నారు. కాని విజయనగర అనుభవాల, ఆర్థిక వనరుల దృష్ట్యా దక్కన్ సుల్తానులంతా ఏకమైనా రామరాయలను అంతతక్కువ వ్యవధిలో జయించటం అసాధ్యమని చెప్పవచ్చు. మొత్తం మీద యుద్ధం 6 నెలలు జరిగిందని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి.

## 9.6.7. విజయనగర విధ్వంసం :

రక్కస - తంగడి యుద్ధ పరాజయ వార్త విజయనగరాన్ని దిగ్భ్రాంతిలో ముంచెత్తింది. యుద్ధంలో చావుతప్పించుకొని పారిపోయిన తిరుమల రాయలు విజయనగరాన్ని రక్షించడం అసాధ్యమనే భయంతో అచటి ధన రాసులతో, అంతఃపురజనంతో పెనుగొండకు తరలినాడు. విజయనగరంలో ప్రభుత్వం అదృశ్యమై రక్షణ లేక పోయిందని ఇది గ్రహించిన సమీపారణ్యాన్నుండి చెంచుకురు బాది దోపిడి గాంఢ్రు దాడిచేసి ప్రజలను దోచుకున్నారు. ఆ తరువాత విజయోత్సాహంతో ముస్లిం సైన్యాలు నగరంలో ప్రవేశించి ఆరు నెలల పాటు నగరాన్ని దోచుకొని, రాజప్రాసాదాలను ప్రధాన నిర్మాణాలను నిర్మూలించి మరలినాయి. ముస్లిం దురాగతాలను స్థానిక చరిత్రలు విపులంగా వర్ణిస్తున్నాయి.

అయితే ముస్లిం సేనలు విజయనగరాన్ని వల్లకాడుగా మార్చాయని రాబర్ట్ సూయల్ వంటి పండితులు వర్ణించింది అతిశయోక్తిగా కనిపిస్తుంది. ఫెరిస్టా రచనల ఆధారంగా అటువంటి అభిప్రాయం వెల్లడించడం సరికాదు. వాస్తవానికి విజయనగరాన్ని సర్వనాశనం చేయడం సుల్తానుల ఉద్దేశంగా కనిపించడం లేదు. ఎందుకంటే అక్కడ వారున్న ఆరునెలల్లో నగరాన్ని తమ ఆధీనంలో అట్టిపెట్టుకోవాలన్న ఉద్దేశం కన్పిస్తుంది. అందుకే తమ సౌకర్యం కోసం రాజప్రాసాదానికి తూర్పుగా రాణుల స్నానశాల, ఏనుగుల శాల, పద్మమహల్ వంటి భవంతులు తమ శైలిలో సుల్తానులు నిర్మించినవి నేటికి హంపీలో కన్పిస్తాయి. నగరాన్ని నాశనం చేసి వెళ్ళటమే వారి లక్ష్యమైతే ఈ భవంతుల నిర్మాణం చేపట్టకపోదురు. కాని దోచుకొనుటే లక్ష్యంగా ఉన్న ముస్లిం సైనికులు చాలా నివాసగృహాలను నాశనం చేయటమో, తగలపెట్టడమో చేశారనటంలో సందేహం లేదు. వారి మత దురాభిమానం కూడా హిందువుల విగ్రహారాధనకు ఆటంకాలు కల్పించడం వరకే పరిమితమయింది. నగరంలోని ప్రధాన ఆలయాల్లో ఉన్న పూజార్హమైన విగ్రహాలను నాశనం చేశారు. అంతేగాని ఆలయాలన్నింటినీ, రాజప్రాసాదాలను మత విద్వేషంతో ముస్లింలు నిర్మూలించారనలేం. ప్రధాన ఆలయాలు ఇతర ముఖ్య నిర్మాణాలు హంపీలో సాక్ష్యంగా నేటికి నిలిచి ఉన్నాయి.

దక్కన్ సుల్తానులు తమ తమ సైన్యాలతో క్రీ.శ. 1565 ఆగస్టు నెలారంభంలో విజయనగరాన్ని వదిలారు. తమ తమ రాజ్యాలకు దూరంగా ఉండి పాలించడం కష్టం అని గుర్తించడం, తిరిగి సుల్తానుల మధ్య పూర్వపు ఈర్ష్య, స్పర్థ, దురాశలు నెలకొనటమే ఇందుకు కారణాలు. ముస్లిం సైన్యాలు మరలినాక తిరుమల రాయలు విజయనగరం తిరిగి వచ్చి పూర్వవైభవాన్ని చేకూర్చడానికి ప్రయత్నించి, కుటుంబ కలహాల వల్ల విఫలుడై, పెనుగొండ చేరి స్వతంత్ర ఆరవీటి వంశ పరిపాలన ప్రారంభించాడు. అయితే సదాశివరాయలు మాత్రం నామమాత్రమైన అధికారాన్ని క్రీ.శ. 1576 వరకు చెలాయించినట్లు శాసనాల వల్ల తెలుస్తుంది. ఇతని మరణంతో తుళువ వంశం అంతరించింది. రాజకీయరక్షణ లేక, ఆలనాపాలనా కరువై కాలం తెచ్చిన మార్పులతో రోముకంటే వైభవోపేతమైన మహానగరంగా విదేశీయులచే కొనియాడబడిన విజయనగరం పూర్తిగా శిథిలమైపోయింది.

## 9.6.8. యుద్ధఫలితాలు :

భారతదేశ చరిత్ర గతిని మార్చివేసిన యుద్ధాలలో రాక్షస - తంగడి యుద్ధం ఒకటి. తళ్ళికోట యుద్ధం విజయనగర ఐశ్వర్యాన్ని నాశనం చేసింది. "అగ్నిజ్వాలలతో, ఖడ్గాలతో, గునపాలతో, గొడ్డళ్ళతో రోజులు తరబడి విధ్వంసకాండను నిర్వహించి దివ్యంగా వెలుగొందే మహనగరాన్ని (ముస్లింలు) స్మశానంగా మార్చారు. ఇటువంటి మహాదారుణ విధ్వంసకాండ ప్రపంచంలో మరెక్కడా జరగలేదు అని రాబర్ట్ సూయల్ అంటాడు. ఈ యుద్ధం వల్ల తుళువ వంశం అంతరించింది. తుళువ వంశం తరువాత అధికారానికి వచ్చిన ఆరవీటి వంశస్థులు తమకు రాజధానిగా పెనుగొండను చేసుకోవడంతో విజయనగరం రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయింది. "విజయనగర సామ్రాజ్య చరిత్రలో తళ్ళికోట యుద్ధం క్లిష్టమైన గండమే గాని మరీ అంత దారుణమైన గండం కాదు" అని సత్యనాధయ్యర్ అభిప్రాయపడినారు.

తళ్ళికోట యుద్ధం వల్ల జరిగిన ఒక ముఖ్యపరిణామం పోర్చుగీసు వారి వర్తక వాణిజ్యాలు దెబ్బతినటం. విజయనగర రాజులు పోర్చుగీసు వారికి అత్యంత సన్నిహితులు, మిత్రులు. విజయనగరం నాశనం కావడంతో పోర్చుగీసు వారి వ్యాపారం కూడా నాశనమైంది. కనుకనే 'విజయనగరంతో బాటే గోవా (పోర్చుగీసు స్థావరం) విజృంభించి పతనమైంది' అని కొందరు చరిత్ర కారుల అభిప్రాయం.

విజయనగర పతనంలో దక్షిణ దేశంలో ముస్లింల విజృంభణకు అడ్డుగోడ తొలగింది. దక్కన్ సుల్తానులు అంతఃకలహాలకు లోనవ్వడంతో మొఘల్ చక్రవర్తులు సులభంగా వారిని లొంగదీశారు.

## 9.7 సారాంశము :

శ్రీకృష్ణ దేవరాయల అల్లుడైన రామరాయలు విజయనగర సింహాసనంపై అచ్యుతరాయల అన్న కొడుకును కూర్చుండబెట్టి సర్వాధికారాలు తానే చెలాయించాడు. భారతదేశ చరిత్రలోనే దారుణమైన ఘటనలలో ఒకటిగా పేర్కొనబడిన తళ్ళికోట యుద్ధంలో రామరాయలు వీరమరణం పొందాడు. ఈ యుద్ధం వల్ల విజయనగర సామ్రాజ్యం తన ప్రాబల్యం కోల్పోయింది.

- డా. వి.కె. మోహన్.

పాఠం : 10

# ఆరవీటి వంశం (క్రీ.శ. 1570 - క్రీ.శ. 1646)

## 10.0 లక్ష్యం :

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన నాల్గవ చివరి వంశమైన ఆరవీటి వంశం రాజకీయ చరిత్రను గురించి తెలుసుకోవడమే. ఈ పాఠం ప్రధానలక్ష్యం.

## విషయక్రమం :

10.1. పరిచయం

10.2. తిరుమల రాయలు

10.3. మొదటి శ్రీరంగరాయలు

10.4. రెండో వెంకటపతి రాయలు

10.5. అంతర్యుద్ధం

10.5.1. రెండో శ్రీరంగరాయలు - తోపూరు యుద్ధం (1616)

10.5.2. రామదేవరాయలు

10.6. మూడో దేవరాయలు

10.7. మూడో శ్రీరంగరాయలు.

10.8 సారాంశము

## 10.1 పరిచయం

ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లాలోని ఆరవీడు కేంద్రంగా ప్రసిద్ధులుయినందున ఆరవీటి వంశం అనే పేరువచ్చింది. వీరు కాకతీయుల కాలంలో మహారాష్ట్రము నుండి వచ్చి ఆంధ్రదేశంలో స్థిరపడినారు. ఈ వంశానికి చెందిన సోమయాజి అనేగొంది కేంద్రంగా ముస్లింలపై స్వాతంత్ర్య పోరాటం సాగించాడు. ఆ తరువాత ఈ వంశీయులు విజయనగర రాజుల కొలువులో చేరారు. ఆరవీటి తిమ్మరాజు సాళువ నరసింహుని సేనాపతిగా ప్రసిద్ధుడయినాడు. ఇతని కుమారుడే రామరాయలు, వెంకటాద్రి, తిరుమలరాయలు. వీరిలో రామరాయలు, వెంకటాద్రి రక్షస తంగడి యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో పరాజయం నిశ్చయమైన తరువాత తిరుమలరాయలు యుద్ధభూమి నుండి రాజధానికి పారిపోయి, అచటగల అశేషధనరాశులను, సదాశివరాయలను తీసుకొని పెనుగొండకు పారిపోయాడు. యుద్ధానికి పూర్వం గూడ తిరుమలరాయలు పెనుగొండ రాజ్యం పాలిస్తున్నట్లు ఫెరిస్టా రచనల వల్ల తెలుస్తుంది. యుద్ధంలో విజయం సాధించిన ముస్లింలు విజయనగరంలో ప్రవేశించి దోచుకొని మళ్లినారు. ముస్లింలు విజయనగరం వీడిన తరువాత తిరుమలరాయలు సదాశివరాయలను వెంటబెట్టుకొని విజయనగరానికి తిరిగి వచ్చి దానిని పునర్నిర్మించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. దీంతో నిరాశతో తిరుమల రాయలు పెనుగొండకు వెళ్ళి పట్టాభిషిక్తుడయినాడు.

ఆరవీటి వంశ స్థాపకుడైన తిరుమలరాయలు పెనుగొండ రాజధానిగా చేసుకొని పాలించాడు. ఈ వంశంలో మొత్తం ఏడుగురు రాజులు 1570 మొదలు 1646 వరకు పెనుగొండ, చంద్రగిరి, వెల్లూరు రాజధానులుగా పాలించారు.

## 10.2. తిరుమల రాయలు : (క్రీ.శ. 1570 - 1572)

ఆరవీటి వంశస్థాపకుడు తిరుమలరాయలు. ఇతడు విజయనగరం నుంచి పెనుగొండ తిరిగివచ్చి 1520లో పట్టాభిషిక్తుడై పెనుగొండ రాజధానిగా పాలించాడు. పట్టాభిషేకం నాటికి ఇతడు 90 ఏళ్ల వృద్ధుడు ఇతడు విజయనగర సామంతులు విధేయతను పొందగల్గినప్పటికీ ముస్లింలు ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి సంపాదించ లేకపోయాడు. ఇతడు, పాలించిన కొద్దికాలంలో విజయనగర వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించాడు.

### 10.2.1. సింహాసన మధిష్టించుట :

క్రీ.శ. 1565 రక్షస - తంగడి యుద్ధంతో విజయనగర సామ్రాజ్యం పతనం కాలేదు. హిందూ విజయనగర సామ్రాజ్యాధికారానికి జీవం పోసి మరొక వంద సంవత్సరాలు కొనసాగించిన ఘనత తిరుమల రాయలకు దక్కింది.

రక్షస - తంగడి యుద్ధానికి పూర్వం దక్కన్ సుల్తానుల మధ్య ఏర్పడిన ఐకమత్యం, యుద్ధంలో విజయం సాధించిన తరవాత విచ్ఛిన్నమయింది. ఈ యుద్ధంలో విజయనగర సామ్రాజ్య పరాజయం, దాని సైనిక ప్రతిష్టకు భంగం కలిగించింది. దక్కన్ సుల్తానుల నుండి రామరాయలు ఆక్రమించిన ప్రాంతాలన్నింటినీ వారికి తిరిగి ఇచ్చివేసి తిరుమల రాయలు వారితో సంధి ఏర్పరచుకొన్నాడు. ముస్లింలు రాజధాని విజయ నగరం నుండి మళ్ళిన తరువాత తిరుమల రాయలు విజయనగరానికి వచ్చి, గతవైభవాన్ని పునరుద్ధరించడానిక చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అందుచేత తిరుమల రాయలు పెనుగొండను రాజధానిగా చేసుకొని, సదాశివ రాయలకు సంరక్షుడుగా పాలిస్తూ క్రీ.శ. 1570లో పట్టాభిషేకం చేసుకొన్నాడు. కాని సదాశివరాయలు 1576 వరకు విజయ నగరంలో ఉండి పాలించినట్లు శాసనాలు చెప్తున్నాయి.

### 10.2.2 రాజ్యంలో అరాజకాన్ని నిర్మూలించుట :

తిరుమల రాయలు పెనుగొండను రాజధానిగా చేసుకొని రాజ్యం పాలించడం ప్రారంభించినప్పటి నుంచి రాజ్యంలో అరాజకం నెలకొన్నట్లు గ్రామ కైఫియతాలు పేర్కొంటున్నాయి. కేంద్రాధికారం బలహీనం కాగానే, రాష్ట్ర పాలకులు తిరుమల రాయలకు ఎదురు తిరిగి, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని, తమ అధికారాన్ని బలపరుచుకొనడానికి, తమ రాజ్యాలు విస్తరింపచేసుకోవడానికి తమలో తాము కలహించుకోవడం అందుకు కారణమైంది. రాష్ట్రపాలకులలో చాలామంది రామరాజుకాలంలో అమరనాయకులుగా, సీమల పాలకులుగా నియమితులైన రామరాజు బంధువులు, ఆప్తులున్నారు. ప్రధమంగా ఆదోనిని పాలిస్తున్న కోనేటి కొండ్రాజు స్వతంత్ర్యాన్ని ప్రకటించాడు. ఆ తరువాత బంకాపూర్ పాలకుడైన వేల్పురాయడు, దక్షిణంలో ఉన్న అమర నాయకులు ఎదురుతిరిగారు. తిరువడిని పాలిస్తున్న కృష్ణప్ప నాయకుడు కావేరికి దక్షిణంగా వున్న మదుర ప్రాంతాన్ని ఆక్రమించాడు. తంజావూరు ప్రాంతంలో కొలెరూన్ నదీ తీరంలో కొన్ని సీమలకు అమరనాయుడుగా ఉన్న అచ్యుతప్ప నాయకుడు చోళ దేశాన్ని ఆక్రమించాడు. జింజే దుర్గపాలకుడుగా ఉన్న తుపాకి కృష్ణప్ప నాయకుడు తొండమండలంలో అధికభాగాన్ని ఆక్రమించి స్వతంత్రంగా పాలించసాగాడు.

ఈ విధంగా రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో అమరనాయకులు, స్వాతంత్ర్యని ప్రకటించుకోగా, వారిని ఎదుర్కొనటానికి తిరుమల రాయలకు అంగబలంకాని, అర్థబలం కాని లేకపోయింది. అయినప్పటికి వారిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి తిరుమల రాయలు ప్రయత్నించాడు. సామ్రాజ్యంలోని వివిధ రాష్ట్రాలలో, సీమలలో స్వాతంత్ర్యం ప్రకటించిన అమర నాయకులపై, సామంతులపై దండెత్తి వారిని జయించి అదుపులోకి తేవడం నాటిపరిస్థితులలో తనకు సాధ్యంకాదని తిరుమల రాయలు గ్రహించాడు. అందువల్ల తిరుమల

రాయలు వారి పట్ల ఉపేక్ష భావం వహించి, చివరకు వారితో రాజీపడి, వారు స్వతంత్రులు గానే తన అధిపత్యాన్ని గుర్తించేటట్లు చేశాడు. తిరుమల రాయలు మధుర, తంజావూరు, జింజి నాయకులలో సఖ్యం కలిపాడు. దీనివల్ల విజయనగర అధికారం సామ్రాజ్యంలో అంతా మన్నింపబడినా, సామ్రాజ్యం దాని మౌలిక స్వభావాన్ని కోల్పోయింది. అది తిరుమల రాయలు తన సైనిక శక్తితో, సర్వం సహాధికారంతో శాసించగల సామ్రాజ్యంగా కాక, నామమాత్రంగా చక్రవర్తి అధికారాన్ని గుర్తించిన అనేక రాజ్యాల సమూహంగా తయారయింది.

## 10.2.3. దక్కన్ సుల్తానులు :

రామరాయలకు తిరుమలాంబకు జన్మించిన వేద తిరుమలుడు తిరుమల రాయలను అధికారం నుండి తొలగించడానికి బీజపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా సహాయం కోరాడు. బీజపూర్ సుల్తాన్ దండెత్తి వచ్చి మొదట ఆనెగొంది దుర్గాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ఆ తరువాత తన సైన్యాన్ని బిజిర్ ఖాన్ నాయకత్వంలో రాజధాని పెనుగొండ మీదికి పంపాడు. పెనుగొండ దుర్గాధిపతిగా ఉన్న సవరం చెన్నప్పనాయకుడు బీజపూర్ సైన్యాలను ఓడించి మళ్లించాడు. ఈ సమయంలో తిరుమల రాయలు తన అన్న అయిన రామరాయల రాజనీతిని అనుసరించాడు. తిరుమల ఆరయలుల అహమ్మద్ నగర్ సుల్తాన్ మొదటి ముర్తజా సహాయం అర్థించాడు. ముర్తజా తన కుమారుడైన హుసేన్‌ను బీజాపూర్ మీదికి పంపాడు. దీంతో బీజాపూర్ సుల్తాన్ తన సేనకు ఆనెగొంది నుంచి వెనుకకు రప్పించుకొన్నాడు. కాని అంతలో పరిస్థితులు మారి బీజపూర్ సుల్తాన్ అహమ్మద్ నగర్ రాజ్యం మీదికి సైన్యాలను పంపాడు. బీజపూర్ సుల్తాన్‌ను చిత్తుచేయడానికి అహమ్మద్ నగర్, గోల్కొండ సుల్తానులు తిరుమల రాయలు సహాయం అర్థించారు. తిరుమల రాయలు అహమ్మద్ నగర్, గోల్కొండల సహాయార్థం సేనను పంపాడు. దీనివల్ల రాయలకు లాభం చేకూరలేదు. అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తానుల చేయికలిపినందుకు ఆగ్రహించిన బీజపూర్ సుల్తాన్ విజయనగర రాజ్యంపై దండెత్తి వచ్చాడు. ఈ దండయాత్ర ప్రధాన ఉద్దేశం ఆదోని దుర్గాన్ని ఆక్రమించుకోవడం. ఆదోని దుర్గ పాలకుడు కోనేటి కొండ్రాజు. తిరుమల రాయలు ఆదోనికి ఎట్టి సహాయం పంపకుండా ఉండడానికి బీజపూర్ సుల్తాన్ అదేసమయంలో పెనుగొండ మీదికి కూడా సైన్యాలను పంపాడు. చివరకు బీజపూర్ సుల్తాన్ ఆదిల్‌షా ఆదోనిని ఆక్రమించాడు. పెనుగొడ మీదికి పంపిన సైన్యాన్ని తిరుమల రాయలు ఓడించి తిప్పికొట్టాడు. కృష్ణా - తుంగభద్రా అంతర్వేది బీజాపూర్‌లో ఆధీనం కిందికి వచ్చింది.

## 10.2.4 పాలనలో మార్పులు :

పైన పేర్కొన్నట్లు సామ్రాజ్య స్వభావంతో ఏర్పడ్డ మార్పులు వల్ల తిరుమల రాయలు పరిపాలనలో కొన్ని మార్పులు నూతనంగా చేయవలసి వచ్చింది. అమర నాయకులపై అజమాయిషీ చేయడానికి వీలుగా తిరుమల రాయలు భాషాప్రాతిపదికగా సామ్రాజ్యాన్ని మూడు భాగాలుగా విభజించాడు. సామ్రాజ్యంలోని ఆంధ్రప్రాంతానికి అంతా పెనుగొండ రాజధానిగా నియమించాడు. శ్రీరంగ పట్టణం కేంద్రంగా కర్ణాటక ప్రాంతానికి రెండో కుమారుడైన రామరాయలను పాలకుడుగా నియమించాడు. చంద్రగిరి కేంద్రంగా తమిళదేశానికంతా కనిష్ఠ కుమారుడైన వెంకటపతిరాయలను పాలకుడుగా నియమించాడు. తిరుమల రాయలు చేసిన విభజన రాజనీతితో కూడిన చర్యగా భావించడానికి వీలులేదు. రాకుమారులు మధ్య పరస్పర సహకారం లోపించడంతో రాజ్యం బలహీనమై సుల్తానుల విస్తరణకు అవకాశం కల్పించింది.

## 10.2.5 ఘనత :

రక్షస - తంగడి యుద్ధం తరవాత తిరుమల రాయలు విజయనగర సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించాడు. సామ్రాజ్య విచ్ఛిన్నకర శక్తులను కొంతవరకు అదుపులోకి తెచ్చాడు. క్షీణించిన కర్ణాటక సామ్రాజ్యాన్ని రక్షించినవాడుగా, పునరుద్ధరించినవాడుగా కీర్తిని పొందాడు. సదాశివరాయలను హత్యచేసి తిరుమలరాయలు పెనుగొండలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా సింహాసనం మీద పట్టాభిషిక్తుడయ్యాడనే ఫెరిస్తా రచనలు అంగీకారయోగ్యంగా లేదు. తిరుమలరాయలు 11 నెలలు మాత్రమే సింహాసనస్థుడై పాలించి తరువాత తన పదవిని తన పెద్దకుమారుడైన శ్రీరంగరాయలకు అప్పగించాడు.

తిరుమల దేవరాయలు గొప్పసాహితీవేత్త. వసుచరిత్రను వ్రాసిన రామరాజ భూషణుడు ఇతని ఆస్థానకవి అని కొందరు చరిత్రకారులు అభిప్రాయం. తిరుమలరాయలు జయదేవుని గీతగోవిందమునకు వ్యాఖ్యను రచించాడు. దక్షిణ దేశంలో హిందూ రాజ్యాధికారానికి జీవం పోసి మహారాష్ట్రులకు అందించిన ఘనత తిరుమలరాయలకు దక్కింది.

## 10.3. మొదటి శ్రీరంగ రాయలు (క్రీ.శ. 1572 - 1585)

తిరుమల రాయల తర్వాత అతని పెద్దకుమారుడైన శ్రీరంగరాయలు పెనుగొండ సింహాసన అధిష్ఠించాడు. ఇతడు సమర్థుడైనప్పటికీ, స్వార్థపరులైన సామంతులు తిరుగుబాట్లలోనూ, దక్కన్ సుల్తానుల దండయాత్రలతోను గడపవలసివచ్చింది. విశ్వాసహీనులైన అతని బంధువులు, సామంతులు నమ్మక ద్రోహంవల్ల ఇతడు దక్కన్ సుల్తానుల దాడులను ఎదుర్కోవడంలో విఫలుడై కొండవీడు, కర్నూలు ప్రాంతాలను కోల్పోవలసినవచ్చింది.

### 10.3.1. ఎదుర్కొన్న సమస్యలు :

మొదటి శ్రీరంగరాయలు రాజ్యానికి రాగానే అనేక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. 1565 రక్షస - తంగడి యుద్ధం తరవాత విజయనగర రాజ్యమింకా కోలుకోలేదు. కొన్ని గ్రామాలలో భూములు సాగుకాలేదు. కొన్ని దేవాలయాలలో పూజాపురస్కారాలు లేకుండా పోయాయి. శ్రీరంగరాయలు అధికారాన్ని ధిక్కరించి అమర నాయకులు సీమలను దోచుకోవడం ప్రారంభించారు. శ్రీరంగరాయలంటే ఇష్టపడని కొందరు అమరనాయకులు బీజపూర్ సుల్తాన్‌ను విజయనగర రాజ్యం మీద దండెత్తి రమ్మని రెచ్చగొట్టారు.

### 10.3.2. దక్కన్ సుల్తానులు :

బీజపూర్ సుల్తాన్ ఆలీఆదిల్ షా 1576 లో హండే తిమ్మనాయకుడికి సహాయంగా పెనుగొండ పైకి దండెత్తివచ్చాడు. శ్రీరంగరాయలు పెనుగొండ దుర్గ రక్షణ సవరం చెన్నప్ప నాయకుడికి అప్పగించి చంద్రగిరి దుర్గానికి వెళ్ళాడు. సహాయమర్థిస్తూ శ్రీరంగరాయలు చంద్రగిరి నుంచి గొల్కొండకు రాయబారులను పంపాడు. అప్పట్లో గోల్కొండ, బీజపూర్ రాజ్యాల సత్సంబంధాలు లేకపోవడం వల్ల గోల్కొండ సుల్తాన్ బీజపూర్ పైకి సైన్యాన్ని పంపి, రాయలతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఒక దూతను చంద్రగిరికి పంపాడు. శ్రీరంగరాయలకు గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షాల మధ్య ఒక మైత్రీ ఒప్పందం కుదిరింది. తన స్థానాన్ని ఇంకా పటిష్ఠం చేసుకోవడానికి శ్రీరంగరాయలు రాజనీతిని ప్రయోగించి హండే తిమ్మనాయకుడుని ధనప్రలోభం ద్వారా తనవైపుకు మళ్ళించుకొని, శత్రుశిబిరంలో సంక్షోభం కలిగించాడు. ఇదే అవకాశంగా సవరం చెన్నప్ప నాయకుడు ఆదిల్‌షాను యుద్ధంలో ఓడించాడు. పరాజయం చెందిన బీజపూర్ సుల్తాన్ తన రాజ్యానికి తిరిగి వెళ్ళాడు.

శ్రీరంగరాయల సామంతులయిన 'మట్లి' కుటుంబం, 'సరి' కుటుంబం యొక్క నాయకుల మధ్య స్పర్థ ఏర్పడింది. ఇదే కాలంలో శ్రీరంగరాయల మిత్రుడుగా ఉన్న గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా మైత్రి ఒప్పందాన్ని విస్మరించి 1579 లో కర్ణాటకం పైకి దండెత్తాడు. ఇది అవకాశంగా తీసుకొని గోల్కొండ సుల్తాన్ హండే నాయకుల సహాయంతో విజయనగర రాజ్యంపై దండెత్తివచ్చాడు. హండే నాయకులయిన మలకప్ప, కదంబరాయుడు సహకరించగా, నరహరిరావు సేనాధిపత్యంలో ఒక సైన్యం కర్నూలు ప్రాంతాన్ని పాడుచేసి, అహోబల నరసింహస్వామి ఆలయాన్ని దోచుకొని, కర్నూలు ప్రాంతాన్ని గోల్కొండ రాజ్యంలో చేర్చారు. సహాయానికి ప్రతిఫలంగా హండే నాయకులు కర్నూలు ప్రాంతానికి పాలకులయినారు. కాని కొండ్రాజు వెంకట్రాజు కింద నడచిన శ్రీరంగ రాయలసైన్యం హండే నాయకులను ఓడించి, వారిని కర్నూలు ప్రాంతం నుంచి తరిమివేసింది.

కొండ్రాజు వెంకట్రాజు సాధించిన విజయానికి ఆగ్రహించిన గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కొండవీడుపైకి తన సైన్యాన్ని పంపాడు. ఈ సైన్యానికి హైదర్ ఉల్ ముల్క్ నాయకత్వం వహించాడు. ఆనాడు కొండవీడును గొబ్బూరు తిమ్మరాజు పాలిస్తున్నాడు. హైదర్ ఉల్

ముల్క్ కృష్ణానదిని దాటి బెల్లంకొండ, నాగార్జున కొండ, మాచర్ల, కొచ్చెర్ల కోట, ఉదయగిరి దుర్గాలను స్వాధీనం చేసుకొని కొండవీడును ముట్టడించాడు. కాని కొండవీడు దుర్గం శత్రుసైన్యాలుకు లొంగలేదు. చివరకునరహరిరావు సలహామేరకు గొబ్బూరి తిమ్మరాజుకు సహాయంగా ఉన్న వెలగోటి తిమ్మ నాయకునికి ఇబ్రహీం లంచమిచ్చి, అతని సహాయంతో 1580లో కొండవీడును స్వాధీనం చేసుకొన్నాడు. దీంతో కొండవీడు రాజ్యం శాశ్వతంగా విజయనగర రాజ్యానికి లేకుండా పోయింది.

గోల్కొండ సుల్తాన్ దాడిని శ్రీరంగరాయలు ఎదుర్కొన లేకపోవటానికి కారణం సామ్రాజ్యంలోని సాధన సంపత్తి అతని ఆధీనంలో లేకపోవడమే. తిరుమలరాయలు తన కుమారుల మధ్య చేసిన సామ్రాజ్య విభజన వల్ల, శ్రీరంగరాయల సోదరులు స్వతంత్ర పాలకులుగా వ్యవహరించి శ్రీరంగరాయలకు సహాయం చేయలేదు. అంతేగాక వెలుగోటి నాయకులు, హండే నాయకులు, మట్ల, కొండ్రాజు కుటుంబాలకు చెందిన క్షత్రియ నాయకులు ఎవ్వరూ శ్రీరంగరాయలకు సహాయంగా రాలేదు.

## 10.3.3. పాలెయగార్ల మధ్య అంతర్యుద్ధం :

గోల్కొండ సుల్తాన్ విజయనగర సామ్రాజ్యంపై దాడులు జరుపుతూ ఉన్నప్పుడే పాలెయగార్ల మధ్య భీకర అంతర్యుద్ధం జరిగింది. కొండ్రాజు వెంకటరాజు విజృంభించి హండె, సారె కుటుంబాల రాజ్యాలను ఆక్రమించాడు. సారి ఓబన ఏరువరాజ్యం పాలిస్తున్న వెలుగోటి రంగప్ప సాయం అర్థించాడు. రంగప్ప తన బావమరిది దామెర్ల వెంకటపతితో బయలుదేరి మట్లి సామంతుల రాజ్యంగుండా నడిచి కోడూరు చేరినాడు. ఇది మట్లి తిమ్మానాయునికి ఆగ్రహం కలిగించింది. తిమ్మానాయుడు కొండ్రాజు పక్షం వహించాడు. ఉభయ సైన్యాలకు కోడూరు దగ్గిర యుద్ధం జరిగింది. మట్లి తిమ్మానాయుడు మొదలైన పాళెగార్లనేకులు మరణించారు. ఓచిన, రంగప్పలకు విజయం లభించింది. కాని ఈ యుద్ధంలో శ్రీరంగరాయల బలహీనత స్పష్టమయి పెనుగొండ రాజ్యం పునాదు కదిలినాయి.

## 10.4. రెండో వేంకటపతి దేవరాయలు : (క్రీ. శ. 1585 - 1614)

శ్రీరంగరాయల అనంతరం అతని సోదరుడైన వేంకటపతి దేవరాయలు పెనుగొండ సింహాసన మధిష్టించాడు. ఇతడు ఆరవీటి వంశస్థులలో మిక్కిలి సమర్థుడు. ఇతడు తన పాలనాకాలంలో సామంతుల తిరుగుబాట్లను అణచడంలోను, కోల్పోయిన రాజ్య భాగాలను తిరిగి జయించడంలోను, రాజ్య పూర్వపు సంపద, వైభవాలను పునరుద్ధరించడంలోను చాలావరకు కృతకృత్యుడయ్యాడు. రక్షస - తంగడి యుద్ధంతో దక్షిణ దేశంలో హైందవ రాజకీయ ప్రాబల్యం నశించలేదనడానికి వేంకటపతి పాలన నిదర్శనం.

## 10.4.1. సింహాసన మధిష్టించుట

శ్రీరంగరాయలు సంతానహీనుడు. శ్రీరంగ పట్టణం పాలకుడు, వేంకటపతి దేవరాయలు అన్న అయిన రామరాయల యొక్క కుమారులు బాలురు. వీరికి గల రాజ్యార్హత హక్కును పక్కకునెట్టి, చంద్రగిరి రాజధానిదగా తమిళ ప్రాంతాలను రాజప్రతినిధిగా పాలిస్తూ తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకొన్న వేంకటపతి దేవరాయలను చెన్నపట్టణ పాలకుడు అయిన జగదేవరాయడి ఆధ్వర్యంలో నాయకులందరూ వేంకటపతి రాజ్యానికి రావటాన్ని సమర్థించారు. ఆనాడు శత్రుదండయాత్రలను ఎదుర్కొనటానికి, రాజ్యంలో శాంతిభద్రతలను సమకూర్చటానికి సమర్థుడయిన రాజు ఉండాలని గమనించి శ్రీరంగరాయల కనిష్ట సోదరుడైన వేంకటపతి దేవరాయల సింహాసన మధిష్టించాడాన్నికి సమర్థించారు. ఫలితంగా శ్రీరంగరాయల తరవాత వేంకటపతి దేవరాయలు 1586 లో పెనుగొండ సింహాసన మధిష్టించాడు. విజయనగర సింహాసనం మీద అతికొద్ది కాలం అధిష్టించిన తుళువ వంశానికి చెందిన అచ్యుతరాయల కుమారుడు వెంకటపతిని మొదటి వెంకటపతి రాయలని పిలవడం చేత, తిరుమల రాయల కుమారుడైన ఈ వెంకటపతిని రెండోవెంకటపతి దేవరాయలని పిలిచారు.

## 10.4.2. గోల్కొండ దండయాత్ర :

సింహాసనమెక్కిన వెంటనే వెంకటపతి ముస్లింలు ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేశాడు. మొదటి శ్రీరంగరాయల కాలంలో గొల్కొండ కుతుబ్‌షాహీలకు కోల్పోయిన, ప్రదేశాలను తిరిగి జయించడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఒక అజ్ఞాత చరిత్రకారుడి కథనం ప్రకారం మొదటి శ్రీరంగరాయల కాలంలో జయించగా మిగిలిన విజయనగర సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవడానికి గోల్కొండ సుల్తాన్ ఒక సైన్యాన్ని అమీన్ ఉల్ ముల్క్ నాయకత్వంలో విజయనగర రాజ్యం మీదికి పంపాడు. అమీన్ ఉల్ ముల్క్ గండికోటను స్వాధీనం చేసుకొన్నాడు. మార్గంలో రాజబంధువులు, నంద్యాల పాలకులయిన బస్వంత్ రాయలను, నరసింగ రాజును ఓడించి వారిని తనకు సామంతులుగా కప్పంకట్టేటట్లు చేశాడు. తరువాత కర్నూలు దుర్గం, గుత్తిదుర్గం గొల్కొండ సైన్యాలకు లొంగిపోయాయి.

ఇదే కాలంలో గోల్కొండ సుల్తాన్ మహమ్మద్ కులీతుబ్‌షా తన సేనతో పెనుగొండ దుర్గాన్ని ముట్టడించాడు. హఠాత్తుగా జరిగిన ఈ దాడిని ఎదుర్కొనడానికి సిద్ధంగా లేని రెండో వెంకటపతి దేవరాయలు కొంత కాలహరణం చేయడానికి గోపరాజు తిమ్మరాజును, పాపయ సెట్టిని తనదూతలుగా, శాంతి ప్రయత్నాలు చేయడానికి గోల్కొండ సుల్తాన్ సైనిక శిబిరాలనికి పంపాడు. ఫలితంగా మూడు రాజుల శాంతిసంధి కుదిరింది. ఈ వ్యవధిలో వెంకటపతి తన అమర నాయకుల సామంతుల అయిన జగదేవరావు, మట్లి అనంతరాజు, వెలుగోటి కస్తూరి రంగప్ప నాయకుడు, వెలుగోటి చెన్నా నాయకుడు, చెన్నా నాయకుడి కుమారుడు వెంకటపతి, తంజావూరు రఘునాధ నాయకుడు మొదలగు వారని సమావేశపరిచి, పెనుగొండను శత్రువుల ముట్టడి నుండి రక్షించడానికి ఏర్పాట్లు చేసి, గొల్కొండ సుల్తాన్‌లో తలపడ్డాడు. వెంకటపతి యొక్క ఈ పన్నాగం ఊహించక సుల్తాన్, మోసపోయి ఓటమినిని పొంది తీవ్రంగా నష్టపడ్డాడు. మట్లి అనంతరాజు సిద్ధవటం శాసనం, రఘునాధాభ్యుయ కావ్యం రాయల చేతిలో సుల్తాన్ ఓటమిని స్పష్టంగా పేర్కొంటాయి. ఇట్లా రాయల చేతిలో ఓటమిని చెందిన సుల్తాన్ అప్పటికి చెలిగి ఉన్న గండికోట, నంద్యాల దుర్గాల రక్షణ తన సేనాధిపతులను అప్పగించి తన రాజధానికి వెనుదిరిగిపోయాడు. విజయనగర సైన్యాలు తమ విజయాన్ని ముందుకుసాగించి గుత్తిదుర్గాన్ని పట్టుకొని, అక్కడనుంచి గండికోట మీదికి నడిచాయి. కొండవీటి పాలకుడుగా ఉన్న ఆఫ్‌జల్ ఖాన్‌ను సహాయక సైన్యాలను గండికోటకు పంపవలసిందిగా సుల్తాన్ ఆదేశించాడు. ఇది గ్రహించిన వెంకటపతి ఆఫ్‌జల్ ఖాన్ సైన్యాలను అడ్డుకోవడానికి మాత్రమేగాక, కొండవీడు, గోల్కొండల మీద దండెత్తివలసిందిగా ఒక సైన్యాన్ని పంపాడు. గుర్రం కొండవద్ద జరిగిన యుద్ధంలో మట్ల అనంతరాజు రావెల నాయకుని ఓడించడంలో ఆఫ్‌జల్ ఖాన్ పంపిన సహాయక సైన్యం గండికోటను చేరలేకపోయింది. గండికోట వద్ద ఉన్న కుతుబ్‌షాహి సేనాపతి ముర్తజాఖాన్ కడపమీద ఆకస్మిక దాడి చేశాడు. వెంకటపతి అతని మీదికి ఎర్రతిమ్మరాజును పంపాడు. కాని ముర్తజా అతనిని ఓడించి తరిమివేశాడు. మహ్మద్‌కులీ రుస్తుంఖాన్‌ను ముర్తజాఖాన్ సహాయానికై పంపాడు. పెన్నానదీ తీరంలో విజయ నగరసైన్యానికి గోల్కొండ కుతుబ్‌షాహి సైన్యానికి తుముల యుద్ధం జరిగింది. విజయనగర సైన్యం కుతుబ్‌షాహి సైన్యాన్ని ఓడించి, కృష్ణానదిని దాటి దానిని వెన్నంటి తరిమింది. గోల్కొండ సుల్తాన్ కృష్ణానదిని రెండు రాజ్యాల మధ్య సరిహద్దుగా అంగీకరించాడు.

## 10.4.3. సామంతుల తిరుగుబాట్లు అణచుట :

గోల్కొండ దండయాత్రను అవకాశంగా తీసుకొని రాజ్యం నలుమూలలా సామంతులు వెంకటపతిపై తిరుగుబాట్లు చేసినారు. అందుచేత గోల్కొండ విజయం తరువాత వెంకటపతి తనదృష్టిని సామంతుల మీదికి మరల్చాడు.

కోలార్ పాలకుడైన తమ్మనగౌడ ఎదురుతిరిగి వెంకటపతికి కట్టవలసిన కప్పం చెల్లించలేదు. అందువల్ల వెంకటపతి సైన్యం వెలుగోటి కస్తూరి రంగప్ప నాయకత్వంలో కోలార్ పైకి నడిచింది. మాట్లి అనంతరాజు కోలార్ దుర్గాన్ని ముట్టడించారు. కోలార్ పాలకుడు పరాజయం చెంది బందీగా చిక్కాడు. తమ్మన కప్పం చెల్లించి, క్షమాభిక్షవేడి, విడుదల పొందాడు.

నంద్యాల పాలకుడైన నందేల కృష్ణమరాజు, ఇంకా కొందరు నాయకలు తిరుగుబాటు చేయగా వెంకటపతి దేవరాయలు వారిని అణచివేశాడు. తమిళదేశంలో అమర నాయకులు చేసిన తిరుగుబాట్లను అణచివేశాడు.

వెల్లూరు పాలకుడైన అంగానాయకుడు వంశపారంపర్యపు హక్కుగా తాను పాలిస్తున్న తన అమరంలో రెండో వెంకటపతి దేవరాయలు జోక్యం చేసుకోవడం ఇష్టం లేదు. అంగానాయకుని అమరంలోని పెరంబూరు సీమను వెలుగోటి కస్తూరి రంగప్పనాయని కుమారుడైన యాచమ నాయనికి వెంకటపతి అమరంగా ఇచ్చాడు. యాచమనాయకుడు తన అమరాన్ని స్వాధీనం చేసుకొని, మధురాంతకం కేంద్రంగా దానిని పాలించసాగాడు. అతను ఉత్తర మల్లూరం కోటమీద ఆకస్మికంగా దాడి చేశాడు. యాచమనాయకుని ఎదుర్కొనడం అంగమనాయకుడికి సాధ్యం కాక మధుర, తంజావూరు, జింజినాయకుల సహాయం అర్థించాడు. ఈ నాయకుల సైన్యాలను అన్నిటిని ఎదుర్కొని యాచమనాయకుడు ఉత్తర మల్లూరు వద్ద విజయం సాధించాడు. దీనిలో ప్రారంభించి, ద్రావిడదేశంలో అనేక తిరుగుబాట్లు చెలరేగగా, వాటనిన్నిటినీ వెంకటపతి సైన్యాలు అణచివేశాయి.

## 10.4.4. రాజధాని మార్పిడి :

దక్షిణదేశంలో సామంతులు తరచూ తిరుగుబాట్లు చేస్తున్నారు. అందువల్ల వారిని అదుపులో వుంచడానికి వారికి సన్నిహితంగా రాజధాని ఉండడం అవసరమని వెంకటపతి దేవరాయలు భావించాడు. అంతేగాక దక్కన్ సుల్తానులకు దూరంగా ఉండడం మంచిదని వెంకటపతి భావించి వుండవచ్చు. అందుచేత రెండో వెంకటపతి దేవరాయలు లింగానాయకుని వెల్లూరు దుర్గం నుంచి తరిమి వేసి, తన రాజధానిని పెనుగొండ నుండి వెల్లూరుకు మార్చాడు.

## 10.4.5. మొగలాయిలు :

మొగల్ చక్రవర్తి అక్బర్ తన సార్వభౌమాధికారాన్ని అంగీకరించవలసిందిగా వెంకటపతి దేవరాయలకు రాయబారం పంపగా "నేను మహ్మదీయుల పాదాలను ముట్టను. అక్బర్ దండెత్తి వస్తే యుద్ధం తప్పని సరి" అని రాణాప్రతాప్ వలె వీరోచితంగా బదులు చెప్పి విజయనగర గౌరవాన్ని, హిందూ స్వాతంత్ర్య కాంక్షను వెంకటపతి రాయలు నిలబెట్టినాడు.

విదేశీ సంబంధాలు : రెండో వెంకటపతి దేవరాయలు తన పాలనా కాలం చివరలో విజయనగరంలో మైత్రి పాటించిన పోర్చుగీసు వారికి విరోధులయిన డచ్చి వారినుంచి కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. పోర్చుగీసువారి పట్ల వెంకటపతి దృఢమైన విధానం అనుసరించాడు.

రెండోవెంకటపతి పోర్చుగీసు వారితో, స్పెయిన్ రాజైన రెండో ఫిలిప్‌తో సత్సంబంధాల కలిగి ఉన్నాడు. జెసూట్ మిషన్‌కు రక్షణ కల్పించినందుకు గాను రెండో ఫిలిప్ వెంకటపతికి కృతజ్ఞతలు తెలిపాడు. జింజి నాయకుడు అనుమతితో డచ్చివారు దేవనపట్నం దగ్గర ఫ్యాక్టరీ నిర్మించుకోగా, రెండో ఫిలిప్‌తో తనకు గల స్నేహ సంబంధాలవల్ల వెంకటపతి దేవన పట్టణం వద్ద డచ్చివారి ఫ్యాక్టరీకి అనుమతి నిరాకరించాడు. కాని పరిస్థితులు మారి పోర్చుగీసులు విజయనగరంతో విరోధం వహించగా, వెంకటపతి పోర్చుగీసు వారికి ప్రత్యర్థులయిన డచ్చివారికి పులికాట్‌వద్ద ఫ్యాక్టరీ నిర్మించుకొని వ్యాపారం చేసుకోవటానికి అనుమతి ఇచ్చాడు. ఇది నచ్చని పోర్చుగీసులు 1612 లో డచ్చివారిని పులికాట్ నుంచి తరిమివేశారు. వెంకటపతి డచ్చివారికి పులికాట్‌లో పునరావాసం కల్పించాడు. డచ్చివారు అక్కడ ఒక కోట నిర్మించారు.

## 10.4.7. ఘనత :

రెండో వెంకటపతి దేవరాయలు ముప్పైఏండ్లు పరిపాలించాడు. అతను సింహాసనం అధిష్టించే నాటికి విజయనగర రాజ్యం క్షీణించి పతనమయిపోవడానికి సిద్ధంగా ఉంది. అతను గోల్కొండ సుల్తాన్ దండయాత్రలను తిప్పికొట్టి, తిరుగుబాటు చేసిన అమర

నాయకులను అణచివేసి, రాజ్యాధికారాన్ని స్థిరపరచి, విజయనగర సామ్రాజ్యానికి అభ్యుదయించే కూర్చాడు. మొగల్ చక్రవర్తి అక్బర్ సార్వభౌమాధిపత్యాన్ని అంగీకరించక విజయనగర గౌరవాన్ని నిలబెట్టాడు.

రెండో వెంకటపతి దేవరాయలు విద్యాభిమాని, పండితాభిమాని, వదాన్యుడు. ఎన్నోదేవాలయాలు దానధర్మాలు చేశాడు. స్వయంగా పండితుడు. తాతాచార్యులు, అప్పయ్య దీక్షితులు, సుధీంద్రులు మొదలైన ద్వైతాద్వైత విశిష్టా ద్వైత వేదాంతులను, ఆచార్యులను, దార్శనికులను, చెన్నమరాజు, తరిగొప్పల మల్లన, తెనాలి రామకృష్ణుడు మొదలైన పండితులను, జైన వ్యాకరణ కర్త ఐన భట్టలంక దేవుడు, భోజరాజీయం, వ్రాసిన అనంతామాత్యుడు, ప్రభావతి ప్రద్యుమ్నము, కళాపూర్ణోదయం వ్రాసిన పింగళి సూరన ఇతని ఆస్థానంలోని వారే. తన సామ్రాజ్యంలో అనేక విద్యాసంస్థలు నెలకొల్పి, వాటి పోషణకై వసతులు కల్పించాడు. దేశీయ, విదేశీయ చిత్రకారులను ఆదరించాడు.

## 10.5. అంతర్యుద్ధం

రెండో వెంకటపతి దేవరాయల మరణాంతరం విజయనగర సామ్రాజ్యంలో అంతర్యుద్ధం ప్రారంభమయింది. ఈ ఆంతరంగిక యుద్ధాల మూలంగా విజయనగర సామ్రాజ్యంలో రక్షణ, శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయి.

### 10.5.1. రెండో శ్రీరంగరాయలు (క్రీ.శ. 1614) : తోపూరు యుద్ధం (1616) :

రెండో వెంకటపతి దేవరాయలకు ఆరుగురు భార్యలు. కాని వారికెవ్వరికి సంతానం కలుగలేదు. రాయల పట్టమహిషి బాయమ్మ అళియ రామరాయలు దౌహిత్రి. గొబ్బూరి ఓబరాజు కూతురు. బాయమ్మ రహస్యంగా ఒక బ్రాహ్మణ బాలుని పెంచి అతనిని తన కొడుకుగా ప్రకటించి పెద్ద చేసింది. అతనిని సింహాసనం ఎక్కించాలని ఆమె ఆశయం. ఈ రహస్యాన్ని తెలుసుకొన్న రెండో వెంకటపతి దేవరాయలు తన మరణానికి పూర్వంతన సోదరుడు, శ్రీరంగరాయలను తన వారసుడిగా నియమించాడు.

రెండో వెంకటపతి రాయల మరణంలో విజయనగర సింహాసనం కోసం ఆరవవీటి వంశంలో అంతర్యుద్ధం జరిగింది. అందులో విజయనగర సామంతులు రెండుమూఠాలుగా చీలి కలిహించ సాగారు. ఒక ముఠాకు బయ్యాంబ సోదరుడైన జగ్గారాయుడు నాయకుడు. ఇతడు తన సోదరి పెంచిన బ్రాహ్మణ బాలుని విజయనగర ప్రభువుగా చేయదలిచినాడు. ఈ ముఠాలో మధుర, జింజి పాలకులు సభ్యులు. రెండో ముఠాకు వెలుగోటి యాచనాయకుడు. తంజావూరు రఘునాధ రాయల నాయకులు. వీరు వెంకటపతిరాయలు తన వారసునిగా ప్రకటించిన శ్రీరంగ రాయలను రాజుగా చేయదలిచినారు.

రెండో శ్రీరంగ రాయలు సింహాసనం అధిష్టించడాన్ని గొబ్బూరి జగ్గరాయలు ఎదిరించాడు. ఇతడు బాయమ్మ సోదరుడు. బాపమ్మ పెంచిన బాలునికి వయస్సు రాగానే ఇతడు తన కూతురు నిచ్చి పెండ్లి చేసినాడు. అందుచేత తన అల్లుని సింహాసనం మీద నిలపాలని జగ్గరాయలు శ్రీరంగరాయలను ఎదిరించాడు. సేనాపతులైన మాలెరాజు, తిమ్మనాయకులను కూడగట్టుకొని జగ్గరాయలు రెండో శ్రీరంగరాయలను బందీచేసి, అతనిని కుటుంబంలో సహా చెరలో ఉంచాడు. వెలుగోటి కస్తూరి రంగప్ప కుమారుడు యంచమ నాయకుడు జగ్గరాయుని కృత్యానికి క్రుద్ధుడై, శ్రీరంగరాయల కుమారులలో ఒకడైన రామదేవుని చెరలో తప్పించాడు. దీనితో ఆగ్రహించిన జగ్గరాయలు శ్రీరంగరాయల కుటుంబాన్ని ఖైదులో హత్య చేయించాడు. జగ్గరాజు అమానుష క్రూరకృత్యంతో రాజ్యం అట్టుడికినట్లయింది. మట్లి తిరువెంగళనాధాది మిత్రులు సయితం జగ్గరాయల పట్ల విముఖత్వం వహించారు. రాజ్యంలోని నాయకులందరూ జగ్గరాయల పక్షమో లేదా యాచమ నాయని పక్షమో వహించడంతో సామ్రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితి, అరాచకం ఏర్పడ్డాయి.

జగ్గరాయల పక్షం బలహీనం కావడం గమనించి యాచమ నాయకుడు మిత్రబృందాన్ని ఓడించాడు. వెల్లూరు యాచమ నాయుని స్వాధీనమయింది. యాచమనాయడు శ్రీరంగరాయల కుమారుడైన రామదేవరాయలను పట్టాభిషిక్తుని చేశాడు. పరాజయం చెందిన

జగ్గరాయలు తన ప్రయత్నాలు కొనసాగించి మధుర, జింజి పాలకుల సాయం సంపాదించాడు. 1565 నుంచి ఈ నాయకులు రాయల అధికారాన్ని ధిక్కరిస్తున్నవారే. ఇది గమనించిన యాచమనాయుడు తంజావూరు రఘునాథరాయలు సహాయం పొందాడు. ఉభయ సైన్యాలు తోపూరు దగ్గర తారసిల్లినాయి. మొదట్లో ఫిరంగులలో భీకర యుద్ధం జరిగింది. దక్షిణ దేశంలో పెద్ద ఎత్తున ఫిరంగుల వాడింది తోపూరు యుద్ధంలోనే అని చెప్పవచ్చు. క్రీ.శ. 1616 లో జరిగిన ఈ తోపూరు యుద్ధంలో జగ్గరాయలు ప్రాణాలు కోల్పోయాడు. ఇతని కూటమి విచ్ఛిన్నమయింది. జింజి కృష్ణప్ప, మధుర వీరప్పలు పారిపోయి ప్రాణాలు దక్కించుకొన్నారు. వారి సైన్యాలు చెల్లాచెదురయినాయి. గొబ్బూరు వంశం వారు అపార నష్టానికి గురి అయ్యారు. వారి దుర్గాలనేకం యాచమనాయుడు స్వాధీనం చేసుకొన్నాడు. తోపూరు యుద్ధాన్ని గురించి 'వెలుగోటి వారి వంశావళి' విపులంగా వర్ణిస్తున్నది. శ్రీరంగరాయల కుమారుడైన రామదేవరాయలు సింహాసన మధిష్టించాడు.

విజయనగర సామ్రాజ్య పతనాన్ని త్వరితం చేయడంలో 1616 నాటి తోపూరు యుద్ధం, 1565 నాటి రక్షస - తంగడి యుద్ధానికన్నా ఉపద్రవమయింది.

## 10.5.2. రామదేవరాయలు (క్రీ. శ.జ1617 - 1630) :

1616 తోపూరు యుద్ధంతో అంతర్యుద్ధం సమాప్తం కాలేదు. రామదేవరాయలు సామ్రాజ్యాన్ని కూడగట్టి ఒకటిగా ఉంచడానికై తన పాలనా కాలమంతా పోరాడవలసి వచ్చింది. జగ్గరాయల సోదరుడైన యతిరాజు రామదేవరాయల మీద పోరాటం కొనసాగించాడు. కాని జగ్గరాయల అల్లుడైన చిక్కరాయలు 1619 లో మరణించడంలో యతి రాజు తన యుక్తులను, విధానాలను మార్చాడు. యతిరాజు తన కుమార్తెను రామదేవరాయలకిచ్చి వివాహం చేసి తన స్థానాన్ని బలపరచుకొన్నాడు. గొబ్బూరి వారు మరలా అధికారం సంతరించుకోవడం యాచమనాయుడు ఇష్టపడలేదు. దానితో మరలా విజయనగర నాయకులంతా పోరాటానికై రెండు పక్షాలుగా చీలిపోయారు. ఈ అంతర్యుద్ధాన్ని గురించిన వివరాలు పోర్చుగీసు బాటసారి మాన్యూల్ బర్రడాన్ లేఖలనుండి లభిస్తున్నాయి.

రామదేవరాయలు, యతిరాజుల మధ్య సమాధానం యాచమనాయుని పక్షం వారు సహించలేదు. యాచమ కుమారుడు వెలుగోటి రంగప్ప తిరుగుబాటు చేశాడు. మధుర, జింజి నాయకులు యధాప్రకారం రామదేవరాయలను ధిక్కరించాడు. కాళహస్తి సామంతుడైన దామెర్ల వెంకటపతి బలవంతుడై తిరుగుబాటు ప్రారంభించాడు. ఇట్టి క్లిష్ట పరిస్థితులలో యతిరాజు సహాయంతో రామదేవరాయలు తిరుగుబాటుదార్లపై అనేక యుద్ధాలు చేసి వారిని ఓడించినాడు. దామెర్ల వెంకటపతి లొంగిపోవడంతో 1629 నాటికి శాంతి ఏర్పడి రామదేవరాయల అధికారం సుస్థిరమయింది.

అంతర్యుద్ధము, సామంతుల తిరుగుబాట్లు అవకాశంగా తీసుకొని శాంథోమ్ నందలి పోర్చుగీసులు అక్కడ ఉన్న కోటను ఆక్రమించి, పులికాట్ నుంచి డచ్చివారిని తరిమివేయడానికి ప్రయత్నించారు.

విజయనగర రాజ్యంలోని అలజడులు బీజపూర్ సుల్తానైన ఇబ్రహీం అదిల్‌షాను విజయనగర రాజ్యంపైకి దండెత్తడానికి ప్రేరేపించాయి. ఆదిల్‌షా, అబ్దుల్ వహాబ్ నాయకత్వంలో కర్నూల్ దిశగా ఒక సైన్యాన్ని పంపించాడు. కర్నూలు దుర్గాధిపతిగా ఉన్న గోపాలరాజు ఈ దాడిని ఎదిరించడానికి గోల్కొండ సహాయాన్ని పొందాడు. దానితో ఇబ్రహీం ఆదిల్‌షా దండయాత్రలను కొనసాగించడం కంటే సంధి చేసుకోవడం మేలని భావించాడు. కాని, అతను కర్నూలును ఆక్రమించే ఆలోచనను మానలేదు. మరలా ఒకసారి ఆదిల్‌షా, అబ్దుల్ కహాబ్ నాయకత్వంలతో గోపాలరాజుపై దండయాత్ర పంపించాడు. ఆదిల్‌షా సైన్యాలను ఎదుర్కొవడానికి గోపాలరాజుకు హండేనాయకులు, పెమ్మసాని నాయకులు, మట్లవారు తోడైనారు. అబ్దుల్ వహాబ్ కర్నూలును ముట్టడించి స్వాధీనం చేసుకొన్నాడు. రామదేవరాయలు తన పాలనాకాలం చివరిలో కర్నూలను తిరిగి రాబట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆళియ రామరాయల మనుమడైన పెదవెంకటపతి రాయలను తన వారసునిగా నియమించి రామదేవరాయలు మరణించాడు.

## 10.6 మూడో వెంకటపతి దేవరాయలు : (క్రీ.శ. 1630 - 1642)

రామదేవరాయల మరణంతో మరొక అంతర్యుద్ధం ప్రారంభమయింది. తనకు సంతానం లేనందులన రామదేవరాయలు ఆళియరామరాయల మనుమడు అయిన పెద వెంకటపతిరాయలను తనకు వారసునిగా నిర్ణయించినాడు. కాని ఈ నిర్ణయాన్ని రామదేవరాయల పినతండ్రి తిమ్మరాజు ధిక్కరించి యుద్ధానికి దిగాడు. తిమ్మరాజు చర్యలను మధుర, జింజి, తంజావూరు పాలకులు గర్హించారు. సామంతులు సహాయంతో పెద వెంకటపతి రాయలు తిమ్మరాజును ఓడించి సింహాసనం ఎక్కినాడు. 1635 లో తిమ్మరాజు మరణంతో అంతర్యుద్ధం ముగిసింది.

మూడోవెంకటపతి రాయల పాలనా కాలమంతా యుద్ధాలతోనే గడిచిపోయింది. ఇతడు బీజాపూర్ సుల్తాన్‌తో సుదీర్ఘంగా యుద్ధం చేశాడు. ఈ యుద్ధానికి స్వార్థపరులైన విజయనగర సామంతులే కారణం. ముఖ్యంగా శ్రీరంగరాయలు బీజపూర్ సేనానితో చేరినాడు. మూడో వెంకటపతి కనిష్ట సోదరుడైన చినవెంకటపతి పుత్రుడు శ్రీరంగరాయలు. కందనహోలు గోపాలరాజు దత్తపుత్రుడు. అందుచే ఇతడు బీజాపూర్ సామంతుడు. శ్రీరంగరాయలు వెల్లూరు సింహాసనం ఆక్రమించినట్లు కన్పిస్తుంది. అయితే తిమ్మరాజు తోటి యుద్ధంలో ఇతడు వెంకటపతికి అండగా ఉన్నాడు. అనంతరం ఉభయుల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. బహుశా శ్రీరంగరాయల ప్రోత్సాహంతో రణదౌల ఖాన్ అనే బీజాపూర్ సేనాని కర్ణాటకంపై అనేక మార్లు దండెత్తినాడు. ఇక్కేరి, బసువా పట్టణం, బెంగళూరులో షహజీని పాలకునిగా నియమించి శ్రీరంగపట్నం పైకి దండెత్తినాడు. కాని కంఠీరవ నరసరాజు ఇతనిని ఓడించి మరణించినట్లు కన్పిస్తుంది. 1641 లో రణదౌలాఖాన్, శ్రీరంగరాయలు కలిసి వెల్లూరుపై దండెత్తినారు. వెంకటపతి రాయలు మధుర, తంజావూరు నాయకుల సహాయంతో రణదౌలాఖాన్‌ను ఓడించి మళ్ళించాడు. తాత్కాలికంగా వెంకటపతికి ప్రమాదం తప్పింది.

కర్ణాకంలో అధికభాగం బీజపూర్ ఆక్రమించడాన్ని గోల్కొండ సుల్తాను సహించలేకపోయాడు. ఇతడు ఆంధ్రప్రాంతాలమీదికి తన సేనను పంపాడు. వెలుగోటి తిమ్మానాయుడు దామెర్ల వెంకటపతి మొదలైన సామంతుల సహాయంతో వెంకటపతి గోల్కొండ సైన్యాలను ఎదిరించాడు కానీ పూర్తిగా పరాజయం చెందాడు. వెంకటపతిరాయలు చిత్తూరు జిల్లా అడవుల్లోకి పారిపోయి కొన్ని రోజులకే మరణించాడు. పులికాట్, శ్రీహరికోట, ఆర్మగం మొదలైన దుర్గాలు గోల్కొండ సైన్యాలు ఆక్రమించాయి. మూడో వెంకటపతి పాలన చివరకు ఆంధ్రకర్ణాటక ప్రాంతాలలో అధికభాగం గోల్కొండ, బీజపూర్ రాజ్యాల స్వాధీనమయింది.

1639 లో వెంకటపతిరాయలు మద్రాసు పట్నం స్థలాన్ని ఆంగ్లేయులకు విక్రయించాడు. వారు అచట ఫ్యాక్టరీ, కోట నిర్మించారు.

## 10.7. మూడో శ్రీరంగరాయలు : (క్రీ.శ. 1642 - 1646)

మూడో వెంకటపతి దేవరాయలు గోల్కొండ సైన్యాలనెదిరించి పరాజయం చెంది చిత్తూరు జిల్లా అడవుల్లోకి పారిపోవడంతో శ్రీరంగరాయలు వెల్లూరు చేరి 1642 లో సింహాసనం ఆక్రమించాడు. ఇతడే విజయనగర రాజులలో చివరివాడు. శ్రీరంగ రాయలు సింహాసనం ఆక్రమించే నాటికి రాజ్యం అంతిమదశలో ఉంది. అతనిలో వలెనే ప్రభువర్గాలన్నింటిలో ద్రోహబుద్ధి, స్వార్థచింతన అధికమయిపోయినాయి. రాజ్యంపై బీజాపూర్, గోల్కొండ సైన్యాలు దండెత్తివున్నాయి. సుల్తానుల్లో ఒకరికి వ్యతిరేకంగా మరొకరి సాయం పొందడానికి, సామంతులనణచి సామ్రాజ్యాధికారాన్ని పునరుద్ధరించి తన పదవిని పదిల పరచుకోడానికి శ్రీరంగరాయలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాయల మాయోపాయలు గ్రహించిన సుల్తానుల 'ఏకంగావడంతో సామంతులు రాయల్ని తుదముట్టించే ప్రయత్నంలో సుల్తానుల సాయం కోరడంలో కర్ణాటక రాజ్యం సంక్షోభితమై క్రమంగా అస్తమించింది.

### 10.7.1. సామంతుల తిరుగుబాటు :

మూడో శ్రీరంగరాయలు తన జీవితాన్నంతా యుద్ధరంగంలోనే గడిపారు. విజయనగర రాజ్యంలోని నాయకులు, అమరనాయకులు శ్రీరంగం రాయలను ఏవగించుకొని అతని అధికారంపై తిరగబడినారు. ఏకమై తనను ఎదిరించిన మధుర, తంజావూర్, జింజి

నాయలకులను శ్రీరంగరాయలు ప్రథమంగా అదుపులోకి తేవాలని భావించాడు. కాని ఆపని అతనికి సాధ్యం కాలేదు. వీరి దాడికి తట్టుకోలేక శ్రీరంగరాయలు 1643 లో తిరుపతికి పారిపోయి అక్కడ తలదాచుకొన్నాడు.

## 10.7.2. గోల్కొండ దండయాత్ర :

గోల్కొండ సైన్యాలు విజయనగర రాజ్యంపై దండెత్తి వచ్చాయి. శ్రీరంగరాయలు వారిలో పోరాడక నారయణవనం, వెల్లూరులకు పారిపోయాడు. గోల్కొండ కుతుబ్‌షాహి సైన్యాలు అతనిని వెన్నాడక ఉదయగిరి వైపుకు మళ్ళీ ఆ కోటను ముట్టడించాయి. ఉదయగిరి రక్షణకు శ్రీరంగరాయలు ఎటుంటి ప్రయత్నం చేయలేదు.

## 10.7.3. బీజాపూర్ దండయాత్ర :

కర్ణాటకలో ఇక్కేరి వీరభద్ర నాయకుడు బీజపూర్ అధికారాన్ని దిక్కరించి స్వతంత్రుడయ్యాడు. దాంతో రణదౌలా ఖన్ సైన్యంలో ఇక్కేరి పైకి దండెత్తినాడు. షిమోగా వద్ద జరిగిన యుద్ధంలో శివప్ప నాయకుడి చేతిలో రణదౌలాఖాన్ పరాజయం చెందాడు. ఓటమి వార్త తెలుసుకొన్న బీజాపూర్ సుల్తాన్ కొంతసైన్యంతో 1644లో ఓంకార్‌పూర్‌కు నడచి, అక్కడి నుంచి దండయాత్రను ముస్తఫా ఖాన్‌కి అప్పగించాడు. ముస్తఫా ఖాన్ మలెనాడును జయించాడు. బీజపూర్ సుల్తాన్ తన రాజధానికి తిరిగి వెళ్ళాడు.

## 10.7.4. గోల్కొండ రెండోసారి దండయాత్ర :

కర్ణాటకలో ఇక్కేరి తిరుగుబాటును అణచే ప్రయత్నంలో బీజాపూర్ ఉండగా, శ్రీరంగరాయలు ఉదయగిరి నుంచి గోల్కొండ సైన్యాలను తరిమివేసి, మదుర, తంజావూర్, జింజి నాయక్ రాజులను అదుపులోకి తేవడానికి ప్రయత్నించాడు. కాని గోల్కొండ రెండోసారి దండయాత్ర చేయడంలో రాయల ప్రయత్నాలు విఫలమయ్యాయి. శ్రీరంగరాయలు వెలగోటి సింగమనాయడు సహాయంతో గోల్కొండ సైన్యాన్ని ఎదుర్కొనడానికి శీఘ్రగతిని పురోగమించాడు. 1644లో పెంగల్లు వద్ద జరిగిన యుద్ధంలో గోల్కొండ సర్వసైన్యాధిపతి మరణించాడు. విజయనగర సైన్యాలు గోల్కొండ సైన్యాన్ని నెల్లూరుకు ఉత్తరంగా ఉన్న కందుకూరు వరకు తరిమికొట్టాయి.

## 10.7.5. గోల్కొండ, బీజపూర్ సైన్యాల సంయుక్త దాడి :

మూడో శ్రీరంగరాయలు గోల్కొండపై సాధించిన పైవిజయం ఎక్కువ కాలం నిలవలేదు. ఈ విజయం తరవాత అనతికాలంలోనే గోల్కొండ, బీజపూర్ సహాయంతో విజయనగర రాజ్యం మీద దండెత్తింది. ఏకంగా వచ్చిన గోల్కొండ, బీజాపూర్ సైన్యాలను ఎదిరించడం అసాధ్యమని తెలిసి శ్రీరంగరాయలు కందుకూరుని విడిచి, సామ్రాజ్య అంతర్భాగంలోనికి వెళ్ళిపోయాడు. గోల్కొండ, బీజపూర్ సైన్యాలు విజయనగర సామ్రాజ్య సరిహద్దును చేరాయి. గోల్కొండ సైన్యాలు మీర్‌జుమ్లా నాయకత్వంలో కర్నూలు జిల్లా తూర్పుప్రాంతాలను జయించాయి. బీజాపూర్ సైన్యాలు ఖాన్ - ఇ - ఖానన్ నాయకత్వంలో కర్నూల్ జిల్లా ఈశాన్యంగా ఉనన్న నంద్యాల, నిరువెళ్ళ, కనిగిరి కోటలను ఆక్రమించాయి. గోల్కొండ సుల్తాన్ యుద్ధాన్ని ఆపాడు. బహుశా శ్రీరంగరాయలు సుల్తాన్‌తో ఒప్పందం కుదుర్చుకొని ఉండవచ్చు.

## 10.7.6. దక్షిణం మీదికి దండయాత్ర :

సామ్రాజ్య దక్షిణభాగంలో మదుర, తంజావూరు, జింజినాయకులు, ఒకటై శ్రీరంగరాయలకు ఎదురుతిరిగారు. శ్రీరంగరాయలు ఉత్తరం నుంచి తన సైన్యాలను ఉపసంహరించి దక్షిణం మీదికి దండయాత్ర చేశాడు. చెట్టిపట్ల చేరేవరకు దక్షిణ ఆర్కాట్ జిల్లాను నాశనం చేస్తూ, తగలబెడ్తూ వెళ్ళాడు. చెట్టిపట్టు వద్ద సైనిక శిబిరాన్ని నిలిపి తిరుగుబాటు నాయకుల రాకకై ఎదురు చూడసాగారు.

దక్షిణ నాయకులు పెద్ద సైన్యాన్ని సమకూర్చి కూడా శ్రీరంగరాయల మీద గెలుపును సాధించగలమనే ధైర్యం చాలక బీజపూర్, గోల్కొండ సుల్తానుల సహాయం అర్థించారు. సహాయానికి ప్రతిఫలంగా వారికి విశేష ధనం ఇవ్వడానికి అంగీకరించాడు. కాని నిజానికి గోల్కొండ, బీజాపూర్ సుల్తానులను ఈ ఆహ్వానంతో పనిలేదు. అప్పటికే మొగల్ చక్రవర్తి షాజహాన్ కర్ణాటక సామ్రాజ్యాన్ని గెలవమని ఈ సుల్తానులను ఆదేశించి ఉన్నాడు.

## 10.7.7. షాజహాన్ ఆదేశం మేరకు సుల్తానుల దండయాత్రలు :

మొగల్ చక్రవర్తి షాజహాన్ ఆదేశం మేరకు గోల్కొండ, బీజపూర్ సుల్తానులు విజయనగర సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి ఉపక్రమించాయి.

**ముస్తఫా ఖాన్ :** బీజపూర్ సైన్యాధిపతి ముస్తఫాఖాన్ తనసైన్యాలను మలెనాడు ద్వారా నడిపించి బెంగళూరు జిల్లాలోని శివగంగ చేరాడు. అక్కడ మదుర, తంజావూరు, జింజి నాయకుల రాయబారులు అతనిని కలిసి సహాయ మర్థించారు. వారి ప్రార్థన మేరకు ముస్తఫా ఖాన్ నెల్లూరు మీదికి నడిచి కర్నూలు వద్ద ఉన్న ఖాన్ - ఇ - ఖానన్ కు తనకు తోడురమ్మన్నాడు. ఈ పరిస్థితుల్లో శత్రువును దెబ్బతీయడంతోనే తనకు విజయావకాశాలు ఉన్నాయని శ్రీరంగనాయలు గ్రహించాడు. ముస్తఫా ఖాన్‌కు ఎటువంటి అనుమానం రాకుండా శాంతి ప్రయత్నాలనే నెపంతో అతని వద్దకు ఒక రాయబారాన్ని పంపాడు. మధుర, తంజావూరు, జింజి నాయకులు తమ సైన్యాలలో బీజపూర్ సైన్యాధిపతిని చేరకముందే శత్రుసైన్యాలను దెబ్బతీయాలని శ్రీరంగరాయల సంకల్పం. అతను శీఘ్రగతిని సైన్యాలను దక్షిణానికి పంపి జింజి నాయకుడిని ఓడించి లొంగదీసుకొన్నాడు. తరువాత శ్రీరంగరాయలు మధుర, తంజావూరు నాయకులపైకి సైన్యాన్ని నడిపారు. కాని ఇంతలో ముస్తఫాకు శ్రీరంగరాయల ప్రయత్నాలు తెలిసివచ్చి తన సైన్యాలను వెల్లూరు మీదికి నడిపాడు. ఈ పరిస్థితుల్లో శ్రీరంగరాయలు నాయకుల మీద నుంచి తన దృష్టిని రాజధాని రక్షణకు మరల్చాడు.

**మీర్ జుమ్లా :** బీజపూర్ సైన్యాధిపతులు తమసైన్యాలలో వెల్లూరుపైకి నడుస్తుండగా, గోల్కొండ సైన్యాధిపతి మీర్ జుమ్లా తన సైన్యాలలో తూర్పు తీరం వెంబడి నడిచి వినుకొండను పట్టుకొని తరవాత ఉదయగిరి ముట్టడించాడు. ఉదయగిరి శ్రీరంగరాయలు సైన్యాలను పంపించాడు. కాని అచట దుర్గాధిపతి మల్లయ్య ద్రోహి అయి దుర్గాన్ని మేల్‌జుమ్లాకు అప్పగించాడు. మీల్‌జుమ్లా ఉదయగిరి నుంచి పడమటగా నడిచి మట్లనాయకులు పాలించే బద్వేల్ పరిసర ప్రాంతాలను గెలిచి, వారి ఆధీనంలో ఉన్న అనేక కోటలను ఆక్రమించాడు. మీర్ జుమ్లాను ఎదిరించ లేక మట్ల నాయకులు గోల్కొండకు సామంతులుగా ఉండడానికి అంగీకరించారు.

## 10.7.8. నాయకులు శ్రీరంగరాయల పక్షం చేరటం :

అన్నివైపులా శత్రువులు చుట్టుముట్టడంలో శ్రీరంగరాయలు నిస్సహాయుడై, తమ మతాన్ని, తమ దేవాలయాలను రక్షించుకోవలసిందిగా ప్రజలకు మొరపెట్టుకొన్నాడు. కాని ఫలితం లేకపోయింది. శ్రీరంగరాయలను పూర్తిగా అణచివేయడానికి మధుర, తంజావూరు, జింజి నాయకులు బీజపూర్ సైన్యాధిపతులకు పెద్దమొత్తంలో లంచమిచ్చి శ్రీరంగరాయలు ప్రాంతాలపై దండెత్తేటట్లు చేశారు. బీజపూర్ సైన్యాధిపతులు పశ్చిమాంధ్రలో విజయాలు సాధిస్తుండగా, నాయకుల వెల్లూరు మీదికి తమ సైన్యాలను పంపారు. 1645 లో శ్రీరంగరాయలకు, నాయకులకు మధ్య జరిగిన యుద్ధంలో శ్రీరంగరాయలు ఓడి వెల్లూరు కోటలోనికి వెళ్ళిపోయాడు. అక్కడనుంచి అతడు నాయకులతో ఒక ఒప్పందానికి రావడానికి ప్రయత్నించాడు. గోల్కొండ, బీజపూర్ సుల్తానులు కలిసి ఒకటిగా విజయనగర సామ్రాజ్యం మీద దాడి చేయటంలో చివరకు వారు తమ రాజ్యాలకు కూడా కబళించగలదని నాయకులు భయపడ్డారు. దీంతో మధుర తిరుమల నాయకుడు తప్ప మిగతా నాయకులంతా శ్రీరంగరాయల పక్షంలో చేరారు. పెద్దసేనతో శ్రీరంగరాయలు ముస్తఫాఖాన్ దండెత్తాడు. యుద్ధంలో శ్రీరంగరాయలు విజయం సాధించాడు. విజయం తరువాత శ్రీరంగరాయలు వెల్లూరుకు మరలిపోయాడు.

## 10.7.9. వెల్లూరు ముట్టడి :

ముస్తఫాఖాన్ శ్రీరంగరాయలు సాధించిన విజయం తాత్కాలికమైంది. కంగుది, మైసూరు నాయకులు శ్రీరంగరాయలను విడిచిపోవడంతో ముస్తఫా ఖాన్ వెల్లూరు పైకి దండెత్తి వెళ్ళినాడు. శ్రీరంగరాయల పట్ల మైత్రీభావం వహించిన నాయకులు రాజధానిని కాపాడుకొనుటకై అతనికి సైన్యాన్ని, ధనాన్ని సహాయం పంపుతామని వాగ్దానం చేశారు. కాని సహాయం అందకుముందే ముస్తఫా ఖాన్ వెల్లూరు పరిసర ప్రాంతాలకు చేరుకొన్నాడు. యుద్ధానికి సిద్ధంగా లేకపోయినా శ్రీరంగరాయలు ముస్తఫాతో పోరాడక తప్పలేదు. వెల్లూరు దగ్గర 1646లో జరిగిన ఘోరయుద్ధంలో శ్రీరంగరాయలు ఓడి, కోటలోనికి పారిపోయాడు. వెంటనే ముస్తఫా వెల్లూరు కోటను ముట్టడించాడు కాని ఈ ప్రాంతంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినందున ముట్టడి విరమించి మైసూరులోని పెక్కుదుర్గాలు ఆక్రమించి బీజపూర్ మరలినాడు.

## 10.7.10. వందవాసి యుద్ధం :

తాత్కాలికంగా శ్రీరంగరాయలకు ముస్తఫా ఖాన్ బెడదతీరినా మీర్‌జుమ్లా ప్రమాదం హెచ్చింది. ఉదయగిరిని స్వాధీనం చేసుకొన్న మీర్‌జుమ్లా తొండమనాడు, తిరుపతి, చంద్రగిరి ఆక్రమించి పులికాట్ చేరినాడు. పులికాట్‌లోని డచ్చివారితో అతనికి సమాధానం కుదరలేదు. అనంతరం మీర్‌జుమ్లా పొన్నేరి, పూనమల్ల, కాంచీపురం, చెంగల్పట్టుల నాక్రమించాడు. శ్రీరంగరాయల పోత్సాహంతో మదుర, మైసూర్ నాయకులు ఏకమై మీర్ జుమ్లాను ఎదిరించాడు. కాని, వందవాసి యుద్ధంలో (1652) పరాజయం పొందారు. శ్రీరంగరాయలు మైసూరుకు పారిపోయాడు. దీంతో విజయనగర సామ్రాజ్యం పరిసమాప్తమయింది.

## 10.7.11. జింజీ ఆక్రమణ :

వందవాసి యుద్ధంలో విజయం సాధించిన మీర్ జుమ్లా జింజీని ముట్టడించాడు. మదుర, మైసూర్‌లను మీర్ జుమ్లా జయించడం, తరువాత జింజీని ముట్టడించడం బీజపూర్‌కు అసూయ కలిగింది. మీర్ జుమ్లా జింజీ పట్టుకోకుండా అడ్డుకోవటానికై ముస్తఫా **ఖాన్,** ఖాన్ - ఇ - ఖానాన్ తమ సైన్యాలతో జింజీని చేరుకొన్నారు. మీర్ జుమ్లా బీజపూర్ సైన్యాధిపతులతో ఒప్పందం కుదుర్చుకొని గోల్కొండ రాజ్యానికి మరలిపోయాడు. బీజపూర్ సేనలు జింజీని ముట్టడించి స్వాధీనం చేసుకొన్నాయి. సుగుమంచి పల్లి కైఫియాతో ప్రకారం 1652 నాటికి విజయనగర రాజ్యం పూర్తిగా సుల్తానుల స్వాధీనమయింది.

## 10.7.12. శ్రీరంగ రాయల చివరి రోజులు :

వెల్లూరును కోల్పోయిన శ్రీరంగరాయలు ఆశ్రయం లేక తిరుగసాగాడని శివతత్త్వ రత్నాకరం చెబుతుంది. విజయనగర రాజుకు రాజ్యం లేకుండా పోయిందని తెరినాట్ అనే ఫ్రెంచి యాత్రికుడు పేర్కొన్నాడు. ఇంకా కొంత స్వాతంత్ర్యంలో నిలబడి ఉన్న మైసూరుకు శ్రీరంగరాయలు ఆశ్రయం కోసం పారిపోయాడు. మైసూరు, ఇక్కేరి నాయకుల సహాయంతో సాధన సంపత్తిని సమకూర్చుకొని తన రాజ్యాన్ని తిరిగి సంపాదించుకొనే అవకాశం కోసం రాయలు ప్రయత్నించాడు. విజయనగర సామ్రాజ్యాన్ని తిరిగి నిలబెట్టడానికి శ్రీరంగరాయలు చేసిన ప్రయత్నాలను మధుర నాయక రాజు తిరుమల నాయకుడు వమ్ముచేశాడు. రెండోసారి తన సామంత నాయకుల చేత మోసగించబడిన విజయనగర రాజు 1659 నాటికి తన రాజ్య పరిహద్దులలోని అడవులలో తల దాచుకొని నికృష్ట జీవితం గడపవలసి వచ్చింది అని క్రైస్తవ మతాచార్యుడు ప్రొమెన్సాస్ అంటాడు. విజయనగర చక్రవర్తికి పట్టిన దీనస్థితిలో, ఇక్కేరి శివప్ప నాయకుడు శ్రీరంగరాయలను ఆదుకొని, బేలూరును గెలిచి అతనికి అప్పగించాడు. తన రాజ్యాన్ని పూర్తిగా నష్టపోయిన తరవాత శ్రీరంగరాయలు ఎంతకాలం బతికాడో చెప్పటం కష్టం. 1669 నాటి శాసనమొకటి శ్రీరంగరాయలను విజయనగర చక్రవర్తిగా పేర్కొంటుంది.

పైవిధంగా ఆరవీటి వంశం, దానితో విజయనగర సామ్రాజ్యం అంతమయినాయి. విజయనగర సామ్రాజ్యానికి గుర్తుగా ఒక్క మైసూర్ రాజ్యం మిగిలింది. ఇస్లాం మత వ్యాప్తిని అరికట్టి, హిందూ ధర్మ సంస్కృతులను పరిరక్షించడం ప్రధాన ధ్యేయంగా **1336 లో**

స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం మూడు శతాబ్దాలు ఆధ్యేయాన్ని సమర్థవంతంగా నిర్వహించి 1646 లో అంతమయిపోయింది. విజయనగర సామ్రాజ్యం అంతరించినా సంప్రదాయం కొనసాగింది. ఛత్రపతి శివాజీ తాను విజయనగర ప్రతినిధిగా నియమించబడినట్లు శ్రీరంగరాయల నుంచి ఒక చార్టర్ కూడా పొందాడు.

## 10.8 సారాంశము :

తళ్ళికోట యుద్ధానంతరం పెనుగొండకు మరలిన తిరుమల రాయలు పెనుగొండని రాజధానిగా చేసుకొని రాజ్యాన్ని పాలించారు. ఆరవీటి వంశస్థులలో సుప్రసిద్ధుడు రెండో వెంకటపతిరాయలు. మూడో శ్రీరంగ రాయల కాలంలో విజయనగర రాజ్యం పూర్తిగా సుల్తానుల స్వాధీనమవ్వటంతో ఆరవీటి వంశం, విజయనగర సామ్రాజ్యం రెండూ పతనమయ్యాయి.

- డా. వి.కె. మోహన్.

పాఠం - 11

# విజయనగర ప్రభుత్వ యంత్రాంగ స్వభావము

## 11.0 లక్ష్యం :

దక్షిణభారత చరిత్రలోనే గాకుండా యావత్ భారత చరిత్రలో ఒక ముఖ్య సామ్రాజ్యముగా, ఖ్యాతి గాంచినది విజయనగర సామ్రాజ్యం ఈ పాఠములో విజయనగర ప్రభుత్వ యంత్రాంగ స్వభావము గురించి తెలియజేయడం జరుగుతుంది.

## విషయక్రమం :


11.1 విజయనగర ప్రభుత్వ యంత్రాంగ స్వభావము

11.1.1 ఆధారాలు

11.1.2 కేంద్ర ప్రభుత్వము

11.1.3 ఆదాయ వ్యయాలు

11.1.4 వ్యవసాయం - నీటివనరులు

11.1.5 సైనిక వ్యవస్థ - యుద్ధ తంత్రం

11.1.6 న్యాయస్థానాలు - శిక్షలు

11.2 నాయంకర పద్ధతి

11.2.1 పరిచయం

11.2.2 ప్రధాన లక్షణాలు

11.2.3 మౌలికాంశాల విశ్లేషణ

11.3 ప్రాదేశిక పాలనా వ్యవస్థ

11.3.1 ఆధారాలు

11.3.2 స్థానిక పాలన

రాష్ట్రము

సీమ

స్థలము

గ్రామము

11.4 సారాంశము

## 11.1 పరిచయం

దక్షిణ భారతదేశ చరిత్రలో ప్రఖ్యాతిగాంచిన విజయనగర సామ్రాజ్యం మూడు శతాబ్దాలకు పైగా పరిపాలన చేసి, మధ్యయుగ రాజకీయాల్లో కీలకపాత్ర వహించింది. అంతేగాక ముస్లిమ్ దాడుల నుండి హిందూ మతాన్ని, హైందవ సంస్కృతిని కాపాడి, దక్షిణ భారత సంస్కృతి వైభవానికీ యనలేని సేవ చేసినది.

### 11.1.1 ఆధారాలు :

విజయనగర ప్రభుత్వ యంత్రాంగం గురించి తెలుసుకోవడానికీ అనేక ఆధారాలు గలవు. పరాశర మాధవీయం, ఆముక్తమాల్యద, సకలనీతి సమ్మతం మొదలగు గ్రంథాలను బట్టి కర్ణాటక రాజక్కల్ సవిస్తర చరిత్ అనే కన్నడ స్థానిక చరిత్రను బట్టి, కాకుమాని, మూర్తికవి రచించిన రాజవాహన విజయం, వేంకటనాధుని పంచతంత్రం ద్వారా, బుర్హాన్ - ఇ - మాసిర్ అనే ముస్లిమ్ చరిత్ర ద్వారా బిజపూర్ చరిత్రకారుడైన రఫీ ఉద్దీన్, ఇబ్రహీమ్ షిలాడి రచనల ద్వారా, ఫెరిస్టా, తబతబ, అబ్దుల్ రజాక్, నికోలో కాంటి, పేస్, న్యూనిజ్, ఇబిన్ బటూట, బర్బోసా, లూయి మొదలగు వారి రచనల ద్వారా, సమాకాలిక శిల, తామ్ర శాసనాల ద్వారా విజయనగర పాలనా విధానం గురించి తెలుసుకోవచ్చు.

### 11.1.2. కేంద్ర ప్రభుత్వము

ఒక సామ్రాజ్యం యొక్క బలముగాని, సుస్థిరత గాని, చాలావరకు మంచి పరిపాలనా వ్యవస్థపైనే ఆధారపడి ఉంటుంది. ఈ అంశాన్ని గుర్తించిన విజయనగర రాజులు, కాలానుగుణముగా మార్పులతో అధికార వికేంద్రీకరణకు తావు కల్పిస్తూ బలమైన కేంద్రంతో, పరిపాలనా వ్యవస్థను, పరిపుష్టముగా రూపొందించారు. రాజ్య రక్షణకై, విస్తరణకై, రాజ్యాల మధ్య ఎడతెగని పోరాటాలు జరగడం వల్ల, విజయనగర ప్రభుత్వ యంత్రాంగాన్ని సైనిక అవసరాల దృష్ట్యా రూపొందించడం జరిగింది.

**రాజు :** విజయనగర సామ్రాజ్యంలో సాంప్రదాయబద్ధమైన రాచరికమే అమలు జరిగింది. అయితే ఇది కేంద్రీకృత, నిరంకుశ, రాజరికము కాదు. ఆముక్తమాల్యద పేర్కొన్నట్లు పరిపాలనా యంత్రాంగంలో కీలకము గానూ, సప్తాంగ సమన్వితమైన రాజ్య వ్యవస్థలో అత్యంత ప్రధాన భాగముగాను రాజు ఉండెవాడు. విజయనగరాన్ని పరిపాలించిన అనేక మంది రాజులు వ్యక్తిగతముగా శౌర్యవంతలేకాగ, ఇతర మంచి గుణాలతో ప్రజల ప్రభుత్వ అధికారుల గౌరవ అభిమానాలనూ చూరగొన్నారు. రాజ్య రక్షణ కోసం అసమర్థులు, వ్యసన పరులైన రాజులను, తొలగించడములో సాళువ నరసింహుని వంటి నాయకులకు ప్రజలు చేయూతనిచ్చారు.

విజయనగర రాజులు ధర్మబద్ధులము అని ప్రకటించుకొన్నారు. దుష్టనిగ్రహం, శిష్టపరిపాలనా వీరి ముఖ్య విధి అయినది. దీనికోసం రాజు దండప్రయోగం చేయవచ్చు. ప్రజల సామాజిక నైతిక జీవనము రాజు న్యాయపాలనా నిర్వహణపై, ఆధారపడింది. ప్రజల వర్ణాశ్రమ ధర్మాలనూ పాటించేలా చూడటం రాజు బాధ్యత. ఈ కార్యనిర్వహణలోనే మొదటి బుక్కరాయల వంటి కొందరు చక్రవర్తులు వైదికమార్గ ప్రతిష్ఠాపనాచార్య మొదలైన బిరుదులు వహించారు. ప్రజల ఆర్థిక అభివృద్ధి బాధ్యత కూడా రాజుదే. దీని కొరకు, అడవులను నరికించి. నీటిపారుదల సౌకర్యాలను కల్పించి, వ్యవసాయాన్ని, అభివృద్ధి చేయించడం జరిగింది. విదేశీ వాణిజ్యానికీ తగిన బద్రత, వసతులు కల్పించబడినాయి. కొన్ని సందర్భాల్లో గనుల వంటి పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహించేది.

రాజుకు, యువరాజు అన్ని విధాల సహాయముగా ఉండేవాడు. ప్రతిరోజు గూఢాచారులను, దండనాయకులను సంప్రతులను కలసి చర్చించేవాడు. తరచుగా సమావేశాలు జరిగేవి. దేవరాయల సభాభవనం ముత్యాలశాల అని శ్రీనాధుడు వర్ణించాడు. కృష్ణరాయల సభకు భువన విజయం అని, అచ్యుత రాయల సభకు వేంకట విలాస మండపం అని పేర్లు. ప్రాజ్ఞుల గోష్టులు కూడా వీనిలోనే జరిగేవి.

వంశపారంపర్య, రాచరిక వ్యవస్థ అమలులో ఉన్న విజయనగరంలో యువరాజు పాలనానిర్వహణలో పాలుపంచుకొనేవాడు. యుక్తవయస్కుడు కాని రాజు లేదా సామర్థ్యం లేని రాజో అధికారంలో ఉన్నప్పుడు పరిపాలనను, రాజ ప్రతినిధి నిర్వహించేవాడు. ఇటువంటి సందర్భాల్లోనే వీరనరసింహరాయలు, రామరాయల వంటి ప్రతినిధులు, తమ అధికార ప్రభావాలను పెంచుకొని సింహాసనాన్ని కూడా ఆక్రమించుకొన్నాడు. విజయనగర పరిపాలకులు, అత్యంత వైభవోపేతమైన సభను నిర్వహించేవారు. వారు ప్రతిచోట సైనిక బలగాలనూ సమీక్షించేవారు.

**మంత్రిపరిషత్ :** పరిపాలనలో రాజుకు సహాయముగా **మంత్రి పరిషత్** ఉండేది. ఆనాటి మంత్రుల సంఖ్యను నిర్ణయించడం కష్టం. మహాశిర: ప్రధాని, ప్రధాని, దళాదికారి, మహా **సామంతాదికారి వంటివారు.** మంత్రి పరిషత్ సభ్యులు మంత్రి పరిషత్‌కు సర్వశిర: ప్రధాని అధ్యక్షుడు. వీర నరసింహరాయలు, కృష్ణరాయల కాలంలో తిమ్మరుసు సర్వశిర: ప్రధాని. అత్యుతరాయల కాలంలో సాళువ నరసింహుడు సర్వశిర: ప్రధానిగా ఉన్నాడు. తిమ్మరుసు సర్వశిర: ప్రధానిగా ఉన్న కాలంలో సోమరసు ఉపప్రధాని పదవినీ వహించి ఉన్నట్లు ఒక శాసనం వల్ల తెలుస్తుంది. సర్వశిర: ప్రధానిని సభానాయక, తంత్రనాయక, కార్యకర్త అనికూడా పిలిచేవారు. మంత్రిమండలి, సమావేశాలనూ తరచూ జరుపుతుండాలి అని, కృష్ణరాయలు చెప్పాడు. ఈ సమావేశాలు, రహస్యముగ జరిగేవి. ముఖ్యమైన సమావేశాలకూ రాజే అధ్యక్షత వహించేవాడు.

**ప్రభుత్వ శాఖలు :** ప్రభుత్వ కార్యనిర్వహణకు, మంత్రుల ఆధ్వర్యంలో అనేక శాఖలు ఉండెవి. ఆయా శాఖాదిపతులను, రాయసస్వాములు అని వారి కార్యదర్శులను సంప్రతులు అని వ్యవహరించేవారు. సమకాలిక సాహిత్యము వల్ల, శాసనాల వల్ల అట్టవన (రెవిన్యూ) కందాచార (మిలిటరీ), భాంఢార (టెజరి), ధర్మాసన (జుడిషరి), సుంక వ్యవహార (కష్టమ్స్, ఎక్సైజ్) శాఖలు ఉండెవి. రాయవాచకం 9 మంది సంప్రతులు ఉన్నట్లు తెల్పుతుంది. అందువల్ల, 9 శాఖలు ఉన్నట్లు భావించవచ్చు. సంప్రతులు సీమల, స్థలాల, పొలిమేరలను గురించి, ఆదాయ, వ్యయాలనూ గూర్చి భూకామందుల గురించి సిస్తులను గురించి, లెక్కల తయారు చేసి ఉంచేవారు. **భాండారంలో** స్వర్ణభాంఢారం, రత్న భాంఢారం ఉండెవి. రాయవాచకములో పెద్ద భాండారం, చిన్న భాండారం చెప్పడం అయినది.

## 11.1.3. ఆదాయ వ్యయాలు

విజయనగర యుగములో ప్రజలపై పన్నుల భారం అధికముగానే ఉండెది. నాటి ఆదాయాన్ని ప్రధానంగా, రెండు తరగతుల క్రింద వసూలు చేసేవారు అవి 1. భూమి ఆదాయం 2. శుల్కాదాయం.

**భూమి ఆదాయం :** భూమి ఆదాయం రెండు రకాలు అవి ధాన్య ఆదాయం సువర్ణ ఆదాయం. రాజ్యములోని భూమినంతా రెండు తరగతులుగా విభజించారు అవి వ్యవసాయ యోగ్యమైన భూమి, వ్యవసాయయోగ్యము కాని అడవులు, కొండలు మొదలగునవి. రెండోవ తరగతి భూమి అంతా రాజ్యానకి చెందినది. అటువంటి భూమి నుంచి పుల్లరి వంటి తక్కువ ఆదాయం మాత్రం వచ్చెది. తమిళదేశ శాసనాల్లో ధాన్య ఆదాయాన్ని, నేల్ ముదల్ అని సువర్ణా ఆదాయాన్ని పోణిముదల్ అని పేర్కొన్నాయి. రెండో దేవరాయల శ్రీరంగం తామ్రపట్టికల నుంచి రాజ్య ఆదాయాన్ని, ధాన్య రూపంలో ధనరూపంలో వసూలు చేసినట్లు తెలుస్తుంది. వ్యవసాయ భూములు గ్రామ పొలిమేరల్లో కేటాయించబడి రైతుల వ్యవసాయాన్ని ప్రోత్సాహించి, ఫలసాయం మీద పన్నులు వసూలు చేసేవారు. పంటలో పదింట తొమ్మిది వంతల వరకు పన్ను ఉండెది అని న్యూనిజ్ వ్రాసిన రచన నమ్మతగినది కాదు. పంటలో మూడోభాగం లేక సగం పన్నుగా వసూలు చేసేవారు అని తెలుస్తుంది. పంటలో రాజుకు చెల్లించవలసిన భాగలనూ గురించి, ప్రత్యేక నిర్ణయం లేనందువల్ల, అమరనాయకులు, దండనాయులు, గుత్తదార్లు, రైతులను బాధించడం జరిగింది. ఈ సందర్భాలు రాజుల దృష్టికి వచ్చినప్పుడు వారు పట్టించుకోని పరిస్థితులను చక్కదిద్దేవారు. విజయనగర కాలంలో మహనవమి ఉత్సవ సందర్భముగా ప్రతియేట సామంతలు, దండనాయకులు అమర నాయకులు కప్పాలు, కట్నాలు, కానుకలు సమర్పించేవారు. ఇది రాజు ఆదాయాన్ని పెంచింది.

**శుల్కాదాయము** : రాజఖజానాకు లభించే రెండోరకం ఆదాయం శుల్కాదాయము ఇది సువర్ణఆదాయము క్రిందికి వస్తుంది. వర్తక సుంకాలు మాత్రమే కాక, పలు రకాలు అయిన ఇతర పన్నులు కూడా సుంకాలుగా వ్యవహరించారు. విజయనగర రాజుల శాసనాల నుంచి కానిక, కట్నం, సిద్ధాయం, గ్రామకట్నం, వెట్టిలేమి, ఇల్లరి, పుల్లరి, చెరువు, యెర, చెడిగా, దుర్గ నివర్తనం మొదలైన అనేక రకాల సాధారణ పన్నులు, మగ్గస్తావర, ఈడిప సిద్దాయ, పింజాణి సిద్ధాయ మొదలైన వృత్త పన్నులు తెలియవస్తాయి.

శుల్కాదాయాన్ని రైస్ మూడు తరగతులుగా విభజించాడు అవి స్థల ఆదాయం, మార్గఆదాయం, మామూలు ఆదాయం. ఒకే స్థలములో అమ్మటానికి వచ్చె సరుకుల మీద వేసే పన్నులు స్థల ఆదాయం. ఒక చోట నుంచి మరొకచోటకి తీసుకొనిపోయే సరుకు మీద వేసే పన్ను మార్గఆదాయము ఇతర రాజ్యాలకూ ఎగుమతి చేసే సరుకులపై వేసే పన్ను మామూలు ఆదాయము.

ఆనాటి పరిశ్రమలు అన్ని, కుటీర పరిశ్రమలే నేత మగ్గాలపైన, మగ్గరి అనే పన్నును, మగ్గానికీ ఏడాదికీ, అర్థ వరాహము వంతున సుంకము బంధించేవారు. శాలీవారు, తాము నేసిన వస్త్రాలు అమ్మేటప్పుడు, అమ్మకపు సుంకం, సంతలో అమ్మితే సంత సుంకం అధికముగా చెల్లించేవారు. కంసాలుల, చాకలివారు, మంగలివారు, మాదిగవారు, మాలవారు, దుమ్మరి వారు విప్రవినోధులు మొదలైన అన్ని వృత్తుల వారు ఆదాయాన్ని అనుసరించి వృత్తి పన్ను చెల్లించేవారు. ఈ కాలంలో పెండ్లి సుంకాలు ఉండెవి. మొదటి సారిగా వీర నరసింహుడు, తన రాజ్యములోని కొన్ని సీమల్లో పెండ్లి సుంకం రద్దు చేశాడు. తిమ్మరుసు సలహాపై కృష్ణరాయలు పెండ్లి సుంకాలను సామ్రాజ్యంలో పూర్తిగా రద్దుచేశాడు. రాజ్యం అంతటా దుర్గనివర్తనం అనే పన్ను వసూలు చేసేవారు. సాధారణంగా ఈ పన్ను గ్రామానికి 10 వరాహాలు, గ్రామదేవతల నిత్య పుడకలకు, పుత్సవాల కొరకు పన్ను విధించేవారు. అన్ని విధాలైన ఆస్థుల మీద పన్నులు ఉండేవి. ఆవులు, గొర్రెలు, మేకలు, మొదలగు వాటిపై, ఆస్థిపన్ను వేసేవారు. గొర్రెలు అమ్మకానికి వచ్చే 59 వివిధ వస్తువుల మీద, విధించే పన్ను వివరాలు కృష్ణరాయల, కొండవీటి శాసనంలో ప్రస్తావించబడింది. విజయనగర రాజుల సమయ సుంకము అనే ఒక క్రొత్త సుంకాన్ని ప్రవేశపెట్టారు. ఒక్కొక్క కులానికి ఒక సంఘం ఉండేది. దాని పేరే సమయం. ఈ సమయాల్లో వసూలు చేసే, భిన్న రూపాల్లోని ఆదాయమె, సుమయ సుంకం. ఈ విధముగా అనేక రకాల పన్నులు వసూలు చేసే ప్రజాకంతకులు అయ్యారు.

విజయనగర సామ్రాజ్య ఆదాయాన్ని, వివిధ చరిత్రకారులు పలు విధాలుగా అంచనా వేశారు. లూయిస్ రైస్ అనే పండితుడు. స్థానిక చరిత్రల ఆధారంగా, ప్రభుత్వ ఆదాయం. 81 కోట్లు అని అంచనా వేశాడు. ఒక కన్నడ స్థానిక చరిత్రను బట్టి, తూర్పు కన్నడ ప్రాంతాల నుంచి కృష్ణరాయల ఆదాయం 3 కోట్ల రూపాయలు, వర్తేమా అనే ఇటాలియన్ యాత్రికుడు విజయనగర రాయలు, భారతదేశ రాజులు అందరి కన్నా సంపన్నుడు అని అతని ఆదాయం రోజుకు 12 వేల రూపాయలు అని చెప్పాడు. విజయనగరాన్ని దర్శించిన పేయస్ ప్రకారం కృష్ణరాయల సంవత్సర ఆదాయం ఖర్చులు అన్నీ పోను 1 కోటి. బుర్హాన్ - ఇ - మాసిర్ అనే ముస్లీమ్ చరిత్ర ప్రకారం సదాశివరాయలు ఆదాయం 12 కోట్ల హోన్నులు

**వ్యయం :** విజయనగర సామ్రాజ్య ప్రభుత్వ ఆదాయంలో సగభాగం సైన్యానికీ, ఒకపాలు అంతఃపుర వ్యయానికీ దానధర్మాలకూ, ఒక పాలు మూలధనానికీ వినియోగించాలి అని కృష్ణరాయలు చెప్పాడు. ఆ కాలంలో ఎక్కువ భాగం యుద్ధాలకే ఖర్చుచేశారు. విదేశీ రచనలను బట్టి విజయనగర సామ్రాజ్యం సమస్త భోగభాగ్యాలతో తుల తూగుచున్నట్లు ఆ భోగభాగ్యాలు సంపన్న వర్గాల వారికే పరిమితం సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో పెద్ద మార్పు కనిపించదు.

## 11.1.4. వ్యవసాయం - నీటివసరులు

విజయనగర రాజులు కాలువలు, చెరువులు త్రవ్వించి వ్యవసాయ అభివృద్ధికీ కృషి చేశారు. అంతేగాక వీరు క్రొత్త భూములను సాగులోకి తెచ్చారు. క్రొత్త గ్రామాలు ఏర్పాటు చేశారు. పాడుబడిన గ్రామాలను పునరుద్ధరించారు. క్రొత్త గ్రామాలు నిర్మించిన వారికీ, క్రొత్తగా భూములు, సాగులోనికి తెచ్చినవారికీ, మిరాలిచ్చి, మొదటి మూడు సంవత్సరాలు పన్నులు లేకుండా చేసి, వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. ఫలితముగా, విజయనగర రాజ్యములో గ్రామాల సంఖ్య, సాగుబడి, పొలాల విస్తీర్ణము, పెరిగాయి.

నీటి పారుదల సౌకర్యము కల్పించడంలో చక్రవర్తులు సామంతులు, ఉన్నత ఉద్యోగులు, ప్రజలు, ప్రత్యేక శ్రద్ధ చూపారు. తటాక నిర్మాణం సప్త సంతానాలలో ఒకటి అని పుణ్యాన్ని ఇవ్వగలదని విశ్వాసం ఉండటం వల్ల చెరువులు త్రవ్వించారు. సముద్రాలు అనే పేరుతో ఈ కాలంలో పెద్ద, పెద్ద తటాకాల నిర్మాణం జరిగింది. కాలువల ద్వారా సేద్యపు నీరు పొలాలకు అందించబడింది. వ్యక్తులు కాని, గ్రామస్థులు గాని, ఒక చెరువు త్రవ్వినపుడు ఆ చెరువు క్రింద సాగయ్యే భూమిలో 10 వంతు ఫల సాయం చెరువు నిర్మించిన దానికీ, మరమత్తులకు ఇచ్చెవారు. దీనికి దశబంధ మాన్యము అను పేరు.

విజయనగర రాజులు త్రవ్వించిన చెరువుల్లో చాలా పెద్దవి కొండవీడు, ఉదయగిరి, కడప, అనంతపురం ప్రాంతాల్లో గలవు. 1369న ఉదయగిరి పాలకుడుగా ఉన్న విజయనగర రాకుమారుడు భాస్కరభవదూరుడు వేయించిన పోరుమామిళ్ల తటాక శాసనంలో తటాక నిర్మాణం గురించి వివరించబడి ఉంది. పోర్చుగీస్ ఇంజనీర్‌ల సహాయంతో శ్రీకృష్ణదేవరాయలు, తుంగభద్ర నదికీ తోరగల్లు వద్ద ఆనకట్ట కట్టించాడు. శ్రీకృష్ణరాయల మంత్రి రాయసం కేండమరసయ్య, కొండవీడు రాజ్యంలో తిమ్మా సముద్రం, కొండాసముద్రం అనే చెరువులు కట్టించాడు. ఇతడె ఉదయగిరి రాజ్యంలో కొన్ని చెరువులు నిర్మించాడు. విజయనగరానికీ తలారిగా ఉన్న పెనుగొండ వీరన్న, ఒక తటాకాన్ని నిర్మించి, ఒక కాలువను త్రవ్వించాడు. ఆనాటి సాహిత్యములో శాసనాల్లో, వరి, జొన్న, రాగి, పప్పుదినుసులు, చెరకు, నువ్వులు, ఆముదాలు, కొబ్బరి, అరటి, తమలపాకులు, మామిడి, పనస, పసుపు, ప్రత్తి , ఉల్లి, మొదలగు పంటల ప్రస్తావన గలదు.

### 11.1.5. సైనిక వ్యవస్థ - యుద్ధ తంత్రం

విజయనగర రాజులు బహమనీలతో నిరంతరం పోరాటాలు చేయవలసి వచ్చినందున తమ ప్రభుత్వ యంత్రాంగాన్ని సైనిక వ్యవస్థను సైనిక అవసరాల దృష్టిలో రూపొందించడం జరిగింది. విజయనగర రాజులు, తమ రాజ్య ఆదాయంలో అధిక బాగం సైన్యానికి ఖర్చుచేశారు. స్థానిక పాలనావిధానం కూడా, సైనిక అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. రెండో దేవరాయలు, వీరసరసింహరాయలు, శ్రీకృష్ణ దేవరాయలు సైనిక వ్యవస్థలో అనేక మార్పులు తీసుకుకొచ్చారు. నికోలో కాంటె లెక్కను బట్టి రాయల సైన్యమును 90 వేలమంది, రజాక్ లెక్క ప్రకారం లక్షమంది సైనికులు ఉండెవారు. న్యూనిజ్ లెక్కను బట్టి కృష్ణరాయలు 70 వేల కాలిబంట్లు, 32 వేల అశ్వదళం, 550 ఏనుగుల ఉన్న సైన్యముతో రాయచూర్‌పై దండెత్తాడు. రాయవాచకం ప్రకారం రాయల సైన్యములో 12 వందల ఏనుగులు 60 వేల గుర్రాలు 5లక్షల కాలిబంట్లు ఉన్నట్లు తెలుస్తుంది.

విజయనగర సైన్యములో ప్రధానంగా రెండు విభాగాలు ఉండెవి. అవి, అమర నాయంకర సైన్యము, కైజీతం సైన్యము.

**అమరనాయంకర సైన్యము** : అమర నాయక పద్ధతికి కాకతీయుల నాటి నాయంకర విధానం పునాది. ఇది భూస్వామ్య అని చెప్పవచ్చు. రాజ్యాన్ని అమరాలుగా విభజించి, కోరినప్పుడు సైన్యము సరఫరా చేసే నిబంధన మీద విశ్వాస పాత్రులైన నాయకులకు పంచి ఇవ్వడం జరిగెది. సైనిక సహాయానికి ఇచ్చి భూమిని గాని, ఆ భూమిపై ఆదాయం గాని అమరము అని ఒక అర్థము. సైనిక సహకారం మీదనే అమర నాయకులు తమ భూములను క్రింది నాయకులకు పంచి ఇచ్చేవారు. అచ్యుతరాయల కాలంలో 6 లక్షల అమరనాయక సైన్యము ఉండేది అని న్యూనిజ్ అంచనా. రాయవాచకం ప్రకారం 2 లక్షల కాల్‌బలం, 24 వేల అశ్వదళం 12 వందల ఏనుగులు, అమరనాయకులు పోషించేవారు. అమర నాయకులే గాక, సామంత రాజులు , రాష్ట్ర ప్రభువులు అవసరం అయినప్పుడు, రాయలకు సైనిక సహాయం చేసేవారు.

**కైజీతం సైన్యము** : రాజు స్వయముగా జీతము ఇచ్చి పోషించే సైన్యము, కైజీత సైన్యము. ఈ సైన్యములో 5 వందల ఏనుగులు 12 వేల గుర్రాలు, 3 లక్షల కాల్‌బలము ఉన్నట్లు రాయవాచకం చెబుతుంది. ఈ కైజీతం వారి వ్యవహారాలనూ, చూడడానికీ కందాచార శాఖ ఉండెది. ఈ శాఖ అధిపతి సేనాపతి ఇతడు మంత్రి పరిషత్‌లో సభ్యుడు. అంతఃపుర రక్షక దళం మీద గజబలం మీద ప్రత్యేక సేనాధిపతులు ఉండేవారు. ముస్లీమ్ సైనికులకు రాయలు ఈనాము ఇచ్చినాడు అని ఫెరిష్టా వ్రాసాడు. ఈనాములు కాక సైనికులకు

4 నెలలకు ఒక్కసారి రాయలు జీతాలు ఇచ్చినట్లు రజాక్ చెప్పినాడు. కందాచార శాఖ కింద సైనికుల అవసరాలను తీర్చడానికీ, నల్గురు పారుపత్యగార్లు, ఆర్గురు కరణాలు, ఆర్గురు ముడుపు గొల్లలు - సుమారు 3 వేల మంది వరకు పనిచూస్తూ ఉండెవారు. వీరిలో 3 వందలమంది మాలీష్ చేసేవారు. కమ్మరి, కాసే, వడ్రంగి, పనుల వారు 2 వేలమంది మిగిలిన వారు చాకలిలు, మంగలిలు మొదలగువారు. మహానవమినాడు రాయలు కైజీతం సైన్యాన్ని సమీక్షించేవాడు.

**సైనికుల ఎంపిక విధానము :** సైనికులను ఎన్నిక చేయడంలో రాయలు స్వయంగా శ్రద్ధ వహించేవాడు. ధైర్యసాహసాలకు పేరుపొందిన తుళు, కబ్బలి, మెరస జాతుల వారు రాయల సైన్యములో అధిక సంఖ్యాకులు, ఆటవికులైన చెంచు, కోయ, బోయలకు కూడా ప్రత్యేక అవకాశాలు ఉండేవి. ప్రజలలో ధైర్యసౌర్యాలు, యుద్ధ ఉత్సాహం, దేహదార్ఢ్యం పెంపొందించడానికీ అవకాసం కల్పించారు. ద్వంద్వ యుద్ధానికీ ప్రోత్సాహం ఉండేది. విజయనగరం భిన్నభాషా ప్రాంతాల రాజ్యము కాబట్టి వారి సైన్యములో భిన్నత్వము కనిపిస్తుంది. రాజ్యస్థాపన కాలం నుంచి ఇంచుమించు రాయల సైన్యములో ముస్లీమ్‌లు చేరినారు. ఆశ్విక శిక్షణలో ఆరితేరి తర్ఫీదు పొందిన తరుష్కులను ఎక్కువగా చేర్చుకోవడం అయినది. రెండో దేవరాయల కాలం నుండి వారి సంఖ్య పెరిగి, రామరాయల కాలంలో అత్యధికమైనది. రక్షస - తంగడి యుద్ధములో రామరాయలు ఓడిపోటానికీ ఈ ముస్లిమ్ సేనాధిపతులు ద్రోహం ఒక కారణం.

**సైనిక విభాగాలు :** విజయనగర సైన్యములో పదాతి, అశ్వ, గజదళ విభాగాలు ముఖ్యమైనవి. 1520 లో కృష్ణరాయలు, రాయచూర్ యుద్ధానికీ, కాల్‌బలము అశ్విక దళము, గజదళంతో వెళ్ళాడు అని ఆ సైన్యము వెంట నౌకరులు, వ్యాపారులు వెళ్ళారు అని పెయస్ వ్రాసాడు. ఈ యుద్ధములో రాయలు తన సైన్యాన్ని 7 విభాగాలు చేసి, పోరాటం జరిపినట్లు న్యూనిజ్ తెలిపాడు. రక్షస - తంగడి యుద్ధములో విజయనగర సైన్యము 3 విభాగాలుగా ఉండి, శత్రుసేనలను ఎదుర్కొన్నాయి. కర్నూలు దుర్గం మీదికి బుక్కరాజు, రామరాజు నడిపిన సైన్యములో ఒక ఏనుగు, 20 గుర్రాలు, 60 మంది విలుకాండ్రు, 60 మంది ఖడ్గదార్లు, 60 మంది బల్లేలవారు ఒక్కో సైనిక దళంలో ఉన్నట్లు రామరాజీయము పేర్కొంటుంది. నాటి యుద్ధ యాత్ర ఏవిధముగా జరిగేదో, రాజవాహన విజయం అను గ్రంథం విపులముగా వర్ణిస్తుంది.

పశ్చిమ తీరములో విజయనగర రాజులకు, నౌకాదళం ఉండెది. కృష్ణరాయల కాలంలో హోనోవర్ రాష్ట్రాదిపతి తిమ్మాజు నౌకాదళాదిపతి అయినట్లు తెలుస్తుంది. గోవాను ఆక్రమించడంలో, పోర్చుగ్రీసు వారికీ, రాయల నౌకాబలం సహాయం చేసింది. అని ఫాదర్ హిరాస్ వ్రాసాడు.

**యుద్ధములో ఉపయోగించబడిన ఆయుధాలు :** విజయనగర రాజుల కాలంలో యుద్ధములో ఉపయోగించిన ఆయుధాల ప్రసక్తి, నాటి సాహిత్యములో కనిపిస్తుంది. గంగాదేవి వ్రాసిన మధురావిజయం, "కవచధారులను భటులు కృపాణ కర్వణ, ప్రాస, కుంత, కోదండ, పాణులై వచ్చికూడిరి." అని చెబుతుంది. కుమార దూర్జటి రచించిన కృష్ణదేవరాయ విజయం తుపాకి గుండ్లును రాచూరి బాణాములను, ఆంపగములు, బల్లెంపుటిటెగములను పేర్కొంది.

వేంకటనాధుని పంచతంత్రంలో రాచూరు కత్తుల ప్రసక్తి ఉంది. దీనిని బట్టి ఆనాడు రాచూరు ఆయుధ పరిశ్రమకు కేంద్రముగా ఉండెది అని తెలుస్తుంది. సైనికులు చర్మములో చేసిన కవచ శిరస్త్రాణాలు, డాళ్ళు ధరించేవారు. కృష్ణరాయల కాలానికి ముందు విజయనగర సైన్యములో తుపాకులను, ఫిరంగులను వాడలేదు. తరువాతి కాలంలో వీటిని విజయనగర సైన్యములో ప్రవేశపెట్టారు. 1565 తరువాత వచ్చిన గ్రంథాలలోనే వీటి ప్రసక్తి కనిపిస్తుంది.

**వ్యయం :** విజయనగర రాజుల కాలంలో దుర్గాలు ప్రముఖపాత్ర నిర్వహించాయి. గిరి, స్థల, జల, వన అనే నాలుగు రకాల దుర్గాలను సమకాలిక వాఙ్మయ శాసనాలు పేర్కొంటున్నాయి. సరిహద్దులో దుర్గాలు ఎక్కువగా నిర్మించాలి అని అముక్తమాల్యదలో కృష్ణరాయలు పేర్కొన్నాడు. విజయనగరం సరిహద్దుల్లో చాలా దుర్గాలు ఉన్నాయి అని పెయిస్ వ్రాసాడు. ఉదయగిరి, చంద్రగిరి, పెనుగొండ,

కొండవీడు, గుత్తి, కందనవోలు మొదలగు దుర్గాలు ప్రధానమైనవి. దుర్గ రక్షణకు పాషాణ యంత్రాలు, దంబోళి ఉండేవి. శత్రువులు పై రాయి రువ్వే ఫిరంగియే దంబోళి. దుర్గ ఆక్రమణకు లగ్గలు వేసే పద్ధతి ఉంది.

**యుద్ధాలు జరిగిన తీరు :** విజయనగర కాలంలో యుద్ధాలు అతి క్రూరంగా జరిగేవి. యుద్ధానంతరం విధ్వంసక చర్యలు జరిగేవి. అహమ్మద్ నగరాన్ని దున్నించి, ఆముదాలు విత్తినట్లు ఆముక్తమాల్యదలో కృష్ణరాయలు చెప్పాడు. రాక్షస - తంగడి యుద్ధము తరువాత విజయనగరం సర్వనాశనం చేయబడింది. ఈ యుద్ధాల వల్ల ప్రజలు అనేక బాధలకు గురి అయ్యేవారు. "సైనికులు పెసర, దోస, చెరకు, సజ్జ పంటలను తిని పంట పొలాలను బీడులుగా మార్చేవారు. గుర్రాలు వరి చేలను త్రొక్కివేసేవి. రథాలు, బండ్లు, ఏనుగులు వల్ల పంట చేలు నాశనం అయినవి. అందుకు కాపులు మిక్కిలి దుక్కించేవారు అని రాజవాహన విజయం వర్ణించింది.

**రక్షకభట విధానము :** విజయనగర రాజ్యములో రక్షకభట శాఖ ఉన్నట్లు కనిపించదు కాని నేరనిరోధమునకు శాంతిభద్రతల రక్షణకు, విజయనగర రాజులు శ్రద్ధ వహించారు. గ్రామాలలో తలారి గ్రామ రక్షణ బాధ్యత నిర్వహించేవాడు. అందుకు ప్రతిగా ఇతనికీ పంట పొలాల్లో ఈనాము ఇచ్చేవారు. రైతులు, వర్తకులు, పంచాణం గ్రామాలకు అనగా స్థలానికీ, కావలిగారు ఉండెవారు. ఇతనిపై అధికారి దేశకావలిగారు సాధారణంగా చెంచు, కోయ, బోయ మొదలగు జాతులలోని వారిని కావలిగార్లుగా నియమించేవారు. వీరికి కూడా మాన్యాలు ఇచ్చేవారు. పర్వత ఆరణ్య ప్రాంతాల్లో, సరిహద్దులో రక్షణకు పాళెగార్ల ఉండేవారు. ప్రతి పాళెగానికీ రెండు గ్రామాలు జాగీరు ఇచ్చి, కోటలు కట్టుకొనే హక్కు ఇవ్వడం జరిగింది. క్రమముగా వీరు బలవంతులై విజయనగర సామ్రాజ్యం చివరి రోజుల్లో పరస్పర యుద్ధాల్లో మునిగి, రాజ్యములో అశాంతికి కారణం అయ్యారు. రాజధాని నగరంలో రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండెవి. విజయనగరంలో 12 వేల మంది రక్షకభటులు ఉండెవారు. తలారులు రాత్రులందు దివిటీలు ధరించి కాపలా కాస్తు ఉండెవారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, ఆనాడు దొంగతనాలు, దోపిడీలు, దార్లు కొట్టడం చాలా తరచుగా జరుగుతుండెవి అని కొఫియత్తుల వల్ల తెలుస్తుంది.

## 11.1.6. న్యాయస్థానాలు - శిక్షలు

న్యాయ నిర్వహణనకు, విజయనగరంలో క్రమబద్ధమైన న్యాయస్థానాలు లేవు. నిరంకుశ రాజరికాలు అన్నిటిలో వలే విజయనగరములో కూడా రాజ అస్థానమే ఉన్నత న్యాయస్థానము న్యాయ విచారణకు, నిర్ణయానికీ ప్రాచీన స్మృతి గ్రంథాలు ఆధారంగా ఉండేవి. విజయనగర కాలంలో పరాశర మాధవీయం న్యాయ విచారణకు, నిర్ణయానికీ ఆధారముగా ఉండెది. 16వ శతాబ్దంలో ప్రతాపరుద్ర గజపతి రచించిన సరస్వతి విలాసం. దక్షిణ భారతదేశంలోని ధర్మాసనాల్లో న్యాయ విచారణలో మిక్కిలి ప్రాచుర్యం పొందింది. ధర్మాసనాల్లో ప్రాడ్వివాకులు, బ్రాహ్మణ సభ్యులు సహాయంతో నేరాలు, విచారించి తీర్పులు ఇచ్చేవారు. విజయనగర సామ్రాజ్యంలో న్యాయస్థానాలు, చట్టాలు రెండు మూడు గ్రామాలకూ ఒక ధార్మాసనం ఉండేది. నేరాలు సివిల్, క్రిమినల్ అని రెండు రకాలు. ధర్మాసనాల తీర్పుమీద పునర్ విమర్శకు అవకాశం ఉండేది. ధర్మాసనాలు సామాన్యంగా ఆలయ మండపంలో సమావేశం అవుతుండేవి. నిందుతులను హింసించి తద్వారా నేరం ఒప్పించే ఆచారం ఉంది. ప్రాడ్వివాకుల సహాయంతో చక్రవర్తులు, దండనాయకులు నేరాలు విచారించేవారు విజయనగరంలో రాయలకు బదులు ప్రధాని న్యాయ నిర్వహణ జరిపేవాడు అని 'రజాక్' చెప్పాడు. రాయలు పర్యటనలో ఉన్నప్పుడు సైతము, స్థానికులు అతనిని కలసి, తమ వ్యవహారాలు నివేదించుకొనే అవకాశం ఉండేది. దివ్య పరీక్షలు ఉన్నట్లు నికోలో కాంటి పేర్కొన్నాడు.

విజయనగర కాలంలో శిక్షలు కఠినముగా క్రూరముగా ఉండెవి. మోసం చేసిన వర్తకులకు ముక్కుకు నీరెత్తటం, అప్పులు తీర్చలేని వారికీ పోగడం దండలు వేయడం తీవ్ర నేరాలకు కాళ్ళు, చేతులు నరకటం ఏనుగుల చేత తొక్కించడం మొదలగు శిక్షలు ఉండెవి. మరణశిక్ష కూడా ఉండెది. రాజద్రోహానికి మరణశిక్ష విధించేవారు. బ్రాహ్మణులకు మరణశిక్ష లేదు. కనుగుడ్లు తీయించి, యావజీవ కారగార శిక్ష విధించేవారు లేదా గాడిద మీద ఉరేగించి, దేశ బహిష్కారం చేసేవారు.

## 11.2. నాయంకర పద్ధతి - పరిచయం :

విజయనగర యుగములో రాష్ట్రాలను రాజ్యాలనీ, కొన్ని సందర్భాలలో మండలాలనీ పిలిచేవారు. ఆనాడు రెండు రకాల రాజ్యాలు వుండేవి. అందులో మొదటి రకం విజయనగర రాజు ప్రత్యక్షముగా తన ప్రతినిధుల ద్వారా పాలించే రాజ్యాలు. రెండవ రకం అమర నాయంకరులనే సామంతులు పరిపాలించే రాజ్యాలు ఈ రాజ్య పాలకులు తమ పరిధులలో కేంద్రం జోక్యం లేకుండానే స్వతంత్రముగా పరిపాలించేవారు. మనం ప్రస్తుతం చర్చించే అంశం నాయంకర వ్యవస్థ. నాయంకరుల విషయానికి వస్తే వీరు చక్రవర్తికి విశ్వాస పాత్రులైన సామంతనాయకులు. ఈ నాయంకర విధానం విజయనగర ప్రాదేశిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగము. ఈ విధానము మధ్యయుగము ఐరోపాలోని భూస్వామ్య విధానాన్ని గుర్తుకు తెస్తుంది.

విజయనగర యుగపు అమరనాయంకర విధానానికి కాకతీయుల నాటి నాయంకర విధానం పునాది. కాకతీయుల సైనికావసరాలను దృష్టిలో వుంచుకొని వారి రాజ్యపాలనా వ్యవస్థను తీర్చిదిద్దారు. వారి సైన్యంలో మూల బలం, సామంతబలం అనే రెండు రకాలుండేవి. మూలబలం రాజుసేన. రెండవరకం సామంత లేక నాయక సైన్యం. నాయకులు రాజు తమకిచ్చిన గ్రామాల నుంచి వచ్చే ఆదాయంలో కొంత భాగం కప్పముగా చెల్లించి, మిగిలిన దానితో రాజసేనకు నిర్ణీత సైన్యాలను పోషిస్తూ యుద్ధ సన్నద్ధం చేయాలి. ప్రతాపరుద్రుడు ఓరుగల్లు రక్షణకు 77 మంది నాయకులను నియమించాడు. కాకతీయుల నాటి ఈ నాయంకర పద్ధతియే తరువాత విజయనగర చక్రవర్తుల క్రింద పాలనావ్యవస్థ ముఖ్యలక్షణము అయింది.

సైనిక సహాయం కోసము ఇచ్చే భూమిని గానీ, ఆ భూమిపై వచ్చే ఆదాయాన్ని గాని అమరం అంటారు. భూమికి సర్వాధికారియైన చక్రవర్తి తన రాజ్యాన్ని అమరంలుగా విభజించ, వార్షికాదాయములో సగము కప్పముగా చెల్లిస్తూ అవసరం అయినప్పుడు సైన్యం ఏర్పాటు చేసే షరతుల మీద విశ్వాసపాత్రులైన సైనిక నాయకులను పంచి ఇచ్చేవాడు. తమ ఆధ్వర్యములోని సైన్యాన్ని పోషించే బాధ్యత అమర నాయకులదే.

హిందూధర్మాన్ని, సంస్కృతిని రక్షించే లక్ష్యముతో క్రీ.శ. 1336 లో తుంగభద్రానది ఒడ్డున విజయనగర రాజ్యం స్థాపించబడింది. ఈ హిందూరాజ్యం స్థాపించబడిన పది సంవత్సరాలకు క్రీ.శ. 1347 లో దక్కన్‌లో ముస్లిముల బహమనీ రాజ్యం స్థాపించబడింది. విజయనగర - బహమనీ రాజ్యాల మధ్య నిరంతర యుద్ధాలు వుండడం వల్ల విజయనగర ప్రభుత్వ యంత్రాంగాన్ని సైనిక అవసరాల దృష్ట్యా రూపొందించడం జరిగింది. విజయనగర రాజులైన రెండవ దేవరాయలు. వీర నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, ఆళియ రామరాయలు అనేక సైనిక సంస్కరణలు చేసి క్రమశిక్షణలో, యుద్ధతంత్రములో, కౌసల్యములో విజయనగర సైన్యాన్ని పటిష్టముగా రూపొందించారు. సైనిక అవసరాలను దృష్టిలో పెట్టుకొనే విజయనగర రాజులు తమ రాజ్యములో నాయంకర పద్ధతిని ప్రవేశపెట్టారు.

విజయనగర రాజులు సైనిక నిర్వహణ కోసం అమర నాయకులకు గ్రామాలను కేటాయించారు. అమరమంటే వెయ్యి కాల్బలము మీద నాయకత్వము, ఇది అమరము అనే పదానికి నిజమైన అర్థం. కాని కాలక్రమములో విజయనగర సామ్రాజ్య కాములో తమకు యుద్ధ సమయాలలో సహాయపడే నిమిత్తము కొంత నిర్ణీత సైన్యాన్ని నిర్వహించేటందుకు గాను నాయకులకు విజయనగర రాజులు ఇచ్చిన భూములకు అమరమనీ, అమరనాయంకరమనీ, అమర మాగాణీ అని రూఢ్యర్థంలో పిలవడం జరిగింది. అమర నాయకులు అమర గ్రామాలో సైన్య నిర్వహణ కొరకు దుర్గదున్నాయమనే పన్నును వసూలు చేసేవారు. కాకతీయులు నాయంకర విధానం ప్రాథమిక దశలో వుంది. అయితే ఈ కాలంలో కూడా నాయకులు సైనికులు కొరకు పన్ను వసూలు చేసేవారు. అయితే ఆనాడు గ్రామమర్యాదలకూ, గ్రామ సభలకూ వ్యతిరేకముగా అదనపు పన్నులు వేసే అధికారం నాయకులకు వుండేది కాదు. కానీ విజయనగర కాలంలో కేంద్ర ప్రభుత్వం ఈ పన్నుల విధింపును, వసూలును సైనిక నిర్వహణ ప్రధాన అంశముగా భావించి అమర నాయంకరులకు పూర్తి అధికారాలివ్వడం జరిగింది. ఫలితంగా వీరు గ్రామ ప్రజలపై, తమ ఇష్టం వచ్చినట్లు పన్నులు వేసి ప్రజలను పీడించసాగారు. గ్రామ ప్రజలు, కాపులు ఈ పన్నులు భరించలేక గ్రామాలు విడిచి పారిపోయేవారు.

అమర నాయంకర పద్ధతి ఒక విధమైన సైనిక సేవానిబంధన. అమరనాయకుడు రాజునకు యుద్ధ సమయాలలో సహాయపడడానికి కొంత నిర్ణీత సైన్యాన్ని పోషించి, ప్రతియేటా ప్రభువుకు నిర్ణీతమైన పన్ను చెల్లించాలి. నాయంకరములోని పరిపాలనా విషయాలలో నిర్ణయాలు తీసుకోవడానికి నాయంకరులకు పరిమితమైన స్వాతంత్ర్యం వుండేది. అచ్యుతరాయల కాలం నాటి అమర నాయకుల విధులను గురించి న్యూనిజ్ ఈ విధముగా పేర్కొన్నాడు. నాయంకరులు ఆరు లక్షల కాల్బలము, ఇరవై నాలుగువేల గుర్రాలను పోషించి చక్రవర్తి 'సిటరావ్' కు అందించాలి. ఈ నాయంకరులు రాజునుండి భూమిని పొంది, అరవై లక్షలు పన్నుగా చెల్లించాలి. భూమినుండి వారికి వచ్చే ఆదాయం నూట ఇరవై లక్షలు. చక్రవర్తికి చెల్లించగా అరవై లక్షలతో సైన్యాన్ని పోషించాలి.

న్యూనిజ్ పేర్కొన్నట్లుగానే పెయస్ కూడా అమరనాయకుల విధుల గురించి చెప్పాడు. కొన్ని ముఖ్యమైన విషయాలలో అమరనాయక విధానం ఐరోపాలోని భూస్వామ్య (ఫ్యూడల్) విధానాన్ని పోలివుంది. ఐతే ఈ పోలిక కొన్ని విషయాలలో మాత్రమే. ఎందుకంటే నాయంకర విధానంలో భూస్వామ్య సేవా నిబంధన సూత్రాలు ఐరోపాలో ఏర్పడినంత నిర్దిష్టముగా ఏర్పడలేదు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరొక అంశం రాజ్య వ్యవస్థాపరంగా రాష్ట్రపాలకుడైన దుర్గదన్నాయకుడు అమరనాయకుని వంటి వాడు కాదు. వారిద్దరి విధులలో కొంత సామ్యం వుంది. అయినప్పటికీ రాజ్యపాలకుడు రాజప్రతినిధిగా రాష్ట్రాన్ని పాలిస్తాడు. రాజు ఆజ్ఞకు పూర్తిగా బద్ధుడై పాలనా వ్యవహారాలు నిర్వహిస్తాడు. రాజు కోరిక మేరకు మరియు పాలన అవసరాలను బట్టి ఈ దండునాయకుడు ఒక రాజ్యం నుంచి మరొక రాజ్యానికి మారుతాడు. సామాన్యముగా రాష్ట్ర పాలకులుగా బ్రాహ్మణులు వుండేవారు. అమర నాయకులకు వారి అమరములో పాలనా వ్యవహారాలను సంబంధించి కొంత స్వతంత్ర ప్రతిపత్తి వుండేది. సామాన్యముగా నాయంకురులకు అప్పగించిన విధులు సక్రమముగా నిర్వహించినంత కాలం వారిని తొలగించడం వుండదు. ప్రథమములో వ్యక్తిగతముగా ఇచ్చిన అమరాలు కాలక్రమంలో ముఖ్యముగా కేంద్రాధికారం బలహీనంగా వున్న సమయములో వంశపారంపర్యముగా మారాయి. 1565 కు ముందు విజయనగర రాజులు అమర నాయకులను ఒకచోట నుంచి మరొక చోటకు మారినట్లు శాసనాలు చెబుతాయి. అమరనాయకులు సైనిక విధులు నిర్వహించడమే గాక, క్రొత్త భూములు సాగులోకి తేవడం, క్రొత్త గ్రామాలు ఏర్పరచడం మొదలగు ఇతర బాధ్యతలు కూడా వుండేవి.

రాజధాని విజయనగరములో అమరనాయకుల తరపున ఇద్దరు అధికారులు వుండేవారు. వీరిలో ఒకరు సైన్యాధికారి. ఇతడు రాజధానిలో నిలిపిన అమరనాయకుని సైన్యాన్ని పర్యవేక్షించి, దానిమీద అధికారం వహించి వుండేవాడు. మరొక అధికారిని స్థానాపతి అని పిలిచారు. ఇతడు చక్రవర్తికి, అమరనాయయకునికీ మధ్య గల రాజకీయ పరిపాలనా వ్యవహారాలను సరిచూసి, విజయనగరంలో జరిగే విషయాలన్నింటినీ అమరనాయకునికి తెలియచేసేవాడు. స్థానాపతి విధుల గురించి, న్యూనిజ్ పేర్కొన్నాడు. మధుర నాయకరాజైన విశ్వనాథ నాయకుని స్థానాపతి విజయ నగరము నుంచి విశ్వనాథ నాయకునికి పంపిన నివేదిక కృష్ణరాయల చరిత్రను, పాలనా విశేషాలను గురించి తెలిపే రాయవాచకము అనే గ్రంథము. అమర నాయకులు మహామండలేశ అనే బిరుదు ధరించారు. కృష్ణరాయల కాలంలో అమరు నాయక సైన్యంలో 24 వేల గుర్రాలు, పన్నెండు వందల ఏనుగులు, 5 లక్షల కాల్బలము వున్నట్లు తెలుస్తుంది. న్యూనిజ్ మాటలలో విజయనగర సామ్రాజ్యంలో రెండు వందల మంది నాయంకరులున్నారు. విజయనగర మందలి అట్లవణంలో అమరనాయకుల సైన్యాలకు సంబంధించిన లెక్కలు చూసే కరణాలు ప్రత్యేకముగా వున్నట్లు రాయవాచకం చెబుతుంది. చక్రవర్తి పట్ల అమరనాయకుల ప్రవర్తన గురించి ఎప్పటికప్పుడు తెలియచేయడానికి గూఢాచారులను నియమించినట్లు రాయవాచకము చెబుతుంది.

## 11.2.3. ప్రధాన లక్షణాలు

విజయనగర శాసనాలు పరిశీలిస్తే, సామ్రాజ్యంలో ప్రథమము నుంచీ నాయంకర పద్ధతి ఆచరణలో వుందని స్పష్టం అవుతుంది. ఐరోపాలో, జపాన్‌లో భూస్వామ్య వ్యవస్థ స్వామికీ, సామంతులనికీ మధ్యగల సంబంధాలు, కట్టుబాట్లచే నిర్వహించబడింది. ఐరోపాలో మధ్య యుగములోని రాజుకు, సామంతునికీ మధ్యగల సంబంధాలతో మధ్యయుగ భారత చరిత్రలోని రాజుకీ, సామంతునికీ మధ్యగల సంబంధాలతో పోల్చి చూచి, భారతదేశంలో భూస్వామ్య లక్షణాలు కలవని చరిత్రకారులు నిర్ణయించారు. మధ్యయుగ దక్షిణ భారత శాసనాలో, సారస్వతములో రాజు, స్వామి అనే పదాలు సామంతుడు, భృత్యుడు అనే పదాలు సమాన అర్థాలుగా కనబడతాయి.

భూస్వామ్య వ్యవస్థను సాధారణంగా సామంత వ్యవస్థ అని అనువదించవచ్చు. విజయనగర సామ్రాజ్యంలో సామంత వ్యవస్థ నాయంకర లేదా అమర నాయంకర పద్ధతి అనే పేరుతో స్థిరపడింది. నాయక అనే పదం వ్యక్తికీ, సైన్యంతో గల సంబంధాన్ని తెలుపుతుంది. అమరము వ్యక్తికీ, ఆ వ్యక్తి యొక్క సైనిక సేవలకు గాను రాజు ఆమోదముతో కొంత భూభాగము మీద ఏర్పడిన హక్కులను తెలుపుతుంది.

ఐరోపాలోని భూస్వామ్య విధానముతో పోల్చి భూస్వామ్యం అనే పదాన్ని మధ్యయుగ భారతదేశంలతో వున్న భూస్వామ్య విధానానికీ, సామంత వ్యవస్థకు వాడటం సరికాదని కొందరి భావం. ఉదాహరణకు మధ్యయుగ దక్షిణ భారతదేశంలో సైనికపరమైన, వ్యక్తిగత ప్రభుత్వ అధికారాలతో కూడిన రాజ్యవిభాగముగా సామంత రాజ్యం చాలా వరకూ కనపడదని బర్టన్ స్టెయిన్ అభిప్రాయము. అంతేగాక, ఐరోపాలో జపాన్‌లో స్వామికీ, సామంతునికీ మధ్య వున్న సేవా నిబంధనలు భారతదేశంలోని నాయంకర పద్ధతిలో లేదని స్టెయిన్ వాదము. కానీ బర్టన్ స్టెయిన్ అభిప్రాయంలో దక్షిణ భారతదేశంలో కొంతవరకూ సామంతవిధానం వుందనే సూచన ఇమిడి వుంది. నాయంకర విధానం అమరనాయంకర పద్ధతి అనే పేరుతో విజయనగర సామ్రాజ్యంలో పరాకాష్ఠ దశకు చేరింది.

## 11.2.4. మౌళికాంశాల విశ్లేషణ

నాయంకర విధానంలోని మౌళిక అంశాలను ఈ క్రింది విధముగా పేర్కొనవచ్చును. మధ్యయుగ దక్షిణ భారతదేశ చరిత్రలో ఈ మౌలిక అంశాలతో కూడిన రాజకీయ పాలనా వ్యవస్థను అవగాహనలోనికి తెచ్చుకోవడానికి 'ఫ్యూడలిజం' అను ఆంగ్లపదానికి గల భావ అర్థం చాలా అనువైనది.

రాజు తన అవసరాలను బట్టి, తనకు సైనిక సేవలు అందించే సామర్థ్యం గల నాయకునికి కొంత భూమినీ, ఆభూమితో బాటు కొంత స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన అధికారాలను దత్తం చేస్తాడు. రాజు ఈ అమర నాయంకరాన్ని రాష్ట్ర సీమ స్థల గ్రామ స్థాయిలో ప్రసాదించవచ్చు. ప్రతి నాయంకరము స్వతంత్ర ప్రతిపత్తి గల రాజ్యముగా ప్రభుత్వం నిర్వహిస్తుంది. అమర నాయకుడు తిరిగి తన నాయంకరములోని భూభాగాన్ని కొందరు వ్యక్తులకు పంచి ఇవ్వవచ్చు. ఫలితముగా ప్రతి అమరనాయకునికీ స్వంత అధికారముతో వ్యక్తిగత పాలనతో కూడిన రాజ్యభాగం ఏర్పడుతుంది.

విజయనగర సామ్రాజ్యంలో ఏర్పడిన నాయంకర విభాగాలను సైనిక సేవా నిబంధముతో పాలించే పాలకులకు అమర నాయకులు అనేది సాధారణ నామము. ఈ రాజ్యభాగం చిన్నదైనా, పెద్దదైనా దానిని నాయంకరమని పిలిచారు. అయితే అమర నాయకులు తమ బలాన్ని బట్టి, రాజు అనుమతితో మహామండలేశ్వర, నాయంకరాచార్య మొదలగు బిరుదులు ధరించేవారు. అన్ని స్థాయిల వారికి నాయంకరాలు ప్రసాదించినట్లు శాసనాల వల్ల తెలుస్తుంది.

స్థానిక నాయకుల తిరుగుబాటు ధోరణులకు అధికార కాంక్షకు పరిష్కార మార్గముగా రాజు అమరనాయకులకు నాయంకరాలు ప్రసాదించడం జరిగింది. అనగా సార్వభౌమాధికారాన్ని అనేకమంది సామంతుల మధ్య పంపకం చేయడం జరిగింది. కొన్ని సందర్భాలలో స్థానిక వ్యక్తుల నాయకత్వం వహించి, శత్రువును ప్రతిఘటించి, తమంతట తామే అధికారం నిర్వహించడం జరిగింది. అటువంటి వారి అధికారాన్ని రాజు గుర్తించి వారికి వారిస్థాయిలో అమరాన్ని ఇవ్వడం జరిగింది. మరికొన్ని సంధర్భాలలో బందిపోటు నాయకులను అమరనాయకులుగా గుర్తించినట్లు శాసనాల వల్ల గ్రామ కైఫియతుల వల్ల తెలుస్తుంది. ఒక వ్యక్తి లేక నాయకుడు యుద్ధంలో ప్రదర్శించిన ధైర్యసాహసాలకు మెచ్చి కూడ ఒక ప్రాంతాన్ని బహుమతిగా ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి.

నాయంకర విధానం వల్ల స్వయం ప్రతిపత్తి కలిగిన అనేక స్థానిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అమరనాయకులు కొన్ని సందర్భాలలో రాజును ఆ శాసనాలలో పేర్కొనగా, మరికొన్ని చోట్ల రాజు పేరు ప్రస్తావించకుండా మహా మండలేశ్వర బిరుదముతో శాసనాలు ప్రకటించిన సందర్భాలు కూడా కలవు. దక్షిణ భారతదేశంలో అనేక మంది రాజ్యకాంక్షతో అధికారాన్ని హస్తగతము చేసికొని స్వతంత్ర రాజ్యాలు స్థాపించిన సంధర్భాలున్నాయి.

అమర నాయంకరానికి మొదటిగా ప్రసాదించిన సర్వాధికారాలనూ, హక్కులనూ రాజు వారసత్వపు హక్కుగా గుర్తించాడు. ఈ వారసులు శత్రువుల ప్రమాదం నుండి రాజును ఆదుకొనే వారు. అలాగే రాజుకూడా ఈ వారసులను శత్రుదాడులనుండి రక్షించేవాడు.

అమర నాయకుడు రాజు పట్ల తన విశ్వాసాన్ని భక్తినీ ప్రకటించేవాడు. అమరనాయకుని నుండి నాయంకరము పొందినవాడు తన భక్తినీ, విశ్వాసాన్నీ రాజుకూ, అమర నాయకునికీ ప్రకటించేవాడు.

సైన్య సేవా నింబధన, జీవన విధానం చాలావరకు నాయకులందరికీ ఒకటే అయినా వారందరూ సమాన స్థాయికి చెందినవారు కారు. వారి మధ్య సంపదను బట్టి తేడాలుండేవి. ఈ తేడాలను బట్టి ఈ విధానములో అనేక అంతస్తులుండేవి. స్వామి అనుగ్రహముతో అమరనాయకుడు సైనిక సేవల ద్వారా పైస్థాయికి పోవచ్చు.

ఇరుగుపొరుగు రాజ్యాలలోని రాజులనెదిరించి పారిపోయి వచ్చిన నాయకులకు, రాకుమారులకు కూడా రాజులు నాయంకరాలు ఇచ్చారు. సారవంతమైన రాజ్యభాగాలను రాజులు నాయకులకు అప్పగించి, నాయంకరాలు సృష్టించినట్లు శాసనాలలో చెప్పబడింది.

నాయంకర విధానానికంతా మూలాధారం నాయకుడు. రాజునుండి కొంత భూమిని పొంది దానికి ప్రతిఫలముగా అతనికి సైనిక సేవల అందజేయడమని సమకాలిక శాసనాలు, సారసత్వం వల్ల తెలుస్తుంది.

విజయనగర సామ్రాజ్యంలో రాజ్య యంత్రాంగం నాయంకర విధానము పరిణామం చెందిందనే విషయంపై విశ్లేషణ వల్ల తెలియవస్తుంది. పశ్చిమ ఐరోపాలో గల 'ఫ్యూడల్' లక్షణాలన్ని విజయనగర సామ్రాజ్యంలోని నాయంకర విధానంలో కన్పిస్తాయి. అయితే విజయనగర యుగపు నాయంకర విధానములో భూస్వామ్య సేవా నిబంధన సూత్రాలు ఐరోపాలో ఏర్పడినంత నిర్దిష్టముగా ఏర్పడలేదు.

## బర్టన్ స్టెయిన్ ప్రతిపాదించిన వ్యవస్థ

ఇటీవలి కాలంలో బర్టన్ స్టెయిన్ అను అమెరికా చరిత్రకారుడు చోళ, విజయనగర రాజ్య ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించి, 'ఖండిత రాజ్య వ్యవస్థ' సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ఎక్కువగా ప్రచారంలోకి వచ్చి, దక్షిణ భారతదేశ మధ్యయుగ రాజ్య వ్యవస్థకు సంబంధించి చరిత్రకారులు ఎక్కువగా చర్చించడం ప్రారంభించారు. ఫలితంగా ఖండిత రాజ్య వ్యవస్థ సిద్ధాంతానికి ఎక్కువ ప్రచారం వచ్చింది. బర్టన్ స్టెయిన్ సిద్ధాంతము పూర్తి, అవగాహన మీద ఆధారపడి రూపొందించిన సిద్ధాంతం కాదు. అందువల్ల అతని సిద్ధాంతం ఆమోదయోగ్యం కాదు. బర్టన్ స్టెయిన్ విజయనగర రాజ్యవ్యవస్థను గురించిగానీ, అందులో అంతర్భాగం అయిన నాయంకర విధానాన్ని గురించి పూర్తి అవగాహన లేకుండా ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. బర్టన్ స్టెయిన్ సిద్ధాంతం ప్రకారం విజయనగర సామ్రాజ్యంలోని వివిధ రాజ్యాలు. నాయంకర రాజ్యాలు పూర్తిగా స్వయంప్రతిపత్తిగా గలవి. ఇవి దేనికవి ప్రత్యేక భాగాలు. ఈ భాగాలన్నీ రాజ్యము రూపొందడానికి ముందే వున్నాయి. ఈ భాగాలన్నీ చేరి, విజయనగర రాజును తమకు నైతిక పరమైన, ధార్మికపరమైన ఆధిపతిగా గుర్తించినందువల్ల ఈరాజ్య వ్యవస్థ ఏర్పడింది, అమర నాయకులకూ, రాజుకూ మధ్యగల సంబంధం రాజకీయమైనది గాక ఒక విధమైన నైతిక, ధార్మిక సంబంధము. అందువల్ల చోళ విజయనగర సామ్రాజ్యంలో కేంద్ర పాలితమైన అధికార యంత్రాంగం రాజ్య వ్యవస్థలేదని పేర్కొని ఈ రాజ్య వ్యవస్థను ఖండిత రాజ్య వ్యవస్థ అని బర్టన్ స్టెయిన్ పిలిచాడు.

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సంగమ, సాళువ, తుళువ వంశ రాజులలో సమర్థులైన వారి పాలనా వ్యవస్థను పరిశీలిస్తే బర్టన్ స్టెయిన్ సిద్ధాంతం నిరాధారమైందని అర్థం అవుతుంది. ఖండిత రాజ్య వ్యవస్థ సిద్ధాంతాన్ని రూపొందించేటప్పుడు బర్టన్ స్టెయిన్ విజయనగర శాసనాలను సరిగా విశ్లేషించలేదు. అంతేగాక బర్టన్ స్టెయిన్ దక్షిణ భారతదేశ సమాజాన్ని విశ్లేషించిన పద్ధతి కూడా సరియైనది కాదు. ఆర్. చంపకలక్ష్మి, నోబురు కరాషిమా మొదలగు భారతీయ, భారతీయేతర చరిత్రకారులు బర్టన్ స్టెయిన్ ప్రతిపాదించిన ఖండిత రాజ్య వ్యవస్థ సిద్ధాంతాన్ని విమర్శించారు.

## 11.3 ప్రాదేశిక పాలనా వ్యవస్థ

విజయనగర సామ్రాజ్యంలో సాంప్రదాయకమైన రాజరికము అమలు జరిగింది. పాలన సౌలభ్యము కొరకు విజయనగర సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించారు. రాష్ట్రాలు సీమలుగా, స్థలాలుగా, గ్రామాలుగా విభజింపబడ్డాయి. విజయనగర సామ్రాజ్యంలో స్థానిక పాలనా విధానం ఆనాటి సైనిక అవసరాలకు అనుగుణంగా రూపొందించారు. రాష్ట్రాలకు దుర్గం కేంద్రముగా ఉండెది. స్థానిక పాలనా విధానంలో అమరనాయక వ్యవస్థ అంతర్ భాగంగా ఉండెది. గ్రామ వ్యవహారాలను 12మంది ఆయగాండ్రు నిర్వహించేవారు. ఈ కాలంలో గ్రామ స్వేచ్ఛ క్రమముగా సన్నగిల్లడం ప్రారంభమైనది. ఈ యుగం చివరినాటికీ గ్రామ వ్యవస్థలో స్వేచ్ఛ ప్రతిపత్తి కేవలం నామమాత్రంగా ఉండిపోయింది.

### 11.3.1 ఆధారాలు

విజయనగర రాజులు, వారి సామంత, మాండలికులు వేయించిన కన్నడ, ఆంధ్ర, తమిళ శాసనాలు, పరాశర మాథవీయము, ఆముక్తమాల్యధ, సకల నీతిసమ్మతం, రాయవాచకం మొదలగు గ్రంథాలను బట్టి, డామింగొ ఫెస్, న్యూనిజ్ మొదలగు విదేశీ యాత్రికుల రచనల వల్ల విజయనగర సామ్రాజ్య పరిపాలనా వివరాలు లభిస్తున్నాయి.

### 11.3.2 స్థానిక పాలన

విజయనగర సామ్రాజ్యంలో స్థానిక పాలనా విధానం నాటి సైనిక అవసరాలకు అనుగుణంగా రూపొందించారు.

రాష్ట్రము : బలిష్టమైన దుర్గాలు కేంద్రంగా రాష్ట్రాలు ఏర్పడినాయి. విజయనగర సామ్రాజ్య కాలంలో రాష్ట్రాలను, రాజ్యాలు అని పిలిచేవారు. ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రాంతాల్లో స్థానిక పాలన విధానంలో కొన్ని వ్యత్యాసాలు గలవు. తమిళ దేశంలో చోళ యుగంనాటి నాడు, కోట్టం మొదలైన విభాగాల్లో మార్పులేదు. ఆంధ్రప్రాంతంలో రాష్ట్రాలను రాజ్యాలు అని వ్యవహరించారు. విజయనగర శాసనాల్లో, ఉదయగిరి, చంద్రగిరి, పెనుగొండ, రాజగంభీర, కొండవీడు, గుత్తి, కందనవోలు, రాయదుర్గ, ముళుభాగలు, మొదలైన రాజ్యాల పేర్లు కనిపిస్తాయి. వీటిలో గండికోటను కూడాచేర్చవచ్చు. పర్వత నాయకుడు గండికోట రాజధానిగా సిరిబోళ్ళ, సిద్దవట, సకిలి, పొత్తపినాడు రాజ్యాలను పాలించాడు అని స్థానిక చరిత్రుల చెబుతున్నాయి. అచ్యుతరాయలు రాజ్యానికి వచ్చేనాటికీ 17 రాజ్యాలు విజయనగర సామ్రాజ్యంలో ఉన్నట్లు నాటి శాసనాల వల్ల తెలుస్తుంది. అవి 1. హంపి 2. పెనుగొండ 3. గుత్తి 4. కందన వోలు 5. శ్రీశైలం 6. రాయదుర్గం 7. బారకురు 8. అంగ 9. కొండవీడు 10. ఉదయగిరి 11. చంద్రగిరి 12. ముళుబాగాలు 13. పడైవీడు 114. తిరువడి 15. శ్రీరంగపట్నం. 16. రాయచూర్ 17. నిడుగల్లు. ఈ రాజ్యాలే గాక అత్యుతరాయల కాలం నాటి శాసనాల్లో మరోనాలుగు రాజ్యాలను కూడా పేర్కొనబడింది. అవి బురుడుకుంటై, కొంగు, ఆదవాని, చెన్నపట్నం వీటిలో కొన్ని రాజ్యాలు యదార్థముగా రాష్ట్రాని కన్నా చిన్నదైన పాలనా విభాగాన్ని రాజ్యము అనే పేరుతో పేర్కొన్ని ఉండవచ్చు. ఉదాహరణకు కృష్ణదేవరాయల పాలనా ఆరంభంలో గుత్తిని ప్రత్యేక రాష్ట్రముగా పేర్కొనడం జరిగింది. కాని కృష్ణరాయల పాలనా కాలం చివరిలో గుత్తిని పెనుగొండ రాజ్యంలో అంతర్భాగంగా పేర్కొన్నారు. మళ్ళీ అత్యుతరాయల కాలంలో దీనిని ప్రత్యేక రాజ్యంగా పేర్కొన్నాడు.

దణ్ణాయకుడు : దుర్గమ కేంద్రముగా నాడు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఈ దుర్గాధి పతులను రాజు నియమించెవాడు. ఉదయగిరి రాజ్యం వంటి కొన్ని కీలకమైన దుర్గాలను పాలకులుగా, రాజకుమారులు నియమించేవారు. సాధారణంగా దుర్గాధిపతిగా రాకుమారులను, రాజబంధువులను,. విశ్వాస పాత్రులైన మంత్రులను నియమించాలి అని కృష్ణరాయలు అంటాడు.

దుర్గాధిపతులను దణ్ణాయకుడు అని పిలిచేవారు. దానికి కారణం ఇతడు కొంత సైన్యానికీ అధిపతి కావడమే. సరిహద్దు రాజ్యాల దన్నాయకులు మినహా ఇతరులు రాజధానిలోనే ఉంటూ తన రాష్ట్రా వ్యవహారాలనూ కార్యకర్తల ద్వారా నిర్వహించినారు. రాష్ట్రాలలో

ప్రధాని, కార్యకర్త, దళవాయు సామంతాధికారి మొదలైన వారిలో సలహా సంఘం ఉండేది. విరుగాక శ్రీముఖాలను, ఆజ్ఞలను రాయడానికి, రాయాసాలు ఉండేవారు. దుర్గాధిపతులు ధర్మనార్థం వచ్చేవారిని సమయం నేనిపెట్టి, నివేధంచి లోపల ప్రవేశపెట్టడానికి 'అవసరము' అనే ఉద్యోగులు ఉండేవారు. రాజ్యానికి సంబంధించిన లెక్కలు రాయడానికి, సంప్రతులు ఉండెవారు.

దన్నాయకులను సామ్రాజ్య అవసరాలను గమనించి ఒక రాజ్యం నుంచి, మరొక రాజ్యానికి రాజు మార్చడం జరిగేది. శ్రీకృష్ణదేవరాయులు కొండవీడును ఆక్రమించిన తరువాత దానికి తిమ్మరుసును పాలకునిగా నియమించాడు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో, కొండ మరుసయ్య, ఉదయగిరి రాజ్యాన్ని పాలించేవాడు. అత్యుతరాయల కాలంలో రామబట్లయ్య, ఉదయగిరి పాలకుడు. అత్యత రాయల కాలంలోని కొందరూ రాజ్య పాలకులను గురించి వారికి ఆ రాజ్యం నుంచి వచ్చి ఆదాయం గురించి, ఆదాయాన్ని బట్టి వారు పోషించవలసిన సైన్యము, చక్రవర్తికీ, చెందవలసిన ఆదాయ గురించి న్యూనిజ్ తన రచనల్లో పేర్కొన్నాడు.

రాష్ట్ర పాలకులకు నాణేలు ముద్రించడం, పన్నులు మినహాయించడం, కొత్త పన్నులు విధించడం వంటి అధికారాలు ఉండేవి. "దుర్గదన్నాయక నివర్తన" అనే పన్ను వీరు వసూలు చేసినట్లు తెలుస్తుంది. దన్నాయకుడు తన రాబడిలో కొంత రాజుకు చెల్లిస్తూ తనకు నిర్దేసితమైన సైన్యాన్ని పోషించాలి. ఉదయగిరి దన్నాయకుని ఆదాయం 8 లక్షలు అందులో 3 లక్షలు రాజుకు చెల్లించేవాడు. 25 వేల కాల్‌బలము, 15 వందల అశ్వదళం, 40 ఏనుగులు, పోషించేవాడు అని న్యూనిజ్ వ్రాసాడు. అసమర్థులైన చక్రవర్తుల కాలంలో ఈ రాష్ట్ర పాలకులు అనుభవించిన స్వేచ్ఛ చివరకు విజయనగర సామ్రాజ్య విచ్ఛినానికే దోహదం చేసింది.

విజయనగర శాసనాల్లో చావడి, కరణాలు అనేమాటలు తరచూ కనిపిస్తాయి. చావడి, దన్నాయకుని కార్యస్థానము అని, కరణాలు, అందలి గుమస్తాలు అని భావించవచ్చు. దీనిని బట్టి రాష్ట్ర వ్యవహారాలు నిర్వహించటానికి ఒక ఉద్యోగి బృందం ఉన్నది అని తెలుస్తుంది.

**అమరనాయంకరులు :** విజయనగర కాలంలో రెండు రకాల రాజ్యాలు ఉండేవి. విజయనగర చక్రవర్తి ప్రత్యక్షముగా తన ప్రతినిధులైన దన్నాయకుల ద్వారా పాలించే రాజ్యాలు మొదటి రకం అయితే అమరనాయంకరులు అనే సామంతులు పరిపాలించే రాజ్యాలు రెండో రకం. దన్నాయకుల గురించి పైన తెలుసుకోవచ్చు.

అమరనాయక వ్యవస్థ స్థానిక పాలనా విధానంలో అంతర్‌భాగంగా ఉండేది. వీరు చక్రవర్తికి విశ్వాస పాత్రులైన సామంతనాయకులు. విజయనగర ప్రాదేశిక పాలన వ్యవస్థలో ముఖ్యభాగమైన ఈ అమరనాయక విధానం మధ్యయుగపు ఐరోపాలోని భూస్వామ్య విధానాన్ని గుర్తుకు తెస్తుంది. కాకతీయుల కాలం నాటి నాయంకర విధానం దీనికి పునాది.

అమరనాయక వ్యవస్తను అనుకరించి రాజ్యంలోని భూమి అంతటికీ చక్రవర్తి యజమాని. ఈ భూమిని అమరాలుగా విభజించి సైన్య సహాయము చేసే షరతులు మీద నాయకులకు చక్రవర్తి పంచేవాడు. ఇవి పొందిన వారే అమరనాయకులు. సైనిక సహాయంకోసం ఇచ్చే భూమిని గాని, ఆ భూమిపై వచ్చి ఆదాయాన్ని గాని అమరం అని అంటారు. పోర్చుగీసు వారి రచనలను బట్టి ఆనాడు 2 వందల మంది అమర నాయకులు ఉన్నట్లు తెలుస్తుంది. అమర నాయకులు తమ భూములను, తమ క్రింద నాయకులకు పరిచేవారు. కొన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికీ భూస్వామ్య విధానానికీ, అమరనాయక విధానానికీ పోలికలు గలవు. భూమిపై హక్కు, సైనిక సహాయం అనేవి 2 విధానాల సమాన లక్షణాలు. అమర గ్రామాల మీదా, దన్నాయకులకు అధికారం లేదు. దన్నాయకుడు చక్రవర్తి ప్రతినిధి. అమరనాయకుడు చక్రవర్తి యొక్క సైనిక సామంతుడు. అమరం ప్రమాణాన్ని బట్టి అమరనాయకుని హోదా ఉండిది. అమరనాయకుడు ప్రతి సంవత్సరం చక్రవర్తికీ కప్పము చెల్లించాలి. అంతేగాక పండుగ సమయాల్లో కానుకలు సమర్పించాలి. తన నిర్ణీతమైన సైన్యాన్ని పోషించి రాయలకు సహాయం చేయవలెను. తన అమరులలో శాంతి భద్రతల రక్షణకు అతడే బాధ్యుడు. అడవుల తొలగించి వ్యవసాయ అభివృద్ధికీ పాటు పడవలెను. దన్నాయకుల వలే వీరు కూడా. రాజధానిలోన ఉండేవారు. దన్నాయకుల కంటే వీరి స్వాతంత్ర్యము ఎక్కువ. వీరినీ ఒక అమరం నుండి మరొక అమరానికీ మార్చరు. అయితే విధి నిర్వహణలో విఫలమైనవారిని చక్రవర్తి శిక్షించవచ్చు లేదా తొలగించవచ్చు. 1565 వరకు ఈ అమర నాయకుల్లో, వార సత్వ హక్కులు ఏర్పడలేదు. పాలెయగార్లుగా కూడా వ్యవహరింపబడిన అమరనాయకులు

కొందరూ తమ స్వేచ్ఛను దుర్వినియోగపరచి కేంద్రముతో తలపడటము లేదా తమలో తాము కలహించుకోవడం చేసేవారు. అటువంటి సందర్భాల్లో చక్రవర్తి తన బలాన్ని ప్రదర్శించవలసి వచ్చేది.

విజయనగర రాజ్యంలో శాంతి భద్రతల రక్షణకు కావలి వారు తలారులు ఉండేవారు రాజధానిలోనే 12 వందల మంది తలారులు ఉన్నట్లు తెలుస్తుంది. రాజ్య సరిహద్దుల్లో, పాళెగార్లు శాంతి భద్రతలకు బాధ్యత వహించేవారు.

సీమ : విజయనగర సామ్రాజ్యములోని ఇతర పాలనా విభాగాలు, సీమలు, స్థలాలు, గ్రామాలు. రాజ్యము లేక రాష్ట్రములో ముఖ్య విభాగాలు సీమ. సీమపై అధికారి పారుపత్యగారు రాయసంవారు, అవసరికులు, రాచకరణాలు అనే మాటలు శాసనాల్లో కనిపిస్తున్నాయి కాని వీరు సీమలో ఉద్యోగులు అని స్పష్టముగా చెప్పలేము. పారుపత్యగారు సీమ ఆదాయ వ్యయాలపై శ్రద్ధ వహించేవారు. ఇతని అధికారాలు, రైతులకు పట్టాలు ఇవ్వడం, పన్నులు మినహాయించడం క్రొత్త పన్నులు విధించడం. సరితలు ఏర్పాటు చేయడం.

స్థలము : సీమలు, స్థలములుగా విబజింపబడెను. ప్రతి స్థలంలో చావలి ఉండేది. రెడ్డి, గౌడలు, చావళులపై అధిపత్యం వహించారు. వీరికి గ్రామ పాలనలో సన్నిహిత సంబంధము ఉండేది. రెండు మూడు గ్రామాల ఉద్యోగులతో కలసి రెడ్డి, కరణం, నేరస్తులను విచారించి, శిక్షించేవారు.

## గ్రామము

**ఆయగాండ్రు :** గ్రామం పాలనకు పునాది. గ్రామ వ్యవహారాలను 12 మంది ఆయగాండ్రు చూసేవారు. గ్రామాన్ని అశ్రయించుకొని తమ జీవనాన్ని గడిపే కొందరు ఉద్యోగులు ఉండేవారు. వీరు గ్రామ భటులు. వీరిని ఆయగాండ్రు అనేవారు. వీరు సామాన్యముగా 12 మంది వారు రెడ్డి, కరణం, తలారి, చాకలి, మంగలి, వడ్రంగి, కంచరి, కమ్మరి, అగసాలి, కుమ్మరి, నీరువావలి, చర్మకారులు అట్లవణతంత్రం ప్రకారం ఆయగాండ్రు 1. శానబోగు 2. గవుడు 3. కుమ్మరి 4. బడిగె 5. అగస 6. పంచాంగ 7. వాయిద్య 8. మాదిగె 9. అగసార్లు 10. తలారి 11. నేరుగంటి 12. కుంచార. కాకతీయులకాలంలో కూడా వారు ఆంధ్ర దేశంలో ఉన్నారు. కాని వీరికి అనాడు గ్రామ వ్యవస్థలో ప్రాధాన్యం తక్కువ ఉండేది. విజయనగర కాలంలో వీరికి మిరాసి భూములు అనబడి ప్రత్యేక వృత్తులు, ఇవ్వబడింది. వీటిని భటవృత్తి మాన్యాలు అనేవారు. ఇవిగాక ప్రతి రైతు పంటకాలంలో వీరికి 'మేర' లనే మాములు ఇచ్చే ఆచారం ఉండేది. వీరిలో రెడ్డి, కరణం, తలారి, నీరుకావలి కొంత ప్రభుత్వ అధికారము కూడా కలిగి ఉండేవారు. ప్రజలు వీరికి లొంగి ఉండేవారు. రెడ్డి, కరణాల ద్వారానే రాజ ఉద్యోగులు గ్రామ వ్యవహారాలనూ చేస్తూ, ఉండేవారు. గ్రామోపజీవులైన వీరికి ఒక ఉద్యోగహోదా ఉండేది.

**గ్రామాలలోని రకాలు :** విజయనగర కాలం నాటి శాసనాలను పరిశీలిస్తే ప్రభుత్వం గ్రామాలను, 5 రకాలుగా విభజించినట్లు తెలుస్తుంది. అవి 1. అమరగ్రామం 2 ఉంబళి గ్రామం 3. బ్రహ్మదేయగ్రామం. 4. దేవాదాయ గ్రామం. 5. బండారవాడ గ్రామం.

**అమరగ్రామాలు :** అమర గ్రామాలు సైనికుల నిర్వహణ కోసం చక్రవర్తి అమరనాయకులకు ప్రత్యేకించిన గ్రామాలు. అమరం అంటే వెయ్యి కాల్‌బలము మీదా నాయకత్వం కాని కాల క్రమంలో విజయనగర కాలంలో చక్రవర్తులు యుద్ధ అవసరాల కొరకు కొంత సైన్యాన్ని నిర్వహించుటకు, నాయకులకు ఇచ్చిన భూములు అని మరో ఆర్థంలో పిలవడం జరిగింది. అమర నాయకులు అమర గ్రామల్లో సైనిక నిర్వహణ కొరకు పన్ను వసూలు చేసేవారు. కాకతీయుల కాలంలో నాయంకర విధానం ప్రాథమిక దశలో వున్నది. ప్రతాపరుద్రుని కాలం వరకు, ఈ విధానానికి ఒక స్పష్టమైన రూపం ఏర్పడలేదు. కాని ఆ కాలంలో కూడా సైనికుల కొరకు పన్ను వసూలు చేసేవారు. కాని విజయనగర కాలంలో కేంద్రప్రభుత్వం పన్ను విధించి వసూలు చేసే అధికారం అమర నాయకులకు పూర్తిగా ఇవ్వడం జరిగింది. ఫలితముగా ఈ అమర నాయకులు గ్రామ ప్రజలపై తమ ఇష్టం వచ్చినట్లు పన్ను వసూలు చేసి, ప్రజలను పీడించ సాగారు. గ్రామ ప్రజలు, రైతులు ఈ పన్నులు భరించలేక, గ్రామాలు విడిచి పెట్టి పారిపోయేవారు. తరువాత చక్రవర్తులు జోక్యము చేసుకొని అదనపు పన్నులు తొలగించి ప్రజలను తిరిగి, గ్రామాలకు పిలిపించడం జరిగింది.

**ఉంబళి గ్రామాలు :** రాజులు తమ వద్ద ఉన్న మంత్రులకు, న్యాయాధికారులకు ఇతర ఉద్యోగులకు వారి సేవలకు మెచ్చి, ఆ స్థాన పండితులకు, కవులకు, బ్రాహ్మణులకు వారి కవిత్వాన్ని లేక సేవలకు మెచ్చి భూధానాలు చేసి సన్మానించేవారు. బ్రాహ్మణులకు ఇచ్చిన ఇటువంటి ఉంబళి గ్రామాలకు అగ్రహారాలు అని పిలిచారు. కృష్ణరాయలు, పేద్దనకు కోకట గ్రామాన్ని ఉంబళిగా ఇచ్చినట్లు ఒక శాసనం తెల్పుతుంది. ఉంబళి గ్రామాలు మీద ఆదాయం ధానము పొందిన వారికీ చెందుతుంది. వీరికి పల్లకే, గుర్రం, ఏనుగు మెదలగువానిని ఎక్కి గౌరవము తక్కువగా ప్రసాధించబడింది.

**బ్రాహ్మదేయగ్రామలు :** వివిధ శాస్రాల్లో విద్యలలో నిష్ణాతులైన, బ్రహ్మణ ప్రముఖులకు ఆ శాస్త్రాలను, విద్యలను అధ్యయనము చేయడానికీ భోధించడానికీ కావలసిన వసతినీ, సుఖజీవనాన్ని కల్పించడానికీ ఇచ్చిన గ్రామాలనూ బ్రహ్మదేయ గ్రామాలు అని అంటారు. ఈ రకపు గ్రామాలకు అన్ని రకాల పన్నులు మినహాయించబడింది. ఈ రకపు గ్రామాల్లో, ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రామ బ్రహ్మణుల అనుమతితో మాత్రమే ప్రవేశించాలి.

**దేవాదాయ గ్రామాలు :** నిత్య పూజ పునస్కారాలు ఉత్సవాల నిర్వహణకై పూర్తి పన్నుల మినహాయింపుతో గానీ, లేక కొన్ని పన్నుల మినహాయింపుతో గాని ఇవ్వబడిన గ్రామాలు దేవాదాయ గ్రామాలు. ఈ రకానికే చెందినవే మఠపుర గ్రామాలు మఠాధిపతులు ధర్మం చేయడానికై ఇచ్చిన గ్రామాలు ఇవి.

**భండార వాడ గ్రామాలు :** పైన రకపు గ్రమాలు అన్ని పోగా మిగిలినవి భండారవాడ గ్రామాలు. ఈ గ్రామాల నుంచి వచ్చె ఆదాయం నేరుగా చక్రవర్తి ఖజానాకు చెందుతుంది. ఈ రకపు గ్రామాలను రాజ ఉద్యోగులు నిర్వహించేవారు. వీరే దైతులనుంచి పన్ను వసూలు చేసేవారు. ఈ రకపు గ్రామలన్నీ దన్నాయకుని పాలనా పరిధిలో ఉండేవి. భండారవాడ గ్రామల్లో, కొన్నిటినీ పన్ను వసూలు నిమిత్తం, వ్యక్తులకు గుత్తకు ఇచ్చేవారు. వీటిని గుత్తభూములు అని పిలిచేవారు.

**గ్రామ స్వేచ్ఛా ప్రతిపత్తి :** విజయనగర కాలంలో సైనిక పరమైన రాచరిక వ్యవస్థ, బలపడిన కొద్ది, గ్రామ స్వేచ్ఛ క్రమముగా సన్నగిల్లడం ప్రారంభమైనది. కాకతీయుల కాలంలోనే గ్రామ నాయకుని ద్వారా పన్ను వసూలు చేసే విధానం అంతరించి, రాజోద్యోగుల ద్వారా పన్నులు వసూలు చేసే పద్ధతి ప్రారంభమైనది. కాకతీయుల నాటి నాయంకర విధానం విజయనగర కాలంలో బలపడింది. ఈ విధానం క్రింద రాజ్యాన్ని సైనిక పరంగా, అమరాలుగా విభజించారు. ఈ అమరాలు అమరనాయకుల అధీనం క్రిందికీ వచ్చాయి. ఈ అమరనాయకుల క్రింద పనిచేసేవారు క్రమ క్రమముగా గ్రామ ప్రజలపై ప్రత్యక్ష అధికారులు అయ్యారు. ఫలితముగా గ్రామ వ్యవస్థలో స్వేచ్ఛా ప్రతిపత్తి కేవలం నామమాత్రముగా ఉండి పోయింది. ప్రజా ప్రతినిధులకు, గ్రామపాలనా విషయంలో ఎటువంటి అధికారం లేకుండా పోయింది. పూర్వ కాలంలో రాజులు ధాన ధర్మలు గ్రామసభను ఉద్దేశించి చేస్తూ ఉండివారు. గ్రామ కాపుల అనుమతి తోటే దేవాలయాలకూ ధానం చేయడం జరిగేది. కాని సైనికక ప్రాతిపధిక పై రూపొందిన భండారవాడ విజయనగర సామ్రాజ్యంలో కాపుల ప్రశక్తి కనబడదు. అన్ని వ్యవహారాలు అమరనాయకులు, వారి కార్యకర్తలే నిర్ణయించేవారు.

## 11.4 సారాంశము :

విజయనగర రాజులు అధికార వికేంద్రీకరణకు చోటు కల్పించారు. సైనిక అవసరాల దృష్ట్యా ప్రభుత్వ యంత్రాంగాన్ని రూపొందించారు. ప్రజలపై అధిక పన్నుల భారం ఉండేది. అయితే వ్యవసాయాభివృద్ధికి విజయనగర రాజులు కృషి చేశారు. సైనిక వ్యవస్థ విశేష ప్రాధాన్యత కలిగి ఉండేది. రాజాస్థానమే న్యాయస్థానములుగా ఉండేవి. శిక్షలు కఠినంగా ఉండేవి. విజయనగర స్థానిక వ్యవస్థలో కీలకమైనది నాయంకర పద్ధతి. సామ్రాజ్యం రాష్ట్రాలుగా, రాష్ట్రాలు సీమలు, స్థలాలు, గ్రామాలుగా విభజింపబడ్డాయి.

- డా. వి.కె. మోహన్.

పాఠం : 12

# విజయనగర కాలము నాటి ఆర్థిక పరిస్థితులు

## 12.0 లక్ష్యం :

దక్షిణ భారతదేశ చరిత్రలోనే గాక, యావద్భారత చరిత్రలో ఒక ప్రముఖ సామ్రాజ్యముగా విజయనగర సామ్రాజ్యము ఖ్యాతి గాంచినది. ఈ సామ్రాజ్యము సుభిక్షమై సిరి సంపదలతో తులతూగుతుండేది. విజయనగర కాలం నాటి ఆర్థిక పరిస్థితుల గురించి వివరించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## విషయక్రమం :


12.1 పరిచయం

12.2 ఆధారాలు

12.3 వ్యవసాయం

12.4 పరిశ్రమలు

12.5 రాకపోకల సౌకర్యాలు

12.6 వర్తక వాణిజ్యాలు

12.7 శ్రేణులు

12.8 నాణాలు

12.9 సారాంశము


## 12.1 పరిచయం :

విజయనగర సామ్రాజ్య ఆర్థికాభివృద్ధిని విదేశీ యాత్రికులైన న్యూనిజ్, అబ్దుల్‌రజాక్, నికోలోకోంటీ, డామింగో, పేస్ మొదలైనవారు వర్ణించారు. విజయనగర సామ్రాజ్యం సుభిక్షమై, సిరిసంపదలతో తులతూగుతుండేది. అందువల్లనే విజయనగర సామ్రాజ్యం తరచూ బహమనీ సుల్తానుల దాడులకు గురి అయింది. విజయనగర రాజులు ఆర్థిక వనరులను పెంపొందించడంలో గొప్ప కృషి చేశారు. వీరు క్రొత్త భూములను సాగులోకి తేవడమే గాక తటాకాలను త్రవ్వించి, వాటికి నీటి పారుదలా సౌకర్యం కల్పించారు. వీరు పరిశ్రమలకు అధిక ప్రాముఖ్యం ఇచ్చారు. అంతేగాక, విజయనగర రాజులు రాకపోకల సౌకర్యాలు కల్పించి దేశీయ, విదేశీయ వాణిజ్యాన్ని పెంపొందించారు. ఆనాడు రాజ్యంలో మూడు వందల రేవులున్నట్లు, వీటిలో గోవా, మోటుపల్లి ప్రధానమైనవని రజాక్ వ్రాశాడు.

విజయనగర కాలంలో ఆర్థికాభివృద్ధి జరిగినా ప్రజల జీవితం సుఖముగా ప్రశాంతముగా ఉందని చెప్పలేము. దానికి ప్రధాన కారణం విపరీతమైన పన్నుల భారం, తరచూ యుద్ధాలు జరగడం. వీటికి తోడు ప్రజలు దేవతల కొలువుకు యాత్రలు, సంతర్పణలు మొదలైన వాటికి ఎక్కువగా ఖర్చు చేసేవారు. అందువల్ల ప్రజలు సుఖజీవితం గడపలేకపోయారు.

## 12.2 ఆధారాలు :

అతి మహోన్నత దశను అనుభవించిన విజయనగర చరిత్రను తెలుసుకోవడానికి అనేక ఆధారాలున్నాయి. విజయనగర కాలం నాటి సంస్కృతం, కన్నడం, తమిళం, తెలుగు భాషలలో రచింపబడిన అనేక గ్రంథాలు, విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించిన విదేశీరాయబారులైన న్యూనిజ్, రజాక్, కోంటీ, బార్బోసా, నికిటిన్, పేస్ మొదలగు వారి రచనలు ఆనాటి ఆర్థిక పరిస్థితిని తెలుసుకోవటానికి తోడ్పడుతున్నాయి.

## 12.3 వ్యవసాయము :

ప్రజలలో అధిక సంఖ్యాకులకు వ్యవసాయమే ముఖ్యవృత్తి. విజయనగర రాజ్యంలోని భూమి సారవంతమైనదని, వ్యవసాయం సమృద్ధిగా సాగుతున్నదని డామింగో పేస్, న్యూనిజ్ వంటి విదేశీయులు చెప్పారు. రాజులు, వారి ఉద్యోగులు, సామంతులు తటాకాలు, కాలువలు త్రవ్వించి, నీటి పారుదల సౌకర్యం కల్పించారు. తటాక నిర్మాణం సప్త సంతానాలలో ఒకటిగా పుణ్యప్రదముగా నాటి ప్రజలు భావించారు. ఒక తటాకం నిర్మించిన తరువాత దాని క్రింద సాగయ్యే భూమిలో పదవ వంతు చెరువు నిర్మాణానికి, మరమత్తులకు అయ్యే ఖర్చుల కోసం చెరువులను నిర్మించిన వారికి ఇచ్చేవారు. విజయనగర పాలకులు నిర్మించిన చెరువులు అనంతపురం, కడప, ఉదయగిరి, కొండవీడు ప్రాంతాలలో నేటికీ వున్నాయి. బుక్కరాయల కాలంలో పెనుగొండ దగ్గర శిరువేరు తటాకం నిర్మించబడింది. సాళువ నరసింహరాయల కాలంలో అనంతపురం దగ్గర నరసాంబుధి అనే తటాకం నిర్మించబడింది. ఉదయగిరి పాలకునిగా వున్న భాస్కర భవదూరుడు వేయించిన పోరుమామెళ్ళ తటాక శాసనం తటాక నిర్మాణం గురించి వివరముగా తెల్పుచున్నది. శ్రీ కృష్ణ దేవరాయలు పోర్చుగీసు ఇంజనీర్ల సహాయముతో నాగలాపుర తటాకము నిర్మించడమే గాక, పంట కాలువలు త్రవ్వించాడు. కొండ మరసు కొండవీడు రాజ్యములో తిమ్మసముద్రం, కొండ సముద్రాలను నిర్మించారు. ఉదయగిరి రాజ్యములో అనంతసాగరం, కందనవోలులో సిద్దవట తటాకం వ్యవసాయం కొరకు నిర్మించబడింది.

తటాకాల మరమ్మత్తులు, కాలువల నిర్మాణం మొదలగు పనులకు ప్రత్యేకముగా పన్నులు వసూలు చేసేవారు. ఆలయాలు, గ్రామ సభలు వ్యవసాయాభివృద్ధికి కృషి చేసేవి. రాజ్యమంతటా జామ, మామిడి, అరటి, నిమ్మ, కొబ్బరి ఆకు తోటలు విస్తారమనీ, పండ్లు చౌకగా లభిస్తాయనీ డామింగో పేస్ వర్ణించాడు. వరి, జొన్నలు, రేగులు, మినుములు, పెసలు, శనగలు, చెరకు, నువ్వులు, ఆముదాలు మొదలగు పంటలు వుండేవని నాటి సాహిత్యం వల్ల తెలుస్తుంది. వరి ధాన్యములో అనేక రకాలుండేవి. అయినా వరి అన్నం ఆనాడు విలాసవస్తువే.

## 12.4 పరిశ్రమలు :

విజయనగర కాలంలో ప్రతి గ్రామములోనూ వ్యవసాయ సంబంధమైన బెల్లం, నూనె తయారీ వంటి పరిశ్రమలుండేవి. చాలా చోట్ల నీలిమందు తయారు అయ్యేది. శాతవాహన యుగం నుండే ఆంధ్రదేశం వస్త్ర పరిశ్రమకు పేరు పొందింది. రైతు కుటుంబాల స్త్రీలు రాట్నాలపై నూలు వడికేవారు. బట్టల నేత ప్రతి గ్రామంలో సాగింది. ప్రత్తి శుభ్రం చేయడం కొందరి వృత్తియైనట్లు పింజ సిద్ధాయం అనే పన్నును బట్టి తెలుస్తుంది. నేత వృత్తిని సాలి, పద్మసాలి, జాంద్ర, కురుబ, మాల కులాలు అవలంబించారు. కురుబలు, గొల్లలు బహుశా కంబళ్ళు నేస్తుండేవారు. ఆనాడు తాడిపత్రి, ఆదోని, గుత్తి, వినుకొండ వస్త్ర పరిశ్రమకు కేంద్రాలుగా వుండేవి. వస్త్ర పరిశ్రమకు సంబంధించినదే అద్దకం పరిశ్రమ. కరక్కాయ, ఇంగిలీకం, మంజిష్టలతో చేసిన రంగులతో వస్త్రాలకు రంగులు వేసేవారు. వీనిని కలంకారీ బట్టలు అంటారు. వీటికి విదేశాలలో మంచి గిరాకీ వుండేది.

విజయనగర కాలంలో ఆంధ్రదేశం వజ్రాల పరిశ్రమకు పేరుగాంచింది. కర్నూలు, గుత్తి, అనంతపురం ప్రాంతాలలో వజ్రాలు దొరుకుతున్నట్లు అందులో వజ్రకరూరు గనులు ప్రసిద్ధమైనట్లు విదేశీ బాటసారులు పేర్కొన్నారు. నకిలీ వజ్రాలు విజయనగర రాజ్యంలో తయారవుతున్నట్లు బార్బోసా పేర్కొన్నాడు. బంగారు, వెండి నగలు చేయడము కర్ర, ఇనుము, రాగి, కంచు మొదలైన లోహాలతో వ్యవసాయ పనిముట్లు, గృహోపకరణాలు, దేవతా వాహనాలు చేయడములో సిద్ధహస్తులు పంచానం వారు. విజయనగర రాజ్యం పోషిస్తున్న వేలకొలదీ సైన్యాలకు సరిపడు ఆయుధాలు, కవచ శిరస్త్రాణాలు స్థానికంగానే తయారు అయ్యేవి. ఆనాడు సుగంధ ద్రవ్యాలను తయారు చేయడంలో ఆంధ్రులు ప్రసిద్ధికెక్కారు. నగరాలలో పూటకూటి ఇండ్లకు పాలు, పెరుగు, నెయ్యి సరఫరా చేయడం గ్రామాలలో కొందరికి వృత్తి అయింది.

## 12.5 రాకపోకల సౌకర్యాలు :

విజయనగర రాజులు రాకపోకల సౌకర్యాలు కల్పించి, వాణిజ్యాభివృద్ధికి కృషి చేశారు. రాజధాని నుండి రాజ్యం నలుమూలలకు రహదారులుండేవి. ఆనాటి రహదారులలో ముఖ్యమైనవి తిరుపతి బాట, కాశీరామేశ్వరం బాట, విజయనగరం కంచి మధ్య బాట, అహోబలం, పోరుమామిళ్ల, ఐనవోలు కంభంలను కలిపే బాట, మచిలీపట్నం, కోవెలకొండ, కంపిలిని కలిపేబాట. ఎద్దులు, గుర్రాలు, గాడిదలు, ఎడ్లబండ్లు, పల్లకీలు నాటి ప్రయాణ సాధనాలు. రహదారుల వెంట చలివేందిరలు, పూట కూటి ఇండ్లు, సత్రాలు వుండేవి. వారానికోసారి ప్రతి గ్రామంలోనూ సంతజరిగేది. స్థానిక పాలకులు వీటిని ఏర్పాటుచేసే వారు. రహదారుల వెంట దోపిడీ దొంగల బెడద ఎక్కువగా వున్నట్లు స్థానిక చరిత్ర నుండి తెలుస్తుంది. దొంగల గుంపులలో బోయవారు, మాలవారు వుండేవారు దొంగల భయానికి వర్తకులు, యాత్రికులు గుంపులు గుంపులుగా ప్రయాణిస్తుండేవారు దొంగల పద్ధతులు, వారి క్రూర చర్యలు ఆముక్త మాల్యదలో వివరించబడి వుంది.

## 12.6 వర్తక వాణిజ్యాలు :

విజయనగర రాజులు దేశీయ, విదేశీయ వాణిజ్యం పెంపొందించడానికి కృషిచేశారు. విదేశీ వాణిజ్యానికి రేవు పట్టణాలు కేంద్రాలు. విజయనగరంలో మూడు వందలకు పైగా రేవులున్నాట్లు రజాక్ వ్రాశాడు. వాటిలో ఎక్కువ భాగం పశ్చిమ తీరంలో గలవు. తూర్పు తీరములో మైలాపూర్, పులికాట్, మోటుపల్లి ముఖ్యమైన రేవులు. మోటుపల్లి కోసం విజయనగర రెడ్డిరాజుల మధ్య ఎక్కువ కాలం ఘర్షణ జరిగింది. మొదటి దేవరాయలు మోటుపల్లిని ఆక్రమించి అచట ఒక శాసనం వేయించాడు. కాకతీయుల కాలంలో ప్రసిద్ధి గాంచిన ఈ మోటుపల్లి రేవు పట్టణం విజయనగర కాలంలో తన ప్రాముఖ్యాన్ని కోల్పోయింది. ఈ కాలంలో మోటుపల్లి స్థానే పులికాట్ అభివృద్ధి చెందింది. పులికాట్ రేవులో హిందూ ముస్లిం వర్తకులు ఎక్కువగా వాణిజ్యం సాగిస్తున్నారని రాజ్యంలోని అన్ని ప్రాంతాలనుండి రహదారుల మీదుగా అనేక రకాల వస్తువులు ఇచటికి చేరుతాయని, పెగూ, మలాకా, సుమత్రా దీవులతోనూ, మలబాక్, గుజరాత్‌లతోనూ ఎక్కువగా వాణిజ్యం సాగిస్తున్నదని, తూర్పు దీవులు ఎక్కువగా కలంకారీ బట్టలు ఎగుమతి చేసి ధనం గడిస్తున్నదనీ రాగి, వజ్రవైఢూర్యాలు, పాదరసం, పన్నీరు, ధాన్యం ఇచటి వాణిజ్య వస్తువులనీ బార్బోసా తన రచనలలో పేర్కొన్నాడు. ఈ కాలంలోనే విదేశీ వాణిజ్యం అరబ్బుల నుండి పోర్చుగీసుల స్వాధీనమైంది. విజయనగర రాజులు పోర్చుగీసు వారితో సంబంధాలేర్పరచుకొన్నారు. ఆనాటి ఎగుమతులలో ప్రధానమైనవి కలంకారీ వస్త్రాలు, రత్నకంబళ్ళు, సుగంధ ద్రవ్యాలు, వజ్రాలు. ఆనాటి దిగుమతులలో ముఖ్యమైనవి పచ్చకర్పూరం పట్టుబట్టలు, కస్తూరి ముత్యాలు, గుర్రాలు మొదలగునవి.

## 12.7 శ్రేణులు :

ఈ కాలంలో గతంలోవలె వర్తకులు, పంచానము వారు, సాలె, మేదర మొదలైన చేతి పనులవారు సంఘాలుగా ఏర్పడి, (శ్రేణులు) తమ వృత్తులు సాగించారు. వర్తక, చేతి పనుల వారి సంఘాల మధ్య పరస్పర సహకారము వుండేది. నాటి శాసనాలలో 'అయ్యావళి

చాలుమూల' అనే వర్తక సంఘం ప్రసక్తి కన్పించును. ప్రతి ముఖ్య వాణిజ్య కేంద్రంలోనూ ఈ సంఘం యొక్క శాఖ వుండేది. ఈ సంఘానికి ఒక అధ్యక్షుడు వుండేవాడు. ఆలయ మండపములో సాధారణంగా సంఘసమావేశాలు జరిగేవి. ప్రతి సంఘానికి ఒక లాంఛనం వుండేది. స్థానిక పాలనలో వర్తక సంఘాలు కొన్ని విధులు నిర్వర్తించేవి. సభ్యులు ప్రభుత్వానికి చెల్లించవలసిన సుంకాలు వసూలు చేసి, చెల్లించేవి. స్థానిక పాలకులతో కలసి న్యాయనిర్వహణలో సహాయపడేవి.

## 12.8 నాణాలు :

విజయనగర యుగంలో బంగారు, వెండి, రాగి నాణాలు అమలులో వుండేవి. గద్యాణం బంగారు నాణెం. దీనిని వరాహం అని పిలిచేవారు. ఈ వరాహ నాణెం చాళుక్యుల కాలంనుండి వస్తున్నది. శ్రీ కృష్ణ దేవరాయల వరాహం 119.7 వడ్లగింజల బరువు వుండేది. గద్యాణంలో సగం ప్రతాప అనీ, తరువాతివి పణం, చిన్నం అనే పిలిచేవారు. ఎక్కువ వాడుకలో వున్న నాణెం పణం తార్ అనే వెండినాణెం. ఇది పణంలో ఆరోవంతు. జిటలు, కాసు అనేవి రాగి నాణాలు. ఇవిగాక రాజ్యములో విదేశీ నాణాలు కూడా వాడుకలో వున్నట్లు తెలుస్తుంది. కేంద్రప్రభుత్వమే గాక, రాష్ట్రపాలకులు వర్తక సంఘ అధిపతులు కూడా నాణాలు ముద్రించేవారు. స్థానిక చరిత్రల సమాచారం ఆధారంగా విజయనగర రాజ్యం మొత్తం 81 కోట్ల రూపాయలనీ రైస్ అనే పండితుడు అంచనా వేశాడు.

విజయనగర కాలంలో ఆర్థిక కృషి జరిగినా ప్రజాజీవితం సుఖముగా ప్రశాంతముగా కన్పించినట్లు కన్పించదు. అందుకు కారణం పన్నుల భారం అధికం కావడమే. దక్షిణ భారతదేశంలో పన్నుల భారముతో సుంకాధికారుల దౌర్జన్యాలతో ప్రజలు క్రుంగి పోతున్నారని పేస్, న్యూనిజ్ పేర్కొన్నారు. సుంకాధికారులు పన్నులతో బాటు స్వంతానికి కట్నాలు వసూలు చేసేవారు. రైతు రకరకాల పన్నులు చెల్లించవలసి వచ్చేది. తరచూ జరిగిన దక్కన్ సుల్తానుల దాడులలో పంట పొలాలకు నష్టం వాటిల్లేది. దీనికి తోడు గ్రామాలు దోపిడీలకు గురి అయ్యేవి. దీనికి తోడు మూఢ విశ్వాసాలతో జరిపే కార్యక్రమాల వల్ల సామాన్యులు ఆర్థికముగా క్రుంగి పోయారు. రైతులు అంబలి త్రాగి బ్రతికేవారట. పట్టణాలలో ప్రభువులు ఐశ్వర్యముతో, విలాసాలతో తూగుతుండగా సామాన్య ప్రజలు దుర్భర దారిద్ర్యములో మునిగి తేలుతున్నారని రష్యా యాత్రికుడు నికిటిన్ వ్రాశాడు.

## 12.9 సారాంశము :

విజయనగర సామ్రాజ్యం ఆర్థికంగా సుసంపన్నమయినదిగా పేర్కొనబడింది. అయితే ప్రజలపై పన్నుల భారం అధికంగా ఉండేది. వ్యవసాయరంగంలో అగ్రగామిగా ఉండేది. అనేక తటాకాలు నిర్మించబడ్డాయి. విజయనగర కాలంలో పరిశ్రమలు ప్రతి గ్రామంలోనూ ఉండేవి. అనేక వస్తువులు ఎగుమతి చేయబడేవి అలాగే అనేక వస్తువులు దిగుమతి అయ్యేవి. బంగారు, వెండి, రాగి నాణాలు చలామణిలో ఉండేవి. స్థూలంగా చెప్పాలంటే ధనికులు మరింత ధనికులుగా పేదలు పన్నులవల్ల మరింత నిరుపేదలుగా మారే పరిస్థితులు ఉండేవి.

- డా. వి.కె. మోహన్.

పాఠం - 13

# విజయనగర కాలం నాటి సాంఘిక, మత పరిస్థితులు

## 13.0 లక్ష్యం :

దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర కాలం ఒక మహోజ్వల ఘట్టం. సుమారు మూడువందల సంవత్సరాల కాలం ముస్లిం దాడుల నుండి దక్షిణ భారతదేశాన్ని రక్షించి, హిందూ సంస్కృతి రక్షణకు విజయనగర రాజ్యం కృషి చేసింది. విజయనగర కాలం నాటి సాంఘిక, మత పరిస్థితుల గురించి తెలియచేయడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## విషయక్రమం :


13.1 పరిచయం

13.2 సాంఘిక పరిస్థితులు

13.2.1 వర్ణ వ్యవస్థ

13.2.2 ప్రజా జీవనం

13.3 మత పరిస్థితులు

13.3.1 స్మార్త మతము

13.3.2 శైవ మతం

13.3.3 వైష్ణవ మతం

13.4 ఆలయం, మఠము

13.5 మూఢ విశ్వాసాలు - ఆచారాలు


## 13.1 పరిచయం :

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశ సాంఘిక ఆర్థిక జీవనంలో కొన్ని మార్పులు వచ్చాయి. రాజకీయముగా ఆంధ్రదేశంలో కొంత భాగం ముస్లిముల ఆధీనంలోకి, మరికొంత భాగం గజపతుల ఆధీనంలోకి పోయింది. ఇందువల్ల ఈ కాలంలో రాజ్య ప్రజలపై ముస్లిముల ప్రభావం ప్రసరించింది.

విజయనగర కాలం నాటి సాంఘిక, మత పరిస్థితుల గురించి తెలుసుకోవడానికి సమకాలీన రచనలే గాక, విదేశీయుల రచనలు కూడా తోడ్పడుతున్నాయి.

## 13.2 సాంఘిక పరిస్థితులు :

విజయనగర కాలం నాటి సాంఘిక పరిస్థితులను పేస్, న్యూనిజ్ వంటి విదేశీ యాత్రికులు తమ తమ రచనలలో వివరించారు. వీరి రచనలలో ప్రజల జీవనస్థితి చాలా ఉన్నతముగా వివరించినప్పటికీ సామాన్యప్రజలు అనేక బాధలు అనుభవించినట్లు తెలుస్తుంది. దానికి ప్రధాన కారణం సమకాలీన రాజకీయ పరిస్థితులని చెప్పవచ్చు.

## 13.2.1 వర్ణ వ్యవస్థ :

దక్షిణ భారతదేశంలో ఇస్లాం మతం విజృంభించడముతో దానికి విజయనగర సామ్రాజ్యం అడ్డుకట్టగా నిలిచి హిందూ సమాజము సంఘటితమై నూతన ఉత్తేజాన్ని సంతరించుకోవడానికి దోహదము చేసింది. దీనితో కాలం తెచ్చిన అనుభవముతో కొంతవరకు సంస్కరించబడిన సనాతన ధర్మం పునరుద్దరించబడినది. వర్ణాశ్రమ ధర్మానికి పాలకులు, పాలితులు కూడా ప్రాధాన్యత నిచ్చారు. అయితే వర్ణవ్యత్యాసాలు, వైషమ్యాలు పెరిగాయి. సమాజములో బ్రాహ్మణులదే గౌరవ స్థానం. బ్రాహ్మణుల సామాన్యమైన జీవనానికి రజాక్, పేస్ వంటి విదేశీ యాత్రికులు అచ్చెరువొందారు. బ్రాహ్మణుల పట్ల రాజులు చాలా భక్తి కనబరచే వారని, బ్రాహ్మణులకు శిక్షలు చాలా స్వల్పముగా వుండేవని విదేశీ యాత్రికులు వివరించారు. బ్రాహ్మణులలో కూడా పూజారులు, మఠాధిపతులు, భూస్వాములు, ఉద్యోగులు, వర్తకులు, భిక్షులు అనే వర్గాలు వున్నట్లు బార్బోసా పేర్కొన్నాడు. బ్రాహ్మణులలో ఎక్కువమంది వైదిక విద్యాబోధనను, వైదిక వృత్తిని, వైదిక ధర్మాలను అవలంభించారు. విజయనగర చరిత్రలో క్షత్రియులు కన్పించక పోవడం చాలా ఆశ్చర్యకరమైన విషయం.

విజయనగర సమాజంలో మూడవ వర్ణం వారు వైశ్యులు. వీరు క్షత్రియుల స్థానాన్ని భర్తీ చేసినట్లు తెలుస్తుంది. దేశీయ వాణిజ్యం చాలా వరకూ వైశ్యులే నిర్వహించారు. వీరిలో నీతి, నియమాలు కరువయ్యాయి.

విజయనగర సమాజంలో నాలుగవ వర్ణంవారు శూద్రులు. రెడ్లు, వెలమలు, ఇతర కులాల వారందరూ ఈ వర్ణానికి చెందిన వారే. సంగమ వంశస్థుల కాలంలో రాజకీయముగా ప్రాబల్యములో వున్న రెడ్లు, వెలమలు ఆ తరువాత తమ ప్రాముఖ్యాన్ని కోల్పోయారు. శ్రీ కృష్ణ దేవరాయల తరువాత రావెళ్ల, పెమ్మసాని వంటి వంశీయులు సేనానులుగా, సామంతులుగా రాజకీయ ప్రాముఖ్యం వహించసాగారు. సమాజములో భిన్న వర్ణాలలో వచ్చిన చైతన్యము కారణంగా ప్రతి వర్గం ఉన్నత వర్గాల స్థాయిలో కొన్ని ప్రత్యేక హక్కులను, గౌరవాన్ని పొందాలని ప్రయత్నించాయి. ఈ సామాజిక పరిణామంలో భాగంగానే విప్రవినోద వర్గం అభివృద్ధి కొంత సాధ్యమైంది. కమ్మరులు, కంసాలులు, వడ్రంగులు, శిల్పులు కొన్ని హక్కుల కోసం తమలో తాము కలహించుకోసాగారు. నేత పనివారు దేవాలయ పాలనలో, స్థానిక పన్నుల విధింపులో కొంత ప్రాముఖ్యం వహించారు. గొర్రెలు కాసే కంబళత్తారులు చిన్న పాళెయగాండ్రుగా స్థిరపడ్డారు.

ఈ కాలములో క్షురకుల ప్రాధాన్యత పెరిగింది. దొమ్మరులు, జాలర్లు, బోయలు, ఎరుకలు వంటి వారిని పోర్చుగీసు వారు ధన ప్రలోభం చూపి క్రైస్తవములోకి మార్చేవారు. ఈ యుగములో బానిసత్వము కూడా వుండేది. ఈ నాటి వర్గ వైషమ్యాలు, అంటరానితనం మొదలైన సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా వేమన, కనక దాస వంటివారు పోరాటము చేశారు.

## 13.2.2 ప్రజా జీవనము :

విజయనగర కాలంలో రాజులు, ధనవంతులు విలాసవంతమైన **జీవితం గడిపేవారు**. సుగంధ ద్రవ్యాలు, పట్టువస్త్రాలు, కర్పూర విడియాలు, నాట్య వినోదాలు, మధుసేవనం, భోగ స్త్రీలు నాటి రసిక జీవనానికి నిదర్శనాలు. అన్ని తరగతుల ప్రజలకు తాంబూలం అలవాటుగా వుండేది. నాటి సంఘ జీవనంలో తాంబూలానికి ఒక ప్రత్యేకత వుండేది. ఒడంబడికలలో, పెండ్లి ఒప్పందాలలో తాంబూల ప్రధానం జరిగేది. రాజులు తమ సేనాధిపతులకు తాంబూలమిచ్చి, యుద్ధానికి పంపేవారు.

ఈ కాలంలో వివాహానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. కన్యాశుల్కం, వరకట్నం, బాల్య వివాహాలు అమలులో వున్నట్లు ఆనాటి సాహిత్యం వల్ల తెలుస్తుంది. వితంతువులకు ఆదరణ లభించలేదు. సతీసహగమనం ఒక ఆచారముగా వున్నట్లు శాసనాల ద్వారా, విదేశీయుల రచనల ద్వారా తెలుస్తున్నది.

విజయనగర కాలంలో సాని వృత్తికి గౌరవ ప్రదమైన స్థానం వుండేది. రాజ వేశ్యలకు ప్రత్యేక గౌరవం వుండేది. గంగాదేవి, తిరుమలాంబ, మోహనాంగి మొదలైన కవయిత్రులు ఉన్నత గౌరవాన్ని పొందిన సామాన్య కుటుంబ స్త్రీల గురించి ఎటువంటి సమాచారం

తెలియటం లేదు. ఈ యుగంలో వేశ్యా వృత్తి చట్టబద్ధం అయినది. వీరు ప్రభుత్వానికి పన్ను చెల్లించేవారు. వీరు సంగీత నాట్యాలలో ప్రావీణ్యం సంపాదించి, పండుగలు ఉత్సవాల సమయాలలో తమ సంగీత నాట్య ప్రతిభను ప్రజలముందు ప్రదర్శించేవారు.

ఆనాటి పట్టణాలు చాలా అందముగా నిర్మించబడినవని విదేశీ యాత్రికులు పేర్కొన్నారు. ధనవంతులు విలాసవంతమైన భవనాలలో నివశించేవారు. రాజ భవనాలు ఉద్యాన వనాలతో, క్రీడా సరస్సులతో అలరారుచుండేవి. ఇంటి లోపలి గోడలను పౌరాణిక గాథలతో అలంకరించేవారు. సామాన్యులు పెంకుటిండ్లలో, పేదవారు పూరి గుడిసెలలో నివశించేవారు. రాజులు, ధనవంతులు ఖరీదైన దుస్తులు ధరించేవారు. జరీ ధోవతులు, వస్త్రాలు, తలపాగా వీరి ముఖ్య దుస్తులు. సామాన్యులు ధోవతి ఉత్తరీయం మాత్రమే ధరించేవారు. సామాన్య స్త్రీలు ఒకే చీరను నడుముకు చుట్టుకొని, దానినే ఉత్తరీయముగా కప్పుకొనేవారు. వెండి బంగారు ఆభరణాలు ధరించేవారు. ముక్కుకు ముంగర, చెవులకు కమ్మలు, నడుముకు వడ్డాణం, దండ కడియాలు, కాళ్లకు అందెలు, కడియాలు ముఖ్యమైన ఆభరణాలు.

విజయనగర కాలపు ప్రజల ముఖ్యమైన ఆహారం వరి అన్నం. జొన్నలు, సజ్జలు ఆహారముగా తీసికొనేవారు. ప్రజలలో శాఖాహారులు, మాంసాహారులు వున్నారు. ప్రజలు మద్యపానీయాలు సేవించేవారు. మల్లయుద్ధాలు, కుస్తీ పందాలు, గుర్రపు స్వారీ, చదరంగం ప్రజల ముఖ్యమైన వినోదాలు. ఏనుగుల వేటకు రాజులు ఎక్కువ ఆసక్తిని చూపేవారు. సంగీతం, నాట్యం, నాటకాలు ప్రజల వినోదాలు.

## 13.3 మత పరిస్థితులు :

హిందూ మత పునరుద్ధరణ లక్ష్యముగా విజయనగర సామ్రాజ్యం స్థాపించబడడం వల్ల దాదాపు మూడు దశాబ్దాల కాలం దక్షిణ దేశంలో హిందూ మతానికి రక్షణ ఏర్పడింది. విజయనగర పాలకులు వైదిక మతాలైన స్మార్త, శైవ, వైష్ణవ మతాలతో బాటు జైన, వీర శైవ మతాలను కూడా ప్రోత్సహించారు. బౌద్ధమతం కొన్ని ప్రాంతాలలో తప్ప పూర్తిగా అడుగంటి పోయింది. విజయనగర రాజులు హిందూమతావలంభికులు అయినప్పటికీ ఇతర మతాలైన ఇస్లాం, క్రైస్తవ మతాలను కూడా ఆదరించారు. సైన్యంలో ముస్లింలు కూడా స్థానం సంపాదించుకున్నారు. విజయనగరంలో వారి మత స్వేచ్ఛకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించబడినవి. అవసరమైతే తప్ప, సంఘనియమాలలో విజయనగర రాజులు జోక్యం చేసికోలేదు.

తమ అభిమాన మతం ఏదైనప్పటికీ విజయనగర రాజులు సమాన ఆదరణతో చూచారు. శ్రీరంగంలోని వైష్ణవులు జైనులను హింసిస్తుంటే బుక్కరాయలు కల్పించుకొని వారి మధ్య సఖ్యత కుదిర్చినాడు. విజయనగరంలోని విరూపాక్షాలయం ప్రక్కనే జైన ఆలయాలు కలవు. దేవరాయలు జైనులకు ముస్లిములకు కూడా ప్రార్థనా సౌకర్యాలు కల్పించాడు. కృష్ణదేవరాయలు శైవ, వైష్ణవ క్షేత్రాలు రెండూ దర్శించి అచట గోపుర మండపాలు నిర్మించి దానాలు చేశాడు. వీర శైవుడైన లింగప్ప శ్రీశైల ప్రాంతంలో జైనులను హింసించగా కృష్ణరాయలు తిమ్మనాయుడిని అచటికి పంపి దండించాడు. రామరాయలు రాజధానిలోని ముస్లిముల వాడలో గోవధను సమ్మతించాడు. ముస్లిములతో నిరంతరం పోరాడుతున్న విజయనగర రాజులు తమ రాజ్యంలో మతపరమైన ఘర్షణలు లేకుండా చూసి ప్రజలందరి ఆదరాభిమానాలు పొందడం రాజనీతికి నిదర్శనం.

### 13.3.1 స్మార్త మతము :

విజయనగర ఆరంభములో రాజాస్థానములో స్మార్త మతానికి పోషణ లభించింది. సంగమ వంశస్తులు కాలాముఖ శైవులు. వారి కులదైవం విరూపాక్షుడు. వారి కుల గురువు క్రియాశక్తి ఆచార్యులు. ఆనాడు అతివాద శైవం మరుగున పడి, స్మార్త గురుపీఠమైన శృంగేరి ప్రాబల్యంలోకి వచ్చింది. అందువల్లనే హరిహర రాయలు తన సోదరులతో సహా శృంగేరీ దర్శించి మఠాధిపతి అయిన విద్యాతీర్థులకు దాన ధర్మాలు చేసి ఆశీస్సులు పొందాడు. విజయనగరంలో విరూపాక్షాలయము కేంద్రముగా స్మార్త మతశాఖ ఏర్పడింది. వైదిక విద్యలో పాండిత్యము వున్న మాధవుడు బుక్కరాయల మంత్రి. మాధవుడు అతని తమ్ముడు శాయణుడు వేదాలకు, స్మృతులకు

భాష్యాలు వ్రాశారు. బుక్కరాయల చివరి కాలంలో స్మార్త పీఠాధిపతియైన విద్యారణ్య స్వామి ప్రాబల్యం వహించాడు. ఈ యుగ ప్రముఖ అద్వైత గురువులలో అప్పయ్య దీక్షితుడు చివరివాడు. ఇతడు రెండవ వెంకటపతి రాయల ఆస్థానంలోని వాడు.

## 13.3.2 శైవ మతము :

స్మార్త మతం రాజాస్థానానికీ బ్రాహ్మణులలో కొందరికి మాత్రమే పరిమితం. సామాన్య ప్రజలలో భక్తి ప్రధానమైన శైవ వైష్ణవాలకే ఆదరము ఉంది. శైవ మత శాఖలలో కాలాముఖ వీర శైవాలకు పరిమితముగా ఆదరణ వుంది. సంగమ వంశస్థులలో దేవరాయల వరకు కాలాముఖ ఆచార్యుడైన క్రియాశక్తి కుల గురువు శ్రీ విరూపాక్ష అనే పదముతో వారి శాసనాలు ముగుస్తున్నవి. బనవాసి రాజ్యాన్ని పాలించిన మాధవ మంత్రి గురువు కూడా క్రియా శక్తే. క్రమముగా తీవ్రవాద శైవ మత శాఖలు త్రిపురాంతకం శ్రీశైలం వంటి ప్రాంతాలకే పరిమితమైనవి.

## 13.3 వైష్ణవ మతము :

విజయనగర యుగంలో వైష్ణవ మతం ఎక్కువగా ప్రచారం అయింది. ఈ మతానికి ఎక్కువగా రాజాదరణ లభించింది. వైష్ణవములో ద్వైత విశిష్టాద్వైత అను రెండు ప్రధాన శాఖలున్నాయి. ద్వైత మత స్థాపకుడు మధ్వాచార్యుడు. విశిష్టాద్వైత మత స్థాపకుడు రామానుజుడు. ఆంధ్ర దేశ పర్యటనలో మధ్వాచార్యుడు శిష్యులుగా స్వీకరించిన వారిలో ఒకడైన పద్మనాభ తీర్థులు మధ్వాచార్యుల తర్వాత ద్వైత గురుపీఠం అలంకరించాడు. మరొక శిష్యుడైన నరహరి తీర్థులు ఉత్తరాంధ్రములో ద్వైత మతాన్ని ప్రచారం చేశాడు. రాజధానిలో ప్రసిద్ధ ద్వైతాచార్యులు వ్యాసతీర్థులు. ఇతడు సాళువ నరసింహుని గురువు. నరసింహుని కోరికపై వ్యాసతీర్థులు తిరుపతిలో అర్చకత్వము నిర్వహించి, నరసింహుడు రాజ్యానికి రాగానే రాజధాని చేరాడు. వ్యాసతీర్థులు గొప్ప విద్వాంసుడు. ఇతని పట్ల కృష్ణరాయలకు అపారమైన అభిమానం. ద్వైత మతము కూడా ప్రజలలో ఆదరణ పొందలేదు.

సాళువ నరసింహుని కాలం నుండీ వైష్ణవానికి రాజధానిలో బలం పెరిగింది. నాటి వైష్ణవ కుటుంబాలలో తాళ్లపాక, తాతాచార్య కుటుంబాలు ప్రసిద్ధాలు. తుళువ, ఆరవీటి వంశాల వారికి తాతాచార్య కుటుంబంవారు కులగురువులైనారు. కృష్ణరాయలు తాతాచార్యులను గురువుగా చేశాడు. రామరాయలకు కూడా గురువు తాతాచార్యులే. ఆరవీటి వంశంలోని వారందరూ వైష్ణవులే. శ్రీ రంగ రాయల గురువు తిరుమల తాతాచార్యుడు. ఆరవీటి రెండవ వెంకటపతి పాలన నుండి శాసనాలలో వెంకటేశ్వరుని పేరు కన్పించును. అతని నాణాల మీద కూడా వెంకటేశ్వర పేరు కన్పిస్తుంది.

## 13.4 ఆలయం, మఠము:

విజయనగర కాలంలో మత విద్యలకు, సాంప్రదాయాలకూ ఆలయం, మఠం పట్టుకొమ్మలుగా నిలిచాయి. ఈ కాలంలో ఆలయ నిర్మాణం విరివిగా సాగింది. పాత ఆలయాలకు కొత్తగా గోపుర మండపాలను సమకూర్చారు. తిరుపతి, శ్రీ శైలం, అహోబలం, కాళహస్తి నాటి ప్రసిద్ధ క్షేత్రాలు. తిరుపతి, అహోబలాలను తుళువ, ఆరవీటి వంశపు రాజులు ఎక్కువగా ఆదరించి పోషించారు. ఉత్సవాలు, తిరునాళ్ళు నిర్వహించి ఆలయాలు ప్రజలను ఆకర్షించాయి. ప్రజల ఆర్థిక, సాంస్కృతిక జీవితములో ఆలయం కీలక పాత్ర నిర్వహించింది. సాధారణంగా మఠాలు ఆలయాలకు అనుబంధముగా వుండేవి. కడప జిల్లాలోని పుష్పగిరిలో శృంగేరీ స్మార్త మఠశాఖ స్థాపించబడింది. శ్రీశైలంలో వీర శైవ మఠాలుండేవి. తిరుపతి, అహోబలాలలో వైష్ణవ మఠాలు వుండేవి. వైష్ణవ గురువులు (ఆళ్వారులు) దేశ సంచారం చేస్తూ తమ మతాన్ని ప్రచారం చేశారు.

## 13.5 మూఢ విశ్వాసాలు - ఆచారాలు :

విజయనగర కాలంలో ప్రజలలో మత పరమైన మూఢ విశ్వాసాలు ఆచారాలు ఎక్కువగా వుండేవి. ఒక దేవుడు తమ కోర్కెలను తీర్చలేడని గానీ లేక ఒక దేవుని ఆరాధిస్తే ఇతర దేవతలకు ఆగ్రహం వస్తుందని ప్రజలు భావించి అనేకమంది దేవతలను ఆరాధించడం

ఎక్కువ అయింది. స్మార్త మతస్థులు పంచాయతన ఆరాధన చేసేవారు. ఈ అయిదుగురు దేవతలకు కుమారస్వామిని చేర్చడం జరిగింది. ద్వైతము వల్ల హనుమంతుని పూజకు ఆదరణ పెరిగింది. మహారాష్ట్రము నుండి విఠోభా ఆరాధన ప్రవేశించింది. కృష్ణరాయలు విఠోబా భక్తుడు. గ్రామ దేవతారాధన ఎక్కువగా వుండేది. సహగమనం చేసిన వారు దేవతలై పూజలందుకొన్నారు. శకునాలలో, దయ్యాలు, భూతాలలో ప్రజలకు నమ్మకం విపరీతముగా పెరిగింది. గ్రామ దేవతలకు జంతుబలినిచ్చేవారు. రాజధానిలో నవరాత్రులలో ప్రతిరోజూ 24 దున్నలు, 150 మేకలు, చివరి రోజు 250 దున్నలు, 400 మేకలు బలి ఇస్తారని పేస్ రచనల వలన తెలుస్తున్నది. ప్రజలు రకరకాల మొక్కులు మొక్కి వానిని జాతరలలో తీర్చేవారు. వానిలో సిడమెక్కి ఆడడం, వీపు కండలివ్వడం, నిప్పులపై నడవడం మొదలగు క్రూర ఆచారాలు వుండేవి. విజయనగరంలో శివరాత్రినాడు సిడమెక్కే వారని, రథోత్సవములో రథానికి వున్న ఇనుప గాలాలకు వీపు చర్మం గుచ్చి వ్రేలాడతారని కాంటీ వ్రాశాడు. ఈ రకమైన క్రూర ఆచారం నేటికీ చిత్తూరు మొదలగు చోట్ల కన్పిస్తుంది. అపారమైన కష్టనష్టాలను, దోపిడీ దొంగల ఉపద్రవాలను లక్ష్యం చేయక తీర్థయాత్రలకు వెళ్లేవారు.

## 13.6 సారాంశము :

విజయనగర కాలంలో వర్ణవ్యవస్థ ఉన్నప్పటికీ క్షత్రియులు కనిపించకపోవటం విశేషం. వివాహానికి ప్రాముఖ్యత ఉండేది. విజయనగర రాజులు పరమత సహనం కలిగి ఉన్నారు. హిందూ మతంతో పాటు ఇస్లాం, క్రైస్తవ, జైన మతాలకు ఆదరణ ఉండేది. అంతేకాక స్మార్త, శైవ, వైష్ణవ మతాలు ప్రచారంలో ఉండేవి. ప్రజలలో మతపరమైన మూఢ విశ్వాసాలు అధికంగా ఉండేవి.

- డా. వి.కె. మోహన్.

పాఠం - 14

# విజయనగర కాలపు దేవాలయ వాస్తు, శిల్పకళలు

## 14.0 లక్ష్యం :

విజయనగర రాజులు కృష్ణానదికి దక్షిణంగా వున్న ప్రాంతాలను సమైక్యం చేసి, ముస్లిముల విస్తరణను అరికట్టి సుమారు మూడు శతాబ్దాలు భారతీయ మత సంస్కృతులకు రక్షణ, పోషణ కల్పించారు. విజయనగర కాలము నాటి వాస్తు, శిల్ప కళల గురించి తెలియచేయడమే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## విషయక్రమం :


14.1 పరిచయం

14.2 వాస్తుకళ

14.2.1 దేవాలయ ముఖ్య లక్షణాలు

14.2.2 హంపి దేవాలయాలు

14.2.3 ఇతర ప్రాంతాల దేవాలయాలు

14.2.4 భవనాలు

14.2.5 లౌకిక వాస్తుకళ

14.3 శిల్పము

14.4 చిత్రలేఖనము

14.5 సారాంశము


## 14.1 పరిచయం :

దక్షిణ భారతదేశ చరిత్రలో స్వర్ణయుగాన్ని సృష్టించిన విజయనగర సామ్రాజ్యం క్రీ.శ. 1336 లో హరిహర బుక్క సోదరులచే విద్యారణ్య స్వామి ఆశీస్సులతో స్థాపించబడింది. సుమారు మూడు శతాబ్దాల కాలం హిందూ సంస్కృతికి రక్షణగా నిలిచింది ఈ సామ్రాజ్యం. విజయనగర రాజులు లలిత కళలన్నింటినీ సమానముగా ఆదరించారు. వీరి ఆధ్వర్యములో హిందూ దేవాలయ వాస్తు కళ పరాకాష్ఠను అందుకొన్నది. వీరి రాజధానియైన విజయనగరం ప్రస్తుత హంపి. ఇది నేటి కర్ణాటక రాష్ట్రంలో హాస్పేట్‌కు సమీపంలో వుంది. ప్రపంచ ప్రఖ్యాత చారిత్రక నగరాలలో ఇది ఒకటి. విజయనగర దేవాలయాలు ప్రధానంగా హంపిలో కన్పిస్తాయి. విజయనగర రాజులు పరమత సహనం ప్రదర్శించారు. అందుకు నిదర్శనముగా ఈ కాలము నాటి హంపిలోని జైన, మహమ్మదీయ, క్రైస్తవ కట్టడాలు పేర్కొనవచ్చు.

హంపి విజయనగరంలోని విఠల ఆలయం, హజారా రామాలయం, దసరా దిబ్బ, పద్మ మహల్, ఏనుగుల శాల, ఏకశిలారథం, వినాయక లక్ష్మీనరసింహ విగ్రహాలు, ఇతర రాజప్రాసాద దుర్గ నిర్మాణాలు, పెనుగొండ, చంద్రగిరి, వెల్లూరు రాజప్రాసాదాలు, కుంభకోణం,

కంచి, తాడిపత్రి, శ్రీరంగం, కదిరి, గోరంట్ల, నాగాలాపురం, నారాయణ వనం, సోమపాలెం, మార్కాపురం, వెంకటరెడ్డి పల్లి, పుష్పగిరి విరంజపురంలలోని ఆలయాలు, వాటి గోపురాలు, కళ్యాణ నాట్యమండపాలు, కుడ్య శిల్పాలు, చిత్రలేఖనం, విజయనగర సామ్రాజ్యకాల. నాటి, కళా వైభవాన్ని నేటికీ చాటుతున్నాయి. కూచిపూడి భాగవతం, యక్షగానం, విజయనగర కాలం నాటి సృష్టియే.

## 14.2 వాస్తుకళ :

విజయనగర చక్రవర్తులు, వారి రాజధాని నగరంలోనూ, వారి సామ్రాజ్యంలోని అనేక ఇతర ప్రాంతాలలోనూ అద్భుతమైన దేవాలయాలు నిర్మించారు.

### 14.2.1 దేవాలయ ముఖ్య లక్షణాలు :

విజయనగర రాజులు నిర్మించిన ఆలయాలకు సువిశాలమైన ప్రాంగణం, ఎత్తైన గాలి గోపురాలు, శిలాప్రాకారాలు, గంభీరమైన విమానం, దేవీ ఆలయం రంగ మండపం, కళ్యాణ మండపం ముఖ్య లక్షణాలు. సాధారణంగా ఈ మండపాలు విశాలముగా వుండి, వివిధ రూపాల స్తంభాలతో సహస్ర స్థంభ మండపాలుగా ప్రసిద్ది చెందాయి. ఈ స్థంభాలను ఒకే రాయితో వ్యాళ అశ్వారూఢులైన యోధులు స్థంభం నుంచి బైటకు దూకుతున్నట్లు మల్చబడింది. స్థంభ అగ్రాన గల 'కార్బల్' సంపుల్ల పుచ్ఛాకృతి కలిగి వుంటుంది. వీరు దేవాలయాల నిర్మాణానికి నల్లటి కఠిన శిల, ఇసుకరాయి ఉపయోగించారు. పల్లవ, చోళ, చాళుక్య ఆలయాల లాగా, వీరి ఆలయాలలో కూడా గర్భగృహం, ప్రదక్షిణా పదం, అంతరాళము, ముఖమండపం అనే అంగాలున్నాయి. విజయనగర ఆలయాల అధిష్ఠానాలు సుమారు ఆరు మొదలు పన్నెండు అడుగుల ఎత్తు కలిగి వున్నాయి. విజయనగర తొలి ఆలయాలలో దేవకోష్ఠాలు కలవు. కానీ ఆ తరువాత ఆలయ వాస్తువులో దేవకోష్ఠాల స్థానే ప్రత్యేక దేవాతా గృహాలు పరివార దేవతలకు నిర్మించే ఆచారం ప్రారంభించారు. విజయనగర రాజులు నిర్మించిన తొలి ఆలయాలలో చాళుక్య శైలి స్పష్టంగా కన్పిస్తుంది. క్రమముగా వీరి శైలిలో చోళ సాంప్రదాయాలు చోటు చేసికొన్నాయి.

### 14.2.2 హంపి దేవాలయాలు :

విజయనగర దేవాలయ నిర్మాణం తుళువ వంశస్థుల కాలంలో పరాకాష్ఠ చెందినది. విజయనగర దేవాలయాలకు సాధారణంగా గర్భగృహం, అంత రాళం, ముఖ మండపం, రంగమండపం వుంటాయి. హంపిలోని హజారా రామాలయం, విఠలస్వామి ఆలయం విజయనగర రాజుల వాస్తు శిల్పకళా నైపుణ్యానికి మచ్చుతునకలు. విఠల ఆలయ నిర్మాణం రెండవ దేవరాయల కాలంలో ప్రారంభము అయినది. ఈ దేవాలయానికి గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణా పదం, ముఖ మండపం, సంగీత మండపం అనే భాగాలు కలవు. ఈ ఆలయం దీర్ఘ చతురస్రాకారపు ప్రాకారం మధ్యలో నిర్మించబడినది. ఈ ఆలయానికి మూడు వైపులా గోపురాలు వున్నాయి. ఈ ఆలయంలోనే సప్తస్వరాలు వినిపించే స్థంభాలున్న మండపము కలదు. ఈ మండపానికి సమీపములోనే ఏకశిలారథము వున్నది. ఈ రథానికి కూడా గర్భగృహం, అంతరాళం, ముఖమండపం అను భాగాలు కలవు.

హజార రామాలయాన్ని శ్రీ కృష్ణ దేవరాయలు వ్యక్తిగతముగా పూజలు చేయడానికి నిర్మించాడు. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, స్థంభాల మండపం కలవు. ముఖ మండడపానికి మూడు వైపులా వరండాలు కలవు. ఆలయం చుట్టూ ప్రాకారము కలదు. ముఖ మండపంలోని స్థంభాల మీద అంతరాళం, గర్భగృహం, వెలుపలి గోడలమీద పౌరాణిక రామాలయ దృశ్యాలు రమ్యముగా చెక్కబడ్డాయి. హజార రామాలయం హిందూ ఆలయ వాస్తురీతిలో నేటికీ నిలిచి వున్న ఒక ఆణిముత్యమని లాంగ్ హర్స్ట్ అనే పండితుని అభిప్రాయం.

హంపిలో అచ్యుత రాయలు తన పేరుతో అచ్యుతరాయ ఆలయాన్ని, పట్టాభిరామాలయాన్ని 1539 లో నిర్మించాడు. ఈ ఆలయం తళ్లికోట యుద్ధంలో ముస్లిములచే నాశనము చేయబడింది. ఈ ఆలయం చాలా వరకు విఠల ఆలయాన్ని పోలి వుంటుంది. గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణా పదము, ముఖమండపం, మహామండపం ఈ ఆలయ ప్రధాన అంగాలు. ఈ ఆలయ ప్రాంగణంలోనే దేవి గృహము కలదు.

హంపి బజారుకు ఎదురుగా వున్న పంపాపతి లేక విరూపాక్ష ఆలయం ఎత్తయిన గోపురముతో సువిశాల ఆవరణములో సుందర స్థంభాలతో, కళ్యాణ మండపముతో, వర్ణ చిత్రాలతో నేటికీ చెక్కు చెదరకుండా నిలిచివుంది. ఈ ఆలయం విజయనగర రాజ్య స్థాపనకు ముందే నిర్మించినట్లు కొందరి భావం. ఆలయ కళ్యాణ మండపాన్ని శ్రీ కృష్ణదేవరాయలు నిర్మించినట్లు ఆధారం కలదు.

## 14.2.3 ఇతర ప్రాంతాల దేవాలయాలు :

విజయనగర రాజులు తమ రాజధాని నగరములోనే గాక, అనేక ఇతర ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించారు. వీరు నిర్మించిన ఆలయాలు లేపాక్షి, తాడిపత్రి, పుష్పగిరి, చంద్రగిరి, పెనుగొండ, కదిరి, గోరంట్ల, నాగలాపురం, నారాయణ వనం, సోమపాలెం, శ్రీశైలం, మార్కాపురం, వెంకటరెడ్డి పల్లి, వెల్లూరు కంచి, విరంజపురం మొదలగు చోట్ల గలవు. విజయనగర రాజులు తిరుపతి, శ్రీశైలం, కాళహస్తి మొదలగు ఆలయాలకు గోపురాలు సమకూర్చారు. అహోబలం, మార్కాపురం, సింహాచలం మొదలగు ఆలయాలలో మండపాలు నిర్మించారు.

విజయనగర వాస్తు శిల్ప చిత్ర కళలకు ప్రసిద్ధి చెందింది లేపాక్షి. ఇది అనంతపురం జిల్లాలో వుంది. ఈ గ్రామానికి ఆనుకొని వున్న కొండమీద వీరభద్రేశ్వర ఆలయం వుంది. దీనిని విజయనగర రాజు అచ్యుత దేవరాయల కాలంలో పెనుగొండ మండలాధిపతిగా వున్న విరూపన్న నిర్మించాడు. ఈ ఆలయ ప్రధాన అంగాలు గర్భగృహం, ముఖ మండపం, నాట్యమండపము, కళ్యాణ మండపము. విజయనగర వాస్తు కళకు పరాకాష్ఠ అనంతపురం జిల్లా తాడిపత్రిలో గల చింతల వెంకట రమణ, బుగ్గరామలింగేశ్వర ఆలయాలు. వెంకటరమణ ఆలయాన్ని రెండవ దేవరాయల కాలంలో తాడిపత్రిని పాలిస్తున్న రామలింగనాయుడు, తిమ్మనాయుడు నిర్మించారు. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, కళ్యాణ మండపం, మహామండపము వున్నాయి. ఆలయ ముఖ ద్వారం గోపురం ఎత్తు 20 అడుగులు, గర్భాలయం పైన రెండంతస్థుల విమానం వుంది. రామలింగేశ్వర ఆలయానికి మూడు గోపురాలు వున్నాయి. ఈ గోపురాలు హంపిలోని విఠలాలయ గోపురాల కంటే సుందరమైనవి. ఈ ఆలయాన్ని కూడా రామలింగనాయుడు నిర్మించినట్లు తెలుస్తుంది.

## 14.2.4 భవనాలు :

విజయనగర రాజులు అద్భుతమైన కోటలు రాజప్రాసాదాలు నిర్మించారు. రెండవ దేవరాయల కాలంలో విజయనగరాన్ని పారశీక రాయబారి అబ్దుల్ రజాక్, ఇటలీ యాత్రికుడు నికోలో కాంటే సామ్రాజ్య వైభవాన్ని వర్ణించాడు. వారి మాటలలో చెప్పాలంటే విజయనగరం చుట్టుకొలత 60 మైళ్ళు, నగరం చుట్టూ ఏడు ప్రాకారాలు కలవు. ఒక ప్రాకారానికీ, మరో ప్రాకారానికీ మధ్య పంట పొలాలు కలవు. ఏడవ ప్రాకారం లోపల అత్యంత మనోహరమైన రాజప్రాసాదం, ఉన్నతోద్యోగుల భవనాలు వున్నాయి. విశాలమైన రోడ్లు, ఇరువైపులా ఆలయాలతో నగరం తీర్చిదిద్దబడింది. ఇటువంటి నగరాన్ని కనీవినీ ఎరుగము.

హంపి కోటగోడలు, బురుజులు, రాజప్రాసాదాలు, నీటి పారుదలా సౌకర్యం, స్నాన వాటికలు, దసరా దిబ్బ, దర్బారు హాల్లు, అశ్వగజశాలలు, పద్మమహల్, తులాబారము, చంద్రగిరి కోటలోని వేసవి విడిది, మధురలోని తిరుమల నాయక ప్రాసాదం, జింజి

పుష్పగిరి కోటలో అందలి భవనాలు విజయనగర కళాకారుల పనితనానికి నిదర్శనముగా నేటికీ నిలిచివున్నాయి. హంపి విజయనగరం హిందువాస్తు శాస్త్రంలోని ఎనిమిది రకాల నగరాలలో ఒకటైన పద్మక వర్గములో శ్రీ చక్ర పద్ధతిలో నిర్మించబడింది.

## 14.2.5 లౌకిక వాస్తు కళ :

హంపిలో నిర్మించబడిన పద్మమహల్, గజశాలలు, చంద్రగిరిలోని వేసవి విడిది విజయనగర రాజుల లౌకిక నిర్మాణాలకు తార్కాణాలు. ఇవి ఇండో - ఇస్లామిక్ వాస్తు రీతికి ప్రతీకలు. పద్మమహల్ రెండంతస్థుల మందిరం. పద్మమహల్ కమానులు, మూలలు మొదలగు వాటిలో ముస్లిం ప్రభావము కన్పించును

## 14.3 శిల్పము :

విజయనగర రాజుల కాలంలో వాస్తుకు, శిల్పానికీ తుల్యతలేదు. వాస్తు అవసరాలను తీర్చేదిగా మాత్రమే శిల్పకళ వున్నది. అనగా విజయనగర రాజులు వాస్తువుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు. అయినా శిల్పం ఆదరించబడింది. స్థంభాలు, కుడ్యాలు, విమానం, గోపురాలు, అధిస్థానాలపై విజయనగర శిల్పులు శిల్పాలు చెక్కారు. విజయనగర శిల్పి నైపుణ్యానికీ వ్యాళల నోటిలోని కదలే రాతి బంతులు ముఖ్య ఉదాహరణగా చెప్పవచ్చు. హజార రామాలయ ముఖ మండపములోని స్థంభాల మీద, అంతరాళం, గర్భగృహం వెలుపలి గోడల మీద పౌరాణిక రామాయణ దృశ్యాలు రమ్యముగా చెక్కబడ్డాయి. హంపిలో ఒకే రాయిలో వినాయక, ఉగ్రనరసింహ విగ్రహాలు చెక్కబడినవి. ఇవి గంభీర సౌందర్యానికి నిదర్శనాలు. వీటిలో ఉగ్రనరసింహ విగ్రహం ఎత్తు 22 అడుగులు. లేపాక్షి, వీరభద్రేశ్వరాలయ నాట్య మండపములోగల 70 స్థంభాల మీద నిలువెత్తు నాట్య కత్తెలు, గంధర్వ కన్యలు, సాలభంజికలు, వివిధ నాట్య విన్యాసాలతో మనోహరముగా చెక్కబడ్డాయి. వీటిలో ముఖ్యముగా పేర్కొనదగినది రంభ - శివుల నాట్య విన్యాసం. లేపాక్షి కళ్యాణ మండప స్థంభాలపై భిన్న దేవతామూర్తులు అద్భుతముగా మలచబడ్డారు. తాడిపత్రి వెంకటరమణ ఆలయ ప్రధాన ద్వారం మీద, వరండాలో మండపాలలో అద్భుత శిల్పాలు కలవు. ఇచటి మహామండపములో కిష్కింధ, చిత్రకూట, సీతారాముల అరణ్య వాస ఘట్టాలు రమ్యముగా చెక్కబడినవి. తాడిపత్రి రామలింగేశ్వర ఆలయ సమీపంలో వున్న మందిరములోని వీరభద్రుని శిల్పం ఆదర్శనీయముగా వుంది. సుందరమైన శిల్ప సంపదకు బేలూరు, హళెబీడు ఆలయాలతో పోటీగా విజయనగర ఆలయాలలో నిలువగలిగింది ఒక తాడపత్రియే అని ఫెర్గూసన్ అభిప్రాయపడినాడు. వేలూరులోని దేవాలయమందలి కళ్యాణ మండపము శిల్పసంపదతో కూడుకొన్నది. అశ్వాలు, సింహాలు గంతులు వేయుచున్నట్లు జీవం ఉట్టి పడుతున్న శిల్ప స్థంబాలు మండపంపై భాగాన గల పావురాలు మర్కటాలు, రాతి గొలుసులు విజయనగర శిల్ప కళకు పరాకాష్ఠ. **తిరుపతి తిరు**మలలోని శ్రీ కృష్ణదేవరాయలు, అతని రాణుల, వెంకటపతి రాయల కంచు విగ్రహాలు ఆనాటి శిల్పుల శిల్ప కళా **నైపుణ్యానికి తా**ర్కాణాలు. లేపాక్షి బసవన్న ఏకశిలా విగ్రహం 20 అడుగుల ఎత్తు 30 అడుగుల పొడవు కలిగివుంది.

## 14.4 చిత్రలేఖనము :

విజయనగర కాలంలో చిత్రలేఖనాన్ని గురించిన ప్రస్తావన సాహిత్యంలో ఎక్కువగా కన్పిస్తుంది. నాటి స్త్రీలు సంగీతముతోబాటు చిత్ర లేఖనాన్ని అభ్యసించే వారు. అంతఃపురంలో నరసనాయక కృష్ణరాయల నిలువెత్తు వర్ణచిత్రాలున్నట్లు పేస్ వ్రాశాడు. నాట్య మందిరాల గోడలపై చిత్తరువు వ్రాసేవారని తెలుస్తుంది. చిత్రాలలో ఇతిహాస, పురాణ గాథలు, కృష్ణలీలలు, రతీ మన్మథ లీలలతో బాటు సామాజిక జీవిత దృశ్యాలు కూడా వుండేవి.

విజయనగర కాలం నాటి చిత్రలేఖనాలు హంపి విరూపాక్ష ఆలయ మండపములో, లేపాక్షి వీరభద్ర ఆలయంలో, తాడిపత్రి, కంచి కాళహస్తి, తిరుపతి మొదలగు చోట్ల చూడవచ్చు. హంపి విరూపాక్షాలయం మండపములోని లోకప్పు మీద విద్యారణ్యస్వామి వారిని పల్లకీలో ఊరేగించే దృశ్యం అందముగా చిత్రీకరించారు.

లేపాక్షి వీరభద్ర ఆలయంలోని నాట్యమండపం, అర్థమండపంపై కప్పులు రకరకాలైన చిత్రాలతో నిండి వున్నాయి. ఇక్కడి చిత్రాలలోని విశిష్టత ఏమనగా ముఖాలు ఒకవైపుకు త్రిప్పినట్లు, ఆవలి కన్ను కోణాకారములో పొడుచుకొని వచ్చినట్లు చిత్రించడం. బలమైన రేఖలు, కంటికి ఇంపైన రంగులు లేపాక్షి చిత్రాల ప్రత్యేకత. నాట్య మండపం పై కప్పు మీద అర్జునుడు మత్స్య యంత్రాన్ని ఛేదించడం, శ్రీరామ పట్టాభిషేకం, శివ పార్వతుల చతురంగ ఖేలనం మొదలగు అనేక పురాణ గాధలలోని దృశ్యాలు వివిధ రంగులలో అద్భుతముగా చిత్రీకరించారు. గర్భగృహంలో వితానము మీద పన్నెండున్నర అడుగుల పొడవుగల వీరభద్రుని చిత్రం వుంది. ఈ కుడ్య చిత్రం ప్రపంచ కుడ్య చిత్రాలలోనే పెద్దదిగా చెప్పుకోవచ్చు. ఈ చిత్రం కంటిలోని ముఖంమీద వున్న రేఖలు భీకర రూపాన్ని స్ఫురింపజేస్తాయి. భీకర రూపానికి అనువైన నలుపు, బూడిద రంగులలో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇచట గల చిత్రాలలో స్త్రీలు ధరించిన రకరకాలైన చీరల తీరు చూడవచ్చు. స్త్రీల శిరోలంకరణ, పురుషులు ధరించిన చొక్కాలు, ఈ చిత్రాలలో కలవు. లేపాక్షిలో మండప వితానములో ఒక చోట చిత్రించిన బాలక్రిష్ణుని చిత్రం మనం ఎటువైపు నుంచి చూసినా మన వైపే చూస్తున్నట్లు కన్పించడం చిత్రాతి చిత్రం. లేపాక్షికి పేరు తెచ్చింది బసవన్నతో బాటు ఈ చిత్రలేఖనాలే.

కంచిలోని వరదరాజ ఆలయంలో మన్మథ కథా దృశ్యం రమణీయముగా చోటు చేసుకొంది. చిత్తూరు జిల్లా సోమపాలెంలో గల చెన్న కేశవాలయ కళ్యాణ మండపంలో రామాయణ దృశ్యాలు చిత్రించారు.

ఈ విధంగా దక్షిణ భారత వాస్తు శిల్పకళ విజయనగర రాజుల పోషణలో పరిపూర్ణతను సాధించి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందింది.

## 14.5 సారాంశము :

విజయనగర రాజులు లలితకళలను విశేషంగా ఆదరించారు. వీరి కాలంలో నిర్మించబడిన అనేక దేవాలయాలు వీరి కళాభిరుచిని తెలుపుతాయి. దక్షిణ భారత వాస్తు శిల్పకళలను బహుళ వ్యాప్తంగా ప్రచారం చేసినవి విజయనగర రాజులచే నిర్మించబడిన ఆలయాలు. హంపి, లేపాక్షి, వంటి ప్రదేశాలలో నిర్మింపబడిన ఆలయాలు, చెక్కబడిన శిల్పాలు నాటి శిల్పుల శిల్పకళా చాతుర్యానికి తార్కాణాలు.

- డా. వి.కె. మోహన్.

పాఠం - 15

# విజయనగర కాలం నాటి సాహిత్యము

## 15.0 లక్ష్యం :

దక్షిణ దేశ చరిత్రలో విజయనగర రాజుల పోషణలో జరిగిన సాహిత్యాభివృద్ధి ప్రత్యేకించి చెప్పుకోదగింది. విజయనగర రాజుల ప్రధాన కాలక్షేపం పండిత గోష్ఠి. దాక్షిణాత్య భాషలలో, సంస్కృత భాషలో అనేక గ్రంధాలు రచింపబడుటయే గాక, నూతన కవితా రీతులు రూపు దిద్దుకొన్నాయి. విజయనగర కాలం నాటి విద్యలు, సంస్కృత, తెలుగు, కన్నడ, తమిళ, భాషా సాహిత్యాల గురించి తెలియచేయడమే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## విషయక్రమం :


15.1 పరిచయం

15.2 విద్యలు

15.3 సాహిత్యము

సంస్కృత సాహిత్యం

తెలుగు సాహిత్యం

కన్నడ సాహిత్యం

తమిళ సాహిత్యం

15.4 సంగీత, నాట్య నాటక కళలు

15.5 సారాంశము


## 15.1 పరిచయం :

దక్షిణ భారతదేశానికి సంబంధించి మరే యుగములోనూ జరగనంత సాహిత్య సృష్టి విజయనగర యుగంలో జరిగింది. సంస్కృతంలోనూ, అన్ని ద్రావిడ భాషలలోనూ జరిగిన ఈ సృష్టి ఒక్క కావ్య సాహితికే పరిమితము కాక, మతము, సంగీతం, నాట్యం అనేక ఇతర శాస్త్రాలకు సంబంధించి కూడా జరిగింది. విజయనగర రాజులలో వారి సామంతులలో అనేకమంది సంస్కృత ఆంధ్ర భాషలలో పండితులు, కవులు. వారి ప్రధాన కాలక్షేపం విద్వద్గోష్ఠి. వారి ఆదరణలో వివిధ భాషలలో అనేక గ్రంధాలు రూపుదిద్దుకొన్నాయి. నూతన కవితారీతులు వెలిశాయి.

## 15.2 విద్యలు :

విజయనగర ప్రభుత్వం ప్రజల విద్యాభివృద్ధికి ప్రత్యక్షముగా ప్రత్యేక శ్రద్ధ వహించలేదు. ప్రభుత్వం పాఠశాలలను నెలకొల్పలేదు. ప్రజలలో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులే. విద్యలో ఆసక్తివున్నప్పటికీ సక్రమమైన పాఠశాలలు లేవు. గ్రంధాలు కూడా సులభముగా

లభ్యమయ్యేవి కావు. అనాదిగా పేరొందిన బ్రాహ్మణులలో సైతం విద్య పట్ల నిర్లక్ష్యం ఏర్పడింది. కొందరు విప్రయువకులు దురలవాట్లకు బానిసలై, విద్యార్జన పట్ల విముఖత కలిగి వుండిరి. అగ్రహారాలు, మఠాలు, దేవాలయాలు, విద్యాలయాలుగా పరిగణించబడినవి.

### వృత్తి విద్యలు :

విజయనగర కాలం నాటి విద్యలలో అధిక భాగం కులాలకు, కుల వృత్తికి సంబంధించి వుండేది. కులవృత్తులు వంశపారంపర్యముగా తండ్రుల నుండి వారి పిల్లలకు సంక్రమించేవి. సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, వాస్తుశిల్పం వంటి లలిత కళలు కూడా ఆ కళలకు అంకితమైన కుటుంబాలు గురు, శిష్య పరంపరగా ఆసక్తి గలవారికి బోధించేవి. కుల విద్యలలో, లలిత కళలలో ప్రతిభావంతులైన వారు తమ విద్యలలో చక్రవర్తులను మెప్పించి వారి ఆదరణకు పాత్రులయ్యేవారు. రాజులు, ఆ విద్యలను కొనసాగించడానికి, ఇతరులకు బోధించడానికి తగిన ఏర్పాట్లు చేసేవారు. వేద అధ్యయనం తప్ప మిగిలిన విద్యలు, శాస్త్రాలు ప్రతిభావంతులైన అందరికీ అందుబాటులో వుండేవని సమకాలీన సాహిత్యం తెలియజేస్తుంది.

### వైదిక విద్యలు :

వైదిక విద్యలు విజయనగర కాలంలో బ్రాహ్మణులకే పరిమితమైనవి. నాటి ధర్మశాస్త్రాల ప్రకారం వేద అధ్యయనం శూద్రులకు నిషిద్ధము. క్షత్రియులకు, వైశ్యులకు వేద అధ్యయనం నిషిద్ధము కాదు. కానీ నిరంతర రాజ్యపాలనా వ్యవహారాలలో మునిగి క్షత్రియులు వేదాధ్యయనాన్ని వదిలి వేశారు. వైశ్యులు వర్తక వ్యాపారాలలో నిమగ్నమై వేదాధ్యయనాన్ని విస్మరించారు. వేదాంగ పారంగతులు శాస్త్ర నిష్ణాతులైన బ్రాహ్మణులకు రాజులు అగ్రహారాలు దానం చేశారు. ఈ అగ్రహారాలలో సుప్రసిద్ధులైన ఆచారులు వేద వేదాంగాలను, ధర్మశాస్త్రాలనూ, న్యాయం, మీమాంస తర్కం, జ్యోతిష్యం, గణితం, సాహిత్యం, అలంకార శాస్త్రాలను శిష్యులకు ఉచిత భోజన వసతులు కల్పించి బోధించేవారు. రాజ సభలలో వాగ్వాదాలు, విద్యా పరీక్షలు జరిగేవి. రాజులు యోగ్యతా పత్రాలను తామ్ర పత్రాల మీద వ్రాయించి ఇచ్చేవారు. మఠాలలో, పండితులలో, గృహాలలో పుస్తక భాండాగారాలు వుండేవి. శృంగేరీ పీఠ భాండాగార ఉద్యోగి పౌరాణిక కవి అయిన కృష్ణభట్టును రెండవ బుక్కరాయలు ఈనాములు ఇచ్చి గౌరవించాడు. నాటివి చాలా వరకూ తాళపత్ర గ్రంధాలే. రాగి రేకులపై కూడా వ్రాయడం వుంది. తాళ్ళపాక అన్నమయ్య తన కీర్తనలు రాగి రేకులపై వ్రాయించి తిరుపతిలోని సరస్వతీ భాండారంలో భద్రం చేశాడు.

## 15.3 సాహిత్యము :

దక్షిణ భారతదేశ చరిత్రలో మరి ఏ యుగంలో కూడా విజయనగర పోషణలో జరిగినంతటి సాహిత్య పరిశ్రమ జరగలేదు. రాజులలో వారి సామంతులలో పెక్కుమంది సంస్కృత, ఆంధ్ర భాషలలో పండితులు, కవులు. వారి ప్రధాన కాలక్షేపం పండిత ఘోష్ఠి. దాక్షిణాత్య భాషలలో సంస్కృతములో వివిధ సారస్వత శాఖలలో అనేక గ్రంధాలు వెలిశాయి. నూతన కవితారీతులు వెలిశాయి.

### సంస్కృత సాహిత్యము :

విజయనగర చరిత్ర మొదటి భాగములో సంస్కృతములో మత సాహిత్యం, కావ్య నాటకాలు, అలంకార శాస్త్రాలు అపారముగా వెలువడ్డాయి.

### మత సాహిత్యము :

విజయవగర కాలంలో అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత పరమైన గ్రంధాలు అనేకం రచింపబడినవి. విద్యారణ్యస్వామి ఐతరేయ దీపిక, తైత్తిరీయ దీపిక, పంచదశీ, జీవన్ముక్తి వివేకము మొదలగు గ్రంథాలు రచించి వైదిక మత ఉద్ధరణకు పాటు పడినాడు. మాధవాచార్యులు పరాశరస్మృతి వ్యాఖ్యతో బాటు జైమినీయ న్యాయ మాలా విస్తరము, సర్వ దర్శన సంగ్రహం మొదలగు గ్రంధాలు వ్రాశాడు. సాయణుడు

వేదార్ధ ప్రకాశిక అను పేరుతో చతుర్వేదాలకు భాష్యం రచించాడు. తంజావూరు రఘునాధ రాయల మంత్రి అద్వైత విద్యా విచార బిరుదాంకితుడైన గోవింద దీక్షతుల కుమారుడు అయిన వెంకటమఖి బోధాయన శ్రౌత సూత్రాలకు భాష్యం, శుల్బమీమాంస అనే గ్రంధం రచించాడు. లింగాధ్వరి వేదార్ధ తత్వనిర్ణయం అను గ్రంధం వ్రాశాడు. వేదాంత దేశికుడు తత్వటీక, తాత్పర్య చంద్రిక, న్యాయ సిద్ధాంజనము వంటి గ్రంధాలు రచించి విశిష్టాద్వైత సిద్ధాంతానికి బలం చేకూర్చాడు.

వ్యాసతీర్థులు తాత్పర్య చంద్రిక, తర్క తాండవము, న్యాయామృతములను రచించి రాజాస్థానమున గౌరవ ఆదరాలు పొందాడు. వాదిరాజ తీర్థులు మధ్య తంత్ర ముఖ భూషణమును రచించినాడు. శ్రీ కంఠ పండితుడు వీరశైవ పరముగా బ్రహ్మ సూత్రం భాష్యం వ్రాయగా, దానిపై అప్పయ్య దీక్షితులు శైవార్క మణిదీపిక అనే పేరుతో వ్యాఖ్యానము వ్రాశాడు. మొదటి బుక్కరాయల కాలం వాడైన మాధవ మంత్రి సూత సంహితపై తాత్పర్య దీపికను శైవామ్నాయసారము వంటి గ్రంధాలు రచించాడు.

## కావ్య నాటకాలు :

విజయనగర కాలం నాటి కావ్యాలలో వేదాంత దేశికుడు రచించిన యాదవ అభ్యుదయం, రామాభ్యుదయము మొట్టమొదటివి. వేదాంత దేశికుని కవితార్కిక సింహ అనీ సమకాలికులు పిలిచారు, భోగనాధుడు. త్రిపుర విజయరామోల్లాస కావ్యాలు వ్రాశాడు. రెండవ దేవరాయలు సంస్కృత కవులను ఆదరించి, పోషించడమే గాక, మహానాటక సుధానిధి అనుగ్రంధాన్ని రచించాడు. ఈతని కాలానికి చెందిన ఉద్దండ కవి మల్లికామారుత అను నాటకాన్ని రచించాడు. నాటి సారస్వత చరిత్రలో కవయిత్రుల రచనలు, చారిత్రక రచనలు విశిష్ఠ లక్షణాలు. వీనిలో బుక్కరాయల కుమారుడైన కంపరాయల భార్య గంగాదేవి గొప్ప కవయిత్రి. ఈమె రచించిన మధురావిజయం కావ్యం సుప్రసిద్ధం. రెండవ దేవరాయల కాలంలో డిండిమ కవి కుటుంబం విజయనగర ఆస్థానంలో ప్రవేశించింది. ఈ కుటుంబములో అరుణగిరి నాధ డిండిముడు సోమపల్లి యోగానంద ప్రవాసనము రచించాడు. ఇతనినే శ్రీనాథుడు ఓడించి ప్రౌఢ దేవరాయల ముత్యాలశాలలో కనకాభిషేక గౌరవం పొందాడు. డిండిమ కుటుంబములో రెండవ రాజనాధుడు సాళువాభ్యుదయాన్ని, మూడవ రాజనాథుడు అచ్యుత రామాభ్యుదయాన్ని రచించారు. కృష్ణరాయలుజాంబవతీ కళ్యాణం రచించాడు. ఇది సంస్కృత నాటకము. విరూపాక్ష స్వామి ఉత్సవ సందర్భములో ఈ నాటకాన్ని ప్రదర్శించేవారు. అచ్యుత రాయల కాలంలో తిరుమలాంబ వరదాంబిక పరిణయం రచించింది. మహామంత్రి తిమ్మరుసు అగస్త్యుని బాలభారతమునకు వ్యాఖ్య వ్రాశాడు. తిమ్మరుసు మేనల్లుళ్ళు గోపరసు, అప్పరసు కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయ నాటకముపై వ్యాఖ్యానాలు రచించారు. తంజావూరు రఘునాధ రాయలు సంస్కృతంలో మహాకవి. అతని మంత్రి గోవింద దీక్షితులు వేదాంత గ్రంధాలతో బాటు సాహిత్య సుధను రచించాడు.

## అలంకార సంగీత నాట్య శాస్త్రాలు :

విజయనగర యుగంలో అలంకార నాట్య సంగీత శాస్త్రాలపై కూడా అనేక గ్రంధాలు వెలువడినాయి. అలంకార శాస్త్ర గ్రంధాలలో సాయణుని ధాతువృత్తి, భోగనాధుని ఉదాహరణ మాల, గోపతిప్పని కావ్యాలంకార సూత్రాలపై వ్యాఖ్య ముఖ్యమైనవి. నాట్య, సంగీత శాస్త్రాలపై గ్రంధాలలో మహానాటక సుధానిధి దేవన భట్టు సంగీత ముక్తావళి, గోపతిప్పని తాలదీపిక, లక్ష్మీధరుని సంగీత సూర్యోదయము రఘునాధ రాయల సంగీతసుధ ఎన్నదగినవి. రఘునాధరాయల జయంత సేన, రామానందములనే కొత్త రాగములను సృష్టించడమే గాక, రఘునాధ విలాసమనే కొత్త నాట్య పద్ధతిని రూపొందించినాడు.

## తెలుగు సాహిత్యము :

తెలుగు భాషా చరిత్రలో స్వర్ణయుగముగా భాసిల్లే విజయనగర యుగంలో మొదటి బుక్కరాయల కాలం నుండీ తెలుగు భాషకు తెలుగు కవులకు ఆదరణ లభించింది. విజయనగర రాజుల ఆదరాభిమానాలతో తెలుగు దాక్షిణాత్య భాషలకే తలమానికమైనది. శ్రీ కృష్ణదేవరాయలు తెలుగు భాష పట్ల ప్రత్యేక అభిమానం చూపడముతో తెలుగు కవిత్వానికి స్వర్ణయుగం ప్రారంభం అయింది. ఈ కాలంలోనే శృంగార రసం ప్రాధాన్యత పెరిగి ప్రబంధ ప్రక్రియ వికసించింది. యక్షగానం ఈ యుగంలో రూపొందినదే. రాక్షసితంగడి

యుద్ధముతో తెలుగు భాషా చరిత్రలో క్షీణ యుగం ప్రారంభమైనది. విజయనగరం నుండి తెలుగు భాష నాయక రాజ్యాలను ఆశ్రయించింది. దక్కన్ సుల్తానుల దాడులతో ప్రజలలో నైతిక దౌర్బల్యం చోటుచేసుకొన్నది. దీనితో భావనాపటిమ సన్నగిల్లింది.

## కృష్ణరాయలకు పూర్వయుగం :

మొదటి బుక్కరాయల కాలం నుండి విజయనగర ఆంధ్ర భాషా చరిత్ర ప్రారంభం అయినది. ఇతని కాలంలో నాచన సోముడు హరివంశం అనే సంస్కృత కావ్యాన్ని తెలుగులోకి అనువదించుటయేగాక, ఉత్తర హరివంశం అనే కావ్యాన్ని తెలుగులో వ్రాశాడు. రెండవ బుక్కరాయలు ఇతనికి పంచాకల దిన్నెను అగ్రహారముగా ఇచ్చి సత్కరించాడు. ఉదయగిరిని పాలించే పూసపాటి బసవరాజుకు దూబగుంటి నారాయణ కవి పంచతంత్రం అంకితం చేశాడు. జంట కవులైన నంది మల్లయ, ఘంట సింగిమ తమ వరాహ పురాణమును తుళువ నరసనాయకునికీ, తమ ప్రబోధ చంద్రోదయమును ఉదయగిరి రాజ్యాన్ని పాలించే బసవరాజు వద్ద మంత్రిగా వున్న గంగన్నకు అంకితం చేశారు.

సాళువ నరసింహుని కాలంలో విజయనగర ఆస్థానంలో తెలుగు భాష నిలదొక్కుకున్నది. పిల్లలమర్రి పినవీరభద్రుడు జైమినీ భారతాన్ని తెలుగులో వ్రాసి సాళువ నరసింహునికి అంకితం చేశాడు. ఇతడు శాకుంతల నాటకాన్ని శృంగార శాకుంతలం అనే పేరుతో కావ్యం వ్రాశాడు. సాళువ నరసింహునిచే అగ్రహారాలు పొందిన ప్రోలుగంటి చెన్నమంత్రి అష్టభాషా కవి. ఇతడు ద్విపద నరసింహ పురాణం వచన బాల భారతం, సౌభరీచరిత్ర, యక్షగానం అను గ్రంధాలు వ్రాశాడు. సాళువ నరసింహుని కాలానికే తాళ్లపాక అన్నమయ్య తిరుపతి చేరి పదరచన ప్రారంభించాడు. ఇదే కాలంలో తెలంగాణా ప్రాంతంలో ఇద్దరు ప్రసిద్ధ కవులు కన్పిస్తారు. ఆనాడు ఓరుగల్లును పాలించే సీతాపతి యొక్క మంత్రి ఎల్లపెద్దనను ఆశ్రయించి చెరిగొండ ధర్మన్న, చిత్ర భారతం రచించాడు. ధర్మన్నకు శతలేఖినీ సురత్రాణ అను బిరుదము వున్నది. ఇతనికి సమకాలికుడైన కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశత్సాల భంజిక అను కావ్యాన్ని రచించి హరిహర నాథునికి అంకితం చేశాడు.

## కృష్ణరాయల యుగము :

శ్రీ కృష్ణదేవరాయల కాలంలో ఆంధ్రభాషా సాహిత్య చరిత్రలో నూతన శకం ప్రారంభమైంది. ఇతని కాలాన్ని ఆంధ్ర భాషా సాహిత్య చరిత్రలో అగస్టస్ యుగముతో పోలుస్తారు. కృష్ణదేవరాయలు అనేకమైన రచనలు చేశాడు. వాటిలో ముఖ్యమైనది ఆముక్త మాల్యద. ఇది తెలుగు పంచకావ్యాలలో ఒకటిగా కీర్తి పొందింది. ఇతని కాలంలోనే తెలుగు సాహిత్యంలో నూతన ప్రబంధ పద్ధతి ప్రారంభం అయింది. దీనికి మార్గదర్శకుడు ఆంధ్రకవితా పితామహుడని బిరుదు పొందిన అల్లసాని పెద్దన. స్వయముగా రాయలు పెద్దన కాలికి గండపెండేరము తొడిగి సత్కరించాడు.

కృష్ణరాయలకు ఆంధ్రభోజుడనే బిరుదు వుంది. ఇతని ఆస్థానానికి భువన విజయం అనిపేరు. ఈ భువన విజయ సభను అలంకరిస్తూ అష్టదిగ్గజాలను ఎనమండుగురు ప్రముఖ కవులు వున్నట్లు ప్రసిద్ధి. వీరిలో సంస్కృత ఆంధ్ర కర్ణాటక భాషా కవులున్నారని భావించడం సమంజసము. కానీ అష్టదిగ్గజాలు ఆంధ్రభాషా కవులేనని సాంప్రదాయం. ఆ కవులు, వారి కావ్యాలు.

| | | |
|---|---|---|
| 1. అల్లసాని పెద్దన | - | స్వారోచిషమను సంభవం |
| 2. నంది తిమ్మన | - | పారిజాతాపహరణము |
| 3. ధూర్జటి | - | శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యము, |
| | | శ్రీ కాళహస్తీశ్వర శతకము |
| 4. మాదయగారి మల్లన | - | రాజశేఖర చరిత్రము |

| | | |
|---|---|---|
| 5. అయ్యలరాజు రామభద్రకవి | - | రామాభ్యుదయము |
| 6. రామరాజ భూషణుడు | - | వసు చరిత్ర |
| (భట్టుమూర్తి) | | నరసభూపాలీయము |
| | | హరిశ్చంద్ర నలోపాఖ్యానము |
| 7. పింగళి సూరన | - | ప్రభావతీ ప్రద్యుమ్నము |
| | | కళాపూర్ణోదయము |
| | | రాఘవ పాండవీయము |
| 8. తెనాలి రామకృష్ణుడు | - | పాండురంగ మహాత్మ్యము |
| | | ఘటికాచల మహాత్మ్యము |
| | | ఉద్భటారాధ్య చరిత్ర |

నవరత్నాలనే సంస్కృత కవులు గుప్త చక్రవర్తి చంద్రగుప్త విక్రమాదిత్యుని కొలువులో వుండేవారన్న సాంప్రదాయంలో వలెనే అష్టదిగ్గజ సాంప్రదాయంలో కూడా చారిత్రక సత్యం లేదు. అష్టదిగ్గజాలలో అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, మాదయగారి మల్లన అనే నలుగురు కవులు మాత్రమే రాయల ఆస్థానంలో వుండేవారని, మిగిలిన వారు ఆ తరువాత కాలం వారని కొందరి చరిత్రకారుల అభిప్రాయము. కృష్ణరాయలు విష్ణుచిత్తీయము అనే పేరుగల ఆముక్త మాల్యదను తిరుపతి వేంకటేశ్వరునికి అంకితం చేసినట్లు చెప్పినాడు.

అష్టదిగ్గజాలలో అల్లసాని పెద్దన, నంది తిమ్మనలు మాత్రమే తమ కృతులను రాయలకు అంకితం చేశారు. పెద్దన ఆస్థాన కవి. ఆంధ్రకవితా పితామహుడు ప్రబంధ పరమేష్ఠి. అతడంటే కృష్ణరాయలకు గొప్ప అభిమానం. పెద్దన చేతిలో ప్రబంధ ప్రక్రియ సుందరముగా రూపొందినది. అందువల్లనే సార్వోచిషమను సంభవం తెలుగులో తొలి ప్రబంధముగా ప్రసిద్ధి చెందింది. నంది తిమ్మన ప్రబంధం పారిజాతాపహరణం ఈ రెండు ప్రబంధాలు కళింగ జైత్రయాత్ర తరువాత రాయలు అంకితము పొంది వుంటాడు.

మాదయ గారి మల్లన కృష్ణరాయలకు సమకాలికుడే గానీ తన రాజశేఖర చరిత్రను కొండవీడు రాజ్యాన్ని పాలించే నాదెండ్ల అప్పరుసుకు అంకితం చేశాడు. అయితే రాయల వాచకం ప్రకారం మల్లన అష్టదిగ్గజాలలోని వాడే. ధూర్జటి తన కావ్యాలను తన ఇష్టదైవానికి అంకితం ఇచ్చాడు. ధూర్జటి రాయల ఆస్థానంలో వున్నట్లు కొన్ని చాటువులు వున్నాయి. అయ్యరాజు రామభద్రుడు తన రామాభ్యుదయ కావ్యాన్ని గొబ్బూరు నరసరాజుకు అంకితం చేశాడు. నరసరాజు ఆలియ రామ రాయలు మేనల్లుడు. రామభద్రుడు అష్టదిగ్గజాలలో వుండానికి అవకాశం తక్కువ. ఐతే అష్టదిగ్గజాలలోని వాడు పుత్తేటి రామభద్రుడై వుండవచ్చని కొందరి భావం.

తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానమున్న వాడు పింగళి సూరన. ఇతని మొదటి కావ్యమైన రాఘవ పాండవీయం తెలుగు భాషలో తొలి ద్వర్థికావ్యం. దీనిని ఆకువీటి పెద వేంకటాద్రికి అంకితం చేశాడు. కళాపూర్ణోదయాన్ని ఆరవీటి వంశస్థుడు, నంద్యాల ప్రభువైన కృష్ణభూపతికి అంకితము చేశాడు. కృష్ణరాయల ఆస్థానంలో తెనాలి రామకృష్ణుడు వున్నట్లు కొన్ని చాటువులలో వున్నాయి. ఇతని అసలు పేరు గార్లపాటి రామలింగయ్య. ఇతని స్వస్థలం తెనాలి. ఇతడు శైవ కుటుంబములో జన్మించాడు. నాదెండ్ల గోపరసుకు మంత్రియైన చేచయ్యకు ఉద్భటారాధ్య చరిత్రను అంకితం చేశాడు. రాజధాని విజయనగరంలో వైష్ణవం బలముగా వున్నందున కృష్ణరాయల అభిమానం పొందడానికి వైష్ణవం స్వీకరించి రామకృష్ణుడై వుంటాడని కొందరి భావం. రామలింగయ్య వైష్ణవుడై వ్రాసిన మొదటి గ్రంధం ఘటికాచల మహాత్మ్యము తరవాత పాండురంగ మహాత్మ్యన్ని వ్రాసి వేదాద్రికి అంకితం ఇచ్చాడు.

రామరాజ భూషణుని తొలి గ్రంథం కావ్యాలంకార సంగ్రహము. లేక నరసభూపాలీయము. దీనిని రామరాయల మేనల్లుడైన నరసరాజుకు అంకితమిచ్చాడు. ఆ తరువాత రామరాయల ఆశ్రయం పొందాడు. 1565 యుద్ధము తరువాత ఇతడు తిరుమల రాయలతో పెనుగొండ చేరాడు. ఇచటనే వసుచరిత్రను వ్రాసి తిరుమల రాయలకు అంకితం ఇచ్చాడు.

అష్టదిగ్గజాలలో లేని కవులు కృష్ణదేవరాయల కాలంలో వున్నారు. వారిలో కొందరిని కృష్ణరాయలు ఆదరించాడు. వీరిలో కవి కర్ణరసాయన కావ్య నిర్మాత సంకుసాల నరసింహ కవి, రాధామాధవ కృతి కర్త చింతలపూటి ఎల్లన పేర్కొన దగినవారు. ఎల్లనకు రాధామాధవ కవి అనే బిరుదాన్ని కృష్ణరాయలు ఇచ్చినాడు అంటారు. కొండవీటి రాజ్యంలో ఉద్యోగి అయిన నాదెండ్ల గోపరసు కృష్ణార్జున సంవాదము అనే పేరుతో గయోపాఖ్యానము ద్విపదలో వ్రాశాడు. ఉదయగిరి పాలకుడైన కంపరాయలు మనుమంచి భట్టుచే అశ్వలక్షణ సానము అంకితము పొందాడు. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య కృష్ణరాయల కాలం వాడే.

పై విధముగా అపారమైన సాహిత్య పరిశ్రమ జరిగినందునే శ్రీ కృష్ణదేవరాయల కాలం తెలుగు భాషా చరిత్రలో స్వర్ణయుగముగా ప్రసిద్ధం అయింది.

విజయనగర కాలంలో ప్రముఖ కవయిత్రులు కూడా వున్నారు. వారిలో శారద, మొల్ల, తిరుమలాంబ పేర్కొనదగినవారు. ఈ యుగము చివరి వాడే యోగి వేమన. ఇతడు సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాజంలోని దురాచారాలను, మత ద్వేషాలను మాన్పి, నైతిక ప్రవర్తన వైపు దృష్టి మళ్లించడానికి చిన్న చిన్న పద్యాలు అనేకం వ్రాసి ప్రసిద్ధికెక్కాడు. ఈ పద్యాలు వేమన శతకము పేరుతో ఆంధ్రదేశమంతా ప్రచారంలో వుంది.

**నాయకరాజ యుగము :**

శ్రీ కృష్ణదేవరాయల మరణానంతరం చెలరేగిన వారసత్వ యుద్ధాల వల్ల విజయనగరంలో సారస్వత పరిశ్రమ క్షీణించింది. ఆరవీటి వంశ చరిత్రకూడా అంతర్యుద్ధాలతో, దక్కన్ సుల్తానుల దాడులతో నిండి, సారస్వత పోషణకు పరిస్థితులు అనుకూలించలేదు. అయితే ఆరవీటి వంశస్థుల కాలంలోనే దక్షిణాన నాయక రాజ్యాలు బలపడి ఒక శతాబ్దిపాటు ఆంధ్రభాషకు గొప్ప సేవ చేశారు. వీరే గాక, తంజావూరును పాలించిన మహారాష్ట్రులు కూడా తెలుగును ఆదరించారు.

నాయక రాజ యుగానికి ఆంధ్ర సాహిత్యములో కొన్ని ప్రత్యేక లక్షణాలు కన్పిస్తాయి. అన్యభాషల ప్రజల మధ్య వర్ధిల్లడం వల్ల తెలుగులో తమిళ, కన్నడ, మహారాష్ట్ర పదాలే గాక, పాశ్చాత్య భాషా పదాలు కూడా ప్రవేశించాయి. ఈ కాలంలో సంగీత సాహిత్యాలు మేళవించిన గేయాలు, యక్షగానాలు ఎక్కువగా తయారైనాయి. ఈ యుగంలోనే వచన వాఙ్మయం క్రమపరిణామం పొందింది. శాస్త్ర విషయాల మీద కూడా గ్రంధాలు రచింపబడ్డాయి. నాటి సాహిత్యము నిండా చారిత్రక ఘట్టాలు, ఆర్థిక, సాంఘిక, పరిస్థితులను గురించిన వివరాలు కన్పిస్తాయి. అయితే ఈ యుగ కవులలో శృంగార, హాస్యరస ప్రియత్వం ఎక్కువ.

తంజావూరు రఘునాధ రాయలు శ్రీ కృష్ణదేవరాయలు వలే సాహిత్య సమరాంగణ సార్వభౌముడు. ఇతడు సంస్కృతాంధ్ర భాషలలో గొప్ప కవి. ఇతడు తెలుగులో వాల్మీకి చరిత్ర, పారిజాతాపహరణ నాటకం రచించాడు. ఇతని ఆస్థానంలోని చేమకూర వెంకటకవి విజయ విలాసము, సారంగధర చరిత్ర వ్రాశాడు. రఘునాధ నాయకుని కొడుకైన విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి పసుపులేటి రంగాజమ్మ, మన్నారుదాస విలాసము, ఉషా పరిణయము అను గ్రంధాలు వ్రాసింది. విజయ రాఘవుడు రఘునాధ నాయకాభ్యుదయము అనే ద్విపద కావ్యాన్ని వ్రాశాడు. రాజగోపాల విలాసము వ్రాసిన చెంగల్వ కాళకవి, రాధికాస్వాంతనము వ్రాసిన ముద్దుపళని విజయరాఘువుని కాలం వారే. విజయరాఘవ నాయకుని కాలంలో వృద్ధి చెందిన సాహిత్య ప్రక్రియ యక్షగానాలు. విజయరాఘువుడు స్వయముగా విప్రనారాయణ చరిత్ర, శ్రీ కృష్ణ విలాసము, రఘునాధాభ్యుదయము అనే యక్షగానాలను రచించాడు. రాఘవుని కుమారుడైన మన్నారు దేవుడు హేమాబ్జ నాయికా స్వయంవరం అనే యక్షగానాన్ని వ్రాశాడు. విజయరాఘవుని ప్రియురాలు రంగాజమ్మ మన్నారు దాస విలాసాది యక్షగానాలు రచించింది.

నాయక రాజుల తరువాత తంజావూరును పాలించిన మహారాష్ట్రులు కూడా తెలుగు యక్షగానాలను ప్రోత్సహించారు. వారిలో తులజ మహారాజు రాజరంజన విద్యా విలాసము అను యక్షగానమును రచించాడు. తంజావూరు నాయకుల కాలంలో ప్రారంభించబడిన యక్షగానాలు కూచిపూడి భాగవతులచే ప్రదర్శింపబడి, ప్రజాదరణ పొందినాయి.

మధుర నాయక రాజైన విశ్వనాథ నాయకుని స్థానాపతి రాయవాచకము అను గద్య కావ్యాన్ని వ్రాశాడు. చొక్కనాధ నాయకుని కాలము నాటి లింగన ముఖి, కామేశ్వరుడు, సత్యభామ స్వాంతనము, ధేను మహాత్మ్యము అను గ్రంధాలు వ్రాశాడు. మధుర నాయక రాజైన విజయరంగ చొక్కనాధుడు శ్రీరంగ మహాత్మ్యము మాఘమహాత్మ్యము అనే వచన గ్రంధాలు రచించాడు. ఈ కాలంలో పేరుగాంచిన సముఖము వెంకట కృష్ణప్ప నాయకుడు అహల్యా సంక్రందనము, రాధికా స్వాంతనము అనే పద్య కావ్యాలు, జైమినీ భారతము సారంగధర చరిత్ర అనే గద్య కావ్యాలు రచించాడు. ఈ కాలపు మరో ప్రసిద్ధ కవి శేషం వెంకటపతి శశాంక విజయము అను తెలుగు ప్రబంధాన్ని రచించాడు.

విజయనగర సామంతులైన పుదుక్కోట రాజులు కూడా తెలుగు సాహిత్యాన్ని పోషించారు. వీరిలో రఘునాధ తొండమాన్ సుప్రసిద్ధుడు. ఇతడు పార్వతీ పరిణయము, కవి జనోజ్జీవిని అను గ్రంధాలు వ్రాశాడు. తొండమాన్ ఆస్థాన కవియైన వెంకనార్యుడు ఆంధ్ర భాషార్ణవము అను తెలుగు నిఘంటువును రచించాడు. ఇదే తెలుగులో తొలి నిఘంటువు. వెంకనార్యుడు మల్లు పురాణం, పార్వతీ కళ్యాణం, తొండమాన్ వంశావలి, బృహన్నాయక దండకము అను గ్రంధాలు వ్రాశాడు.

**కన్నడ సాహిత్యము :**

విజయనగర యుగంలో తెలుగు సంస్కృత సాహిత్యాలతో బాటు కన్నడ సాహిత్యము కూడా బాగా అభివృద్ధి చెందింది. ఈ కాలంలో కర్ణాటకములో జైనులు గొప్పగా భాషాసేవ చేశారు. మధుర, భాస్కర, జీవంధర మొదలగు రాజులు జైన కవులు వీరు జైన ధర్మాన్ని వివరిస్తూ తపోనియమాల గొప్పతనాన్ని తెలియజేస్తూ అనేక గ్రంధాలు వ్రాశారు. రెండవ దేవరాయల కాలంనుండి జైనులతో బాటు శైవులు కూడా సారస్వత కృషి జరిపారు. వీరిలో భీమకవి చామరస జకనార్య ఆయతవర్మ గురుబసవ మగ్గియ మగ్గ దేవ సుప్రసిద్ధులు. తిమ్మన కవి కృష్ణదేవరాయలకు కన్నడ భారతాన్ని అంకితము చేశాడు. తెలుగు వేమన వలే సర్వజ్ఞమూర్తి అనే అతడు సమకాలీన సాంఘిక మత దురాచారాలను ఖండిస్తూ, సర్వజ్ఞపదగళము అనే పదివేల పద్యాలను వ్రాశాడు. భట్టలంక దేవుడు కర్ణాటక శబ్దానుసార అను కన్నడ వ్యాకరణ గ్రంధం వ్రాశాడు. కన్నడ భాషలో హరిదాసు కీర్తనల ద్వారా భక్తి మతాన్ని పురికొల్పిన శ్రీ పాదరాజు, వ్యాసరాజు, పురంధర దాసు, కనక దాసు విజయనగర కాలం వారే.

**తమిళ సాహిత్యము :**

బుక్కరాయల కుమారుడైన కుమార కంపన తమిళ దేశాన్ని జయించి, దానిని విజయనగర సామ్రాజ్యంలో కలిపాడు. ఫలితంగా తమిళప్రాంతంలో ముస్లిముల బెడద తప్పి, శాంతి భద్రతలు ఏర్పడి, తమిళభాషా సాహిత్యాభివృద్ధికి అవకాశం కలిగింది. ఈ కాలంలో సంస్కృత తెలుగు కన్నడభాషలలో జరిగినంత సాహిత్యాభివృద్ధి తమిళ భాషలో జరగలేదు. ఈ యుగంలో వెలువడిన తమిళసాహిత్యం ఎక్కువగా మత సంబంధం అయినది. ఆనాటి ప్రముఖ తమిళ కవులలో పేర్కొనదగినవారు యేరుమందార పురాణం అను జైనగ్రంధాన్ని వ్రాసిన వామనాచార్య, తమిళభారతాన్ని 4350 పద్యాలలో వ్రాసిన విల్లిపుత్తురార్, వేదాంత దేశికులు, కాల మేఘపులవార్, తిరుమల నాధ, పరంజ్యోతియార్ మొదలగు వారు.

## 15.4 సంగీత నాట్య నాటక కళలు :

సాహిత్యానికి తోడు సంగీత, నాట్య, నాటక కళలను విజయనగర రాజులు ప్రోత్సహించారనడానికి ఆనాడు వెలువడిన సంగీత శాస్త్రగ్రంధాలే నిదర్శనం. విద్యారణ్యస్వామి తన సంగీతసారములో పెక్కు రాగాలను వర్ణించాడు. రెండవ దేవరాయలు మహానాటక

సుధానిధి అను గ్రంధాన్ని వ్రాశాడు. కృష్ణరాయలు కృష్ణ అను విద్వాంసుని దగ్గర వీణ అభ్యసించినట్లు తెలుస్తుంది. రామరాయలు తన కుమార్తెలకు రామయ మంత్రిచే సంగీతం నేర్పించాడు. రామయమంత్రి వ్రాసిన సర్వమేళకళానిధి కర్ణాటక సంగీతానికి వేదం వంటిది. సంగీత నాట్య కళలకు వేశ్యలు నిధులై దేవతాఉత్సవాలలో సాంఘికమైన వివాహాది శుభకార్యాలలో పాల్గొనేవారు. ఆలయాలలో ప్రత్యేకించి నాట్య మండపాలు నిర్మించబడ్డాయి. కృష్ణరాయలు అనేక వాయిద్యాల గురించి ప్రస్తావించాడు. వాటిలో వీణకు జనాదరణ పెరిగింది. ఈ కాలంలోనాటకాలు ఆడడం ఎక్కువైంది. కర్ణాటక సంగీతానికి మూలపురుషులు అనబడు అన్నమయ్య, క్షేత్రయ్య ఈ యుగము వారే. కూచిపూడి భాగవతం, యక్షగానం ఈ కాలం నాటివే. కూచిపూడి భాగవతులు దేశ సంచారము చేస్తూ నాటకాలడుతుండేవారు. నాట్య సంగీతాలకు ప్రాధాన్యమున్న యక్షగానాలకు ఆదరణ ఎక్కువగా కన్పిస్తుంది.

## 15.5 సారాంశము :

దక్షిణ భారతదేశంలో ఏ యుగంలోనూ జరగనంతటి సాహిత్య సృష్టి విజయనగర యుగంలో జరిగింది. భువనవిజయంగా పిలువబడే శ్రీకృష్ణదేవరాయల కొలువులో అష్టదిగ్గజాలు ఉండేవారు. తెలుగు, తమిళ, కన్నడ సాహిత్యాలు విజయనగర యుగంలో అభివృద్ధి చెందాయి. కేవలం సాహిత్యమేకాక సంగీత, నాట్య కళలు కూడా ఈ కాలంలో ఆదరించబడ్డాయి.

- డా. వి.కె. మోహన్.

పాఠం : 16

# గోల్కొండ కుతుబ్‌షాహి రాజవంశం

## 16.0 లక్ష్యం :

తెలంగాణా, తీరాంధ్ర ప్రాంతాలు ముస్లిముల వశమయ్యాక ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యాలేర్పడినవి. వాటిలో ఒకటైన గోల్కొండ కుతుబ్‌షాహి రాజవంశం గురించి తెలియపరచుట ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :


16.1 పరిచయం

16.2 సుల్తాన్ కులీ సేనాపతి పాత్ర

16.3 గోల్కొండ చరిత్ర

16.4 సుల్తాన్ కులీ స్వతంత్రించుట

16.5 కులీ కుతుబ్ ఉల్‌ముల్క్

16.6 జంషీద్ కులీ కుతుబ్ షా

16.7 ఇబ్రహీం కులీకుతుబ్ షా

16.8 మహమ్మద్ కులీకుతుబ్ షా

16.9 అబ్దుల్లా కుతుబ్ షా

16.10 అబుల్ హసన్ కుతుబ్ షా

16.11 గోల్కొండ పతనం

16.12 సారాంశము


## 16.1 పరిచయం :

ఆంధ్రుల చరిత్రలో కాకతీయుల కాలంచాల ముఖ్యమైన ఘట్టం. కొందరు దీన్ని స్వర్ణయుగం అనడం కూడ కద్దు. శాతవాహనుల అనంతరం ఆంధ్రదేశాన్ని జాతినీ సమైక్యం చేసి, ఏకఛత్రాధిపత్యం కిందికి తెచ్చిన హైందవ రాజవంశీయులు కాకతీయులొక్కరే. కాకతీయులు ఆంధ్ర దేశాధీశ్వర బిరుదం ధరించినారు. వారి రాజధానియైన ఓరుగల్లు ఆంధ్రనగరి. కాకతీయ రాజ్యపతనంతో ఆంధ్రప్రదేశంలో ముస్లిం అధికార స్థాపన జరిగింది. అరవీటి, ముసునూరి, రెడ్డి నాయకులు నడిపిన 'స్వాతంత్ర ఉద్యమ' ఫలితంగా క్రీ.శ. 1336నాటికి ఆంధ్ర దేశం నుండి ముస్లిం అధికారం అస్తమించింది. కాని క్రీ.శ. 1347లో గుల్బర్గాలో, అల్లావుద్దీన్ హసన్ గంగూ బహమనీ రాజ్యస్థాపన గావించి నప్పటినుండి ఆంధ్ర నాయకరాజ్యాలకు ముస్లిం ప్రమాదం ఏర్పడి, క్రమంగా తెలంగాణా, తీరాంధ్ర ప్రాంతాలు ముస్లిముల వశమయినాయి.

క్రీ.శ. 1500 నుండి 1526 వరకు బహుమనీరాజ్యం విచ్ఛిన్నమై ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యాలేర్పడి నాయి. బీరరులో ఇమాద్ షాహివంశం (1490-1574) మహ్మద్ నగర్‌లో నిజామ్‌షా వంశం (1490-1637) బీజపూర్‌లో ఆదిల్‌షాహి వంశం (1490-1686) బీదర్‌లో బరీద్‌షాహి వంశం (1526-1619) చివరిగా గోల్కొండలో కుదుబ్ షాహీవంశం (1518-1687)లు స్థాపించ బడినవి.

కుతుబ్ షాహి రాజవంశం సుల్తాన్ కులీకుతుబ్ ముల్క్ 1512-46తో ప్రారంభమయింది. ఈయన హమ్‌దాన్‌కు చెందిన కారాకు యున్‌లూ తెగకు చెందిన రాజకుటుంబంవాడు. సుల్తాన్ కులీ తండ్రి పేర్‌కులీ, తల్లి మలిక్‌సాలె. ఈతెగను వారి ప్రతిపక్షులయిన అన్‌కుయున్‌లూ తెగవారు ఓడించి, వారి రాజ్యాన్నిస్వాధీన పరచుకున్నారు. కారాకుయున్‌లూ తెగకు చెందిన మగవాళ్లందర్నీ చంపేసారు. అన్‌కుయున్‌లు తెగతోటి సంఘర్షణలో కారాకుయున్‌లు తెగప్రాబల్యం కోల్పోయి రాకుమారులకు ప్రాణాపాయం ఏర్పడ్డ పరిస్థితుల్లో సుల్తాన్ కులీ తన పిన తండ్రియైన అల్లా కులీతో కలసి భారతదేశానికి వచ్చినాడు. ఢిల్లీ సుల్తానత్‌క్షీణించి ఉత్తర భారత రాజకీయాలు ఆశజనకం కానందున ఉభయులు బహమనీరాజ్యం చేరినారు. నాటికే షియాబ్ ఉద్దీన్ మహమూద్ పాలనలో బహమని రాజ్యం కూడ అంత్యదశలోనే వుంది. కాని ఉత్తర భారత దేశం నుండి మాత్రమేగాక అరేబియా, పర్షియా, టర్కీస్థాన్‌ల నుండి కాందిశీకుల సంఖ్యాకంగా బీదర్ వస్తుండేవారు. కులీ బీదర్‌లో గుర్రాల వ్యాపారం చేయనిశ్చయించినాడని, బానిసగా బహమనీ ఆస్థానంలో ప్రవేశించినాడనీ భిన్న అభిప్రాయాలున్నాయి. ఏమైనా అచిరకాలంలోనే తన పాండిత్యంతో, చాకచక్యంతో, ధైర్యశౌర్యాలతో సుల్తాన్ మహమూద్ అభిమానం సంపాదించి సుల్తాన్ కులీ ఆస్థాన ఉద్యోగి బృందంలో చేరి 'ఖవాస్‌ఖాన్' బిరుదం పొందినాడని తారిఖ్ ఇకుర్బియా మొదలైనస్థానిక కుతుబ్‌షాహి చరిత్రవల్ల తెలుస్తున్నది.

## 16.2 సుల్తాన్‌కులీసేనాపతి పాత్ర :

సుల్తాన్‌కులీ అతికొద్దికాలంలోనే సమర్థుడైన సేనాపతిగా గుర్తింపు సంపాదించినాడు. బహమనీరాజ్యంలో చెలరేగిన అలజడుల్లో మహమూద్‌షా పట్ల విధేయుడై అపారమైన సేవచేసినాడు. దారిదోపిడి దొంగలవల్ల సామంత అవిధేయతవల్ల తెలంగాణా ప్రాంతాల్లో ప్రబలిన అరాచకాన్ని అణచి శాంతి నెలకొల్పినాడు. క్రీ.శ. 1487లో బీదర్‌నగరంలో డక్కానీ ఆఫాకీముస్లిం వర్గాల మధ్య తీవ్రసంఘర్షణ జరిగి సుల్తాన్ ప్రాణానికే ప్రమాదం వాటిల్లగా ఆఫాకీ వర్గనాయకుడిగా కులీ మహమద్‌షాను రక్షించినాడు. అటుపిమ్మట క్రీ.శ. 1493లో గోవా పాలిస్తున్న బహాదూర్ జిలానీ తిరుగుబాటు చేసి జంబుఖండి దుర్గం కేంద్రంగా సుల్తాన్ సైన్యాలను ప్రతిఘటించినాడు. అతనితోటి యుద్ధంలో తెలంగాణాపాలకుడైన కుతుబ్ ఉల్‌ముల్క్ డక్కానీ మరణించడంతో ఢక్కానీ స్థానంలో మహమూద్‌షా, కులిని నియమించినాడు. జంబు ఖండితోపాటు మిరాజ్ మొదలై దుర్గాలను పట్టుకొని, జీలాని తిరుగుబాటును కులీపూర్తిగా అణచినాడు. సుల్తాన్ సంతోషించి కులీకికుతుబుల్‌ముల్క్‌బిరుద మిచ్చి అతణ్ణి గోల్కొండ జాగీర్‌దార్‌గా చేసినాడు. కుతుబుల్‌ముల్క్ బిరుదమే కుతుబ్‌షా వంశనామమయింది.

## 16.3 గోల్కొండ చరిత్ర :

దక్కన్ చరిత్రలో గోల్కొండకు ప్రాముఖ్యత ఉన్నది. ఈ గోల్కొండ ప్రాంతము చాళుక్యుల కాలంలో 'మంగళవరం' అని పిలవబడేది. కాకతీయుల కాలంలో, కొండపై ఒక దుర్గం కట్టబడినది. ఆ కాలంలో కొండపై గోవులను మేపే వారనీ, అందువలన దీనికి 'గోల్కొండ' అనే పేరు వచ్చిందని అభిప్రాయం. క్రీ.శ. 1496 లో సుల్తాన్ కులీ దీనిని జాగీర్దారైనప్పుడి నుండి ఈ దుర్గాన్ని ఎక్కువ శ్రద్ధతో బాగుచేయించి, రక్షణ శ్రేణులను, నివాస ప్రాంతాలను, నిర్మించినాడు. ముందు చూపుగల సుల్తాన్ కులీ, క్రమేణా దీనిని ఒక గొప్ప నగరముగా తీర్చిదిద్ది తన రాజధానిగా మార్చినాడు.

## 16.4 సుల్తాన్‌కులీ స్వతంత్రించుట :

ఎక్కువ మంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం సుల్తాన్ కులీ క్రీ.శ. 1518 వరకు, అనగా బహమనీ సుల్తాన్ అయిన మహమద్ షా మరణించే వరకు కులీ అతడికి విధేయుడై యున్నట్లు గోల్కొండ దుర్గంలో నిజామీ మసీదు శాసనం తెలుపుతుంది. ఈ శాసనం

బహమనీ షా మహమ్మద్ (1482 - 1518) కాలం నాటిదిగా తెలుస్తుంది. అందువలన క్రీ.శ. 1518 చివరి భాగంలో స్వతంత్రించినప్పటికీ 'షా' బిరుదు ధరించక 'కుతుబ్ ఉల్ ముల్' తోనే పిలువబడేవాడు. ఇతడు 'బడె మాలిక్' గా కూడా పిలువబడేవాడు.

## 16.5 కులీకుతుబ్ ఉల్‌ముల్క్ - 1518-1543 ఎ.డి.

**రాజ్యవిస్తరణ :**

క్రీ.శ. 1518లో కులీ స్వతంత్రించినప్పుడు గోల్కొండ జాగీరు కోహిర్ ఓరుగల్లు మధ్య ప్రాంతానికి మాత్రమే పరిమితం. గోల్కొండ రాజ్యానికి దక్షిణాన విజయనగరం, తూర్పున గజపతులు బలపడుతున్నారు. ఓరుగల్లు నుండి తూర్పు తీరంవరకు గజపతుల సామంతుడుగా షితాబ్‌ఖాన్ పాలిస్తున్నాడు. కులీ మొట్టమొదట స్థానిక నాయకుల తిరుగుబాట్లను అణచి వేసేడు. ముందు గజపతులసైన్యాధిపతి సీతాపతి (షితాబ్‌ఖాన్) ఖమ్మం మెట్టు యుద్ధంలో ఓడించి బెల్లంకొండ మొదలైన కోటలను పట్టుకున్నాడు. ఈ యుద్ధం జరిగింది పెనుగంచి ప్రోలువద్ద. సీతాపతి నాయకత్వాన హిందూరాజులు 3 లక్షల కాల్బలాన్నీ, 30వేల అశ్విక బలాన్నీ, 700 ఏనుగుల్నీ యుద్ధరంగంలోకి తెచ్చేరు. ఇంతసైన్యాన్ని సుల్తాన్ కులీ కేవలం 5 వేల అశ్వసైన్యంతో ఓడించాడు. హిందూరాజుల సైన్యం అధికంగా ఉండడం వారికే కాలుచేతులు ఆడని పరిస్థితిని కలిగించింది. యుద్ధంలో ఓడిపోతున్నట్లు నటిస్తూ వెనక్కి తగ్గి మాటువేయడమూ, తరుముతున్నామనుకొని వెంటబడ్డ శత్రువుమీద హఠాత్తుగా ఎదురుదాడి చేయడమూ సుల్తాన్ కులీ అవలంబించే ఎత్తుగడ అన్నారు యాజ్దనీ. ఆయన తన సైన్యంలో కొంత భాగాన్ని రిజర్వులో ఉంచుకొని, హఠాత్తుగా శత్రువుమీద పక్కనుంచి దాడిచేసేవాడని ఆయన వ్రాసేవారు.

క్రీ.శ. 1518-19లో కృష్ణరాయలు కళింగదండయాత్రలో షితాబ్‌ఖాన్‌తోసహా పెక్కుమందిదుర్గాధిపతులను జయించినాడు గాని అనంతరం వారాతని ఆధిపత్యం అంగీకరించలేదు, తీరాంధ్రంకూడ గజపతుల స్వాధీనమయింది. సుల్తాన్‌కులీ రాజ్యవిస్తరణ కాంక్ష ఉన్నమహా యోధుడు. తెలంగాణాన్ని తన పాలనలో సమైక్యం చేయాలని అతని కనీస ఆశయం. కాని, కృష్ణరాయల జీవితకాలంలో అది సాధ్యం కాదనే భావంతో రాజ్యవిస్తరనకు పూనుకోలేదు. రాయల మరణానంతరం క్రీ.శ. 1529 విజయనగరంలోని అంతఃకలహాలు అతనికి మంచి అవకాశమయినాయి. కృష్ణరాయలమరణానంతరం తీరాంధ్రపై గజపతి దండెత్తిన సమయంలోనే బహుశా కులీ కొండవీడుపై దండెత్తినాడుగాని, వెలుగోటి (గని) తిమ్మానాయుడు గోల్కొండ సైన్యాన్ని ఓడించి మరలించాడు. అయితే గోల్కొండ రాజ్యవిస్తరణ రాజుకొండ దుర్గాక్రమణతో ప్రారంభమయింది. అనంతరం దేవరకొంగ, పానగల్లు, ఘనపుర దుర్గాలాతని వశమయినాయి. ఇస్మాయిల్ ఆదిల్షాతో ఘోర యుద్ధం జరిగిన తరువాత కోవిలకొండ కులీస్వాధీనమయింది. ఈ యుద్ధానంతరం అనతి కాలానికే ఆదిల్‌షా మరణించినాడు. (క్రీ.శ. 1534). ఈ విజయాలతో కృష్ణానది వరకు పశ్చిమతెలంగాణము కులీవశమయింది. కులీ ఈదండయాత్రల్లో ఉన్న సమయంలో కినామ్ ఉఖాముల్క్ అనే తురుష్కసర్దారు, ఎల్గందల, మలంగూర్ మొదలైన దుర్గాలను ఆక్రమించి తిరుగుబాటొనర్చినాడు. అతనికి బీరార్ సుల్తాన్ దర్యాఇమాద్ ఉల్‌ముల్క్ సహాయంవుంది. కులీ దండెత్తి, అతని వశంలో ఉన్నదుర్గాలను ఆక్రమించడమేగాక, రాంగీర్ యుద్ధంలో బీరార్‌సైన్యాలను ఓడించి పారదోలినాడు. దీనితో ఉత్తర తెలంగాణా అధిక భాగం అతని పాలనలోకి వచ్చింది. హరిచంద్ తిరుగుబాటునణచి నల్గొండను కులీ ఆక్రమించినాడు.

అనంతరం కులీ, గజపతుల అధీనంలో ఉన్న గోదావరిప్రాంతం వైపు మరలినాడు. షితాబ్‌ఖాన్ సహాయంతో గజపతి కులీ నెదరించినాడు. కాని, ఉభయులు గోదావరి యుద్ధంలో పూర్తిగా పరాజయం పొందినారు. కృష్ణా - గోదావరీ డెల్టాల మధ్య తీరాంధ్రం గొల్కొండ రాజ్యంలో చేరింది.

కులీకుతుబ్‌షా దగ్గర దగ్గర 50 సం॥లు విరామం లేకుండా యుద్ధాలుచేసి, కృష్ణానదికి ఉత్తరంగా ఉన్నతెలుగు ప్రాంతాలన్నింటిని చాలా వరకు గోల్కొండ రాజ్యంలో తన పాలనకింద సమైక్యం చేసినాడు. "నిశిత ఖడ్గధారినై అరవైడెబ్బయి దుర్గాలను స్వయంగా ఆక్రమించినా"నని చెప్పుకున్నాడు. కులీ షియామతస్థుడు. నాటికే టికాపూర్, అహమ్మద్‌నగర్ రాజ్యాలలో షియామతం ప్రచారంలో వుంది. మతవిషయాల్లో కులీ ఉదారభావాలున్నవాడు. నాటిరాజకీయాల దృష్ట్యా సున్నీయైన బహమనీ సుల్తాన్‌తో చేరి, బిజపూర్‌తో పోరాడి నాడు. అతని ఆస్థానంలో హిందువులు ఉన్నత పదవులు నిర్వహించినారు. ఆరవీటి రామరాయలాతనికి కొంతకాలం కుడిభుజంగా ఉన్నాడు.

**...లీకుతుబ్ షా మరణము :**

కడువృద్ధుడు, తొంబయియేండ్లు దాటినవాడై క్రీ.శ. 1543 (2-6-950/2-9-1543) తన రోజువారి దినచర్య అయిన నమాజుకని ఎళ్ళి అసర్ ప్రార్థన చేయుసమయములో, తన కొడుకు జంషీద్ కుట్రకుగురియై, మీర్ మహ్మద్ హమదాని చేత హత్యచేయబడినాడు. తన తండ్రి దేవుని సన్నిధిలో వున్నాడన్న ఇంగిత జ్ఞానములేని కుమారుడు, రాజ్యకాంక్షతో తండ్రిని హతమార్చినాడు.

## 16.6 జంషీద్ కులీ కుతుబ్ షా 1543-1570 క్రీ.శ.

జంషీద్ కులీ కుతుబ్ షా 1543 - 1570 క్రీ.శ. సుల్తాన్ కులీ కుతుబ్ షాకు ఆర్గురు కుమారులు. వారి పేర్లు 1. హైదర్ కులీ, కుతుబ్ - ఉద్దీన్, జంగీద్, అబ్దుల్ కరీం, దౌలత్ కులీ, చివరి వాడు ఇబ్రహీం కులీ. హైదర్ కులీ తండ్రికి ముందే మరణించినాడు. రెండో వాడైన కుతుబ్-ఉద్దీన్ కు రాజకీయాలంటే పడదు. జంషీద్‌కు రాజ్యం అంటే అతి ఆశ. అబ్దుల్ కరీం తిరుగుబాటు చేసి బీజపూర్ పారిపోయినాడు. అచటనే మరణించినాడు. దౌలత్ కులీ భువనగిరి కోటలో బంధి అయినాడు. చిట్టచివరి వాడైన ఇబ్రహీం కులీ సమర్థుడు, యోగ్యుడు తండ్రి పట్ల విధేయుడు. అనేకమైన బాధ్యతాయుత పదవులు నిర్వహించి తండ్రి మరణ సమయంలో దేవరకొండలో రాజప్రతినిధిగా ఉన్నాడు. వీరందరిలోను మూడవ వాడైన జంషీద్, గోల్కొండలోనే బందీగా వుండడం వలన, జైలు అధికారులు కండ్లు గప్పి రాజధానిలో తన వర్గాన్ని బలపర్చుకొని, మీర్ మహమ్మద్ హందానీ ద్వారా, మసీదులో ప్రార్థన చేస్తున్న తండ్రిని హత్య గావించినాడు. అనంతరం బయటబడి, అంతఃపురాన్ని ఆక్రమించి, అన్నకుతుబ్ - ఉద్దీన్ కండ్లు పొడిపించి బందీచేసి సింహాసనం ఎక్కినాడు.

జంషీద్ ఎక్కువ కాలం బందీగా వుండటం వలన క్రమశిక్షణను, కోల్పోయినాడు. కొంతమేరకు రాజ్యపాలనలో సమర్థుడేగాని, పరమ క్రూరుడు. దీనికి ఉదాహరణ వేరేగా చెప్పనవసరం లేదు. మసీదులో ప్రార్థనలో ఉన్న తండ్రిని హత్య చేయించడమే. ఆస్థాన ప్రజలలో, జంషీద్ అంటే సదభిప్రాయంలేదు. నేరాలు చేసిన వారికిఅతి క్రూరమైన శిక్ష విధించేవాడు. చదువుకున్నవాడు. కవిత్వమంటే అభిరుచి. జంషీద్ కాలంలో గోల్కొండ రాజ్యం అభివృద్ధి పొందలేదు. అదే సమయంలో క్షీణించక పోవడం ఆశ్చర్యమని చరిత్రకారుల అభిప్రాయం. జంషీద్ కాలంలో దక్కన్ సుల్తానుల మధ్య సంబంధాలు క్షీణించి రక్తపాతం జరిగింది.

**జంషీద్ - దక్కన్ సుల్తానులు :**

జంషీద్ పట్టాభిషేకానంతరం అతని సోదరుడు ఇబ్రాహింకులీ బీదర్ పారిపోయి మాలిక్ బరీద్ సాయంతో గోల్కొండపై దండెత్తినాడు. జంషీద్‌కు బర్హాన్ నిజాంషా సహాయం లభించింది. ఇబ్రాహీం గోల్కొండ ముట్టడి విరమించి విజయనగరం పారిపోయినాడు. ఈసంఘటనతో గోల్కొండ, అహమ్మద్‌నగర్‌ల మధ్య మైత్రి బలపడింది. ఇది జరిగిన అనతికాలానికే బర్హాన్ నిజాంషా, జంషీద్, ఉమాద్ ఉల్‌ముల్క్ (బీరార్)కలసి బీజపూర్‌పై దండెత్తినారు 1544లో ఇబ్రహీం ఆదిల్‌షా గత్యంతరం లేక మాలిక్ బరీద్ సాయం అర్థించినాడు. కాని, ఉభయులు పరాజయం పొందినారు. మాలిక్ బరీద్‌ను బీదర్ వరకు తరిమి అపార ధనరాశులతో జంషీద్ కుతుబ్‌షా గోల్కొండకు మరలినాడు. ప్రతీకార కాంక్షతో మాలిక్‌బరీత్ పలుమార్లు గోల్కొండపై దండెత్తినాడు. క్రీ.శ. 1545లో పటాన్‌చెరువు, కొల్పగూర్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఓడి, తిరోగమించినాడు. మరుసంవత్సరమే దండెత్తివచ్చి మెదక్‌దుర్గం ఆక్రమించినాడు గాని, నారాయణఖేడ్ యుద్ధంలో ఓడినాడు. అనంతరం బర్హాన్ నిజాంషా, జంషీద్‌లు కలిసి బీదర్ రాజ్య నిర్మూలనం చేయ నిశ్చయించి బీదర్‌పై దండెత్తినారు. బరీద్‌కు ఇబ్రాహింషా సహాయం లభించింది. కౌలాస్ యుద్ధరంగమైయింది. జంషీద్ సేనాని జగదేవరావుయుద్ధంలో ప్రముఖపాత్ర వహించి విజయంసాధించినాడు. నారాయణఖేడ్, హసనాబాద్‌లు జంషీద్‌షా వశమయినాయి.

నారాయణఖేడ్ యుద్ధం తర్వాత క్రీ.శ. 1547లో దక్కన్ సుల్తానుల మధ్య సంబంధాల్లో కొత్త పరిణామం జరిగింది. జంషీద్, బుర్హాన్ నిజాంషాలు ఇబ్రహీం ఆదిల్‌షాను రెచ్చగొట్టితమ కూటమిలో చేర్చుకొన్నారు. బీదర్ రాజ్యనిర్మూలనమే వీరి ఆశయం. నైజాంషా బీదర్‌మీద, ఆదిల్‌షా విజయనగరం మీద దండెత్తడానికి నిర్ణయం జరిగింది. దీనిప్రకారం నిజాంషా దండెత్తి కంధార్‌దుర్గం ముట్టడించినాడు, ఆదిల్‌షా

సహాయం అర్థించడానికై బరీద్‌షా స్వయంగా బీజాపూర్ చేరినాడు. కాని, బరీద్‌ను ఖైదుచేసి ఆదిల్‌షా విజయనగరంపై దండెత్తినాడు. విజయనగరప్రాంతాల నాక్రమించి ఆదిల్‌షా బలవంతుడు కాగలడనే భయంతో నైజాంషా బీదర్ దండయాత్ర విరమించి బీజపూర్ రాజ్యంలోని షోలాపూర్‌పై దండెత్తినాడు విజయనగర దండయాత్రనుండి ఆదిల్‌షా మరలక తప్పలేదు. షోలాపూర్ దగ్గిర ఘోరయుద్ధం జరిగింది. ఈ పరిస్థితుల్లో ఆదిల్‌షా, నిజాంషా, బరీద్‌షాలు ముగ్గురు జంషీద్ సహాయం అర్థించినారు. డెక్కన్ రాజకీయాల్లో మధ్యవర్తిగా గోల్కొండకు [illegible] లభించింది. గోల్కొండ గౌరవప్రతిష్టలు ఇనుమడించినాయి. బరీద్ విముక్తిని సాధించి ఆదిల్‌షా, నైజాంషాల మధ్య సమాధానం కుదిర్చి జంషీద్ బీదర్ వరకు నడచినాడు. కృతజ్ఞతతో బరీద్ అమూల్యములైన బహుమతులిచ్చి జంషీదును గౌరవించినాడు.

**జంషీద్‌కుతుబ్‌షామరణము :**

జంషీద్ షా క్రీ.శ. 1543-1550 వరకు పరిపాలించినాడు. ఈతను పరిపాలించినేడు సంవత్సరాలలో దక్కన్ సుల్తానులతో సహాయ సహకారాలతో గోల్కొండ ప్రతిష్టను ఇనుమడింపచేసినాడు. మొదటి నాలుగైదు సంవత్సరములు యుద్ధాలతో గడిపినాడు. మిలిన రెండు సంవత్సరములు విశ్రాంతి తీసుకొనదల్చినాడు - కాని ఈ రెండుసంవత్సములు జంషీదు రాజయక్ష్మవ్యాధిచే అనారోగ్యం పాలయినాడు దీనినే కుతుబ్‌షాయి రచనలో కేన్సరుతో అని లిఖించబడినది. జంషీదుషా 3-1-957/22-1-1550లో చనిపోయినాడు.

**రాజకీయ అనిశ్చత : 22-1-1550 - 27-7-1550**

సుమారు ఆరునెలలపాటు, జంషీద్ మరణానంతరం గోల్కొండ రాజకీయ సంక్షోభం ఏర్పడినది. రాణీ జిల్‌కిస్ జమాన్ తన కుమారుడైన సుఖాన్ కులీ సింహాసనం ఎక్కించింది. సుఖాన్ కులీ ఏడేండ్ల బాలుడు. రాణీ జిల్‌కిస్ జమాన్‌కు, విదేశీ ముస్లిం నాయకులైన ముస్తఫా ఖాన్, సలాబత్ ఖానుల సహాయం అందినది. సైఫ్‌ఖాన్ అయినుల్ ముల్క్ రాజ్యవ్యవహారాలు చూసేవాడు. సైఫ్ ఖాన్ పరిపాలనా ఆస్థానంలో ఎవ్వరికి గిట్టలేదు. ఈ పరిస్థితులలో జగదేవరావు, అతని సహాయకులు భువగిరిలో బందీగా ఉన్న దౌలత్ కులీని సుల్తాన్ ప్రకటించడంతో రాజకీయ అనిశ్చిత ఏర్పడి, అంతర్యుద్ధం మొదలైంది. సైఫ్ ఖాన్ తిరుగుబాటును అణచి, దౌలత్ కులీని తిరిగి భువనగిరిలో బందీచేసినాడు. జగదేవరావును బందీగా చేసి గోల్కొండ తెచ్చినాడు.

తిరుగుబాటును అణచిన గర్వంతో సైఫ్ ఖాన్ సర్దారుపట్ల అహంకారంతో ప్రవర్తించుట వలన, సర్దారులందరూ కలసి విజయనగరంతో ప్రవాసిగా వున్న ఇబ్రహీం కులీని సుల్తాన్‌గా ప్రకటించటానికి సిద్ధమైనారు. గోల్కొండలో పరిస్థితులు తనకు అనుగుణంగా ఉన్నాయని గ్రహించిన ఇబ్రహీం కులీ రాయల సైనిక సహాయంతో గోల్కొండకు బయలుదేరినాడు. మస్తఫా, సలాబత్ ఖాన్‌లు తమ బాలతో ఇబ్రహీంను చేరినారు. ఇబ్రహీం కులీని ఎదిరించటానికి సైఫ్ ఖాన్ పెద్ద సైన్యంతో కోయిల కొండపై నడచినాడు. ఈ సమయంలోనే గోల్కొండలో తిరుగుబాటు జరిగి, జగదేవరావు బంధవిముక్తుడై సుఖాన్ కులీని ఖైదు చేసినాడు. పరిస్థితులను గ్రహించిన సైఫ్ ఖాన్ బీరార్ పారిపోయాడు. ఇబ్రహీం కులీ, గోల్కొండనాక్రమించి, క్రీ.శ 1550 లో పట్టాభిషేకం జరుపుకున్నాడు.

## 15.7 ఇబ్రాహీంకులీ కుతుబ్‌షా 1550-1580

క్రీ.శ. గోల్కొండను పరిపాలించిన ఏడుగురు సుల్తానులలో ఇబ్రాహీం కులీ విశిష్టమైన వ్యక్తిత్వం ఉన్నవాడు. అతి సమర్దుడు. షిరాజ్ మొదలైన సమకాలిక రచయితలు అతని పాలనాధ్యక్షతను ప్రశంశించినారు. చిరకాలం విజయనగరాస్థానంలో ఉన్నందున రాజనీతి చాతుర్యమేగాక ఆంధ్ర భాషా సంస్కృతుల్లో అతనికి అభిమానం ఏర్పడింది. సంక్షుభితమైన గోల్కొండపాలనాయంత్రాంగాన్ని ఇబ్రహీంకులీ పటిష్టం చేసినాడు. తెలంగాణాప్రాంతాల్లో కల్లోలానికి కారణమైనదోపిడి దొంగలను దారుణంగా శిక్షించి దేశంలో శాంతిభద్రలు నెలకొల్పినాడు. గూఢాచారి దళాన్ని ఏర్పరచి స్థానిక సమాచారం సేకరించి అవసరచర్యలు తీసుకొనేవాడు. అతనికాలంలో న్యాయశాఖ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆలీచీన్ అజీజుల్లా అభిప్రాయంలో న్యాయశీలతలో ప్రపంచరాజులందరికీ ఇబ్రహీం ఆదర్శప్రాయుడు. ఇబ్రహీం కులీ గురించి కొమర్రాజు లక్షణరావుగారు తన మహ్మదీయ మహాయుగంలో ఇలా వ్రాశాడు. "ఈ నవాబు విద్వాంసుడు ఇతని రాజ్యంలో దొంగల భయం

లేదు. మసీదులను, ప్రాసాదములను కట్టించి, చెరువులను తవ్వించి, ఎన్నో ప్రజోపయోగమైన పనులుచేశాడు". గోల్కొండ దుర్గానికి చుట్టూ ప్రహరీగోడ ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్ అనేతోటలు, హుస్సేన్ సాగర్ అనే బ్రహ్మాండమైన చెరువు, మూసీనదికి బడవల్ వద్ద ఆనకట్ట ఇతడే కట్టించాడు. టర్కీ, అరేబియా, పర్షియాలనుండి విదేశీ వర్తకులు గోల్కొండకు విపరీతంగా వచ్చేవారు.

ఇబ్రాహీం కులి పరిపాలన కట్టుదిట్టం చేసి దాక్షిణాత్య రాజకీయాలపై దృష్టి మరల్చినాడు. ఇబ్రాహీం శాంతి కాముకుడని ముస్లిం చరిత్రకారులభివర్ణిస్తారు. సుల్తానుల మధ్య కొంత వరకు అతను మధ్యవర్తిగా వ్యవహరించి, తుల్యప్రాబల్య సిద్ధాంతం అనుసరించే ప్రయత్నం చేసి, వారి మధ్య అనవసర రక్తపాతాన్ని నివారించాడు. అతని విధానాల వలనే కొత్త పరిణామాలేర్పడి, విజయ నగరానికి వ్యతిరేకంగా సుల్తానులకూటమి ఏర్పడినదనడం చాలావరకు యధార్థం.

**ఇబ్రాహీం కులీకుతుబ్‌షా - దక్కనుసుల్తానులు :**

చిరకాలంగా వున్న అహమద్‌నగర్, గోల్కొండల మధ్య మైత్రి పాటిస్తూ గుల్బర్గాను నిజాంషా రాజ్యంలో చేర్చే ఉద్దేశ్యంతో హుస్సేన్ నిజాంషాతో కలసి ఇబ్రాహీం కులీ బీజపూర్‌పై దండెత్తినాడు. (క్రీ.శ. 1557) ఇబ్రాహీం ఆదిల్‌షా విజయనగర సహాయం అర్థించినాడు. రామరాయలు జోక్యం కలిగించుకొని సుల్తానుల మధ్య సమాధానం కుదిర్చినట్లు తెలుస్తుంది. గుల్బర్గాను ఆక్రమించి నైజాంషా బలవత్తరుడవుతాడనే భయంతో ఇబ్రాహీం యుద్ధ విరమణ చేసినాడని ఫెరిస్టా కథనం. బీజపూర్‌లో ఇబ్రాహీం ఆదిల్‌షా మరణానంతరం ఆలీ ఆదిల్‌షా సింహాసనం ఎక్కినాడు. రామరాయలు ఆలీ ఆప్తమిత్రుల్లోనివాడు ఆలీయుద్ధ ప్రియుడు: రాజ్యవిస్తరణకాంక్ష కలవాడు. అందుచే సుల్తానుల మధ్య యుద్ధాలు తిరిగి ప్రారంభమయినాయి. రామరాయలతో సంధి కుదుర్చుకొని కొల్హాపూర్ కల్యాణ్ ప్రాంతాలనాక్రమించే ఆశయంతో ఆలీ అహమ్మద్ నగర్‌పై యుద్ధానికి సన్నద్ధుడయినాడు. ఈ కూటమిలో ఇబ్రాహీంకులీ చేరినాడు. విజయనగరంతో వైరం ప్రమాదకరమని ఇబ్రాహీం అభిప్రాయమై యుండవచ్చు. పరోక్షంగా నైజాంషాకు సహాయంచేసే ఉద్దేశ్యంతోనే ఇబ్రాహీంకులీ కూటమిలోచేరినాడని కొందరి అభిప్రాయం. కూటమిసైన్యాలు అహమ్మద్ నగర్‌ను ముట్టడించగా హుస్సేన్ నిజంషా రాజధానిని విడిచి పరాజయభయంతో పారిపోయినాడు. బీజపూర్, విజయనగర సైన్యాలు అహమ్మద్‌నగర్‌ను దోచుకొని చాల నష్టం కలిగించినాయి. చివరకు ఇబ్రాహీం కులిజోక్యం కలిగించుకొని వారిని మరలించినాడు. కల్యాణి దుర్గం బీజపూర్ వశమయింది. ఇదే సమయంలో బహుశ ఇబ్రాహీంకులీపైజగదేక రావుతిరుబాటుచేసినాడు. బీరార్ సుల్తాన్ సహాయంతో దౌలత్ కులీని సింహాసనం ఎక్కించాలని అతని ప్రయత్నం. అతనికి ఎల్లందలకేంద్రం. ముస్తఫాఖాన్ దండెత్తి జగదేవరావునోడించి ఎల్లందల ఆక్రమించినాడు. జగదేకరావు విజయనగరం పారి పోయినాడు. రామ రాయలాతణ్ణి ఆదరించి ఉన్నతోద్యోగంలో నియమించినాడు. రామరాయలచర్య ఇబ్రాహీం కులీకి ఆగ్రహకారణమయింది.

**దక్కన్ సుల్తానులమధ్య వివాహ సంబంధాలు :**

ఫెరిస్టా రచనల ప్రకారం దక్కన్ సుల్తానుల మధ్య వివాహ సంబంధాలలో ఇబ్రహీం కుతుబ్ షాదే కీలకపాత్ర. విజయనగర, బీజపూర్ రాజ్యాలతో ఏర్పడిన విరోధం వలన గోల్కొండ, అహమ్మద్ నగర్ రాజ్యాలు సన్నిహితమైనాయి. ఈ సన్నిహిత సంబంధాలు, వివాహ సంబంధాలలోకి మార్చినాయి. నైజాంషా తన చెల్లెలు బీబీ జమాల్ ను ఇబ్రహీంకిచ్చి కళ్యాణి దుర్గం సమీపంలో పెండ్లిచేసి ఉభయులు కలిసి 1562 లో కళ్యాణి దుర్గంపై దండెత్తినారు. బీజపూర్‌కు సహాయంగా విజయనగర రాయలు తమ్ముడైన వెంకటపతి, జగదేకరావు, బన్ ఉల్ ముల్, చందాఖాన్‌లతో ఇబ్రహీం రాజ్యంపై దండెత్తగా రామరాయలు నిజాంషాపై దండెత్తి ఆ రాజ్యంను కొల్లగొట్టినాడు. ఇబ్రహీం, హుస్సేన్‌లు కళ్యాణి దుర్గం ముట్టడి మధ్యలోనే విరమించవలసి వచ్చినది. కళ్యాణి దుర్గంను ఆదిల్ షా ఆక్రమించినాడు. విజయనగర సైన్యాలు గోల్కొండను దోచుకున్నాయి, జగదేకరావు ప్రోద్బలంలో ఇంద్రకొండ, కోయిల కొండ, ఘనపుర, పానగల్లు సామంతరాజులు ఇబ్రహీం కుతుబ్‌షా పై తిరుగుబాటుచేసినారు. రామరాయల ప్రోద్బలంతో కొండవీటి సామంతుడు గని తిమ్మానాయుడు కొండపల్లిపై దండెత్తినాడు.

ఇబ్రహీం కులీ తన రాజనీతి ప్రజ్ఞతో, రాజ్యంలో ఏర్పడిన క్లిష్ట పరిస్థితిని చక్కదిద్దుటకు నిశ్చయించినాడు. ముస్తఫాఖాన్‌తో చర్చించి, అతని సలహాపై, విజయనగర, బీజపూర్ రాజ్యాలతో సంధి, సంప్రదింపులు మొదలుపెట్టినాడు. మరోప్రక్క విజయనగర రాజ్య స్థిరత్వంతో

భయపడిన ఆలీ ఆదిల్ షా, ఆలీ బరీద్ షాలు, గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీంతో స్వయంగా సంప్రదింపులు జరపటానికి నిశ్చయించినార ఘనపుర, పానగల్ దుర్గాలు గెల్చుకొని రామరాయలు విజయనగరం చేరినాడు. రామరాయలు నిష్క్రమించిన తర్వాత, ఇబ్రహీం, శత్రువుల చేరిన ఇంద్ర కొండ కేశవరావు మొదలైన సామంతులనణచినాడు. గోల్కొండ దుర్గానికి కొత్త రక్షణ శ్రేణులు నిర్మించి దుర్భేద్యం చేయడం జరిగింది.

విజయనగర సుస్థిరత్వంను గ్రహించిన, దక్కన్ సుల్తానులు భయందోళనలతో, ఒక కూటమిగా ఏర్పడాలని నిర్ణయించినారు. దీనిల కీలక పాత్ర పోషించినది బీజపూర్ సుల్తాన్ ఆదిల్ షా అని ఫెరిస్టా తెలుపగా, నిజాం షా, కుతుబ్ షాలు అని, కుతుబ్ షాహీ చరిత్రకారుల వ్రాసినారు. ఈ కూటమికి ముందుగానే ఆదిల్ షా, కుతుబ్ షాహీ వంశాల మధ్య వివాహ సంబంధం కుదిరింది. హుస్సేన్ షాని నిజా తన కూతురు ప్రసిద్ధురాలైన చాంద్ బీబీని, ఆలీ ఆదిల్ షాకిచ్చి వివాహం చేసినాడు. ఆలీ ఆదిల్ షా చెల్లెలు హరియా సుల్తానాను నిజా షా యువరాజు ముర్తుజా పెండ్లాడినాడు. ఎప్పటినుండో బీజపూర్‌కు, అహమ్మద్ నగర్‌కు మధ్య యుద్ధాలకు కారణమైన షోలాపూర్, బీజాపూరుకు దత్తమైంది. ఈ వివాహ సంబంధాలతో ఆదిల్ షా - బీజపూర్, నిజం షా - అహమ్మద్ నగర్, కుతుబ్ షా - గోల్కొండల మధ్య మైత్రి ఏర్పడినది. వీరందరి దృష్టి హిందూ రాజ్యమైన విజయనగరంపై మరలినది.

**తల్లికోట యుద్ధం 1565 క్రీ.శ. :**

దక్కను సుల్తానుల సైన్యం క్రీ.శ. 24-12-1564 లో విజయనగరముతో యుద్ధమునకు బయలుదేరినవి. ముస్లించరిత్రకారుల ప్రకారం ఆదిల్‌షా బీజపూరు - నిజాంషా అహ్మద్ నగర్, కుతుబ్‌షా - గోల్కొండ, బరీద్‌షా - బీదర్‌లు మాత్రం కూటమిలో చేరినారని, బీరార్‌సుల్తాన్ ఖుర్వాన్ ఇమాద్‌షా చేరలేదని తెలుస్తుంది. **తెలుగు లోని స్థానిక చరిత్రలు** 'పంచపాదుషాల'ను పేర్కొంటున్నాయి. సుల్తాను కూటమి విజయనగంపై యుద్ధం ప్రకటించి **తల్లికోటకు తమసైన్యాలను నడిపించింది.** రామరాయలు యుద్ధానికి సిద్ధమయినాడు. యుద్ధం కృష్ణానదికి దక్షిణంగా జరిగిందని ముస్లిం చరిత్రకారులు **వ్రాసినారు గాని స్థల నిర్దేశం చే**యలేదు. వారి రచనలపట్ల విశ్వాసంతో ఆచార్యషేర్వాణీ యుద్ధం మూసీ-హుక్కేరి నదులసంగమస్థలంలో **బట్టి హట్టి లేక బానిహట్టి వద్ద 23-1-1565**లో జరిగినట్లు నిర్ణయించినాడు. ఇదికేవలం ఊహపై ఆధారపడి, ఇతర ఆధారాలను పరిగణింపని **నిర్ణయం. రా॥ స్ మాయల్** యుద్ధం తల్లికోట సమీపంలో జరిగిందని నిర్ణయించి, దాన్ని తల్లికోట యుద్ధంగా నిర్ణయించినాడు. **హిరాస్ పండితుడు యుద్ధం కృష్ణానదికి ఉ**త్తరంగా రాక్షసితంగడి గ్రామాల మధ్య జరిగిందనగా, నేలటూరు వెంకటరమణయ్యగారు ఆనిర్ణయాన్ని బలపరచినారు. **తెలుగు, కన్నడ భా**షల్లోని స్థానిక చరిత్రలు సుల్తానులకు రాయలకు మధ్య యుద్ధం కృష్ణా మలప్రభా సంగమ స్థలంలో **రాక్షసి-తంగడి గ్రామాల మధ్య**జరిగిందని ముక్తకంఠంగా చెబుతున్నాయి. **తల్లికోట** యుద్ధంలో రామారాయలు మరణించి, విజయనగరసైన్యాలు **సర్వనాశనమయినాయి.** విజయగర్వంతో ముస్లింసైన్యాలు విజయనగరంలో ప్రవేశించి ప్రధాన నిర్మాణాలను ధ్వంసంచేసినాయి. **హిందూ రాజకీయాధికార కేం**ద్రంగా విజయనగరాన్ని నిర్మూలించాలనే సుల్తానుల ఆశయం ఫలించింది. తల్లికోట యుద్ధం జరిగిన కొంతకాలనికే సుల్తాన్ కూటమిలో విభేధాలు కలిగి, విచ్ఛిన్నమై వారి **మధ్య** అంతర్యుద్ధాలు చెలరేగినాయి. విజయనగర రాజ్యంలోని కల్లోలిత పరిస్థితి అవకాశంగా తీసుకొని ఆదిల్‌షా-బీజపూర్, **కర్ణాటకంలో** విస్తరించడానికి ప్రయత్నించినాడు. బీరార్ రాజ్యాన్ని ఆక్రమించాలని నిజాంషా ఆశయం. ఇబ్రాహీంకులీ అనుసరించిన **తుల్యప్రాబల్య** విధానం పూర్తిగా విఫలమయింది. తల్లికోట యుద్ధం జరిగిన వెంటనే ముస్తఫాఖాన్ (ఇబ్రాహీం కులిమంత్రి) రాయచూరు **అంతర్వేది**ని ఆక్రమించి ఆలీ ఆదిల్‌షాపరంచేయడం హుస్సేన్ నిజాంషాకు ఆగ్రహం కలిగించింది. ఆతణ్ణి తృప్తిపరచడానికై ముస్తఫాఖాన్‌ను పదవినుండి ఇబ్రాహీంకులీతొలగించవలసి వచ్చింది. ఇంతలో హుస్సేన్ నిజాంషా మరణించి, మూర్తుజా అహమ్మద్‌నగర్ సింహాసనం ఎక్కినాడు. మూర్తుజా రాజనీతిలో చతురుడు, మంచియోధుడు. కాని, చపలచిత్తుడని ప్రసిద్ధి. కేవలం స్వార్థంతో వ్యవహరించేవాడు. అతనితోటి మైత్రివల్ల ఇబ్రాహీం కులీకి లాభం కంటెనష్టమే ఎక్కువగా కలిగింది.

**ఇబ్రాహీం కులీ కుతుబ్‌షా వైఫల్యాలు :**

సుల్తానులకూటమిలో చేరని నేరానికి ఇమాద్‌షాను శిక్షించే ఉద్దేశంతో క్రీ.శ. 1566లో ఆలీ ఆదిల్‌షా-బీజపూర్, మూర్తుజా-అహమ్మద్ నగర్‌లు కలసి బీరారుపై దండెత్తగా బీరార్ మంత్రి తుఫాల్ ఖాన్ వారికి యుద్ధ పరిహారం చెల్లించి మరలించినాడు. బీజపూర్, అహమ్మద్

నగర్‌లమధ్య మంత్రిఎంతో కాలం కొనసాగలేదు. క్రీ.శ. 1567లోనే ఆలీ ఆదిల్ షా, అహమ్మద్ నగర్‌పై దండయాత్రలు ప్రారంభించినాడు. ఇబ్రాహీం ముర్తుజాపక్షం వహించినాడు గాని, క్రీ.శ. 1569లో ఆదిల్ షా కుతంత్రాన్ని గ్రహించలేక కుతుబ్‌షా సైన్యం పైనే దాడిచేసి మూర్తుజానిజాంషా 150 ఏన్గులను సంగ్రహించినాడని ఫెరిస్టావ్రాసినాడు. కర్ణాటకంలో ఆదోని, బంకాపుర, ధార్వాడ దుర్గాలను ఆక్రమించి ప్రబలుడవుతున్న ఆలీ ఆదిల్‌షాను, తిరుమల రాయలు, మూర్తుజాలతో కలసి అరికట్టాలని ఇబ్రాహీంకులీచేసిన ప్రయత్నం కూడా మూర్తుజా నిజాంషా మొండితనం వల్ల విఫలమయింది. బీగార్ స్వాతంత్ర్యాన్ని నిర్మూలించి అహమ్మద్ నగర్‌లో కలిపి వేయాలనే ప్రయత్నం మూర్తుజా నిజాంషా విరమించేదు. ఆలీ ఆదిల్‌షా, ఆలీ బరీద్ షాలతోకలసి మూర్తుజాను ప్రతిఘటించడానికై ఇబ్రాహీంకులీచేసిన కృషి ఫలింపకపోగా మూర్తుజా, ఆలీ ఆదిల్‌షాలు చేసుకున్న ఒప్పందం ప్రకారం బీరారును మూర్తుజా, కర్ణాటక ప్రాంతాలను ఆదిల్‌షా ఆక్రమించడానికి అంగీకరించినారు. ఆలీబరీద్, బుర్హాన్ ఇమాద్‌షాలను కూడగట్టుకొని ఇబ్రహీంకులీ, మూర్తుజా దురాక్రమణనరికట్టే ప్రయత్నం చేసినాడు. నిజాంషాహిసైన్యాలు తెలంగాణంపై దాడులు జరిపినాయి. కౌలాస్ దుర్గం పరశురామ ప్రీతి అయింది. క్రీ.శ. 1574లో బీరార్, అహమ్మద్ నగరంలో లీనమయింది. ఇది ఇబ్రాహీం కులీరాజనీతికి పెద్దపరాజయం. క్రీ.శ. 1579లో ఆలీ ఆదిల్‌షా మరణానంతరం బీజపూర్ రాజకీయాలు కల్లోలితం కాగా మూర్తూజాతో కలిసి బీజపూర్ రాజ్యాన్ని విచ్ఛిన్నంచేయాలని కుతుబ్‌షా చేసిన ప్రయత్నాలు విఫలమయినాయి. ఆలీ ఆదిల్‌షా, మూర్తుజారాజ్య విస్తరణ ఇబ్రాహీం కులీ అరికట్టలేకపోయినాడు. కర్ణాటకరాజులైన తిరుమల, శ్రీరంగరాయలులకు క్రీ.శ. 1576లో సాయంచేసి ఆదిల్‌షా దురాక్రమణను ఆపడంకూడ అతనికి సాధ్యంకాలేదు. అతనితుల్య భారవిధానం ఫలించలేదు. అందుచే బీజాపూర్‌కు సమవుజ్జీగా గోల్కొండరాజ్యాన్ని ఆంధ్రప్రాంతంలో విస్తరింపజేయడం సముచితమని ఇబ్రాహీం కులీ భావించాడు.

**ఇబ్రాహీంకులీకుతుబ్‌షా ఆంధ్రప్రాంత రాజ్య విస్తరణ :**

గజపతి రాజ్యంలో పరిస్థితులు భిన్నంగామారి, అంతర్యుద్ధానికి దారి తీసినాయి. ఈ పరిస్థితులను గ్రహించిన ఇబ్రహీం కులీ రాజ్య విస్తరణ తలపెట్టినాడు. అయినుల్ ముల్క్, సలాబత్ ఖాన్ సర్దారులను, క్రీ.శ. 1572 లో, కుతుబ్ షా సైన్యంతో, ఆంధ్ర ప్రాంతమైన రాజమహేంద్రవరం, కశింకోట, వీరఘట్టాలను ఆక్రమించటానికి పంపినాడు దక్షిణ కళింగ, కొండవీటిని గోల్కొండ రాజ్యంలో కలపటమైంది. అటుపిమ్మట, వినుకొండ, కంభం, కొచ్చర్ల కోటలను పట్టుకొని గోల్కొండ సేనాని మీర్ షామీర్ ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువ భాగాన్ని గోల్కొండలో విలీనం చేసినాడు.

**ఇబ్రాహీం కులీ కుతుబ్‌షా మరణం :**

ఇబ్రాహీం కులీ కుతుబ్‌షా క్రీ.శ. 1580లో మరణించినాడు. గోల్కొండసేనాని మురహరిరావు అహోబలదేవాలయాన్ని బంగారు విగ్రహాలతో సహా దోచి సుల్తాన్ ముందు ప్రదర్శింపగా ఇబ్రాహీంకులీ భిన్నుడై స్వస్థతచెడి మరణించినాడని ఒక గాథ. ఏమైనా ఇబ్రాహీం కులీ మరణం చాలా ఆకస్మిక సంఘటన అని చరిత్ర కారుల అభిప్రాయం. ఇబ్రాహీంకులీ కాలంలో గోల్కొండ సర్వతోముఖాభివృద్ధి చెందినదనడం నిర్వివాదం, రాజ్యంలో శాంతి భద్రతలు నెలకొన్నాయి. 'పెట్టెడు బంగారంతో వృద్ధురాలైనా గోల్కొండనుండి బెంగాలుగాని, బీజపూరుగాని నిర్భయంగా వెళ్ళగలిగేది' అని ఫెరిస్టావంటివారు లిఖించినారు. ఇబ్రాహీంకులీ సారస్వతప్రియుడు, ఉరుదు, ఫారశీక, తెలుగు కవులనాదరించి పోషించినాడు. ఇబ్రాహీం 'ఇభరాముడ'ని ప్రసిద్ధిచెందినాడు. అతనిధైర్యశౌర్యాలు, విద్యాపోషణను గురించి తెలుగులోపెక్కు చాటువులున్నాయి. ఇబ్రాహీంకులీ అనేకమంది తెలుగు కవులనుపోషించాడు. "మల్కిభారం" అనేపేరుతో కవులీతనిని కీర్తించారు. అద్దంకి గంగాధరుడనే కవి తపతీసంవరణోపాఖ్యానం వ్రాసి, ఇబ్రాహీంషాకు అంకితం ఇచ్చాడు. కందు కూరు రుద్రకవి నిరంకుశోపాఖ్యానం అనే ఒక కావ్యాన్ని, సుగ్రీవ విజయమనే యక్షగానాన్ని వ్రాశారు. ఈ కవికి ఇబ్రహీంషా చింతలపాలెం అనే అగ్రహారందానం చేశాడు. మల్లారెడ్డి అనేమరొక కవి శివధర్మోత్తరము, షట్ చక్రవర్తులచరిత్రము మొదలయిన గ్రంథాలు వ్రాశారు. వీరుగాక ఇంగా అనేక కవులు ఇబ్రాహీం పరిపాలనాకాలంలో వర్ధిల్లారు.

ఇబ్రాహీంకులీ పెద్దకొడుకు తండ్రికి ముందే చనిపోయెను. రెండో కొడుకు హుస్సేన్ ఆలీ ఏకారణం చేతనో సింహాసనం ఎక్కలేదు. మూడోకొడుకు మహమ్మద్ కులీ సుల్తానయ్యేడు. బహుశా అంతఃపుర కుట్రల ఫలితంకావచ్చు. ఈ యనతల్లి భగీరధి అనే హిందూస్త్రీ

అని కొందరంటారు. విదేశీయాత్రికుల కథనం ప్రకారం ఆమె పేరు భాగ్మతి అనీ, హిందూ నాట్యకత్తె అనీ, ఆమెపేరున కట్టిన భాగ్యనగరమే నేటి హైద్రాబాద్ అనీ అంటారు.

## 16.9 మహమ్మద్ కులీకుతుబ్‌షా 5-6-1580 - 11-1-1612

ఇబ్రాహీం కులీ కుతుబ్‌షాకు ఆరుగురు కొడుకులు అందులో పెద్దవాడైన అబుల్ ఖాదర్ తండ్రి పట్ల అవిధేయతవల్ల దేవరకొండలో ఖైదీగా - తండ్రి కంటేముందే మరణించినాడు. రెండోవాడైన హుస్సేన్ కులీ మంచి విద్వాంసుడు. తర్కవేదాంతశాస్త్రాల్లో పండితుడు. మూడో కొడుకు ముహమ్మద్ కులీ పదునాలుగేండ్లబాలుడు, ఇతణ్ణే ఇబ్రాహీం కులీతనకు వారసుడుగా నిర్ణయించినట్లు తెలుస్తుంది, మిగిలిన ముగ్గురు, అబ్దుల్ ఫతేహ, ఖదాబంద్, ముహమ్మద్ అమిన్‌లు అతిచిన్నవారు. యుక్త వయస్కుడు, విద్వాంసుడునైన హుస్సేన్‌ను కాదని ముహమ్ముద్ కులీ సింహాసనానికి రావటం అంతఃపురకుట్రవల్ల జరిగివుండవచ్చని షేర్వాణీ వంటిచరిత్రకారుల అభిప్రాయం.

**ముహమ్ముద్ కులీకుతుబ్‌షా పరిపాలన :**

మహమ్మద్ కులీకుతుబ్ షా రాజ్య పరిపాలనకు వచ్చేటప్పటికి పదునాలుగేండ్ల బాలుడు అప్పటికే రాజ్య వ్యవహారాలలో మంచి శిక్షణ పొందినాడు. ఇతడు మంచి విద్వాంసుడు. దక్కన్ భాష గ్రంధకర్త, తెలుగులో కవి. కళలన్నా గొప్ప అభిమానం. మహమ్మద్ కులీ, సోదరుల, సామంతుల తిరుగుబాట్లను ఎదుర్కొన వలసి వచ్చింది. విజయనగర రాయలైన వెంకటపతితో తీవ్ర యుద్ధం జరపవలసి వచ్చినది. మొగలాయిల విస్తరణ ఈతని కాలంలోనే ప్రారంభమైంది. పేష్వామీర్ ముమన్ ఆర్డిస్టానీ, మీర్‌జుమ్లా ఆమీన్ ఉల్ మల్క్‌ల సహాయంతో, తిరుగుబాట్ల నణచి, దేశంలో శాంతి నెలకొల్పినాడు. విద్యలకు, కళలను మహమ్మద్ కులీ ఎక్కువగా పోషించి, ఆదరించినాడు. అందువలన మహమ్మద్ కులీ కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్ర కారులు వర్ణిస్తారు.

**ముహమ్ముద్ కులీ కుతుబ్‌షా - విజయనగరం :**

ముహమ్మాద్ కులీ సింహాసనం ఎక్కిన సమయంలో నల్‌దుర్గ దగ్గర బీజపూర్‌తో యుద్ధం సాగుతున్నది బీజపూర్‌ను విచ్ఛిన్నంచేయాలన్న ఇబ్రాహీంకులీ సంకల్పం నెరవేరలేదు. అందుచేత బీజపూర్‌తో సమాధానం కుదుర్చుకొని క్రీ.శ. 1581 సం॥లో ముహమ్మాద్ కులీ గోల్కొండ సైన్యాలను ఉపసంహరించినాడు. ఇదే సమయంలో ఆలీకాన్ లూర్‌సేనాని తిరుగుబాటుచేసి, వెంకటపతిరాయల సాయంతో కొండవీడు నాక్రమించడానికి ప్రయత్నించినాడుగాని, లాభంలేకపోయింది. కుతుబ్‌షా సామంతుడుగా కొండవీడు పాలిస్తున్నరాయ్ రావ్ ధైర్యసాహసాలవల్ల కొండవీడు లూర్‌కు లొంగలేదు. ఈలోగా గోల్కొండ సైన్యాలు లూర్ తిరుగుబాటు నణచినాయి. అనంతరం ముహమ్మాద్ కులీ తన చెల్లెలు చాంద్ సుల్తాన్ (మాలికా - ఇ - జహాన్)ను ఇబ్రాహీం ఆదిల్‌షాకిచ్చి పెండ్లిచేసి, బీజపూర్, గోల్కొండలమైత్రి పటిష్టంచేసినాడు.

ఆలాఖాన్ లూర్‌కు వెంకటపతి సహాయం చేయడంతో విజయనగర, గోల్కొండల మధ్య సంఘర్షణ ప్రారంభమయింది. అమీన్ ఉల్‌ముల్క్ నాయకత్వంలో కతుబ్‌షా హీ సైన్యాలు కర్నూలు, గుత్తి, ఉదయగిరి, గండికోటలాక్రమించి, పెనుగొండపై నడిచినాయి. వెంకటపతిరాయలు సంధిసంప్రదింపులతో సుల్తానును నమ్మించి సామంత సైన్యాలు కూర్చుకొని హటాత్తుగా గోల్కొండసైన్యాలపై పడినాడు. కృష్ణానదిలో వరదలు ప్రారంభించడంతో గోల్కొండ సైన్యాలు మరలక తప్పలేదు. కొండవీడు మినహా మిగిలిన దక్షిణ ఆంధ్రప్రాంతాలను వెంకటపతి ఆక్రమించినాడు. విజయనగరంతో యుద్ధకాలంలోనే గోల్కొండసామంతులు రాజ్యం నలుమూలలా తిరుగుబాట్లు ప్రారంభించినారు. కొండవీటి ప్రాంతంలో భదేరావ్, ఆలంఖాన్ పరాల్లను అమీన్ ఉల్‌ముల్క్ అణచినాడు. ఇంతలో క్రీ.శ. 1590లో కసింకోట పాలకుడైన ముకుందరాజుబాహుబలేంద్రుని తిరుగుబాటు జరిగింది. ఈతనితో కొండవీడు, ఏలూరు, రాజమహేంద్రవరసర్దారులు చేరి, తీరాంధ్రమొత్తం తిరుగుబాటు ప్రభావానికి గురి అయింది. సుదీర్ఘమైనపోరాటం తార్వాత ఆమీన్ ఉల్‌ముల్క్ (సర్‌నోబత్) చంఘిజ్ ఖాన్లు ఈతిరుగుబాటునణచి శాంతినెలకొల్పినారు.

**మొహమ్మూద్ కులీకుతుబ్‌షా - మొగలుచక్రవర్తి అక్బర్ పాదుషా :**

మొహమ్మూద్ కులీకుతుబ్‌షా కాలంలోనే దాక్షిణాత్యరాజ్యాలకు మొగలాయీ విస్తరణప్రమాదం ఏర్పడింది. ఇంచుమించు అదే కాలానికి క్రీ.శ. 1606, పాశ్చాత్యవర్తక సంఘాలు ఆంధ్రదేశంలో ప్రవేశించి వాణిజ్యం ప్రారంభించినాయి. డచ్చికంపెనీవారు మచిలీపట్టణం, నిజాం పట్టణం, పులికాట్ రేవుల్లో స్థావరాలేర్పరచుకున్నారు. వారి అనంతరం ఆంగ్లేయులు ప్రవేశించినాడు. గుజరాత్, మాళవలు అతని సామ్రాజ్యంలో చేరినాయి. ఖాన్‌దేష్‌పాలకుడతని సామంతుడయినాడు. ఇక అక్బర్ దృష్టి దాక్షిణాత్య రాజ్యాలపై ప్రసరించడం సహజం. ముర్తుజానిజాంషా కాలంనుండి నగర రాజకీయాలు అల్లకల్లోలమై, ఇబ్రాహీం నిజాంషా మరణానంతరం క్రీ.శ. 1595 మరింత దిగజారినాయి. ఇబ్రాహీం నిజాంషా కొడుకు బహదూర్ నిజంషాను సింహాసనం ఎక్కించిచాంద్ బీబీ పరిపాలన నిర్వహించసాగింది. ఆమెకు వ్యతిరేకంగా అహమ్మద్ అనేరాకుమారుని సుల్తాన్‌గా ప్రకటించి, పేష్వాటి యాన్ మంజాతనకు సాయంగా గుజరాత్‌ను పాలిస్తున్నమొగల్ రాకుమారుడ మురాద్ క్రీ.శ. 1595లో అహ్మద్ నగర్‌పై దండెత్తమని ఆహ్వానించినాడు. అవకాశం కోసం నిరీక్షిస్తున్న అక్బర్ పాదుషా ఆజ్ఞపై మురాద్ అహమ్మద్‌నగర్‌పై దండెత్తినాడు. చాంద్ బీబీ ఓడిపోయి, బీరార్‌ను మొగలాయిలకు దత్తం చేసి క్రీ.శ. 1596లో సంధిచేసుకొన్నది. బీరార్ ఆక్రమణలో మొగలాయి సైన్యాలు జరిపిన దుండగాల వల్ల యుద్ధం తిరిగి ప్రారంభమయింది. చాంద్ బీబీ, ఆదిల్‌షా, కుతుబ్‌షాల సాయం అర్థించింది. తాహిర్ ఖాన్ నాయకత్వంలో కుతుబ్‌షాహీ సైన్యం చాంద్ బీబీకి సహాయ పడింది. కాని దక్షిణాత్య సైన్యాలు సోనేపట్ యుద్ధంలో క్రీ.శ. 1579లో పరాజయంచెంది చెల్లా చెదరయినాయి. మొగలాయి సైన్యాలు అహమ్మద్ నగరపై పురోగమించినాయి. చాంద్ బీబీ ఆత్మహత్య చేసుకొన్నది. అహమ్మద్ నగర్ మొగలాయిల వశమయింది. క్రీ.శ. 1600లో॥ ఆదిల్‌షా, కుతుబ్‌షాలు తమకు సన్నిహితమైన ప్రమాదం గుర్తించినారు, కాని బలవత్తరుడైన మొగల్‌పాదుషాతో వైరం కూడ ప్రమాదమే. అక్బర్ కూడ బీజాపూర్, గోల్కొండల మైత్రి నాశించినట్లు కన్పిస్తుంది. మసూద్ బేగ్ అనే రాయబారిని అక్బర్ గోల్కొండ ఆస్థానానికి పంపినాడు. ముహమ్మూద్ కులీ కుతుబ్‌షా అమూల్యములైన బహుమతులిచ్చి తన మైత్రిని ప్రకటించినాడు. మరొక మారు క్రీ.శ. 1604లో కూడా కుతుబ్‌షా మొగల్ పాదుషాకు కానుకలు పంపినట్లు తెలుస్తుంది.

**మహమ్మద్ కులీ కుతుబ్‌షా మరణం :**

మహమ్మూద్ కులీ కుతుబ్‌షా క్రీ.శ. 1612లో మరణించినాడు. అతని కొలువులో హిందువులనేకులు ఉన్నతోద్యోగాలు నిర్వహించినారు. పారశీకంనుండి కవులు పండితులు అసంఖ్యాకంగా గోల్కొండ చేరి అతని ఆదరణపొందినారు. ముహమ్మూద్ కులీకి శాశ్వతకీర్తి చేకూర్చింది, కొత్తరాజధాని నగరం హైదరాబాద్. దీనిని 999 / 1590-91 సం॥లో కట్టించినాడు చార్ మినార్‌ను 1-1-1000 / 9-10-1591 లో మొదలు పెట్టి కట్టించడం జరిగింది. ఈ విధంగా మహమ్మద్ కులీ కుతుబ్‌షా అనేక ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించి చరిత్రలో చిరస్మరణీయుడైనాడు. సుల్తాన్ మహమ్మద్ కులీకుదుబ్‌షాకు కుమారులులేరు. అందుచే సోదరుడైన మీర్జా అమీన్ కొడుకైన సుల్తాన్ మహమ్మద్‌ను పెంచుకొని తన కూతురు హయత్ బక్షీబేగం నిచ్చి పెండ్లిచేసి తన వారసుడుగా ప్రకటించినట్లు తెలుస్తుంది. సుల్తాన్ మహమ్మద్ సింహాసనం ఎక్కిన సందర్భంలో ఆదిల్‌షా-బీజపూర్, నిజాంషా-అహమ్మద్ నగర్‌లే గాక పారశీక చక్రవర్తి రెండో షా అబ్బాస్ కూడ అభినందనలంపినాడు. పారశీకరాయబారి మీర్‌జయినుల్ అబిదీన్ 1614లో హైదరాబాదు దర్శించినట్లు తెలుస్తుంది. సుల్తాన్ మహమ్మద్ శాంతి కాముకుడు. అతని కాలంలో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని చరిత్రకారులు వర్ణిస్తారు.

**దాక్షిణాత్యరాజ్యాలలో మాలిక్ అంబర్ కీలకపాత్ర :**

సుల్తాన్ ముహమ్మద్‌కాలంలో, దాక్షిణాత్య రాజ్యాలకు మొగలాయీ ప్రమాదం మరింత హెచ్చింది. ఈ సమయంలో దాక్షిణాత్య రాజ్యరాజకీయాల్లో మాలిక్ అంబర్ కీలకమైన పాత్ర నిర్వహించినాడు. మాలిక్ అంబర్ అబిసీనియా దేశస్థుడు. దాక్షిణాత్యరాజ్యాల్లో పెక్కు పదవులు నిర్వహించి అనుభవం గడించినాడు. మొగలాయిలు ఆక్రమించగా మిగిలిన నిజాంషాహీ రాజ్యంలో మూర్తుజానిజాంషా అనే రాకుమారుణ్ణి పారెంద నగరంలో సింహాసనం ఎక్కించి అహమ్మద్ నగర్ గౌరవ ప్రతిసష్టలు పునరుద్ధరించడానికి సంకల్పించినాడు. మరాటా అశ్వకులను సైన్యంలో చేర్చుకొని వారికి గెరిల్లా యుద్ధపద్ధతిలో శిక్షణ ఇచ్చిమొగలాయితో తలపడినాడు. క్రీ.శ. 1610నాటికి అహమ్మద్ నగర్ నుండి కూడ మొగలాయిలను పారదోలి ఆక్రమించి, పాదుషా జహాంగీర్ చేసిన దాడులను తిప్పికొట్టినాడు. పరోక్షంగా ఆదిల్‌షా,

కుతుబ్‌షాలాతనికి సాయపడినట్లు తెలుస్తుంది. చివరకు జహాంగీర్ తనకుమారుడైన ఖుర్రంను అంబర్‌పై పంపినాడు. అంబర్ ఓడి క్రీ.శ. 1616లో మొగలాయిలతో సంధిచేసుకున్నాడు. బీజపూర్, గోల్కొండ సుల్తానులు ఖుర్రం విజయంతో హడలిపోయినారు. మొగల్ రాయబారి మీర్ మక్కి గోల్కొండ దర్శించగా పాదుషాతో తన మైత్రికి నిదర్శనంగా సుల్తాన్ 15లక్షల రూపాయలు విలువచేసే బహుమతులు సమర్పించినాడు. షాజహాన్ ఉత్తర భారతదేశానికి పయనించగా, క్రీ.శ. 1620లో మాలిక్ అంబర్‌తిరిగి విజృంభించినాడు. మరల షాజహాన్ దండెత్తిరాగా పలుయుద్ధాల్లో అంబర్ పరాజయం పొందినాడు. మొగలాయి సైన్యాలు అహమ్మద్ నగరును దోచి, ధ్వంసంచేసినాయి. కాని క్రీ.శ. 1621లో మాలిక్ అంబర్ షాజహాన్‌తో సంధిచేసుకున్నాడు. మొగల్ మహారాణి నూర్జహాన్ కుట్రల ఫలితంగా షాజహాన్ తండ్రిపై తిరుగుబాటు చేయడంతో తాత్కాలికంగా దాక్షిణాత్య రాజ్యాలకు ప్రమాదం తప్పింది. షాజహాన్, అంబర్‌తో చేరి కుతుబ్‌షా సాయం అర్థించినాడు. షాజహాన్‌కు సాయం చేసిమొగల్ పాదుషా ఆగ్రహానికి గురి కావడానికి కుతుబ్‌షా సాహసించలేదు. కాని, మొగల్ సేనాపతి మొహబత్ ఖాన్ చేతిలో ఓడిన షాజహాన్ గోల్కొండ, మచిలీపట్టణాల మీదుగా బెంగాల్ చేరడానికి అనుమతించడమేగాక, ప్రయాణంలో అతనికి ధనధాన్యాలు సహాయం చేయవలసిందిగా గ్రామోద్యోగులను మహమద్ కుతుబ్‌షా ఆజ్ఞాపించినట్లు ఇక్బల్ నామాజహంగీరీ మొదలైన గ్రంథాలనుండి తెలుస్తుంది.

సుల్తాన్ ముహమ్మద్ 1626, జనవరిలోను, మాలిక్ అంబర్ మరోనాలుగు నెలలతర్వాత, ఢిల్లీ చక్రవర్తి జహాంగీర్ మరో ఏణ్ణర్ధంతరవాత మరణించేరు. ఈ ముగ్గురి మరణంతో దక్షిణ దేశ చరిత్ర నూతన అధ్యాయం ప్రారంభం అయింది. అహమ్మద్ నగర్, బీజపూర్, గోల్కొండలను స్వాధీనంలో వుంచుకొనేందుకు ఢిల్లీ చక్రవర్తులకుఅనుకూలపరిస్థితులు ఏర్పడ్డాయి. సుల్తాన్ ముహమ్మద్ పాలన కాలం అన్ని విధాలా మహమద్ కులీకాలానికి అనుబంధం అని చెప్పవచ్చు. సుల్తాన్ మంచి విద్యావంతుడు, కవి, ఆతని ఆస్థానంలో పారశీక, దక్కనీ భాషలకు పోషణ లభించింది. పారశీక భాషలో పెక్కుగ్రంథాల రచన జరిగింది. మీర్ మహమ్మద్ ముమీన్ తూనికలు కొలతల మీద 'రిసాలామిక్దరీయ' అనే గ్రంథం రచించినాడు. హకీం తకీయుద్దీన్ వైద్యశాస్త్రంపై 'మిజానుత్‌తబాయీ కుతుబ్‌షాహీ' రచించినాడు. 'తారీఖ్ -ఇ-మహమద్ కుతుబ్‌షా' అనే చారిత్రక గ్రంథం తయారయింది. ముహమ్మాద్ కులీకివలె సుల్తాన్ మహమద్‌కి కూడ భవననిర్మాణంలో ఆసక్తి ఎక్కువ. అతని పోషణలో భవనాలతో, తటాకాలతో (మాన్‌సాహిబ్‌కాతాలబ్) హైదరాబాదు సుందరమైన నగరంగా రూపొందింది. ఖైరతాబాద్ మాస్కును నిర్మించడమే గాక ప్రసిద్ధమైన మక్కా మసీదుకు సుల్తాన్ పునాదులు వేసినాడు. సుల్తాన్ మరణానంతరం అనతికాలానికి హైదరాబాదు దర్శించిన టవర్నియర్ అనే ఫ్రెంచి నగల వ్యాపారి మక్కా మసీదును 'భారతదేశ ప్రసిద్ధ నిర్మాణాలలో ఒకటి' అని ప్రశంసించినాడు. దాని నిర్మాణంలో 2000 మందిరాలు చెక్కేవారు, 2000 మంది తాపీ మేస్త్రీలు, 4000 కూలీలు సంవత్సరాల తరబడి పనిచేసేవారని తెలుస్తుంది

## 16.9 అబ్దుల్లా కుతుబ్‌షా క్రీ.శ. 1-2-1626 - 21-4-1672

అబ్దుల్లా కుతుబ్‌షా, సుల్తాన్ కుతుబ్‌షా కొడుకు. ఈతని కాలంలో గోల్కొండ రాజ్యక్షీణదశ ప్రారంభమయింది. అయితే గోల్కొండ, బీజపూర్‌లు కలసి జీర్ణకర్ణాటక రాజ్యాన్ని పంచుకొని విస్తరించినాయి. ఇదే కాలంలో ఆంధ్ర దేశంలో ఆంగ్లేయులు బలపడి అలజడులు కలిగించసాగినారు.

సింహాసనం ఎక్కేనాటికి (1626) అబ్దుల్లా పన్నెండేళ్ళబాలుడయినందున తల్లి హయాత్ బక్షీ బేగం సంరక్షకురాలుగా పరిపాలన నిర్వహించింది. హయాత్ బక్షీకి, కులీకాలంనుండి ప్రభుత్వ వ్యవహారాలు పరిశీలించడంలో మంచి అనుభవం వుంది. అయినప్పటికీ క్రమంగా పాలనాయంత్రాంగం స్వార్థపరులైన ఉద్యోగుల హస్తగతం కావడం వల్ల రాజ్యంలో అలజడులు చెలరేగినాయి. వానికి అబ్దుల్లా నిర్లక్ష్యమూ విలాసప్రియత్వమూ తోడయినాయి. అల్లర్లకు కారకుడు మీర్‌జుమ్లాగా ఉన్న మన్‌సూర్‌ఖాన్ 1628లో మరణించడము, విదేశీయుడైన షేక్ మొహమ్మద్ పేష్వాకావడం (1629) తో రాజ్యంలో శాంతి నెలకొన్నది. ఇంతలో గోల్కొండకు మొగలాయివిస్తరణ ప్రమాదం ఏర్పడింది.

**పాదుషా షాజహాన్ - దాక్షిణాత్య రాజ్యాలు :**

పాదుషా జహాంగీర్ మరణించి, క్రీ.శ. 1628లో షాజహాన్ మొగల్ సింహాసనం అధిష్టించినాడు. షాజహాన్ దాక్షిణాత్యరాజకీయాలు క్షుణ్ణంగా తెలిసినవాడు. షియా మతాన్ని ద్వేషించేవాడు. సాధ్యమైనంతవరకు దాక్షిణాత్యరాజ్యాలను మొగల్ సామ్రాజ్యంలో చేర్చడమే అతని

ఆశయం. అందుకు అవకాశంగా దాక్షిణాత్యరాజకీయాలు అసమర్థులు నిర్వహించసాగినారు. మాలిక్ అంబర్ మరణించి క్రీ.శ. 1627 అతనికొడుకు ఫతేఖాన్ కుత్సితస్వార్థ విధానాల వల్ల అహమ్మద్ నగర్ రాజ్యం కల్లోలితమయింది. దీనికతోడు మొగల్ దక్కన్ రాజప్రతినిధియైన ఖాన్ జహాన్‌లోడి షాజహాన్‌పై తిరుగుబాటుచేసి, మూర్తుజా నిజాంషాను ఆశ్రయించినాడు. ఇది కారణంగా మొగల్ సైన్యాలు నిజాంషా రాజ్యంపై దండెత్తినాయి. రాజ్యంలో అంతఃకలహాలవల్లనిజాంషా మొగలాయీలను ప్రతిఘటించలేక పోయినాడు. క్రీ.శ. 1633లో మూడో హుస్సేన్ నిజాంషా మొగలాయీలకు బందీగా చిక్కినాడు. మొగల్‌సైన్యం దౌలతాబాదు నాక్రమించి దోచింది. అనంతరం మహారాష్ట్రనాయకుడైన షాజీభాన్స్లే మొదలైన వారు షాజహాను నెదిరించి నారు గాని, వారి ప్రతిఘటన అనతి కాలంలోనే వీగిపోయింది. నిజాంసాహీరాజ్యం మొగల్ సామ్రాజ్య అంతర్గతమై, బీజపూర్, గోల్కొండ రాజ్యాలకు మొగల్ ప్రమాదం మరింత చేరువయింది. నిజాంషాతోడి యుద్ధంలో జోక్యం పెట్టుకోవద్దని షాజహాన్ బీజపూర్, గోల్కొండలకు రాయబారాలు పంపినాడు. పాదుషా కోర్కెను ధిక్కరించి తనవ్యక్తిత్వం నిలుపుకోడానికి ప్రయత్నించడమేగాక, బీజపూర్, గోల్కొండ కూడ ప్రోత్సహించింది ఈమూడు రాజ్యాలు సమైక్యంగా మొగలాయిలను ప్రతిఘటించినట్లయితే దక్షిణదేశ చరిత్ర భిన్నంగా ఉండేదని ఆచార్య షేర్వాణీవంటి చరిత్రకారుల అభిప్రాయం, కాని, అబ్దుల్లా కుతుబ్‌షా భయపడ్డాడు, మొగల్ రాయబారులను సగౌరవంగా ఆహ్వానించి అమూల్యములైన బహుమానాలతో సత్కరించి పాదుషాకోరికలను మన్నించడానికి అంగీకరించినాడు. అయినప్పటికి మొగల్‌సైన్యాలు కుతుబ్‌సాహీ ప్రాంతాలైన కళింకోట, మన్‌సూర్‌ఘర్‌లపై రెండు మార్లు దాడి జరిపి గోల్కొండ సైన్యాలను చెల్లా చెదరుచేసినాయి. దౌలతాబాద్ ఆక్రమణ అనంతరం షాజహాన్ బీజపూరు, గోల్కొండలను కప్పంచెల్లించ వలసిందిగా ఆజ్ఞాపించినాడు. క్రీ.శ. 1636 ప్రారంభంలో ఆదిల్‌షా సంధి చేసుకొని మొగల్ సామంతుడైనాడు. అదే సంవత్సరం మొగల్ రాయబారియైన అబ్దుల్ లతీఫ్‌తో సంధిచేసుకొని అబ్దుల్లా సామంతుడై ప్రతి సంవత్సరం రెండున్నర లక్షలు కప్పం చెల్లించడానికి, తన రాజ్యంలోని శుక్రవారం ప్రార్థనలలో పారశీక చక్రవర్తి పేరుకు బదులు మొగల్ పాదుషా పేరునమోదు చేయడానికి అంగీకరించినాడు. గోల్కొండ మొగల్ సామంత రాజ్యమయింది.

**అబ్దుల్లా కుతుబ్‌షా - మీర్‌జుమ్లా :**

మొగలాయిలతో సంధి అనంతరం కుతుబ్‌షా కర్ణాటక రాజ్యంపై దృష్టిమరల్చినాడు. కర్ణాటక రజ్యాన్ని నిర్మూలించవలసిందిగా పాదుషా ఇచ్చిన ఆదేశాను సారమే ఆరాజ్యంపై బీజపూర్, గోల్కొండల దాడులు జరిగినాయని ఆచార్య షేర్వాణీ పరిశీలన. కర్నాటకంలో, గోల్కొండ విస్తరణకు నాయకత్వం వహించింది మొహమ్మద్ సయ్యద్. ఈతని జన్మభూమి అర్దిస్తాన్, నగల వ్యాపారి బానిసగా గోల్కొండకు వచ్చినాడు. ఆ వ్యాపారి మరణించడంతో అతని ఆస్థికి వారసుడై గోల్కొండకువచ్చి వ్యాపారము చేస్తూ ప్రముఖవ్యక్తి కావడమేగాక ఆస్థానంలో ప్రవేశించి క్రమంగా మీర్‌జుమ్లా, సేనాపతి పదవులు నిర్వహించసాగినాడు. మొహమ్మద్ సయ్యద్ విశ్వాసఘాతకుడైన స్వార్థపరుడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతణ్ణి కంభం ప్రాంతాలపై రాజప్రతినిధిగా నియమించి కర్నాటకాన్ని జయించవలసిందిగా ఆజ్ఞాపించినాడు. మీర్‌జుమ్లా పెద్ద సైన్యం సమకూర్చుకున్నాడు. ఇరవైవేల కాల్బలం, ఐదువేల గుర్రాలు, మూడువందల ఏన్గులు, ఫ్రెంచి, ఇంగ్లీసు, ఇటాలియన్ ఉద్యోగులకింద నున్న శతఘ్నిదళం అతని సైన్యంలో ఉన్నట్లు, ఈ శతఘ్నిదళసాయంతోనే గండికోట మొదలైన దుర్గాల నాతడాక్రమించినట్లు టవర్నియర్ మొదలైన వారి వ్రాతల నుండి తెలుస్తుంది. గండికోటను స్థావరంగా చేసుకొనిమూడో వేంకటపతి, మూడో శ్రీరంగ రాయులులను పలుయుద్ధాల్లో ఓడించి మద్రాసు పర్యంతం తూర్పు ఆంధ్రప్రాంతాలను మీర్ జుమ్లా స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాజ్య విధ్వంసంపూర్తయింది. మీర్‌జుమ్లా విజయపరంపరలతో గోల్కొండ రాజ్యం విస్తరించి, గౌరవంపెరిగింది కాని, అతని స్వార్థచింతన ప్రమాదకరంగా పరిణమించింది. తాను జయించిన కర్ణాటక ప్రాంతాలను సుల్తాన్ పరంచేయక మీర్ జుమ్లా తన స్వంతరాజ్యంగా పరిగణిస్తూ, సుల్తాన్ ఆదేశాలను ధిక్కరించ సాగినాడు. రాజధానిలో మీర్ జుమ్లా కొడుకు ఆమీన్ సయితం అవిధేయత ప్రదర్శించడంతో అబ్దుల్లాసుల్తాన్ ఆగ్రహించి అతడ్ని ఖైదుచేసినాడు. మీర్‌జుమ్లా సుల్తానుకు లొంగడానికి బదులు దక్కన్‌లో మొగల్ రాజప్రతినిధియైన ఔరంగజేబుతో సమాధానం కుదుర్చుకొని, అతడ్ని గోల్కొండపై దండెత్తమని కోరినాడు.

**ఔరంగజేబుకు మీర్ జుమ్లా ఆహ్వానం :**

దక్షిణ రాజ్యాలపట్ల షాజహాన్, ఔరంగజేబుల విధానాలలో వ్యత్యాసం లేదనే చెప్పవచ్చు. వానిపై దండెత్తే అవకాశం కోసం నిరీక్షిస్తున్న ఔరంగజేబుకు మీర్ జుమ్లా ఆహ్వానం మంచి ప్రోత్సాహమయింది. తండ్రి అనుమతిలో ఔరంగజేబుతన కొడుకు మహమ్మద్ సుల్తాన్‌ను

గోల్కొండపై దండుపంపినాడు. అబ్దుల్లా కుతుబ్‌షా హైదరాబాదును విడిచి గోల్కొండలో తలదాచుకొన్నాడు. మొగల్ సైన్యాలు హైదరాబాదును ఆక్రమించిదోచుకున్నయి. క్రీ.శ. 1656లో, ఔరంగజేబుతో అబ్దుల్లా జరిపిన సంధి సంప్రదింపులు ఫలించలేదు. అందుచే అబ్దుల్లా చక్రవర్తి అయిన షాజహానును అర్థించినాడు. షాజహాన్ జోక్యంతో ఔరంగజేబు సంధికి అంగీకరించినాడు. మొగలాయీలకు కోటిరూపాయలు చెల్లించడానికి, తన కూతురిని మహమ్మద్ సుల్తాన్ కిచ్చిపెండ్లిచేసి, అతడ్ని తనవారసుడుగా ప్రకటించడానికి అబ్దుల్లా కుతుబ్‌షా అంగీకరించినాడు. గోల్కొండ గౌరవ ప్రతిష్టలు అడుగంటినాయి. మీర్‌జుమ్లా మొగల్ సైన్యంలో మన్సబ్‌దారై, గోల్కొండనుండి నిష్క్రమించినాడు.

మీర్‌జుమ్లా తిరుగుబాటు, మొగలాయిల తోడి యుద్ధం ఫలితంగా కర్ణాటకలోని పరిస్థితులు అస్తవ్యస్తమయినాయి. నాటికే ఫ్రెంచి, డచ్చి, ఇంగ్లీషువాణిజ్య సంఘాలు తూర్పుతీరంలో స్థావరాలేర్పరచుకున్నాయి. వారిపట్ల కుతుబ్‌షాహీలు ఉదారంగా ప్రవర్తించినారు. క్రీ.శ. 1636లో అబ్దుల్లా కుతుబ్‌షా ఆంగ్లేయులకు 'బంగారు ఫర్మానా' ద్వారా అనేక సౌకర్యాలు కలిగించినాడు. అయినా రాజ్యంలోని కల్లోలాలు అవకాశంగా తీసుకొని ఐరోపాకంపెనీలు అవిధేయంగా ప్రవర్తించసాగినాయి. డచ్చివారు శాన్‌థోం ఆక్రమించినారు. మచిలీపట్నం, చెన్నపట్టణంలో ఆంగ్లేయులు అద్దెలు, సుంకాలు చెల్లించడం మానివేసినారు. పరిస్థితులను చక్కబరచడానికికై అబ్దుల్లా కర్ణాటకరాష్ట్ర పాలకుడుగా రజాక్ కులీ నెక్నం ఖాన్‌ను నియమించినాడు క్రీ.శ. 1663లో నెక్నంఖాన్ కర్ణాటకంలోని తిరుగుబాటుదార్ల నణచి డచ్చివారి నుండి శాన్‌థోమ్ నాక్రమించినాడు. అతని బలసామర్థ్యాలకు వెరచి చెన్నపట్టణంలోని ఆంగ్లేయులు పన్నెండువేలు అద్దెగాను, 4200 రూపాయలు సుంకంగాను చెల్లించడానికి అంగీకరించినారు. ఈ ఒప్పందం తర్వాత అనతి కాలానికే అబ్దుల్లా కుతుబ్‌షా మరణించినాడు. మీర్ జుమ్లా ద్రోహం, అబ్దుల్లా కుతుబ్‌షా అనుసరించిన దూరదృష్టిలేని దుర్బల విధానాల ఫలితంగా గోల్కొండ మొగల్‌సామంత రాజ్యం కావడమేగాక పతనోన్ముఖమయింది.

## 16.10 అబుల్ హసన్ కుతుబ్‌షా - 21-4-1672 - 21-9-1687

అబుల్ కుతుబ్ షాకు కుమారులు లేరు. ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె బారి సాహిబ్‌ని. రెండవ కుమార్తె ఫాతిమా ఖానం. మూడవ కుమార్తె బాద్‌షా బీబి. పెద్దకుమార్తెను, ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్ సుల్తాన్‌తో 1656 సం॥ సంధి ప్రకారము వివాహము జరిపారు. ఆ సంధి ప్రకారము అబ్దుల్లా అనంతరం, గోల్కొండ సుల్తాన్‌గా మహమ్మద్ సుల్తాన్ కావాలి. కాని మొగలుల వారసత్వ యుద్ధంలో, మహమ్మద్ సుల్తాన్, షాజహాన్ రెండవ కుమారుడైన షా షుజా పక్షాన వహించి భార్యతో సహా ఖైదీ అయినాడు. రెండవ కుమార్తె అయిన ఫాతిమా ఖానంను, మీర్జా నిజామ్ ఉద్దీన్ అహమ్మద్‌తో వివాహం జరిగింది. ఇతను కూడా 1674 లో ఖైదీగా మరణించాడు. అబుల్ హసన్ ఆధ్యాత్మిక చింతనగలవాడై షారజొ కట్టాల్ అనే సూఫీ గురువును ఆశ్రయించాడు. అబుల్ హసన్‌ను పిలిపించి తన మూడవ కుమార్తె అయిన బాద్‌షా బీబీనిచ్చి వివాహం చేసి తన రాజ్యానికి వారసుడుగా ప్రకటించాడు.

**అబుల్‌హసన్ - అక్కన్న - మాదన్నలు :**

అబుల్ హసన్ వ్యసనపరుడనీ అసమర్థుడనీ వర్ణించే రచనల్లో సత్యం కన్పించదు. అతడు విద్యావంతుడు, అలోచనాపరుడు, అతని చర్యల్లో రాజనీతి ప్రతిఫలిస్తుంది. పరిపాలనలో శ్రద్ధ వహించి తరచు దేశాటనం చేస్తుండేవాడు. సింహాసనం ఎక్కిన అచిర కాలనికే సయ్యద్ ముజఫర్ అహంకారంతో ఆస్థాన ఉద్యోగులపట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుండడం గమనించి అతణ్ణి తొలగించి క్రీ.శ. 1674లో అతని స్థానంలో మాదన్నను మీర్‌జుమ్లాగా నియమించినాడు. మీర్‌జుమ్లా అయినప్పటికీ సమస్త రాజ్య వ్యవహారాలు మాదన్న మంత్రియే నిర్వహించసాగినాడు. మొగలాయి విస్తరణ ప్రమాద భీతి ఉన్న ఆరోజుల్లో గోల్కొండ స్వాతంత్ర్యాన్ని రక్షించడానికి హిందూమంత్రియే హృదయపూర్వకంగా ప్రయత్నించగలడని బహుశ అబుల్ హసన్ భావించవుంటాడు. అక్కన్న - మాదన్నలు ఆంధ్రులనీ, కన్నడీగులనీ, మహారాష్ట్రులనీ భిన్న అభిప్రాయాలున్నాయి. వీరు పింగళి వంశస్థులు. అన్మకొండ వాస్తవ్యులు అని తెలుస్తుంది. ఈ సోదరులు బహుభాషల్లో పండితులు, ఆ స్థాన ఉద్యోగానికి నాడు అవసరమైన విద్యల్లో శిక్షనపొందినారు. మొదట్లో సయ్యద్ ముజఫర్ కింద ఉద్యోగాల్లో చేరినారు. సయ్యద్ ముజఫర్ సర్వసైన్యాధ్యక్షుడయినప్పుడు అతనికి మాదన్న పేష్కారు కాగా, మాదన్నకు అక్కన్న కార్యదర్శి అయినాడు. క్రీ.శ.

1674లో "సూర్యప్రకాశరావు" అనే బిరుదంతో మాదన్నను మీర్‌జుమ్లా చేసి అబుల్ హసన్ రాజ్యవ్యవహారాలన్నీ అతనికి అప్పగించినాడు. మాదన్న ప్రభుభక్తి పరుడు. పాలనాదక్షుడు. కొండవీడు, కొండపల్లి, ఓరుగల్లు మొదలైన దుర్గాల రక్షణ శ్రేణులు బలపరచి సైన్యాన్ని వృద్ధి చేసినాడు. పాలనాయంత్రాంగాన్ని సంస్కరించి ఆర్థిక వనరులను పెంచినాడు. మద్రాసులోని ఆంగ్లేయుల ఆగడాలు కట్టించి, వారు చెల్లించవలసిన అద్దెలు, సుంకాలు బకాయీలతో సహావసూలు చేయగలిగినాడు. కొంతమంది చరిత్రకారుల ప్రకారం, మాదన్న హిందూపక్షపాతియై, తనబంధు మిత్రులను ఉన్నతోద్యోగాల్లో నియమించినాడని విశ్వాసం వ్యక్తమైనది. అతని అన్న అక్కన్న సర్వసైన్యాధ్యక్షుడై (సర్‌లష్కర్) అంతరంగిక వ్యవహారాలు చక్కబెట్టేవాడు. తమ్ముడు వెంకన్న రుస్తుంరావు అనే బిరుదంతో సైనికోద్యోగి అయినాడు. మేనల్లుడు పొదిలిలింగన్న కర్ణాటక పాలకుడుకాగా, మరొక మేనల్లుడు కంచర్ల గోపన్న భద్రాచలం తరఫ్ దారయినాడు. మాదన్న ముస్లిములపట్ల - ముఖ్యంగా విదేశీ ముస్లిముల పట్ల ప్రతీకారకాంక్షతో వ్యవహరించినాడనీ, లంచగొండియనీ, కొన్ని సందర్భాల్లో రాజ్య గౌరవ భద్రతలకు భంగకరంగా, స్వార్థంతో వ్యవహరించినాడనీ సమకాలీన ముస్లిం, పాశ్చాత్య రచయితల వ్రాతల్లో సత్యం లేకపోలేదని జాదునాద్ సర్కార్, కృష్ణస్వామి అయ్యంగార్, షేర్వాణీ వంటి చరిత్ర కారుల అభిప్రాయం. మాదన్న ముస్లిం గురువులకు, సంస్థలకు దానధర్మాలు చేయకపోలేదు. కాని, ముస్లిములపట్ల మరికొంత ఉదారంగా విచక్షణతో వ్యవహరించివుంటే అతణ్ణి ప్రధానిచేయడంలోని అబుల్ హసన్ ఆశయం ఫలించి వుండేది.

**ఔరంగజేబు క్రీ.శ. 1658 - 1707 - దాక్షిణాత్య రాజకీయాలు :**

అబుల్ హసన్ పాలన కాలం - దాక్షిణాత్య రాజకీయాలు క్లిష్టరూపంధరించినాయి. పాదుషా ఔరంగజేబు దాక్షిణాత్యరాజ్యాలను నిర్మూలించవలెననే దీక్షతో అవకాశం లభించినపుడల్లా దాడులు కొనసాగిస్తున్నాడు. బీజపూర్‌లో ఆలీ ఆదిల్‌షా మరణించి క్రీ.శ. 1672లో, బాలుడైన సికందర్ ఆదిల్‌షా సింహాసనం ఎక్కడంతో స్వదేశీ, విదేశీ ముస్లిం వర్గాల మధ్య సంఘర్షణ విజృంభించి రాజ్యం కల్లోలితమయింది. క్రీ.శ. 1650 ప్రాంతం నుండి మహారాష్ట్ర వీరుడు శివాజీసాహస కృత్యాలు ప్రారంభమయినాయి. మొదట్లో బీజాపూర్, గోల్కొండ రాజ్యాలపై దాడులు జరిపిన శివాజీ దేశాన్ని కొల్లగొట్టినాడు. క్రీ.శ. 1672లో గోల్కొండ వరకు దాడిచేసి రెండు లక్షల హోన్నులు వసూలుచేసినట్లు తెలుస్తుంది, షేర్వాణి కథనంప్రకారం. క్రమంగా బీజపూర్, గోల్కొండలతో సమాధానపడి మొగలాయిల నెదిరించడానికి శివాజీ ప్రయత్నించినట్లు కన్పిస్తుంది. క్రీ.శ. 1674లో 'స్వరాజ్యం' అనే పేర స్వతంత్రమహారాష్ట్ర రాజ్యాన్ని శివాజీస్థాపించినాడు. స్వరాజ్యవిస్తరణాభివృద్ధులపట్ల వహించినంతగా మొగలాయి విస్తరణకు సమైక్య ప్రతి ఘటనను సంఘటితం చేయడానికి శివాజీ శ్రద్ధ వహించలేదు. మాదన్న మంత్రి ప్రోత్సాహంతో క్రీ.శ. 1676లో శివాజీ గోల్కొండను దర్శించి అబుల్ హసన్‌తో సంధించేసుకున్నాడు. శివాజీ సాగించనున్న దక్షిణ దిగ్విజయ యాత్రలో ప్రతినిత్యం సైన్యపోషణకై మూడు వేల హోన్నులు సుల్తాన్ చెల్లించేటట్లు శివాజీ కర్ణాటకంలో జయించిన ప్రాంతాలను సుల్తానుతో పంచుకునేటట్లు ఒప్పందం జరిగింది. క్రీ.శ. 1677లో బళ్ళారి, వెల్లూరు, ఆరణి, జింజి మొదలైన ప్రాంతాలను శివాజీ జయించినాడు. ఒప్పందం ప్రకారం శివాజీకి అబుల్ హసన్ డబ్బు చెల్లించినాడు. కాని, శివాజీ మాత్రం తానుజయించిన ప్రాంతాలేవీ సుల్తాన్ పరంచేయలేదు. ఇదిమోసంగా, తనకు జరిగిన పరాభవంగా సుల్తాను, రాజకుటుంబము, ముస్లింప్రభువర్గీయులు భావించినారు. ఒప్పందానికి కారకుడైన మాదన్న పట్ల రాజకుటుంబానికి, ముస్లింలకు అనుమానము, ద్వేషమూ పెరగడం ఆశ్చర్యం లేదు.

క్రీ.శ. 1680లో శివాజీ మరణించి, శంభూజీ ఛత్రపతి అయినాడు. శంభూజీలో రాజనీతి శూన్యం. అందుచే ఔరంగజేబు దక్షిణ దేశం జయంచడానికి నాటివరకు వున్న ఆటంకం తొలగి అవకాశం హెచ్చింది. క్రీ.శ. 1685లో ఔరంగజేబు దక్షిణ దిగ్విజయయాత్ర ప్రారంభమయింది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను మహారాష్ట్రులకు సహాయ కారులుగా ఉన్న బీజపూరు, గోల్కొండలను ఆక్రమించి, అనంతరం స్వరాజ్యాన్ని జయించాలనే పథకం ప్రకారం క్రీ.శ. 1686లో ఔరంగజేబు బీజపూర్‌పై దండెత్తినాడు. బీజపూర్‌కు, గోల్కొండ సైనిక సహాయం అందకుండా మొగల్ సేనలు ఆటకాయించినాయి. అబుల్ హసన్ ప్రయత్నాలు గుర్తించి ఔరంగజేబు బీజపూర్, గోల్కొండలపై ఒకే మారు దాడులు జరిపినాడు. మొగల్, కుతుబ్‌షాహీ సైన్యాలు మాల్ ఖేడ్ దగ్గిరతారసిల్లినాయి. మొగల్ సైన్యం రాకుమారుడు మవుజాం (షా ఆలయం) నాయకత్వంలో నడిచింది. మొదట్లో గోల్కొండకే విజయం లభించింది. కాని, చివరకు గోల్కొండసైన్యాలు ఓడి చెల్లా చెదరయినాయి. ఇబ్రాహీం, దావూద్, మొహమ్మద్ తాకీ, షరీఫ్ ఉల్‌ముల్క్ మొదలైన ఉతుబ్ షాహీ సేనాపతులు మొగలాయీలతో చేరినారు. అబుల్ హసన్

హైదరాబాదు విడిచి వెళ్ళి గోల్కొండ కోటలో తలదాచుకొన్నాడు. నిస్సహాయమైన హైదరాబాద్‌లో మొగలు సైన్యాలు ప్రవేశించి విచక్షణ లేకుండా దోపిడి చేసినాయి. చివరకు షాఆలం విధించిన షరతులతో అబుల్ హసన్ సంధిచేసుకున్నాడు. సంధిప్రకారం బకాయీల కింది అబుల్ హసన్ మొగలాయీలకు కోటి హొన్నులు, సాలుసరి కప్పం రెండులక్షలు చెల్లించవలెను. మాల్ ఖేడ్ ప్రాంతాన్ని మొగలాయీలకు అప్పగించవలెను. అక్కన్న మాదన్నలను ఉద్యోగం నుండి తొలగించవలెను.

**అక్కన్న - మాదన్నల హత్య :**

మొగల్ సైన్యం నిష్క్రమించిన తరువాత అక్కన్న మాదన్నలను తొలగించడానికి సుల్తాన్ జాప్యం చేసినాడు. ఔరంగజేబు కోపకారణం హిందూసోదరులేనని కుతుబ్‌షాహీ అంతఃపురము, ముస్లిం ప్రభువర్గమూ భావించినారు. అంతఃపుర ప్రోత్సాహంతో షేక్ మిన్హజ్‌నాయకత్వంలో అక్కన్న మాదన్నల హత్యకు కుట్ర సిద్ధమయింది. క్రీ.శ. 1686 మార్చి 24వ తారీఖురాత్రి సుల్తాన్‌తో సంప్రదించి, ఇంటికి తరలుతున్న అక్కన్న మాదన్నలను గోల్కొండ నడివీధిలో హత్యచేసినారు. సుల్తానే స్వయంగా వారిని వధించినాడనే సమాచారం యదార్థం కాదని చరిత్రకారులు భావిస్తున్నారు. అక్కన్న మాదన్నల తలలు ఔరంగజేబుకు కానుకగా సమర్పించడం జరిగింది.

## 16.11 గోల్కొండ పతనం - 21-9-1687 క్రీ.శ. :

అక్కన్న మాదన్నల నిష్క్రమణతో ఔరంగజేబు తృప్తి వహించలేదు. గోల్కొండలో హిందూప్రాబల్యం అనేది అబుల్ హసన్‌ను నిందించడానికి ఉపయోగించిన సాకు మాత్రమే. గోల్కొండ విధ్వంసమే ఔరంగజేబు ఆశయం. అక్కన్న మాదన్నల హత్యతో గోల్కొండ రక్షణ మరింత దుర్బలమయింది. బీజపూర్ ఆక్రమణ పూర్తయినంతనే క్రీ.శ. 1687లో ఔరంగజేబు స్వయంగా గోల్కొండ దుర్గాన్ని ముట్టడించినాడు. ముట్టడి ఎనిమిది మాసాలు సాగింది. గోల్కొండ సైన్యాలు ధైర్యసాహసాలతో పోరాడి మొగలాయిలకు అపార నష్టం కలిగించినాయి. ఔరంగజేబుకు విజయం అనుమానాస్పదమయింది. చివరకు గోల్కొండ సేనాపతుల్లో అబ్దుల్లా పాణి అనేద్రోహికి లంచం ఇచ్చి అర్ధరాత్రివేళ కోట తూర్పుద్వారం తెరపించి మొగల్‌సైన్యాలు కోటలో ప్రవేశించినాయి. ప్రభుభక్తి పరులైన రజాక్ లారీ వంటివారు ఆమరణాంతం మొగల్ సైన్యాలతో తలపడి పోరాడినారుకాని, లాభం లేకపోయింది. కోటమొగలాయీల వశమయింది. అబుల్‌హసన్ కుతుబ్‌షా బందీ అయినాడు. అతణ్ణి సకుటుంబంగా గ్వాలియర్ కోటకు పంపినారు. కోటలోని ఏడుకోట్లకుపైగా ధనం, అపారములైన సువర్ణ వజ్రవైఢూర్యాల రాశులు ఔరంగజేబు దోచుకున్నాడు. గోల్కొండ రాజ్యంమొగల్ సామ్రాజ్యం అంతర్భాగమయింది.

అబుల్ హసన్ తానీషా కోటలో పదమూడు సంవత్సరములు బందీగా వున్నాడు. ఆఖరు రోజులలో నిరశన వ్రతం ప్రారంభించి క్రీ.శ. 1700లో మరణించినాడు.

## 16.12 సారాంశము :

దాదాపు శతాబ్దం పాటు గొల్కొండను పాలించిన వారు కుతుబ్‌షాహి వంశస్థులు. బహమనీ రాజ్యాల విచ్ఛిన్నమై ఐదు రాజ్యాలుగా ఏర్పడ్డాయి. వాటిలో ఒకటి కుతుబ్‌షాహి రాజ్యం. ఈ పాలకులలో ముఖ్యులు కులీకుతుబ్ షా, జంషీద్, ఇబ్రహీం, మహమ్మద్ కులీకుతుబ్ షాలు మరియు అబుల్ హసన్‌లు. అబుల్ హసన్ తన సేనాపతి నమ్మక ద్రోహం వల్ల మొఘలులకు బందీ అవటంతో గోల్కొండ మొఘలుల వశమై కులీకుతుబ్ షా పాలన అంతరించింది.

## References Books :


1. H.K. Sherwani : History of the Qutb Shahi Dynasty
2. Siddiqui : History of Golkonda

3. Venkata Ramanaiah : Further Sources of Vijayanagara Hstory.

4. Tavenier : Travels in India, Calcutta 1905.

5. Kambhampati Satyanarayana : Andhrula Samskiti-Chairta QutbShahi Yugamu.

6. Yatukuri Balaramamurthy : Andhrula Samkshipta Charita

7. B.S.L. Hanumantha Rao : Andhrula Charita

8. Jadunath-Sarkar : History of Aurangazeb

9. Irfan Habib : Comprehensive History of India.


డా॥ కంరున్నిసాబేగం

పాఠం : 17

# నాయక రాజ్యాలు

## 17.0 లక్ష్యం :

విజయనగర సామ్రాజ్యము మహోన్నత స్థితిలో ఉన్న సమయంలో మధుర, తంజావూరు, మైసూరు, జింజిమొదలయిన దూర రాష్ట్రాలు రాజప్రతినిధుల ఆధీనంలో ఉండేవి. వీరిని నాయకులు అనేవారు. ఈ నాయకులు ఇంచుమించు స్వతంత్రరాజులుగా వ్యక్తిత్వంతో తమతమరాష్ట్రాలను పాలించినారు. అందు చేత ఈ నాయకరాజ్యాల చరిత్రతోగాని విజయనగర సమీక్షపూర్తికాదు. ఈ నాయక రాజుల గురించి తెలియపరచటమే ఈ పాఠం లక్ష్యం

## విషయక్రమం :

17.1 పరిచయం

17.2 మధుర నాయక రాజ్యం

కృష్ణప్ప నాయుడు

ముద్దు కృష్ణప్ప

ముద్దు వీరప్ప

తిరుమల నాయకుడు

చొక్క నాథుడు

విజయరంగ చొక్క నాథుడు

చెవ్వప్ప

అచ్యుత నాయకుడు

రఘునాథుడు

విజయ రాఘవుడు

17.3 మైసూరు నాయకులు

17.4 సారాంశము

## 17.1 పరిచయం

విజయనగర రాజ్యం కన్యాకుమారి వరకు విస్తరించి ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు తమిళమండలంలో - ముఖ్యంగా తంజావూరు, జింజి, మధుర రాష్ట్రాల్లో తెలుగు నాయకులు సామంతపాలకులయినారు. రాక్షసి తంగడి యుద్ధానంతరం విజయనగరం క్షీణించడంతో అమరనాయక - పాళెయ గారి విధానంలోని దుష్ఫలితాలు వెర్రితలలు వేసినాయి. రాష్ట్రపాలకులు పాళెగార్ల అంతర్యుద్ధాలు జరపడమేగాక కేంద్రంతో సయితం యుద్ధాలకు దిగినారు. ఈరోజుల్లోనే పైరాజ్యాల నాయకరాజులు స్వతంత్రంగా పాలించ సాగినారు. ఈ వంశాల చరిత్రకు ఆంధ్రదేశంతో ఏమాత్రం సంబంధంలేదు కాని, వారి చరిత్ర అరవీటి వంశచరిత్రతోముడి పడింది. ముఖ్యంగా జింజి, మధుర నాయకులు ద్రోహబుద్ధితో అరవీటి వంశ నిర్మూలనకు, కర్ణాటక రాజ్య వినాశనానికి శక్తికొలది ప్రయత్నించినారు. అయితే ఆంధ్ర సంస్కృతీ వికాశవిస్తరణ లకీరాజ్యాలు ఇతోధికంగా కృషిచేసినాయి. తెలుగు సంగీత సాహిత్యాలకు రంగస్థలాలై దక్షిణదేశం అంతటా తెలుగు సంస్కృతి గౌరవప్రతిష్టలు చేకూర్చినాయి.

## 17.2 మధుర నాయకరాజ్యం :

"ప్రాచీన పాండ్యదేశమే రాయలనాటి మధుర రాజ్యం. అందులో నేటి మధుర, రామనాథపురం, తురునల్వేలి, తిరుచునాపల్లి, కోయంబత్తూరు, సేలంజిల్లాలు, తిరువాన్కూరులో కొంత భాగం కలిసివుండేది. మధుర రాజ్యస్థాపనను గురించి ఒక ఐతిహ్యంఉంది. "పాండ్యరాజుల నుండి మధురను జయించిన సేనాని నాగమనీడు కృష్ణరాయలను ధిక్కరించి స్వతంత్రించినాడు. నాగమకొడుకు విశ్వనాథుడు నాగమను జయించి బందీగా పట్టుకురాగా రాయలు సంతసించి మధుర రాజ్యాన్ని విశ్వనాథునికిచ్చినాడు" అని ఆకథ. అంటే - కృష్ణరాయలకాలంలోనే విశ్వనాథుడు మధుర రాజ్యం స్థాపించినాడని ఆకథసారాంశం. దీనికి చారిత్రక ఆధారం లేదు. విశ్వనాథుడు అచ్యుతరాయల కాలంలో తాంబూల కరండవాహిగా ఉన్నట్లు శాసన సాక్ష్యం ఉంది. బహుశా అచ్యుతుని అభిమానంతో విశ్వనాథుడు చోళమండలంలో అమరనాయకుడయి వుంటాడు. తరువాత సదాశివుని కాలంలో దక్షిణదేశదండ యాత్రనడిపిన రామరాజు విఠలులకు సాయపడిన రామరాజయల అభిమానం పొంది తిరువాడ పాలకులయినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1564 వరకు విశ్వనాథుని పాలనసాగింది. అనంతరం అతనికొడుకు కృష్ణప్ప పాలకుడయి రాకాసిగండి యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధానంతరం తిరుమల రాయల ఇక్కట్టులు, నిస్సహాయత అవకాశంగా తీసుకొని నామమాత్రంగా అతనికి లోబడి కప్పం చెల్లిస్తూ స్వతంత్రంగా వ్యవహరించసాగినాడు. అందుచే క్రీ.శ. 1565 ప్రాంతంలో కృష్ణప్పనాయడే మధురరాజ్యం స్థాపించినాడని చెప్పవలెను." బి.యస్.ఎల్. హనుమంతరావు

### కృష్ణప్పనాయుడు క్రీ.శ. 1565 - 1572 :

కృష్ణప్పకాలంలో అరియనాథుడు ప్రధాని, దండనాథ పెదవుల్లో వుండిరాజ్య వ్యవహారాలు నిర్వహించినాడు. కృష్ణప్ప కొడుకు వీరప్పనాయకుడు రెండో వెంకటపతి రాయలపై తిరుగుబాటచేసి వల్లంకోట యుద్ధంలో పరాజయం పొందినట్లు తెలుస్తుంది. ఈతనికాలంలో ఫెర్నాడియనే పోర్చుగీసు క్రైస్తవ మతప్రచారకుడు మధురలో చర్చినిర్మించి ప్రచారం ప్రారంభించినాడు.

### ముద్దు కృష్ణప్ప క్రీ.శ. 1601 - 1609 :

వీరప్ప అనంతరం సింహాసనం ఎక్కినవారిలో ముద్దు కృష్ణప్ప ప్రముఖుడు. మారవదేశంలో (మధురతీర ప్రాంతభూములు) పోర్చుగీసులు జరుపుతున్న దుండగాలనణచి రామేశ్వరం వెళ్ళే తీర్థయాత్రికులకు రక్షణకల్పించినాడు.

### ముద్దు వీరప్ప క్రీ.శ. 1609 - 1623 :

ముద్దు కృష్ణప్పకొడుకు ముద్దు వీరప్ప బాహాటంగా విజయనగరాన్ని ధిక్కరించిన రెండో వెంకటపతిరాయలి అనంతరం చెలరేగిన అంతర్యుద్ధంలో జగ్గరాజు పక్షం వహించి తోపూరు యుద్ధంలో పరాజయం చెందినాడు.

**తిరుమల నాయకుడు 1623 - 1659**

వీరప్ప కొడుకు తిరుమలనాయకుడు మధుర నాయకరాజుల్లో అగ్రగణ్యుడు. రాజనీతి కిటుకులు తెలిసినవాడు. ఈతని పాలనలో మధుర ప్రాబల్యం ఇనుమడించిందికాని, స్వార్ధంతో ఈతడు అనుసరించిన విదానాలవల్ల విజయనగరరాజ్యం నసించడమేగాక మధుర ఉనికికే ప్రమాదం ఏర్పడింది. శ్రీరంగరాయల విజయనగర రక్షణకై చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించి తిరుమలనాయకులు బీజపూర, గోల్కొండసుల్తానుల పక్షంవహించినాడు. దీనితో కర్ణాటకాన్ని బీజాపూరు, ఆంధ్రప్రాంతాలను గోల్కొండ ఆక్రమించినాయి. దీనికితోడు తిరుమలరాయల కాలం అంతా మారవసేనాపతులతోను ఇతర పాళెగార్లతోను యుద్ధాలతో సరిపోయింది. ఈతని చివరిరోజుల్లో మైసూరు కంఠీరవ నరసరాజు మధురపై దండెత్తి, సత్యమంగళం ప్రాంతంలో చేజిక్కిన వారిని ఆడ, మగ విచక్షణ లేకుండా క్రూరంగా ముక్కులు కోయించి నాడట. దీన్నే ముక్కుల యుద్ధం' అంటారు. యుద్ధంలో పోర్చుగీసువారు సాయం చేసినందున తిరుమలుడు వారికి చర్చీలు కట్టించినాడు. ఈ రోజుల్లో రాబర్ట్ డనోబిలీ అనే ప్రసిద్ధ మతప్రచారకుడు మధుర కేంద్రంగా కొత్త పద్ధతుల్లో క్రైస్తవ ప్రచారం ప్రారంభించినాడు. యుద్ధాల్లో నిమగ్నుడై వున్న తిరుమలుడు కళలను, సారస్వతాన్ని పోషించడంలో ఏమరలేదు. నేటికీ మధురలో యాత్రికులనాకర్షించే 'తిరుమలరాయల మహల్' అతని నిర్మాణమే. తిరుమలుని కాలం నుండి మధుర తెలుగు సారస్వతానికి ఆటపట్టుయింది.

**చొక్కనాధుడు క్రీ.శ. 1659 - 1682 :**

తిరుమలుని కొడుకు చొక్కనాధుని కాలంలో మధుర రాజ్యవిచ్ఛిన్నం ప్రారంభమయింది. ఉద్యోగులు కుట్రలు సాగించినారు. దానికీ తోడు క్రీ.శ. 1663లో బీజపూరు సైన్యం దండెత్తిరాగా, చొక్కనాధుడు సంధిచేసుకొని మరలించినాడు. మధుర పరిస్థితులీ విధంగావుండగా, చొక్కనాధుడు తంజావూరు నాక్రమించి పగతీర్చుకున్నాడు. చొక్కనాధుని తమ్ముడు అళగిరి తంజావూరు పాలకుడయినాడు, కాని, అచిరకాలంలోనే తంజావూరు, బీజపూరు సామంతులైన మహారాష్ట్రుల వశమయింది. ఇంతలో చొక్కనాధుడు కోయంబత్తూరు, చిత్తూరు ప్రాంతాలను, మైసూరును కోల్పోయినాడు.

చొక్కానాధుని కొడుకు మూడో ముద్దుకృష్ణప్ప ఏడేండ్లు పాలించినాడు.

**విజయరంగచొక్కానాథుడు - మాతామహిమంగమ్మ :**

మూడో ముద్దు కృష్ణప్ప కొడుకు విజయరంగచొక్కనాథుడు బాలుడయినందున మాతామహిమంగమ్మ సామర్థ్యంతో రాజ్యవ్యవహారాలు నిర్వహించింది. మంగమ్మకాలంలో దక్షిణదేశ రాజకీయాల్లో అనేక పరిణామాలు జరిగాయి. క్రీ.శ. 1674 లో 'శివాజీస్వరాజ్యం' స్థాపించినాడు క్రీ.శ. 1676లో తంజావూరు మహారాష్ట్రుల స్వాధీనమయింది. మొగలుపాదుషా ఔరంగజేబు, బీజపూర్, గోల్కొండనాక్రమించినాడు. దక్షిణ దేశంలో అధిక భాగం హైదరాబాద్ సుభాలో చేరి నిజాంఉల్-ముల్క్ సుబేదారయినాడు. హైదరాబాద్ సుబేదార్ కింద ఆర్కాటులో 'నవాబీ' ఏర్పడింది. ఇట్టి పరిస్థితుల్లో మంగమ్మ రాజనీతితో వ్యవహరించి ఔరంగజేబుకు కప్పం చెల్లించడానికి అంగీకరించింది. క్రీ.శ. 1706 నుండి విజయ రంగచొక్కానాధుడు పరిపాలనాభారం వహించినాడు గాని అతనికి సాహిత్యంలో వున్న ఆసక్తి ప్రభుత్వ నిర్వహణలో లేనందున ఉద్యోగుల దుండగాలు మితిమీరి ప్రజలనేక బాధలకు గురి అయినారు.

విజయరంగచొక్కానాధుని మరణానంతరం క్రీ.శ. 1732లో, ఆతని భార్య మీనాక్షి పాలనాభారం వహించింది. ఆస్థాన ఉద్యోగులది సహించక కుట్రలు సాగించినారు. పరిస్థితులవకాశంగా తీసుకొని ఆర్కాటు నవాబు ఆనతితో చందాసాహెబ్ మధురపై దండెత్తినాడు క్రీ.శ. 1739లో మీనాక్షి ఆత్మహత్యచేసుకొన్నది. మధుర రాజ్యం ఆర్కాటు 'నవాబీ'లో లీనమయింది.

**తంజావూరు నాయకరాజ్యం :**

తంజావూరు, తిరుచునాపల్లి, పుదుక్కోట ప్రాంతం కలిసి తంజావూరు నాయక రాజ్యం. ఇది ప్రాచీన చోళ మండలం. ఈ ప్రాంతం కృష్ణరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యంలో చేరింది. తరువాత కాలంలో అచ్యుత రాయలు తనదగ్గరి బంధువైన చెవ్వప్పను క్రీ.శ.

1535 లో పాలకుడుగా ఈ ప్రాంతానికి నియమించాడు. తంజావూరు నాయక రాజులు విజయనగర సామ్రాజ్యం పట్ల విశ్వాస భావంతో ఉండేవారు.

**చెవ్వప్ప క్రీ.శ. 1535-1561 :**

చెవ్వప్ప మంచి సమర్థుడు. తంజావూరు ప్రాంతాల్లో అలజడులకు కారణమైన చోళనాయకులనణచి శాంతి భద్రతలనెలకొల్పినాడు. మహావిద్వాంసుడైన గోవింద దీక్షితులు అతని మంత్రి. చెవ్వప్ప అనుమతితో పోర్చుగీసువారు తంజావూరులో చర్చి నిర్మించుకున్నారు.

**అచ్యుతనాయకుడు. క్రీ.శ. 1561-1614 :**

చెవ్వప్పకొడుకు అచ్యుతనాయకుడు, రాయల పట్ల విధేయతతో వల్లం కోట యుద్ధంలో రెండోవెంకటపతి పక్షాన మధురతో పోరాడినాడు. దీనితో మధుర, తంజావూరు మధ్యస్పర్థ పెరిగింది. అచ్యుతునకు యువరాజైన రఘునాథుడు అన్ని విధాల తోడ్పడుతూ వుండేవాడు. క్రీ.శ. 1597లో వెల్లూరు పై గోల్కొండ సైన్యాలు దండెత్తినపుడు రాఘునాధుడే రాయల సహాయంగా సైన్యాలు నడిపించినాడు. అచ్యుతనాయకుడు కుంభకోణం, చిదంబరక్షేత్రాల్లో గోపుర మండపాలు నిర్మించటమే గాక, కావేరినది ఆకట్ట మరమ్మత్తుచేయించి ప్రజలకు మేలు చేకూర్చినాడు.

**రఘునాథుడు క్రీ.శ. 1614-1633 :**

తంజావూరు నాయకరాజుల్లో రఘునాధుడు అగ్రగణ్యుడు. ఈతడు సింహాసనం ఎక్కేనాటికి విజయనగరంలో అంతర్యుద్ధం జరుగుతోంది. అదే సమయంలో పోర్చుగీసులచే పదభ్రష్టుడయిన నేపాళ (జాఫ్నా) రాజురఘునాథుని శరణు జొచ్చినాడు. దేవకోటప్రాంతంలో చోళగుడనే దొంగలనాయకుని దుశ్చర్యలు మితిమీరినాయి. ఇట్టి పరిస్థితుల్లో రఘునాథుడు డచ్చివారితో స్నేహంచేసి, వారిచేతన సైనికులకు శిక్షణ నిప్పించి దేవి కోట మీద దండెత్తినాడు. చోళగుని అణచి దేవికోటనాక్రమించి జాఫ్నాపై దండెత్తి పోర్చుగీసుల నోడించి నేపాళ ప్రభువును సింహాసనంపై పునరుద్ధరించినాడు. అనంతరం యాచమనాయకునితో చేరి తోపూరు యుద్ధంలో ప్రముఖ పాత్ర నిర్వహించినాడు. రఘునాధుడు సాహిత్యస్రష్ట, పోషకుడు; తంజావూరుకు శ్రీకృష్ణరాయల వంటివాడు.

**విజయరాఘువడు క్రీ.శ. 1633-73 :**

రఘునాధునికొడుకు విజయరాఘువుడు. సాహిత్యాభిమానియేగాని రాజకీయాల్లో సమర్థుడుకాదు; కుత్సితుడు. తాతతండ్రులవలె గాక, మధురతో చేరిరాయలకు ద్రోహం తలపెట్టినాడు. అయితే, తిరుమల నాయకునితో కూడవైరం పెట్టుకొని ఏకాకి అయినాడు. రాజ్యంలో కూడ వైష్ణవ మతాభిమానంతో అన్యమతస్థులను పీడించడంవల్ల ప్రజాభిమానం కోల్పోయినాడు. విజయరాఘువుని బలహీనతను గ్రహించి, బీజపూర్, గోల్కొండ సుల్తానులు తరచు దండెత్తి వచ్చి కప్పం వసూలు చేసినారు. దీనితో ప్రజలపై పన్నుల భారం పెరిగింది. ఇందుకుతోడు క్రీ.శ. 1662లో గొప్ప క్షామం సంభవించి ప్రజలనేక బాధలకు గురి అయినారు. పరిస్థితులిట్లుండ మధుర చొక్కనాధునిపై తిరుగుబాటు చేసిన లింగమనీనికి విజయరాఘువుడు ఆశ్రయం ఇచ్చినందున చొక్కనాధుడు ఆగ్రహించి దండెత్తి వచ్చి విజయరాఘువుని, అతనికొడుకు మన్నారుదాసును వధించి తంజావూరు రాజ్యాన్ని మధురలో కలిపినాడు.

తంజావూరు రాజ్యంపై చొక్కనాధుని సవతి తమ్ముడు ఆళగిరి పాలకుడయినాడు. ఆళగిరిరాజనీతి పరుడు కాదు. విజయరాఘువుని కొలువులోని ఉద్యోగియైన రాయసం వెంకన్న బీజపూరు సేనాని ఏకోజీ సహాయంతో ఆళగిరిని తొలగించి మన్నారు దాసు కొడుకు చెంగమల దాసును సింహాసనం ఎక్కించినాడు. చెంగమలదాసు తన దుష్పరిపాలన తో వెంకన్న అభిమానం కూడకోల్పోయినాడు. అందుచే ఏకోజీ సేనాని చెంగమల దాసును తొలగించి తంజావూరు నాక్రమించినాడు. ఏకోజీ శివాజీ సవతి తమ్ముడు. తంజావూరులో మహారాష్ట్ర పాలన ప్రారంభమయింది.

## 17.3 మైసూరు నాయకులు క్రీ.శ. 1578-1761 :

అశోకుని శాసనాలలోని మహిషమండలమే మైసూరు కాని మైసూరు నగరం మాత్రం క్రీ.శ. 1524లో చామరాజు అనే స్థానిక పాలకుడు నిర్మించి 'మహిషదుర్గము' కేంద్రంగా ఏర్పడిందని భావిస్తున్నారు. చామరాజవంశం వారికి శ్రీరంగ పట్టణం రాష్ట్రపాలకులకూ తరచు పోరాటం జరిగింది. ఉభయులూ విజయనగరాధీశుల సామంతులే. చామరాజువంశ స్థుడైన వడయార్ (క్రీ.శ. 1578-1617) రెండవ వెంకటపతిరాయల సామంతుడై కర్ణాటంలో అనేక ప్రాంతాలు జయించి బీజపూర్ సుల్తాను దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. ఇతని తరవాత సింహాసనమెక్కిన చామరాజు (క్రీ.శ. 1617-37) బెంగుళూరు మండలాన్ని జయించినాడు. ఇతని అనంతరం రాజైన కంఠీరవ నరసనాయకుడు క్రీ.శ. 1637-59, అతని కొడుకైన దొడ్డదేవుడు మధురతో పోరాడినారు. కోయంబత్తూరు ప్రాంతం వారి వశమయింది. దొడ్డదేవుని అనంతరం సింహాసనమెక్కిన చిక్కదేవరాయలు మైసూరు నాయక రాజులలో సుప్రసిద్ధుడు. యుద్ధాలతో రాజనీతితో చిక్కరాయలు తన రాజ్యాన్ని దక్షిణాన అన్నామలై కొండలు, తూర్పున సేలం పశ్చిమాన కూర్గ్, బేలూరు, ఉత్తరాన తుముకూరు వరకు విస్తరింపజేసినాడు. చిక్కరాయలు సైతం ఔరంగజేబ్ సార్వభౌమత్వ మంగీకరించి తన రాజ్యాన్ని కాపాడుకొన్నాడు. చిక్కరాయలకు శ్రీరంగపట్టణం రాజధానిగా ఉండేది. చిక్కరాయలు పరిపాలనా దక్షుడు. కావేరీనదికి ఆన కట్టవేయించి కాలువలు తవ్వించినాడు. అతని ఆస్థానంలో కన్నడ, తెలుగు కవులకు పోషణలభించింది. అతని మంత్రి, ఆస్థానకవి అయిన తిరుమలుని సోదరుడైన సింగరాయలు హర్షుని రత్నావళిని కన్నడంలోకి అనువదించినాడు. చికుపాధ్యాయ అనే మరొక మంత్రి వైష్ణవ మత గ్రంథాలు వ్రాసినాడు. తెలుగు వచనభారతకర్త అయిన కళువె వీరరాజు చిక్కరాయని దళవాయి.

చిక్కదేవరాయల తరవాతిరాజులు బలహీనులైనందువల్ల హైదరాలీ అనే సేనాని బలవంతుడై 1761 నాటికి అధికారము హస్తగతం చేసుకొన్నాడు.

## 17.4 సారాంశము :

విజయనగర సామ్రాజ్యంలో దూర ప్రాంతాలయిన మధుర తంజావూరు రాష్ట్రాలను పాలించిన నాయకరాజుల సంక్షిప్త చరిత్ర పరిశీలించాము.

డా॥ కంరున్నిసాబేగం

పాఠం : 18

# నాయక రాజుల పాలనలో సాధారణ పరిస్థితులు

## 18.0 లక్ష్యం :

నాయక రాజుల పాలనలో మధుర, మైసూరు, తంజావూరు ప్రాంతాలలో ఉన్న పరిపాలనా విశేషాలను పరిశీలించడము.

## విషయక్రమం :


18.1 పరిచయం

18.2 పరిపాలనా విధానం

18.2.1 మంత్రిమండలి

18.2.2 ప్రభుత్వ శాఖలు

18.3 ఆదాయ వ్యయాలు

18.4 సైన్యం

18.5 రక్షకభట విధానం

18.6 న్యాయ నిర్వహణ

18.7 స్థానిక పరిపాలన

18.8 అమర నాయక వ్యవస్థ

18.9 సీమ

18.10 ఆర్థిక పరిస్థితులు

18.11 పరిశ్రమలు

18.12 వాణిజ్యం - రవాణా సౌకర్యాలు

18.13 మత, సాంఘిక పరిస్థితులు

18.14 సారాంశము


## 18.1 పరిచయం

రెండుశతాబ్దాల కాలం దక్షిణాపథంలో హిందూ సంస్కృతికి రక్షణ కలిగించి రాజకీయంగా మధ్యయుగ భారతదేశ చరిత్రలో విజయనగర రాజ్యము కీలకమైన పాత్ర నిర్వహించింది. విజయనగరంతో నిరంతరం పోరాడవలసి వచ్చినందుకే బహమనీసుల్తానులు, ఢిల్లీ సుల్తానులు

బహీనులైనప్పటికీ, ఉత్తరంగ విస్తరించలేకపోయినారు. అందువల్లనే మొఘల్ సామ్రాజ్యస్థాపనకు అవకాశం కలిగింది. దక్షిణ దేశంలో భిన్నభాషా ప్రజలలో సామరస్యం కూర్చియావద్భారతంలో హైందవ ప్రతిభకు విజయనగరము పోషణ కల్పించింది. విజయనగరసామ్రాజ్యంలో కన్నడ, తమిళ, మళయాల ప్రాంతాలతో బాటు కృష్ణానదికి దక్షణంగా సువిశాల ఆంధ్రభూభాగం చేరి ఉండేది. రాజ్యం చివరిదశలో సయితం ఉదయగిరి , పెనుగొండ, చంద్రగిరి ప్రాంతాల్లో రాయల అధికారం చెల్లింది. అందుచేత పురాతన స్థానిక సంప్రదాయాలను మన్నిస్తూ, సమకాలిక అవసరాల కనుగుణమైన పాలనా విధానాన్ని విజయనగరాధీశులు రూపొందించినారు. తురుష్కదండయాత్రల ప్రమాదం నుండి హిందూ మతసంప్రదాయాలను రక్షించడానికి బద్ధకంకణులయి సంస్కృతంతో బాటు దాక్షిణాత్య భాషాసంస్కృతులను పోషించినారు. ముఖ్యంగా తెలుగు సాహిత్య సంగీతాలకు విజయనగరంలో విశేష ఆదరణ లభించింది. నాడు దక్షిణదేశం అంతటా తెలుగు అధికార భాషగా చలామణి అయినట్లు కన్పిస్తుంది. అందుచేతనే ఆంధ్ర సంస్కృతీ వికాస చరిత్రలో విజయనగర యుగాన్ని స్వర్ణ యుగం అనడం కద్దు.

## 18.2 పరిపాలనా విధానం :

నాయక రాజులు పరిపాలనా విషయాలలో శ్రద్ధ తీసుకునేవారు. వీరి పరిపాలన రాయల పరిపాలనతో పోల్చ వచ్చును. పరిపాలన క్రమ బద్ధంగా ఉండేదని న్యూనిజ్ రచనల వల్ల తెలుస్తుంది. గూఢచారులు, దన్నాయకులు, సంప్రతులు మొదలైన వారితో చర్చించి సమాచారాన్ని సేకరించేవారు. అనేక విభాగాలుగా పరిపాలనా సాగేది.

### 18.2.1 మంత్రిమండలి :

రాజ్యం సప్తాంగసమన్వితం. సప్తాంగాల్లో మంత్రి ప్రాముఖ్యం వివరించపనిలేదు. రాయలకు సలహా ఇవ్వడానికి మంత్రి పరిషత్తు ఉండేది. దానికి సర్వశిరః ప్రధాని అధ్యక్షుడు, ఇతణ్ణే సభానాయక, తంత్రనాయక కార్యకర్త అని కూడ అనేవారు. ఉపప్రధాని, రాయభాండారి, దళాధికారి, మహాసామంతాధిపతి మంత్రి వర్గంలో ఇతర సభ్యులు. సాధారణంగా మంత్రి మండలి సమావేశాలు రహస్యంగా జరిగేవి. ముఖ్యమైన సమావేశాలకు రాయలే అధ్యక్షత వహించేవారు. మంత్రి వర్గసమావేశాలను తరచు జరుపుతుండాలని కృష్ణరాయల సూచన.

### 18.2.2 ప్రభుత్వశాఖలు :

ప్రభుత్వ కార్యక్రమాలు శాఖలద్వారా జరిగేవి. అట్టవన, కలదాచర, భాండార, ధర్మాసన, సుంకవ్యవహారాదిశాఖలుండేవి, వీనిని ప్రధాని, దన్నాయక, ధర్మస నాధికారి, భాండాగారాదిమంత్రులు నిర్వహించేవారు. ప్రతిశాఖలోను సంప్రతులు, కరణాలు ఉండేవారు. తొమ్మిదిమంది సంప్రతులున్నట్లు తెలుస్తుందున తొమ్మిది శాఖలున్నట్లు భావించవచ్చు. భాండారంలో రత్నభాండార, స్వర్ణభాండార విభాగాలుండేవి. సంప్రతులు, సీమలస్థలాల పొలిమేరలను గురించి భూకామందులను గురించి, శిస్తులనుగురించి చిట్టాలు తయారు చేసి వుంచేవారు.

## 18.3 ఆదాయవ్యయాలు :

ప్రభుత్వ ఆదాయ మార్గాల్లో పన్నులు, సామంతులు చెల్లించేకప్పాలు, భాండారవాడల ఆదాయం, అమర నాయకుల మామూళ్ళు దర్శనకానక. అధికారవర్తని మొదలుగా సాంప్రదాయక వసూళ్ళు ముఖ్యంగా పేర్కొనవచ్చు. పుత్రోదయ, వివాహాది శుభసమయాల్లో ప్రభువులు రాయలకు ధరూపంలో, ఆభరణ రూపంలో కానుకలు చెల్లిస్తారని పేస్‌వ్రాసినాడు. వీరు అనేక రకాల పన్నులు వసూలు చేసేవారు. వానిలో భూమిశిస్తు ప్రధానమయింది. విజయ నగరాధీశులు పంటపొలాల్ని 'సర్వే' చేయించినారని, తెలుగు ప్రాంతాల్లో 'సర్వే' తిమ్మరుసు మంత్రి నిర్వహించినాడని తెలుస్తుంది. భిన్న ప్రాంతాల్లో వేరువేరు కొలమానాలు వాడినారు. తీరాంధ్రంలో కేసరి పాటిగడ (42'6')రే నాడులో దొరగడ వాడుకలో ఉండేది. పాకనాడులోనే రెండుగడలు ప్రచారంలో ఉన్నట్లు శాసనాలవల్ల తెలుస్తుంది. శాస్త్రరీత్యా పంటలో ఆరోవంతు పన్నుగా వసూలు చేయవలెగాని పంటలో సగం (నంగోరు) లేక మూడో వంతు (ముంగోరు) వరకు వసూలు చేసేవారు. బ్రాహ్మణుల ఈనాములపై ఆరోవంతు, దేవాలయభూములపై ముప్పదోవంతు వసూలుచేసినారు. కొత్తగా ఏర్పడిన వ్యవసాయ గ్రామాలపై కొంత

మినహాయింపు పన్నులో వ్యత్యాసాలుండేవి. పన్ను ధనరూపంలో గాని ధాన్యరూపంలోగాని చెల్లించవచ్చుకాని, హరహర రాయలు పన్నులు ధనరూపంలోనే చెల్లించే కట్టడి చేసినాడని పరాశర మాధవీయం చెబుతున్నది. నీరాంబర భూముల్లో ధాన్యరూపంలో చెల్లించినా కాడాంబర భూముల్లో (అరటి, ఆకుతోటలు, కూరగాయతోటలు) ధనరూపంలోనే చెల్లించవలె. సువర్ణాదాయాన్ని సిద్దాయం అనేవారు. గ్రామాల్లో పంటపొలాలు శిస్తు మొదలైన వివరాలను కరణాలు 'కవిలె'లలో నమోదుచేసి వుంచేవారు.

భూమిశిస్తుతో పాటు వృత్తి, సామాజిక, మత, పారిశ్రామిక, వాణిజ్య సుంకాల పలురకాలుండేవి. పశువులను మేపుకున్నందుకు పచ్చిక బీళ్ళపై పుల్లరి, కొండలపై కొండగుట్ట చల్లించవలెను. గ్రామోద్యోగులు, పురోహితులు, కంసాలి, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి, మేళగాండ్రు, పశువుల కాపర్లు, జంగము, మాదిగి వృత్తి పన్నులు చెల్లించేవారు. బిచ్చగాండ్రపై 'గణాచిరిపన్ను' అనే వృత్తిపన్ను విధించేవారు. కొండోజు అనే మంగలి మంగలి ప్రార్థనపై అళియరామ రాయలు కొన్ని ప్రాంతాల్లో మంగలి పన్ను తీసివేసినాడు. వేశ్యలు కూడవృత్తి పన్నుచెల్లించవలె. రాజధానీ నగరంలో వేశ్యలు చెల్లించే పన్నుఅందలి 12,000 మంది రక్షకభట దళాన్ని పోషించడానికి సరిపోయేదని పేస్ వ్రాసినాడు. సాలె (మగ్గరి, పింజసిద్దాయం), కంసాలి, తెలిక (గానుగరి) కుమ్మరి (చక్రకానిక), గమళ్ళ (ఈడుగ సుంకం) మొదలైనవారిపై పారిశ్రామిక సుంకాలుంటేవి. ఉప్పుకొటార్లపై ఉప్పరి సిద్దాయం వసూలు చేసేవారు. ఇండ్లు (ఇల్లరి) నిధి నిక్షేపాలు, పశువులు, తోటలు నీటిబుగ్గలపై సంపత్తి పన్నువుండేది. స్థలాదాయ మార్గాదాయ మామూలాదాయములు వాణిజ్యసుంకాలు, కొండవీడువంటి వాణిజ్యకేంద్రాలలో వస్తువులపై సుంక ప్రమాణాన్ని వివరిస్తూ శాసనాలుండేవి. ఎండుగడ్డి, కట్టెల వంటి వానిపై గూడ సుంకాలుండేవి. వసంతగరువు, చలివేందిక, సంతలు వాణిజ్య సుంకాల వసూలు కేంద్రాలు. వేలంపాటలో 'సుంకందార్లు' సంతల్లో సుంకం వసూలు చేసే హక్కులు కొనేవారు. నాగలాపురంలో ప్రవేశించే వస్తువులపై 42 వేల 'పగోడా'లు ఆదాయం వచ్చేదని న్యూనిజ్ వ్రాసినాడు. సభలు, సమావేశాలకు గూడ పన్ను చెల్లించవలెను. దేవాలయ పోషణకు, అందలి ఉత్సవ నిర్వహణకు కానుపీసాలు, మహారాజప్రయోజనాలు అనేపన్నులుండేవి. వన్నాయక స్వామ్యం, దుర్గస్వామ్యం, కావలి కానిక అనేవి సైనిక పన్నులు, పెండ్లిండ్లలో ఉభయపక్షాల మీద గుడికళ్యాణం, కల్యాణకానికె అనేసుంకాలుండేవి. గుడికల్యాణం ఊరుగింపు పన్ను అని తెలుస్తుంది. వివాహ సుంకాలను ప్రజలు తీవ్రంగా నిరసించినారు. కృష్ణరాయలీ పన్నులను కందనవోలు, చంద్రగిరి మొదలైన ప్రాంతాల్లో తొలగించినట్లు తెలుస్తుంది. కాని, తరువాత మామూలుగా వసూలుచేసినారు. ఒకశాసనంలోని "కల్యాణకానుక వసూలు చేసేవాడు తల్లికి మొగుడు" అనే మాటను బట్టి ప్రజలీ పన్నులు ఎంతగా గర్హించినారో స్పష్టమవుతుంది.

**"అట్టవనం" ఆదాయవ్యయశాఖ :**

మహానవమితో ఆర్థిక సంవత్సరం ప్రారంభయ్యేదని పేస్ రచనను బట్టి తెలుస్తుంది. పన్నుల వసూలు చేయడంలో పలు పద్ధతులుండేవి. కొన్ని సందర్భాలలో సుంకాధికారులను ప్రభుత్వంనియమించేది. కొన్నిచోట్ల సుంకాధికారాన్ని మధ్యవర్తులు విక్రయించుకొనేవారు. మరికొన్ని చోట్ల స్థానిక సంస్థలు అమరనాయకులు వసూలు చేసేవారు. ఈ ఆదాయవ్యయశాఖ ప్రధాని పర్యవేక్షణలో పనిచేసేది.

దక్షిణ భారతదేశంలో పన్నుల భారంతోను, సుంకాధికారుల దౌర్జన్యాలతోను ప్రజలు కుంగిపోతున్నారని పేస్, న్యూనిజ్ చనల్లో సత్యం లేక పోలేదు అని పైవివరణ రుజువుచేస్తుంది. పన్నులు చెల్లించడానికై చేసిన అప్పులు చెల్లించలేక రైతులు భూములు అమ్మకోవడం, భూములు వదలివలసపోవడం వంటి సంఘటనలు నాటి కైఫీయతుల్లో విస్తారంగా కన్పిస్తాయి. ఈ సమాచారాన్ని శాసనాలు బలపరుస్తున్నాయి. మాచుపల్లికైఫియతు ననుసరించి పన్ను చెల్లించని రైతుల స్త్రీల స్తనాలకు సంబెట గురవరాజనే ఉద్యోగి చిడతలు పట్టించి బాధించినట్లు తెలుస్తుంది. కృష్ణరాయల కాలంలో కొండవీడులో బాచమరను దేష్యంతో వ్యవహరించినాడట. సుంకాధికార్లు పన్నులతో బాటు సొంతానికి కట్నాలు వసూలు చేసేవారట. పన్నులు చెల్లించలేక తంజవూరును విడిచి వెళ్ళడానికి పంచాణం వారు నిశ్చయించగా వారిపై కానిక, తలారి కానికమొదలైన పన్నులను చిన్నప్ప నాయకుడు మినహాయించినాడట.

తమిళ మండలంలో పన్నుల భారానికి వ్యతిరేకంగా వలంగై, ఇండగై తెగలు సహాయనిరాకరణోద్యం సాగించడమేగాక ప్రభుత్వానికి తాము ఎంత చెల్లించేది తామే నిర్ణయించుకొన్నట్లు శాసనసాక్ష్యం లభిస్తున్నది. పన్నులు వసూలు చేయడంలో ఉద్యోగులు క్రూరంగా ప్రవర్తించేవారనడానికి కృష్ణరాయల ఆముక్తమాల్యద నుండిపైన చెప్పినది చక్కని నిదర్శనం. విజయనగరం రాజ్యం మొత్తం ఆదాయం

ఎంతో నిర్ధారణగా చెప్పలేము. స్థానిక చరిత్రల సమాచారం ఆధారంగా లూయిరైస్ 81 కోట్లరూపాయలని అంచనావేసినాడు గాని, ఇది అతిశయోక్తిగా కన్పిస్తుంది. "కర్ణాటకరాజ కాల సవిస్తరచరిత్ర" అనే ప్రాచీన గ్రంథం ప్రకారం తూర్పు కన్నడ ప్రాంతాల నుండి కృష్ణరాయల ఆదాయం మూడుకోట్లరూపాలు. వార్తామా అనే పాశ్చాత్య బాటసారి రాయలను భారతదేశంలోని రాజులందరిలో ఐశ్వర్యవంతుడని, అతని ఆదాయం రోజుకు 12,000 అనీ వ్రాసినాడు. బుర్హాన్ ఇమాసిర్‌ను బట్టి సదాశివరాయలి ఆదాయం 12 కోట్ల హోన్నులు. ఈ విధంగా ఆదాయ ప్రమాణం నిర్దుష్టంగా తెలియనట్లుగానే రాయలు ఖర్చుల పద్దులేమో స్పష్టంగా తెలియవు. విజయనగరంలో ఉద్యోగులకు ఈనాములిచ్చే ఆచారం ఉంది. ప్రభుత్వం నిర్వహించే క్రమబద్ధమైన న్యాయస్థానాలు లేవు గ్రామాల్లో రక్షకభటులకు ఇతర ఉద్యోగులకు గ్రామస్తులేవరు మానాలు చెల్లించేవారు. విద్య, వైద్య సదపాయాలకు ప్రయోగకర సంస్థలు స్థాపించి ప్రభుత్వం నిర్వహించలేదు. అయితే, ఆదాయం అంతః పుర ఖర్చులకు, సైన్యపోషణకు, దేవాలయాది భవన నిర్మాణానికి, తటాకాది నీటి పారుదల సౌకర్యములకు, కళాసాహిత్య పోషణకు, దానధర్మాలకు వినియోగ మయ్యేది. రాయలు తన ఆదాయం 65 లక్షలలో 25 లక్షలు మాత్రం సొంతానికి వినియోగించి మిగిలిన మొత్తంతో గుర్రాలు, ఏనుగులు కొనేవాడని న్యూనిజ్ వ్రాసినాడు. కాబట్టి ఆదాయంలో అధిక భాగం సైన్య పోషణకు ఖర్చయ్యేది. నాటి పరిస్థితుల్లో అదితప్పనిసరి అని చెప్పనక్కరలేదు. ఇక రాయల అంతఃపురం అత్యంతవైభవోపేతంగా ఉండేదని బాటసారులు నిర్ణించినారు. ఆదాయంలో ఐదోవంతు దేవాలయ నిర్మాణ నిర్వహనలకు వినియోగించినారు. ఖర్చుపోను ప్రతి సంవత్సరం కోటి పణాలు భండారంలో రాయలు నిల్వచేసేవాడని పేస్ వ్రాతలను బట్టి తెలుస్తుంది.

విజయనగరంలో బంగారు, వెండి, రాగి నాణేలు అమలులో ఉండేవి. గద్యాణం బంగారు నాణెం, దాన్నే 'వరాహ' అనేవారు. ఇదిచాళుక్యుల కాలంనుండి వస్తున్న నాణెం. బహుశా 'వరాహ' పదమే 'వరహా' అయి ఉంటుంది. కృష్ణరాయల గద్యాణం 119.7 వడ్లగింజల ఎత్తుఉండేది. ఘటివరాహా, దొడ్డవరాహా అనే ప్రత్యేక గద్యాణాలు కూడ ఇచ్చేవారు. గద్యాణంలో సగం 'ప్రతాప' తరువాతవి 'పణం', 'చిన్నం' ఇవి అన్నీ బంగారునాణేలే. ఎక్కువ వాడుకలో వున్న నాణెం పణం. 'తార్' అనేది వెండినాణెం. ఇది పనంలో ఆరోవంతు. జీటలు, కాసుఅనేవి రాగినాణెలు. వీని విలువ స్పష్టంగా తెలియదు. ఇవిగాక రాజ్యం పశ్చిమప్రాంతాల్లో పోర్చుగీస్, ఈజిప్షియన్ నాణెలువాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. 'దీనారం' ఈజిప్షియన్ నాణెం. ప్రౌఢరాయలు' దీనారటంకాల'తో శ్రీనాధుని తీర్థమాడించినాడు. కేంద్ర ప్రభుత్వమేగాక రాష్ట్రాపాలకులు నగరాధిపతులు (వర్తకశేష్టులు) గూడనాణేలు ముద్రించేవారు. "ప్రతి సంస్థానానికి టంకశాల గుత్తచేసుకొని వారి వారి పేరటను ముద్రలు కల్పించుతూవచ్చిరి" అని అట్టవన తంత్రం చెబుతున్నది. నాణేల నాణెతను కంసాలులు నిర్ణయించేవారు.

## 18.4 సైన్యం :

దక్కను సుల్తానులతో నిరంతరపోరాటాలు జరుగుతున్నందున విజయనగరాధీశులు సైన్య పోషణలో అప్రమత్తత వహించినారు. రాజ్య అదాయంలో అధిక భాగం సైన్యానికి ఖర్చయ్యేది. స్థానిక పాలనా విధానం కూడ సైనిక అవసరాలకనుగుణంగా రూపొందించినారు. రెండో దేవరాయలు, వీర నరసింహరాయలు, కృష్ణ రాయలు అనేక సంస్కరణలొనర్చి క్రమ శిక్షణలో, నేర్పరితనంలో, తంత్రంలో, విజయనగర సైన్యం దక్కన్ సుల్తానుల సైన్యంతో కనీసం తీసిపోని విధంగా తీర్చిదిద్దినారు. నికోలోకాంటె లెక్కలను బట్టి రాయలు సైన్యంలో 90 వేల మంది, రజాక్ లెక్క ప్రకారం లక్షమంది సైనికులుండేవారు. కృష్ణరాయలు 70,000 కాలిబంట్లు, 32,000 అశ్వదళం, 550 ఏనుగులు ఉన్న సైన్యంతో రాయచూరుపై దండెత్తినట్లు న్యూనీజ్ వ్రాసినాడు. కాని, రాయవాచకం ప్రకారం రాయల సైన్యంలో 1200 ఏన్గులు, 60,000 గుర్రాలు, 5,00,000 కాలిబంట్లు ఉన్నట్లు తెలుస్తుంది.

మొత్తం సైన్యంలో ప్రధానంగా రెండు విభాగాలు ఉంటే ఒకటి సిద్దసైన్యం. రాయలు స్వయంగా జీతం యిచ్చి పోషించేనైజీత సైన్యం. ఇందులో కొంతమూలబలం సిద్దసైన్య ప్రమాణం స్పష్టంగా తెలియదు. న్యూనిజ్ వ్రాసిన దాన్ని బట్టి కృష్ణరాయల నైజీత సైనికులు 50 వేలమంది అని అందులో 2000 అశ్వికులు అంతిపురం రక్షణకు, 200 మంది అశ్వికులు రాజు అంగరక్షకులుగా ఉన్నట్లు తెలుస్తుంది. సిద్దసైన్యంపై అజమాయిషీకి కందాచారశాఖఉంటేది. ఈ శాఖ అధిపతి సేనాపతి లేక దళవాయి. మంత్రి మండలిలో సభ్యుడు. అంతిపుర రక్షకదళం మీద, బహుశాగజ బలంమీద ప్రత్యేక సేనాపతులుండేవారు. ముస్లిం సైనికులకు రాయలు ఈనాములిచ్చినాడని ఫెరిస్టా వ్రాసినాడు.

ని, జాగీర్లుగా కనాల్గు నెలలకొక మారు సైనికులకు రాయలు జీతాలిచ్చినట్లు రజాక్ వ్రాసినాడు. పండాచారశాఖ కింద సైనికుల అవసరాలు ర్చడానికి నల్గురు పారుపత్యగార్లు, ఆర్గురు కరణాలు, ఆర్గురు ముడుపు గొల్లలు, సుమారు 3000 మం వరకు పనిచేస్తూంటే వారు. లో 300 మంది మాలీసు చేసేవారు. కమ్మరి, కాసె, వడ్రంగి, పనులవారు 2000 మంది, మిగిలినవారు చాకళ్ళు, మంగళ్ళు, మొదలైనవారు. హానవమినాడు రాయలుకై జీతం సైన్యాన్ని సమీక్షజరిపేవారు.

రెండోవిభాగం అమరనాయకసైన్యం. అమర నాయక పద్ధతికి, కాకతీయులు నాటి నాయంకర విధానం మూలం. ఇది భూస్వామ్య విధానం అని చెప్పవచ్చు. రాజ్యాన్ని అమరములుగా విభజించి, కోరినప్పుడు సైన్యం సరఫరాచేసే నిబంధన మీద విశ్వాస పాత్రులైన నాయకులకు పంచి యివ్వడం జరిగింది "సైనిక సహాయానికి ఇచ్చేభూమిని గాని, ఆభూమిపై ఆదాయంగానీ అమరము" అని ఒక అర్థం. అమరం పారశీక భాషాపదం అనీ, ఆజ్ఞ అని దాని అర్థమనీ మరొక వాదం. అమరం ప్రమాణాన్ని బట్టి అమరనాయకుని హోదా, అతడు పోషించవలసిన సైన్యప్రమాణము ఉండేది. సైనిక సహకారం మీదనే అమరనాయకులు తమభూములను కిందినాయకులకు పంచి యిచ్చే వారు. అచ్యుతరాయల కాలంలో ఆరులక్షల అమర నాయక సైన్యం ఉండేదని న్యూనీజ్ అంచనా రాయవాచకం ప్రకారం రెండు లక్షలకాల్బలం 24 వేల అశ్వదళం, 1200 ఏనుగులు అమరనాయకులు పోషించేవారు. అమరనాయకులేగాక సామంతరాజులు, రాష్ట్ర ప్రభువులు అవసరమైనప్పుడు రాయలకు సైన్య సహాయం చేసేవారు.

విజయనగర సైన్యంలో పదాతి, అశ్వ, గజదళ విభాగాలు ముఖ్యమైనవి. విల్లంబులు, కత్తి, ఈటె ప్రధాన ఆయుధాలు. కాలిబంట్లకు కవచశిరస్త్రాణాలు లేవనీ శరీరం నిండా నూనెపులుముకొనేవారనీ ఫెరిస్టా వ్రాసినాడు గాని చర్మంతో చేసిన కవచశిరస్త్రాణాలు డాలు ధరించేవారని పేస్, బర్రోస్‌ల వంటి పోర్చుగీస్ బాటసారులు వర్ణించినారు. పదాతి తళంలోతుపాకి విభాగం కూడ ఉంది. "రటితదిక్తట నటత్పెట పెటార్భటులతో ఘోరమైన తుపాకి గుండ్లు" అంటూకు మారదూర్జటి రచన. అయితే, విజయ నగరాధీశులు తుపాకిదళంపై ఎక్కువ శ్రద్ధ వహించినట్లు లేదు. గుర్రాలు, ఏనుగులను అలంకరించేవారు. పశ్చిమతీరంలో విజయనగరాధీశులకు నౌకాదళం ఉండేది. కృష్ణరాయల కాలంలో హొనావర్ రాష్ట్రాధిపతి తిమ్మోజు నౌకాదళాధిపతి అయినట్లు తెలుస్తుంది. గోవా నాక్రమించడంలో పోర్చుగీసువారికి రాయలనౌకాబలం సహాయంచేసిందని పాదర్ హీరాస్ వ్రాసినాడు.

దక్కను సుల్తానుల, విజయనగర యుద్ధాలలో దుర్గాలు ప్రముఖ పాత్ర నిర్వహించినాయి. అష్టవిధ దుర్గాలని సంప్రదాయంగాని రాయవాచకం మాత్రం గిరి, స్థల, జల, వన అనేచతుర్విధ దుర్గాలనే పేర్కొంటున్నది. గడిదేశంలో-సరి హద్దుల్లో - దుర్గా లెక్కువగా నిర్మించాలని కృష్ణరాయల సూచన. విజయనగరం సరిహద్దుల్లో పెక్కుదుర్గాలున్నాయని వానిచుట్టూ దుర్గమాటవులు పెంచుతారని పేస్ వ్రాసినాడు. దుర్గరక్షణకు పాషాణయంత్రాలుచ దంభోళి ఉండేవి. శత్రువులపై రాలు రువ్వేఫిరంగియే దంభోళి. దుర్గ ఆక్రమణకు లగ్గలు వేసే పద్ధతి ఉంది. కృష్ణరాయలు కొండవీటి లగ్గం బట్టుకొన్నాడు.

సైనికులనెన్నిక చేయడంలో రాయలు స్వయంగాశ్రద్ధ వహించేవారు. ధైర్య సాహసాలకు పేరొందిన తురుష్క, కబ్బలి, మొరసజాతుల వారు రాయల సైన్యంలో అధిక సంఖ్యాకులు అటవికులైన చెంచు, కోయ, భోయలకు గూడ ప్రత్యేక అవకాశాలుండేవి. ప్రజల్లోధైర్య శౌర్యాలు, యుద్ధోత్సాహం, దేహదార్ఢ్యం పెంపొందించడానికి అవకాశాలు కల్పించినారు. ద్వంద్వ యుద్ధానికి ప్రోత్సాహం ఉండేది. దేశం నలుమూలలా సాముగిండీలుండి హోంతకాయులు శిక్షణ ఇచ్చేవారని నాటి గ్రంథాలనుండి తెలుస్తుంది. విజయనగరం భిన్నభాషా ప్రాంతాలరాజ్యం కాబట్టి వారిసైన్యంలో భిన్నత్వం కన్పిస్తుంది. రాజ్యస్థాపనకాలం నుండి ముమ్మడిరాయల సైన్యంలో ముస్లిములు చేరినారు. దేవరాయలకాలం నుండి వారి సంఖ్య పెరిగి ... కాలంలో ... రాముడు. రామరాయలు రాకాసిగండి యుద్ధంలో పరాజయం చెందటానికి ముస్లిం సేనాపతుల ద్రోహం ఒక కారణం.

## 18.5 రక్షక భటవిధానం :

నేరనిరోధకమువకు శాంతి భద్రతల ... ప్రజలు ... వహించేవారే కాని ప్రభుత్వంలో ప్రత్యేక రక్షక భటశాఖ ఉన్నట్లు తెలియదు. గ్రామంలోని పన్నులు ... లనుబట్టి వారు తస్కరించిన సొమ్ము రాబట్టడం.

అల్లర్లు జరగకుండా చూడటం ఈతని విధులు ఈతనికి నెలజీతం లేదు. పంటపొలంలో ఈనాము ఇచ్చేవారు, రైతులు, నర్తకులు, పంచాణంవారి నుండి తలారి మామూలు వసూలు చేసుకొనేవాడు. పదిపన్నెండుగ్రామాలకు - అంటే స్థలానికి 'కాపలిగారు' ఉండేవాడు. గ్రాతల్వారిని స్థలకావలిగారే నియమించినట్లు తెలుస్తుంది. వీరిపై అధికారి దేశకావాలిగారు. శాసనాల్లో అక్కడక్కడ 'నాడు కావలిగారు' అనేమాట కన్పిస్తుంది. వీరిని బహుశారాయలేని యంచేవాడు. సాధారణంగా, చెంచు, కోయ, బోయ మొదలుగా నేరస్థుల జాతుల్లోని వారినే కావలిగార్లుగా నియమించేవారు. ఇది 'దొంగకుతాళం చెవులివ్వడం' వంటి విధానం దొంగలముఠాల స్థావరాలతోను వారి విధానాలతోను వీరికి పరిచయం ఉన్నందున నేరాలను సామర్థ్యంతో ఆపగలరని వీరిని నియమించినట్లు తెలుస్తుంది. వీరికి కూడా మాన్యాలు ఇచ్చేవారు. కొన్నిచోట్ల భూస్వాములు, ధనికులు ప్రత్యేకంగా కావలిగార్లను నియమించిపోషించడం కూడ కద్దు. ఇక పర్వతారణ్య ప్రాంతాల్లోను సరిహద్దుల్లోను రక్షణకు పాళెగార్లుండే వారు. ప్రతి పాళెగానికి రెండు గ్రామాలు 'జాగీరు' ఇచ్చి కోటలు కట్టుకొనే హక్కు ఇవ్వడంజరిగింది. క్రమంగా పాళెగార్లు బలవంతులై విజయనగరం చివరిరోజుల్లో ఇతర భూస్వాముల వలెనే పరస్పర యుద్ధాల్లో మునిగి రాజ్యశ్రేయస్సుకు ప్రమాదంగా పరిణమించినారు. రాజధానీ నగరంలోను ఇతర ప్రధాన నగరాల్లోను ప్రత్యేకమైన ఏర్పాటులుండేవి. విజయనగరంలో పన్నెండు వేలమంది రక్షక భటులుండేవారనీ ఒక్కొక్కనికి ముప్పది పణాల జీతమనీ వారిపై అధికారి కార్యాల మంటంకశాలకు ఎదురుగా వుండేదని అబ్దుల్ రజాక్ వ్రాసినాడు. తలారులు రాత్రులందు దివిటీలు ధరించి కాపలా కాస్తుండేవారు. "ప్రొద్దుపోయినదని తలారులకు వెరచి, యొక విధంబున నారాత్రియుండదలచె" అన్న నిరంకుశోపాఖ్యాన వాక్యాన్ని బట్టి కేవలం దొంగతనాలేగాక ఇతర సాంఘికనేరాలను కూడా తలారులరికట్టేవారని తెలుస్తున్నది. రాష్ట్రాల్లో ప్రభువులు, అమర నాయకులు శాంతి భద్రతల రక్షణకు కృషిచేసేవారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ రాజ్యంలో దొంగతనాలు, దోపిడీలు, దార్లు కొట్టడం చాలా తరచుగా జరుగుతుండేవని కైఫియత్తులవల్ల, నాటి సారస్వతంనుండి తెలుస్తుంది.

## 18.6 న్యాయ నిర్వహణ :

న్యాయనిర్వహనకు విజయనగరం క్రమబద్ధమైన న్యాయస్థానాలు లేవనే చెప్పవలెను. సభ్యులనుబట్టి నాల్గు రకాలు న్యాయస్థానాలను పరాశరమాధనీలం పేర్కొన్నది కాని అవి ఎంత వరకు ఆచరణలో ఉన్నదీ చెప్పలేము. నిరంకుశరాజరికాలన్నింటిలోవలె నేవి జయనగరంలోకూడ రాయలే ఉన్నతన్యాయాధికారి. అతడే నేరాలను విచారించి నిందితులను శిక్షించేవాడు. "అయోగ్యులకు న్యాయనిర్వహణాధికారం ఇవ్వరా"దని కృష్ణరాయలసూచన, కాని విజయనగరంలో రాయలకు బదులు ప్రధాని న్యాయనిర్వహణ జరిపేవాడని రజాక్ రచన సూచిస్తున్నది. తిమ్మరుసు మంత్రికి ఉన్న "ధర్మ ప్రతిపాలక" బిరుదం రజాక్ సాక్ష్యాన్ని బలపరుస్తున్నది. ప్రాడ్వివాకులు, సభ్యులు రాయలకు న్యాయ నిర్వహణలో సహాయపడేవారు. రాయలు పర్యటనలో ఉన్నప్పుడు సయితం స్థానికులు అతడ్ని దర్శించి తమ వ్యవహారాలు నివేదించుకొనే అవకాశం ఉండేది రాష్ట్రాలలో రాష్ట్రపాలకులు, అమరనాయకులు న్యాయ నిర్వహన జరిపే వారు. వారి తీర్పు సంతృప్తి కరంగా లేనిచోరాయలకు నివేదించుకొనే అవకాశం ఉంది. ఆస్తి తగాదాలకు తాత్కాలిక న్యాయస్థానాలకు ఏర్పాటు చేసేవారు. వీటిని ధర్మసనాలు అనేవారు. ఇవి సాధారణంగా ఆలయ మండపంలో సమావేశమవుతుండేవి. నిందితులను హింసించి తద్వారా నేరం ఒప్పించే ఆచారం ఉంది. "ఆడుమకట్టున వేడి ఎండలో మిగుల జడియవీపుల మీద కోపరాలెత్తి" పొగడ దండలుపైచి హింసించేవారు. నేరనిరూపణకు దివ్య పరీక్షలుండినట్లు నికోలోకాంటే పేర్కన్నాడు. శిక్షలు కఠినంగా ఉండేవి. దేశద్రోహ, రాజద్రోహనేరాలకు మరణమేశిక్ష. కృష్ణరాయల కాలంలో బహుశా నాగలాపుర తటాక నిర్మాణానికి నరబలి అవసరమైనందున మరణశిక్ష విధింపబడిన బందీలను బలి ఇచ్చినట్లు న్యూనిజ్ వ్రాసినాడు. బ్రాహ్మణులకు మరణశిక్ష విధింపరాదు కాబట్టి కండ్లు పొడిచి యావజ్జీవ కారాగార శిక్ష విధించేవారు.

## 18.7 స్థానిక పాలన :

సువిశాలమైన విజయనగర సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించినారు. రాష్ట్రాన్ని 'రాజ్యము' అనే వ్యవహరించినట్లు తెలుస్తుంది, తంజావూరు, మధుర, ఇక్కేరి, చంద్రగిరి, శ్రీశైలం, కొండవీడు మొదలైనవి ముఖ్యరాజ్యాలు. ఈ రాజ్యాధిపతులు ఇంచుమించు స్వతంత్రంగానే వ్యవహరించినారు. తరచుగా వీరు సార్వభౌమాధికారములక్ష్యం చేయక తమలోతాము కలహించుకొనేవారు. విజయనగరంలో స్థానిక పాలన నాటిసైనిక అవసరాల కనుగుణంగా రూపొందించినారు. బలిష్ఠములైన దుర్గాలు కేంద్రంగా రాష్ట్రాలు ఏర్పడినాయి. ఆంధ్ర, తమిళ, కన్నడ

ప్రాంతాలలో స్థానిక పాలన విధానంలో వ్యత్యాసాలున్నాయి. తమిళ మండంలో చోళయుగం నాటి "నాడు" "కొట్టం" మొదలైన విభాగాల్లో మార్పు లేదు. ఆంధ్రప్రాంతంలో రాష్ట్రాలను రాజ్యాలు అని వ్యవహరించినారు. పెనుగొండ, గుత్తి, కందనవోలు, శ్రీశైలము, ఉదయగిరి, చంద్రగిరి, కొండవీడు రాజ్యాలకు కేంద్రాలు. వీటిలో గండికోటను కూడ చేర్చవచ్చు. పర్వతనాయకుడుగండికోట రాజవానిగా సిరివొళ్ళ, సిద్దవట, సకిలి, పొత్తపినాడు రాజ్యాలను పాలించినాడని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి. అచ్యుతరాయల కాలంలో సామ్రాజ్యంలో మొత్తం 17 రాజ్యాలున్నట్లు శాసనాలవల్ల తెలుస్తుంది. దుర్గదన్నాయకుడురాజ్యంపై అధికారి. సాధారణంగా వీరు రాజకుమారులు, రాజబంధువులు లేదా మాధవమంత్రి, లక్కన, తిమ్మరుసులవంటి విశ్వాసపాత్రులైన మంత్రులు; దన్నాయకులుగా బ్రాహ్మణులను నియమించడంలోని రాజనీతి కృష్ణరాయలు వివరించినాడు. సరిహద్దురాజ్యాల దన్నాయకులు మినహా ఇతరులు రాజధానిలోనే వుంటూతమ రాష్ట్రవ్యవహారాలను కార్యకర్తలద్వారా నిర్వహించినారు. రాష్ట్రాల్లో కూడ ప్రధాని, కార్యకర్త, దళవాయి. సామంతాధికారి మొదలైన వారితో సలహాసంఘం వుండేది. దన్నాయకులకు నాణేలు ముద్రించడం, పన్నులు మినహాయించడం, కొత్త పన్నులు విధించడం వంటి అధికారాలుండేవి. 'దుర్గదన్నాయక నివర్తన' అనే పన్నులు వీరు వసూలు చేసి నట్లు తెలుస్తుంది. దన్నాయకుడు తన రాబడిలో కొంతరాయలకు చెల్లిస్తూ తనకు నిర్దేశితమైన సైన్యాన్ని పోషించవలె. ఉదయగిరి దన్నాయకుని ఆదాయం 8 లక్షలు. అందులో 3 లక్షలు రాయలకు చెల్లించేవాడు; 25,000 కాల్బలాన్ని, 1500 అశ్వదళాన్ని 140 ఏనుగులను పోషించేవాడని న్యూనీజ్ వ్రాసినాడు. దన్నాయకులను ఒక దుర్గం నుండి మరొక దుర్గానికి తరచుమారుస్తుండేవారు. శాసనాల్లో చవడి, కరనాలు అనేమాటలు తరచు కన్పిస్తాయి. చావడిదన్నాయకుని కార్యస్థానమని, కరణాలు అందిలి గుమస్తాలని భావించవచ్చు. దీన్ని బట్టి రాష్ట్ర వ్యవహారాలు నిర్వహించాడానికి ఒక ఉద్యోగి బృందం ఉండేదని తెలుస్తుంది.

## 18.8 అమరనాయక వ్యవస్థ :

అమరనాయక వ్యవస్థ స్థానికపాలన విధానంలో అంతర్భాగంగా ఉండేది. ఈవ్యవస్థ ననుసరించి రాజ్యంలోని భూమిసమస్తానికి రాయలు యజమాని ఆభూమిని అమరాలుగా విభజించి సైన్యసహాయం చేసేషరతుమీద నాయకులకు రాయలు పంచేవాడు. ఇవి పొందినవారే అమరనాయకులు. పోర్చుగీస్‌వారి రచనలను బట్టి రెండు వందలమంది అమరనాయకులున్నట్లు తెలుస్తుంది. అమర నాయకులు తను భూములను తమకింది నాయకులకు పంచేవారు. కొన్ని వ్యత్యాసాలున్నప్పటికి భూస్వామ్య, అమరనాయక విధానాలకు పోలికలున్నాయి భూమిలో హక్కులు, సైనికసహాయం అనేవి రెంటికీ సమాన లక్షణాలు.

అమరగ్రామాల మీద దన్నాయకులకు అధికారం లేదు. దన్నాయకుడు రాయల ప్రతినిధి; అమరనాయకుడు రాయలసైనిక సామంతుడు. అమరం ప్రమాణాన్ని బట్టి అమరనాయకుని హోదా ఉండేది. అమరనాయకుడు ప్రతి సంవత్సరం రాయలకు 'కప్పం' చెల్లించవలెను. అంతేగాక, కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా సంవత్సరాది రోజున రాయలకు మామూళ్ళు, కానుకలు సమర్పించవలెను. మామూళ్ళలో భోజన పదార్థాలు కూడా ఉండేవి. తనకు నిర్ణీతమైన సైన్యాన్ని పోషించి రాయలకు సహాయం చేయవలెను. తన అమరంలో శాంతి భద్రతల రక్షణకు అతడే బాధ్యుడు. అడవులు ఛేదించి వ్యవసాయాభివృద్ధికి పాటుపడవలెను. అమరనాయకులు కూడ రాజధానిలోనే వుండేవారు. దన్నాయకులకంటె వీరి స్వాతంత్ర్యం ఎక్కువని చెప్పవచ్చును. వీరిని ఒక అమరం నుండి మరొక వానికి మార్చరు. అయితే విధిని నిర్వహణలో ప్రమత్తులైన వారిని రాయలు శిక్షించవచ్చు లేదా తొలగించవచ్చును. రాకాసిగండి యుద్ధం వరకూ అమరనాయకుల్లో వారసత్వహక్కులేర్పడలేదు.

## 18.9 సీమ-రాజ్యంలో ముఖ్యవిభాగం :

సీమపై అధికారి పారుపత్యగారు. రాయసంవారు, అవసరికులు, రాచకరణాలు అనేమాటలు కన్పిస్తున్నాయి గాని వీరు సీమల్లో ఉద్యోగులని స్పష్టంగా చెప్పలేము. పారుపత్యగారు సీమ ఆదాయవ్యయాలపై శ్రద్ధవహించేవారు రైతులకు పట్టాలివ్వడం, పన్నులు మినహాయించడం, కొత్త పన్నులు విధించడం, సంతలు ఏర్పాటు చేయడం ఈతని అధికారాలు. సీమను స్థలాలుగా విభజించినారు. ప్రతిస్థలంలో చావి ఉండేది. రెడ్డి లేక గౌడ, స్థలకరణాలు ఇందలి ఉద్యోగులు, వీరికి గ్రామ పాలనతో సన్నిహిత సంబంధం ఉండేది. రెండు మూడుగ్రామాలు ఉద్యోగులతో కలసి వీరుధర్మాసనంగా ఏర్పడి నేరస్థులను విచారించి శిక్షించేవారు.

గ్రామాల్లో ఖాండారవాడలు, అమరగ్రామాలు, మాన్యగ్రామాలు అని మూడు రకాలుండేవి. అమరనాయకులు ఆధీనంలో ఉండేవి అమర గ్రామాలు. మాన్యగ్రామాల్లో దేవ బ్రాహ్మణ అగ్రహారాలు, ఉబ్బలిగ్రామాలు ఉండేవి. ప్రభుత్వానికి చేసినసేవకు ప్రతిఫలంగా బహుకరించిన గ్రామాలు ఉబ్బలి గ్రామాలు. మాన్యగ్రామాలు నామమాత్రమైన 'జోడి'అనే పన్నుచెల్లించేవి. బ్రామ్మణాగ్రహారాల్లో విద్వాన్ మహాజనసభలు గ్రామసాలనని నిర్వహించేవి. భాండారా వాడలు రాజక్షేత్రంలోనివి. సాధారణగ్రామ వ్యవహారాలను పన్నిద్దరు అయగాండ్రు నిర్వహించేవారు. వాస్తవానికి వీరు గ్రామసేవకులు. వీరుకరణము, రెడ్డి, తలారి, పురోహితుడు, కంసాలి, కమ్మరి, వడ్రంగి, కాసె, కుమ్మరి, చాలకి, మంగలి, మాదిగ. కొన్నిగ్రామాల్లోనీర్గంటి పన్నిద్దరిలో వుండేవారు. కరణము, రెడ్డి, తలారికి మాత్రము ప్రభుత్వంతో ముఖ్యంగా స్థలోద్యోగులతో సంబంధం ఉండేది. ఆయగాండ్రకు జీతాలు లేవు; భూములు అనుభవించేవారు. రైతులు పంటలో 'మేర' అనుపేరు మామూళ్ళు చెల్లించేవారు.

విజయనగర రాజ్య ఆర్థిక సౌష్టవాన్ని, రజాక్, పేస్, న్యూనీజ్‌వంటి విదేశయాత్రికులు వర్ణించినారు. సుభిక్షమైసిరిసంపదలతో తులతూగుతున్నందునే విజయనగరం తరచు దక్కలసుల్తానుల దాడులకు దోపిడీలకు గురి అయింది. ప్రతిసంవత్సరం రాయలు లక్షమాడలు భండారంలో భద్రపరుస్తున్నట్లు పోర్చుగీసు బాటసారుల వృత్తాంతం. దేశ ఆర్థికవనరులను పెంపొందిచడంలో రాయలు శ్రద్ధవహించేవాడు.

## 18.10 ఆర్థిక పరిస్థితులు :

ప్రజల్లో అధిక సంక్యాకులు వ్యవసాయమే ముఖ్యవృత్తి. భూమి సారవంతమైనదని వ్యవసాయం సమృద్ధిగా సాగుతున్నదని పేస్, న్యూనీజ్‌లు మెచ్చుకున్నారు. రాజులు వారి యుద్యోగులు తటాకాలు, కాల్వలు తవ్వించి నీటిసౌకర్యం కల్పించినారు. బుక్కరాయల కాలంలో పెనుగొండ దగ్గిర శిరువేరు తటాకం నిర్మించినారు. సాళువ నరసింహునికాలంలో అనంతపురం దగ్గిర నరసాంబుధి అనే తటాకం ఏర్పడింది. కృష్ణదేవరాయలు పోర్చుగీసు ఇంజనీర్ల సాయంతో నాగలాపుర తటాకం నిర్మించడమేగాక పంటకాలువలు తవ్వించినాడు. కొండ వీటిరాజ్యంలో కొండమర సుతిమ్మసముద్రం, కొండసముద్రాలను నిర్మించినాడు. ఉదయగిరి రాజ్యంలో అనంతసాగరం, కందనవోలులో సిద్దవటతటాకం వ్యవసాయానికుపయోగించేవి. తటాకాల మరమ్మతులు మొదలైన పనులకు పన్నులు వసూలు చేసేవారు; ఆలయాలు గ్రామసభలు శ్రద్ధవహించేవి. రాజులు సయితం కొంత వ్యవసాయకగ్రామాలు నిర్మించి మిరాశీలిచ్చి కొన్ని సంవత్సరాల పాటు పన్నులు వసూలు చేయక వ్యవసాయాభివృద్ధికి తగిన ప్రోత్సాహం ఇస్తుంఏవారు. దేశం అంతటా జామ, మామిడి, నిమ్మ, అరటి, కొబ్బరి, ఆకుతోటలు విస్తారమనీ పండ్లు చవకగా లభిస్తాయనీ పేస్ వర్ణించినాడు. వరి, జొన్నలు, రాగులు, మినుములు, పెసలు, శనగలు, చెరకు, నువ్వులు, ఆముదాలు పుష్కలంగా పండేవి. వరిధాన్యంలో తీగమల్లెలు, ఖర్జూరాలు, సంపెంగలు, రాజానాలు, కుసుమలు మొదలు గాపలురకాలున్నట్లు తెలుస్తుంది. అయినా వరి అన్నం విలాస వస్తువుగానే ఉండేది.

## 18.11 పరిశ్రమలు :

ప్రతిగ్రామంలోను వ్యవసాయ పంబంధములైన పరిశ్రమలు ఉండేవి. బెల్లం, నూనెల తయారీల వంటివి సాగుతుండేవి. నీటిమందు చాలాచోట్ల తయారయ్యేది. ఆనాదిగా ఆంధ్రదేశం వస్త్రపరిశ్రమకు పేరు పొందింది. విరామసమయాల్లో రైతుస్త్రీలు రాట్నాలపై నూలు వడకే వారు. బట్టలనేతకూడ ప్రతి గ్రామంలో సాగింది. "పింజసిద్దాయం" అనే పన్నును బట్టి ప్రత్తి శుభ్రం చేయడం కొందరి వృత్తి అయింది. సాలె, పద్మసాలె, జాంద్ర, కురుబ, మాలకులాలు నేరవృత్తి నవలంబించినారు. కురుబలు, గొల్లలు, బహుశా కంబళ్ల నేస్తుండేవారు. తాటి పత్రి, ఆదోని, గుత్తి, వినుకొండ నూలు పరిశ్రమకు కేంద్రాలు, ఒక అలవకొండ గ్రామంలో 411 మగ్గాలుండినట్లు తెలుస్తుంది. వస్త్ర పరిశ్రమకు సంబంధించినదే అద్దకం పరిశ్రమ మంజిష్ఠ, ఇంగిలీకం, కరక్కాయలతో చేసిన రంగులతో వస్త్రాలకురంగులువేసేవారు. వీనిని కలంకారీ బట్టలంటారు. కలంకారీవస్త్రాలకు విదేశాల్లో మంచిగిరాకీ ఉండేది.

ఆంధ్రదేశంలోని వజ్ర పరిశ్రమను విదేశబాటసారు లెంతగానో వర్ణించినారు. కర్నూలు, గుత్తి, అనంతపురం ప్రాంతాల్లో వజ్రాలు దొరుకుతున్నట్లు, అందులో వజ్రకరూరు గనులు ప్రసిద్ధములైనట్లు పేర్కొన్నారు. బంగారు, వెండివగలు చేయడంలో; కర్ర, ఇనుము, రాగి, కంచు మొదలైన లోహాలతో వ్యవసాయం పనిముట్లు, గృహోపకరణాలు, చవికెలు, సింహాసనాలు, కీలు గుర్రాలవంటి దేవతావాహనాలు

చేయడంలో పంచాణంవారు సిద్ధహస్తలు, విజయనగర రాజ్యం పోషిస్తున్న సైన్యానికి సరిపడు ఆయుధాలు, కవచ శిరస్త్రానాలు స్థానికంగానే చేయడంలో పంచాణంవారు సిద్ధహస్తలు, విజయనగర రాజ్యం పోషిస్తున్న సైన్యానికి సరిపడు ఆయుధాలు, కవచ శిరస్త్రానాలు స్థానికంగానే

## 18.12 వాణిజ్యం - రవాణాసౌకర్యాలు :

విజయనగరాధీసులురాక పోకల సౌకర్యాలు కల్పించి దేశీయయ విదేశీయవాణిజ్యం పెంపొందించినారు, విజయనగరం నుండి రాజ్యం నలుమూలలకు రహదారుల్నుండేవి. తిరుపతి బాట, కాశీరామేశ్వరంబాట, విజయనగరం కంచీనగరాలమధ్యబాట, అహోబిలం, పోరు మామిళ్ళ, ఐనవోలు, కంభములను కలిపే బాట, మచలీపటట్టణం, కోవిలకొండ, పిలినికనలిపేబాటలు చాలాముఖ్యమైనవి. ఇవి దండుబాటలుగా కూడా ఉపకరించినాయి. వీనిమీద కావళ్ళు, ఎద్దులు, గుర్రాలు, గాడిలు, ఎడ్ల బండ్లు, పల్లకీలు ప్రయాణసాధనాలు. పల్లకీలను బోయలు మోసేవారు. ఎడ్లను, గుర్రాలను మజిలీస్థలాలలో అద్దెకిచ్చేవారు. బాటలపై చలివేందిరములు, పూటకూటిండ్లు, సత్రాలు ఉండేవి. చలివేందిరలలో వనితులు సుగంధ మిశ్రతమైన మంచి నీటిని, నీరు మజ్జిగను ఇచ్చి దాహం తీర్చేవారని నాటి గ్రంథాలనుండి తెలుస్తుంది. వారానికోమారు బహుశా ప్రతిగ్రామంలోను సంతజరిగేది. స్థానిక పాలకులీసంతల నేర్పాటు చేసేవారు. "ఊరూరిసంత సంతకు" అని ఆముక్తమూల్యద. హంసవింశతి అనే 18వ ॥శతాబ్దికావ్యం దక్షిణాపథంలోని ప్రముఖ వ్యాపార **కేంద్రాల్లో ఆంధ్రదేశంలో**ని ఆదోని, పెనుగొండ, ఉదయగిరి, కొండవీడు, వినుకొండ, పొదిలి, దేవరకొండ, కంభం, మార్కాపురం, **పోరుమామిళ్ళ**, మాచర్ల, మంగళగిరి, కొండపల్లి మొదలైన వానిని పేర్కొంటున్నది.

విదేశవాణిజ్యానికి రేవుపట్టణాలు కేంద్రాలు విజయనగరంలో 300 లకుపైగా ఓడరేవులున్నవని అబ్దుల్ రజాక్ వ్రాసినాడు. **వీనిలో** చాలవరకు పశ్చిమ తీరంలోనివి. ఆంధ్రప్రాంతంలో మైలపూర్, పులికాట్, మోటుపల్లి ముఖ్యమైన రేవులు. మైలపూర్ అప్పుడప్పుడే **వృద్ధిలోకి** వస్తున్నది. మోటుపల్లి కోసం కొండవీడు, విజయనగరాల మధ్య చాలాకాలం సంఘర్షణ జరిగింది. మోటుపల్లిని మొదట దేవరాయలాక్రమించి అచట ధర్మశాసనం వేయించినాడు. క్రీ.వ. 1416లో. కాని, క్రమంగా మోటు పల్లి ప్రాముఖ్యంక్షీణించిపులికాట్ అభివృద్ధిచెందింది. పలికాట్ రేవులో ముస్లిం, హిందూ వర్తకుల సంఖ్యాకంగా వాణిజ్యం సాగిస్తున్నారవి, రాజ్యం నలుమూలలనుండి బాటలుమీదగా రకరకాల వస్తువు లచటికి చేరుతాయని, ముఖ్యంగా పెగూ, టెనాసరిం, మలాకా, సుమత్రాదీవుల తోను, పశ్చిమాన మలబార్, గుజరాత్‌ల తోను పులికాట్ ఎక్కువగా వాణిజ్యం సాగిస్తున్నదని, తూర్పు దీవులకు ఎక్కువగా కలంకారీచీర లెగుమతి చేసి ధనం గణిస్తూన్నదనీ, వస్త్రాలుగాక రాగి, వజ్రవైడూర్యాలు, పాదరసం, పన్నీరు, ధాన్యం ఇచట వానిజ్యవస్తువులనీ బార్బోసా వ్రాసినాడు. విదేశీ వాణిజ్యం క్రమంగా అరబ్బులనుండి పోర్చుగీసుల వశమవుతోంది. విజయనగరాధీశులు పోర్చుగీసులతో స్నేహసంబంధాలేర్పరచుకొన్నారు. తూర్పు దేశాల్లో పోర్చుగీసుల ప్రాబల్యం విజయనగరంతో పెరిగి విజయనగరంతో బాటే కూలిందని ఒక చరిత్రకారుడు వ్రాసినందాట్లో సత్యం లేకపోలేదు. పదిహేడోశతాబ్దరాంభని డచ్చి, ఆంగ్ల కంపెనీల రాక పారంభమయింది. డచ్చి వారు పులికాట్‌లోను, ఆంగ్లేయులు మచలీపట్టణం, నిజాం పట్టణాలలోను స్థావరాలేర్పరచు కొన్నారు. పాశ్చాత్యజాతులమధ్య పోటీ ప్రారంభమయింది. దిగుమతులతో ముఖ్యమయినవి గుర్రాలు, బాహ్లిక, పారశీక, శక, ధట్టా, రట్ట ఘట్టాణములనే జాతుల గుర్రాలను సాహిత్యం పేర్కొంటున్నది. ఆమాటలను బట్టి అవి ఆయాదేశాలకు చెందిన గుర్రాలని భావించవచ్చు పచ్చకప్పురం, పట్టు బట్టలు, కస్తూరి, ముత్యాలు, మణులు పారశీక వనితలు కూడ దిగుమతుల్లో ముఖ్యమయినవి. ఎగుమతుల్లో కలంకా వస్త్రాలు రత్నకంబళ్లు, సుగంధద్రవ్యాలు, వజ్రాలు ప్రధానమయినవి.

వర్తకులు, పంచాణం, సాలె, మేదరమొదలై చేతి పనులవారు, ఉప్పుకొటార్ల వారు సంఘాలుగా నేర్పడి తమవృత్తులు సాగించినా వర్తక, హస్తకళాసంఘాల మధ్య పరస్పర సహకారం వుండేది. శాసనాల్లో 'అయ్యావళి చాలుమూల' వర్తక సంఘం ప్రసక్తి కన్పిస్తుంది. ప్రతిము వాణిజ్య కేంద్రంలోనూ ఈ సంఘశాఖ ఉండేది. "శెట్టి పట్టణశ్రేష్టి" ఈ సంఘానిఇ అధ్యక్షుడు. సంఘ **సమావేశాలు** సాధారనంగా ఆల మండపంలో జరిగేవి. ప్రతి సంఘానికి ఒకలాంచనం ఉండేది. సంభ్యులు, ప్రభుత్వానికి చెల్లించవసిన సుంకాలు కావలి గాని రుసు ఆలయాలకు, మఠాలకు చెల్లించవలసిన మినహాయింపులు మామూళ్లవసూలు చేసి చెల్లించేవి. స్థానిక పాలకు**లతో** కలసి ధర్మాసనాలే న్యాయ నిర్వహణలో తోడ్పడుతుండేవి.

ఆర్థిక కృషి ఇంతగా జరిగినా ప్రజానీకం సుఖంగా, ప్రశాంతంగా జరిగిందని చెప్పలేము. అందుకు ప్రధానకారణం విపరీతమైన పన్నుల భారం, రాజుకు, అమరనాయకునకు, అయగార్లకు, ఆలయాలకు చెల్లించవలసిన రకరకాల పన్నులతో మామూళ్ళతో రైతు పంటహరించపోయేది. తరచుగా జరిగిన బహమనీదండ యాత్రల్లో యుద్ధాల్లో పొలాల్లోని పంటకు నష్టం వాటిల్లేది; గ్రామాలు దోపిడులకు గురి అయ్యేవి. వీనికితోడు అజ్ఞానంతో మూఢవిశ్వాసాలతో జరిపేకొలువులు యాత్రలు, సంతర్పణలు, వివాహాది సాంఘిక కార్యక్రమాల్లోని ఆడంబరాలు సామాన్యులను ఆర్థికంగా కుంగదీస్తుండేవి. అందుచే రైతులకు అంబతేగతి అయ్యేది. ఇదే యుగంలో బహమనీరాజ్యంలో పర్యటించిన రష్యాయాత్రికుడు నికిటిన్ "పట్టణాల్లో ప్రభువులు ఐశ్వర్యంతో, విలాసాలతో తులతూగుతుండగా సామాన్య ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మునిగితేలుతున్నారు" అని వ్రాసినాడు. విజయనగర పరిస్థితులు అందుకు ఏమంత భిన్నములు కావు.

## 18.13 మతసాంఘిక పరిస్థితులు :

ఉల్లీ సుల్తానుల సామ్రాజ్య విస్తరణ నరికట్టి ఏర్పడిన విజయనగర రాజ్యానికి హిందూ మత సంస్కృతుల రక్షణ, పోషణ ఆశయాలుకావడం సహజం. విజయనగరాధీశులు "వేదమార్గప్రతిష్టాపనాచార్య" బిరుదం ధరించినారు. అయితే విజయనగర రాజ్యంలో హిందువుల్లోని భిన్న శాఖలేగాక జైనులు, తగినంత సంఖ్యలో ముస్లింలు, క్రైస్తవులు కూడ నున్నారు. తమ అభిమానమతం ఏమయనప్పటికీ విజయనగరాధీశులు మతాలన్నింటినీ సహనంతో చూచినారు. శ్రీరంగంలోని వైష్ణవులుజైనులను హింసిస్తుంటే బుక్క రాయలు కల్పించుకొని వారి మధ్య సమాధానం కుదిర్చినాడు. రాజధానిలో విరూపాక్షాలయం పక్కనే జైనుల ఆలయాలున్నాయి. దేవరాయలు జైనులకు, ముస్లిములకు కూడ ప్రార్ధనాసౌకర్యాలు కల్పించినాడు. కృష్ణదేవరాయలు విరూపాక్షునకు స్వర్ణ కిరీటాదికానుకలర్పించినాడు. శైవ, వైష్ణవ క్షేత్రాలు రెండూ దర్శించి, అచట గోపుర మండపాలు నిర్మించినాడు. వీరశైవుడైన శాంతలింగప్ప శ్రీశైల ప్రాంతంలోని జైనులను హింసించడం వినికృష్ణరాయలు పంపగా వెలుగోటి గని తిమ్మానాయడాతణ్ణి దండించినాడట. అళియ రామరాయలు రాజధానిలోని తురక వాడలోగోవధను కూడ సమ్మతించే దూరదృష్టిని ప్రదర్శించినాడు. భారతీయ ప్రభువులకు మత సహనం సాంప్రదాయకమే అయినా ముస్లిములతో నిరంతరం పోరాడుతున్నవి. జయనగరాధీశులు తమరాజ్యంలో మతపరమైన కలతలు లేకుండజూచి సర్వప్రజల సమాదరాన్ని చూరగొనడం రాజనీతి అనికూడ భావించివుంటారు.

కాకతీయ యుగంలో వేళ్లూనడానికి ప్రారంభించిన స్మార్త మతానికి విజయనగరారంభంలో రాజాస్థానంలోపోషణ లభించింది. సంగమ వంశీయులు కాలముఖశైవులని చెప్పవచ్చు. వారికుల దైవం విరూపాక్షుడు; కులగురువు క్రియాశక్తి ఆచార్యులు. గంగాదేవి "అసాధారణ సార్వజ్ఞం విలసత్సర్వ మంఘలమ్‌క్రియాశక్తి గురుంవన్డేత్రిలోచన వివారమ్" అంటూ కీర్తించింది. కానీ నాటికి అతివాదశైవం వెనుకాడి స్మార్త గురుపీఠమైన శృంగేరి పాబల్యం వహించసాగింది. అందుచేతనే హరిహరుడు సోదరులతో సహాశృంగేరి దర్శించి మఠాధిపతియైన విద్యాతీర్థులకు దాన ధర్మాలు చేసి ఆశీస్సులు పొందినాడు. రాజధానిలో విరూపాక్షాలయం కేంద్రంగాస్మార్త మతశాఖ ఏర్పడింది. వైదిక విద్యలోకూలంకష పాండిత్యం ఉన్న మాధవాచార్యులు బుక్కరాయల మంత్రి. మావాచార్యులు, అతని తమ్ముడు శాయణాచార్యులు వేదాలకు, స్మృతులకు భాష్యాలు వ్రాసినారు. బుక్కరాయలి చివరిరోజుల్లో స్మార్త పీఠాధి పతి అయిన విద్యారణ్యులు ప్రాబల్యం వహించినాడు. కేవలం శంకరాచార్యులు అద్వైత వేదాంత విధానమే గాక మాధవాచార్యులు కర్మ మీమాంసాపద్ధతినిపునరుద్ధరించడానికి ప్రయత్నించినాడు. అతడు "మహాక్రతూనాం అహర్త", ప్రతి వసంతసోమయాజి" విధానాన్ని వివరిస్తూ "జైమినీయన్యాయమాలా విస్తర", "యజ్ఞతంత్రసుధానిధి" అనేగ్రంథాలు రచించినాడు. ఈ యుగ ప్రముఖ అద్వేత ప్రవర్తకులలో అప్పయ్య దీక్షితులు చివరివాడు, క్రీ.శ. 1520-93, బహుగ్రంథకర్త. రండోవెంటకటతిరాయల ఆస్థానంలోనివాడు. అయితే, నాటి ప్రధానసమస్య రాజకీయంగానేకాక మతసాంస్కృతిక పరంగా కూడా ఇస్లాం వ్యాప్తినరికట్టడం. అదే ఆశయంతో ఉత్తర భారతంలో సంస్కరణాత్మకమైన భక్తి ఉద్యమం సాగింది. ఆ ఉద్యమానికీ, మాధవాచార్య, విద్యారణ్యులద్వారా విజయనగరం ప్రోత్సహించిన వైదిక ధర్మపునరుద్ధరణోద్యమానికి పొంతనలేదు. సంస్కృతంలో సంతరించిన వేదభాష్యాలద్వారా ప్రజానీకంలో హిందూ మత సందేశంలో విశ్వాసం బలపరిచి ఇస్లాంసవాబు నెదుర్కొనగల శక్తి స్థైర్యాలను వారికేమాత్రం ఈ ఉద్యమం ఇవ్వగలిగిందో అనుమానం ందుచేత విజయనగరాస్థానంలో సాగిన మతోద్యమ సామాజిక ప్రయోజనం అత్యల్పమేనని చెప్పవచ్చు.

విజయనగర యుగంలో వైష్ణం రాజాదరణతో ఎక్కువగా ప్రచారమయింది. ద్వైత, విశిష్టాద్వైత పరంగా వైష్ణవంలో రెండు ప్రధానశాకలున్నాయి. ద్వైతమతస్థాపకుడు మధ్వాచార్యులు (క్రీ.శ. 1193 - 1227) ఆంధ్రదేశ పర్యటనలో మధ్వాచార్యులు **గోదావరి**

తీరంలో శ్యామశాస్త్రి, శోభన భట్టులను శిష్యులుగా స్వీకరించినాడని వారేనదహరతీర్థ, పద్మనాభ తీర్థులని ఒక గాధవుంది. మధ్వాచార్యులు అనంతరం పద్మనాభతీర్థులు ద్వైతగురుపీఠం అలంకరించినాడు. నరహరితీర్థులు శ్రీకూర్మం కేంద్రంగా ఆంధ్రకళింగ ప్రాంతాల్లో మాధ్వమతం ప్రచారం చేసినాడు. వైష్ణవసంప్రదాయ గ్రంథాల నుండి అక్షోభ్యతీర్థులక, విద్యారణ్యులకు వాగ్వాదంజరిగినట్టు తెలుస్తుంది. ఏమైనా విజయనగరంలో ప్రసిద్ధి ద్వైతాచార్యులు వ్యాసతీర్థులు. సాళువ నరసింహుని కాతడు గురువు. అతనికోరికపై వ్యాసతీర్థులు తిరుపతిలో అర్చకత్వం నిర్వహించి, అతడు విజయనగరసింహాసనం ఆక్రమించిన తరువాత చంద్రగిరినుండి విజయనగరం చేరినారు. వ్యాసతీర్థులు గొప్ప విద్యావంసుడు. కృష్ణరాయలకాతని పట్ల అపారమైన అభిమానం. రాయల పట్ల తీర్థుల కెనలేని వాత్సల్యం. ఇతంటి రాజాదరణ లభించినప్పటికీ సనాతన సంప్రదాయ ప్రియతత్వం వల్ల మాధ్వ మతం కూడా జనాదరణ పొందక బ్రాహ్మణుల్లో అత్యల్ప వర్గానికి మాత్రమే పరిమిత మయింది. అరవీటి వంశంలో ఇంచుమించు అందరూ వైష్ణవులే. శ్రీరంగరాయల గురువు తిరుమలతాతాచార్యులు, రెండోవెంకటపతి కాలం నుండి శాసనాల్లో శ్రీ విరూపాక్షునికి బదులు శ్రీ వెంకటేశ్వరుడు ప్రత్యక్షమయినాడు. అతని నాణెముల మీద కూడా శ్రీవెంకటేశ్వరాయ నమః అనే లేఖనం కన్పిస్తుంది. వెంకటపతి ఆస్థానంలో తాతాచార్యలకు తోడుతిరుమల శ్రీనివాసాచార్య, క ందాళ అప్పలాచార్య, తాళ్ళపాకతిరుమలచార్యా అనేవైష్ణవ విద్వాంసులుండేవారు.

ఆలయము, మఠము మత విద్యలకు సంప్రదాయాలకు పట్టుగొమ్మలుగానిలిచాయి. ఆలయనిర్మాణంవిరివిగా సాగింది. పాత ఆలయాలకు కొత్తగా గోపురమండ పాదులను కల్పించినారు. తిరుపతి, శ్రీశైలం, అహోబిలం, కాళహస్తి ఆలయాలు ప్రసిద్ధములు. ముఖ్యంగా వైష్ణవ క్షేత్రాలైన తిరుపతి, అహోబిలాలను తుళువ, అరవీటిరాజులెక్కువ ఆదరించి పోషించినారు. అనేక ఉత్సవాలు, తిరునాళ్లు జరిపి ఆలయాలు ప్రజలు ఆకర్షించేవి. ప్రజల ఆర్థిక సాంస్కృతిక జీవితంలో ఆలయ నిర్వహించిన పాత్రనుపై అధ్యాయాల్లో చదివినాము. సాధారణంగా మతాలు, ఆలయాలకు అనుబంధంగా వుండేవి. పుష్పగిరి (కడపాజిల్లా)లో శృంగేరి స్మార్తమఠశాకవెలసింది. శ్రీశైలంలో భిక్షావృత్తి మొదలైన వీరశైవ మఠాలుండేవి. తిరుపతి, అహోబిలాలలో వైష్ణవ మఠాలు ప్రసిద్ధములు. ముఖ్యంగా వైష్ణవ గురువులు దేశసంచారం చేస్తూ మత ప్రచరాం జరిపేవారు.

ప్రజలలో త సంబంధమైన మూఢ విశ్వాసాలు ఆచారాలు ఎక్కువగా ఉండేవి. ఒకే దేవుడు తమకోర్కెలన్నింటినీ తీర్చలేడేమో అనే భయమో లేక ఒక దేవుని ఆరాధిస్తె ఇతరులకు ఆగ్రహం వస్తుందనే భయమోగాని బహుదేవతారాధన ఎక్కువయింది. స్మార్తులు ఐదురుగ దేవతలతోటి "పంచాయతన" ఆరాధన చాలా కాలం గాచేస్తున్నారు. ఆదేవతలకు కుమారస్వామిని చేర్చి 'షణ్మతాలను' రూపొందించడమే గాక అద్వైత బోధకుడైన శంకరాచార్యుని 'షన్మతస్థాకుడు' డనికీర్తించసాగినారు. మాధ్వమతం వల్ల హనుమతండునిపూజక ఆదరణ హెచ్చింది మధ్వాచార్యులు హనుతుని అవతారమని మాధ్వుల విశ్వాసం. మహారాష్ట్రనుండి విఠోబా ఆరాధన ప్రవేశించింది. కృష్ణరాయలు విఠోభాభక్తుడు గ్రామ దేవతల సంగతి వేరేచెప్పనక్కరలేదు. సాగు మానం (సహగమనం) చేసిన వారు దేవతలైపూజలందుకొనేవారు. శకునాలలో దయ్యాల భూతాలలో నమ్మకం విపరీతంగా ఉండేది. గ్రామదేవతలకొలువుల్లోనునవరాత్రులలోను జంతు బలులు జరిగేవి. విజయనగరం నవరాత్రులలో ప్రతిరోజు 24 దున్నలు, 150 మేకలు, చివరిరోజున 250 దున్నలు, 400 మేకలు బలి ఇస్తారని పేస్ వ్రాసినాడు జను రకరకాల మొక్కులు మొక్కివానిని జాతర్లలో తీర్చేవారు. వానిలో సిడిమెక్కి ఆడడం, వీపుకండలివ్వటం, అరటి ఆకు చినగకుండ నడవడ నిప్పులపై నడవడం, నిప్పుగుండంలో ప్రవేశించడం, నోటితాళాలివ్వం వంటి వికృతములైన క్రూర ఆచారాలుండేవి రాజధానిలో శివరాత్రినా సిడమెక్కే వారనీ రథోత్సవంలో రథానికి ఉన్న ఇనుపగాలాలకు వీపుచర్మం గుచ్చి వేలాడతారనీ నికోలో కాంటి వర్ణించినాడు.

సనాతన ధర్మపునరుద్ధరణ ఆశయమైన విజయనరంలో వర్ణవ్యవస్థ బలపడే అవకాశం ఎక్కువగావుంది. ఆదిమవర్ణ ధర్మాలు చ వరకు నశించినప్పటికీ, వర్ణవ్యత్యాసాలు తత్ఫలితంగా వైషమ్యాలు పెరిగినాయి. బ్రాహ్మణుల్లో పూజారులు, మఠాధిపతులు, భూస్వాము ఉద్యోగులు, వర్తకులు, భోక్తలు అనేవర్ణాలున్నట్లు బార్బోసా, పేస్‌వంటి పాశ్చాత్యయాత్రికులు వ్రాసినారు. కృష్ణరాయలు కాలం వ బ్రాహ్మణులులెక్కువ సంఖ్యలో మంత్రులుగా, దండనాయకులుగా విజయనగరానికి సేవచేసినారు. కాని క్రమంగా బ్రాహ్మణులువ్యవసా వృత్తి నవలంభించసాగినారు. దేశీయ వాణిజ్యంచాలా వరకు వైశ్యులు నిర్వహించినారు. వీరిలో నీతినియమలు మృగ్యమైనాయి వీరి రిత్తి గురించి వీరు చేసే మోసాను గురించినాటి కావ్యాల్లోను, చాటువుల్లోను, చాలాసమాచారం లభిస్తుంది. కృష్ణ రాయల అనంతరం కమ్మ - రావెళ్ళ, పెమ్మసాని మొదలైన కుటుంబాలవారు, సేనానులుగా, సామంతులుగా ప్రాజల్వం వహించసాగినారు.

సమాజవ్యాప్తంగా అనేకదురాచారాలు ప్రబలినాయి. ప్రభు, ధనికవర్గాలలో శృంగార ప్రియత్వంభోగలాలసత్వం ఎక్కువ, బహుభార్యత్వం, సర్వసాధారణమయింది. వివాహాలు ఆడబరంగానే జరిగేవి. కన్యాశుల్కం, వరశుల్కం విపరీతంగా వుండేవి. ఆడపిల్లపెండ్లిని భారంగా తల్లిదండ్రులు పరిగనించేవారు. కొన్ని సందర్భాలలో భూములమ్మి పెండ్లి చేయవలసి వచ్చేది. వేశ్యాలంపటత్వాన్ని గురించి వేరేచెప్పనక్కర్లేదు. ఉంపుడుకత్తె హోదాకు చిహ్నం కాసాగింది. ముఖ్యంగా రాజవేశ్యలకు ప్రత్యేక గౌరవం ఉన్నట్లు పాశ్చాత్య బాటసారులు కూడగుర్తించినారు. సతీసహగమనం అక్కడక్కడ కనిపిస్తుంది. రాయల అంతఃపురంలోని స్త్రీలలో కొన్నివందల మంది అతనితో సహగమం చేయడానికి సిద్ధం అనికాంటే వ్రాసినాడు. మధ్య పానం ఎక్కువయింది. దానికి ధూమపానంతోడయింది. అన్నితరగతులలోను రకరకాల జూదం సర్వసామాన్యమై అనేక బాధలకు కారణమయింది. వేషాదారనలో తురుష్కపాశ్చాత్య సంప్రదాయాలు ప్రవేశించినాయి.

## 18.14 సారాంశము :

నాయక రాజులు ఇంచుమించు స్వతంత్రంగా పరిపాలన జరిపారు. వారి పాలన న్యాయ, సైనిక ఆర్థిక రంగాలలో విశేష అభివృద్ధి సాధించింది. ప్రజలు పన్నుల భారంతో ఇబ్బందులు పడ్డారు. పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. వాణిజ్యం అభివృద్ధి చెందింది. అనేక మతాలు ఆదరించబడ్డాయి.

డా॥ కంరున్నిసాబేగం

పాఠం : 19

# దక్కన్‌లో మొఘల్ ప్రతినిధుల పాలన

## 19.0 లక్ష్యం :

దక్కన్‌లో మొఘల్ ప్రతినిధియైన నిజాముల్‌ముల్క్ గురించి తెలియపరచటమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :

19.1 పరిచయం

19.2 అసఫ్‌జా నిజాముల్ ముల్క్

19.3 సారాంశము

## 19.1 పరిచయం

ఔరంగజేబు మరణానంతరము మొగలు సామ్రాజ్యక్షీణత ప్రారంభమయ్యెను. అతని వారసులు బలహీనతను అవకాశముగా తీసుకొని రాష్ట్రపాలకులు కొందరు స్వతంత్ర్యరాజ్యములను ఏర్పాటుచేసుకొనిరి. వారిలో దక్కన్ సుబేదారైన నిజామ్ ఉల్-ముల్క్ ఒకడు. అతనికి ఆసఫ్ జా అను బిరుదు గలదు, దానిని బట్టి అతని వంశమునకు "ఆసఫ్‌జాహీ" వంశముపేరు కలిగినది. ఆసఫ్ జాహీవంశీయులు రెండుంబావుశతాబ్దముల కాలము దక్కన్‌ను పాలించిరి. రాజ్యారంభమునుండి 18వ శ॥వరకు ఆంధ్రదేశము వారి రాజ్యములో నొకభాగముగా నుండెను.

## 19.2 అసఫ్‌జా నిజామ్ ముల్ ముల్క్ 1724-1748:

మొగలుల చరిత్రలోనేగాక భారతీయ రాజకీయరంగంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన వారిలో నిజాముల్ ముల్క్ ఒకరు. నాదిర్షా
దండయాత్రల వలన కూకటి వ్రేళ్ళతో కదలిపోయిన మొగలు సామ్రాజ్య వృక్షమును మరికొంతకాలము నిలవయుండ్లునట్లు చేసిన ఘనత
ఈయనదేయని చెప్పుట అతిశయోక్తికాదు. అతడు గొప్పరాజ నీతిజ్ఞుడు, విజేతయేగాక పరిపాలనాదక్షుడు కూడా. నిరాడంబరుడైన ఆసఫ్‌జా
ప్రజాక్షేమమునకు, రాజ్యక్షేమమునకు ఆవిరళ కృషిచేసినాడు.

### పూర్వవృత్తాంతము :

ఆసఫ్‌జానిజాముల్ ముల్క్ అసలు పేరు మీర్‌కంరుద్దీన్‌ఖాన్. అతనికి చిన్ ఖలిచ్‌ఖాన్ అను నామాంతరము కలదు. చిన్‌ఖిలిన్ ఖాన్
1671లో జన్మించినాడు. అతని పూర్వీకులు టర్కీ స్థానపు నివాసులు. మహమ్మద్ ప్రవక్తముఖ్యశిష్యులలో నొకడగు అబూఒకల్ వంశమునకు
చెందినవారు. ఆసఫ్‌జా మాతామహుడు, పితామహుడు మొగలు చక్రవర్తులైన షాజహాన్, ఔరంగజేబు కొలువులోనుండి విశిష్టమైన సేవచేసినారు
చిన్‌ఖలిచ్ ఖాన్ 19వ॥ సంవత్సరముల ప్రాయము వచ్చు సరికి విద్యావివేకసంపన్నుడుగా, రాజనీతికుశలునిగా రూపొందెను. అతడు పార్శీభాష
పండితుడు, కవి అరబ్బీ, తురుష్క భాషలలో అతనికి పరిచయముకలదు.

**రాజ్యపాలనానుభవము :**

క్రీ.శ. 1690లో ఔరంగజేబు మీర్ కంరుద్దీన్‌ను 4000 సేనకు మన్సబ్‌ధారునిగా, సర్కారుపాలకునిగా నియమించబడినాడు. సర్కారుపాలనకునిగా అతడు ప్రదర్శించిన శక్తిసామర్థ్యములను సంతసించిన ఔరంగజేబు అతనిని 5000సేనకు మన్సబ్ దారునిగా నియమించుటయేగాక కర్ణాటక ఫౌజుదారుగా చేసి "చిన్‌ఖిలచ్‌ఖాన్" అనుబిరుదును ప్రధానముచేసెను. ఔరంగజేబు వారసుడైన బహదూర్‌షాకాలములో అయోధ్యరాష్ట్ర సుబేదారుగా నియమింపబడినాడు. అటుపిమ్మట ఫరూక్‌సియార్ కాలములో 7000సేనకు మన్సబ్‌దారుగా, దక్కన్ సుబేదారుగా నియమింపబడుటయేగాక "ఫతేజంగ్, నిజాముల్‌ముల్క్" అనుబిరుదులుగా గూడా పొందెను. మహమ్మద్‌షా కాలములో (1719-1748) ప్రధాన మంత్రిగా నియమితుడయ్యెను.

**మొగలు సామ్రాజ్య ప్రధానిగా :**

మొగలు సామ్రాజ్యప్రధానిగా నిజాముల్ ముల్క్ చేసిన సూచనలేవనగా 1) ప్రభుత్వభూములను ఇజారాపై ఇచ్చు పద్ధతిని రద్దుచేయుట 2) పేష్కష్‌లను రద్దుచేయుట. 3) జిజియాపన్నును పునరుద్ధరించుట 4) ఆఫ్ఘన్‌లకు వ్యతిరేకంగా ఇరాన్‌కు సాయపడుట. కానీ ఈసూచనలను అమలు జరుగునట్లు చూచుటకు నాటి పరిస్థితులు అనుకూలముగా లేకుండెను. రాష్ట్రపాలకులు స్వతంత్రులగు చుండిరి. మొగలు సామ్రాజ్యము క్షీణంపచొచ్చెను. ఈవాతావరణంలో మొగలు సామ్రాజ్యములకు తానెట్టి సేవను చేయజాలనని గ్రహించిన నిజాముల్‌ముల్క్ దక్కను సుభాకు వెళ్ళిపోయెను.

**దక్కను సుబేదారుగా :**

ఫరూక్‌సియార్ కాలమున దక్కనులోసుబేదారునిగా నియమింపబడిన నిజాముల్ ముల్క్ మొగలుసామ్రాజ్యములో విజృంభించిన అరాచక పరిస్థితులవలన 1724 నుండి (మహమ్మద్ షాకాలము) స్వతంత్రుడుగా వ్యవహరించెను. కాని పేరుకు మాత్రము మొగలు సామంతునిగా నుండెను. ధక్కనులోనెల కొనియున్న పరిస్థితుల దృష్ట్యా తనకు స్వతంత్ర ప్రతిపత్తి అవసరమని నిజాముల్‌ముల్క్ చేసిన విజ్ఞప్తికి మొగలు చక్రవర్తి అంగీకరించి, అతనికి 'ఆసఫ్‌జా' అనుబిరుదును 8000 మన్సబ్‌దారీని ఇచ్చెను.

**మున్‌గిషిన్ గాంప్ సంధి 1728 :**

ఆసఫ్ జానిజాముల్ ముల్క్ దక్కనులో స్వతంత్ర రాజ్యమునెలకొల్పిన పిమ్మట మహారాష్ట్రుల అధికార విస్తరణను అరికట్టుటకు ...లానుకొనెను. అంతఃకలహములు సృష్టించి స్వకార్యమును నెరవేర్చుకొనుటకు ప్రయత్నించెను. కొల్హాపూర్ పాలకుడగు రెండవ శాంభాజీతో ...కులు కలిపి ఛత్రపతి సాహుకు చేత్, సర్దేశ్‌ముఖిపన్నులు చెల్లించుటకు (1714 సంధి ప్రకారము) నిరాకరించెను. కాని పీష్వాబాజీరావు ...గాంను పాల్ఖేట్ యుద్ధమున పరాజితుని చేసి మున్ గిషిన్ గాంప్ సంధికి (1728) అంగీకరింపజేసెను. దీని ప్రకారమునిజామ్ చేత్, ...ద్దేశ్‌ముఖి పన్నులను చెల్లించుటకు కంగీకరించిన హామీగా కొన్ని దుర్గములను పీష్వాఆధీనముచేసెను.

**...ర్నాసంధి క్రీ.శ. 1731 :**

పూర్వపువైరమును మరువని నిజాముల్ ముల్క్ మహారాష్ట్రసేనాపతి త్రియంబక్ రావుని పీష్వాపైకి ఉసికొల్పెను. త్రియంబక్ ...ద్ధములోని హతుడగుటవలన ఆ ప్రయత్నము గూడా విఫలమయ్యెను. అంతనిజాం పీష్వాతో వార్నాసంధిచేసుకొనెను. దాని ప్రకారము ...ణమున నిజాముల్ ముల్క్ ఉత్తర హిందూస్థానమున మహారాష్ట్రులకు తమతమప్రాబల్యములు నెలకొల్పుటకు అంగీకారముకుదిరెను.

**...పాల్ యుద్ధము క్రీ.శ. 1738 :**

మహారాష్ట్రులకు బద్ధవిరోధియైన నిజాముల్ ముల్క్ వారిని పరాభవించు అవకాశమునకై ఎదురుచూచుచుండెను. 1737 సం॥నాటికి ...హారాష్ట్రులు ఢిల్లీ సమీపము వరకు తమ అధికారమును వ్యాపింపజేసిరి. ఆపరిస్థితులను చూసి ఆందోళనచెందిన మొగలు చక్రవర్తి

మహమ్మద్‌షా తన నమ్మిన బంటైన నిజాముల్ ముల్క్‌ను ఢిల్లీ రావించిమహారాష్ట్రులను శిక్షింపవలసిందని ఆదేశించెను. అపుడు 1738 జనవరి నెలలో మహారాష్ట్రులకు నిజాముల్ ముల్క్‌కు భోపాల్ వద్ద జరిగిన యుద్ధములో నిజాం పూర్తిగా ఓడిపోయి సంధికంగీకరించెను. దురారీ సరాయివద్ద జరిగిన సంధి (జనవరి 7,1738) ప్రకారము; 1) మళ్వారాష్ట్రమును 2) చంబల్, నర్మదానదుల మధ్యదేశమును, యుద్ధనష్టపరిహారము 50 లక్షలరూపాయలను మారాష్ట్రుల కిప్పించుటకు నిజాం అంగీకరించెను.

**నాదిర్షా దండయాత్ర క్రీ.శ. 1738 :**

క్రీ.శ. 1738లో మొగలు సామ్రాజ్యముపై నాదిర్షాదండయాత్ర జరిగెను. నాదిర్షాతన నెదిరించిన మహమ్మద్‌షా, నిజాముల నోడించి ఢిల్లీ చేరుకొనెను, ఆ సందర్భమున నాదిర్షా ఆగ్రహమునకు గురియైన ఢిల్లీ పౌరులను నిజాముల్ ముల్క్‌కాపాడెను.

**నాసర్‌జంగ్ తిరుగుబాటు క్రీ.శ. 1740 :**

నిజాముల్‌ముల్క్ ఢిల్లీలో నున్నపుడు అతని ప్రతినిధి దక్కనులో నున్ననాసర్‌జంగ్ (అతనికుమారుడు) తిరుగుబాటు చేసెను నిజాంతిరుగుబాటును అణచివేసి కుమారుని క్షమించెను.

**యూరోపియన్‌లతో మైత్రి :**

గోల్కొండ సుల్తానులకాలము నుండియు తీర్పుతీరమున వ్యాపారకేంద్రములు నెలకొల్పిన ఆంగ్లేయులతోను, ఫ్రెంచి వారితోను స్నేహసంబంధములు నెలకొల్పినారు. మహారాష్ట్రులదాడులనుండి తనరాజ్యమును కాపాడుకొనుటకు వారిసహాయమవసరమని అతడు గ్రహించెను. అందుచేత వారి వివాదములలో తలదూర్చక తటస్థముగానుండెను.

నిజాం తన రాజ్యములోని ఉత్తర భాగములను మహారాష్ట్రులదండయాత్రనుండి రక్షించుకొనుటకు కట్టుదిట్టములుచేసి, కర్ణాటక ప్రాంతములో పర్యటించిశత్రువులనుండి దానిని సురక్షితము కావించెను. 1743లో మహారాష్ట్రులనుండి తిరుచునాపల్లి కోటను వశపరచుకొనెను తదుపరి 1746 బాలకొండదుర్గము నాక్రమించెను.

**రాజ్యవిస్తీర్ణము :**

ఆసఫ్‌జానిజామ్ల్ ముల్క్‌తన రాజ్యము ఉత్తరమున తపతీనది నుండి దక్షిణమున తిరుచునాపల్లివరకు, పశ్చిమమున హైదరాబాద్ నుండి తూర్పున బంగాళాఖాతమువరకు విస్తరించెను.

**మరణము :**

ఆఫ్ఘనిస్థాన్ పాలకుడగు అహమ్మద్ షా అబ్దాలి భారతదేశముపై దండయాత్ర చేయుచున్నాడను వదంతులువ్యాపించగా, అహ్మద్ షా ఆహ్వానమును పురస్కరించుకొని ఢిల్లీ వెళ్ళుచూ మార్గమధ్యమున బుర్హాన్ పూర్ వద్ద మే 22, 1748తేదీన 79వ ఏట తనువు చాలించెను.

**ఘనత :**

నిజాముల్ ముల్క్ విజేత రాజనీతిజ్ఞుడు, పరిపాలనాదక్షుడు, మహారాష్ట్రులతో మైత్రి, అపరాదుల యెడల మెలకువతో నుండుట, దేశాటనద్వారా ప్రజల కష్టసుఖముల నెరయుట, ప్రజాక్షేమమును పెంపొందించుట మున్నగు అంశములతో కూడియున్న అతని మరనశాసనమే అందుకు నిదర్శనము. ఆసఫ్ జా కవి పోషకుడు. పదిలక్షల జనాభాతో వర్ధిల్లు అతని రాజధాని ఔరంగబాదు కవి పండితులకు నిలయమై యుండెను. నిజాముల్ ముల్క్ నిరాడంబరుడు. దర్బారునకు పోవునపుడు తప్ప అతనెప్పుడు విలువైన ఆభరణములను దరించెడివాడుకాదు. అతడు వితరణశీలి. పేదసాదలకు, ఫకీరులకు, మతగురువులకు, కవిపండితులకు ధనధాన్యములను విరివిగా ఇచ్చెడివాడు. "భారతదేశములో 18వ ॥శతాబ్దప్రథమార్ధ భాగమున తన రాజకీయ లక్ష్యాలను సఫలీకృతము చేసుకొన్నరాజనీతిజ్ఞుడు ఇతడొక్కడే. ఇతడు జన్మతః

నాయకలక్షణాలను కలిగినవాడు. గొప్పయోధుడు, పరిపాలనాదక్షుడు. అని డా॥యూసఫ్ హుస్సేన్ ఖాన్ నిజాముల్‌ముల్క్‌ను గూర్చి ప్రశంసాపూర్వకముగా వ్రాసెను.

"He is the only statesman in the early 18th century in India whose political aims have been completely fulfilled....a born leader of men, a great soldier, a capable administrator"... Dr. Yusuf Hussain Khan.

## 19.3 సారాంశము :

ఔరంగజేబు మరణం తర్వాత మొఘల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైపోయింది. సామ్రాజ్యం అనేక స్వతంత్ర రాష్ట్రాలుగా విభజింపబడింది. ఈ స్వతంత్ర రాష్ట్రాలకు పాలకులైన వారిలో దక్కన్ సుబేదార్ నిజాముల్ ముల్క్ ఒకరు. ఈయనకు ఆసఫ్‌జా అనే బిరుదు ఉండటంతో ఆ బిరుదు పేరు మీదుగా ఆసఫ్‌జా రాజవంశం స్థాపించబడింది.

డా॥ కంరున్నిసాబేగం

పాఠం : 20

# ఐరోపా వారి వాణిజ్య కేంద్రాలు

## 20.0 లక్ష్యం :

— పదిహేనవ శతాబ్దం నుండి భారతదేశమునకు చేరిన పోర్చుగీసు, డచ్, ఆంగ్లేయుల వంటి వారి గురించి తెలియపరచడం ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం :

| | |
|---|---|
| 20.1 | పరిచయం |
| 20.2 | పోర్చుగీసు |
| 20.3 | డచ్ |
| 20.3.1 | ఆంధ్రదేశమువందలి డచ్ స్థావరములు |
| 20.4 | ఆంగ్లేయులు |
| 20.4.1 | ఆంధ్రదేశములో ఆంగ్లేయుల స్థావరములు |
| 20.4.2 | ఆంగ్లేయుల ఇతర స్థావరములు |
| 20.5 | ఫ్రెంచి వారు |
| 20.5.1 | ఆంధ్ర ప్రాంతంలో ఫ్రెంచి స్థావరాలు |
| 20.6 | సారాంశము |

## 20.1 పరిచయం

క్రీ.శ. 1453లో కాన్‌స్టాంట్‌నోపిల్ తురుష్కుల హస్తగతమగుటచే యూరోపియన్‌లకు ప్రాగ్దేశములతో వాణిజ్యముచేయుటకు క్రొత్త మార్గములు కనుగొనవలసిన ఆవశ్యకత ఏర్పడినది. భౌగోళికాన్వేషణలు వారి ప్రయత్నములను సులభతరముచేసెను. ఆ ప్రయత్నములలో ప్రప్రథమంగా భారతదేశమునకు నూతన జలమార్గములను కనుగొన్న ఘనతపోర్చుగీసువారికి దక్కెను.

## 20.2 పోర్చుగీసువారు :

పోర్చుగీసు నావికుడు వాస్కోడగామా క్రీ.శ. 1498 మే 27 తారీఖున కళ్ళికోటచేరెను. స్థానిక ప్రభవగు జామొరిన్ అతని నాదరించి ఆశ్రయమిచ్చెను. అతని కాలంలోనే పోర్చుగీసువారు కళ్ళికోట, కొచ్చిన్, కన్ననూరుల వద్ద తమ స్థావరములను ఏర్పాటుచేసికొనిరి. వారు

ఐరోపా, ఆసియాలవ్యాపారము తురుష్కుల ఆధీనములో నున్న భూమార్గమునుండితమ ఆధీనములో నున్న జమార్గమునకు మరల్చుటకు తీవ్రప్రయత్నములు చేసిరి. క్రీ.శ. 1500-1509 సంవత్సరముల మధ్య వారు హిందూ సముద్రాధిపత్యమును సాధించిరి. కొచ్చిన్‌లోని పోర్చుగీసు వారి గవర్నరయిన ఆల్మీడా "సముద్రాధిపత్య విధానము (ఔజితిలి గిలిశిలిజీ చీలిజిరిలిగి) ననుసరించి విజేయుడయ్యెను అతని వారసుడైన ఆల్బుకర్క్ భూసంపాదనకు ప్రయత్నించి 1510లో గోవాను, 1511లో మలక్కాను సంపాదించెను. విజయనగరపాలకుడైన కృష్ణదేవరాయలు పోర్చుగీసువారితో స్నేహసంబంధములు నెలకొల్పెను. క్రమక్రమముగా వారుడయ్యు, డామన్, సాల్‌సెట్టి, బేసిన్‌లను సంపాదించిరి. తూర్పు తీరమున మద్రాసు దగ్గర శాన్‌థోమ్‌లోనూ బెంగాల్‌లో హుగ్లీ దగ్గర స్థావరములను నెలకొల్పుకొనిరి. ఇండియాలోనే గాక మెజాంబిక్, ఆర్మజ్, మస్కట్, మలాకా, సింహళ ప్రాంతాలలోకూడ వారి ఆధిపత్యము విస్తరించెను. కాని తరువాత వచ్చిన ఐరోపా వ్యాపారుల పోటికి తట్టుకొనలేక క్రమముగా వారి ప్రాంతములనుండి వైదొలగవలసివచ్చెను. క్రీ.శ. 1670 నాటికి వారు స్థావరమొకటి ఆంధ్రతీరప్రాంతములో మచిలీ పట్టణమునకు కూడా నెలకొల్పబడెను.

## 20.3 డచ్‌వారు :

వీరు హాలెండ్ వాసీయులు. వీరు సాహసకులైన నావికులు. డచ్‌వారు 1602లో సంయుక్తతూర్పు ఇండియావర్తక సంఘాన్ని స్థాపించి తూర్పు ఇండియా దీవులతోను, ఇండియాతోను వ్యాపారము ప్రారంభించి, పోర్చుగీసు వారి ప్రాబల్యమును తుదముట్టించిరి. వీరు పోర్చుగీసు వారి నుండి తూర్పు దీవులను వశపచుకొనిరి. భారతదేశములోని గుజరాత్ బట్టలు, ఆంధ్రదేశపు కలంకారీ వస్త్రములకు తూర్పుఇండియా దీవులలో ఎక్కువ గిరాకీ ఉండెను. ఈ వాణిజ్యంలో వచ్చిన లాభముతో తమ దేశానికి అవసరమైన సుగంధ ద్రవ్యములు కొనవచ్చునెడి ఉద్దేశముతో డచ్‌వారు ఇండియాలో గూడ వర్తక స్థావరములను సంపాదించిరి. మలబార్ తీరములోనికి క్విలన్, క్రాంగనూరు, కొచ్చిన్‌ల వద్ద బెంగాల్‌లోని చిన్సూరా, బీహార్‌లోని పాట్నా, మద్రాస్ సమీపమున నాగపట్టణములవద్ద, ఆంధ్ర తీరములోని మచలీపట్టణము, నర్సాపురం, భీమునిపట్నం, యానమ్, పులికాట్‌ల వద్ద వారి స్థావరములు నెలకొల్పబడెను.

### 20.3.1 ఆంధ్రదేశమునందలి డచ్‌వారి స్థావరములు :

గోల్కొండ సుల్తాన్ ఉద్యోగులకు డచ్‌వారి సంయుక్త తూర్పు ఇండియా సంఘానికి మధ్య కుదిరిన ఒప్పందము ప్రకారము డచ్‌వారు క్రీ.శ. 16.6లో మచలీ పట్టణము, నిజాంపట్టణంలవద్దను, క్రీ.శ. 1610లో పులికాట్ వద్దను తదుపరి నర్సాపూరము, భీమునిపట్నముల వద్దను తమవ్యాపారకేంద్రములను ఏర్పరచుకొనిరి. భారతదేశములోని వారి స్థావరము లన్నింటికీ క్రీ.శ. 1689 వరకు పులికాట్ కేంద్రముగానుండెను. ఈ రేవులలో డచ్‌వారికి కొన్ని ప్రత్యేక సౌకర్యములు కల్పింపబడెను. ఆంగ్లేయుల వలెవస్తువుల వారీగా కాక డచ్‌వారు ఏకమొత్తంగా వర్తకసుంకములు చెల్లించే సౌకర్యమును పొందిరి. నాణెములను ముద్రించు హక్కుకూడా డచ్‌వారి కీయబడెను. నూలు, నీలిమందు, ముతకదుస్తులు, సిల్కు, పింగాణీ సామగ్రి, సీసము మున్నగునవి వారి వ్యాపారవస్తువులు, క్రీ.శ. 1623 (మహమ్మద్ కుతుబ్‌షా కాలము) వరకు డచ్‌వారు వజ్రవుగనుల గుత్తాధి పత్యమును కలిగి యుండిరి. క్రమక్రమంగా బలమును పుంజుకున్న ఆంగ్లేయుల పోటీకి నిలువలేక డచ్‌వారు భారతదేశములోని తమస్థావరములను కోల్పోయిరి.

## 20.4 ఆంగ్లేయులు క్రీ.శ. 1600 :

క్రీ.శ. 1600 సంవత్సరాంతమున లండను వర్తకులు కొందరు ఒక సంఘముగా ఏర్పడిరి. ఆసంఘమే "తూర్పు ఇండియావర్తక సంఘము" తూర్పు దేశములతో వర్తకము చేయుటకు వారు ఇంగ్లండు రాణియగు మొదటి ఎలిజబెత్ నుండి ఆజ్ఞాపత్రము పొందిరి. ఆంగ్లవర్తక సంఘమువారు క్రీ.శ. 1601 - 1606 సం॥ల మధ్య జావా, సుమిత్ర దీవులను సందర్శించి క్రీ.శ. 1608లో కెప్టెన్ హాకిన్స్ నాయకత్వమున మొదటి సారిగా భారతదేశమునకు వచ్చిరి. హాకిన్స్ మొగలు చక్రవర్తి జహంగీర్‌ను దర్శించెను. పోర్చుగీసువారి కుతంత్రములవలన మొగలుసామ్రాజ్యంలో వ్యాపారకేంద్రములు నెలకొల్పు కొనుటకు అతడు చేసిన ప్రయత్నములు ఫలించలేదు.

## 20.4.1 ఆంధ్రప్రదేశములోని ఆంగ్లేయుల స్థావరములు :

క్రీ.శ. 1608లో ఆంధ్రతీర ప్రాంతములలో గూడా వర్తక కేంద్రములను నెలకొల్పుటకు ఆంగ్లేయులు ప్రయత్నించిరి. మొదట పులికాట్ వారి దృష్టిని ఆకర్షించెను.

**మచిలీపట్టణము :**

భారతదేశ తూర్పు తీరంలో వర్తక స్థావరములు నెలకొల్పుటకై ఆంగ్లవర్తక సంఘమువారు హిప్పన్ నౌకదళాధిపతి నాయకత్వంలో "గ్లోబ్" మచిలీపట్టణము చేరెను. ఆంగ్లవర్తకులు గోల్కొండ సుల్తాన్‌తో ఆంధ్రతీరప్రాంతపు వ్యాపార విషయమై సంప్రదింపులు ప్రారంభించిరి. తత్ఫలితముగా 1611లో మచిలీపట్టణమువద్ద ఆంగ్లేయుల కర్మాగారములు నెలకొల్పబడెను. ఈ విధంగా "గ్లోబ్" నౌకాయానము ఆంగ్లేయుల తూర్పుదేశముల వ్యాపార చరిత్రలో నూతనాధ్యయమును ప్రారంభించెను.

మచిలీపట్నము చక్కటి నౌకాశ్రయమేగాక నేతపరిశ్రమకు, కలంకారీ వస్త్రములకు, కెంపులు, వజ్రములు వ్యాపారమునకు కేంద్రము. అందుచేత ఆంగ్లేయులు తమతూర్పుతీరవర్తక స్థావరములకు మచిలీపట్టణమును కేంద్రముగా చేసికొనిరి. కాని డచ్‌వారి పోటీవలన, పోర్చుగీసువారి అసూయ ద్వేషమువలన, సుల్తాన్ ఉద్యోగవర్గ పీడనవలన ఆంగ్ల వర్తకులు అనేక యిబ్బందులుకు గురియగుచుండిరి. నూలుబట్టల వ్యాపారములో వచ్చు లాభముల వలన వారివన్నియు కొంతకాలం సహించి. తమయిబ్బందులను గోల్కొండ సుల్తాన్‌తో మొరపెట్టుకొనిరి. వారి విన్నపములు అరణ్యరోదనములయ్యెను. అట్టి పరిస్థితులలో వారచట నిలువలేక క్రీ.శ. 1621లో పులికాట్ వద్ద నౌకా కేంద్రమును నెలకొల్పుకొనిరి. డచ్‌వారి అసూయవలన అచటగూడ ఎక్కువకాలము నిలువలేకపోయిరి. కావున క్రీ.వ. 1626లోపులికాట్‌కు 35 మైళ్ళ ఉత్తరముగ నెల్లూరు జిల్లా ఆర్మగాంవ్ వద్ద బ్రిటీష్ వారు తమకర్మాగారమును నిర్మించుకొనిరి, ఆర్మగాంవ్ మంచి నౌకాశ్రయము కాకపోవుటవలన, దాని పరిసరప్రాంతములలో నాణ్యత గలబట్టలు తయారుచేయబడకపోవుట వలన, అచట రాజకీయ పరిస్థితులుస్థిరముగా లేకపోవుట వలన క్రొత్త స్థావరములకై మరల అన్వేషణమొదలయ్యెను. గోల్కొండ సుల్తాన్ బ్రిటీషువారికి "బంగారు ఫర్మానా"ను జారీ చేసివారు గోల్కొండ రాజ్యంలో యధేచ్ఛగా వ్యాపారము చేయు అవకాశము కలిగించుటచేత వారు మరల తమకేంద్రము మచిలీపట్టణమునకు మార్చుకొనిరి. కాని ఈసమయమునకు అచటి పరిస్థితులు మారిపోయెను. ఆప్రాంతములో క్షామ పరిస్థితులేర్పడుట వలన నేతగాండ్రు కొందరు మరణించుట వలన, మరికొందరు యితరప్రాంతములకు వలసపోవుట వలన నూలుబట్టల వ్యాపారము దీనావస్థలోనుండెను.

**విశాఖపట్టణము**

క్రీ.శ. 1632 నవంబరులో గోల్కొండ సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా జారీచేసిన "బంగారుఫర్మానా" ప్రకారము మచిలీపట్టణము, నిజాంపట్టణము, భీముని పట్టణములవద్ద వర్తకస్థావరములనెలకొల్పుకొనుటకు, యథేచ్ఛగా వ్యాపారము చేయుటకు బ్రిటీషువారికి హక్కులభించెను. ఈ ఫర్మానా వెలువడిన అర్థశతాబ్దముతరువాత క్రీ.శ. 1682లో విశాఖపట్టణమువద్ద బ్రిటీషువారి కర్మాగారము నెలకొల్పబడెను. ఈ కార్మాగారం 1691 తరువాత క్రమగా వృద్ధిచెంది తూర్పు తీరములోని ప్రముఖ వ్యాపారకేంద్రముగా రూపొందెను.

**ఇంజరం :**

ఇది తూర్పు గోదావరిజిల్లాలో తీర ప్రాంతములోని బ్రిటీషువారి వాణిజ్యకేంద్రము క్రీ.శ. 1708లో యిచట ఆంగ్లవ్యాపారకేంద్రము నెలకొల్పబడెను.

**మద్రాసు :**

క్రీ.శ. 1638-'39లో తూర్పు ఇండియావర్తకలసంఘడైరెక్టర్‌లు, ఆర్మగాండ్‌లోని తమకర్మాగారమును నిర్మూలించి అనువైన మరొక స్థలమును నిర్ణయించవలసినదిగా అచట కంపెనీ ఉద్యోగి ఫ్రాన్సిస్ డే ని ఆదేశించిరి. ఫ్రాన్సిస్ డే అట్టి ప్రదేశమునకై పుదుచ్చేరి ప్రాంతములో

అన్వేషణలు ప్రారంభించెను. ఆప్రాంతము చంద్రగిరి పాలకుడైన మూడవ వెంకటాద్రి బ్రిటీషువారి ప్రయత్నములను గూర్చి విని మద్రాసు ప్రాంతము వారికి అనుకూలమైనదని సూచించి, వారికి తన మద్దతునుకూడా ప్రకటించెను. క్రీ.శ. 1641 అప్పటినుండి తూర్పు తీరములోని ఆంగ్లస్థావరములకు చెన్నపట్టణము కేంద్రమయ్యెను.

### 20.4.2 ఆంగ్లేయుల ఇతర స్థావరములు :

పశ్చిమతీరంలోని బొంబాయివద్దను, బెంగాల్, బీహార్‌లలో, హుగ్లీ, కాసింబజార్, కలకత్తా, రాజమహల్, పాట్నాల వద్ద బ్రిటీష్‌వారి వర్తక కేంద్రములు నెలకొల్పబడెను. ఆంగ్లేయుల స్థావరాలలో కంపెనీవారు ముద్రిస్తున్ననాణెములు మొగలాయినాణెములతోపాటు చెలామణిలో నుండెను.

## 20.5 ఫ్రెంచివారు :

తూర్పు దేశములతో వాణిజ్యము లాభటిసాటిగా నుండునని ఫ్రెంచి ప్రభుత్వమే వర్తకులను ప్రోత్సహించెను. ఫ్రెంచి ఆర్థిక మంత్రియైన కోల్‌బర్టు క్రీ.శ. 1664లో ఫ్రెంచి తూర్పుఇండియావర్తక సంఘమును స్థాపించి అందులో మూడవవంతు వాటాలను ప్రభుత్వంచే కొనిపించి, తూర్పుదేశములతో వాణిజ్యమును ప్రోత్సహించెను. ఫ్రెంచివర్తకసంఘమువారు ఆఫ్రికాతీరంలో మెడగాస్కర్, బూర్బన్ దీవులనాక్రమించి వాటిని కేంద్రముగా చేసికొని ఇండియాలో వ్యాపారస్థావరములను నెలకొల్పుటకు ప్రయత్నించిరి. వారు క్రమంగా, సూరత్, పుదుచ్చేరి, చంద్రనగర్, ఢాకా, కాసింబజార్, పాట్నా, బాలసోర్, కళ్ళికోట వద్ద వర్తకస్థావరాలు స్థాపించుకొనిరి.

### 20.5.1 ఆంధ్రప్రాంతములోని ఫ్రెంచిస్థావరాలు :

కారన్ అనేఫ్రెంచి నౌకాదళాధిపతి గోల్కొండసుల్తాన్ అబ్దుల్లా కుతబ్‌షా అభిమానమును పొంది క్రీ.శ. 1689లో మచిలీపట్టణములో కర్మాగారముస్థాపించెను. క్రీ.శ. 1708లో కాకినాడ సమీపములోని యానమ్‌వద్ద గూడ ఫ్రెంచివారిస్థావరము నెలకొల్పబడెను.

ఈ విధముగా ఐరోపావాసుల ఆంధ్రప్రదేశములోను, భారతదేశములోని ఇతరప్రాంతములలో వర్తకస్థావరములను ఏర్పాటుచేసికొనిరి.

## 20.6 సారాంశము :

భౌగోళికాన్వేషణలో భాగంగా భారతదేశానికి జలమార్గమును కనుగొని పోర్చుగీసువారు ఈ దేశంలో అడుగుపెట్టారు. ఆ తర్వాత డచ్ వారు ఆంగ్లేయులు, ఫ్రెంచివారు ఈ దేశంలో అడుగిడారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా అనేక ప్రాంతాలలో వీరు తమ వర్తక స్థావరాలనేర్పరచుకున్నారు.

**References Books :**


1. Heras : Beginnings of Vijayanagara History.
2. Mahalingam : Administration and Social life under Vijayanagara
3. Ramachandraiah, O. : Studies in Sri Krishnadevaraya
4. Sastri & Venkataramanaiah : Further Sources of Vijayanagara History.
5. Sathianathiyar : The Nayaks of Madurai
6. Sewell, R. : Forgotten Empire of Vijayanagara
7. Sherwani & Joshi : History of Medieval Deccan I & II
8. Sherwani : History of Qutb Shahi Dynasty
9. B.S.L. Hanumantha Rao : Andhrula Charitra
10. P. Raghunadha Rao : History of Modern Andhra Pradesh


డా॥ కంరున్నిసా బేగం

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
| --- | --- | --- |
| M.A. History | Ist Year | Paper - III : History of South India (1336 to 1765 A.D.) |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)